స్మృతి రేఖలు

అంతర భారతీయ పుస్తకమాల

స్మృతి రేఖలు

మూలం

భగవతీ చరణ్ వర్మ

అనువాదం

ఇలపావులూరి పాండురంగ రావు

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ప్రథమ ముద్రణ : 1970 (శక 1892)
ద్వితీయ ముద్రణ : 1990 (శక 1912)

రూ. 30.00

Original Title in Hindi : Bhoole Bisre Chitra
by Bhagawati Charan Verma
TeluguTranslation : Smriti Rekhalu

డైరక్టరు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
ఎ-5, గ్రీన్ పార్కు, కొత్త ఢిల్లీ-110 016 చే ప్రచురింపబడినది.

సమీక్షాత్మక పరిశీలనం

వెనుకటికొక లావాటి కఱ్ఱ ఉండేదట. దానిమీద ఈ కఱ్ఱ అన్నింటినీ విరిచేస్తుందని చెక్కబడి ఉందట. ఇది పందొమ్మిదో శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత ఫ్రెంచి నవలా రచయిత హెన్రీ బాల్ జక్ వాడిన చేగఱ్ఱట. ఇరవయ్యో శతాబ్దంలో ఈ కఱ్ఱ సంగతి విన్న జర్మన్ నవలా రచయిత ఫ్రాంజ్ కాఫ్కా ఒక చిన్న బెత్తం మీద ఆ బెత్తాన్ని అన్నీ విరిచేస్తాయని వ్రాయించారట. యూరప్ దేశంలోని నవలా రచనా పరిమాణాన్ని ఈ రెండు ఘటనలూ నిరూపిస్తాయని విమర్శకులంటారు. బాల్ జక్ తాను తన కాలంలో ప్రజలలో చేరుకొని పోయిన కుళ్ళునూ, దురాచారాలనూ, వికారాలనూ ధ్వంసం చేసేందుకు తన నవలా రచనను బెత్తంగా వాడేవాడని దీని అభిప్రాయం. నిజానికి నవల అనే కథనాత్మక సాహిత్య శైలి జాగరూకులయిన మధ్య వర్గ ప్రజల మనోభావాలను వాఙ్మయరూపంలో వ్యక్త పరుస్తుంది. అందువల్ల ఈ రచనా శైలి మొదటినుండి సంఘానికీ వ్యక్తికీ గల పరస్పర సంబంధాలనూ, వైషమ్యాలనూ, సమస్యలనూ చిత్రిస్తూ వచ్చింది. ఈ విషయం 'సర్వెంటీస్' లో స్పష్టంగా గోచరిస్తుంది. అదృష్టవశాత్తు, మొట్టమొదటి హిందీ నవల 'పరీక్షా గురు' (లాలా శ్రీనివాస దాస్ వ్రాసింది) లోనే ఇలాంటి జాగృతి మనకు గోచరిస్తుంది.

కథలూ, ఆఖ్యాయికలూ కేవలం మనస్సును రంజింపచేసేవి మాత్రమే కావు. అవి మొదటినుండి ఉపదేశాత్మకంగా కూడా ఉపయోగిస్తూ వచ్చాయి. కాని ఈనాటి జీవితంలోని శక్తి సామర్థ్యాలను గమనించి యదార్థ జగత్తును ఆధారం చేసుకొని బహుముఖంగా ఉన్న సాంఘిక సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన సమస్యలను అవగాహనం చేసుకొని వాటిని చిత్రించేందుకు ప్రయత్నించడం ఈ కథా శైలి ద్వారానే సాధ్యమవుతుంది. కథలు సామాన్యంగా చదివేందుకు సరదాగా (మనోరంజకంగా) ఉండనే ఉంటాయి. కాని ప్రతి కథకూ చివర ఏదో ఒక నీతి ఉన్నా లేక పోయినా ఉన్నట్టుగా నిరూపించేందుకు ప్రయత్నించడం బదులు ఉన్న సమస్యను ఉన్నట్టుగా చిత్రించడం అనేది రచయితలోని మెలకువనూ, నేర్పునూ, నిరీక్షణ శక్తినీ తెలియ పరుస్తుంది. సజీవమైన పాత్ర పోషణతో

నమ్మదగిన సంఘటనలను ఏర్చి కూర్చడంవల్ల నవల అనే పేరిట వెలువడిన ఈ కథా శైలి ఇంతకు ముందున్న కథా సాహిత్యానికంటె విలక్షణంగా రూపొందింది. 'ఆ తర్వాత ఏమయింది?' అనే సహజ కుతూహల స్థాయిని దాటి 'అలా ఎందుకయింది?' 'ఈ జరుగుతున్నదంతా అసలేమిటి?' 'ఇక ముందు ఏమవుతుంది?' అనే ప్రశ్నలకు ప్రాధాన్యం లభించింది. ఈ ప్రశ్నల్లో కూడా కీలకమయిన ప్రశ్న మధ్యదేనని వేరే చెప్పవలసిన పని లేదు.

ఇక హిందీ నవలను గురించి రెండు మాటలు. హిందీ నవలా రచన మొదటినుండి కూడా ఈ నవీనతా బీజాన్ని గుర్తించిందనే చెప్పాలి. భారతేందు, ప్రతాప నారాయణ మిశ్ర లాంటి వాళ్ళు తమ నాటకాలలోనూ వ్యాస రచనల ద్వారానూ, ఖండించిన దురాచారాలనూ, అసహ్య సంప్రదాయాలనూ, వికారాలనే లాలా శ్రీనివాస దాస్, బాలకృష్ణ భట్టు లాంటి వాళ్ళు తమ నవలల్లో చిత్రించి వాటికి పదునుపెడుతూ వచ్చారు. సమస్యల నవగాహనం చేసుకొని వాటి నెదుర్కొనాలనే ఆకాంక్ష ఒక్కటే ఈ రచనల్లో మనకు గోచరిస్తుంది. ఈ మాట కొంచెం వింతగా తోస్తే తోచవచ్చు. కాని వాస్తవంగా 'చంద్ర కాంతా సంతతి' లోని అతిలోక కల్పనలకూ ఉక్తి వైచిత్రికీ వెనుక మానవోచితమైన ఈ లౌకిక యథార్థభావనే గోచరిస్తుంది. ఒక వైపు నీరసించిపోతున్న సామంత వాదాన్నీ, మరో వైపు నవనవోన్మేషంతో వెలువడుతున్న ధనిక వర్గాన్నీ ఈ భావన ప్రతీక శైలిలో చిత్రిస్తూ వచ్చింది.

భారతేందు యుగానికి సంబంధించిన తొలి నవలా రచనల్లోని ప్రాశస్త్యాన్ని ఉగ్గడించేప్పుడు వాటియందలి ఈ నవీన భావన కొంతవరకు స్థూలమయినది అనే విషయం మాత్రం గమనించడం అవసరం. పాత్ర పోషణ, వస్తు విన్యాసం ఒక వ్యవస్థిత రూపాన్ని ఇంకా కూర్చుకోలేదు. సమస్యల కనుగుణంగా పాత్రలను సృష్టించడం, సంఘటనలను కల్పించడం జరిగింది. యథార్థాన్ని నిశితంగా పరిశీలించడం జరగలేదు. ఈ లోటును తీర్చినవాడు ప్రేమచంద్. ఆయన వ్రాసిన నవలల్లో సమస్యలు కథా క్రమంలో సహజంగా పుట్టుకువస్తాయి. ప్రేమచంద్ నిజంగా సాధించదలుచుకున్న సమస్యలను పరిష్కరించడం కాదు. (అది స్థూలంగా ఆరోపించబడిన ప్రయోజనం, కనుకనే దానిలో కళాకౌశలం కన్పించదు.)

ఆయన సాధించ గలిగింది నవలా రచనకు కావలసిన పాత్ర సృష్టి, సన్నివేశ కల్పన, వస్తువిన్యాసం, అన్నిటికంటె మించి నవలకు తగిన భాషా స్వరూప నిర్ణయం. యథార్థాన్ని నిశితంగా పరిశీలించడం, ఉదార మైన దృక్పథం, రచన యందలి ఆత్మీయత, సారగర్భితమైన సహజ భాషా శైలి ప్రేమచంద్‌లో ప్రత్యేకంగా పేర్కొనదగిన లక్షణాలు. ఆయన నవలలు వ్యక్తిగత భావాలకూ, సాంఘిక చరిత్రకూ ఒకచోట కూడలి ఏర్పరచటమే కాక వాటి నొక చతుష్పథంలో కూర్చగలిగాయి. ఆయన నవలల్లో ప్రాధాన్యం లభించింది వ్యక్తికా? సంఘానికా? అనే ప్రశ్నకు 'అవును' 'కాదు' అని నిక్కచ్చిగా సమాధానం చెప్పేందుకు వీల్లేదు. అవి ఒకదాని నొకటి అధిగమించి పరస్పరం ఛేదించుకొనే బిందువు నాధారం చేసుకొనే ఆయన నవలా శిల్పం నెలకొంటుంది. ప్రేమచంద్ మనస్తత్వం కూడా అతి సరళమై నిత్య జీవితానికి సంబంధించి ఉంటుంది. ఆయన తొలి రచనల్లో ఎదురులేని సంకల్పం, కుంటుపడని విశ్వాసం కనిపిస్తాయి. ఆనాటి జాతీయోద్యమం ప్రారంభిక దశలో ప్రసాదించిన ఆశా విశ్వాసా లకు ఆ రచనలు నిదర్శన ప్రాయంగా గోచరిస్తాయి. కాని క్రీ.శ. 1930 సమీపించేసరికి జాతీయోద్యమం ఫలించక పోవడంవల్ల వివేకవంతులు బాధ పడసాగారు. నిజాయితీ గల కళా పోషకునిగా తన బాధ్యతను గమనించిన ప్రేమచంద్ ఈ కటు యథార్థాన్ని కూడా చిత్రించాడు.

పరాజయం, వైఫల్యం, నైరాశ్యంతో నిండిన ఈ జాతీయ పర్యావరణం లోనే 1930 ప్రాంతంలో మరోతరం రచయితలు బయలుదేరారు. పంధొ మ్మిదో శతాబ్దంలో బయలుదేరిన మధ్య వర్గం కూడా ఈ పాటికి తమ రూపురేఖలనేకాక తమ భవితవ్యాన్ని కూడా నిర్ణయించుకొనే స్థితికి వచ్చింది. ఇటు దేశంలో వివేకం, విజ్ఞానం, పరిశ్రమలు అభివృద్ధి చెంద డంతో ప్రజలలో జ్ఞానోదయం కలిగి విశిష్ట పరిశోధనలు వృద్ధి పొందాయి. మార్క్స్, ఫ్రాయడ్, డార్విన్ సిద్ధాంతాలతో వాతావరణం ఘనీభ వించింది. ఈ తాత్త్వికుల బోధనలు మనుష్యునిలో తరతరాలనుండి పాతు కొని పోయిన నమ్మకాలను కూకటివేళ్ళతో పెకలించి వేశాయి. ఇలాంటి విద్యున్మయావేశంతో కూడిన వాతావరణంలో 1930 తర్వాతి తరం బయలు దేరింది. ఈ తరానికి చెందిన వారి మనస్సుల్లో ఒకవైపు మధ్య వర్గానికి సంబంధించిన వ్యక్తివాదం, స్వేచ్ఛావాదం ఎక్కువగా కనిపిస్తూ వచ్చింది.

మరో వైపు ప్రత్యక్ష జీవితంలో (ప్రణయ రంగంలో అయితేనేం, రాజకీయ రంగంలో అయితేనేం) మాటి మాటికి వైఫల్యం కనిపిస్తూ వచ్చింది. వారిలో క్షోభిస్తూ ఉన్న అహమ్మన్యత తిరిగి తిరిగి పరిస్థితుల పైననే విరచుకుపడ సాగింది. నూతన భావాలోకంలో పాప పుణ్యాలనూ, గుణ దోషాలనూ, ప్రణయ వాసనలనూ పునర్విమర్శించు కొనేందుకు ప్రయత్నించడం ఈ తరం రచయితలు అవసరమని భావించారు. వీరిలో కొందరికి విశాలమైన సంఘ జీవితంనుండి వ్యక్తిని వేరుచేసి అతని అంతరంగంలోని అంతులేని లోతులను అందుకొని ఆనందించడం అభిలషితమైతే మరి కొందరికి త్వరత్వరగా మారిపోతూ తుదకు పరాజయం వైపు పురోగమిస్తున్న జీవిత ఘడియలను అనుభవించి ఆస్వాదించడం ఆనందంగా తోచింది. జీవితానుభవాన్ని పొందవలెననే ఈ వ్యాకులత వల్లనే తరచుగా పాపం, పుణ్యం, నీతి, అవినీతి అనే విచికిత్స బయలుదేరుతుంది. అందు వల్ల కొందరు చిరాకుచెంది విధిలేక అన్నిటిని నిర్మూలం చేసే హింసనూ, అరాజకత్వాన్నీ అవలంబించడం జరుగుతుంది.

1930 తర్వాత బయలుదేరిన ఈ తరానికి చెందిన రచయితలు చక్కని ప్రతినిధి భగవతీచరణ్ వర్మ. ఒక వైపు జీవిత మహా సముద్రంలో ఉప్పొంగిన కెరటాల అహ్వానాన్ని గమనిస్తూ మరో వైపు వాటి విశద వికరాళ గర్భంలో దాగియున్న నవయుగ యువక వర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహించారు. ఈ తరానికి చెందిన వారిలోని ఏకాంతమైన అహమ్మన్యత లోలోపల కుమిలి కుంది, దేశ కాలాలను దిగ మ్రింగుతున్న ఈ కెరటాలు మనకలవి కానివని గుర్తించింది. సాంఘిక జీవితంలో పరాజయం పొందిన వ్యక్తి వేదనా ప్రాగల్భ్యాన్ని కీర్తించాయి. ఆనాటి సాహిత్యంలో వెలువడిన పలు విధములయిన భావ గీతాలు, బెంగాలీ సాహిత్యంలో శరచ్చంద్రుడు కానీ, హిందీలో జైనేంద్ర, ఇలా చంద్రజోషీ, భగవతీ చరణ్ వర్మ కానీ ఈ పోకడ ననుసరించిన వారే. బచ్చన్, అంచల్, నరేంద్ర శర్మ లాంటి వారి గేయాలకు కూడా ఇదే ఆధారపీఠం. కాని పరాజయం ముంచుకు వచ్చిన ఈ భావనలో కూడా తిరుగుబాటు ప్రస్ఫుటితమవుతూ ఉంది. ఆ తిరుగుబాటు చివరకు సాధించింది ఏమీ లేకపోయినా సరే అది వాఙ్మయం మాత్రమయింది.

ఈ పీఠికనాధారం చేసుకొని భగవతీ చరణ్ వర్మ గారి నవలల్ని

చదివితే వాటిలోని సాంకేతిక నిగూఢాశయం మరికొంత స్పష్టంగా బోధ పడుతుంది. 'చిత్రలేఖ', 'తీన్ వర్ష్' (మూడు సంవత్సరాలు) 'టేఢే మేఢే రాస్తే' (వంకర టింకర దారులు) – ఆయన వ్రాసిన మొదటి మూడు నవలలు. వీటిలోని ప్రముఖ పాత్రలను ఏదో ప్రత్యేకమైన వ్యక్తిగత వైశిష్ట్యం అలంకరించింది. ఏదో ఒక క్షణంలో ఆ పాత్రలు పరాజయం పొందినట్టు గోచరిస్తుంది. 'చిత్రలేఖ' లో గతాన్ని ఆధారం చేసుకొని పాప పుణ్యాలను సమీక్షించడం జరిగింది. 'తీన్ వర్ష్'లో ఈ నాటి పరిస్థితిలో పరిణయం, ప్రణయం, కామం వీటికి సంబంధించిన ప్రశ్న ప్రతిపాదించ బడింది. 'టేఢే మేఢే రాస్తే' ఆనాటి రాజకీయ విశ్వాసాలకు ఒకపరి ప్రశ్న. కాని అన్నింటిలో ఒకే ఒక భావన గోచరిస్తుంది – 'మనుష్యుడు పరిస్థితులకు దాసుడు'. పురాతన విశ్వాసాలను అంతటా ఖండించడం జరిగింది – 'ఈ ప్రపంచంలో పాపి ఎవడు? పుణ్యాత్ముడెవడు? ఇల్లాలి కంటె వెలయాలు కొన్నివిధాల మెరుగనిపించవచ్చు. రాజకీయ విశ్వాసాలన్నీ యదార్థం కావు. ఇలాంటి భావాలవల్ల ఆనాటి వ్యక్తికి బలం చేకూరిన మాట నిజమయి నప్పటికీ దీన్ని క్షయాత్మకమైన జీవితాదర్శం అని చెప్పవచ్చు. క్రీ. శ. 1959 లో వెలువడిన 'భూలే బిసరే చిత్ర' (స్మృతి రేఖలు) లో జ్వాలా ప్రసాద్ కూడా ఈ మాటలతో తృప్తి పడతాడు. "మనుష్యుని చేతిలో ఏమీ లేదు. అతడు సాధించ గలిగిందేమీ లేనప్పుడు దాన్ని గురించి విచారించడం దేనికి? కావలసిందేదో అయిపోయింది, దాన్ని ఆపడం ఎవ్వరికీ చేత కాదు." — (స్మృతి రేఖలు)

తనతోటి రచయితలలో భగవతీబాబుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. జైనేంద్ర, ఇలా చంద్ర జోషీ లాంటివాళ్ళు వ్యక్తి మనస్తత్వాన్ని విశ్లేషిం చేందుకు పూనుకొన్న రోజుల్లో కూడా ఆయన సాంఘిక పరిస్థితిని చిత్రిం చడం మానలేదు. ప్రేమచంద్ వలె వ్యాపక ఫలకంలో ఆయన తన పాత్ర లను చిత్రించక పోయినా మధ్య వర్గానికి సంబంధించిన వివిధ సమస్యలనూ ప్రతిక్రియలనూ ఆధారం చేసుకొనే ఆయన పాత్రలను పోషించారు. నవలలకు ఆధారం తరచుగా కుటుంబ జీవితమనే చెప్పాలి. ఈ దృష్టిలో ఆయన ప్రేమచంద్ నడచిన మార్గానికి దగ్గరివాడని చెప్పవచ్చు. కథా కథన శైలిలో కూడా ఆయన తనతోటి రచయితల కంటె ప్రేమచందునే ఎక్కువగా అనుసరించారు. మరో విషయం గమనించాలి. తత్త్వ చింతనకు

ఆయన క్రమంగా దూరమవుతూ వచ్చారు. ఇతర రచయితలలో ఈ బాధ్యం ఎక్కువగా వ్యాపించింది. భగవతీబాబు అనుసరించిన ఆదర్శానికి సహజ పరిణామం ఘటనా బాహుళ్యం అనే అనిపిస్తుంది.

పైన చర్చించబడిన మూడు నవలల తర్వాత భగవతీ బాబు రచనా పాటవం కొంచెం తగ్గి పోయింది. 'ఆఖిరీ దాంవ్' ఈ శైథిల్యాన్ని నిరూపిస్తుంది. కాని మళ్ళీ 'భూలే బిసరే చిత్ర' లోనూ, 'సామర్థ్య ఔర్ సీమా' లోనూ ఆయన రచనా శక్తి, కళా కౌశలం ఉచ్చస్థాయి నందుకొన్నాయి. 'భూలే బిసరే చిత్ర' (స్మృతి రేఖలు) ఆయనకు సాహిత్య అకాడమీ, హిందూస్తానీ అకాడమీ వారి ఘన సన్మాన బహుమానాలను సేకరించి పెట్టింది.

'భూలే బిసరే చిత్ర' (స్మృతి రేఖలు)

ఈ నవల అసలొక సుదీర్ఘమైన రచన. సమగ్ర రూపంలో ఈ నవల ఏడెనిమిది వందల పేజీల వరకు సాగింది. దానికిది సంక్షిప్త రూపం. మూల కథా గతిని దృష్టిలో ఉంచుకొనే దీన్ని సంక్షిప్తం చేయడం జరిగింది. ఇలా కుదించడంవల్ల ఈ నవలలోని మంచి మంచి ఘట్టాలూ, జీవితానికి సంబంధించిన చిత్ర విచిత్ర దృశ్యాలూ కొన్ని లోపించిన మాట నిజమే కాని అందువల్ల కథా వస్తువలో ఎక్కువ కూర్పు, స్పష్టత, విశిష్టత చేకూరాయన్న విషయం కూడా కాదనలేము.

వరుసగా నాలుగు తరాలకు సంబంధించిన ఒక కుటుంబ గాథ ఇందులో చిత్రించబడింది. ఈ తరాలకు చెందిన వ్యక్తులు తమ కాలపు పరిస్థితుల కనుగుణంగా సమస్యల నెదుర్కొంటూ క్రిందపడుతూ పైకి లేస్తూ ముందుకు సాగుతారు. ఈ కుటుంబం గతానికి సంబంధించినదవడం వల్ల అది చరిత్ర కెక్కిపోయింది. ఈ విధంగా వ్యక్తి, కుటుంబం, సంఘం చరిత్రలో కలసిపోవడం జరిగింది. కాబట్టి దీన్ని ఒక రకంగా 'పీరియడ్ నావల్' అనవచ్చు. క్రీ.శ. 1880 నుండి 1930 వరకు జరిగిన కథ ఇందులో ఉంది. యాభై సంవత్సరాల కాల పరిమితిలో వ్యాపించిన భారతీయ సాంఘిక జీవితాన్ని రాజకీయ పర్యావరణంలో చిత్రించడం జరిగింది. చరిత్రను వ్యక్తి నిరపేక్షంగా చిత్రించ వలెననే ఉద్దేశ్యంతోనే కాబోలు వర్మగారు తన కథా క్రమాన్ని 1930 వరకే పరిమితం చేశారు. ఆ తర్వాత జరిగిన ఘటనలతో

వర్మగారికి వ్యక్తి గత సంబంధం ఉన్నందువల్ల వాటిలో ఆయన మనో భావాలు ఫలించవచ్చు. వర్మగారు రచనా రంగంలోకి 1930 దాదాపుననే ప్రవేశించారనే విషయం గమనించ దగినది. నాల్గవ తరానికి చెందిన నవల్ నిజానికి వర్మగారి తరానికే ప్రతినిధి. అందువల్ల అతన్ని కార్య రంగంలో దించి రచయిత విరమిస్తారు. పర్యవసానంలో తలదూర్చడం ఆయనకు ఇష్టం లేదు.

సమష్టి కుటుంబ విచ్ఛేదం, మధ్యవర్గాభ్యుదయం, ధనిక వర్గానికి సామంత వర్గం లొంగిపోవడం, జాతీయమైన స్వాతంత్ర్యోద్యమం – ఈ నాలుగు బిందువులపై సమస్త కథాక్రమం ఆధారపడి ఉంది. ఈ నాలుగింటి పరస్పర సంపర్కం వల్లనే కథాశిల్పం సమగ్రతను చేకూర్చుకుంటుంది. మున్షీ శివలాల్ మొదటి తరానికి చెందినవాడు. కచ్చేరీ బయట కూర్చుని అర్జీలు వ్రాసి పెట్టడం ఆయన వృత్తి. కాని ఆయన కుమారుడు ఇంగ్లీషు చదువుకుని ఇంగ్లీషు కలెక్టరు అనుగ్రహం వల్ల డిప్టీ తహసీల్దారు అవుతాడు. మధ్య వర్గం పొందిన అభ్యుదయానికి ఇది మొదటి మెట్టు. దీని వల్ల మున్షీ శివలాల్ సమష్టి కుటుంబంలో వెంటనే మార్పు వస్తుంది. కుమారునితో పాటు కోడలు కూడా ఊరు విడిచి వెళ్ళడంతో వాళ్ళ సమష్టి కుటుంబంలో తొలిసారి విచ్ఛేద సూచనలు కనిపిస్తాయి. ఆ తర్వాత మున్షీ శివలాల్ తమ్ముడు మున్షీ రాధేలాల్ ఎన్ని విధాల ప్రయత్నించినా వాళ్ళ సమష్టి కుటుంబం చివరకు విచ్ఛిన్నమై పోతుంది. ఈ సమస్య ఆ తర్వాత కూడా వచ్చే అవకాశం లేకపోలేదు. కాని బహుశా అలాంటి అవకాశం రాకుండా ఉండేందుకు కాబోలు జ్వాలా ప్రసాద్, గంగాప్రసాద్, నవల్ – ముగ్గురినీ ఏకైక సంతానంగానే రచయిత నిరూపించారు.

పీఠికలో వివరించినట్లు 1930 సమీపించే సరికి మధ్య వర్గ ప్రజలకు చిక్కు ఏర్పడింది. ధనిక వర్గానికి, సామ్రాజ్య వాదానికి చెందిన వారి ప్రోత్సాహంతో ఈ తరగతికి చెందినవారు పైకి వచ్చారు. కాని క్రమంగా ఆర్థిక స్థితి దిగజారే సరికి వారిలో స్వేచ్ఛాభిలాష ఉదయించింది. 'స్మృతి రేఖలు' లో ఇదే పరిస్థితి చిత్రించబడింది. జ్వాలా ప్రసాద్, గంగాప్రసాద్ పరిపాలనా తంత్రంలో పనిచేసే మధ్య వర్గానికి చెందిన ప్రజానీకానికి ప్రతినిధులు. గంగాప్రసాద్ కలెక్టరవుతాడు. ఇది మధ్య వర్గం పొందిన అభివృద్ధికి పరాకాష్ఠ. కాని అతను అకస్మాత్తుగా మరణించడంతో అతని

కుమారుడయిన నవల్‌కు దిక్కు తోచదు. తన తాతగారి జీవితం ఆరంభ దశలో ఎలా ఉండేదో దాదాపు అదే స్థితిలో అతను ప్రవేశిస్తాడు. కాని అతన్ని బాధిస్తున్న అహమ్మన్యత వల్ల ఎవరి దయాదాక్షిణ్యాల మీదనూ ఆధారపడడం అతనికి ఇష్టం లేదు. జీవిత ప్రవాహంలో దిశామూఢుడై కొట్టుకుని పోతూ అతను చివరకు ఆవేశంతో సత్యాగ్రహ సమరంలో దూకుతాడు. నిజానికి నాల్గవ తరానికి చెందిన నవల్ పాత్రలో ఈ తరగతికి చెందిన వారి స్వభావం, భవితవ్యం స్పష్టంగా గోచరిస్తాయి. మొత్తం మీద నాలుగు తరాలలో క్రమంగా పరిణామం పొందుతూ ఉన్న ఈ కుటుంబాన్ని చిత్రించడంలో రచయితకు చాలా వరకు సాఫల్యం చేకూరింది.

కథ ఆరంభించగానే కుటుంబ రంగంతో పాటు జమీందార్లకూ ధనిక వర్గానికి చెందిన మరో రంగం కూడా గోచరిస్తుంది. డిప్టీ తహసీల్దారు ఘాటంపూర్ చేరగానే ఠాకుర్ గజరాజసింగు, ఠాకుర్ బర్‌జోర్ సింగులతో లాలా ప్రభుదయాల్‌కు స్పర్థ ఆరంభిస్తుంది. సామాన్య వైశ్య కుమారుడయిన ప్రభుదయాల్ కులాభిమానంతో విర్రవీగుతూ పాత జమీందారీ రీవితో సర్దాగా జీవితం గడిపే ఇద్దరు జమీందార్లను కించ పరుస్తాడు. తన పని నెరవేర్చుకొనే నేర్పు అతనియందు పూర్తిగా కనిపిస్తుంది. అధికార్లతో మైత్రి చేయడం అవసరమని అతను తెలుసుకుంటాడు. ఈ అధికార వర్గానికి ప్రతినిధి అయిన జ్వాలా ప్రసాద్ న్యాయం, చట్టం పేరిట అతనికి తోడ్పడుతాడు. ఈ విధంగా అధికార వర్గంతో ధనిక వర్గం కలిసి పోవడంవల్ల సామంత వర్గం దెబ్బ తిన్నదనే చారిత్రక సత్యాన్ని రచయిత నిరూపిస్తాడు. ఆ తర్వాత ఈ ధనిక వర్గం తన లోపాలను దాచుకునేందుకు ముఖంపై కప్పుకొన్న ముసుగును రచయిత మాటి మాటికి తొలగించి నిజాన్ని బట్టబయలు చేస్తాడు. ఈ ధనికులు విదేశ వర్తకుల ప్రాధాన్యాన్ని తొలగించి వారి స్థానంలో తాము స్థిరపడేందుకు సహకరించే సహాయ నిరాకరణోద్యమానికి దోహదం ఇస్తారు. కాని కార్య సాధన కాగానే మళ్ళీ ఆ వైపు ముఖం చూపించరు. ఈ ధనికులు సామ్రాజ్య వాదులయిన విదేశీయులకు కూడ ధన సహాయం చేసి సర్ బిరుదులు పొందుతారు. అందువల్ల సంఘంలో వారికి పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఇతరుల డబ్బును అక్రమంగా సంక్రమింప జేసుకొనేందుకు ఈ వర్గం వారు ఏ మాత్రం

జంకరు. మృత్యు శయ్యపై ఉన్న తల్లిని కూడా అనరాని మాటలు - కేవలం డబ్బు కోసం - అనడానికి వెనుదీయరు. ఈ ధనిక వర్గం యొక్క స్వభావం జ్ఞానప్రకాశ్ మాటల్లో యథాతథంగా కనిపిస్తుంది.

"కాని గంగూ! ఇందులో ఆశ్చర్య పడవలసిందేమీ లేదు. ఈ కోటీశ్వరులు విపరీతంగా లాభాలు కొడతారు. అందులో కొంత భాగం గవర్నమెంటు కిచ్చి కావలసిన సౌకర్యాలన్నీ పొందుతారు. ఈ లాభంలో కొంత భాగం అతను కాంగ్రెసుకు కూడా ఇస్తాడు. అందువల్ల స్వదేశీ ఉద్యమం బాగా కొనసాగుతుంది. అతని సరకు బాగా అమ్ముడు పోతుంది. అతను చేసే అన్యాయాలకూ, అక్రమాలకూ ప్రభుత్వోద్యోగులు ఏమీ చేయకుండా కండ్లు మూసుకొని ఉండడానికి అతను జాయింట్ మెజిస్ట్రేటయిన గంగాప్రసాద్‌కు కూడా ఈ లాభంలో కొంత భాగం ముట్ట చెప్తాడు. ఈ రోజుల్లో డబ్బు అన్ని పనులూ చేయిస్తుంది."

ఆర్థిక పరిస్థితితోపాటు రాజకీయాలు గూడా సహజంగా చర్చకు వస్తాయి. నవల రెండో ప్రకరణంలో ఈ రాజకీయ వాతావరణానికి ప్రాధాన్యం లభిస్తుంది. ఈ ప్రకరణంలోని మొదటి అధ్యాయంలోనే విదేశీయుల పరిపాలన, దాని పరిణామాలు, కులమత భావనలు మొదలైన విషయాలు చర్చించడం జరుగుతుంది. ఆ తర్వాత రౌలట్ ఆక్టు, సహాయ నిరాకరణం, చౌరీ చౌరా, మత కలహాలు, సమ్మెలు, దండి యాత్ర, ఉప్పు సత్యాగ్రహం అన్నీ ఒక దాని వెనుక మరొకటి వస్తాయి. రాజకీయ ఘటనా బిందువుతోనే నవల ముగిసి పోతుంది.

ఈ నవలలో చిత్రించబడిన ఈ వివిధ రంగాలు దేనికవి వేరు వేరు గాక అన్యోన్యాశ్రయంతో మేళవించి ఉంటాయి. ఒక రంగం మరో రంగానికి ఆధారం అవుతుంది. అన్ని రంగాలనూ సమగ్రంగా పరిశీలించి వాటి అన్నింటిలోనూ ముఖ్యంగా కనిపించే భావాన్ని గమనిస్తే, పాత ప్రపంచం సమగ్ర విశ్వాసాలతో, విలువలతోనూ విచ్ఛిన్నమయి పోయిన తర్వాత వెలువడుతున్న నూతన ప్రపంచంయొక్క రూపురేఖలనూ, పరిణామాన్నీ చిత్రించడమే ఈ రచనా ప్రయోజనం అని తోస్తుంది. జ్వాలాప్రసాద్ అభిజాత్యంతో విఱ్ఱవీగే జమీందారీ విధానాన్ని నిర్మూలించే పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థిస్తూ చెప్పిన మాటలివి: "నాన్నగారూ! ఇది నవీన యుగం. మనం వడ్రంగి పని చేయాల్సిన పని ఏమీ లేదు. కలప

సామాన్లు తయారుచేసే కార్ఖానా పెడుతున్నాడతను. వందలకొద్ది వడ్రంగులు ఆ కార్ఖానాలో పనిచేస్తారు. యంత్రాల సహాయంతో అన్ని పనులూ అయిపోతాయి. మంచి మంచి కొత్త రకం నాజూకు సామానంతా తయారవుతుంది. లక్షల మీద వ్యాపారం సాగుతుంది. కొత్త ప్రపంచం కొత్త పద్ధతిలో నడుస్తుంది.'' మున్షీ శివలాల్‌కు ఈ విషయం బోధపడదు. కాని నవీనయుగానికి చెందిన తన కుమారుడు చెప్పడం చేత ఆయన ఒప్పుకుంటారు. కాబట్టి లక్ష్మీచంద్ (పెట్టుబడిదారుడు) జ్వాలా ప్రసాద్ (ప్రభుత్వోద్యోగి) నవీనయుగానికి చెందిన వ్యక్తులు. ఈ నవీనత కుటుంబంలోకి కూడా ప్రవేశిస్తుంది. శివలాల్ ఆలోచించసాగారు. 'అధికారం, శక్తి ఒక చోటినుండి మరో చోటికి మారుతున్నాయి. కుటుంబంలో ఇంతవరకూ అనుసరిస్తున్న పద్ధతి మారిపోతున్నది.'

కాని జ్వాలా ప్రసాద్ తోటి ప్రపంచం కూడా మారుతుండ. ఆయన కూడా పాతకాలం వాడయిపోతాడు. డిప్టీ కలెక్టరు సోమేశ్వర శాస్త్రి గంగాప్రసాద్‌ను గురించి అంటారు: ''ఇతను చాల ఉత్సాహవంతుడు, మిర్ సాహబ్! ఈ విషయం మీరు ఒప్పుకొని తీరాలి. నవీన యుగానికి చెందినవాడు. ఈ నవీన వ్యక్తిలో ఉన్న గుణం ఏమంటే అతనికి ధైర్యం ఉంది. ఎవరినీ ముఖస్తుతి చేయలేడు. ఇంగ్లీషువాళ్ళతో కూడా సరి సమానంగా వ్యవహరిస్తాడు. తనకు తోచింది జంకకుండా చెప్పేస్తాడు.'' అంటే ఈ పాటికి మధ్య వర్గానికి పూర్తిగా ఆత్మ విశ్వాసం చేకూరిందన్న మాట. తాము స్వతంత్రంగా అభివృద్ధికి రాగలమనే ధైర్యం వారికి వచ్చింది. కాని సౌఖ్యం, భద్రత, ఉద్యోగం లాంటి విషయాల్లో వాళ్ళకింకా ఈ ఆత్మవిశ్వాసం తోడ్పడడం లేదు. ఈ సామర్థ్యం తరువాతి తరంలో చేకూరుతుంది. తన తండ్రి వ్యాధితో బాధపడుతుంటే ఆయనకు ఉపచారం చేసేందుకు తానుకూడా ఆయనతోపాటు భువాలీ వెళ్ళేందుకు సిద్ధమయిన నవల్‌ను గంగాప్రసాద్ చూస్తాడు - సమర్థుడు, ఆత్మవిశ్వాసం గల కుమారుడు. భవిష్యత్ప్రతినిధి! నవీనయుగానికి ప్రాతినిధ్యం వహించిన ఈ యువకుడు స్త్రీ స్వాతంత్ర్యాన్ని సమర్థిస్తాడు. స్త్రీ ఉద్యోగం చేసే విషయాన్ని నవీనయుగం వాళ్ళు సమర్థిస్తారని అంటాడతను. పిడరు పని చేయడం అతనికి ఇష్టం లేదు. అబద్ధం, ముఖస్తుతి, మోసం తన వల్ల సాధ్యమయేవి కావని అంటాడు. ''నేను నిరాశచెంది జైలుకు వెళ్ళడం లేదు;

నేననుసరిస్తున్న మార్గానికి ఇదే సహజ పరిణామం. సంఘర్షం, సంఘర్షం సంఘర్షం! జీవితమంతా సంఘర్షమయమే. సంఘర్షమే నాలోని అంతః ప్రేరణ,'' అని అంటాడతను. ఈ నవీనాన్ని నిర్మించేందుకు ఎంతటి వ్యయ ప్రయాసలు అవసరమో అతనికి తెలియకపోలేదు. ప్రాచీనాన్ని ఎంతో నిర్దాక్షిణ్యంగా నిర్మూలించవలసి వస్తుంది.''

వడి వడిగా మారిపోతున్న ఈ నూతన ప్రపంచాన్ని చిత్రించడంలో రచయితకు పూర్తిగా సాఫల్యం చేకూరిందని చెప్పేందుకు చక్కని నిదర్శనం ఒకటి కనిపిస్తుంది. కథ మొదట జ్వాలా ప్రసాద్ నవీనయుగానికి చెందిన వాడు. అదే వ్యక్తి యాభై సంవత్సరాల తర్వాత కింకర్తవ్య మూఢుడై ఇలా అనుకుంటాడు: ''నాకూ బోధపడడం లేదు, భీఖూ! ఇదంతా ఏమిటి? ఇలా ఎందుకు జరుగుతూ ఉంది? ఈ రక రకాల చిత్రరువులు వాటంతట అవి ఏర్పడుతున్నాయి. మళ్ళీ వాటంతట అవే మాయమై పోతున్నాయి. దీనివల్ల ప్రయోజనం?''

నవల చివర రచయిత ఇలా అంటాడు: ''తర తరాల చిత్రరువులను చూచి జీవితంలో ఎన్నో ఒడుదుడుకులకు తట్టుకుని ఎంతో అనుభవం సంపాదించిన ఇద్దరు వృద్ధులు ఏమీ చెయ్యలేకుండా ఉన్నారు, ఏమీ బదులు చెప్పలేకున్నారు. వాళ్ళకు దూరంగా వేలు, లక్షలు, కోట్లకు మించిన ప్రజలు జీవితాన్ని, జీవిత పురోగమనాన్ని గమనించి నవ నవోన్మేషంతో నూతనోత్సాహంతో నవ్య జగత్తును నిర్మించాలని వెళ్ళుతున్నారు.''

దీనితో కథ ముగిసిపోతుంది.

విస్తృత దేశకాలమందు వ్యాపించిన ఈ నవలయందలి కూర్పును గురించి కూడా విచారించడం అవసరం. ఈ విషయ వివేచనలో మొట్ట మొదట కథా కథనంలో రచయిత అవలంబించిన దృష్టిభంగిమ మనల నాకర్షిస్తుంది. రచయిత చిత్రించ దలచుకొన్న జీవిత విధానం చాల తటస్థ మైన దృష్టిభంగిమనపేక్షిస్తుంది. అందువల్లనే అతడు తటస్థమైన దృష్టితో కథా వస్తువును చిత్రిస్తాడు. ఈ దృక్పథం వల్లనే ఇంతటి విశాల దేశ కాల పరివ్యాప్త మయిన వస్తువును నిర్వహించడం సాధ్యమయింది. కాని ఈ తటస్థ దృష్టి వల్ల కథా కథనంలోని నాటకీయ శైలిలోని వైవిధ్యం కుంటుపడలేదు. మనోహరమైన సంభాషణ శైలి నాటకీయ తత్వాన్ని పుష్కలంగా పోషించింది. తటస్థ దృక్పథంతో చరిత్రకారుని శైలిలో కథ

చెప్పడం వల్ల రచయిత కథా సౌధంలో తన యిష్టం వచ్చిన మార్గంలో ప్రవేశించి కథను పెంచగలిగాడు. ఒక్కొక్కచోట అతను స్వతంత్రించి పాత్రల ప్రవర్తనను గురించి గానీ ఘటనా తత్వాన్ని గురించి గానీ వ్యాఖ్యానించడం కూడా జరిగింది. ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించు కొన్నప్పటికీ కథాకథనంలో కొన్ని లోపాలు రానే వచ్చాయి. తలవని తలంపుగా కొన్ని ఆకస్మిక సంఘటనలను ప్రవేశపెట్టి కథను ముందుకు నడిపించడం ఇలాంటి వాటిలో ఒకటని చెప్పవచ్చు. బుద్ధూ, జగ్గూ పహల్వాన్ల ఆనుషంగిక కథ ఇలాగే ఆకస్మికంగా ప్రవేశ పెట్టబడుతుంది. బిషన్‌లాల్‌కు సంబంధించిన వృత్తాంతం కూడా మూల కథా వస్తువుకు ఏ విధంగా దోహదం చేయదు. దానివల్ల మూల కథా గమనానికి ఏ విధమైన ప్రయోజనం చేకూరదు. కాని గంగాప్రసాద్‌కు జబ్బు చేయడం, తర్వాత ఆయన మరణించడం కూడా ఆకస్మికంగానే తోస్తుంది. అలా చేయడం ద్వారా రచయిత ఈ పాత్రను వదిలించుకోవాలని ప్రయత్నించినట్టు తోస్తుంది. గంగాప్రసాద్ వల్ల సాంధించ గలిగిన ప్రయోజనాలను రచయిత పూర్తిగా సాధించగలిగాడని చెప్పలేము. బర్జోర్ సింగ్ ఆత్మహత్య విషయంలో కూడా ఇలాగే తోస్తుంది. కాని ఇలాంటి లోపాలున్నప్పటికీ కథాకథనంలో శైథిల్యం మాత్రం రాలేదని చెప్పవచ్చు. నాలుగు తరాలకు సంబంధించిన వృత్తాంతం చెప్పవలసి వచ్చినపుడు కథా సూత్రాన్ని అవిచ్ఛిన్నంగా నడిపించేందుకు ఏదో ఒక పాత్ర కీలకంగా ఉండడం అవసరం. దానికి రచయిత జ్వాలా ప్రసాదును ఎన్నుకున్నాడు. అతని తండ్రియైన శివలాల్ మొదటి తరానికి సంబంధించిన వాడు. ఈ తరానికి చెందిన అభ్యుదయమంతా అతను తన ప్రయత్నంవల్లనే సాధిస్తాడు. తన తరంతో పాటు, తన కుమారుని తరానికి చెందిన స్థితిగతులు కూడా అతను అవగాహన చేసుకోగలుగుతాడు. కాని అతని మనుమడు నవల్ నాలుగో తరానికి చెందిన వాడు. ఈ తరానికి సంబంధించిన పరిస్థితులు జ్వాలా ప్రసాద్‌కు బోధపడవు. వాటన్నిటినీ ఆయన నిరీహంగా గమనిస్తుంటాడు. ఈ విధంగా మొదటినుండి చివరివరకు జ్వాలా ప్రసాద్ కథా క్రమానికి మేరుదండం లాగా నిలబడి ఉంటాడు. ఈ పాత్రకు కథా వికాసంలో సక్రియ పాత్ర నిర్వహణ లేని సమయంలో కూడా ఈ వ్యక్తి పరిస్థితులను

సంపృక్తంగా గమనిస్తూనే ఉంటాడు, కాబట్టి ఈ పాత్రవల్ల సాధించదగిన ప్రయోజనాలను రచయిత పూర్తిగా సాధించ గలిగాడని చెప్పవచ్చు.

పాత్ర నిర్వహణను గురించి చర్చించేప్పుడు ఒక విషయం మనకు గోచరిస్తుంది. పాత్ర పోషణలో రచయిత చూపించ వలసినంత లోతు పాతులను చూపించలేక పోయాడని అనిపిస్తుంది. బహుశా ఇంతటి విశాల దేశ కాల పరిధుల్లో విస్తరించిన సాంఘిక జీవితాన్ని చిత్రించడంలో రచయిత ఉద్దేశ్యం ఈ లోపానికి కారణమని తోస్తుంది. లేకుంటే 'చిత్రలేఖ', 'తీన్ వర్ష్', 'టేఢే మేఢే రాస్తే', లో రచయిత పాత్ర పోషణలో ప్రశంసనీయమైన నేర్పు ప్రదర్శించాడు. 'టేఢే మేఢే రాస్తే' లోని పండిత్ రామనాథ్ మరపురాని కథానాయకుల్లో ఒకరుగా పరిగణింపదగిన పాత్ర కాని ఈ నవలలోని పాత్రలు దాదాపు అందరూ ఏదో ఒక జాతికి, తెగకు చెందిన వారే. వారిలో వ్యక్తిత్వం లోపించింది. వివిధ పాత్రల మధ్యగల పరస్పర సంబంధంలో కూడా ఆత్మీయత అట్టే గోచరించదు. విహితమైన అనురాగం కానీ, అవిహిత రాగానుబంధం కాని, వాత్సల్య సంబంధం కానీ ఏ సందర్భంలో కూడా శుష్కతర్కాన్నీ, కారణకార్య సంబంధాన్నీ వాటి వ్యక్తి వైచిత్రిని స్పష్టీకరిస్తున్నట్టు కన్పట్టదు. ఈ రకమైన స్థూల చిత్రణ కుటుంబ వ్యవహారాల్లోనే కాక అధికారులూ, ధనికులూ, రాజకీయ కార్యకర్తలూ వ్యవహరించే విధానంలో కూడా కనిపిస్తుంది. వారి కార్య కలాపాలకు సంబంధించిన వివరాలు వల్లె వేయడమే తప్ప సంశ్లిష్ట రూపంలో వారి జీవితం చిత్రించినట్లు కనిపించదు. ఛింకీ, భీఖూ లాంటి పాత్రల్లో కొంత వైశిష్ట్యం, పుష్టి, మానవత్వం కనిపిస్తాయి. కాని కథా క్రమంలో ఈ పాత్రలు ఎక్కువగా వికాసాన్ని పొందలేదు. బహుశా రచయిత మనస్సులో అలాంటి ఆశయమేమీ లేదేమో.

ఏదో ఒక వర్గ విశేషానికి ప్రాతినిథ్యం వహించే పాత్ర పోషణకు సంబంధించినంతవరకు వర్మగారు ప్రేమచంద్‌కు సరితూగుతారు. మున్షీ శివలాల్ కరిణీకం, గుమస్తా గిరిలో ఆరితేరిన కాయస్థ కులానికి ప్రతినిధిగా మసి పూసి మామిడి కాయ చేసి అక్రమ మార్గాన్ని అనుసరించి అయినా సరే స్వార్థ సిద్ధికి ప్రయత్నించే వర్గానికి చెందిన వారు. తన కుమారుడే ఈ విధానానికి అంగీకరించక ఎదురు తిరిగితే ఆయన ఆవేశంలో ఆత్మ హత్య చేసుకొంటారు. మున్షీ రాధేలాల్ కూడా తన అన్నగారికి తగిన

తమ్ముడనిపించుకొంటూ అదే మార్గంలో నడుస్తారు. జ్వాలా ప్రసాద్ అలా కాక సామర్థ్యం, నిజాయితీ, కర్తవ్య పరాయణతతో ప్రభుత్వోద్యోగాల్లో అభివృద్ధికి వచ్చేందుకు ప్రయత్నించే మధ్య వర్గానికి ప్రతినిధి. గంగాప్రసాద్ కూడా ఈ మార్గాన్నే అనుసరిస్తాడు. కాని పరిస్థితులతో పోరాడవలసిన అవసరం అతనికి రాదు. అతని పర్యావరణం అతని అభివృద్ధికి దోహదం చేస్తుంది. అతను దాదాపు సమతల మార్గంలోనే పయనిస్తాడు. అందువల్లనే అతను సులభంగా దుర్వ్యసనాల్లో దిగి చివరకు చెడిపోతాడు. అతని కుమారుడు నవల్ అనిర్దిష్టమైన లక్ష్యాన్ని చేరుకునేందుకు పోరాటం సలపవలెనని ఉత్సహించే నవయుగ యువకులకు ప్రాతినిధ్యం వహిస్తాడు. మిగిలిన పాత్రల్లో ఠాకుర్ గజరాజసింగు, ఠాకుర్ బర్జోర్‌సింగు, సరోహన్ రాజా విచ్ఛిన్నమయి పోతున్న జమీందారీ విధానానికి ప్రతినిధులయితే, ప్రభుదయాల్, లక్ష్మీచంద్ అభ్యుదయం పొందుతున్న పెట్టుబడిదారీ విధానానికి ప్రాతినిధ్యం వహిస్తారు. జ్ఞానప్రకాశ్ రాజకీయ చైతన్యానికి ప్రతినిధి అయితే విద్య తిరుగుబాటు చేసే నవ యువతీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. మీర్ సాహబ్ రచయిత భావాలను కొంత వరకూ ప్రతిబింబింప చేస్తూ మరో వైపు పురాతన మతాను రాగాన్ని, నైతిక జీవితాశయాలను కూడా కొంతవరకు నిరూపిస్తారు. కాని ఆయన నూతన జీవిత విధానానికి అట్టే అనుకూలుడు కాడని భావించి రచయిత అతన్ని త్వరలోనే కథా రంగంనుండి తొలగిస్తాడు. ఘటనా బాహుళ్యంతో కూడిన విశాల కథా వస్తువును చేపట్టినప్పుడు, వర్గ గతమైన పాత్ర పోషణ తప్పదనే విషయం కూడా ఈ సందర్భంలో గమనించాలి.

కథా సంవిధానంలోనూ, పాత్ర పోషణలోనూ ప్రసంగానుకూలమైన వాతావరణం సృష్టించడంలో రచయిత యొక్క ఔచిత్య పరిచితి స్పష్టమవుతుంది. జ్వాలా ప్రసాద్ డిప్టీ తహసీల్దారయినప్పటి వాతావరణాన్ని చిత్రించడంలోగానీ, అల్లామా వహశీకీ, స్వామీ జటిలానందుకూ మధ్య జరిగిన శాస్త్రార్థాన్ని వర్ణించడంలో గానీ, నవల్ జైలుకు వెళ్ళే సమయంలో ఉత్సాహంతో ఊరేగింపుగా బయలుదేరిన ప్రజానీకాన్ని, వాళ్ళు ముక్త కంఠంతో చేసే జయ జయధ్వానాలను వర్ణించడంలో గానీ రచయిత సమయస్ఫూర్తినీ, ప్రాసంగిక పరిజ్ఞానాన్నీ చక్కగా ప్రదర్శించాడు. ఈ ఘట్టాల్లో కథా గమనంతో పాటు పాత్ర పోషణ కూడా సమృద్ధిని

పొందింది. ఇలా ప్రసంగోచిత వాతావరణాన్ని సృష్టించడంలో రచయిత అనుచిత వ్యామోహాన్ని చూపించినట్టు కూడా అనిపించదు. పరిశీలకూ, కథకూ ఎక్కడా, ఏమాత్రం వ్యవధానం ఏర్పడినట్టు కూడా కనిపించదు. వాతావరణాన్ని ఇంత చక్కగా అనాయాసంగా కల్పించగలగడం రచయిత సాధించిన గొప్ప సాఫల్యం.

ఈ రచనలోని భాష కూడా నిత్య జీవితంలో మనం మాట్లాడుకునే సహజ సరళమైన మాటలతో కూడుకుని ఉంటుంది. ఈ దృష్టిలో రచయిత ప్రేమచంద్‌నే అనుసరిస్తాడు. అలంకారికమైన భాష గాని, అనుచిత గాంభీర్యంతో కూడిన భాషగాని ఎక్కడనూ కనిపించదు. రచయిత అవలంబించిన భాషా శైలి కథావగాహనకు దోహదంచేసి చదువుకొనే వారి ఆసక్తిని పెంచుతుంది. నిజంగా ఈ నవలలో చిత్రింపబడిన స్మృతి రేఖలు మరల మన భావ వీథిని ప్రవేశించి రమణీయంగా, హృద్యంగా భాసిస్తాయి. మనదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత వెలువడిన హిందీ సాహిత్యంలో ఇది కృత కృత్యమయిన రచన. ఒక విధంగా ఇది స్ఫూర్తి దాయకమే కాక జ్ఞాన వివర్ధకమని కూడా చెప్పవచ్చు.

— దేవి శంకర్ అవస్థి

మొదటి ప్రకరణం

ఒకటి

మున్షీ శివలాల్ పిటిషన్ వ్రాసి అన్నారు: "ఇదిగో పిటిషన్ ఎలా వ్రాశానో చూడు ఠాకూర్! దీనితో ఆ మైకూలాల్ ఇక మళ్ళీ లేవడానికి వీల్లేకుండా పతనమయి పోయినాడన్న మాటే!"

మున్షీ వ్రాసిన పిటిషను విని ఠాకుర్ భూపసింహ్ సంబరపడ్డారు. "ఔరా ఎంత తెలివిగలవాడవయ్యా! మున్షీ! ఎంత తమాషాగా మాటలల్లేశావు?" అంటూ ఠాకుర్ భూపసింహ్ ఒక అర్థరూపాయి మున్షీ శివలాల్ చేతిలో పెట్టారు.

మున్షీ శివలాల్ ముఖం చిట్లించుకుని అన్నారు: "ఇదిగో చూడు ఠాకూర్! నేను రూపాయికి ఒక్క పైస తక్కువైనా ఒప్పుకోను. ఏ జూనియర్ ప్లీడరు దగ్గిరికో వెళ్ళితే నిర్మొహమాటంగా రెండు రూపాయలు లాగేవాడు. పైపెచ్చు కేసుకూడ చెడగొట్టి పెట్టేవాడు."

ఎంతో తర్కించుకున్న తర్వాత ఠాకూర్ భూపసింహ్ మరోపావులా మున్షీ శివలాల్ చేతిలో పెట్టారు. ఆ పావులా తీసుకుని మున్షీ శివలాల్ పిటిషను ఠాకూర్ భూపసింహ్ చేతికిచ్చి అన్నారు: "ఇప్పుడే విచారణ చేసే వేళయింది. నేరుగా కలెక్టరుగారి కచ్చేరీకి వెళ్ళండి. ఈ పిటిషన్‌తో పాటు పేష్కారు చేతిలో ఒక పావలా పెట్టడం మాత్రం మరిచిపోకండి. తెలిసిందా?"

మున్షీ శివలాల్ అంత పొడుగుమనిషి కాదు, పొట్టివాడు కూడా కాదు. మధ్యరకంలో సన్నపాటివాడు. వయస్సు దాదాపు యాభైయైదేండ్లు ఉంటుంది. చిన్న చిన్న మీసాలు — కుదించినట్లు రెండు మూడు రంగుల్లో ఉంటాయి. ముఖం అందంగానే ఉంటుంది. కాని స్ఫోటకపు మచ్చలు–గోధుమరంగు శరీరమయినప్పటికీ ఆ మచ్చలవల్ల చామనిచాయ అనిపిస్తుంది. ఠాకూర్ భూపసింహ్‌ను పంపించి మున్షీ శివలాల్ తమలపాకుల సంచీ బయటికి తీశారు. తమలపాకులు కిళ్లీ కట్టుకుంటూ ఆయన కేక వేశారు: "ఒరేయి ఘసీటూ!"

ఫతేపూర్ జిల్లా కలెక్టరు ఆఫీసు ఆవరణంలో ఒక పెద్ద మర్రిచెట్టు ఉంది. ఆ చెట్టుక్రింద మట్టికుండల్లో నీళ్ళుపోసుకుని ఘసీటూ ఆఫీసుకు వచ్చే

పొయ్యేవాండ్లకు మంచినీళ్ళు అందిస్తూ ఉంటాడు. నిద్ర మత్తుతో తూగుతూ ఉన్న ఘసీటూ మున్షీ శివలాల్ వేసిన కేకకు ఉలిక్కి పడ్డాడు. కండ్లు నులుపుకుంటూ అతను అక్కడినుండే పలికాడు. "ఏమిటి మున్షీ గారు! ఎందుకో పిలుస్తున్నారు ?"

"అరే! ఇలా రావోయ్ కొంచెం," అన్నారు మున్షీ శివలాల్.

ఘసీటూ బోయవాడు. మున్షీ శివలాల్‌గారి ఇంటికి సమీపంలోనే ఉంటాడు. ఘసీటూ భార్య చింకి మున్షీ శివలాల్‌గారి ఇంట్లోనే తిరుగుతూ ఏదో పని చూస్తూ ఉంటుంది. మున్షీ శివలాల్ ఘసీటూ ముందు ఒక పావలా విసిరేసి చెప్పారు: "సాయంత్రం కచ్చేరినుండి ఇంటికి వచ్చే టప్పుడు ఈ పావలాకు సారా తీసుకురా."

ఘసీటూ మున్షీ శివలాల్ వైపు ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు: "రాం రాం మున్షీగారు! నిన్ననే కదా మెళ్ళో రుద్రాక్షమాల వేసుకున్నారు. ఈ రోజు సారా తాగడం మొదలు పెట్టారా? ఎంత సిగ్గుచేటో, దొరా!"

మున్షీ శివలాల్ కొంచెసేపు ఆలోచించి అన్నారు: "నీవు చెప్పింది నిజమే నోయ్! నాకుమాత్రం తెలియదనుకున్నావా! కానినాకో ఉపాయంతట్టింది. ఇంట్లో గంగాజలం లేదటోయ్. ఆ సీసాలోనుండి నాలుగు బొట్లు గంగా జలం ఈ సారాలో కలిపేసేయ్. గంగాజలం అన్నింటినీ శుద్ధి చేస్తుంది."

ఘసీటూకు నవ్వు వచ్చింది. "భేష్ మున్షీగారు! భలే బుర్ర మీది. చక్కగా పని చేసిందని ఒప్పుకుంటాను." అంటూనే క్రింద పడేసిన పావలా తీసుకుని ఘసీటూ చెట్టుక్రింద పోగయినవాండ్లకు మంచినీళ్ళు ఇవ్వడానికి వెళ్ళి పొయ్యాడు.

మున్షీ శివలాల్ ఆకులు వేసుకుని మళ్ళీ పార్టీల కోసం ఎదురు చూస్తూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. అదే సమయంలో కలెక్టరుగారి జమాను చందనసింహ్ పరుగెత్తుకుంటూ మున్షీ శివలాల్ దగ్గరికి వచ్చి చెప్పాడు. "మున్షీగారూ! మిమ్మల్ని ఎంతసేపటినుంచి వెతుకుతున్నానో! దొరగారు మిమ్మల్ని ఇప్పుడే రమ్మని కబురు చేశారు బాబూ!"

దొరగారి పేరు వినగానే మున్షీ శివలాల్ ముఖం వెలవెల పోయింది. ఠాకూర్ భూపసింహ్‌కు వ్రాసిపెట్టిన పిటిషన్‌లో తాను చూపించిన తెలివి తేటలకు కలెక్టరుగారికి ఎక్కడన్నా కోపం వచ్చిందేమోనని భయపడ్డారు. మున్షీ శివలాల్ మనస్సులో పడుతున్న ఆందోళనను చందనసింహ్

గమనించాడు. అతను మున్షీ శివలాల్‌కు ధైర్యం చెపుతూ అన్నాడు: “భయపడాల్సిన విషయమేమీ లేదు మున్షీగారూ! దొరగారు పేష్కారుతో నవ్వుతూ మాట్లాడుతున్నారు. మీ మీద కోపం ఏమీ లేదు.”

మున్షీ శివలాల్ విజృంభిగుతూ అన్నారు: “కోపం వస్తే మాత్రం ఆయన నన్నేం చేయగలరు? నిజాయితీతో పనిచేసుకుని కష్టార్జితం అనుభవిస్తున్నాను. కృష్ణ, రామ అనుకుంటూ జీవితం గడుపుతున్నాను.”

కలెక్టరు తన గదిలో కూర్చుని ఆ రోజు వచ్చిన పిటీషన్లు పేష్కారు చదివి చెపుతూ ఉంటే విని వాటిని గురించి తన నిర్ణయాన్ని వాటిమీదనే వ్రాసేస్తున్నారు. అతను మున్షీ శివలాల్‌ను చూచి అన్నారు: “వెల్ మున్షీ! నీవు చాలా చురుకైన వాడివే!”

“దొరగారు మన్నించాలి. ఈ దాసుడు చేసిన తప్పేమయినా ఉంటే సెలవియ్యండి.” అన్నారు మున్షీ శివలాల్.

భూపసింహ్‌కు సంబంధించిన పిటీషను పేష్కారు దగ్గర నుండి అడిగి తీసుకుని కలెక్టరుగారన్నారు. “అయితే ఠాకూరును షాహుకారు కొట్టాడూ! షాహుకార్ని ఎద్దు పొడిచిందీ! ఎంత చక్కగా అల్లేశావ్? నేనిది నమ్మేస్తాననేనా నీ ఉద్దేశ్యం? అసలు జరిగిందేమిటో నిజం చెప్పు. దీని మీద పోలీసు దరియాప్తు జరిపించ వలసిందని నేను వ్రాసేశాను.”

గొంతు సవరించుకుంటూ మున్షీ శివలాల్ అన్నారు: “దొరగారు మన్నిస్తే మనవి చేస్తాను.”

ఆ రోజు కలెక్టరు మంచి మూడ్‌లో ఉన్నారు: నవ్వుతూ అన్నారు: “అలాగే, నిన్ను క్షమించాను. కాని జరిగిందంతా ఉన్నదున్నట్టుగా చెప్పాలి. ఒక్క అక్షరం కూడా అబద్ధం చెప్ప గూడదు.”

“అలాగేనండీ! ఈ మైకూలాల్ ఉన్నాడే, ఒట్టి మోసగాడు. వందల కొలది రైతుల్ని అతను నాశనం చేసేశాడు. అతని దగ్గర అప్పు తీసుకున్న వాళ్ళెవ్వరూ అప్పు తీర్చలేక పొయ్యారు.”

“ఓహో! ఈ మైకూలాల్ వడ్డీ వ్యాపారస్థుడన్న మాట! అయితే ఇక అర్థమయి పోయింది. నిజంగా అతను మోసగాడు, వంచకుడే అయి ఉంటాడు. సరే, తర్వాత ఏమయింద?”

“అదే మనవి చేస్తున్నాను సార్! మన భూపసింహ్ ఉన్నాడే, ఇతను మామూలుగా అందరినీ నమ్మే స్వభావంగల రైతు. అనుభవం తక్కువ.

అలాంటివాడు ఈ మైకూలాల్ వలలో చిక్కున్నాడు. ఇప్పటికి మైకూలాల్ అతని దగ్గర అసలుకు మూడురెట్లు వసూలు చేశాడు. కానీ అతని దాహమింకా తీరలేదు. మైకూలాల్ ప్రస్తుతం అతని ఇల్లూ, పొలం కూడా కాజెయ్యాలని చూస్తున్నాడు. మరి అలాంటప్పుడు భూపసింహ్‌కు అతని మీద కోపం వచ్చిందంటే ఆశ్చర్యం లేదు.''

''అయితే మరి ఈ పిటిషనంతా అబద్ధమనేగా'' అన్నాడు కలెక్టరు.

''అయ్యా, నిజమో అబద్ధమో సాక్ష్యం మీద ఆధారపడి ఉంటుంది. దొరగారు నన్ను నా యజమాని హోదాలో అడిగారు కాబట్టి నేనలా మనవి చేసుకున్నాను. న్యాయాధిపతిగా అడగలేదు కనుక ఉన్నదున్నట్టు చెప్పాను. దొరగారికి తెలియంది లేదు. మోసగాడితో మోసంగా వ్యవహరించకపోతే వాడికి బుద్ధిరాదు.''

కలెక్టరు ఆ సమాధానం విని నవ్వాడు: ''అయితే నీవు కూడా టక్కరివన్న మాటే! ఎలాగయితేనేం, మున్షీ, నీ సమాధానం నాకు తృప్తికరంగా ఉంది. నీవు మీ అబ్బాయి జ్వాలా ప్రసాద్‌ను గురించి ఏదో అడిగావు.''

''దొరగారికి మాబోటి నిరుపేదలంటే ఎంతో కనికరం. వాడికి ఎక్కడైనా రెవిన్యూ ఇన్‌స్పెక్టరుపనో, మరేదో అలాంటి పని ఏదైనా చూపించారా అంటే మా కుటుంబానికి ఎంతోమేలు చేసిన వాండ్లవుతారు.''

కలెక్టరు ఇంకా పెద్దగా నవ్వాడు: ''వెల్, మున్షీ! ఆ సంగతి నీవు చెప్పాలా? మీ అబ్బాయి జ్వాలా ప్రసాద్‌ను డిప్టీ తహసీల్దారుగా వేసేశాను.''

మున్షీ శివలాల్ తన చెవులను నమ్మలేక పోయారు. కండ్లువిప్పి ఆయన కలెక్టరు ముఖంలోకి చూచారు: ''దొరగారేం సెలవిచ్చారు! జ్వాలా ప్రసాద్‌ను డిప్టీ తహసీల్దారుగా దొరగారు నియమించారా? నేను వింటున్నది నిజమేనా దొరగారూ!''

కలెక్టరు గవర్నమెంటు ఆర్డరు శివలాల్ చేతికిచ్చి అన్నారు: ''ఇదిగో గవర్నమెంటు ఆర్డరు. పదిహేను రోజుల తర్వాత జ్వాలా ప్రసాద్ కాన్పూరు జిల్లాలో ఘాటంపూర్ తహసీలుకు వెళ్ళి పనిలో చేరిపోవాలి. అతను వెంటనే నన్ను కలుసుకుంటే నేనతనికి అన్ని విషయాలూ వివరంగా చెప్తాను.''

మున్షీ శివలాల్ వెంటనే కలెక్టరుగారి కాళ్ళపైపడి అన్నారు: "దొర గారు మాకు తల్లిదండ్రుల్లాంటివారు. మేము తరతరాల వరకూ మీ మేలు మరిచి పోలేము." అక్కడినుంచి లేచి ఆయన పేష్కారుకు కూడ చేతు లెత్తి నమస్కరించారు.

అర్జీలు వ్రాసిపెట్టే మున్షీ శివలాల్‌గారి కుమారుడు జ్వాలా ప్రసాద్‌కు డిప్టీ తహసీల్దారు పని వచ్చిందనే వార్త మెరుపు తీగలాగా ఒక్క క్షణంలో ఊరంతా తెలిసిపోయింది. మున్షీ శివలాల్ ఇంట్లో అందరికీ ఈ శుభ వార్త తెలియపరుద్దామని వెళ్ళేసరికి ఇంట్లోవాండ్లకి శివలాల్ తమ్ముడు మున్షీ రాధేలాల్ తన చుట్టూ చేరిన ఇరుగు పొరుగువాండ్లతో అంటున్నారు: "మా వంశమంటే ఏమిటనుకున్నారు! సిపాయీల తిరుగుబాటు రాకముందు మా వంశం ఎంత కీర్తి ప్రతిష్టలు సంపాదించిందో చరిత్ర చదివితే తెలుస్తుంది. మా పూర్వీకుల బల పరాక్రమాల వల్లనే నవాబుల సామ్రాజ్యం సాగేదని చరిత్రలో వ్రాశారు. ఈ సంగతులన్నీ కలెక్టరుగారికి తెలియబట్టే మేమడక్కుండానే పట్టుమని మా జ్వాలాను డిప్టీ తహసీల్దార్ చేసేశారు...

ఇరుగు పొరుగువాండ్లకు మూడుతరాలనుంచి రాధేలాల్‌గారి కుటుంబం ఎలాంటిదో బాగా తెలుసు. రాధేలాల్ తాత మున్షీ కుందన్‌లాల్ మొదట్లో ఫతేపూర్‌కి కరణంగా వచ్చారు. ఆయన వంచనకూ, అన్యాయాలకూ, అబద్ధాలకూ పెట్టిన పేరు. కుందన్‌లాల్ మంచి బ్రహ్మాండమైన ఇల్లు కట్టించారు. అదిగాక ఎన్నో వేల రూపాయలు డబ్బు సంపాయించారు. ఆయన జమిందారీ కొనెయ్యాలని అనుకునే రోజుల్లోనే ఠాకుర్ ఝూమర్ సింహ్‌తో ఆయనకు తగాదా వచ్చింది. ఠాకుర్ ఝూమర్ సింహ్ కేవలం జమిందారే కాదు. దోపిడీదొంగ కూడాను. ఒకనాటి రాత్రి మున్షీ కుందన్‌లాల్‌గారి ఇంట్లో దోపిడీ జరిగింది. రొక్కమూ, నగలూ తీసుకొని, మున్షీ కుందన్‌లాల్‌కు కాళ్ళూ చేతులూ విరగ్గొట్టి దొంగలు పారిపోయారు. ఇంకా ఏమయినా గొడవచేస్తే కుటుంబాన్నంతా నాశనం చేస్తామని భయ పెట్టి పోయారు.

కుందన్‌లాల్ సంపాద్యంలో అతని కుమారుడు బన్‌వారీకి ఆ ఇల్లొకటే మిగిలింది. కుందన్‌లాల్‌కు ఒక్కడే ఒక్క కొడుకు బన్‌వారీలాల్. అతనికి చదువూ సంధ్యలు అబ్బలేదు. వీధుల వెంబడి తిరుగుతూ ఉండే

వాడు. కాని బన్‌వారీలాల్ తన జీవితమంతా దర్జాగా గడుపుకున్నాడు. అతని జీవితం అవిధంగా ఎలా గడిచిందో ఎవరికీ బోధపడేది కాదు. బన్‌వారీలాల్‌కు ఇద్దరు పిల్లలు-మున్షీ శివలాల్, మున్షీ రాధేలాల్. మున్షీ శివలాల్ కోర్టులో అందరికీ అర్జీలు వ్రాసిపెట్టి జీవిస్తూ ఉండేవారు. మున్షీ రాధేలాల్ కేసులు, కోర్టు వ్యవహారాలూ చూస్తూ ప్లీడర్లకు కేసులు మాట్లాడిపెడుతూ ఉండేవారు.

మున్షీ రాధేలాల్ గొప్పగా చెప్పే బడాయీలను విమర్శించడానికిగానీ, ఆయన చెప్పింది తప్పని చెప్పేందుకుగానీ ఇరుగు పొరుగున ఎవరికీ ధైర్యం లేదు. మున్షీ రాధేలాల్ అంటే, అందరికి ఎక్కడలేని భయం. మున్షీ రాధేలాల్ ఏ సమయంలో ఎవరితో ఎలా పేచీపెట్టుకుంటాడో అని అందరూ జంకుతూ ఉండేవాళ్ళు. మున్షీ శివలాల్ రాగానే చుట్టుపక్కల వాళ్ళందరూ ఏకకంఠంతో అన్నారు: "శివలాల్‌గారూ! చాలా శుభ వార్త విన్నాం. విందుచేసి తీరాలి."

మున్షీ శివలాల్ నవ్వుతూ అన్నారు: "మీ అందరి చలవవల్ల భగవంతుడు ఈనాటికి మా మొర ఆలకించాడు. రెండు మూడు రోజుల్లో సత్యనారాయణ వ్రతం చేసుకోవాలని అనుకొంటున్నాం. జ్వాలా రాగానే విందు ఏర్పాటవుతుంది."

చుట్టుపక్కల వాళ్ళందరికి సమాధానం చెప్పి సాగనంపిన తర్వాత మున్షీ శివలాల్ ఇంటికివెళ్ళి గుడ్డలు మార్చుకుంటున్నారు. అదే సమయంలో ఛింకీ మున్షీ శివలాల్ ఉన్న గదిలోకి ప్రవేశించింది. ఘసీటూ భార్య ఛింకీ వయస్సు దాదాపు ముప్పై సంవత్సరాలుంటుంది. మంచి కాయవాటుగా, రాటుదేరిన నల్ల చేవబొమ్మవలె ఉంటుంది. ఛింకీ ఘసీటూకు రెండో భార్య. ఘసీటూ మొదటి భార్య రధియా దాదాపు పన్నెండు సంవత్సరాల క్రితం ఎనిమిదేండ్ల కొడుకు భీఖూను ఘసీటూకు ఒప్పగించి చనిపోయింది. ఛింకీకి పిల్లాజెల్లా ఎవరూ లేరు. అలాంటి అవకాశం కూడా లేదు. ఘసీటూ వయస్సు కూడా దాదాపు అరవై యేండ్లు నిండబోతూ ఉన్నది.

"మరి నాకు వెండికంటె చేయించి పెట్టాలి. అబ్బాయిగారికి డిప్టీ తహసీల్దారు పని అయింది." అన్నది ఛింకీ నవ్వుతూను.

"అలాగే, తప్పకుండాను. రేపే కంసాలివాడికి ఒక కంటె చేయ

మని చెప్పేస్తాను. అమ్మాయి ఏం చేస్తూ ఉంది?'' అన్నారు మున్షీ శివలాల్.

మున్షీ శివలాల్‌కు భార్యలేదు. దాదాపు ఎనిమిది సంవత్సరాలక్రితం ఆయన భార్యపోయింది. అప్పటికి ఆయన కుమారుడు జ్వాలాప్రసాద్ పధ్నాలుగేండ్లవాడు. అంతకు రెండేడ్లముందే జ్వాలాప్రసాద్‌కు వివాహ మయింది. బంధువులంతా ఎంత చెప్పినా మున్షీ శివలాల్ మళ్లీ పెండ్లి చేసుకో లేదు. ''పిల్లవాడున్నాడు, కోడలుంది, తమ్ముడూ, వాడికుటుంబం— వీళ్ళంతా ఉంటే మళ్ళీ పెండ్లి ఎందుకు? వృద్ధాప్యంలో ఏదో 'కృష్ణా', 'రామా' అనుకుంటూ ఉంటాను.'' అనేవారాయన.

జ్వాలాప్రసాద్ భార్య కాపరానికి వచ్చి ఆరునెల్లయింది. కాని ఇంట్లో పెత్తనమంతా రాధేలాల్ భార్యదే. యమున కేవలం అత్తింటికోడలు. అప్పటికి యమున వయస్సు పదహారు సంవత్సరాలు.

ఛింకీ కొంచెం కోపంగా, కొంచెం గంభీరంగా అన్నది: ''వంట చేస్తూ ఉన్నది. అది సరే కానీండి, చిన్నమ్మగారు అమ్మాయిగారిమీద మహా అధికారం చలాయిస్తుంది. పాపం అమ్మాయి ఒట్టి అమాయకురాలు. రాత్రీ పగలూ ఒకే చాకిరి. చిన్నమ్మగారితో మీరు కొంచెం చెప్పగూడదటండీ''

మున్షీ శివలాల్ పట్టీపట్టనట్టు ఛింకీతో అన్నారు: ''పోనీలేవే! రాధూ భార్య మాత్రం పరాయిదా ఏమన్నానా? ఇంటికి పెద్ద అదే కదా? దానికెలాచేస్తే బాగుంటుందని తోస్తే అలా చేస్తుంది.''

ఛింకీ మరేమీ చెప్పలేక అన్నది: ''మరేనండీ, అలాగే అంటారు మీరు. నేను వెళ్ళి అమ్మాయిగారికి రొట్టెలు ఒత్తన్నా ఇస్తాను. కొంచెం కాకపోతే కొంచెమయినా సాయం చేసినట్టవుతుంది.''

ఫతేపూర్‌లో జ్వాలాప్రసాద్ క్షణం తీరికలేకుండా తిరుగుతున్నాడు. మున్షీ శివలాల్ అతన్ని పెద్ద పెద్ద ఉద్యోగస్థులందరి దగ్గరికి తానే స్వయంగా తీసుకెళ్ళి సలాం చేయించి వచ్చారు. ఫతేపూర్లో ఉన్న కాయస్థులూ ఆ పేటలోని ఇరుగు పొరుగువారంతా జ్వాలా ప్రసాద్‌కు విందులుచేశారు. మున్షీశివలాల్ తన మనస్సు వచ్చినట్టు విందులూ, వినోదాలూ జరిపించారు. జ్వాలా ప్రసాద్ ఫతేపూరునుండి ఘాటంపూర్‌కు బయల్దేరవలసిన రోజుకు రెండురోజులు ముందుగానే ఛింకీ యమునతో అన్నది — ''నిన్నుగూడా ఘాటంపూర్ తీసికెళ్ళమని మీ పిన్ని

వ్రాసిందని విన్నాను. కాని నీవు వెళ్ళే ప్రయత్నంలో ఏమీ లేవే? ఇంతకూ జ్వాలాబాబుతో ఈ సంగతి చెప్పారా లేదా?"

యమున నిరుత్సాహంగా జవాబు చెప్పింది – "ఏం చెప్పను ఛింకీ? నేనెంతో చెప్పి చూదాను. కాని ఆయన నా మాట వింటేగా! నాన్నగారెలా చెప్తే అలా చేద్దామని అంటారు."

"ఐతే మరి జ్వాలా బాబు ఒంటరిగా వెళ్తారా? చిన్నమ్మగారు గూడా వెళ్ళే ప్రయత్నంలో లేదే!" అన్నది ఛింకీ.

"ఒంటరిగానే వెళ్తారేమో! నాకేమన్నా చెప్తారా, చేస్తారా? ఎప్పుడన్నా ఆయనతో మాట్లాడదామంటే ఆయనకు తీరికే లేదు. రాత్రింబగళ్ళు విందులూ, వినోదాలూనూ."

ఛింకీ కొంచెం ఆలోచించి అన్నది: "ఐతే కొంచెం ఆగండి, నేను పెద్దయ్యగారితో మాట్లాడి వస్తాను. జ్వాలా బాబుతో మీరు వెళ్ళడం తప్పదు. లేకపోతే ఆయన మంచి చెడ్డలు ఎవరు చూస్తారమ్మ గారూ?"

ఛింకీ మాటలకు యమున కలవర పడింది. ఆమె ఛింకీ చెయ్యి పట్టుకొని బ్రతిమాలింది: "నా మాట విను ఛింకీ! ఇప్పుడీ సంగతంతా లేవదీయకు. ఇదంతా నేను చేయించానని అనుకొని అత్తయ్య నన్నిక సాధించడం మొదలుపెడుతుంది. నీకు తెలియందేముంది చెప్పు."

ఛింకీ ఆమె చెయ్యి విడిపించుకుంటూ అన్నది: "అంత భయపడితే లాభం లేదమ్మా! నేను మాత్రం పెద్దయ్యగారికి నీవు చెప్పమంటే చెప్పినట్లు చెప్తానా? ఎలాగైనా సరే నిన్ను అబ్బాయిగారితో పంపించేటట్టు చూచే పూచీ నాది. నీవు నిశ్చింతగా ఉండు." అంటూ ఛింకీ యమున సమాధానానికి ఎదురు చూడకుండానే వెళ్ళిపోయింది.

మున్షీ శివలాల్ స్నానం చేసి పూజకు కూర్చోబోతున్నారు. ఇంతలో ఛింకీ ఆయన గదిలోకి ప్రవేశించింది. ఆయన ప్రశ్నార్థకంగా ఛింకీ వైపు చూడడం గమనించి ఛింకీ అన్నది: "చాలా ముఖ్యమైన మాట ఒకటి అడగాలి మిమ్మల్ని."

"నేను పూజ ముగించుకుని వచ్చే వరకు ఆగడానికి వీల్లేనంత అవసరమా?" అని అడిగారు మున్షీ శివలాల్ విసుక్కుంటూ.

"అంత అవసరం కాకపోతే నేను మీ పూజకు అడ్డం వస్తానా? ఎప్పుడన్నా నేను అలాంటి తెలివి తక్కువ పని చేశానా?"

మున్షీ శివలాల్ శాంతపడి అడిగారు: "అయితే మరి చెప్పు. త్వరగా- నీవు చెప్పదలుచుకుందేదో! ఈ రోజు నాకు చాలాపని ఉంది. జ్వాలాకు కావలసిన ఏర్పాట్లన్నీ చెయ్యాలి."

ఛింకీ కొంచెం ఎత్తిపొడుస్తున్నట్లు అన్నది: "మీ కాపరానికి సంబంధించినవిషయాల్లో నాకేమీ జోక్యంలేదని నాకు తెలుసు. జోక్యం కలగ జేసు కోవాలనికూడా లేదు. జ్వాలా బాబు ఒంటరిగా వెళ్లుతాడా అని అడగడానికి వచ్చాను."

"అవును, పెద్ద మ్మాయికి పురిటిరోజులు కదా అని నేనే మరదల్ని వద్దన్నాను. లేకుంటే ఆమెకు వెళ్ళాలనే ఉంది."

"మరి జ్వాలాబాబుకు తిండీ తిప్పలూ ఎవరు చూస్తారు?" అని అడిగింది ఛింకీ.

"అక్కడ ఎవరినన్నా వంటమనిషినేర్పాటు చేసుకుంటాడు. పెద్ద ఆఫీసరుగా వెళ్ళుతున్నప్పుడు వాడికి నౌకర్లకేం కొదవ? నేనా విషయమంతా వివరంగా జ్వాలకు చెప్పాను. ఆ దిగులు నీకేమక్కరలేదు."

"అయ్యో రామ, మీతెలివి తెల్లవారినట్టే ఉంది." అన్నది ఛింకీ ముఖం చిట్లించుకుంటూ: "నౌకర్లతో కాపరాలెక్కడన్నా బాగుపడుతాయా? మన చిట్టిబాబు కాపురమొక్కటేనా అలా బాగుపడేది? పొరుగూరు, పెద్ద ఉద్యోగం, అన్నింటికీ మించి తెలిసీ తెలియని వయస్సు."

మున్షీశివలాల్ ఛింకీని గదుముతూ అన్నారు: "ఏమిటలా సుద్దం బద్ధం లేకుండా వాగుతున్నావ్?" ఆ తర్వాత ఆయనకండ్లు మూసుకుని ఏదో ఆలోచించడం మొదలుపెట్టారు. మున్షీ శివలాల్ ఛింకీని గదిమారే కాని అది చెప్పిన మాటతో ఆయన మనస్సులో ఒక ధర్మసందేహం బయలు దేరింది. ఆయన ఇంతవరకూ అసలీ విషయాన్ని గురించి ఆలోచించనే లేదు.

మున్షీశివలాల్ మనస్సులో ఏర్పడ్డ ఆందోళనను ఛింకీ గమనించింది. తాను వేసిన బాణం గురి తప్పకుండా సరియైన లక్ష్యాన్ని చేరుకుందని అది తెలుసుకుంది. దానితో ధైర్యం తెచ్చుకొని మళ్ళీ సంభాషణ కొనసాగించింది: "అది కాదు, నా ఉద్దేశ్యం-అది కాదు. జ్వాలా బాబు వంటి బుద్ధిమంతుడయిన పిల్లవాడు మరొకడు ఉండడు. ఎంతో అమాయకుడు, నెమ్మదైనవాడు. కాని నేను చెప్పొచ్చిందేమిటంటే మన చిన్నబాబును శ్రద్ధగా చూడడానికి

నౌకర్లకంత అపేక్ష ఎందుకుంటుందీ అని. మీరే ఆలోచించండి ఒంటరిగా ఉంటే జ్వాలాబాబు ఆరోగ్యం సరిగా ఉంటుందా?"

శివలాల్ కండ్లు తెరిచారు — ఈ సమస్యను పరిష్కరించి తీరాలి. ఆయన రెప్పవాల్చకుండా ఛింకీవైపు కొంచెంసేపటి వరకూ చూచారు. "అయితే మరి ఏం చెయ్యాలని నీ ఉద్దేశ్యం?" అని ఆయన అడిగారు.

ఛింకీ కొంచెం జంకుతూ సమాధానం చెప్పింది: "మీతో మాట్లాడడానికి నాకెందుకో భయమేస్తుంది. మీరు కోప్పడకుండా ఉంటే చెప్తాను. కాని నేను చెప్పినమాట కాదంటే బాగుండదు."

"నీకు తోచిందేదో చెప్పవే, నీ బండ బడ! వినదగిందయితే అలాగే వింటాను."

"అయితే జ్వాలా బాబుతో పాటు అమ్మాయి గారిని కూడా పంపించడం మంచిదని నా ఉద్దేశ్యం."

"మున్షీ రామ్ సహాయ్ కూడా ఆ మాటే వ్రాశారు. కాని అమ్మాయిని జ్వాలాతో ఎలా పంపడం? అక్కడ ఒంటరిగా ఎలా ఉండగలదు?"

"ఒంటరిగా ఎందుకుంటుంది? జ్వాలాబాబు ఉన్నాడు గదా!" అన్నది ఛింకీ.

"అది నిజమే. కాని అమ్మాయికి తోడుగా ఉండి పనిపాటల్లో సాయం చేసేవాళ్ళెవరైనా ఉండ వద్దూ?"

"మరి దానికి నేనో మాట చెప్తాను. జ్వాలా బాబు పెద్ద ఆఫీసరయి వెళ్ళుతున్నాడు. అతనికి చెప్పు చేతల్లో ఒక పనివాడు ఉండడం అవసరం. మీరు సరేనంటే నేను భీఖూను వాళ్ళతో పంపించేస్తాను."

భీఖూను వెంట పంపించడమనే ఆలోచనతో మున్షీ శివలాల్‌లో కదలిక ఏర్పడింది. ఛింకీ చెప్పింది బాగానే ఉంది. డిప్టీ తహసీల్దారుగా వెళ్ళే అతనికి కూడా ఒక పరిచారకుడి లాంటి వాడు ఉండడం కనీసం హోదాకయినా అవసరం. భీఖూ ఇంటి పిల్లవాడు. మున్షీ శివలాల్ ఇంటి పక్కన అతడు పుట్టాడు. ఆయన ఇంట్లోనే వాడు పెరిగాడు. భీఖూ కూడా ఉంటే జ్వాలా భార్యకు ఏమీ ఇబ్బంది ఉండదనడంలో సందేహంలేదు.

"అలాగే కానియ్యి! అమ్మాయిని ప్రయాణం కమ్మని చెప్పు. ఎల్లుండి మధ్యాహ్నం బయలు దేరాలి. మరదలికి నేను చెప్తాను. భీఖూను కూడా ప్రయాణం చెయ్యి."

రెండు

జ్వాలా ప్రసాద్‌తో కూడా భీఖూను పంపించేందుకు ఘసీటూను ఒప్పించ డం ఛింకీకి చాలా సులువైన పని.

తహసీల్దారూ, డిప్టీ తహసీల్దారూ అంటే రాజా – మహారాజాలకంటె ఏమాత్రం తీసిపోయినవాడు కాదని ఘసీటూకు తెలుసు. అదికాక అతను మున్షీ శివలాల్‌గారి ఇంట్లో చనువుగా ఉండేవాడు. ఛింకీ చెప్పిన ఆలోచనకు ఘసీటూ చాలా సంతోషించి వెంటనే ఒప్పుకున్నాడు. జ్వాలా ప్రసాద్‌తో ఘాటంపూర్ వెళ్ళవలసిందని ఘసీటూ భీఖూకు చెప్పగానే భీఖూ ఉత్సాహంతో గంతులు వేశాడు. కొత్త స్థలానికి వెళ్ళడం అనే ఉత్సాహంతోపాటు, తాను స్వయంకృషితో తన జీవనోపాధి సంపా దించుకోగలననే ఆనందం తోడయేసరికి తల్లి దండ్రులకు దూరమై పోతాననే విషయం వాడికి బాధాకరంగా తోచలేదు.

యమునా జ్వాలాప్రసాదులతోపాటు ఘాటంపూర్ చేరేసరికి భీఖూకు ఏదో కొత్త పదవి లభించినట్టు తోచింది. ఒక విధంగా జ్వాలా ప్రసాద్ గారి ఇంట్లో అన్ని ఏర్పాటు చేసే భారం భీఖూ మీదనే ఉంది. ఆఫీసు పనితో జ్వాలా ప్రసాద్‌కు క్షణం తీరేదికాదు. యమున పెద్ద ఉద్యోగస్థుని భార్య అవడంచేత తన బాధ్యతలు నెరవేర్చుకుంటూ ఇంట్లోనే ఉండేది. మంచం మీద కూర్చునే, అందరిచేత పని చేయిస్తూ ఉండేది. ఇంటి ఖర్చంతా చూచుకొనే బాధ్యత భీఖూకు ఒప్పచెప్పారు. ఇంట్లో సామానులన్నీ భీఖూ స్వాధీనంలోనే ఉండేవి. జ్వాలా ప్రసాద్ కాపరంలో భీఖూ ఒక రకంగా భార్యాభర్తల మధ్య సంధాయకుడుగా పని చేసేవాడు.

అవి చలి రోజులు. భీఖూ బయట వరాండాలో కూర్చుని చిలుం తాగు తున్నాడు. జ్వాలా ప్రసాద్ ఆరోజు క్యాంపుకు వెళ్ళారు. యమున జమీందారుగారి భార్యను చూచి వచ్చేందుకు వెళ్ళింది. ఆ సమయంలో ఇల్లంతా భీఖూ స్వాధీనంలో ఉంది. అతను తనలోతాను ఎంతో సంతోష పడుతున్నాడు, మురిసి పోతున్నాడు, తన్మయమై పోతున్నాడు. ఉన్నట్లుండి అతని ఆనందానికి అంతరాయం కలిగింది. శివపురాన్నుంచి

వచ్చిన ఆ వూరి నంబర్‌దారు అతని యెదుట నిలబడి అడుగుతున్నారు:
"ఏమోయ్! డిప్టీ తహసీల్దారుగారు ఇంట్లో ఉన్నారా?"

"లేరండి, ఆయన క్యాంపుకు వెళ్ళారు. రేపు వస్తే రావచ్చు" భీఖూ లేచి సమాధానం చెప్పాడు.

నంబర్‌దారు ఒంటరిగా రాలేదు. ఆయనతో కూడా మరో మనిషి ఉన్నాడు. ఆ మనిషి తలమీద ఒక బుట్ట వుంది. భీఖూతో ఆయన అన్నారు: "శివపురానుంచి నంబర్‌దారు లాలా ప్రభుదయాల్ వచ్చి వెళ్ళారని డిప్టీ సాహబ్‌కు చెప్పు. రెండు మూడు రోజుల్లో నేను మళ్ళీ దర్శనం చేసుకుంటానని చెప్పు. అమ్మగారికి ఈ సామానియ్యి." ఈ మాటచెప్పి లాలా ప్రభు దయాల్ తన మనిషి చేత బుట్ట దింపించి భీఖూ ఎదుట పెట్టించారు.

ఆ బుట్ట చూచేసరికి భీఖూకు నోరూరింది. కాని మళ్ళీ కాస్త సర్దుకుని అన్నాడు: "అమ్మగారు ఇంట్లో లేరు. ఎవరన్నా ఏదయినా ఇవ్వడానికి వస్తే అది అయ్యగారికి చూపించందే, ఆయనకు చెప్పందే తీసుకొనేందుకు వీల్లేదని మా అయ్యగారు చాలా గట్టిగా చెప్పారు."

"అసలు మేమిది అయ్యగారి కోసం తీసుకొస్తే గదటోయ్. మా ఆవిడ డిప్టీ తహసీల్దారుగారి భార్యకు రాబోయే హోలీకి కానుకగా పంపించింది. దీనితోపాటు ఆమెను హోలీకి శివపురా రమ్మని ఆహ్వానం కూడా పంపింది, తెలిసిందా?" అని చెప్పి లాలా ప్రభుదయాల్ జేబులో నుండి ఒక రూపాయి తీసి భీఖూకియ్యబోయాడు: "ఇదిగో నీ ఇనాం తీసుకో."

ఆ రూపాయితో భీఖూ ధర్మ సందేహంలో పడ్డాడు. ఆ బుట్ట తీసుకోవచ్చునా తీసుకోకూడదా అని అతను నిర్ణయించలేక పోతున్నాడు. ఆ రూపాయి చూచేసరికి అతని మనస్సులోని సందేహం తీరిపోయింది. తనంతట తాను తటస్థపడ్డ లక్ష్మిని తిరస్కరించరాదని శాస్త్రాలు చెప్పాయనే విషయం అతనికి గుర్తు వచ్చింది. "అలాగేనండీ నంబర్ దారుగారూ! కాని ఇనాం ఇచ్చిన సంగతి మాత్రం అయ్యగారికి చెప్పకండి. లేకపోతే కోప్పడతారు..."

నంబర్‌దారు ప్రభు దయాల్ అక్కడినుండి వెళ్ళిపోయిన తర్వాత భీఖూ ఆ బుట్ట తెరిచి చూచాడు. అతని కాశ్చర్యం వేసింది. ఆ బుట్టలో రకరకాల తినుబండారాలున్నాయి - అన్నీ చాలా ఖరీదయినవి – పిస్తా, బాదం,

జీడిపప్పు, అక్రోట్. ఇవన్నీ కాక మఖమల్ తాను ఒకటి, కీన్‌ఖాబ్ తాను మరొకటి! అంతే కాదు-బరువైన వెండి పళ్ళెంలో సిల్కు రుమాలులో చుట్టిపెట్టిన వంద రూపాయలు. ఆ తర్వాత భీఖూ బుట్టలో ఉన్న వస్తువుల నన్నింటిని ఎప్పటిలాగానే మళ్ళీ అమర్చి ఆ బుట్టను తీసుకెళ్ళి సామాన్ల గదిలో పెట్టేశాడు. అప్పుడు బయటికి వచ్చి మళ్ళీ చిలుం తాగటం మొదలు పెట్టాడు. కాని అతని మనసులో ఏదో బరువు పెట్టినట్లయింది. ఈ బుట్టను తను స్వతంత్రించి తీసుకోడం తప్పేమో అని అతనికి అనిపిస్తూ ఉన్నది.

సాయంత్రానికి యమున ఇంటికి తిరిగి వచ్చింది. భీఖూ ఆ బుట్టను తీసుకుని వచ్చి యమున ముందు పెట్టి అన్నాడు: "అమ్మగారూ! శివపురా నుండి నంబరుదారుగారి భార్య మీకిది కానుకగా పంపించారు. నంబర్‌దారుగారే వచ్చి ఇచ్చి వెళ్ళారు. నంబరుదారు భార్య మీకు హోలీ శుభాకాంక్షలతో ఇది పంపించారు. అయ్యగారికి చెప్పకుండా తీసుకోడం నాకు ఇష్టం లేదు. అందుకని నేను వద్దని చెప్తూ ఉంటే నంబర్‌దారు నా మాట వినిపించుకోకుండా మా ఆవిడ అమ్మగారి కోసం ఇది పంపించారని చెప్పి ఇచ్చి వెళ్ళారు. మరి ఇక మాట్లాడలేక తీసుకున్నాను."

యమున బుట్ట తెరిపించింది. మఖమల్, కీన్‌ఖాబ్ తాన్లను చూచే సరికి ఆమె కండ్లు చెదిరి పోయాయి. తాన్లను బాగా మడతలు విప్పించి పరిశీలనగా రెండు వైపులా తేరిపార చూచింది. ఆమె ముఖం చేటంత యింది. తర్వాత ఆమె దృష్టి రుమాల్లో చుట్టి వెండి పళ్ళెంలో పెట్టి ఉన్న వంద రూపాయల వైపు ప్రసరించింది. ఆ వంద రూపాయలను చూసి ఆమె ముఖం చిన్న బోయింది. ఆమె భీఖూతో అన్నది: "భీఖూ! పండ్లు, గుడ్డలు కానుకగా ఇవ్వడం బాగానే ఉంది. కానీ ఈ రూపాయ లెందుకు పంపించి నట్టు?"

"నాకేం తెలుస్తుంది తల్లీ! బహుశా మీరు మీకు నచ్చిన వస్తువేదయినా చేయించుకునేందుకు డబ్బు పంపించి ఉండవచ్చు. ఒకరికి నచ్చిన సొమ్ములు మరొకరికి నచ్చకపోవచ్చునని నంబరుదారుగారి భార్య ఇలా పంపించి ఉండవచ్చు."

భీఖూ చెప్పిన సమాధానం యమునకంత తృప్తికరంగా లేదు. కాని

ఆమె చేయగలిగింది కూడా ఏమీ లేదు. అందులో న్యాయాన్యాయాలు నిర్ణయించవలసింది జ్వాలా ప్రసాద్. ఆమె భీఖాతో అన్నది: "అయితే భీఖా! ఈ సామానంతా ప్రస్తుతం సామాన్ల గదిలో అలాగే ఉంచేసెయి. ఆయన వచ్చిన తర్వాత ఆయనకెలా తోస్తే అలా చేస్తారు."

మరునాడు జ్వాలా ప్రసాద్ క్యాంపునుండి తిరిగి వచ్చారు. జ్వాలా ప్రసాద్‌కు ఆ బుట్ట తీసుక వచ్చి చూపించమని యమున భీఖాతో చెప్పింది. భీఖా బుట్టలో ఉన్న సామానంతా తీసుకు వచ్చాడు. కాని వెండిపళ్ళెం, ఆ పళ్ళెంలో పెట్టిన వంద రూపాయలు మాత్రం అతను సామాన్ల గదిలోనే వేరే పెట్టి వచ్చాడు. జ్వాలా ప్రసాద్ ఆ సామానంతా చూచి నవ్వుతూ యమునతో అన్నారు: "మఖమల్, కిన్‌ఖాబ్! ఆ రోజు రాజపురా నుండి వచ్చిన తర్వాత నీవొక మఖమల్ లంగా కావాలని అడిగావు. జ్ఞాపకముందా? ఇదిగో నీ కోరిక తీరిపోయింది. ఒక మఖమల్ లంగా, ఒక కిన్‌ఖాబ్ లంగా కుట్టించుకో."

జ్వాలా ప్రసాద్ ఆ కానుక తీసుకోడానికి సమ్మతించారనే విషయం భీఖా గమనించాడు. ఇప్పుడు సామాన్ల గదిలో ఉన్న వెండి పళ్ళెం, వంద రూపాయలు కూడా అతను తీసుక వచ్చాడు. ఆ పళ్ళెం, ఆ డబ్బు అతను జ్వాలా ప్రసాద్ ముందు పెట్టాడు. జ్వాలా ప్రసాద్ ఆశ్చర్య పడి అన్నాడు: "ఈ పళ్ళెం, ఈ డబ్బు ఎక్కడిది?"

"ఇవి కూడ ఆ బుట్టలోనే ఉన్నాయి. నేను వాటిని వేరే తీసి ఉంచాను"

"అలాగా! అయితే ఇది ఉపహారం కాదు, లంచం. ఇప్పుడు తెలిసిపోయింది. అసలు నీవు లాలా ప్రభు దయాల్ దగ్గరి నుంచి ఈ బుట ఎందుకు తీసుకున్నావు?" జ్వాలా ప్రసాద్ చాలా కటువుగా అన్నారు.

భీఖా తన పక్షం నెగ్గుతున్నట్టు గమనించాడు. "ఈ కిన్‌ఖాబ్, మఖమల్, ఈ పిస్తా, బాదం–ఇవన్నీ కానుకలయితే వెండిపళ్ళెంలో పెట్టిన సొమ్ములు మాత్రం కానుకలు కావా బాబూ! అమ్మగారు తన మనస్సుకు నచ్చిన సొమ్ములు చేయించుకుంటారులే అని నంబరుదారుగారి భార్య సొమ్ములకు బదులు డబ్బు పంపించారు. అంతే గదా భేదం!"

భీఖా తర్కాన్ని ఖండించడానికి వీల్లేక పోయింది. జ్వాలా ప్రసాద్‌కు దానికి ప్రతివాదం ఎంత ఆలోచించినా దొరక లేదు. "అవును, నీవు

చెప్పింది నిజమే. కాని .... కాని .... సరే పోనీ అదంతా ఎందుకులే. అయితే లాలా ప్రభు దయాల్ నాతో ఏమన్నా పని ఉన్నదని చెప్పారా ?"

భీఖూ సగర్వంగా నవ్వుతూ అన్నాడు: "అదేంలేదు బాబూ! ఆయనకు నేను మీరు కోప్పడతారని కూడా చెప్పాను. అమ్మగారు ఇంట్లో లేరు. నేనీ బుట్ట తీసుకోడానికి వీల్లేదని చెప్పాను. అప్పుడాయన నంబరుదారు భార్య అమ్మగారికని ఈ కానుక పంపించారని చెపితే మరేమనలేక నేను తీసుకున్నాను బాబూ!"

జ్వాలా ప్రసాద్ యమునతో అన్నారు: "దర్జీ వాణ్ణి పిలిపించి లంగా కుట్టించుకో. జరీ నేను కాన్పూరు నుంచి తెప్పిస్తాను. కంసాలిని పిలిపించి కావలసిన సొమ్ములు చేయించుకో."

లాలా ప్రభుదయాల్ పెద్ద జమీందారు కారు గాని ఆయన మంచి పేరు ప్రతిష్టలు గలవారు. ఇప్పటికాయన ఎన్ని జమీందారీలో కొనేశారు. ప్రభుదయాల్ వైశ్య కులానికి చెందినవారు. ఆయన తండ్రి చిల్లర దుకాణం నడిపించే వారు. ప్రభుదయాల్ వడ్డీ వ్యాపారం మొదలు పెట్టారు. ఆయన దగ్గర అప్పు తీసుకున్న వాళ్ళు తమ జీవితాంతం వరకేకాక తరతరాల దాకా ఆయన ఋణం తీర్చలేరని అందరూ చెప్పు కుంటారు. అయినప్పటికీ ప్రభు దయాల్ అంటే ఇష్టం లేని వాండ్లెవరూ లేరు. ఎవ్వరికీ ఆయన మీద కోపం లేదు. ఆయన భవంతి ముందే ఒక పెద్ద రాధాకృష్ణ మందిరం ఉంది. ఆ మందిరం ఆయన కట్టించి ఏడెనిమిది సంవత్సరాలయింది. అక్కడ ప్రతిరోజూ ఉదయం సాయంత్రం పూజ జరుగుతుంది. అందరికీ ప్రసాదం పంచి పెడతారు. సామాన్యంగా ఏ రామాయణమో, భాగవతమో పురాణ కాలక్షేపం అక్కడ ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఆ కాలక్షేపానికి ఎంత దూరంనుంచో జనం వచ్చేవారు. అప్పుడప్పుడూ పెద్ద పెద్ద ఆఫీసర్లకు తన ఇంట్లో విందులు కూడా చేసేవారు.

ఘాటంపూర్ వచ్చిన తర్వాత జ్వాలాప్రసాద్ ప్రభుదయాల్‌ను గురించి చాలావరకూ విన్నారు. ప్రభుదయాల్‌ను ఆయన తరచుగా కలుసుకునే వారుకూడాను. కాని ప్రభుదయాల్‌తో ఆయనకు సన్నిహితసంబంధం ఏర్పడలేదు. ఆయన ఘాటంపూర్ వచ్చినతర్వాత కృష్ణాష్టమినాడు ప్రభుదయాల్ భార్య జైదేయి స్వయంగా యమున ఇంటికివచ్చి కృష్ణ

మందిరంలోని అలంకారం చూపించడానికి ఆమెను బలవంతంగా తనతో తీసుకువెళ్లింది. అప్పుడు జైదేయి తన ఇంట్లో యమునను రెండు రోజులు ఉంచుకుంది. ఈ రెండురోజుల్లో యమునకూ, జైదేయికీ మంచిస్నేహం ఏర్పడింది. వీడ్కోలు సమయంలో ప్రభుదయాల్ జ్వాలాప్రసాద్‌కు ఏదో కానుక ఇవ్వాలని అనుకున్నారు. కాని జ్వాలాప్రసాద్ దానికి సమ్మతించ లేదు.

యమున ఆనాడే దర్జీని పిలిపించి కీన్‌ఖాబ్ మఖమల్ తాను పావడాలు కుట్టడానికి ఇచ్చేసింది. కంసాలిని పిలిపించి అయిదు తులాల గాజులు తయారు చేయడానికి ఆర్డరిచ్చింది. ఇవి ఇంతత్వరగా చేయించ డానికి కారణం కూడా లేకపోలేదు. రెండు మూడు నెలల్లో ఘాటంపూర్ జమిందారయిన ఠాకుర్ గజరాజ సింగుగారి అమ్మాయి పెండ్లి జరగబోతూ ఉంది. ఠాకుర్ గజరాజసింగు ఇలాకాదారుగా పరిగణింప బడేవారు. ఆయన కూతుర్ని అయోధ్యలో ఒక తాలూకాదారు కుమారునికిచ్చి చేస్తున్నారు. పెండ్లి కుమారుడి తరపున దాదాపు వెయ్యిమంది పెండ్లికి వస్తారని అనుకుంటున్నారు. ఇంతమంది పెండ్లివాళ్ళు వచ్చేప్పుడు పెండ్లి కూతురుగారి ఇంట్లో నెలా రెండు నెల్లనుంచే చుట్టాలూ పక్కాలూ ముందుగావచ్చి ఉండడంలో ఆశ్చర్యంలేదు.

ఠాకుర్ గజరాజసింగు జ్వాలాప్రసాద్ కంటె వయస్సులో చాలా పెద్దవాడే అయినప్పటికీ జ్వాలాప్రసాద్‌తో ఆయన స్నేహితుడుగానే ప్రవర్తించేవారు. దానికి కారణం జ్వాలాప్రసాద్‌గారి మామ మున్షీరాము సహాయ్‌తో ఠాకుర్ గజరాజసింగు కుటుంబానికిగల పూర్వపరిచయం. దాన్ని పురస్కరించుకొనే ఠాకుర్ గజరాజసింగు జ్వాలాప్రసాద్‌ను గవర్నమెంటు ఉద్యోగస్థునిలా కాకుండా తన తోటివానిగా సంఘంలో గౌరవిస్తూ ఉండేవారు. యమునకూడా గజరాజసింగుగారి ఇంట్లో చనువుగా తిరుగుతూ ఉండేది.

ఠాకుర్ గజరాజసింగు భార్య దేవీరాణి యమునకంటె చాలపెద్దది. యమునతో ఆమె అలాగే ప్రవర్తించేదికూడాను. పిల్ల పెండ్లి విషయంలో వచ్చిన అతిథులను విచారించడం, వాళ్లకు తగిన మర్యాదలు చేయడం— ఈ బాధ్యత అంతా ఆమె యమునకు అప్పచెప్పింది. గొప్పగొప్ప వాళ్లకు మర్యాదలు చేయడానికి తనుకూడా గొప్పగా కనిపించడం అవసరం.

కాని అలా కనిపించడానికి యమునకు తగిన తళుకు బెళుకు గుడ్డలుకాని, విలువగల సొమ్ములుగాని లేవు. సొమ్ములు కొంతవరకు ఆమె తన వైపు వాళ్లదగ్గర ఎక్కడనో ఎరువు తెచ్చుకుంది. కాని గుడ్డల సమస్యకేమీ పరిష్కారం కనిపించడంలేదు. కనీసం రెండు మూడు జతల గుడ్డలు కుట్టించుకోకపోతే జరిగేట్టులేదు. అవి కూడా కొంచెం విలువగలవిగా ఉండాలి. అందువల్ల ఇటీవల కొద్దిరోజులనుంచి యమున జ్వాలా ప్రసాద్‌ను ఒత్తిడి చేస్తూనే ఉంది. మంచిమంచి గుడ్డలు కొనడానికి డబ్బు కావాలి. జ్వాలా ప్రసాద్‌కు ఎంతవచ్చినా ఆయన దగ్గర డబ్బు నిలవ ఉండడం లేదు. తన జీతంలో నాలుగోవంతు ఆయన తన తండ్రికి పంపిస్తూ ఉన్నారు. మిగిలిన దానితో ఆయన తన హోదాకు భంగం లేకుండా జీవితం గడుపుతున్నారు. పై ఆదాయం రావడానికి అవకాశం లేక పోలేదు. కాని ఈ పైసంపాద్యం అంటే ఆయనకు ఇష్టం లేదు.

లాలా ప్రభుదయాల్ పంపించిన కానుకతో జ్వాలా ప్రసాద్‌ను ఎదుర్కొంటున్న ఈ గొప్పసమస్య చాలా సులువుగా తేలిపోయింది. ఈ సమస్య ఇంత సులువుగా తేలిపోయిందనే ఆనందంలో ఆయనకు యథార్థంగా అందులో ఉన్న అహితం గోచరించలేదు. ఆ తర్వాత దాదాపు మూడు నెలలకు గజరాజసింగుగారింట్లో పెండ్లికి వచ్చిన జైదేయి పాలకీ జ్వాలా ప్రసాద్‌గారి ఇంటిముందు ఆగినప్పుడు అతనికి దానిలోని అసుందరత్వం ఆభాస మాత్రంగా బోధపడింది.

గజరాజసింగు ప్రభుదయాల్‌ను పెండ్లికి ఆహ్వానించారు. ప్రభుదయాల్ భార్య జైదేయి పల్లకిలోనుంచి దిగేసరికి యమున గజరాజసింగుగారి ఇంటికి వెళ్లడానికి సిద్ధమవుతూ ఉన్నది. తన భార్య జైదేయి జ్వాలా ప్రసాద్‌గారి ఇంట్లో తన చెల్లాయి యమునతో బసచేయాలని అనుకుని ఇక్కడకు వచ్చిందని ప్రభుదయాల్ జ్వాలా ప్రసాద్‌తో ఎంతో ఆత్మీయంగా చెప్పారు. ఆమాటకు యమున చాలా సంతోషించింది. కాని జ్వాలా ప్రసాద్‌కు ఆ విషయం అంతగా నచ్చలేదు. కాని ప్రభుదయాల్ చూపించిన ఆత్మీయతను నిర్మొహమాటంగా తిరస్కరించడానికి కూడా జ్వాలా ప్రసాద్‌కు మనస్కరించలేదు. ఇక చేసేది లేక బాహ్యంగా ప్రేమను కనబరుస్తూ ఆయన ప్రభుదయాల్ని, జైదేయిని లోపలికి పిలుచుకు వెళ్లారు.

గజరాజసింగుగారింట్లో పెండ్లికి వియ్యాలవారు ఆ రోజే ఉదయం

వచ్చేశారు. ఇంత పెద్ద ఎత్తున పెండ్లి వాళ్ళెవరూ ఇంతకు ముందు ఎప్పుడూ ఘాటంపూర్ రాలేదని అందరూ చెప్పుకుంటున్నారు. పెండ్లి కుమారునితోపాటు దాదాపు పన్నెండు వందల మంది చుట్టాలు వచ్చారు. ఈ చుట్టాలూ, పక్కాలేకాక పదకొండు ఏనుగులూ, యాభై ఒక్క ఒంటెలూ, నూట ఒక్క గుఱ్ఱాలూ, మూడువందల ఎద్దుబండ్లూ, వాటితోపాటు ఆరు వందల ఎద్దులూ – ఈ చుట్టాలనూ, పశువులనూ విచారిస్తూ వాళ్ళకు పరిచర్య చేయడానికి దాదాపు ఎనిమిది వందల మంది నౌకర్లు కూడా వచ్చారు. ఈ బలగం అంతా ఉండేందుకు ఠాకుర్ గజరాజసింగు యాభై ఎకరాల మామిడి తోటలో విడిది ఏర్పాట్లు చేయించారు. ఎక్కడెక్కడి నుంచో డేరాలు వేయడానికి కావలసిన సరంజామా అంతా తెప్పించి అన్ని ఏర్పాట్లు చేయించారు.

యజ్ఞపూర్‌కు తాలూకాదారయిన రాజా చంద్రభూషణసింగు కుమారుడు లాలా ఇంద్రభూషణసింగుకు తన కూతురునిచ్చి వివాహం చేయడానికి ఠాకుర్ గజరాజసింగు ఇంత ఖర్చు పెట్టాల్సి వచ్చింది. కట్నం ఇంత అని ఏమీ అనుకోలేదు. కాని ఠాకుర్ గజరాజసింగు తన రాజధానికి తగినట్టుగానే ఇద్దామనుకున్నారు. ఈ హుందాతనాన్ని నిలబెట్టు కొనేందుకు గజరాజసింగుకు అప్పుచేయక తప్పింది కాదు. లాలా ప్రభు దయాల్ దగ్గర అయిదూళ్ళు కుదవపెట్టి ఆయన ఈ అప్పు తీసుకున్నారు.

జైదేయిని కూడా తీసుకుని యమున ఉదయం పది గంటలకే గజరాజ సింగుగారి ఇంటికి వెళ్ళిపోయింది. తర్వాత మధ్యాహ్నానికల్లా లాలా ప్రభు దయాల్‌ను వెంటబెట్టుకొని జ్వాలా ప్రసాద్ కూడా గజరాజసింగుగారి ఇంటికి వెళ్ళారు. గజరాజసింగు దివాణంలో కూర్చుని బంధువులతోనూ పనివాళ్ళతోనూ, జమీందార్లతోనూ పెండ్లి ఏర్పాట్లను గూర్చి, మాట్లాడుతూ ఉన్నారు. పెండ్లివాళ్ళు చాలామంది వస్తారని ఆయనకు తెలుసు. దానికి తగిన ఏర్పాటు కూడా ఆయన చేయించారు. కాని ఇంతమంది ఇంత సన్నాహంగా వస్తారని ఆయన ఊహించనైనా లేదు. ఆయన చేసిన ఏర్పాటు ఇంతమందికి సరిపోయేలాగా లేదు. అందువల్ల ఆయన చిక్కున పడిపోయారు. అదనంగా ఏర్పాట్లు చేయడానికి ఆయన తనకు తెలిసిన వాళ్లకు కబురు చేశారు. వాళ్లంతా వచ్చి ఆయన కోసం ఎదురుచూస్తున్నారు.

జ్వాలా ప్రసాద్‌ను చూడగానే ఆయన అన్నారు: "చూచారా డిప్టీగారూ, పెండ్లివాళ్లలా వచ్చారో! దోపిడి ముఠా లాగా వచ్చేశారు. నేను మీ రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లనిద్దరినీ అన్నీ ఏర్పాట్లు చేయడానికి పంపించాను. మీ పేరు చెప్పి నలుగురు కరణాలను కూడా పిలిపించాను. మీకు తెలిసి ఉంటే బాగుంటుందని చెప్తున్నాను."

"వాళ్లందర్నీ మీ స్వంత మనుష్యుల్లాగనే భావించండి ఠాకుర్‌గారూ! అవసరమైతే నేను కూడా సిద్ధంగానే ఉన్నాను." అన్నారు జ్వాలా ప్రసాద్ నవ్వుతూ. "ఎంత చెట్టుకంత గాలి. గొప్పవాళ్ళ ఇంట్లో కార్యాలు గొప్పగానే ఉండాలి."

"ఎందుకలా ఎత్తిపొడుస్తారు డిప్టీగారు!" అంటూ ఠాకుర్ గజరాజ సింగు కూడా నవ్వారు. తర్వాత ఆయన ప్రభుదయాల్ వైపు తిరిగి అన్నారు: "కూర్చోండి ప్రభుదయాల్ గారూ ఎప్పుడు రావడం?"

"ఉదయమే వచ్చాం మేము. మా ఆవిడ కూడా వచ్చింది. కాని ఆవిడను తహసీల్దారుగారి భార్య బలవంతం చేసి వాళ్ళింట్లోనే దిగమన్నారు. ఇప్పుడు వాళ్ళిద్దరుకూడా ఇక్కడికి వచ్చేశారు. ఠాకుర్‌గారూ! వాళ్ళిద్దరికీ ఎంత స్నేహం, ఎంత ఆపేక్ష అనుకొన్నారు? నాకామె పద్ధతులన్నీ ఎంతో బాగా నచ్చాయి. ఆమెకు ఎంత మమకారం, ఎంత ఉత్సాహం; మన బాబూ జ్వాలా ప్రసాద్ ఎంత కలుపుగోలుగా, ఆపేక్షగా, నిష్కపటంగా ఉంటారో అలాగే ఆయన భార్య కూడాను. ఇద్దరి దాంపత్యాన్ని ఇంత చక్కగా కూర్చిన భగవంతుని ప్రశంసించాలి."

"దానికేముంది ప్రభుదయాల్ గారూ! నాయిల్లయితే ఒకటీ, డిప్టీ గారిల్లయితే ఒకటీనా? అక్కడ దిగడం మంచి పనే చేశారు. ఇక్కడ అంతా చీకాకు. ఆడపిల్ల పెండ్లంటే ఎంత శ్రమ అనుకున్నారు! లాలాజీ, చూస్తూనే ఉన్నారు గదా! నాకు క్షణం తీరిక దొరకడం లేదు. నేను మన యజ్ఞపూర్ రాజాగారికి ఎక్కువ మందిని తీసుకరావద్దని చెప్పాను గూడా. కాని 'రాజసం' అని మనవాళ్ళు ఊరికే చెప్పారూ! మహా పట్టుదల మనిషి! పన్నెండు వందల మంది చుట్టాలను తీసుకొనివచ్చారు. అంతే కాదు. వుండటానికి సామగ్రీ, తిండి గింజలూ అన్నీ తన కూడా తీసుకొని వచ్చారు. ఎక్కడికో దండయాత్ర వెళ్ళుతున్నట్లుగా ఉన్నది గాని, ఇది పెండ్లి సందడిగా లేదు. ప్రభుదయాల్ గారూ! నాకు మాత్రం చెడ్డ కోపం

వచ్చింది. ఇదంతా బాగులేదని నేనాయనతో నిర్మొహమాటంగా చెప్పేశాను. కాని ఆయన ఎంతగొప్పవాడో అంతమంచి వాడు. అమాయకుడు. నేనామాట అనేసరికి ఆయన కండ్లు చెమర్చాయి. నా భుజం మీద చెయ్యిచేసి "నీ మర్యాదను నేను నామర్యాదగానే భావిస్తాను. ఈ చిన్న విషయాన్ని గురించి నీ వింతగా అనుకుంటావని నేననుకోలేదోయ్" అన్నారు.

గజరాజసింగు బావమరిది ఠాకుర్ బర్‌జోర్‌సింగు అక్కడనే కూర్చుని ఉన్నారు. ఆయన భావావేశంతో అన్నారు: "నీకేం తెలుసు బావా? రాజాసాహెబ్ మానవుడనుకుంటున్నావా? ఆయన దేవుడిలాంటి వాడు. రాజాసాహేబ్‌లాంటి వియ్యంకుడు దొరకడం నీ అదృష్టమనుకో బావా!"

గజరాజసింగు ఆ మాటలకు ఉబ్బి పోయినారు. చుట్టుపక్కల కూర్చున్న వాళ్ళంతా ఏమనుకుంటున్నారో గమనించడానికి ఆయన నలువైపులా చూచారు. లాలా ప్రభుదయాల్ తనలో తాను నవ్వుకుంటున్నారు. ప్రభుదయాల్ నవ్వులో సహజమైన మాధుర్యం లేనట్టుతోచింది ఠాకుర్ గజరాజసింగుకు. ఆయనకు ఆ నవ్వులో వ్యంగ్యం స్పష్టంగా గోచరించింది. కొద్ది రోజుల క్రిందటనే ఆయన ప్రభుదయాల్ దగ్గర ఐదూళ్ళు కుదువ పెట్టి ఇరవై వేల రూపాయలు అప్పు తీసుకున్నారు.

ఠాకుర్ గజరాజసింగు పేరు మోసిన జమీందారు. జమీందారీవల్ల ఆయనకు సంవత్సరానికి ఇరవై వేలు ఆదాయం వస్తుంది. కాని ఆయన ఖర్చుకూడా అలాగే విపరీతంగా పెట్టేస్తారు. ఆయనకు వ్యసనాలు ఎన్ని ఉండాలో అన్నీ ఉన్నాయి. అందువల్ల ఆయన దగ్గర డబ్బు నిలవ ఉండదు. పొదుపుగా ఖర్చు పెట్టడమనేది ఆయన దృష్టిలో తప్పైన పని. ఖర్చు పెట్టడానికే భగవంతుడు ఆదాయం ఇస్తాడని ఆయన నమ్మకం. అందువల్ల ఆయన లాలా ప్రభుదయాల్‌ను అగౌరవంగా చూస్తారు. ఇరవై సంవత్సరాల క్రితం ప్రభుదయాల్ తండ్రి చిన్న చిల్లరకొట్టు పెట్టుకొని కాలం గడుపుతూ ఉండే రోజులు ఆయనకు గుర్తున్నాయి. ఈ ఇరవై సంవత్సరాల్లోగానే లాలా ప్రభుదయాల్ ఆరు గ్రామాలు కొనేశారు. లక్షల్లో వడ్డీ వ్యాపారం నడిపిస్తున్నారు. ఘాటంపూర్ తహసీల్దారు మొత్తంలో లాలా ప్రభుదయాల్ దగ్గర ఉన్నంత రొఖ్ఖం మరి ఇంకెవరి దగ్గరా లేదు.

గజరాజసింగు తన సందేహాన్ని ధ్రువ పరచుకునేందుకు లాలా ప్రభుదయాల్‌ని పలకరించారు: "ఏమండీ ప్రభుదయాల్‌గారూ! ఈ పెండ్లి వాళ్లను గురించి మీ అభిప్రాయ మేమిటి?"

ప్రభుదయాల్ అలాగే నవ్వుతూ అన్నారు; ఈ పెండ్లివారి సంగతి చెప్పేదేముంది? అంతా రాజులు, జమీందార్లు, దానికి తగిన ఠీవి, రాజసం మరి! కొంచెంసేపాగి మళ్ళీ అన్నారాయన: "యజ్ఞపూర్ రాజాగారి ఆదాయం ఏడాదికి మూడు లక్షల రూపాయలని విన్నాను."

లాలా ప్రభుదయాల్ యజ్ఞపూర్ రాజా అదాయాన్ని గురించి చెప్పిన మాటల్లో ఉన్న అభిప్రాయం అక్కడ కూర్చున్న వాళ్లల్లో జ్వాలాప్రసాదుకు తప్ప మరెవ్వరికి బోధపడలేదు. లాలా ప్రభుదయాల్ చెప్పిన సమాధానం గజరాజసింగుకు తృప్తికరంగానే తోచింది. ఆయన అన్నారు: "కాని ఆయన ఖర్చు పెట్టడం కూడా అలాగే పెడతారు. రూపాయలను మంచి నీళ్లలాగా వాడుతారాయన. మసూరీలో ఒక మేడ వుంది. అలహాబాదులో మరోమేడ ఉంది. ఏడాదికి ఆరు నెలలు కలకత్తా వెళ్ళి ఉంటారు."

అదే సందర్భంలో ఠాకుర్ బర్‌జోర్ సింగు తన బావగారి మాటకు వంత పాడుతూ అన్నాడు: "ఏమనుకున్నావ్ మరి రాజవంశానికి చెందిన వాళ్ళోయి, ఏమన్నా వర్తకులో, నర్తకులో అనుకున్నవా ఏం!"

ప్రభుదయాల్ ముఖంలో మందహాసం యథాప్రకారంగానే ఉంది. ఆయన ముఖముద్రలో ఏ మాత్రం మార్పు రాలేదు: "నిజం చెప్పావోయ్ బర్‌జోర్‌సింగ్. రాజవంశం మీద ఆధారపడి ఉండే ప్రజాసామాన్యం మా కోమటి జాతి. మీకు, మాకు పోలిక ఎక్కడ చెప్పండి!"

ఠాకుర్ బర్‌జోర్‌సింగు తండ్రి ఒకప్పుడు గొప్ప జమీందారు. కాని రోజులు తారుమారయ్యాయి. చివరకొక చిన్న గ్రామం మిగిలింది బర్‌జోర్‌సింగుకు. అది కూడా చాలా వరకూ బంజరు భూమి. ఆ గ్రామం మీద ఏడాదికి దాదాపు రెండు వందల యాభై రూపాయలు వస్తాయి. కాని ఎంత చెడినా బర్‌జోర్‌సింగు జమీందారే. ఘాటంపూర్‌కు షుమారు ఐదుమైళ్ళ దూరంలో ఆయన గ్రామం చునోఠా ఉంది. ఆ గ్రామంలో ఆయనకు పెద్ద భవంతి ఉంది. దాని ఎదురుగా ఆయన తండ్రి తాలూకు ఒక ఏనుగు గూడా ఉంది. భవంతికి మరమ్మతు చేయడం లేనందువల్ల అక్కడక్కడ శిథిలమై పోతూ ఉంది. బర్‌జోర్‌సింగుకు

దాదాపు వంద ఎకరాల స్వంత వ్యవసాయం ఉంది. ఆ వ్యవసాయమే ఆయనకు జీవనాధారం. యమునానదీ తీరంలో ఉన్నందువల్ల అది మంచి పంటలు పండే సారవంతమైన భూమి. కాని తన కుమారుని కేశఖండన మహోత్సవ సందర్భంలో తన కేశఖండనం కూడా చేయించుకోవాలని ఆయనకు సంకల్పం కలగడం వల్ల అయిదేండ్ల క్రితం ఆ స్వంత వ్యవసాయపు భూమిని ప్రభుదయాల్ దగ్గర తాకట్టు పెట్టారు. ఆ భూమిని తాకట్టు పెట్టి ఆయన ఒక వెయ్యి రూపాయలే తీసుకున్నారు. కానీ వడ్డీ మీద వడ్డీ పెరిగి అదే ఇప్పుడు రెండు వేలయింది. ఒక సంవత్సరము నుంచి ప్రభుదయాల్ ఈ విషయమై బర్‌జోర్‌సింగును కొంచెం ఒత్తిడి చేయడం కూడా జరిగింది. ఒకటి రెండు సార్లు కొంచెం గట్టిగా మాట్లాడుకున్నారు. మూడు నెల్ల కింద ఇలా తర్కించుకోడంలో ఇక బర్‌జోర్‌సింగు మీద కేసు పెట్టవలసి వస్తుందని కూడా ప్రభుదయాల్ బెదిరించారు.

ప్రభుదయాల్ పై బర్‌జోర్‌సింగు విసరిన వ్యంగ్యాన్ని సామాన్యమైన పరిహాసం లాగా తాను భావించినట్టుగా ప్రభుదయాల్ చాల మృదువుగా సమాధానం చెప్పారు. కాని నిజానికి ఆ మరుక్షణమే ప్రభుదయాల్ మనస్సులో బర్‌జోర్‌సింగుపై కక్ష ఏర్పడింది. ఆయన గజరాజ సింగుగారి ఇంటి నుండి జ్వాలా ప్రసాద్‌తో పాటు తిరిగి వచ్చేసరికి ఆయన ముఖంలో అవన్నె కనిపించింది. ప్రభుదయాల్ ముఖ వైఖరినీ గాంభీర్యాన్నీ, చూచి జ్వాలా ప్రసాద్ మామూలు ధోరణిలో అడిగారు. "ఏమండీ! ప్రభుదయాల్‌గారూ! ఉన్నట్టుండి మీలో ఇంత గాంభీర్యం వచ్చిందేమిటి?"

ప్రభుదయాల్ సమాధానం చెప్పారు. "మిథ్యాభిమానంలో మునిగిపోయి మనుష్యుడు తన మేలును, కీడును కూడా లెక్కబెట్టకుండా ఇంత మదాంధు డెందుకవుతాడా అని ఆలోచిస్తున్నాను, తహసీల్దారుగారు!"

"అవును, నాకు కూడా అలాగే తోచింది. ఠాకుర్ గజరాజసింగు తన పిల్ల పెండ్లి విషయంలో తన తాహతుకు మించి ఖర్చు పెడుతున్నారు." అన్నారు జ్వాలా ప్రసాద్ సహజ ముఖ వైఖరితో.

"కాదు జ్వాలాబాబూ! నేను ఆలోచిస్తున్నది ఠాకుర్ గజరాజసింగును గురించి కాదు. బర్‌జోర్‌సింగు విషయమై నేను ఆలోచిస్తున్నాను. మీరు బహుశా గమనించే వుంటారు. అతను పరోక్షంగా నన్ను అవమాన

పరచడానికి ప్రయత్నించాడు. అతనలా ఎందుకు ప్రవర్తించవలసి వచ్చిందా అని ఆలోచిస్తున్నాను. నిమిషాల్లో అతన్ని నేను ఎందుకూ పనికి రాకుండా చేయగలను. అతను స్వంత వ్యవసాయం చేసుకునే భూమి వంద ఎకరాలు నాదగ్గర కుదువ ఉంది. దానిమీద ఇప్పటికి రెండు వేలయింది. ఇప్పటికి అయిదు సంవత్సరాలయింది. అప్పు పెరిగిపోతూ ఉంది. ఎన్నాళ్ళు ఓరు కోగలను? ఇక అతని మీద కేసుపెట్టక తప్పదు. అకారణంగా నన్ను ఇలా అవమానం చేసినందుకు ప్రతీకారం చేసి తీరుతాను. జ్వాలా బాబూ! ఇందులో నా తప్పేమీ లేదు. దీనికి మీరే సాక్ష్యం."

జ్వాలా ప్రసాద్‌కు బర్‌జోర్‌సింగుతో బాగా పరిచయం ఉంది. ప్రకృత్యా బర్‌జోర్‌సింగు మంచివాడు, స్నేహపాత్రుడు, ఇతరులకు కష్టసుఖాల్లో సహాయం చేసే స్వభావం అతనిది. కాని మనిషికి ఎక్కడ లేని పట్టుదల. దానికి తోడు నోరు దుడుకు. జ్వాలా ప్రసాద్‌కు బర్‌జోర్ సింగుపై కొంచెం సానుభూతి ఉంది. అందువల్ల ఆయన కొంచెం విచారంగా అన్నారు: "రెండువేల రూపాయలు అప్పు చేశారా? అయ్యో పాపం! ఆయన దగ్గర ఉన్నదంతా ఈ వంద ఎకరాల పొలమే. ఆ గ్రామం మీద ఆయనకు వచ్చే వరుమానం కూడా ఏమీలేదు."

ప్రభుదయాల్‌కు నవ్వు వచ్చింది. "కేసు పెట్టడ మెందుకులే అని నేను కూడా చాలా వరకు చూచాను. కాని ఈరోజు నాకు పూర్తిగా విసుగు పుట్టింది. కాస్తా, కూస్తా అయితే అనుకోవచ్చు. రెండు వేల రూపాయలు! అదీకాక, ఎవరు చేసుకున్నది వాళ్ళనుభవించక తప్పదు. దానికి ఎవరూ ఏమీ చేయలేరు."

ఈ సందర్భంలో జ్వాలా ప్రసాద్‌కు ఏమి సమాధానం చెప్పాలో తోచక ఆయన ఏమీ మాట్లాడలేదు. నిజానికి ప్రభుదయాల్ మాట్లాడే మాటల్లో కాని, అతని ప్రవర్తనలో కాని, అతని స్వభావంలో కానీ, జ్వాలా ప్రసాద్‌కు అయిష్టం పుట్టించే విషయం ఏమీ కనిపించడం లేదు. కాని మొత్తం మీద జ్వాలా ప్రసాదుకు తన పక్కన కూర్చున్న వ్యక్తి మీద క్రమంగా అసహ్య భావం ఏర్పడుతూ ఉంది.

జైదేయి, ప్రభుదయాల్ జ్వాలా ప్రసాద్‌గారి ఇంట్లో మూడు రోజు లున్నారు. ఈ మూడు రోజుల్లోనే జైదేయికి, యమునకు మధ్య చాలా మైత్రి ఏర్పడింది. అంతేకాదు, జైదేయి జ్వాలా ప్రసాద్‌తో మరిది వరుస

ఏర్పరచుకుంది. కాని జ్వాలా ప్రసాద్ మనస్సులో మాత్రం ప్రభు దయాల్‌ను గురించి ఏదో గ్లాని ఏర్పడింది.

మూడు

మీర్ సఖావత్ హుసేన్‌ను ఆయనకు తెలిసిన వాళ్ళందరూ మీర్‌సాహెబ్ అని అంటారు. మీర్‌సాహెబ్ ప్రపంచం మీద వైరాగ్యం ఏర్పడిన వ్యక్తి. దీర్ఘకాయం, అందమైన రూపు, పరిమితమైన గడ్డం, దానికి తగిన చిన్న మీసం, ముఖంలో ఎప్పుడూ గాంభీర్యం ఉట్టిపడుతూ ఉంది. మీర్ సాహెబ్ వ్యక్తిత్వం ఎవరియందైనా గౌరవభావాన్ని కలుగజేయ గలదు.

మీర్ సఖావత్ హుసేన్ పేరుకు ఘాటంపూర్ తహసీల్దారు. కాని ఆయన తన కార్యభారమంతా జ్వాలా ప్రసాద్ మీదనే వదిలేశారు. మీర్ సాహెబ్ వయస్సు యాభై దాటింది. ఆయనకెప్పుడూ మతం, వేదాంతం అంటే అనురాగం. ఎక్కువకాలం ఆయన ఈశ్వర ధ్యానంతోనే గడిపే వారు. తీరిక సమయంలో పొద్దు పోవడానికి చదరంగం ఆడుతూ ఉండే వారు. ఆయనకొక్కడే కుమారుడు కలిగాడు. అతడు కూడా పదిహేనేండ్ల క్రితం చనిపోయాడు. అప్పటినుంచీ ఆయనకు ప్రపంచం మీద వైరాగ్యం ఏర్పడింది. ఆ తర్వాత ఐదు సంవత్సరాల క్రితం ఆయన భార్యకూడా పోయింది. దానితో ఒక విధంగా ఆయన సన్యాసం పుచ్చుకున్నట్టయింది. ఆయన ఇంట్లోనుంచి బయటకి వెళ్ళడం మానేశారు. ఎవరినైనా కలిసి కోవడం కూడా ఆయన ఒకరకంగా మానేసినట్టే. జ్వాలా ప్రసాద్ ఆయన ఇంటికివెళ్లి అవసరమైన సలహాలూ, సూచనలూ తీసుకొని ముఖ్యమైన కాగితాల మీద ఆయన సంతకం పెట్టించుకుని వచ్చేవారు.

మీర్‌సాహెబ్ ప్రతి సంవత్సరం వేసవిలో లక్నో వెళ్లుతూ ఉండేవారు. ఆయన ఇల్లు లక్నోలోనే ఉంది. ఆ సంవత్సరం కూడా ఆయన లక్నోలో రెండు నెలలు గడిపివచ్చారు. ఆయన వచ్చారని తెలిసి జ్వాలా ప్రసాద్ ఆఫీసు కాగితాలు తీసుకుని ఆయన ఇంటికి వెళ్ళారు.

జ్వాలా ప్రసాద్‌ను కూర్చోమని మీర్‌సాహెబ్ అన్నారు: "ఏం జ్వాలా బాబూ! కులాసాగా ఉన్నావా? పనులన్నీ సక్రమంగానే జరుగుతున్నట్టుంది. ఎక్కడినుంచీ ఏ విధమైన ఫిర్యాదులూ రావడం లేదు. అన్నట్టు గజరాజసింగుగారి అమ్మాయి వివాహం చాలా బ్రహ్మాండంగా జరిగిందని విన్నాను. పెండ్లివాళ్లంతా ఎంతమంది వచ్చారేమిటి?"

"ఇంతవరకూ నేను ఇంతమంది పెండ్లివాళ్లను మరెక్కడా చూడలేదండీ! తమరా పెండ్లికి రాలేకపోయారని ఠాకుర్ గజరాజసింగు చాలా అనుకున్నారు."

"ఏం చెయ్యను మరి! నాకు కూడా చాలా విచారంగానే ఉంది. కాని ఏడాదికి రెండునెల్లపాటు నేను ప్రతి సంవత్సరం లక్నో వెళ్లుతాననే విషయం అందరికీ తెలిసిందే గదా! ఆ కార్యక్రమంలో మాత్రం అంతరాయం రావడానికి వీల్లేదు;" ఆ తర్వాత మీర్‌సాహెబ్ కొంచెం గంభీరంగా అన్నారు: "కాని బాబూ! అప్పుచేసి పెండ్లి చేసినందువల్ల ప్రయోజనం ఏమిటి చెప్పు. ఒక్క పెండ్లి చెయ్యడానికి ఇరవై వేల రూపాయల అప్పా! నీకు గజరాజసింగుతో బాగా దగ్గరి పరిచయం ఉంది కదా! అతనిలా అప్పు చెయ్యకుండా చూడలేక పోయావా?"

"ఈ అప్పు సంగతి నాకు తాకట్టు రిజిస్టరు చేసేదాకా తెలియనే తెలియదు సార్! లేకుంటే నేను ఆయనకు నచ్చచెప్పడానికి ప్రయత్నించి ఉండేవాణ్ణి. నేను చెప్పినా ఆయన ఒప్పుకుంటారనే నమ్మకం లేదనుకోండి. మీకు తెలియదూ ఎంత పట్టుదల మనిషో!"

"ఎంత పట్టుదలేమిటి, తాను పట్టిందే పట్టంటాడు. అయినా చాలా మంచివాడు. అయితే అతను లాలా ప్రభుదయాల్ నంబరువారు దగ్గర అప్పు తీసుకున్నాడా?"

"అవునండీ. అందుకుగాను గజరాజసింగు అయిదు గ్రామాలు తాకట్టు పెట్టారు."

"అయితే ఈ అయిదు గ్రామాలు కూడా ప్రభుదయాల్‌వి అయిపోయినాయన్నమాట!" అంటూ మీర్‌సాహెబ్ నవ్వారు: "మనిషంటే అతనోయ్! నాకండ్ల ఎదుటనే ఇంత గొప్పవాడయి పోయాడు. ఈసారి ఈ ప్రభుదయాల్ మీయింట్లో దిగాడని విన్నాను. నిజమేనా?" ఈ మాట అంటూనే మీర్‌సాహెబ్ జ్వాలాప్రసాద్ వైపు అర్థవంతంగా చూచారు.

ఆ చూపులోని గూఢార్థం జ్వాలా ప్రసాద్ వెంటనే గమనించారు. "అవునండీ, వాళ్ళు మా యింట్లోనే దిగారు. కాని నేను వాళ్ళను మా యింట్లో దిగమని ఏమీ ఆహ్వానించలేదు. ఈ విషయంలో మీకేమాత్రం సందేహం అక్కర్లేదు. బలవంతంగా ఇంటికి వచ్చి పడ్డవాళ్ళను కాదనడం ఎలాగా అని మంచితనానికి లొంగి పోయాను."

మీర్‌సాహెబ్ కొంచెం గంభీరంగా అన్నారు: "బాబూ! పాపం ఎప్పుడు మన మీదికే వచ్చి పడుతుందని మన పూర్వీకులు చెప్పింది తప్పు కాదు. పాపానికి దూరంగా ఉండడమే మంచిదని మనకందరికీ తెలుసు. ధనం, వైభవం అంటే అందరికీ వ్యామోహం ఉంటుంది. ఈ వ్యామోహం ఎంతవరకు వెళ్ళుతుందంటే ఈ ధనదేవత మన నిజమైన దైవాన్ని కూడా మింగి వేస్తుంది. ఎక్కడికో వెళ్ళనక్కర లేదు, ఈ ప్రభుదయాల్ సంగతే చూడు. ఇతను గుడి కట్టించాడు, మద్య మాంసాలు అంటనైనా అంటడు. కాని ఇతనికి దైవం, ధర్మం అంతా డబ్బే, ఏమంటావ్?"

"తమరు చెప్పింది నిజం. చాలా నికృష్టమైన వ్యక్తి" అన్నారు జ్వాలా ప్రసాద్.

"తానొక్కడే నికృష్టుడయితే పరవాలేదు. కాని అతనితో సాంగత్యం చేసిన ప్రతి వ్యక్తినీ, నికృష్టుణ్ణిగా చేసేస్తాడు. అందుకనే బాబూ! నిన్ను హెచ్చరించడం అవసరమని తోచింది. ఈ ధనదేవత ఉందే, దీన్ని ఆరాధించే వాళ్ళకు ఒక మతమంటూ ఉంది. అన్నివైపులా వ్యాపించడం, ఇతరులను తనలో చేర్చుకోవడం ఈ మతంయొక్క నైజం. ఈ డబ్బును మతంగా సేవించే వ్యక్తి చాలా ప్రమాదకరమైన వాడుగా పరిణమిస్తాడు. అతను నీ మతాన్నే మార్చి వేయడానికి ప్రయత్నిస్తాడు" ఈ మాట అంటూ మీర్‌సాహెబ్ బిగ్గరగా నవ్వారు.

జ్వాలా ప్రసాద్ మీర్‌సాహెబ్ దగ్గరినుండి ఇంటికి వచ్చేసరికి ఠాకుర్ గజరాజసింగు ముఖంలో సహజంగా అతనిలో ఎప్పుడూ లేని గాంభీర్యం కనిపిస్తూ ఉంది.

జ్వాలా ప్రసాద్ బట్టలు మార్చుకొని ఠాకుర్ గజరాజసింగు దగ్గరికి వచ్చి కూర్చున్నారు.

గజరాజసింగు ముఖంలోని గాంభీర్యాన్ని తొలగించడానికి జ్వాలా ప్రసాద్ అన్నారు. "ఠాకుర్ సాహబ్! ఈ సంవత్సరం సకాలానికి

వర్షాలు కురిసేటట్టున్నాయి. మేఘాలు ఎంత అందంగా వ్యాపించాయో చూడండి."

కాని గజరాజసింగు గంభీర ముఖముద్ర మారలేదు. "మేఘాలు మాత్రం వ్యాపిస్తూ ఉన్నాయి. కాని అవి అందంగా ఉన్నాయనే విషయం మాత్రం నాకు సందేహమే." ఈ మాటలు అంటుంటే ఆయన ముఖంపై వ్యంగ్యాత్మకమైన నవ్వు కనిపించింది.

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పలేదు. గజరాజసింగు మనస్సులో ఏదో ఆందోళన పడుతున్న విషయం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. కాని ఆ ఆందోళనకు కారణం ఏమయి ఉంటుందో అనేది జ్వాలా ప్రసాద్‌కు బోధపడడం లేదు. ఆయన మౌనంగా గజరాజసింగు మాటకెదురు చూస్తూ ఉన్నారు.

గజరాజసింగు ఏదో చెప్పడానికి వచ్చారు గదా! కాబట్టి ఆయనే మొదలు పెట్టారు: "కమ్మిన మబ్బు కురియక మానదు. కాని ఆ వర్షం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం జ్వాలా బాబూ!"

అప్పుడు జ్వాలా ప్రసాద్ నవ్వడం తన ధర్మమనుకొని నవ్వారు: "మీరేదో పొడుపు కథ చెపుతున్నారు ఠాకుర్‌గారూ! అసలు విషయమేమిటో చెప్పండి."

"అసలు విషయమేమీ లేకపోతే ఈ సమయంలో నేను ఇంట్లోనుంచి కదుల్తానా? ఠాకుర్ గజరాజసింగు మధ్యాహ్నం లోపల స్నానం చెయ్యకుండా పూజ ముగించుకోకుండా ఇంట్లోనుండి బయటికి వెళ్ళాడంటే ఏదో విశేషమున్నదన్న మాట. ఈ విశేషం చాలా గంభీరమైనది కూడాను" అంటూ గజరాజసింగు పొడి పొడిగా నవ్వారు.

మీర్‌సాహబ్‌ను కలుసుకొని వచ్చినప్పటినుండి జ్వాలా ప్రసాద్‌కు ఏదో నీరసంగా ఉంది. అలాంటి మనస్థితిలో గజరాజసింగు మాట్లాడే ధోరణి ఆయనకు రుచించడం లేదు. వాన కురియడం మొదలయింది. తూర్పునుండి చల్లనిగాలి ఒక్కపెట్టున గదిలోకి వీచింది. వడి వడిగా పడుతున్న జల్లు నెమ్మదిగా సంగీతస్థాయి నందుకుంది. జ్వాలా ప్రసాద్ కొంచెంసేపు కురిసే మేఘాలవైపు చూచి మళ్ళీ గజరాజసింగును పలకరించారు: "మీరు చాలా ఆవేశంతో నిండి ఉన్నారు ఠాకూర్‌గారూ! అసలు విషయమేమిటో స్థిమితంగా చెప్పండి."

గజరాజసింగు గొంతు సవరించుకుని అన్నారు: "జ్వాలాబాబూ! వర్తకుడు రాజా కావాలని చూస్తున్నాడు."

"ఇందులో ఆశ్చర్యమేముంది?" అంటూ జ్వాలా ప్రసాద్ తన అభి ప్రాయాన్ని జోడించారు: "ఈ రోజుల్లో భుజబలం ఒక బలం కాదు. ధన బలమే బలం. ఆ మాటకు వస్తే ఇంగ్లీషువాళ్ళు కూడా వర్తకులే కదా! ఏడు సముద్రాలు దాటి విదేశాలనుండి వ్యాపారం చేయడానికని వచ్చారు. మరి ఇప్పుడు సమస్త భారతదేశాన్ని పాలిస్తూన్నారు.

గజరాజసింగుకు కోపం వచ్చింది: "ఇంగ్లీషువాళ్ళు వర్తకులని మీ కెవరు చెప్పారు? ఇంగ్లీషువాళ్ళు గొప్ప విద్వాంసులు. మన దేశంలో బ్రాహ్మణోత్తములు కూడా పాండిత్యంలో వాళ్ళకు సమానంకారు. ఇంగ్లీషు వాడు చావుకు జంకడు. చంపటానికి కూడా జంకడు. అందుకనే అతడు రాజ్యం పాలించ గల్గుతున్నాడు. ఇతని రాజ్యంలో పులి-మేక ఒకే రేవున నీరు తాగుతాయి. మేము క్షత్రియులం. అయితేనేం వాళ్ళముందు మేమెందుకూ పనికిరాము. లేదు జ్వాలాబాబూ! నేను అసలు విషయం మరిచి పోయాను. ప్రభుదయాల్ బర్‌జోర్‌సింగు మీద కేసు పెట్టాడని మీకు తెలుసు. బర్‌జోర్ స్వంత వ్యవసాయం చేసుకొనే పొలం అతని దగ్గర తాకట్టులో ఉంది."

ప్రభుదయాల్‌కూ, తనకూ మధ్య రెండు నెల్ల క్రిందట జరిగిన సంభాషణ అప్పుడు జ్వాలా ప్రసాద్‌కు జ్ఞాపకం వచ్చింది. ఈ సంభాషణ జరిగినప్పుడు జ్వాలా ప్రసాద్ అది ప్రభుదయాల్ యొక్క క్షణికమైన ఉద్రేకం అనుకొన్నారు. కాని ఆ మాటలు చాలా పాతుకు పోయినవనే విషయం జ్వాలా ప్రసాద్‌కు ఇప్పుడు బోధ పడింది. చివరకు ప్రభు దయాల్ పగ తీర్చుకోడానికి తయారయ్యాడు. జ్వాలా ప్రసాద్ మెల్లగా అన్నారు: "బహుశా బర్‌జోర్‌సింగు ప్రభుదయాల్‌కు రెండు వేల రూపా యలు ఇయ్యాల్సి ఉంటుందనుకుంటాను."

"అయితే నేననుకున్నది అబద్ధం కాదు. ఈ విషయం మీకు కూడా తెలుసు. బహుశా ప్రభుదయాలే మీకు చెప్పి ఉంటాడు. కాని జ్వాలా బాబూ! బర్‌జోర్‌సింగు వెయ్యి రూపాయలు మాత్రమే తీసుకున్నారు. అందులో ఇప్పటికి పన్నెండు వందలు ఇచ్చేశానని బర్‌జోర్‌సింగు అంటూంటాడు."

"అప్పు చాలా చెడ్డది. దయాదాక్షిణ్యాలు లేని కటిక వడ్డీ వ్యాపారస్థుని దగ్గర తీసుకుంటే ఇక చెప్పవలసిన పనిలేదు. ఈ అప్పువల్ల ఎన్ని కుటుంబాలు నాశనమయి పొయ్యాయో చెప్పలేము." అంటూ జ్వాలా ప్రసాద్ అడిగారు: "మరి ఇప్పుడు మనం చేయవలసిందేమిటి?"

"అదే నన్నెదుర్కొంటున్న ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోడానికే నేనిక్కడికి వచ్చాను. మనం ఏం చెయ్యాలి?" గజరాజసింగు దిగులుపడుతూ అన్నారు: "బర్‌జోర్ దగ్గర ఒక్క పైసకూడా లేదు. ఏదో అవస్థపడి నేను నాలుగయిదు వందల దాకా సర్దగలను. ఇటీవల పిల్లపెండ్లి చేసిన తర్వాత ఇంతవరకు నేను తేరుకోలేదు. లాలా ప్రభుదయాల్‌కు మీ మాటమీద గౌరవం ఉంది: కనుక మీరేదో మధ్యవర్తిత్వంచేసి రాజీ కుదిరించాలి. లేకుంటే...." గజరాజసింగు మాట్లాడుతూ మాట్లాడుతూ ఆగిపొయ్యారు.

"లేకుంటే........." జ్వాలా ప్రసాద్ అస్పష్టంగా ఆ మాటలనే మళ్ళీ అని తర్వాత కొంచెం సేపటికి అన్నారు: "అవును, దీనికేదో మార్గం వెదకాలి. కాని బర్‌జోర్‌సింగు అతన్ని అవమాన పరచినందుకు పగ తీర్చుకోడానికి ప్రభుదయాల్ ఇలా చేస్తున్నాడని నా అనుమానం. మీ అమ్మాయి పెండ్లి సందర్భంలో బర్‌జోర్‌సింగు అన్నమాట మీకు బహుశా గుర్తుండక పోవచ్చు. ఆ రోజు బర్‌జోర్‌సింగు నిష్కారణంగా ప్రభుదయాల్‌ను అవమాన పరిచారు. అసలు నిష్కారణంగా మన అందరి ముందు ప్రభుదయాల్‌ను అవమాన పరచడం ఎందుకు చెప్పండి."

"నాకేమీ గుర్తు రావడం లేదు." గజరాజసింగు కొంచెం ఆలోచిస్తూ అన్నారు: "ప్రభుదయాల్ మీ యింట్లో దిగాడు కదా! అదీకాక, ప్రభుదయాల్‌కూ, బర్‌జోర్‌సింగుకూ మధ్య సంభాషణ కూడా ఏమీ జరిగినట్టు నాకు జ్ఞాపకం లేదు."

జ్వాలా ప్రసాద్ శుష్కమైన చిరునవ్వుతో అన్నారు: "అవును, అందరికీ తెలిసేలాగా, అప్రియమైన సంభాషణ ఏమీ జరగలేదు. దానికి కారణమేమంటే ప్రభుదయాల్ ఆ అవమానాన్ని తనలో తాను ఇముడ్చుకొన్నారు. బర్‌జోర్‌సింగు అన్నమాట ఇది – 'మీ వియ్యంకుడు రాజవంశానికి చెందినవాడోయ్. వర్తకుడో, నర్తకుడో కాదు' అని అన్నారు. ఈ మాట ప్రభుదయాల్‌ను మనస్సులో ఉంచుకొని అన్నారు."

గజరాజసింగుకు కూడా నవ్వు వచ్చింది! "అవును, ఇప్పుడు కొద్దిగా గుర్తు వస్తూన్నది. అయితే మాత్రం జ్వాలాబాబూ! బర్ జోర్ అన్న మాటల్లో తప్పేమీ లేదు కదా! ప్రభుదయాల్ ఎంత నీచుడో మీ కందరికీ తెలుసు. బర్ జోర్ ఉన్నమాట ఉన్నట్లనేశాడు. నిజం చెపితే కోప పడడం భావ్యమంటారా?

"ఠాకుర్ గారూ! అప్రియమైన సత్యాన్ని చెప్పగూడదని శాస్త్రాల్లో వ్రాయలేదూ!" అన్నారు జ్వాలా ప్రసాద్.

"అవును, వ్రాసిన మాట నిజమే. శాస్త్రాల్లో వ్రాసింది తప్పు కూడా కాదు. కాని అయిపోయిందేదో అయిపోయింది. వేసిన బాణం, ఆడిన మాటా మళ్ళీ వస్తాయా చెప్పండి." అంతటితో గజరాజసింగు ముఖం మీది చిరునవ్వు మాయమయింది: "ప్రస్తుత పరిస్థితి ఏమంటే, ఈ సమన్ వచ్చినప్పటినుండి బర్ జోర్ పిచ్చి కుక్కలాగా తిరుగుతున్నాడు. పొలం పనంతా మానుకొని కోర్టుచుట్టూ తిరగాలంటే ఎవరివల్ల అవుతుంది చెప్పండి. ఈ రోజు పొద్దున్నే అతను లాలా ప్రభుదయాల్ దగ్గరకు వెళ్ళాడు. నేను అతన్ని ప్రభుదయాల్ దగ్గరికి వెళ్ళకుండా చూడడానికి ప్రయత్నించాను. కాని నా మాట వింటాడా! ఉదయం ఏడు గంటలకే అతను శివపురా వెళ్ళడానికి బయలు దేరాడు. ఇంతవరకూ తిరిగి రాలేదు. ఇంతా మూడుకోసుల దూరం కూడా లేదు ప్రభుదయాల్ గారి ఇల్లు. ఇంత ఆలస్యం ఎందుకయిందో తెలియటం లేదు."

"ఇందులో ఆదుర్దా పడవలసిన దేముంది? వస్తూనే ఉండవచ్చు. వర్షంకూడా తెరపలేకుండా కురుస్తున్నది. అంత పొద్దెక్కలేదు కూడాను." అన్నారు జ్వాలా ప్రసాద్.

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఇద్దరూ బయట జోరున కురిసే వానను చూస్తున్నారు. ఇద్దరూ ఏదో అంతులేని ఆలోచనలో మునిగి ఉన్నారు. ఇంతలో గజరాజసింగు అన్నారు: "అడిగో బర్ జోర్ వస్తున్నట్టు ఉన్నాడు— ఏనుగు మీద!"

శివపురా నుండి వస్తున్న ఏనుగును జ్వాలా ప్రసాద్ చూచారు. ఆ ఏనుగు మీద బర్ జోర్‌సింగు తడిసి ముప్పందుమై కూర్చుని ఉన్నాడు. బర్ జోర్‌సింగు పెద్ద తలపాగా పెట్టుకుని ఉన్నారు. కాని ఆయన వక్షస్థలమంతా నిర్వసనంగానే ఉంది. ధోవతికి నడికట్టు ఉంది. ఆ నడికట్టుకు

వాళ్ళ వంశంలో తరతరాల నుంచి వాడుతున్న కత్తి తగిలించి ఉంది. ఏనుగు గజరాజసింగుగారి ఇంటివైపు వెళ్ళుతున్నది. గజరాజసింగు పొలికేక వేశారు: "బర్‌జోర్! ఒరేయ్ బర్‌జోర్! మేము ఇక్కడనే ఉన్నామోయ్!"

ఆ కేకవిని బర్‌జోర్ ఏనుగును జ్వాలా ప్రసాద్‌గారి ఇంటివైపు మరలించాడు.

ఏనుగుమీది నుంచి దిగి బర్‌జోర్‌సింగు వానకు తడుస్తూ జ్వాలా ప్రసాద్ వాళ్ళు కూర్చున్న గది బయటనే నిలబడ్డాడు. "బావా! ఆయన ఈ ఏనుగును తీసుకోలేదు. ఆయనగారికి పొలం కావాలిట. నా వంద ఎకరాల పొలం." ఈ మాట అంటూ బర్‌జోర్‌సింగు పిచ్చినవ్వు నవ్వాడు.

బర్‌జోర్‌సింగు మాటల్లోని జాలి, ఆ తర్వాత అతను నవ్విన పిచ్చి నవ్వులో అతని ఆవేదన, నైరాశ్యం, నిస్సహాయత జ్వాలా ప్రసాద్ గమనించారు.

"అయితే అప్పు తీర్చడానికి ప్రభుదయాల్‌కు ఈ ఏనుగియ్యడానికి వెళ్ళారా మీరు?" అని అడిగారాయన.

"అవునండీ తహసీల్దారుగారూ! పొలం పోకుండా చూచుకోడానికి ఈ ఏనుగు నియ్యడానికి కూడ సిద్ధపడ్డాను. కాని ఏనుగును కట్టివేసుకోడం సులభమే కాని దానికి తిండి పెట్టడం చాలా కష్టమని అన్నాడతను. ఏనుగును పెంచడం ఈ సెట్టివల్ల అవుతుందిటండీ! కనక నేను తిరిగి వచ్చేశాను." ఈ మాట అంటూనే బర్‌జోర్ బిగ్గరగా నవ్వాడు: "అయితే బావా! నాకు చెడ్డ కోపం వచ్చింది. కోపాన్ని ఆపుకోలేక పోయాను. అతని వాకిట్లో ఉమ్మేసి అనాల్సిన మాట అనేశాను. 'ఏనుగును రాజవంశం వాళ్ళు పోషించాలి గాని కోమటిసెట్లేం పోషించగలరని వాడి మొహాన అనేసి వచ్చాను."

జ్వాలా ప్రసాద్ గజరాజసింగు వైపు అర్థవంతంగా చూచారు. ఆ చూపుల్లో అంతరార్థం గజరాజసింగు గమనించి బర్‌జోర్‌తో అన్నారు: "అనవసరంగా వాణ్ణి ఎందుకన్నావోయ్? నీవిలా నోరు కాయకపోవడం మూలానే నీ పొలం జప్తీ అయ్యే వరకు వచ్చింది పరిస్థితి. ఏదో తెలిసీ తెలియక అనరాని మాటలన్నావని నీవు ప్రభుదయాల్‌ను క్షమించమని అడిగితే విషయం సులభంగా పరిష్కారమవుతుందని నేనూ, జ్వాలాబాబూ అనుకుంటూన్నాం."

“క్షమించమని అడగాల ? నేనా! ఆ కోమటిసెట్టినా ? ఏమండీ డిప్టీ గారూ! మీరిలా సలహా ఇచ్చారా?” బర్‌జోర్‌సింగు నిరుత్సాహంగా అన్నాడు: “రోజులు మారాయి డిప్టీగారూ! లేకుంటే ఒక్క రాత్రిలో ప్రభు దయాల్‌ను ఖాళీ చేసేవాళ్ళం.” ఆ తర్వాత మాట మారుస్తూ బర్‌జోర్ సింగు అన్నాడు: “పోనియ్యండి డిప్టీగారూ! మా బావగారూ, మీరూ అనవసరంగా ఈ విషయాన్ని గురించి విచారించకండి. ఇది మా యిద్దరికి సంబంధించిన విషయం. నేను స్వయంగా ప్రభు దయాల్‌తో దీన్ని తేల్చుకుంటాను. మధ్య మరొకరు దీనిలో జోక్యం కలుగ జేసుకోవలసిన పని లేదు.” ఈ మాటలు అంటున్న సమయంలో బర్‌జోర్ చెయ్యి అప్రయత్నంగా నడుముకు వేలాడుతున్న కత్తి పైకి వెళ్ళింది.

బర్‌జోర్‌సింగు ఏనుగు మీదఎక్కి కూర్చున్నాడు. అతనితోపాటు గజరాజ సింగు కూడా లేచి వెళ్ళడానికి సిద్ధమయ్యారు: “మంచిది జ్వాలా బాబూ! ఇక నేను వెళ్ళి వస్తాను. వర్షం ఆగేటట్టుగా లేదు. స్నానానికి పూజకు వేళ మించి పోతున్నది. ఇంటికి వెళ్ళేలోగా ఈ తొలకరి వానలో నాకు స్నానం దానంతట అదే అయిపోతుంది. కాని మీరి ప్రభు దయాల్‌ను సాధ్యమైనంత త్వరలో కలుసుకొని ఈ విషయాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించండి. బర్‌జోర్‌సింగు ఏనుగును అమ్మడానికిసిద్ధంగా ఉన్నాడు. కొరవపడితే నేను కూడా కొద్దో గొప్పో సర్దుతాను.”

జ్వాలా ప్రసాద్ ఇప్పుడిప్పుడే ప్రభుదయాల్‌ను కొద్ది కొద్దిగా అర్థం చేసుకుంటున్నారు. ఎంత ఇష్టం లేకపోయినా, జ్వాలా ప్రసాద్, ప్రభు దయాల్ – ఇద్దరి కుటుంబాల మధ్య ఆత్మీయత పెరిగి పోతూనే ఉంది. ఇలా ఆత్మీయత పెరగటానికి కారణం జైదేయి. లాలా ప్రభుదయాల్ భార్య జైదేయిని అందరూ నంబరుదారు భార్య అని అంటారు. ఆమె చాల కలుపుగోలు మనిషి. ప్రసన్న వదనంతో ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. ఆమె జ్వాలా ప్రసాద్‌ను మరిదిగా భావించి సంబోధించేది. జ్వాలా ప్రసాద్ కూడా ఆమెను ‘వదినా’ అని పిలిచేటట్టు చేసుకున్నదామె. ఆమె తన భర్తలా కాకుండా ఉదారంగా ఖర్చుపెట్టే స్వభావం గలది. ఆమెలో అపేక్ష, మమకారంవంటి మానవనైజ గుణాలు అధికంగా కనిపిస్తాయి.

జైదేయికీ, యమునకూ వయస్సులో చాలా వ్యత్యాసం ఉంది. కాని ఆ వ్యత్యాసం అంత స్పష్టంగా కనిపించేది కాదు. జైదేయి వయస్సు దాదాపు

ముప్పైయైదేండ్లు ఉంటుంది. కాని ఆమె ఇరవైయేండ్ల యమునకు సమ వయస్కురాలుగా కనిపించేది. అందువల్ల ఆమె యమునను తన స్నేహితురాలిగా చూచుకుంటూ ఉండేది. జైదేయికి మొదటి కాన్పులో కుమారుడు కలిగిన తర్వాత మళ్ళీ సంతతి లేకపోవడంవల్ల బహుశా అలా ఉండి ఉండవచ్చు. ఆమెకు తొలుచూరి కాన్పుకు పుట్టినవాడే లక్ష్మీచంద్.

తల్లిదండ్రులకు ఒక్కగాన ఒక్కడయినందున లక్ష్మీచంద్ చాలా గారాబంగా పెరిగాడు. అందువల్ల అతని స్వభావంలో కొంత ఔద్ధత్యం కనిపిస్తూ ఉంటుంది. లక్ష్మీచంద్‌కు తండ్రి గుణాలన్నీ అబ్బినాయి. అతని వయస్సు పదహారు సంవత్సరాలే అయినా చుట్టు పక్కలవాళ్ళు అతని ధైర్య సాహసాలకు భయపడుతూ ఉంటారు. ఆ కోమటి బిడ్డకు ఇంత సాహసం రావడానికి రెండు కారణాలున్నాయి. మొదటి కారణం లాలా ప్రభుదయాల్ పెద్ద జమిందారు అవడంవల్ల అందరి మీదా ఆయన పెత్తనం చేస్తూ ఉండడం. రెండో కారణమేమంటే, లక్ష్మీచంద్ కాన్పూరులో వాళ్ళ మామ దగ్గర ఉండి ఇంగ్లీషు చదువుకోవడం వల్ల నగర వాతావరణంలో అతనికి ధైర్య సాహసాలు సహజంగా చేకూరడం.

భోజనం చేసినతర్వాత జ్వాలా ప్రసాద్ శివపురాకు బయలుదేరి వెళ్ళారు. లాలా ప్రభుదయాల్ మేడ దగ్గరకు వెళ్ళగానే జ్వాలా ప్రసాద్ అలవాటు చొప్పున వాకిట్లో ఉన్న రాధాకృష్ణ మందిరం ఎదురుగా నిలబడి నమస్కరించి తర్వాత ఇంట్లోకి ప్రవేశించారు. మెట్లెక్కగానే లాలా ప్రభుదయాల్‌గారి ఇంటిలో దావడి కనిపిస్తుంది. దానినానుకునే ఒక పెద్ద వరాండా ఉంది. వరాండాలో ఒక పెద్ద కొయ్యమంచం మీద దిండు నానుకొని అటు కూర్చున్నట్టూ కాకుండా, ఇటు పండుకున్నట్టూ కాకుండా ఉన్నారు ప్రభుదయాల్. ఆ మంచం క్రింద పరచిన తివాచీ మీద ప్రభుదయాల్ గుమాస్తా లచ్చీరాం, చనోతా కరణం శీతల్ ప్రసాద్ కాగితాలు తెరిచి పెట్టుకొని కూర్చుని ఉన్నారు. కొయ్య మంచానికి కొంచెం దూరంగా కుడివైపు పోలీసు ఇన్స్పెక్టరు అంజదాలీ వాలుకుర్చీలో కాళ్ళు చాపుకుని కూర్చుని ఆకాశంవైపు చూస్తున్నారు. ఆయన చేతులు అప్రయత్నంగా ఎదురుగా ఉన్న బుడ్డిలో నుంచి వెండి గ్లాసులో సారా నింపుతున్నాయి. నోటిదాకా వెళ్ళిన గ్లాసు క్షణంలో ఖాళీ అయిపోతూ ఉంది. మళ్ళీ ఆ చేతులు యంత్రంలాగా గ్లాసును నింపుతూనే ఉన్నాయి.

బయటి వాకిలినుంచే లక్ష్మీచంద్ కేక వేశాడు: "నాన్నా! బాబాయి వచ్చారు."

లక్ష్మీచంద్ వేసిన కేక వినగానే ప్రభుదయాల్ తలఎత్తి చూదారు. ఆ మరుక్షణమే జ్వాలా ప్రసాద్ ఎదుట నిలబడగానే తాను కూడా లేచి నిలబడ్డారు. గుమాస్తా, కరణం ఇద్దరూ కాగితాలు కట్టేశారు. కరణం శీతల్ ప్రసాద్ చేతులు కట్టుకుని దూరంగా నిలబడ్డాడు. పోలీసు ఇన్స్పెక్టరు అంజదాలీ మాత్రం కూర్చున్న వాడు కూర్చున్నట్టే అన్నాడు: "మంచి సమయానికి వచ్చారండీ డిప్టీగారూ! ప్రభుదయాల్‌గారూ, మరో గ్లాసు తెప్పించండి. ఎంత చక్కటి వాతావరణం. రోజంతా తాగినా, ఇంకా తాగాలనిపిస్తూనే ఉంది. ఒళ్ళు తెలియకుండా ఉంది." అంటూ అంజదాలీ ఫక్కున నవ్వారు.

కాని జ్వాలా ప్రసాద్ మనస్సులో వర్షాకాలపు ఉల్లాసం లేదు. ఆయన ఏదో ఇష్టం లేనట్టుగా అన్నారు: "నాకు తాగడం అలవాటులేదని మీకు తెలుసు కదా ఇన్స్పెక్టరుగారూ! అందులో ఈ మిట్ట మధ్యాహ్నంవేళ చెప్పవలసిన పనిలేదు. ఈ ఋతువులో ఘాటంపూర్ నుండి ఇక్కడికి నేను కాలినడక మీద వచ్చానంటే, ఏదో అవసరమైన పనిమీద వచ్చానన్న మాట." ఆ తర్వాత ఆయన కరణంగారి వైపు తిరిగి అన్నారు: "ఏమండీ శీతల ప్రసాద్‌గారూ! ఈ సమయంలో మీ ఇలాకా వదిలిపెట్టి ఇక్కడికెలా వచ్చారు?"

"మరేనండీ! నంబరుదారుగారు నాకు కబురు చేశారు. మీస్నేహితుల మాట కాదనడం నా వల్ల అవుతుందా చెప్పండి."

శీతల ప్రసాద్ కొంచెం పొగరుబోతుగా సమధానం చెప్పినట్టు తోచింది జ్వాలా ప్రసాద్‌కు. అతనలా సమాధానం చెప్పటం ఆయనకు నచ్చలేదు. కాని అతను చెప్పిన దానిలో పొరపాటేమీ లేదని కూడా ఆయన గ్రహించారు. ఒక వైపు సారా తాగుతున్న అంజదాలీని చూచి తన్నుతాను చూచుకున్నారు. ఆ తర్వాత లచ్చీరాం, శీతల ప్రసాద్ ఇద్దర్నీ పిల్చి చెప్పారు: "కొంచెంసేపు మీరు బయటకి వెళ్ళండి. ప్రభుదయాల్‌తో నేను ముఖ్యంగా కొన్ని విషయాలు మాట్లాడాలి. మాట్లాడడం అయిపోయిన తర్వాత మిమ్మల్ని పిలుస్తాను."

శీతల ప్రసాద్, లచ్చీరాం — ఇద్దరూ అక్కడినుండి వెళ్ళిపోయారు.

కాని అంజదాలీ పెద్దగా నవ్వుతూ అన్నారు: "డిప్టీగారూ! నేనీ బుద్ధి ఖాళీ చెయ్యకుండా ఇక్కడినుంచి కదలడానికి వీల్లేదు. అయినా, నేనిప్పుడున్న స్థితిలో మీ మాటలు నాకు వినిపించనే వినిపించవు. ఒకవేళ వినిపించినా అవి నాకేమీ బోధపడవు. కాబట్టి నేనిక్కడ ఉన్నప్పటికీ మీరు నిశ్చింతగా మాట్లాడుకోవచ్చు."

జ్వాలా ప్రసాద్‌లోని ఒత్తిడి కొంతవరకూ తగ్గిపోయింది. ఆయన నవ్వుతూ అన్నారు: "అదికాదు ఇన్స్పెక్టరు గారూ! నా ఉద్దేశ్యంలో మీరు మా సంభాషణలో పాల్గొన గలిగితే నాకంతకంటె కావలసింది లేదు. విషయం చాలా విషమించింది. దీన్ని పరిష్కరించడానికి మీ సలహా నాకు చాలా సహాయకారిగా ఉంటుంది."

"అయితే అభ్యంతరం లేదు." అంటూ అంజదాలీ తన కుర్చీని ప్రభుదయాల్ మంచం దగ్గరికి లాక్కొని కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ ప్రభుదయాల్ పక్కనే ఆయన మంచం మీదనే కూర్చున్నారు. కొంచెంసేపు మౌనంగా కూర్చుని ఆయన ఉపక్రమించారు: "ప్రభు దయాళ్ గారూ! ఈ బర్‌జోర్‌సింగు వ్యవహారం చాలా తప్పు దారి పడుతున్నది."

ప్రభుదయాల్ నవ్వారు: "అయితే ఈ సంగతి మీ దాకా వచ్చిందన్న మాట! అంజదాలీ గారిని నేను పిలిపించింది కూడా అందుకే. వీలు చూచుకొని మీతో కూడా మాట్లాడాలని అనుకుంటున్నాను. ఇవ్వేళ పొద్దునే వచ్చి అతను నన్ను బెదిరించి వెళ్ళాడు. నేను కూడా నా ప్రాణం కాపాడుకోడానికి ఏదో ఏర్పాటు చేసుకోవాలి గదా! ఇంగ్లీషువాళ్ళ పరిపాలనా మరేమన్నానా? పోలీసులు, సైన్యం అన్నీ ఉన్నాయి."

"కాని - కాని" అంటూ జ్వాలా ప్రసాద్ ఆగిపోయారు. ఆయన తను చెప్ప దలుచుకున్న విషయం లాలా ప్రభుదయాల్‌కు ఎలా చెప్పడమో ఆయనకు బోధపడడం లేదు. ఆయన ఎదుట కనిపిస్తున్న పరిస్థితిని బట్టి-, బర్‌జోర్‌సింగు నేరస్థుడు, అతను చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. అగాయిత్యం చేయడానికి పూనుకొన్నవాడతను. మరి అలాంటి పరిస్థితిలో ప్రభుదయాల్‌కు ప్రాణహాని జరుగకుండా రక్షణ అవసరం, సహాయం అవసరం. లాలా ప్రభుదయాల్ విచిత్రమైన ముఖముద్రలో జాలిగొలిపే టట్టు కూర్చుని ఉన్నారు.

"అయ్యా! 'కాని' అని మీరాపేశారు– అదేదో వివరంగా చెప్పండి డిప్టీ గారూ!" అన్నారు అంజదాలీ.

"అంజదాలీగారూ! నేను ప్రభుదయాల్ గారికి ఒక విషయం చెప్పాలని వచ్చాను. బర్ జోర్ సింగు దగ్గఱ ఉన్నదంతా ఈ వంద ఎకరాల పొలం ఒక్కటే. ఇదే అతని జీవితానికి ఆధారం. అతని పొలం అతనికి దక్కేలాగా ఏదయినా ఉపాయం చూడడానికి వీల్లేదా" అని జ్వాలా ప్రసాద్ ప్రభుదయాల్ వైపు చూచారు.

ప్రభుదయాల్ సమాధానం చెప్పారు: "డిప్టీగారూ! అప్పు తీసుకునేది మళ్ళీ ఇయ్యడానికే గాని అది దాన ధర్మంగా ఇచ్చేది కాదు. మీరే చెప్పండి, నా అప్పు రాబట్టే ఉపాయం ఏదన్నా ఉంటే. ఈ రోజు ఉదయం అతను తన అప్పు కింద ఏనుగును ఇస్తానని వచ్చాడు. అతనే చెప్పాడు– రాజులూ, మహారాజులూ పెంచవలసిన ఏనుగును మీ కోమటి మూకకు పెంచడం చేతవుతుందా అని. తన గొప్పతనం చూపించి నన్ను అనరాని మాటలు అనే సమయంలో తను బిచ్చగాడు, నిరుపేద అనే విషయం అతనెందుకు మరిచి పోతాడో మరి మీరే చెప్పండి. చేసుకున్న వారికి చేసుకున్నంత! అది విధి విధానం."

"కాని అతను నాశనమయి పోతాడు. ఆ విషయం కూడా మీరు కొంచెం గమనించాలి" అన్నారు జ్వాలా ప్రసాద్ బతిమాలినట్టుగా.

ప్రభు దయాల్ బిగ్గరగా నవ్వారు: "డిప్టీ గారూ! ఇతరులు పాడయి పోతారని నేను ఆలోచిస్తూ కూర్చుంటే ఇక నా వ్యాపారం సాగినట్టే. ఒకరు పాడయి పోతేనేగాని మరొకరు బాగుపడరు. అయోగ్యుడు, తెలివి తక్కువవాడు, నిగ్రహం లేనివాడు పాడయిపోవడం తప్పదు. అతన్ని కాపాడడం ఎవరికీ చేత గాదు. మీకా దిగులంతా అక్కర్లేదు. కర్మ సిద్ధాంతం విచిత్రంగా నడుస్తుంది, అది ఎప్పుడూ అలాగే ఉంటుంది. ఈ ప్రపంచంలో అందరి కంటే సమర్థుడే జీవించగలడు."

ప్రభుదయాల్ చెప్పిన సమాధానానికి జ్వాలా ప్రసాద్ చాలా బాధ పడ్డాడు. కాని ఆ ఆవేదన నంతా తన మనస్సులోనే ఇముడ్చుకొని మరోసారి ప్రయత్నించి చూచారు: "కాని ప్రభుదయాల్ గారూ! మనిషి తీరును కనిపెట్టి ప్రవర్తించడం అవసరం. బర్ జోర్ సింగు మీతో అన్న మాట కేవలం మిమ్మల్ని బెదిరించడానికని నేననుకోను. మనిషి స్వభావం

కనిపెట్టడంలో నాకున్న అనుభవంతో ఆ వ్యక్తి తను చెప్పిన పని చేసి తీరేవాడని మాత్రం నేను చెప్పగలను. మీరేమంటారు ఇన్స్పెక్టరుగారూ? మీరు పోలీసు శాఖలో పని చేస్తున్నారు. నిత్యం మీరు రకరకాల వ్యక్తులతో మెలుగుతూ ఉంటారు. నేను పొరబాటు పడడం లేదు గదా!''

అంజదాలీ ఈ సారి కొంచెం గంభీరంగా అన్నారు: ''మీరు చెప్పింది పూర్తిగా నిజం డిప్టీగారూ! ఈ బర్‌జోర్‌సింగు ముక్కుకు సూటిగా వెళ్ళే మనిషి అనే విషయం నాకు బాగా తెలుసు. అందుచేత అతను ఆడినమాట తప్పడు కూడాను. పిరికితనం అనేది అతనికి ఆమడ దూరాన ఉంటుంది. మాకు చేతయినంత వరకూ మేము ప్రభుదయాల్‌గారిని కాపాడడానికి ప్రయత్నిస్తాము. కాని ఈయన కూడా తన జాగ్రత్తలో తానుండడం అవసరం. బర్‌జోర్‌సింగును అరెస్టుచేసి నేను పోలీసుకు స్వాధీనం చేసేవాణ్ణే. కాని ఇతని బావ గజరాజసింగు కలెక్టరు దాకానేకాదు. క్యాప్టను దాక వెళ్ళగలడు. అతనికి తెలియని వాళ్ళు లేరు.''

ప్రభుదయాల్ తన తలక్రింద పాతకాలపు దిండులోనుంచి ఒక రివాల్వరు బయటికి తీసేసరికి జ్వాలా ప్రసాద్ చాలా ఆశ్చర్యపడుతూ ఆయన వైపు చూచారు: ''జమిందారీ అంటే నవ్వులాట కాదని నాకు తెలుసు డిప్టీగారూ! చావుతో చెలగాటానికి సిద్ధపడినవాడే నిజమైన మనిషి. నేను పాతకాలపు వర్తకుల్లాగా అందరికీ భయపడే పిరికిపందను కాదు. బర్‌జోర్‌సింగు లాంటివాళ్ళ బెదిరింపుకే భయపడిపోతే ఇక అయినట్టే. అలా అయితే ఠాకుర్ గజరాజసింగు నా దగ్గర తాకట్టు పెట్టిన అయిదు గ్రామాలను స్వాధీనం చేసుకొనే ఆలోచన కూడా వదులుకోవలసి వస్తుంది. మీరు నన్ను గురించి విచారించకండి డిప్టీగారూ! అవసరమయితే బర్‌జోర్ సింగు నా మీద చెయ్యి చేసుకున్నప్పటికీ నేను నెగ్గగలను.''

లాలా ప్రభుదయాల్ ఇలాంటి వాడని జ్వాలా ప్రసాద్ ఎప్పుడూ ఊహించను కూడా లేదు. భయమూ, భక్తి, సందేహం, సంకోచం—ఏమీ లేని మహా దానవుడు తన యెదుట ఉన్నట్టు తోచింది జ్వాలా ప్రసాదుకు. ఆ దానవుని ఎదుట తాను చాలా చిన్నవాడు, ఎంతో చిన్నవాడు, మరుగుజ్జులాంటి వాడని కూడా ఆయనకు అనిపించింది. అంతేకాదు. లెక్క లేనంతమంది అతని కాళ్ళ క్రిందపడి నలిగిపోతూ అతని ఆజ్ఞను శిరసావహిస్తున్నట్టు తోచింది.

ఈ పీడకలకు అతని మనస్సు కలవర పడింది. ఈ ప్రవాహంలో నుండి తెప్పరిల్లి ఆయన మళ్ళీ తన ఎదుట బక్కచిక్కిన ముసలి దేహాన్ని చూచారు. ముఖం ముడుతలు పడ సాగింది. అతని చెయ్యి రివాల్వరు బరువుకు కంపిస్తూ ఉంది. అయినప్పటికీ భయంకరంగా, వికారంగా ఉన్న అతని ముఖంలో అసుర పాషాణ సంకల్పం అలాగే తొంగిచూస్తూ ఉంది.

జ్వాలా ప్రసాద్ లేచి నిలబడ్డారు: ‘‘ప్రభుదయాల్‌గారూ! నేను నా కర్తవ్యం నెరవేర్చాను. నా మనస్సులో భారం తగ్గిపోయింది. కాని మీరనే మాటలు నా కేమీ బోధపడలేదని మాత్రం నేను చెప్పాలి. అలాగే మీకు కూడా నేను చెప్పిన మాటలు బోధపడి ఉండవనే అనుకుంటాను. మన దృక్పథాలు వేరు వేరుగా ఉన్నాయి. మరి యిక సెలవు. నేను వెళ్ళి వస్తాను.’’

కాని అప్పుడే లక్ష్మీచంద్ లోపలినుండి వచ్చి చెప్పాడు: ‘‘బాబాయ్! లోపలికి వెళ్ళి ఫలహారం చెయ్యకుండా వెళ్ళడానికి వీల్లేదని మా అమ్మ మీతో చెప్పమన్నది. ఆమె మిమ్మల్ని లోపలికి రమ్మంటున్నది.’’

నాలుగు

లాలా ప్రభుదయాల్ బర్‌జోర్‌సింగుమీద కేసుపెట్టి గెలిచారు. రెండువేల రూపాయలకుగాను బర్‌జోర్‌సింగు స్వంత వ్యవసాయం క్రిందఉన్న వంద ఎకరాల పొలం ప్రభుదయాల్‌కు స్వాధీనమయింది. ఆ పొలం వేలం వేసే రోజున ప్రభుదయాల్ తప్ప మరెవ్వరూ పాడేందుకు అక్కడ లేరు. డిక్రీమొత్తానికే ఆయన పొలం కొనేశారు.

కోర్టులో పొలాన్ని గురించిన రాతకోతలు ముగించుకొని ఆయన ఇంటికి వెళ్ళేసరికి సాయంత్రమయింది. ఘాటంపూర్‌లో ఉన్న తన బండి కట్టించుకొని ఆయన ఇంటికి వెళ్లుతున్నారు.

అది జనవరి మొదటివారం. ఆకాశం మబ్బులతో మసక మసకగా

వుంది. లాలా ప్రభుదయాల్‌తోపాటు ఆయన గుమాస్తా లచ్చీరాం, కరణం శీతల ప్రసాద్ కూడా వున్నారు. ఘాటంపూర్‌నుండి శివపురావెళ్ళే మట్టి రోడ్డుమీద వాళ్ళ బండి మలుపు తిరిగింది. వెంటనే బర్‌జోర్ సింగు కేక వినిపించింది. "లాలా ప్రభుదయాల్! కొంచెం ఆగండి!"

బండి ఆగింది. లాలా ప్రభుదయాల్ రివాల్వరు బయటికి తీసి గట్టిగా పట్టుకున్నారు. ఇంతలో బర్‌జోర్‌సింగు ఆయన బండి దగ్గరికి వచ్చాడు. అతని చేతిలో ఏమీలేదు. కాని అతని ముఖం కోపంతో మండిపోతూవుంది. అతడు వస్తూనే అన్నాడు: "అయితే రాతకోతలు ముగించుకొని వచ్చావా ప్రభుదయాల్! చావు సమీపించిందన్నమాట!"

"ఏమిటలా ఒళ్ళు తెలియకుండా వాగుతున్నావు? మాటలు కొంచెం జాగ్రత్తగా రానియ్యి." అన్నారు లాలా ప్రభుదయాల్ కోపంతో.

ప్రభుదయాల్ చేతిలో ఉన్న రివాల్వరు బర్‌జోర్‌సింగు కంటపడింది. అతను నవ్వుతూ అన్నాడు: "అదా సంగతి. పిస్తోలు చేతులో పెట్టుకొని తిరుగుతున్నావా. కాని ప్రభుదయాల్‌గారూ! ఈ పిస్తోలు మీలాంటి శ్రేష్ఠి సోదరుల చేతుల్లో ఉండవలసిందిగాదు." అంటూ బర్‌జోర్‌సింగు నిర్భయంగా ఒక్క క్షణంలో ప్రభుదయాల్ చేతిలోనుండి రివాల్వరు లాక్కున్నాడు. ప్రభుదయాల్ భయపడి కేక పెట్టారు. ఆయన ముఖంలో కాంతి పోయింది. శీతల ప్రసాద్, లచ్చీరాం ఇద్దరూ చేతులు ముడుచుకుని దణ్ణాలు పెడుతూ గుప్‌చిప్‌గా కూర్చున్నారు. "భయపడకు లాలా, నిన్ను చంపాలని నేను రాలేదు. కాని నీవు మా పొలాన్ని ప్రాణాలతో స్వాధీనం చేసుకోలేవని మాత్రం చెప్పాలని వచ్చాను. నీవు పోయిన తర్వాత ఈ పొలం నీకు స్వాధీనమై కూడా ప్రయోజనం లేదు. అందుకని మా పొలాన్ని స్వాధీన పరుచుకోవాలనే తెలివితక్కువ ఆలోచన మానేసెయ్." అనిచెప్పి బర్‌జోర్‌సింగు ప్రభుదయాల్ ముందు రివాల్వరుపెట్టి త్వరత్వరగా ఘాటంపూర్‌వైపు తిరిగి పోయాడు.

ప్రభుదయాల్ తన బండిని శివపురా వైపు వెళ్ళనీయక జ్వాలా ప్రసాద్ గారి ఇంటివైపు మళ్ళించారు. అతన్ని ఏదో విచిత్రమైన భయం ఆవరించింది.

రెండు మూడు రోజులనుంచి జ్వాలా ప్రసాద్ ఆరోగ్యంకూడా అంత సరిగా లేదు. ఆయనకు పూర్తిగా జలుబు చేసింది. యమున మున్షీ రామ సహాయ్‌గారి ఇంటికి రాజపురా వెళ్ళింది. జ్వాలా ప్రసాద్ ఇంట్లో ఒంటరిగా

ఉన్నారు. ఆయన లోపలి గదిలో రజాయి (దూదిబొంత) కప్పుకుని పండుకొని ఉన్నారు. భీఖూ బయటి పంచలో చలిమంట వేసుకుని చిలుం తాగుతున్నాడు. ప్రభుదయాల్‌ను చూడగానే భీఖూ లేచి నిలబడ్డాడు: "అయ్యగారికి జలుబూ దగ్గూ చేసి కొంచెం జ్వరంగా ఉంది. పండుకొని ఉన్నారు. ఏదన్నా అవసరమయిన పని ఉంటే ఆయన్ని లేపుతాను."

ప్రభుదయాల్ తొందరపడుతూ అన్నారు: "అవును, చాలా ముఖ్యమయిన పని ఉంది. వెళ్ళి వెంటనే లేపు. నేను వచ్చానని చెప్పు. చావు బ్రతుకులకు సంబంధించిన విషయం మాట్లాడాలి ఆయనతో."

"అమ్మయో! అయితే రండి, గది తలుపు తీస్తాను. కూర్చోండి" గది తలుపు తెరిచి భీఖూ ప్రభుదయాల్ వచ్చిన సంగతి జ్వాలా ప్రసాద్‌కు చెప్పడానికి వెళ్ళాడు.

భీఖూ జ్వాలా ప్రసాద్ దగ్గరినుంచి వచ్చి ప్రభుదయాల్‌తో అన్నాడు: "అయ్యగారు మిమ్మల్ని లోపలికే రమ్మంటున్నారు. ఒంటరిగానే ఉన్నారు. అమ్మగారు రాజపురా వెళ్ళారు. నాతోరండి లోపలికి."

జ్వాలా ప్రసాద్ మంచంమీద దిండు నానుకొని కూర్చొని ప్రభుదయాల్ కోసం ఎదురు చూస్తున్నారు.

"రండి ప్రభుదయాల్‌గారూ! రెండు మూడు రోజులనుంచి విపరీతంగా జలుబుచేసింది. కొద్దిగా జ్వరం కూడాఉంది. మా వాళ్ళు కూడా ఇంట్లో లేకపోవడంతో మరీ అలసటగా ఉంది. కూర్చోండి. అదేమిటి చాలా కంగారుగా ఉన్నారు? ఏమిటి అయిందసలు?"

ప్రభుదయాల్ ఎదురుగా ఖాళీగా ఉన్న మంచంమీద కూర్చుని అన్నారు: "డిప్టీగారూ! ఈరోజు నేను బర్‌జోర్‌సింగ్ పొలం నా పేర వ్రాయించుకుని శివపురా వెళుతున్నాను."

ప్రభుదయాల్ పూర్తిగా చెప్పక ముందే జ్వాలా ప్రసాద్ ఆయన్ని మధ్యలోనే ఆపి అడిగారు: "అయితే బర్‌జోర్‌సింగు పొలం మీరు కొనేశారా?"

"మీకా విషయం తెలియదా? ఏం చెయ్యను? వేలం వేస్తే అతనికి భయపడి ఎవ్వరూ పాట పాడేందుకు రాలేదు. నేనే పాడి, కొనవలసి వచ్చింది."

"అలాగా!" అంటూ జ్వాలా ప్రసాద్ ఆలోచించ సాగారు. తర్వాత

ఆయన విచారంగా ప్రభుదయాల్ వైపు చూచారు: "నాకీ సంగతి ఏమీ తెలియదు. ఇటీవల నా స్వంత విషయాల్లో మునిగి ఉండడంవల్ల ఏమీ తీరడం లేదు. దానికి తోడు ఆరోగ్యం కూడా సరిగా లేదు." చాలా నిరుత్సాహంగా ఆయన అడిగారు: «అయితే మీరు పొలం కొనేశారు. పొలాన్ని మీ పేరిట వ్రాయించుకున్నారు కూడా అన్నమాట!"

"అవును, ఈరోజే డిప్టీదొరగారి అనుమతితో పొలం నా పేరిట వ్రాయించుకొని కాన్పూరు నుండి వచ్చాను. బర్‌జోర్‌సింగు పిల్లల తరపునకూడా పిలుపు వచ్చింది. కాని ఎవ్వరూ కోర్టులో హాజరు కాలేదు." అన్నారు ప్రభుదయాల్. తర్వాత ఆయన కంఠం ఉన్నట్లుండి నీరసించింది. భయంతో ఆయన వణికిపోయారు: "డిప్టీగారూ! ఇంతకు ముందే నా బండి శివపురావైపు తిరిగిందో లేదో బర్‌జోర్‌సింగు అడ్డం వచ్చి నాబండిని ఆపేశాడు. నా ప్రాణం తీస్తానని భయపెట్టాడు."

జ్వాలా ప్రసాదుకు తన ఎదుట కూర్చున్న వ్యక్తిని చూచేకొద్దీ భయంతో కూడిన విచారం గలుగుతూ ఉన్నది. ఆయన చాలా విషాదంగా అన్నారు: "ప్రభుదయాల్‌గారూ! ఇలా మిమ్మల్ని బెదిరించడం ఇది మొదటిసారి కాదనే విషయం మీకు తెలుసు. మీరు అతని పొలం జప్తీ చేసినట్టు సమన్లు పంపించిన రోజే అతనికి పిచ్చెక్కినట్టయింది. అందువల్ల నాకు ఇందులో ఆశ్చర్యం కాని, క్రొత్త విషయం కాని కనిపించడం లేదు. కాని మీ దగ్గర ఎప్పుడూ రివాల్వరు ఉంటుంది కదా! పోలీసు ఇన్‌స్పెక్టరు అంజదాలీ మిమ్మల్ని కాపాడతానని పూచీ తీసుకున్నాడు. మరి మీకింక భయమెందుకు?"

ఏదో సంకోచంతో ప్రభుదయాల్ అన్నారు: "ఆ మాట నిజమే భయపడవలసిన అవసరమేమీ లేదు. కాని ఏదో అరిష్టం జరుగుతుందేమోనని ఎందుకో నా కనిపిస్తూంది. రేపే నేనతని పొలాన్ని స్వాధీనం చేసుకోబోతున్నాను."

జ్వాలా ప్రసాద్ ఏదో పరధ్యానంతో అన్నారు: «అవును, చట్టరీత్యా మీకు ఆ పొలాన్ని స్వాధీనం చేసుకోడానికి పూర్తిగా అధికారం ఉంది. కాని ఈ పంట వదిలేస్తే బాగుంటుంది."

"ఆ పొలం నాది. కనక ఆ పొలంలో పండిన పంటకూడా నాదే.

డిప్టీగారూ! ఆ పొలాన్ని స్వాధీన పరుచుకోవడంలో మీరు నాకు సాయం చేయాలి. మిమ్మల్ని ఈమాట అడగడానికే నేనిప్పుడిక్కడికి వచ్చాను."

జ్వాలా ప్రసాద్ కొంచెంసేపు మాట్లాడలేదు. ఆ తర్వాత ఆయన ధైర్య సాహసాలను పుంజుకొని అన్నారు: "నన్ను క్షమించండి ప్రభుదయాల్‌గారూ! ఈ విషయంలో జోక్యం కలుగ జేసుకోవడం నాకిష్టం లేదు. చట్టం మీ పక్షం ఉన్నదనే విషయం నాకు తెలుసు. కాని ధర్మం, న్యాయం మీ చర్యను సమర్థించదనే విషయంకూడా నాకు తెలుసు. అదీకాక నా శరీర పరిస్థితి మీరు చూస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా నాకు జ్వరం కాస్తూనే ఉంది."

లాలా ప్రభుదయాల్ ముఖంలో రంగులు మారాయి. "మీరు చెప్పింది నిజమే డిప్టీగారూ! న్యాయం నావైపు లేదు. కాని న్యాయం ఎవరివైపు ఉందో నాకెవరైనా చెప్పగలరా? నేను మీ దగ్గరికి వచ్చాను. మీరు నాకు ఆత్మీయులని అనుకొని మీ సహాయం కోరి వచ్చాను. కాని ఠాకూర్ గజరాజసింగు మీకు ముఖ్య స్నేహితులనే విషయం నేను మరిచిపొయ్యాను. బర్‌జోర్‌సింగు గజరాజసింగుకు బావమరిదేగా మరి! పోనీలెండి, మిమ్మల్ని ఇక శ్రమ పెట్టను." ఈ మాట చెప్పి ప్రభుదయాల్ తల వంచుకొని మళ్ళీ మాట్లాడకుండా వెళ్ళిపొయ్యారు.

కాని ప్రభుదయాల్‌వల్ల జ్వాలా ప్రసాద్ మనస్సులో ఒక రకమైన అశాంతి ఏర్పడింది.

జ్వాలా ప్రసాద్ ఈ సంభాషణను మరచిపోయి నిద్ర పొయ్యేందుకు ఎంత ప్రయత్నించినా ఆయనకు నిద్ర పట్టనేలేదు. దాదాపు రెండు గంటలదాకా ఆయన అటూ ఇటూ పొర్లుతూనే ఉన్నారు. చివరకు ఆయన లేచి కూర్చున్నారు. లేచి ఆయన గుడ్డలు మార్చుకుని భీఖూతో చెప్పారు: "భీఖూ! నేను ఠాకుర్ గజరాజసింగుగారి ఇంటికి వెళుతున్నాను. ఇప్పుడే ఒక గంటలో వచ్చేస్తాను."

గజరాజసింగు గారి ఇంట్లో ఆ సమయంలో ఏదో పెద్ద వినోద కార్యక్రమం జరుగుతూ ఉంది. ఆ రోజు ఉదయమే గజరాజసింగుగారి వియ్యంకుడు రాజా చంద్రభూషణ్‌సింగు వచ్చారు. ఆయన గౌరవార్థం నృత్యం సంగీతం ఏర్పాటు చేశారు. గజరాజసింగుగారింటికి భోజనానికి వచ్చి ఆ వినోద కార్యక్రమంలో పాల్గొనవలసిందని ఆ రోజు మధ్యాహ్నమే

జ్వాలా ప్రసాద్‌కు కూడా పిలుపు వచ్చింది. కాని ఆ సమయంలో ఆయన ఆరోగ్యం సరిగా లేనందువల్ల తాను ఆ కార్యక్రమంలో పాల్గొనలేనని కబురు చేశారు. జ్వాలా ప్రసాద్ దుప్పట్లు కప్పుకొని చలికి ముడుచుకొని వస్తుంటే గజరాజసింగు చూచి ఆశ్చర్యపోయినారు. ఆయన జ్వాలా ప్రసాద్‌కు స్వాగతం చెప్తూ అన్నారు: "రండి, జ్వాలా బాబూ! రండి. ఇంట్లో ఒంటరిగా ఉంటే ఏమీ తోచలేదనుకుంటాను. అయినా, జలుబు కూడా ఒక జబ్బేనా? ఇదిగో, కొంచెం వెచ్చవెచ్చగా తాగండి. బర్‌జోర్, జ్వాలా బాబుగారికి కూడా ఒక గ్లాసు తీసుకురా."

బర్‌జోర్‌సింగు వెండిగ్లాసులో సారాపోసి జ్వాలా ప్రసాదుకు అందించాడు. జ్వాలా ప్రసాద్ ఒక గుక్క మింగి మళ్ళీ ఆ గ్లాసును అక్కడే పెట్టారు. ఆ తర్వాత ఆయన నలువైపులా చూచారు. గదిలో చాలా కొద్దిమందే ఉన్నారు. కాన్పూరు నుండి ఒక గాయకురాల్ని పిలిపించారు. ఆమె పాడుతూ ఉన్నది. రాజా చంద్రభూషణ్‌సింగు ఓరగన్నుతో దిండుమీద ఏటవాలుగా పండుకొని ఉన్నారు. మొదట రాజా చంద్రభూషణ్‌సింగు నిద్రపోతున్నారనే అనుకున్నారు జ్వాలా ప్రసాద్. కాని ఆయన చెయ్యి అప్పుడప్పుడు ఎదురుగా పెట్టిన సారా గ్లాసును అందుకొని పెదిమలదాకా తీసుకునిపోయి మళ్ళీ అలాగే తివాచీపయిని పెట్టడం జ్వాలా ప్రసాద్ గమనించారు. రాజా చంద్రభూషణ్ ప్రక్కనే కూర్చుని ఉన్నాడు బర్‌జోర్‌సింగు. బర్‌జోర్‌సింగు కండ్లు నిప్పుకణికల్లాగా మండి పోతూ ఉన్నాయి. రాజా చంద్రభూషణ్‌సింగు ముందున్న గ్లాసులో ఎంత పరిమాణంలో సారా నింపుతున్నారో అంతకు రెట్టింపు తన గ్లాసులో అతను సారా పోసుకుంటున్నారు. ఆ సమావేశంలో ఒకరిద్దరు వ్యక్తులు జ్వాలా ప్రసాద్‌కు పూర్తిగా అపరిచితులుగా కనిపించారు. వాళ్ళిద్దరూ బహుశా రాజా చంద్రభూషణ్‌సింగుతో వచ్చిఉంటారు.

ఎదుట నృత్యం జరుగుతూ ఉంది. కాని ఆ నృత్యాన్ని కనీసం రాజా చంద్రభూషణ్‌సింగు మాత్రం చూడడంలేదు. ఆ సభలో ఉత్సాహంకానీ ఉల్లాసంకానీ ఉన్నట్లు జ్వాలా ప్రసాద్‌కు తోచడంలేదు. కొంచెం సేపటివరకు జ్వాలా ప్రసాద్ పాట విన్నారు. తర్వాత ఆయన గజరాజసింగు చెవిలో చెప్పారు: "ఠాకూర్‌గారూ! మీతో చాలా

అవసరమైన విషయం మాట్లాడాలి. లేకుంటే నా ఒంట్లోఉన్న పరిస్థితికి ఇప్పుడు నేను వచ్చి ఉండేవాణ్ణికాదు."

"అలాగా! అయితే పక్కగదిలోకి వెళదామా?" అన్నారు గజరాజసింగు.

"అక్కర్లేదు. ఇక్కడనే ఒక మూలకు జరిగితే సరిపోతుంది. కాని బర్జోర్‌సింగునుకూడా కొంచెం ఇక్కడికి పిలిస్తే బాగుంటుంది. నేను మాట్లాడదలచుకున్నది అతనికి సంబంధించిన విషయమే." అన్నారు జ్వాలా ప్రసాద్.

గజరాజసింగు గంభీరంగా అన్నారు: "జ్వాలా బాబూ! కావలసిందేదో అయిపోయింది. ఇక కానున్నది కూడా కాకమానదు. దాన్ని అపడం ఎవ్వరికీ సాధ్యంకాదు. మీరు చెప్పదలచుకొన్న విషయం నాకు తెలుసు. ప్రభుదయాల్ బర్జోర్‌సింగు పొలాన్ని రేపేస్వాధీనం చేసుకుంటాడనేగా!"

జ్వాలా ప్రసాద్‌కు ఆశ్చర్యం వేసింది: "అయితే మీకీవిషయం తెలుసన్నమాట? ఆశ్చర్యంగా ఉందే!"

"దీనిలో ఆశ్చర్యమేముంది? ప్రభుదయాల్ సంగతి తెలిసిన వాళ్ళెవరైనా ఈ మాత్రం ఊహించగలరు. ఆ పొలం తన పేరిట వ్రాయించుకున్న తర్వాత అతను ఊరికే కూర్చుంటాడా? పొలంలో పంట సిద్ధంగా ఉంది. భగవంతుని దయవల్ల ఈసారి పంట చాలా బాగా పండింది కూడాను. ఎంతకాదన్నా ఎకరానికి అరపుట్టి ధాన్యానికి తగ్గదు. ఇలాంటి పంటను ప్రభుదయాల్ వదులుకుంటాడా? అతను రేపే బర్జోర్‌సింగు పొలాన్ని స్వాధీన పరుచుకుంటాడు."

"కానీ రేపే స్వాధీనం చేసుకుంటాడని మీరెలా చెప్పగలరు?"

"జ్వాలా బాబూ! సాయంత్రం అతను మీ యింటికి వెళ్ళాడా? లేదా? బహుశా మీవల్ల అతనికి ప్రయోజనం లేకపోయింది. అందుచేత పోలీస్ ఇన్స్పెక్టరు అంజదాలీ దగ్గరికి వెళ్ళి అతన్ని తీసుకొని తన గ్రామానికి వెళ్ళాడు. బలగాన్నంతా తీసుకుని రేపు బర్జోర్ పొలాన్ని స్వాధీన పరుచుకోడానికి వెళతాడు. అన్నిటికంటే దురదృష్టమైన విషయమేమిటంటే గవర్నమెంటు అతనికే మద్దతిస్తుంది. గవర్నమెంటు చట్టం కూడా అతన్నే సమర్థిస్తుంది. పోలీసులు కూడా అతని వైపే ఉంటారు.

గవర్నమెంటు సహాయం లేకుండా వస్తే ఎలా స్వాధీనం చేసుకుంటాడో మేం చూస్తాం.''

"అయితే మరి పర్యవసానమేమిటి ?'' అన్నారు జ్వాలా ప్రసాద్ నిరాశతో.

"ఈశ్వరుడెలా రాస్తే అలా అవుతుంది'' అని గజరాజసింగు తులసీదాసు వాక్యాన్ని జ్ఞాపకం చేశారు. "ఇక మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకొండి జ్వాలా బాబూ! ఇంత జ్వరంలోకూడా మాకోసం పరుగెత్తుకుంటూ వచ్చినందుకు మీకెంతో కృతజ్ఞులం. కాని మీరు దిగులు పడినందువల్ల అయ్యేదేమీ లేదనే సంగతి మీరు గమనిస్తూనే ఉన్నారు. బ్రహ్మ వ్రాసిన వ్రాతను తప్పించడం ఎవరికీ సాధ్యం కాదు.''

"ఏమిటోయ్, ఆ గుసగుసలు! నన్ను గూడా కొంచెం విననిద్దురూ!'' అన్నాడు బర్జోర్‌సింగు కూర్చున్నచోటు నుంచి కదలకుండానే. ఆ మాటవిని రాజా చంద్రభూషణ్‌సింగు కూడా స్తిమితంగా కూర్చున్నారు.

గజరాజసింగు సమాధానం చెప్పారు: "ఏం లేదోయ్. జ్వాలా ప్రసాద్‌గారు లాలా ప్రభుదయాల్‌ను గురించి మాట్లాడుతున్నారు.''

బర్జోర్‌సింగు నవ్వుతూ అన్నాడు: "మాట్లాడుకోండి మీ ఇష్టం వచ్చినట్టు ఆ ప్రభుదయాల్‌ను గురించి. కాని ఈ సంభాషణలోకి బర్జోర్‌సింగును మాత్రం లాగకండి. నాకు సంబంధించినంతవరకు ప్రభుదయాల్‌తో ఈ సమస్యను పరిష్కరించుకొనేందుకు నేనొక్కడినే చాలు.''

బర్జోర్‌సింగు కంఠం జ్వాలా ప్రసాద్‌కు అంత సౌమ్యంగా తోచలేదు. ఇంతలో రాజా చంద్రభూషణ్‌సింగు అనేశారు: "నీ మాట మీద నిలబడి ఉండు బర్జోర్! నేనుండగా నీకేం భయంలేదు. పిరికితనంతో నోరు మూసుకుని కూర్చునేందుకు మన రాజవంశం అంత హీనస్థితిలో ఏం లేదు. మనల్ని అవమానపరిచే ధైర్యం ఈ సెట్టిగారికి ఎక్కడ వచ్చింది?''

జ్వాలా ప్రసాద్ చాల బాధపడుతూ లేచి నిలబడ్డారు. ఆయన మనస్సులో ఒక విధమైన భయం ఏర్పడింది, ఏదో ఒకరకమైన సందేహం ఆయనలో ప్రవేశించింది. ఆయన నిరాశ చెందినట్టుగా గజరాజసింగుతో అన్నారు: "అయితే మరి నేను వెళ్ళి వస్తాను. ఇక వెళ్ళి పండుకుంటాను. మనస్సులో ఏదో విచారంగా ఉంటే ఇలా వచ్చాను. ఇకముందు కావలసింది మీ చేతుల్లో ఉంది.''

గజరాజసింగు జ్వాలా ప్రసాద్‌ను సాగనంపడానికి ఆయనతో వెళ్ళుతూ అన్నారు: "మీరు వెళ్ళి నిశ్చింతగా నిద్రపొండి. ఇది మాకు సంబంధించిన విషయం. ఏదో విధంగా దీన్ని మేమే పరిష్కరించుకుంటాం. కాని ఇక ముందు మాత్రం మీరు ఈ విషయంలో ఏమాత్రం జోక్యం కలుగజేసుకోకుండా ఉండడం మంచిది. మీకీవిషయం ఏమీ తెలియనట్టూ, తెలిసికోవాలని కూడా లేనట్టూ ఉండండి. మీరు చక్కబెట్టలేని విషయాన్ని ఏదో విధంగా పరిష్కారం కానియ్యండి."

జ్వాలా ప్రసాద్ ఇంటికి వచ్చి పండుకున్నారు. ఆయన శరీరమే కాదు, ఆయన మనస్సు, ఆయన ప్రాణం కూడా బాగా అలసిపోయ్యాయి.

ఆయన ఎంతసేపు నిద్రపోయ్యారో ఆయనకు తెలియదు. గుమాస్తా లచ్చీరాం వచ్చి ఆయన్ని నిద్రలేపినప్పుడు, ఆయన కండ్లు నులుపుకుంటూ లేచి ఏమయింది?" అని అడిగాడు. లచ్చీరాం చాలా గాబరా పడుతూ చెప్పాడు: "జైదేయమ్మగారు తమర్ని వెంటనే రమ్మన్నారు. ప్రభుదయాల్‌ను ఇంతకు ముందే ఎవరో చంపేశారు. ఇన్స్పెక్టర్ అంజదాలీని శివపురాకు పంపించి మేము తమరి దగ్గరికి వచ్చాం."

జ్వాలా ప్రసాద్ నివ్వెర పోయారు: "ఏమిటీ? లాలా ప్రభుదయాల్‌ను ఎవరో చంపేశారా? ఎవరు చంపారు? ఎలా చంపారు?"

"అదంతా తమరక్కడికి దయచేస్తే జైదేయమ్మగారే చెప్తారు. నౌకర్లూ, వాళ్ళూ చెప్పుకునే దాన్ని బట్టి రాత్రి దాదాపు పది-పదకొండు గంటలవేళ భవంతిగేటు దగ్గరికి ఇన్స్పెక్టర్ అంజదాలీని సాగనంపి ప్రభుదయాల్ వెనక్కి వెళుతూ ఉన్నారట. ఆయన మెట్లెక్కి బయటి గదిలోకి వెళ్ళేసమయంలో ఉన్నట్టుండి పెద్ద కేక వినిపించింది. రక్షించండి బాబో రక్షించండి-చంపేశారని కేక పెట్టారు. ఆ కేకకు పనివాళ్ళందరూ అక్కడికి చేరారు. ప్రభుదయాల్ తల్లక్రిందులుగా పడిపోయ్యారు. వీపు నుండి రక్తం ధారలు కట్టి కారుతూ ఉంది. జైదేయమ్మగారికి ఇది చూచేసరికి స్పృహతప్పి పోయింది. వెంటనే ఒక నౌకరు పరుగెత్తుకుంటూ వచ్చి మాకీ విషయం చెప్పాడు. వెంటనే మేమూ అక్కడికి వెళ్ళాం. స్పృహ వచ్చిన తర్వాత అమ్మగారు మిమ్మల్నీ, ఇన్స్పెక్టరుగార్నీ పిల్చుకు రమ్మని పంపారు."

ఏదో జరుగుతుందని జ్వాలా ప్రసాద్ అనుకున్నారే కాని అదంతా ఇంత తొందరగా ముంచుకు వస్తుందని ఆయన అనుకోలేదు. జ్వాలా

ప్రసాద్ లేచి త్వరత్వరగా బట్టలు వేసుకున్నారు. ఠాకూర్ గజరాజ సింగుకు ప్రభుదయాల్ హత్యకు సంబంధించిన వార్త తెలియపరుద్దామని ముందు అనుకున్నారు, కాని మరుక్షణంలోనే దానివల్ల ఏమీ ప్రయోజనం లేదని అనిపించింది. ఎలా అనుకున్నారోగాని ఆయన వెంటనే ఈహత్య సంగతి ఠాకూర్ గజరాజసింగుకు తెలుసని ఆయనకు తోచింది. లచ్చీరాం తోపాటు వచ్చిన ఇతర నౌకర్లతో కలిసి 'ఇక్కా'[1]లో కూర్చుని ఆయన తక్షణమే శివపురాకు బయలు దేరారు.

మరునాడు రాత్రి దాదాపు పది గంటలకు ప్రభుదయాల్ దహన సంస్కారాలు ముగించుకుని ఆయన ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆయనకు విపరీతంగా జ్వరం వచ్చింది. మూడురోజుల వరకూ ఆయన ఒళ్ళు తెలియకుండా మంచంలోపడి ఉన్నారు. భీఖూ రాజపురాకు మనిషిని పంపించి ఆయన జబ్బుపడ్డ విషయం మున్షీ రామసహాయ్‌కీ, యమునకూ తెలియ పరిచాడు. యమున ఇక్కడికి వచ్చేస్థితిలో లేదు. అందువల్ల మున్షీ రామసహాయ్ తానే జ్వాలా ప్రసాద్‌ను చూచిపోవడానికి వచ్చారు. నాలుగోనాటికి జ్వాలా ప్రసాద్‌కు జ్వరం తగ్గింది. జ్వాలా ప్రసాద్‌కు ఒంట్లో సరిగా లేనందువల్ల మున్షీ రామ సహాయ్ ఘాటంపూర్‌లోనే ఉండి పోయ్యారు.

జ్వరం నయమయిన తర్వాత ప్రభుదయాల్ హత్యకు సంబంధించిన వృత్తాంతమంతా జ్వాలా ప్రసాద్ మున్షీ రామసహాయ్‌తో పూర్తిగా చెప్పారు: జరిగిందంతా విని రామసహాయ్ చాలా గంభీరముద్రతో అన్నారు: "జ్వాలా, నీవీ విషయంలో జోక్యం కలుగజేసుకోకపోవడం మేలయింది. ప్రభుదయాల్‌కు ఏదో ఒక రోజు ఈ గతి పట్టకపోదని అందరికీ తెలుసు. అన్యాయం, అక్రమం అట్టే ఎక్కువ రోజులు సాగవు."

"కాని, కాని మామా! ఈ చట్టం, ఈ వ్యవస్థ, ఇవన్నీ దేనికి?" అని అడిగారు జ్వాలా ప్రసాద్ చాలా నీరసంగా. కొంచెం సేపు ఆయన ఏదో గుర్తు వచ్చినట్లు అన్నారు: "అయితే మామా! బర్జోర్‌సింగును అరెస్టు చేశారో లేదో నీకేమయినా తెలుసా?"

"బర్జోర్‌సింగును అరెస్టు చేయలేదు. అతనసలు ఘాటంపూర్‌లోనే లేడు. అతని భార్య, పిల్లలు గజరాజసింగు దగ్గరనే ఉన్నారు.

[1] ఇక్కా మనవైపు రిక్షాలాంటిది

ప్రభుదయాల్ హత్య జరిగేందుకు వారం రోజులు ముందే వాళ్ళు చనోతా నుండి ఇక్కడికి వచ్చారు. హత్య జరిగిన రోజు సాయంత్రమే రాజా చంద్రభూషణ్‌సింగుతో కలిసి ఖర్‌జోర్‌సింగు కాన్పూరుకు బయలుదేరి వెళ్ళాడని గజరాజసింగు చెప్తున్నారు.”

“అది అబద్ధం, పచ్చి అబద్ధం!” జ్వాలా ప్రసాద్ కొంచెం ఆవేశంతో అన్నారు: “ఆ రోజు రాత్రి గజరాజసింగుగారి ఇంట్లో ఒక వినోద కార్య క్రమం కూడా జరిగింది. ఆ సభలో తాగుడు కూడా విపరీతంగా జరిగింది. అదంతా నేను నా కండ్లతో చూచాను. రాత్రి తొమ్మిది గంటలకు నేను అక్కడి నుండి ఇంటికి వచ్చాను. ఆ సభలో నేను కూడా ఉన్నాను.”

“నీవు వెళ్ళగానే సభ ముగిసిందని గజరాజసింగు చెప్తారు. అంతకు ముందు వర్షం కురుస్తున్నందువల్ల ఆయన ప్రయాణం ఆలస్యమయిందనీ వర్షం ఆగిపోగానే సభ ముగిసిందనీ ఆయన అంటారు.” ఆ తర్వాత రామసహాయ్ నెమ్మదిగా జ్వాలా ప్రసాద్ చెవిలో చెప్పారు: “నిన్ని విషయంలో ఏమాత్రం జోక్యం కలుగజేసుకోవద్దని గజరాజసింగు నాతో మరీ మరీ చెప్పారు.”

జ్వాలా ప్రసాద్ మౌనంగా కొంచెంసేపు ఏదో ఆలోచించి మళ్ళీ అన్నారు: “మామా! ఈ విషయంలో నేను తటస్థంగా ఉండడం న్యాయమేనా? మీ సలహా చెప్పండి. నేను తటస్థంగా ఉండి ఒక హంతకుణ్ణి రక్షించడం చట్టాన్ని నోరు మూయించడం కాదూ! ఈ బ్రిటిష్ ప్రభుత్వం న్యాయం, చట్టం-ఈ రెంటిమీదనే ఆధారపడి ఉంది. ఆ బ్రిటిష్ ప్రభుత్వమే నాకొక పదవినిచ్చి నన్ను నమ్మి నాకు కొంత బాధ్యత ఒప్పచెప్పింది. మరి అన్యాయానికి అంతరాయం కల్పిస్తే నేను విశ్వాసఘాతకుణ్ణి అయిపోనూ?”

జ్వాలా ప్రసాద్ వేసిన ప్రశ్నలకు రామసహాయ్ సమాధానం చెప్పలేక పోయారు. ఆయన మౌనంగా కూర్చుని కొంచెంసేపు ఆలోచించి నిరుత్సాహంగా అన్నారు: “నీవు చెప్పిన దాంట్లో పొరపాటేం లేదు బాబూ! కర్తవ్యం నెరవేర్చక పోవడం తప్పే. నా ఉద్దేశ్యంలో చట్టరీత్యా ఖర్‌జోర్‌సింగు ఎంతటి నేరస్థుడవుతాడో నిజానికి అతడంతటి నేరస్థుడని కాదు. అయినా చట్టరీత్యా అతడు హంతకుడుగానే పరిగణింపబడుతాడు. ప్రభుదయాల్‌కు ఇలా జరిగిందని నాకేమీ విచారకరంగా లేదు. ఆ శాస్తి

అతనికి జరగవలసిందే. కాని అతన్ని తన యిష్టం వచ్చినట్లు తనంతట తాను శిక్ష విధించే అధికారం బర్‌జోర్‌సింగుకు లేదు. నీకు ఏది ఉచితమని తోస్తే అలా చెయ్యి. నిన్ను నేనడ్డుపెట్టను.''

ఆరోజు సాయంత్రమే మున్షీ రామసహాయ్ రాజపురాకు బయలుదేరి వెళ్ళారు. వెళ్ళుతూ వెళ్ళుతూ ఆయన జ్వాలా ప్రసాద్‌తో మరోసారి చెప్పారు: "బాబూ! కొంచెం జాగ్రత్తగా మెలుగుతుండు. నీ అంతటి పెద్ద ఉద్యోగస్థుడి జోలికి వెళ్ళేందుకు ఎవరికీ ధైర్యం ఉండదనుకో. అయినప్పటికీ మన జాగ్రత్తలో మనం ఉండడం మంచిది. తగిన జాగ్రత్తలో ఉన్నవాడికి ఎప్పటికీ ముప్పురాదని శాస్త్రాల్లో కూడా చెప్పారు.''

ఎనిమిది రోజుల తర్వాత జ్వాలా ప్రసాద్ మెజస్ట్రేటు ఎదుట తన వాఙ్మూలం ఇచ్చారు. ఆయన ఇచ్చిన వాఙ్మూలాన్ని పురస్కరించుకుని బర్‌జోర్‌సింగుకు వారంటిచ్చారు.

ప్రభుదయాల్‌కు కర్మాంతరాలన్నీ అయిపోయాయి. కాని జ్వాలా ప్రసాద్ అక్కడికి వెళ్ళలేదు. పదమూడోరోజు తర్వాత పదిహేను రోజులకు లక్ష్మీచంద్‌ను వెంటబెట్టుకొని జైదేయి జ్వాలా ప్రసాద్ దగ్గరికి వచ్చింది. జ్వాలా ప్రసాద్ పదమూడో రోజయినా శివపురా రాలేదని మనస్సులో బాధపడుతూ ఆమె అన్నది: "విధి మాకెదురు తిరగడంవల్ల కాబోలు మీకు కూడా మామీద కోపం వచ్చినట్టుంది. పదమూడోరోజు మీ కోసం నేనెంతో ఎదురు చూచాను. కాని ఆయన చనిపోయిన తర్వాత మీరాతట్టు రానేలేదు. మరి ఇప్పుడు నేనే వచ్చాను—ఈ తండ్రిలేని పిల్లవాణ్ణి తీసుకుని.''

జ్వాలా ప్రసాద్ జైదేయి వైపు చూచారు. ఆయన ముఖం తేజోహీనమయిపోతున్నది. బాలిపడుతూ ఆయన అన్నారు: "వదినా! నేను బర్‌జోర్‌సింగుకు వ్యతిరేకంగా వాఙ్మూలం ఇచ్చిన సంగతి మీకు తెలుసు కదా! నేనిచ్చిన వాఙ్మూలాన్ని బట్టే అతని పేరిట వారెంటు జారీ చేశారు. మరి! అలాంటి పరిస్థితిలో ఆ సమయంలో నేను మీ యింటికి రావడం భావ్యం కాదని రాలేదు.''

"అవును బాబూ! మీ మీద మాకు పూర్తిగా నమ్మకముంది. పోలీసు ఇన్స్పెక్టరు అంజదాలీ ఆయనతో ఎంతో స్నేహంగా ఉండేవారు. కాని

ఆయన ఈ విషయాన్ని ఒకరకంగా దాచేశారు.'' జైదేయి కన్నీరు కారుస్తూ అన్నది: "ఇక మాకు ఘాటంపూర్‌లో ఎవ్వరూలేరు. మా అన్నయ్య కాన్పూరు నుండి వచ్చి మమ్మల్ని కాన్పూరు తీసుకు వెళతానంటున్నారు. ఇక ఇక్కడ మేముండడం అంత శ్రేయస్కరం కూడా కాదు. ఈ విషయంలో మీ సలహా అడగాలని వచ్చాను.''

"నేను మీకు సలహా ఏమి ఇయ్యగలను వదినెగారూ! మీకూ ఎలా తోస్తే అలా చెయ్యండి. కాని శివపురాలో మీ జోలికి ఎవ్వరూ రాకుండా మాత్రం నేను హామీ ఇయ్యగలను. ప్రభుత్వం ఉంది. ప్రభుత్వం తరపున చట్టం, న్యాయముంది. ప్రభుత్వానికి, న్యాయానికి అందరూ కట్టుబాటయి ఉండవలసిందే.''

జైదేయి ఒక సంచిని జ్వాలా ప్రసాద్ ముందుపెట్టి చెప్పింది: "జ్వాలా బాబూ! లక్ష్మీచందును తన కూడా తీసుకు పొమ్మని మా అన్నయ్యకు నేను చెప్పాను. కాన్పూరులో అయితే వాడి చదువుకూడా పూర్తవుతుంది. నేనిక్కడనే శివపురాలో ఉండి ఆస్తిపాస్తుల్ని చూచుకుంటూ ఉంటాను. ఆయన తల దూర్చిన వ్యవహారాలన్నీ క్రమంగా గాని సర్దుకోవు. జ్వాలా బాబూ! మీరు మాకు చేసిన మహోపకారానికి ఇదిగో ఈ వరహాల సంచి మీకు కానుకగా ఇస్తున్నాను.''

ఆ సంచిని చూచి జ్వాలా ప్రసాద్ నవ్వారు: "వదినెగారూ! నేను చేసిందంతా అది నా కర్తవ్యమని భావించి చేశాను. మమకారం, న్యాయం- ఇవి అమ్మేవీ, కొనేవీ కాదు. ఈ డబ్బనేది జీవితంలో అన్ని అధర్మాలకు మూలం. కనక నన్నీ మాయాజాలంలో పడెయ్యడానికి ఇక ఎప్పుడూ ప్రయత్నించవద్దు. మీరు కూడా ఈ వ్యామోహానికి దూరంగా ఉండడమే మంచిది.''

జ్వాలా ప్రసాద్ ప్రవర్తనకు జైదేయి నివ్వెరపడింది. ఆమె పెరిగిన వాతావరణంలో ప్రతివస్తువూ క్రయ విక్రయాలకు అందుబాటులో ఉండేదే కాని వీటికతీతమయిందేదీ లేదు. "మీరు మానవులుకారు, దేవతలు. భగవంతుడు మీకు మేలు చేస్తాడు.'' అంటూనే ఆమె అప్రయత్నంగా భక్తితో జ్వాలా ప్రసాద్ కాళ్ళకు నమస్కరించింది.

జ్వాలా ప్రసాద్ ఆ రోజు మీర్ సాహబ్ దగ్గరికి కాగితాలు తీసుకుని వెళ్ళాల్సిన పని ఉంది. జైదేయికి భోంచెయ్యందే వెళ్ళొద్దని చెప్పి ఆయన

ఖీఖాతో అన్నారు: "అమ్మగారిక్కడనే భోంచేస్తారు. ఆమెతో మాట్లాడుతూ ఉండు. నేనిప్పుడే తహసీల్దారు గారింటికివెళ్ళి వస్తాను. ఓగంటలో వచ్చేస్తాను."

జ్వాలా ప్రసాద్ మీర్‌సాహబ్ దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ ఠాకూర్ గజ రాజసింగు మీర్‌సాహబ్‌తో మాట్లాడుతూ ఉన్నారు. మీర్‌సాహబ్ జ్వాలా ప్రసాద్‌ను చూస్తూనే అన్నారు, "రావోయ్ జ్వాలాబాబూ ! నీకు నూరేండ్లాయుస్సు. ఇప్పుడే నీ సంగతి అనుకుంటూ ఉన్నాం."

గజరాజసింగు చాలా విచారంగా తల వంచుకుని కూర్చున్నారు. ఆయన జ్వాలా ప్రసాద్ వైపు చూడనైనా లేదు. జ్వాలా ప్రసాద్ కూర్చున్న తర్వాత మీర్‌సఖావత్ హుసేన్ అన్నారు. "జ్వాలాబాబూ! బర్‌జోర్‌సింగు మరణానికి నీవే కారణమని అంటారు గజరాజసింగు. నీవు బర్‌జోర్ సింగుకు వ్యతిరేకంగా చెప్పకపోతే అతనికి వారెంటు వెళ్ళేదిగాదు."

జ్వాలా ప్రసాద్ మెల్లగా అన్నారు: "అవునండీ, నేను బర్‌జోర్‌సింగుకు వ్యతిరేకంగా వాఙ్మూలం ఇయ్యక పోయినట్టయితే అతనికి వారెంటు వెళ్ళేది కాదు. ఖూనీ చేసిందెవరో బయట పడేది కూడా కాదు. ఆ విషయం నాకు తెలుసు. కాని ప్రభుత్వోద్యోగి నయి ఉండి న్యాయం చట్టం నాశనమై పోతూఉంటే చూస్తూ ఉండనా చెప్పండి. అయినా ఇప్పుడేమయింది. ఇంకా కేసు నడవాలి గదా!"

ఇప్పుడు గజరాజసింగు కండ్లెత్తి జ్వాలా ప్రసాద్‌ను సూటిగా చూచారు: ఆయన ముఖం పాలిపోయి విచారకరంగా ఉంది. ఆయన కండ్లు తడిగా ఉన్నాయి: "శవంమీద కేసు పెట్టడం ఎలా జరుగుతుంది జ్వాలా బాబూ! బర్‌జోర్‌సింగు ఇప్పుడీ ప్రపంచంలోనే లేడు. తాను చేసిన పాపానికి తానే శిక్ష విధించుకున్నాడు. యజ్ఞపూర్ నుండి తిరిగి వచ్చే సరికి మొన్న రాత్రి విధనూలో అతనికి ఈ వారెంటు సంగతి తెలిసింది. వెంటనే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. నిన్న ఉదయం నేను అతని భార్యా పిల్లల్ని తీసుకొని విధనూ వెళ్ళాను. దహన సంస్కారాలు ముగించుకొని నిన్న రాత్రి నేను మళ్ళీ తిరిగి వచ్చేశాను." ఆ తర్వాత గజరాజసింగు శుష్కంగా నవ్వుతూ అన్నారు: "ఒక విధంగా ఈకాండ కూడా ముగిసింది. బర్‌జోర్‌సింగే లేనప్పుడు ఆయన్ని ఎవరు మాత్రం ఏం చేయగలరు?" అంటూనే గజరాజసింగు ఉన్నట్టుండి కన్నీరు కార్చారు. "కాని జ్వాలా

బాబూ! ఎవరేమనుకున్నా, బర్‌జోర్‌సింగు హృదయం మంచిది. కాని చాల దురదృష్టవంతుడు. అతను ప్రపంచంలో ఎప్పుడూ ఎవరికీ కీడు చేయలేదు. చేతనైనంత వరకూ ఇతరులకు సహాయమే చేశాడు. కాని దీనికంతా అతనికి దక్కిన ప్రతి ఫలమిది. అతని పొలం పోయింది, ప్రాణం పోయింది, పిల్లలనాథలయినారు. చివరకతని భార్యకు మాంగళ్యం కూడా దక్కలేదు. అతని భార్య పుట్టిల్లు విధనూలో ఉంది. అక్కడనే ఆమె అల్లాడుతూ ఉంది. ఇద్దరు పిల్లలతనికి, ఒకడికి పధ్నాలుగేండ్లు, మరొకడికి పదేండ్లు. పన్నెండు పదమూడేండ్ల పిల్ల కూడ ఉంది. పెండ్లికి ఎదుగుతూ ఉంది. వాళ్ళగతి ఏమవుతుందో, భగవంతుడికి తెలియాలి!"

మీర్‌సాహబ్ జ్వాలా ప్రసాద్ వైపు చూచారు: "మీ న్యాయం, ధర్మం ఎలా పరిణమించాయో చూచావుటోయ్ జ్వాలా బాబూ! న్యాయ విధులకూ, దయాదాక్షిణ్యాలకూ మధ్య పేచీరాకుంటే మాత్రం న్యాయానికీ, కర్తవ్యానికీ ప్రాధాన్యం ఇయ్యాలని నేను ఇంతవరకూ ఠాకుర్ గజరాజ సింగుకు చెపుతూ ఉన్నాను. ఆ దృష్టిలో నీవు చేసిన పనిలో పొరపాటేమీ లేదు."

బర్‌జోర్‌సింగు ఆత్మహత్య చేసుకుంటాడని జ్వాలా ప్రసాద్ అనుకో లేదు. బర్‌జోర్‌సింగు సంగతి ఏమవుతుంది, అనే విషయం కూడా జ్వాలా ప్రసాద్ ఆలోచించలేదు. ఆయన ఆవేశ పూరితుడై అలా చేశాడు. నేరం చేసిన వాడికి శిక్ష లభించి తీరాలనే పట్టుదల ఒకటే ఆయన మనస్సులోని ఆలోచన. బర్‌జోర్‌సింగు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలియగానే ఆయన హృదయాంతరం చలించింది. కొంచెంసేపు ఆయన అలాగే కూర్చుని ఆలోచిస్తూ ఉన్నారు. బర్‌జోర్‌సింగు మరణించినందుకు పూర్తిగా తానే బాధ్యుడనని ఆయనకు అనిపించింది. ఉన్నట్టుండి ఆయన ఒక్కసారిగా తలయెత్తి మీర్‌సాహబ్‌తో అన్నారు: "అయ్యా! తమరు నన్ను మన్నిస్తానంటే నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను."

"అలాగే, ఇందులో మన్నించడం, మన్నించక పోవడమేముంది? నిర్భయంగా అడుగు" అన్నారు మీర్‌సాహబ్.

"తమరు నా స్థితిలో ఉంటే ఏమి చేశేవారు?" మీర్‌సాహబ్ ముఖంమీద చిరునవ్వు మాయమయింది. "చాలా కఠినమైన ప్రశ్న వేశావోయ్ జ్వాలా బాబూ! నేను ఏంచేసి ఉండేవాణ్ణో చెప్పలేను. కాని

నీవు చేసిన పని మాత్రం బహుశా నేను చేసేవాణ్ణి కాదు. లేకుంటే సరిగ్గా నీవు చేసిందే నేను కూడా చేసి ఉండేవాణ్ణేమో చెప్పడం కష్టం. అందుకనే ఇది చాలా కఠినమైన ప్రశ్న అని చెప్పాను.''

ఇప్పుడు జ్వాలా ప్రసాద్ అన్నారు: ''లేదండీ, ఇప్పుడు నాకు తెలిసి పోయింది. నేను చేసిన పని మీరు చేసేవారుగారు. మా మామ రామసహాయ్ కూడా దాదాపు ఇదే సలహా ఇచ్చారు నాకు. కాబట్టి నేనే తప్పటడుగు వేశానని నాకు అనిపిస్తూ ఉన్నది.'' జ్వాలా ప్రసాద్ మాటలు చాలా దీనంగా ఉన్నాయి: ''న్యాయానికీ, సత్యానికీ సరిహద్దులు లేవనీ, ఆ విషయంలో దయాదాక్షిణ్యాలకు ఏమీ ఆస్కారంలేదనీ నేను అనుకుంటూ వచ్చాను. కాని అలా అనుకోడం తప్పని ఇప్పుడు గమనిస్తున్నాను.''

దీనంగా జ్వాలా ప్రసాద్ చెప్పిన ఈ మాటలకు మీర్ సాహబ్ కరిగి పోయారు: ''లేదు జ్వాలాబాబూ! దయాదాక్షిణ్యాలనూ, వ్యక్తిగత భావనలనూ సమర్థించాలని నా ఆశయంకాదు. మానవుడు ఈ భావనా పరిధి నధిగమించ గలిగితే అతడు మహోన్నతుడనే నా అభిప్రాయం. కాని సామాన్యంగా మానవుడయిన వాడెవ్వడూ వాటిని దాటలేడనే నా నమ్మకం.'' సందర్భం మారుస్తూ మీర్‌సాహబ్ అన్నారు: ''అదంతా వదిలేయ్ అయిందేమో అయింది. దాన్ని ఎవ్వరూ ఆపగలిగేవాళ్ళు కారు. అందువల్ల దాన్ని గురించి ఇక మాట్లాడడం అనవసరం. ఏవీ కాగితాలు బయటికి తియ్యి, సంతకాలు పెట్టేస్తాను.''

జ్వాలా ప్రసాద్ ఇంటికి వెళ్లేసరికి జైదేయి అడిగింది: ''అదేమిటి జ్వాలా బాబూ! చాలా విచారంగా కనిపిస్తున్నారు. ఇక్కడి నుంచి వెళ్లేప్పుడు సంతోషగానే కనిపించారే!''

జ్వాలా ప్రసాద్ నిరుత్సాహంగా అన్నారు: ''వదినగారు! తహసీల్దారు గారి దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ ఠాకుర్ గజరాజసింగు ఒక దుర్వార్త వినిపించారు. మొన్నరాత్రి విధనూలో బర్‌జోర్‌సింగు ఆత్మహత్య చేసుకున్నాడట.''

''ఆత్మహత్య చేసుకున్నాడా? బర్‌జోర్!'' జైదేయి ఆశ్చర్యంతో అడిగింది. కొంచెంసేపు ఆగి ఆమె అన్నది: ''పోనియ్యండి. తన నేరానికి తానే శిక్ష విధించుకున్నాడు. కాని జ్వాలా బాబూ! నాకు కాకుండా పోయింది మాత్రం నాకు మళ్ళీ దక్కదు కదా!''

జ్వాలా ప్రసాద్ జైదేయి అన్నమాటకు సమాధానం చెప్పలేదు. బహుశా దానికి సమాధానమే లేదేమో! జ్వాలా ప్రసాద్ తన మానసిక బాధలోనే చిక్కుకొని ఉన్నారు. బర్‌జోర్‌సింగు భార్య, పిల్లల సంగతి ఏమవుతుందా అని ఆయన విచార పడుతున్నారు. జైదేయికి వచ్చిన ఆపద నిజంగా ఒక ఆపద కాదు. ఆమెకు లక్షలుచేసే ఆస్థి ఉంది. ఆ ఆస్థి మీద ఆమెకు పూర్తిగా అధికారం ఉంది. ఆమె నూరు వరహాలు ఇచ్చే స్థితిలో ఉంది. కాని పాపం బర్‌జోర్‌సింగు భార్య స్థితి ఏమిటి? ఆమె తన అన్న ఇంటిలో తల దాచుకొనేందుకు వెళ్ళింది. ఆమె పిల్లలనాథలైపోయారు.

అయిదు

జ్వాలా ప్రసాద్ తన భార్యను పుట్టికి తండ్రి, బాబాయిగారి దగ్గరికి ఫతేపుర్ పంపకుండా తన మామగారింటికి రాజపురా పంపారు. మున్షీ శివలాల్ దీన్ని గురించి మరోలా అనుకోలేదు, కాని మున్షీ రాధేలాల్ చాలా గొడవచేశారు. ఆయన మున్షీ శివలాల్‌తో అన్నారు: "అన్నయ్యా! అమ్మాయి పురుడు పోసుకునేందుకూ మన ఇంట్లో ఏర్పాటు చేయలేక పోయామా? లోకులు విని ఏమనుకుంటారు? కుర్రవాడు పెద్ద ఉద్యోగస్థుడైనాడంటే తండ్రినీ, బాబాయినీ, పెద్దవాళ్ళనందర్నీ మరిచి పొమ్మనా దాని అర్థం?"

మున్షీ శివలాల్ తర్కించడం ఇష్టంలేక అన్నారు: "లేదు రాధూ! అసలు విషయ మేమంటే ఘాటంపూర్ కంటే రాజపురా దగ్గర అవుతుంది. అదికాక, మున్షీ రామసహాయ్ స్వయంగా వచ్చి అమ్మాయిని తీసుకు వెళ్ళారు. అక్కడ ఉపచారం చెయ్యడానికి చాలామంది నౌకర్లుకూడా ఉన్నారు. కనుక నాకిందులో పొరపాటేమీ కనిపించడం లేదు."

"బాగా ఉంది నీవు చెప్పేది పెదనాన్నా! మరి మనం ఇక్కడ ఉండి ప్రయోజనం? ఇక్కడ మనం చూచినట్టుగా నౌకర్లు చూస్తారా?" అన్నాడు రాధేలాల్ పెద్ద కుమారుడు రామలాల్.

రామలాల్ అన్నమాట శివలాల్‌కు నచ్చలేదు. ఆ విషయం రాధేలాల్ గమనించారు. ఆ మాటనే మరో విధంగా అన్నారాయన: "రామూ చెప్పేదికూడా నిజమే. ఇక్కడ మనమంతా ఉన్నందువల్ల ప్రయోజన మేముంది? పురుడు వచ్చిన తర్వాతనైనా సరే రెండు మూడు నెల్లపాటు అమ్మాయినిక్కడ ఉంచుకొనే ఏర్పాటన్నా చెయ్యి."

మున్షీ శివలాల్‌కు హుక్కా తయారుచేసి తీసుకుని వచ్చిన ఛింకీ అక్కడనే నిలబడి ఈ సంభాషణ అంతా వింటూ ఉన్నది. "అవును, అమ్మాయిగారు ఇక్కడనుంచి వెళ్ళి ఇప్పటికి రెండు సంవత్సరాలయింది. రెండు మూడు నెల్లపాటు మళ్ళీ పిలిపించడం మంచిదే." మళ్ళీ కొంచెం సేపు ఆలోచించినట్టే ఆలోచించి అన్నది ఛింకీ. "కాని అయ్యగారూ! మీరే ఒకసారి ఘాటంపూర్ వెళ్ళి అబ్బాయిగారిని చూచి రాకూడదూ! పిల్లవాడి మీద అపేక్ష ఉన్నట్లుండి ఒక్కసారి ఎలా పోతుంది బాబయ్యా! మీరే వెళ్ళి అమ్మాయిగారిని తీసుకురండి."

మున్షీ శివలాల్ హుక్కా తాగుతూ అన్నారు: "అవును, నీవన్న మాట బాగానే ఉంది. జ్వాలాను చూచి కూడా చాలా రోజులయింది. వచ్చే నెల ఘాటంపూరు వెళ్ళి అక్కడ నుండి రాజపురా వెళ్ళుతాను." కొంచెంసేపాగి ఆయన ఘసీటూ శరీర పరిసితిని గురించి ఛింకీ నడిగారు.

ప్రసంగం మారిందని గమనించి మున్షీ రాధేలాల్, రామలాల్ ఇద్దరూ అక్కడినుండి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత ఛింకీ కండ్లనీళ్ళ పర్యంతం అవుతూ అన్నది: "ఏం చెప్పను బాబయ్యా! ఇప్పుడు మంచం మీదినుంచి కూడా లేవలేక పోతున్నారు. మూడు రోజులనుంచి జ్వరం ఎక్కువగాఉంది. భగవంతుడు ఆయన్ని ఎంత త్వరగా తీసుకువెళ్ళితే అంత మంచిది. ఇలా బతికి ఉండేకంటే చని పోవడమే హాయిగా ఉంటుంది. ఆయన అవస్థ చూడలేకుండా ఉన్నాను. నిన్ననే మిమ్మల్ని గురించి అడుగుతున్నారు."

"అయితే ఇప్పుడే కొంచెం సేపట్లో వస్తాను. నీవు ఇంటికి వెళ్ళు. నేను వైద్యుణ్ణి పిల్చుకు వస్తాను."

"ఆ వైద్యుడూ సరే, నేనూ సరే, ఇప్పటికి పదిసార్లు మందుమార్చాడు. నాకు విసుగువేస్తూ ఉంది. మొన్నటినుంచి ఆయన మందు కూడా తీసుకోడంలేదు." అంటూ ఛింకీ వెళ్ళిపోయింది.

శివలాల్ కొంచెం సేపటివరకూ చీకట్లు కమ్ముతున్న రాత్రిని పరిశీలిస్తూ ఉన్నారు. ఆ తర్వాత ఆయన బలవంతంగా లేచి నిలబడ్డారు. ఇటీవల కొద్ది రోజులనుండి మున్షీ శివలాల్ కొంచెం అస్వస్థతగా ఉంటున్నారు. ఘసీటూ దీర్ఘవ్యాధితో బాధ పడడంవల్ల ఆయన దినచర్య కూడా మారిపోయింది. సాయంత్రం తాగే సారా ఆయన ఒంటరిగానే తాగవలసి వస్తున్నది. అందువల్ల దాని మోతాదు కొంచెం ఎక్కువయింది. తరచుగా ఆయన తాగుతూ తాగుతూనే స్పృహ తప్పి పడిపోవడం కూడా జరుగుతూ ఉంది. అందువల్ల ఆయనకు నీరసంగా ఉంటున్నది. ఛింకీ తనకు వీలయినంతవరకూ ఆయన సంగతి విచారి స్తూనే ఉన్నది. కాని ఘసీటూ జబ్బు పడడం వల్ల ఛింకీకి ఎక్కువ కాలం ఘసీటూకు ఉపచారం చెయ్యడంతోనే సరిపోతున్నది.

అనుకోకుండా ఘసీటూ చనిపోవడం మున్షీ శివలాల్‌కు ఒక రకంగా బాధ కలిగించింది. ఇంతవరకూ, ఆయన మృత్యువును గురించి దీర్ఘంగా ఆలోచించలేదు. కాని ఆ రోజునుండి చావంటే ఆయన మనస్సులో ఏదో తీవ్రమైన భయం ఏర్పడింది. తన శరీరంకూడా త్వరత్వరగా బలహీనమై పోతున్నదని ఆయనకు తోచింది. ఈ భయాన్ని మరిచి పోయేందుకు త్వరగా ఘాటంపూర్ వెళ్ళాలని ఆయన తొందరపడు తున్నారు.

ఛింకీ ఘసీటూను పోగొట్టుకుంది. మున్షీ శివలాల్ ఆరోగ్యం కూడా దిగజారి పోతూ ఉండడం వల్ల దానికి మరీ దిగులుగా ఉంది. ఘసీటూకు సక్రమంగా అంత్యక్రియలు చేసి మున్షీ శివలాల్‌గారి ఇంట్లోనే అది ఉండడం మొదలు పెట్టింది. ఒకరోజది శివలాల్‌ను అడిగింది: "మరి చిన్నబాబు దగ్గరికి వెళ్ళడం ఎప్పుడు ఖాయం చేశారు? అమ్మాయిగారికి కాన్పు వచ్చింది కాబట్టి ఇక ఆమెను ఘాటంపూర్ తీసుకు రావచ్చు."

"అవును, ఉత్తరం కూడా వచ్చింది. అమ్మాయి ఒక వారం రోజుల్లో రాజపురానుండి ఘాటంపూర్ వచ్చేస్తుందిట. వచ్చే సోమవారమో, మంగళవారమో నేను బయలుదేరి వెళ్ళుదామనుకుంటున్నాను."

"తొందరగా మీరు ఇక్కడినుండి వెళ్ళడం మంచిదని నేను కూడా చెప్పాలనుకుంటున్నాను. నా మాట మీరు వినదలచుకుంటే నన్ను కూడా మీతో ఘాటంపూర్ తీసుకు వెళ్ళండి."

మున్షీ శివలాల్‌కు ఆశ్చర్యం వేసింది. "నీవు కూడా ఘాటంపూర్ వచ్చేస్తావా? ఎందుకలా?"

"ఇక్కడుండి చేసేదేముంది బాబూ! ఆయనేమో స్వర్గం వెళ్ళారు. మీరేమో ఘాటంపూర్ వెళ్ళుతున్నారు. నన్నడిగితే మీరు మళ్ళీ ఇక్కడికి తిరిగి రావల్సిన అవసరం కూడా లేదు. మీరిక మీ అబ్బాయి దగ్గర్నే ఉండడం మంచిదని నా ఉద్దేశం. నేను కూడా ఎప్పుడూ జ్వాలా, భీఖూ ఇద్దరూ నాపిల్లలని అనుకుంటూ ఉంటాను. వాళ్ళతోనే నా జీవితం తెల్లవారి పోతుంది. ఇక్కడ నాకింక ఎవరున్నారు?"

ఛింకీ చెప్పిన మాటల్లో సారం లేకపోలేదని మున్షీ శివలాల్‌కు తోచింది: "నీవు చెప్పేమాట నిజమే. అలాగే నీవుకూడా ప్రయాణం కా. సోమవారం వెళ్ళుదాం."

మున్షీ శివలాల్‌తో పాటు ఛింకీ కూడా వెళ్ళుతుందనే సంగతి వినగానే మున్షీ రాధేలాల్ తల తిరిగి పోయింది. అయితే అన్నయ్య ఇక ఎప్పటికీ తన కొడుకుదగ్గర ఉండడానికే వెళ్ళుతున్నారా? ఆయన తన మనస్సులో ఈ ప్రశ్నకు సమాధానం వెదుకుతున్నారు. ఈ వార్తతో మున్షీ రాధేలాల్ కుటుంబంలో కూడా ఒక విధమైన అలజడి బయలుదేరింది. శనివారం సాయంత్రమే అవకాశం కల్పించుకుని రాధేలాల్ శివలాల్‌తో అన్నారు: "అన్నయ్యా, ఛింకీని గూడా నీతో తీసుకెళితే ఇంట్లో పరిస్థితి చెడిపోతుంది. దాన్ని నీవనవసరంగా నీతో తీసుకెళుతున్నావు. ఇంతకూ రెండు మూడు నెలల్లో నీవు అమ్మాయిని తీసుకుని వచ్చేస్తావు గదా!"

మున్షీ శివలాల్ కొంచెం విసుక్కుంటూ అన్నారు: "ఏం, ఇంట్లో అన్నీ చూచుకోడానికి మీ ఆవిడ ఉందిగదా! రామూ భార్యకూడా ఉంది. నా సంగతి చూచేవాండ్లెవరైనా ఉండద్దా అని ఛింకీని నాకూడా తీసుకెళ్ళుతున్నాను."

"అక్కడ జ్వాలా భార్యలేదూ! అదికాక నెలా రెండునెల్లకు నీవు మళ్ళీ వచ్చేస్తున్నావు కదా! వచ్చేప్పుడు జ్వాలా భార్యనుకూడా తీసుకొనే వస్తావాయె! ఈలోగా అమ్మాయి నీకు కావలసినవన్నీ బాగానే చూడగలదు."

రాధేలాల్ రెండుసార్లు నెలా రెండు నెలల్లో అమ్మాయిని తీసుకొని రావడం సంగతి ఎత్తేసరికి మున్షీ శివలాల్‌కు కోపం వచ్చింది: "జ్వాలా

భార్య పెద్ద ఆఫీసరు భార్య. అదీకాక చంటిపిల్లవాడు కూడాను. మనకందరికీ చాకిరి చెయ్యడానికా దానికి భగవంతుడు తహసీల్దారు భార్య అయే అదృష్టం ఇచ్చింది. వీల్లేదు రాధా! అమ్మాయి నాకు ఉపచారం చేయడం నాకు మనస్కరించదు. భగవంతుడి దయవల్ల ఇప్పుడు జ్వాలాకు మంచి హోదా లభించింది. వాడికీ, వాడి భార్యకూ తగిన గౌరవం, ప్రతిష్ఠ కూడా ఉండాలి. అదికాక నాకు కూడా వయస్సు మళ్ళింది. నా మనస్సుకు హాయిగా ఉంటే సంవత్సరమో లేకుంటే ఆరు నెల్లయినా అక్కడ ఉండిపోవచ్చు. ప్రస్తుతం అనుకోడం మాత్రం నెలా రెండు నెలలలే అనుకుంటున్నాను. ఆ సంగతి అక్కడికి వెళ్ళిన తర్వాత ఆలోచిస్తాను. కడుపునబుట్టిన పిల్లవాడే కాని పరాయి వాడేం కాదుగా!''

మున్షీ శివలాల్‌కు మళ్ళీ ఫతేపూర్ తిరిగి రావాలని లేదని రాధేలాల్ గమనించారు. రాధేలాల్ కుటుంబం పెద్దది. ఖర్చులు కూడా దానికి తగ్గట్టు హెచ్చుగానే ఉంటాయి. రాధేలాల్‌కు నలుగురు కొడుకులు- రామలాల్, శ్యామలాల్, కిషన్‌లాల్, బిషన్‌లాల్. మొదటి ఇద్దరూ చదువు మానేశారు. శ్యామలాల్‌కు వివాహం కూడా అయింది. కిషన్ లాల్, బిషన్‌లాల్ ఇంకా చదువుకుంటున్నారు. రామలాల్ మిడిల్ ప్యాసయి కరణంపని కోసం ప్రయత్నిస్తున్నాడు. శ్యామలాల్ మూడు సంవత్సరాలు వరసగా మిడిల్ తప్పి వీధుల వెంబడి తిరగడం ఆరంభించాడు. మున్షీ శివలాల్ కొంతడబ్బు కూడబెట్టి పదిగొర్ల పొలం కొన్నారు. శ్యామలాల్ ఆ పొలం పని చూస్తూ ఉంటాడు. కాని శ్యామలాల్ కష్టించి పనిచేసే రకం కాదు. అందువల్ల ఆ పొలం మీద శిస్తు చెల్లించేందుకు సరిపోయే అంత వరుమానం కూడ రావడంలేదు.

రాధేలాల్ ముఖం వేలాడేసి అన్నారు: "అన్నయ్యా! ఇంట్లో సంగతులన్నీ నీకు తెలుసుగదా! నీవు వెళ్ళిన తర్వాత జ్వాలా ప్రతి నెలా పంపించే ఇరవై రూపాయలు కూడ పంపించడం మానెయ్యడు గదా?''

మున్షీ శివలాల్ నవ్వుతూ సమాధానం చెప్పారు: "లేదు రాధా! నీకా దిగులేమీ అక్కర్లేదు. నేను వాడికిచెప్పి నెలకు పది రూపాయలు నీకు పంపించే ఏర్పాటు చేస్తాను. ఎప్పుడయినా ఇంకా ఏదయినా అవసర మయితే నాకు కబురు చెయ్యి. నేను సర్దగలిగింది నేనూ పంపిస్తాను. రామూనుకూడా కరణంపని కుదరకపోతే జిల్లాబోర్డు స్కూల్లో చేరమను.

సలామతుల్లాతో నేను మాట్లాడాను. శ్యామూకు తెలిసీ తెలియంది చెప్పి కష్టపడి పని చెయ్యమని చెప్పు. మన పొలం పక్కనే అయిదు గొర్ల పొలం అమ్మకానికి వస్తున్నది. అదికొనే ఏర్పాటు చెయ్యి. డబ్బు సంగతి నేను చూస్తాను. అన్నట్టు శ్యామూకు ఎక్కడన్నా పెండ్లి సంబంధం వస్తే వచ్చే వేసవిలో చేసేసేయి. బహూశా పెండ్లయితే వాడి అలవాట్లు బాగు పడవచ్చు.''

శివలాల్ చెప్పిన మాటలకు రాధేలాల్‌కు కొంచెం ధైర్యం వచ్చింది. ఆయన మనస్సు తేలిక పడింది. కాని ముందు ముందు జీవిత విధానంలో కొన్ని మార్పులు వచ్చే సూచనలు ఆయనకు కనిపించాయి. ఆయనకు తన పిల్లల పనికిరానితనాన్ని తలుచుకుంటే వాళ్ళమీద కోపం వస్తూ ఉంది. కాని దానికంటే కూడా జ్వాలా ప్రసాద్, అతని భార్యకు అబ్బిన అదృష్టాన్ని తలుచుకొంటే కలిగే అసూయ ఎక్కువగా ఉంది. మున్షీ శివలాల్‌ను అంతకంటే నొప్పించడంవల్ల ప్రయోజనం లేదని ఆయన గమనించారు. తన అన్నగారి ఐశ్వర్యాన్ని చూచి అతని మనస్సులో ద్వేషభావం ఏర్పడింది. కాని ఆ ద్వేషాన్ని కప్పేస్తూ ఉంది ఆయనలో ఏర్పడిన భయం.

ఘాటంపూర్ వెళ్ళేసరికి మున్షీ శివలాల్‌కు స్వర్గంలో ఉన్నట్టని పించింది. జ్వాలా ప్రసాద్ పేరుకు డిప్యూటీ తహసీల్దారనే కాని నిజానికి ఆయన అధికారం, హోదా, దర్జా అన్నీకూడా తహసీల్దారువే. జ్వాలా ప్రసాద్ తండ్రి అయినందువల్ల మున్షీ శివలాల్‌ను అందరూ గౌరవిస్తూ ఉండేవాళ్ళు. ఆయన అన్నమాట చలామణీ అయ్యేది. అక్కడి వాళ్ళంతా ఆయనను సలహా అడుగుతూ ఉండేవాండ్లు. ఆయన చెప్పిన సలహాలకు చాలా విలువ కూడా ఉంటూండేది. ఇంట్లో అన్ని వస్తువులు పుష్కలంగా ఉండేవి. దేనికీ కొదువ అనేది అనిపించేది కాదు. తరుచుగా ఆయన మీర్‌సాహబ్‌తో చదరంగం ఆడడానికి వెళుతూ ఉండేవాడు. ఆయనకు మీర్‌సాహబ్‌తో గాఢమైత్రి ఏర్పడింది.

కాని ఒక విషయం మాత్రం ఆయన గమనించారు. అందు కాయనకు కొంచెం విచారం కలిగినప్పటికీ లోలోపల ఆనందం, గర్వం అనుభవించా రాయన. అదేమిటంటే జ్వాలా ప్రసాద్ చాల నిజాయితీగా, ముక్కుకు సూటిగా తన కర్తవ్యాన్ని నెరవేరుస్తారు. తాను స్వయంగా అంత

సచ్చరిత్రుడు కాకపోయినా, ఇతరుల గుణగణాలను గౌరవించగల సామర్థ్యం ఆయనలో ఉంది. పరిస్థితుల మార్పువల్ల ఆయన ఆరోగ్యం మునుపటి వలెకాక ఇప్పుడు కొంచెం మెరుగు పడుతూ ఉన్నట్టు ఆయనకు తోచింది. ఆయన తనకండ్ల యెదుట ఒక నూతన జీవితం, నూతనో త్సాహం చూస్తున్నారు. ఆయన పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళవుతున్నారు. వాళ్ళకు దేనికీ కొరవ లేకుండా సమృద్ధిగా జీవితం గడుస్తున్నది.

చలికాలం అయిపోయింది. పంట మళ్ళీ కోతకు వస్తున్నది. మధ్యాహ్న సమయంలో మున్షీ శివలాల్ ముందు గదిలో కూర్చుని హుక్కా తాగు తున్నారు. ఇంతలో ఎవరో పిలిచారు : "జ్వాలాబాబూ!"

మున్షీ శివలాల్ బయటికి తొంగిచూచారు. ఠాకుర్ గజరాజసింగు ఎదురుగా నిలబడి ఉన్నారు. మున్షీ శివలాల్ ఇంతవరకూ ఠాకుర్ గజరాజసింగును కలుసుకోలేదు. బర్‌జోర్‌సింగు విషయంలో జ్వాలా ప్రసాద్‌కూ, గజరాజసింగుకూ మధ్య ఏర్పడిన మనోమాలిన్యం ఇంత వరకూ పోలేదు. అక్కడ ఎదురుగా నిలబడిఉన్న వ్యక్తి సామాన్యుడు కాదని మాత్రం మున్షీ శివలాల్ పసిగట్టారు. "రండి, కూర్చోండి. జ్వాలా క్యాంపుకు వెళ్ళాడు. రేపు సాయంత్రానికల్లా రావచ్చు. ఏదయినా చెప్పమంటే చెప్తాను."

"ఠాకుర్ గజరాజసింగు ఏదో ముఖ్యమైన పనిమీద వచ్చి వెళ్ళారని చెప్పండి. ఎల్లుండి ఉదయం మళ్ళీ నేను వస్తాను. ఈ మాట చెప్తే చాలు." అనిచెప్పి ఠాకుర్ గజరాజసింగు అక్కడినుండి వెళ్ళడానికి సిద్ధమయినారు. కాని ఆయన కాళ్ళు ముందుకు సాగలేదు. అవి వాటంతట అవే ఆగిపోయాయి. ఆయన వెనక్కితిరిగి మున్షీ శివలాల్‌ను దగ్గరిగా చూచారు, "మిమ్మల్ని మొదటిసారి చూస్తున్నాను. మీరు జ్వాలా ప్రసాద్ తండ్రిగారనుకుంటాను."

మున్షీ శివలాల్ నవ్వుతూ సమాధానం చెప్పారు: "అవును, మీరు సరిగానే ఊహించారు. జ్వాలా ప్రసాద్ మా అబ్బాయే. ఏదన్నా ముఖ్యమైన విషయముంటే నాకు చెప్పండి. మా వాడు వచ్చాక నేను వాడికి చెప్తాను."

"మీకు అనవసరంగా శ్రమ ఇవ్వడం నాకు ఇష్టం లేదు. నేనే స్వయంగా వచ్చి ఆయన్ని కలుసుకుంటాను." అని మళ్ళీ కొంచెం ఆగి

అన్నారు: "మీరు చాలా అనుభవజ్ఞులు. మీకు విషయమంతా వివరంగా చెప్పడంలో తప్పులేదను కుంటాను. నేను చాలా ధర్మసందేహంలో పడిపోయాను. దీనికి మీరేదయినా మార్గం చూపించగలరను కుంటాను."

గజరాజసింగు చెప్పిన వృత్తాంతమంతా విన్నతర్వాత మున్షీ శివలాల్ మనస్సులో బర్‌జోర్‌సింగు కుటుంబంమీద సానుభూతి ఏర్పడింది. "మీరు నిశ్చింతగా వెళ్ళండి ఠాకుర్‌గారూ! జ్వాలాకు నేనన్ని విషయాలూ వివరంగా చెప్తాను. మా జ్వాలా చేయగలిగిందంతా తప్పకుండా చేస్తాడు. ఈ విషయంలో మీకేమీ సందేహమక్కర్లేదు. దానికి మీరు నా మాట మీద ఆధారపడి ఉండవచ్చు."

మరుసటిరోజు జ్వాలా ప్రసాద్ క్యాంపునుండి తిరిగి వచ్చారు. మున్షీ శివలాల్ ఆయనతో చెప్పారు: "బాబూ! నిన్న మధ్యాహ్నం ఠాకుర్ గజరాజసింగు నీకోసం వచ్చారు."

జ్వాలా ప్రసాద్ ఆశ్చర్యపడుతూ అడిగారు: "ఠాకుర్ గజరాజసింగు వచ్చారా, నాకోసం? ఏమన్నా చెప్పి వెళ్ళారా?"

"అవును, బర్‌జోర్‌సింగు పొలాన్ని గురించి నీతో మాట్లాడడానికి వచ్చారు. పంట కోతకు వచ్చిఉంది. కాని ఫలసాయంతో సహాపొలం జైదేయి పేరిట కోర్టు వ్రాసిఇచ్చింది. జైదేయి గుమాస్తా లచ్చీరాం పొలాన్ని స్వాధీనం చేసుకొనేందుకు దరఖాస్తు పెట్టాడని కూడా చెప్పారు. నిండుపంట సిద్ధంగా ఉంది. నీ సహాయంకోసం వచ్చారు."

జ్వాలా ప్రసాద్ ముఖంలో కొద్దిగా విచారం కనిపించింది. తానేమి చేయగలననే దైన్యం కనబరుస్తూ ఆయన అన్నారు: "నేనేం చేయగలను, నాన్నా? నంబరుదారు భార్య పేరిట పొలంవ్రాసి ఇచ్చినప్పుడు, పొలాన్ని ఆమె స్వాధీన పరుచుకోక మానుతుందా? ఆయనకు నేను చేయగలిగిన సాయమేమిటో మీరే చెప్పండి."

"బర్‌జోర్‌సింగు భార్య నంబరుదారు భార్యకు తనంతట తానే పొలాన్ని స్వాధీనం చేసేటట్టూ, ఈ పంటమాత్రం బర్‌జోర్‌సింగు భార్య అనుభవించేటట్టూ, నీవు ఏర్పాటు చేయవచ్చు. దానితో వ్యవహారం సులభంగా పరిష్కారమై పోతుందని నేననుకుంటాను."

"బర్‌జోర్ సింగు భార్య ఘాటంపూర్ వచ్చిందా?" అని అడిగారు జ్వాలా ప్రసాద్.

"అవును, పిల్లల్ని కూడా తీసుకుని ఆమె గజరాజసింగుగారి ఇంటికి వచ్చేసింది. గజరాజసింగు రేపు ఉదయం మళ్ళీ నిన్ను కలుసుకొనేందుకు వస్తానని చెప్పారు." కొంచెంసేపు ఆగి శివలాల్ మళ్ళీ అన్నారు: "సాధ్యమైనంత వరకూ వాళ్ళకు సహాయం చెయ్యడానికి ప్రయత్నించు. పాపం దిక్కులేని వాళ్ళయి పోయినారు."

జ్వాలా ప్రసాద్ చాలా నిరుత్సాహంగా సమాధానం చెప్పారు: "అలాగే చూస్తాను. ఏదో రకంగా సహాయం చెయ్యడానికే ప్రయత్నిస్తాను. మీరు చెప్పిన పద్ధతికి జైదేయి ఒప్పుకున్నా ఒప్పుకోవచ్చు."

సాయంత్రం కాకమునుపే జ్వాలా ప్రసాద్ శివపురాకు బయలుదేరి వెళ్ళారు. ఆయన శివపురా వెళ్ళేసరికి చీకటి పడుతూ ఉంది. ప్రభుదయాల్‌గారి ఇంటి వాకిట్లో ఉన్న రాధాకృష్ణ మందిరంలో పూజ జరుగుతూ ఉన్నది. అక్కడ కోలాహలంమంతా మునుపటి లాగానే ఉంది. జైదేయిగారి పరిచారకులు జ్వాలా ప్రసాద్‌కు నమస్కారం చేసి ఆయన్ని లోపలికి రమ్మని ఆహ్వానించి గదిలో కూర్చోబెట్టారు. ఆతర్వాత జైదేయిగారికి జ్వాలా ప్రసాద్ వచ్చిన సంగతి కబురు చేశారు. జ్వాలా ప్రసాద్ వచ్చిన సంగతి అంతకుముందే ఇంటికి వెళ్ళిపోయిన గుమాస్తా లచ్చీరాంకు కూడా తెలియ జేశారు.

జైదేయి జ్వాలా ప్రసాద్‌ను తన లోపల గదిలోకి రమ్మని కబురుచేసింది. ఆమె లేచి జ్వాలా ప్రసాద్‌ను ఆహ్వానించింది: "మీరు రావడం నాకెంతో మహాభాగ్యంగా ఉంది జ్వాలాబాబూ! రెండు మూడు సార్లు మీకోసం నేను కబురు చేశాను. కాని మీరు ఆఫీసర్లుగదా! ఎప్పుడు విచారించినా క్యాంపులో ఉన్నారనే చెప్పేవారు." అంటూ జైదేయి నవ్వింది.

జ్వాలా ప్రసాద్‌కూడా నవ్వుతూ అన్నారు: "ఏం చెప్పను వదినా! ఈ పనితో బొత్తుగా తీరడంలేదు. కాసేపు తీరికగా ఇంట్లో కూర్చొనేందుకు కూడా వీలవడంలేదు. నా పని చూచుకుంటూ మీర్‌సాహబ్‌గారి పని కూడా చూడాల్సి వస్తున్నది. నిన్న రాత్రి క్యాంపునుండి వచ్చాను. వదినెగార్ని కలుసుకుని చాలా రోజులయిందని తీరిక చేసుకుని ఇప్పుడిలా వచ్చాను."

"నామీద మీకెంత కనికరం జ్వాలాబాబూ! ఇక్కడ నాకు మీరుతప్ప మరి యెవ్వరూ లేరు. కూర్చోండి, నిలుచునే మాట్లాడుతున్నారు. నేను

మీ యింటికి కూడా వెళ్ళి వచ్చాను. మీ అబ్బాయిని చూస్తే ఎంత ముద్దొస్తున్నదో! మా చెల్లాయి కులాసా ?"

జైదేయి యమునను చెల్లాయి అని అంటుంది. ఆ విషయం జ్వాలా ప్రసాద్ కు తెలుసు. "ఆ కులాసాగానే ఉంది. మిమ్మల్ని అడిగానని చెప్పమన్నది." కొంచెం ఆగి ఆయన అన్నారు: "వదినగారూ! మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. మిమ్మల్ని ఒక విషయం అడగడానికి వచ్చాను."

అప్పుడాయన అడిగారు: "వదినా! బర్ జోర్ పొలం మీరు స్వాధీనం చేసుకోబోతున్నారని విన్నాను."

"అవును జ్వాలాబాబూ! లచ్చీరాం రాతకోతలన్నీ పూర్తి చేసేశాడు. రెండు మూడు రోజుల్లో ఆ పొలాన్ని స్వాధీనం చేసుకోవాలి. ఈ విషయం చాలా రోజులనుంచి అలాగే పడిఉంది."

"వదినా! నేనొక విషయం చెప్పేందుకు వచ్చాను. బర్ జోర్ సింగు భార్య, పిల్లలు ప్రస్తుతం ఇక్కడనే ఉన్నారు. పూటకాపూట గడవడం కష్టంగా ఉంది వాళ్ళకు. ఈసారి పంట వాళ్ళను కోసుకోనిస్తే వాళ్ళే ఆ పొలం నీకు ఒప్ప చెప్పేస్తారు. కనుక ఆ పొలాన్ని అప్పుడే స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నం మానెయ్యమని లచ్చీరాంకు చెప్పు."

జైదేయి ముఖం బిగుసుకు పోయింది. ఆమె తల వంచుకొని అన్నది: "జ్వాలాబాబూ! ఎవరి అదృష్టం వాళ్ళది. ఈ ప్రపంచంలో పేదసాదలెంతమందో ఉన్నారు. ఎంతమంది కష్టాలని మనం తీర్చగలం? ఆ పొలంమీద నాకు అధికారం ఉందనే మాట మీరు మాత్రం కాదనగలరా?"

జ్వాలా ప్రసాద్ అన్నారు: "నీవు చెప్పిన మాట నిజమే వదినా! ఆ పొలం మీదనే కాదు, ఆ పొలంలో పండిన పంటమీద కూడా మీకే అధికారం ఉంది. కాని కష్టపడి ఆ పంట పండించింది బర్ జోర్ సింగు. చట్టం కాదనదు. కాని నేను దయా పరోపకారాన్ని పురస్కరించుకొని మీతో ఈ మాట చెప్పాలని వచ్చాను."

జైదేయి ముఖంలో మళ్ళీ చిరునవ్వు వచ్చింది: "జ్వాలా బాబూ! మీరెంత మంచివారో అంత గొప్పవారు కూడాను. ఈ ప్రయత్నం మానెయ్యమని లచ్చీరాంతో చెప్పేయండి. మీ మాట నేను కాదన

గలనా?'' తర్వాత కొంత సేపటికి ఆమె అన్నది: "జ్వాలా బాబూ! భోంచేసి వెళ్ళండి. నేను మీకోసం స్వయంగా వంట చేస్తాను. ఇప్పుడే అయిపోతుంది. అందాకా కొంచెం విశ్రాంతిగా కూర్చోండి.''

"ఈ సారి నన్ను క్షమించాలి వదినా! నాన్నగారికి నేను చెప్పి రాలేదు. ఆయన నేను వెళ్ళేవరకు భోంచెయ్యరు. ఈ సారి వచ్చేప్పుడు ఇంట్లో చెప్పేసి వస్తాను. నీ కోరిక ప్రకారం నీ చేతి వంట తినే వెళ్తాను.''

"అలాగే జ్వాలాబాబూ! కాని కొంచెం ఫలహారం మాత్రం చేసి వెళ్ళండి.''

ఫలహారంచేసి జ్వాలా ప్రసాద్ బయటికి వచ్చేసరికి లచ్చిరాం పంచలో కూర్చుని జ్వాలా ప్రసాద్ కోసం ఎదురు చూస్తున్నాడు. జ్వాలా ప్రసాద్ బయటికి రాగానే అతను లేచి నిలబడ్డాడు: "అయ్యగారేదో పనిమీద దయచేశారే?''

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: "నీవు సరిగ్గా సమయానికి వచ్చావోయ్ లచ్చిరాం! రెండు మూడు రోజుల్లో నీవు బర్జోర్‌సింగు పొలాన్ని స్వాధీన పరుచుకొనేందుకు ఏర్పాటు చేస్తున్నావని విన్నాను.''

"అవునండీ, జైదేయమ్మగారే చెయ్యమని చెప్పారు. అదికాక స్వాధీన పరుచుకోడంలో ఇప్పటికే చాలా ఆలస్యమయి పోయింది. పంటకూడా కోతకు వచ్చింది.''

"పంట కోతకు వచ్చిన మాట నిజమే లచ్చిరాం! అందుకనే ఆ పంటను వాళ్ళు కోసుకునే వరకు పొలం స్వాధీనం చేసుకోవడం ఆపితే బాగుంటుందని చెప్పడానికి వచ్చాను. పంట కోసేసుకుని బర్జోర్‌సింగు భార్య మీకు తనంతట తానే పొలం స్వాధీనం చేస్తుంది. జైదేయమ్మతో నేను మాట్లాడాను. ఆమె ఒప్పుకొన్నది. నీకి విషయం చెప్పమని ఆమె నాతో చెప్పింది.''

జ్వాలా ప్రసాద్ చెప్పినవిషయం లచ్చిరాంకు నచ్చలేదు. "జైదేయమ యజమానురాలు. ఆమె చెప్పిన మాటకు తిరుగులేదు. కాని ఆస్థిపాసుల విషయంలో దయా దాక్షిణ్యాలకు అవకాశం లేదు తహసీల్దారుగారూ అయ్యగారి ప్రాణాలు కూడా ఇందువల్లనే పోయాయి. జైదేయమ్మగారు దీనికెలా ఒప్పుకున్నారో నాకు బోధ పడడం లేదు.'' అన్నాడతను.

జ్వాలా ప్రసాద్‌కు లచ్చిరాం మాటల్లోని హేళన మీద అసహ్యం వేసింది.

ఆయన కచ్చితంగా అనేశారు: "ఆ విషయమంతా నీ యజమానురాలి నడిగి కనుక్కో. లాలా ప్రభుదయాల్‌కూ, జైదేయమ్మకూ భూమికీ ఆకాశానికీ ఉన్నంత వ్యత్యాసం ఉందనే విషయం మాత్రం నాకు బాగా తెలుసు. ఈ పొలం సంగతి ప్రస్తుతం నీవు పట్టించుకోవద్దని నీకు చెప్పడమే నా ఉద్దేశ్యం. అంతకుమించి నీకు నేను చెప్పవలసింది లేదు. అర్థమయిందా?" దానికి లచ్చీరాం చెప్పబోయే సమాధానానికికూడా ఎదురు చూడకుండా జ్వాలా ప్రసాద్ అక్కడనుండి వెళ్ళిపోయినారు.

లచ్చీరాం జైదేయి దగ్గరకు వెళ్ళాడు. జైదేయి మాగన్నుగా మంచం మీద పండుకుని ఏదో కలగాంచడానికి ప్రయత్నిస్తూ ఉంది. లచ్చీరాం కాళ్ళచప్పుడు కాగానే ఆ వచ్చే కల కాస్త వెనక్కు వెళ్ళిపోయింది. ఆమె కండ్లు తెరిచింది. ఎదురుగా నిలబడ్డ లచ్చీరాంను ఆమె అడిగింది: "ఏం లచ్చీ! ఏమిటి సంగతి?"

లచ్చీరాం ఉద్రేకంతో అన్నాడు. "అయితే అమ్మగారూ! ఇక ఈ యింట్లో తహసీల్దారుగారి మాట మీదనే నడుచుకోవాలా?"

జైదేయికి లచ్చీరాం మాట్లాడే వైఖరి నచ్చలేదు. కాని ఆమె తన భావాన్ని లోపలనే ఇముడ్చుకుని సహజమైన చిరునవ్వుతో అన్నది; "లేదు లచ్చీ! నీతో మాట్లాడమని చెప్పి నేను జ్వాలాబాబుకు చెప్పాను. ఇంత చిన్న విషయానికి అంతగా అనుకోవలసిన పని లేదు."

లచ్చీరాం అన్నాడు: "కాని అమ్మగారూ! ముందు నాతో మాట్లాడితే ఎంత బాగుండేది! ఈ యింట్లో మంచి చెడ్డలంతాచూచే వాణ్ణి నేనే గదా!"

జైదేయికి ఈ సారి మరీ నవ్వు వచ్చింది: "అవును లచ్చీ, ఈ యింట్లో మంచి చెడ్డలు చూచే బాధ్యత నేనే నీకు ఒప్పచెప్పాను. కాని జ్వాలా బాబు దేవునిలాంటివాడని నీకు తెలుసు. ఆయన మనకు పెద్ద అండగా ఉంటున్నారు."

లచ్చీరాం అన్నాడు: కాని "అమ్మగారూ! మనం పొలాన్ని స్వాధీనం చేసుకొని తీరాలి."

జైదేయి కొంచెం గంభీరంగా అన్నది: "ఈ స్వాధీనం చేసుకోడంతో ఆయన ప్రాణాలే పోయినాయి. ఇక నీవు మిగిలావు. నిన్ను కూడా పోగొట్టుకోమంటావా లచ్చీ!"

లచ్చీరాం మాటల్లో ఉన్నట్టుండి తొట్రుపాటు వచ్చింది: "అయితే

అలాంటి భయమేమన్నా ఉందా, అమ్మగారూ? తహసీల్దారుగారా విషయమేమన్నా చెప్పారా?"

లచ్చీరాంను భయపెట్టడం జైదేయికి సరదాగా ఉన్నట్టుతోచింది: "మరిదిగారికి అలాంటి వార్త ఏదో అందింది. ఠాకూర్ గజరాజసింగుగారి యింట్లో వాళ్ళవియ్యంకుడు ఏడెనిమిది మంది గూండాలను తీసుకొచ్చి పెట్టారట. తహసీల్దారుగారు ఇక్కడికి వచ్చేప్పుడు కూడా దార్లో ఇద్దరు రౌడీలు తుపాకులు చేతిలో పట్టుకుని ఆయనకి కనిపించారుట. తహసీల్దారు గారు వాళ్ళను నిలబెట్టి అడిగితే మేము గజరాజసింగు బంధువులం, వేటకోసం వచ్చామని చెప్పారట."

లచ్చీరాంకు చిరుచెమటలు పట్ట సాగినయి: "అయితే మరి పోలీసులు, గవర్నమెంటు చూస్తూ ఊరుకుంటారా అమ్మగారూ!"

"అది నాకేం తెలుసు. పోలీసు ఇన్స్పెక్టరు అంజవాలీ సమయానికి మనల్ని మోసం చేసిన సంగతి నీకు తెలిసిందే గదా! తహసీల్దారు మీదనే మన ప్రాణాలు ఆధారపడి ఉన్నాయి. నీకేమో ఆయన మాట కూడా గిట్టడం లేదు. ఇక పరమేశ్వరుడే రక్షించాలి మనల్ని."

"లేదు, లేదు, తహసీల్దారుగారు చెప్పినట్టే చేద్దాం. ఆయన మాట దాటేది లేదు." అన్నాడు లచ్చీరాం.

జైదేయి ఆవలించింది: "నా ఒంట్లో సరిగ్గా లేదు లచ్చీ! నీవిక ఇంటికి వెళ్ళు. భోంచేసే వేళయింది. నీవు మాత్రం కొంచెం జాగ్రత్తగా ఉండు. తహసీల్దారుగారు తనకు చేతయినంత వరకు మనకేమీ ప్రమాదం రాకుండా చూస్తాననే చెప్పారు."

లచ్చీరాం బయటికి వెళ్ళాడు. ఇప్పుడతనికి ఒంటరిగా ఇంటికి వెళ్ళడానికే భయమేస్తున్నది. ఒక నౌకర్ను కూడా తీసుకుని వెళ్ళాడు.

ఆరు

మున్షీ రామసహాయ్ చాలా అభిమానంతో హోలీ పండుగకు మున్షీ శివలాల్, జ్వాలా ప్రసాద్, యమున—అందర్నీ రమ్మని పిలిచారు. మున్షీ రాఘుసహాయ్‌గారి ఉత్తరం చూచుకుని మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "బాబూ మీ మామగారు ఇంత సంతోషంగా పిలిచినప్పుడు వెళ్ళడమే మంచిది. కొన్నాళ్ళు రాజపురాలోనే ఉందామని అనిపిస్తున్నది నాకు. ఇక నాకు దిగులూ విచారం లేకుండా అక్కడక్కడా హాయిగా తిరుగుతూ ఉండాల్సిన రోజులే కదా!"

"నిజమే నాన్నా! కాని దీనికోసం నేను సెలవు తీసుకోవాల్సి ఉంటుంది. అసలీ పండగలూ పర్వాలూ గవర్నమెంటు ఉద్యోగస్థులకు వర్తించవు. అదీకాక ఈ రోజుల్లోనే మాకు పనికూడా పెరిగిపోతుంది. మీరు దాన్ని తీసుకుని వెళ్ళండి. ఛింకిని కూడా మీతోనే తీసుకెళ్ళచ్చు. ఇక్కడ భీఖూ ఉంటే చాలు."

అక్కడే దగ్గిర నిలబడి ఉన్న ఛింకి అన్నది: "అమ్మాయిగారు ఇన్నాళ్ళదాకా అక్కడనే ఉండి వచ్చారు కదా! మరి ఆమె ఎలా వెళ్ళుతుంది? అదిగాక హోలీ పండుగంటే మన ఇంటికి కూడా ఎవరో వచ్చేవాళ్ళూ పోయేవాళ్ళూ ఉంటారు గదా! వాళ్ళందరికీ మర్యాదలు చేసేందుకు ఇక్కడ ఎవరో ఒకరు ఉండాలి. మీరు ఒంటరిగా వెళ్ళి రండి. ఇంతమందిని తీసుకొని వెళ్ళడం బాగా లేదు."

జ్వాలా ప్రసాద్ కూడా అదే మాట అన్నారు: "మీతో నేను కూడా రాజపురా వస్తాను. అక్కడికి క్యాంపుకు వెళ్ళేపని కూడా అయిపోతుంది. మిమ్మల్ని రాజపురాలో దించి నేను మళ్ళీ తిరిగి వచ్చేస్తాను."

మున్షీ శివలాల్‌ను రాజపురా చేర్చి జ్వాలా ప్రసాద్ తిరిగి వచ్చేసరికి ఆయన ఇంట్లో గజరాజసింగు కూర్చుని ఆయన కోసం ఎదురు చూస్తున్నారు. జ్వాలా ప్రసాద్ ఇక్కా (రిక్షాబండి లాంటిది) లో తన ఇంటికి వెళ్ళుతూ ఉంటే ఆయన గమనించి ఇక్కడికి వచ్చారు. కాని జ్వాలా ప్రసాద్ దార్లో కొంచెం సేపు ఆఫీసులో ఆగారు.

"క్షమించండి జ్వాలాబాబూ! ఆ రోజు తర్వాత నేను మళ్ళీ మిమ్మల్ని కలుసుకోలేక పోయాను. అమ్మాయిని పంపించడానికి రాజపురా వెళ్ళాను.

నేను స్వయంగా వెళ్ళవలసిన పని లేకపోయినా విధిలేక వెళ్ళాను. ఇంట్లో మరో మగదిక్కు లేకపోవడంతో నేనే వెళ్ళవలసి వచ్చింది. బర్‌జోర్‌సింగు ఉంటే ఇలాంటివన్నీ చూచుకునే వాడు. నిన్ననే అమ్మాయిని పంపించి వచ్చాను. మీరు క్యాంపుకు వెళ్ళారనీ ఈ రోజు ఉదయం వస్తారనీ తెలిసింది.''

జ్వాలా ప్రసాద్ తమలపాకుల పళ్ళెం తీసుకురమ్మని భీఖూకు చెప్పి గజరాజసింగుతో సంభాషణ ప్రారంభించారు: "ఠాకుర్‌గారూ! బర్‌జోర్ పొలాన్ని గురించి మీరు కోరినట్టే ఏర్పాటు చేయించాను. ఆ పొలాన్ని స్వాధీనం చేసుకునేందుకు నంబరుదారుగారి భార్య ఇప్పుడే ప్రయత్నించదు. పంట కోసేసుకున్న తర్వాత మీరే ఆ పొలాన్ని ఆమెకు స్వాధీనం చెయ్యండి. అనవసరంగా కోర్టుకెక్కడం ఎందుకు? నేను ఆ రోజే ఆమెతో ఈ విషయాలన్నీ మాట్లాడి వచ్చాను.''

"ఎంతో ఉపకారం చేశారు జ్వాలాబాబూ! తండ్రిలేని పిల్లలు మీ పేరు చెప్పుకుంటారు. బర్‌జోర్ భార్యకు నేనీ విషయం చెప్తాను. ఆమె వాళ్ళ యింటికి చనోతా వెళ్ళిపోయింది. పొలం స్వాధీనం చేసే బాధ్యత నాది. మీకా దిగులేమీ అక్కర్లేదు.''

ఠాకుర్ గజరాజసింగు ఎంతో ఆనందంగా ఇంటికి వెళ్ళారు.

మరుసటి రోజు సాయంత్రం గజరాజసింగు జ్వాలా ప్రసాద్‌గారి ఇంటికి వచ్చారు. ఆయన చాలా సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తున్నారు. ఊరంతా హోలీ పండగ చేసుకుంటూ ఉంది. వాతావరణం అంతా ఆనందం, ఉల్లాసంతో నిండి ఉంది. గజరాజసింగు జ్వాలా ప్రసాదును తన యింటికి హోలీ విందుకు పిలిచేందుకు వచ్చారు. "జ్వాలాబాబూ! అయిందేమో అయింది. మీరు న్యాయ సమ్మతంగా మీ కర్తవ్యాన్ని నెరవేర్చుకున్నారు. మీరు చేసిందానిలో అన్యాయం ఏమీ లేదు. నేనే అనవసరంగా మీతో వైరం పెట్టుకున్నాను. నేను చేసిన తప్పుకు నా మనస్సు చాలా బాధపడుతూనే ఉంది. మీరు మా యింటికి వచ్చి నాతో పాటు భోంచేస్తే మీరు నా తప్పును మన్నించారని నేను భావిస్తాను. మా ఆవిడ కూడా మిమ్మల్నిద్దర్నీ తప్పకుండా తీసుకరమ్మని మరీ మరీ చెప్పింది.'' అన్నారు గజరాజసింగు.

గజరాజసింగు అంత ఆప్యాయంగా పిలిస్తే జ్వాలా ప్రసాద్ కాదనలేక

పోయారు. తప్పకుండా వస్తాను ఠాకుర్‌గారూ! ప్రపంచంలో మంచీ, చెడూ అన్నీ ఉంటాయి. మనం తప్పులు చేస్తూ ఉంటాం. ఫలితం అనుభవిస్తూ కూడా ఉంటాం. కాని భావావేశాలను దాటి ఉన్నతస్థాయి నందుకొనే వాళ్ళు మనలో చాలా కొద్ది మందే ఉంటారు. మనలోని భావావేశం మనల్ని తప్పు దారి పట్టిస్తుంటుంది. కాని తప్పుదారిని వదిలేసి మళ్ళీ సరియైన దారికి రాగలిగితే దానివల్ల నష్టమేమీ లేదు.''

హోలికాదహనమయిన మరునటి రోజు రంగు నీళ్ళు చల్లుకోడం మొదలు పెట్టారు. జ్వాలా ప్రసాద్‌ను కలుసుకుని ఆయన మీద వసంతం చల్లి, చల్లించుకునేందుకు దాదాపు స్నేహితులందరూ వచ్చారు. వచ్చిన వాళ్ళందరికి మర్యాదలు కూడా చక్కగా జరిగాయి. ఉదయం నుండి మద్యపానం ప్రారంభమైనది. జ్వాలా ప్రసాద్ కూడా అతిథులతో పాటు అన్నిటినీ సేవిస్తూనే ఉన్నారు.

మధ్యాహ్నానికి యమునతో కూడా జ్వాలా ప్రసాద్ ఠాకుర్ గజరాజ సింగుగారి ఇంటికి వెళ్ళారు. యమున లోపలికి వెళ్ళింది. గజరాజసింగు కూర్చునే గదిలో నాట్యోత్సవం జరుగుతూ ఉంది. పల్లెటూరి ఆట కత్తెలు జట్టుగా నృత్యం చేస్తున్నారు. ప్రేక్షకులందరూ మద్యపానంతో మైమరచి పోతున్నారు.

దాదాపు రెండు గంటలకు కార్యక్రమం ముగిసింది. అందరూ భోజ నాలకు కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్‌ను గజరాజసింగు తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నారు. బక్‌జోర్‌సింగు కొడుకు లిద్దరూ వడ్డిస్తూ ఉన్నారు. గజరాజసింగు అన్నారు: ''ఈ పిల్లలకు ఇంట్లో పండుగ చేయడం లేదు జ్వాలాబాబూ! అందుకని నేను వీళ్ళనిక్కడికే రమ్మన్నాను. వాళ్లకు వచ్చిన ఆపద ఏమిటో వాళ్ళకేం తెలుసు పాపం! వాళ్ళ అమ్మ ఒంటరిగా ఇంట్లో కూర్చుని ఏడుస్తూ ఉంటుంది. సాక్షాత్ లక్ష్మి! ఆమె ఏం పాపం చేసిందని భగవంతుడామెకింత కఠినశిక్ష విధించాడో తెలియదు. మీరు ఈ పిల్లలకెంత ఉపకారం చేశారో చెప్పడానికి వీల్లేదు. మీ పేరు చెప్పుకొని వాళ్ళు తమ ఇల్లు నిలబెట్టుకో గలిగారు.''

జ్వాలా ప్రసాద్ కండ్లు కైపుతో తూలిపోతూ ఉన్నాయి. ఈ కరుణ గాథ వినేసరికి ఆయన హృదయంలో దయా సముద్రం పొంగి ప్రవ హించింది. ఎంతో జాలి పడుతూ ఆయన అన్నారు: ''తెలియక నేను

వీళ్ళకు చేసిన అపకారానికి పోలిస్తే వీళ్ళకు నేను చేయగలిగిన ఉపకారం ఒక లెక్కలోనిది కాదు.''

గజరాజసింగు చాలా అనుభవజ్ఞుడు. వెంటనే ఆయన అందుకున్నారు: "జ్వాలాబాబూ! జైదేయిగారు మీ మాట కాదనరు. ఈ వంద గొర్ల పొలం ఉందే- దీని కౌలు బర్‌జోర్‌సింగు పిల్లలకు ఇప్పించ కూడదూ!''

కొంచెం ఆలోచించి జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: "ఎందుకిప్పించ గూడదూ! నాకు తోచినంతవరకూ దీనికేమీ అంతరాయం ఉండ కూడదు. ఎవరికో ఒకరికి ఆ పొలం కౌలుకు ఇయ్యవలసిందే కదా! ఇకపోతే మక్తా ఎంత ఇవ్వాల్సి వస్తుంది అనేదే ప్రశ్న. కాని అందులో ఒకటి రెండు వందలు తగ్గించమని నేను చెప్పగలను. మీరు సరేనంటే నేను మాట్లాడుతాను.''

కొంచెం విచారకరంగా గజరాజసింగు అన్నారు: "రాజకుటుంబంలో పెరిగినవాళ్ళు వ్యవసాయం చెయ్యడమనేది నిజంగా చాలా విచారకరమైన విషయం. కాని మనం చేయగలిగిందేముంది? రోజులు మారినప్పుడు ఏపనయినా చేయాల్సి ఉంటుంది. బ్రహ్మ రాసిన రాత తప్పించుకోవడం మనకు సాధ్యం కాదు. ఆకలితో బాధపడే కంటే వ్యవసాయం చేసుకోడమే మంచిది, జ్వాలా బాబూ! మీరీమాత్రం చెయ్యగలిగితే చాలా ఉపకారం చేసినవారవుతారు. ఆ పిల్లలు బతికిపోతారు.''

గజరాజసింగు మాటల్లో ఒక రకమైన నైరాశ్యం కనిపిస్తూ ఉంది. ఆ నైరాశ్యంలో కొంచెం వ్యంగ్యం కూడా ధ్వనిస్తూ ఉంది. జ్వాలా ప్రసాద్ మనస్సులో క్రమంగా ఏదో బాధ మొదలు పెట్టింది. ఆయన అన్నం తినలేక పోతున్నారు. లోపలి దిగులు వల్లనో లేక కొంచెం ఎక్కువగా తాగడం వల్లనో కాని భోంచెయ్యగానే ఆయన చాలా భారంగా ఇల్లు చేరుకున్నారు. యమున, ఛింకీ-ఇద్దరూ గజరాజసింగు భార్య బలవంతం చేస్తే అక్కడే ఉండిపోయినారు. భీఖూ హోలీ సంబరాల్లో తమతోటి బోయవాళ్ళతో చేరాడు.

జ్వాలా ప్రసాద్ ఇంటికి వచ్చి పండుకున్నారు. బర్‌జోర్‌సింగు భార్య, పిల్లల్ని గురించి ఆయన ఆలోచిస్తున్నారు. ఎంత ప్రయత్నించినా ఆయనకు నిద్ర పట్టలేదు. అరగంటదాకా పక్కలో అటూ, ఇటూ పొర్లుతూనే ఉన్నారు. ఇంటి చుట్టూ నలువైపులా ఆటలూ, పాటలూ, సంబరాలూ,

సరదాలూ జరుగుతూ ఉన్నాయి. కాని ఆయన మాత్రం విచారంలో నిమగ్నులై ఉన్నారు.

ఈ విషాదాన్ని తరిమి వేయాలని కాబోలు ఆయన బలవంతంగా లేచి నిలబడ్డారు. బట్టలు వేసుకుని ఆయన ఇక్కా కట్టించుకుని ఒళ్ళు తెలియని స్థితిలో శివపురాకు బయలుదేరారు.

ఎండ చాలా తీవ్రంగా కాస్తూ ఉంది. రంగు నీళ్ళ చల్లడం ఆగి పోయింది. కాని అక్కడక్కడ మద్దెల చప్పుళ్ళ మధ్య హోలీ పాటలు వినవస్తూనే ఉన్నాయి. కొంతసేపటికి జ్వాలా ప్రసాద్ మనస్సులోని విషాద రేఖలు కూడా మాసిపోయాయి. శివపురాలో లాలా ప్రభుదయాల్ గారి భవంతి ముందు ఆయన ఇక్కా ఆగింది.

ప్రభుదయాల్‌గారి భవంతి ముందు నిశ్శబ్దంగా ఉంది. రాధాకృష్ణ మందిరం తలుపులు మూసి ఉన్నాయి. వాకిట్లో ద్వారపాలకుడు తప్ప మరి ఎవ్వరూ లేరు. ఈ సంవత్సరం శివపురాలో ప్రభుదయాల్‌గారి ఇంట్లో హోలీ పండుగ జరిపించే ఏర్పాటు లేదు. అందువల్ల చాల మంది నౌకర్లు సెలవు తీసుకుని తమ తమ బంధువుల ఇండ్లకు వెళ్ళి హోలీ పండుగ చేసుకొంటున్నారు. ఒకరిద్దరు పనివాళ్ళు అక్కడక్కడ కూర్చుని కునికి పాట్లు పడుతున్నారు. ఈ వాతావరణం చూచి జ్వాలా ప్రసాద్ ఇంటికి తిరిగి వెళ్ళుదామని అనుకున్నారు. హోలీ నాడు జైదేయి ఇంటికి రావడం పొరపాటని అనిపించిందాయనకు. కాని మరుక్షణమే అంతర్వాణి పలికింది: "నీవు హోలీ పండుగ కోసం రాలేదు గదా! బర్‌జోర్‌సింగు కుటుంబం యొక్క సమస్యను పరిష్కరించడానికి నీవు వచ్చావు." జ్వాలా ప్రసాద్ జైదేయికి తను వచ్చినట్టు కబురు చేశారు.

జైదేయి మంచం మీద పండుకుని ఉంది. అప్పుడప్పుడే మెలకువ వస్తోంది. కాని బద్ధకం పూర్తిగా పోలేదు. జ్వాలా ప్రసాద్ వచ్చారని వినగానే ఆమె బద్ధకమంతా ఎక్కడికో పోయింది. ఎంతో ఉల్లాసంతో ఆమె లేచింది. లోపలి గదిలో ఆయన్ని కూర్చో పెట్టమని చెప్పి పని మనిషిని పంపించి తాను గుడ్డ సవరించుకొని ఆయన దగ్గరకు వెళ్ళింది. ఆ సమయంలో ఆమె శుభ్రమైన తెల్ల చీర కట్టుకుని ఉంది. ఏ విధమైన అలంకారాలూ లేవు. ఆమె నవ్వుతూ అన్నది: "క్షేమమా జ్వాలా బాబూ!

హోలీ నాడు వదినను గుర్తు పెట్టుకుని వచ్చారు. ఎంత మంచివారు!'' అంటూ ఆమె జ్వాలా ప్రసాద్‌కు ఎదురుగా కొంచెం దూరంగా కూర్చున్నది.

ఆ మామూలు వేషంలో జైదేయి ఎంతో చక్కగా ఉంది. ఆమె చిరునవ్వు ముద్దులు మూట కట్టినట్టుంది. కొంచెం సేపు ఆమె జ్వాలా ప్రసాదే మాట్లాడుతారేమోనని చూచి అన్నది: "ఎందుకు జ్వాలా బాబూ! అలా చూస్తున్నారు నన్ను. చాలా గంభీరంగా ఉన్నారే. హోలీలో! పూర్తిగా నిమగ్నులైనట్టున్నారు.'' అంటూ జైదేయి పెద్దగా నవ్వింది: "ఏం చేద్దాం, ఈ సంవత్సరం హోలీ పండగే చేసుకోలేదు. లేకుంటే నేనే మీకు తనివిదీర తాగించేదాన్ని.''

అప్పుడు జ్వాలా ప్రసాద్ మౌనం ఆగిపోయింది: "లేదు వదినెగారూ! నేను తాగడానికి రాలేదు పగలంతా తాగుతూనే ఉన్నాను. మీతో పని ఉండి వచ్చాను.''

జైదేయి కొంచెం అలిగినట్టుగా అన్నది: "పొండి జ్వాలా బాబూ! ఎప్పుడు వచ్చినా ఏదో పనీ, పనీ అంటారు. పని కోసమయితే చెప్పం పిస్తే సరిపోక పోయిందా? మీరు చెప్పిన మాటకాదనని నేను చెప్పలేదూ. అయితే చెప్పండి. నవ్వుతూ చెప్పండి. అంత గంభీరంగా ఉండద్దు.''

జ్వాలా ప్రసాద్‌కు తాను చాలా గంభీరంగా ఉన్నానన్న విషయం అప్పుడు తెలిసింది. నవ్వడానికి ప్రయత్నిస్తూ ఆయన అన్నారు: "వదినా! నేను బర్‌జోర్‌సింగు పొలాన్ని గురించి ఆలోచిస్తున్నాను. ఆ పొలం ఆ పిల్లలకిచ్చేయ కూడదూ! పాపం తండ్రి లేని పిల్లలు! దిక్కులేని వాళ్ళయి పోయారు.''

జైదేయి సమాధానం చెప్పింది: "మీకు చట్టం తెలుసు గదా జ్వాలా బాబూ! నేనా పొలం ఎలా ఇస్తాను చెప్పండి. పోనీ, అప్పు తీర్చునన్నా తీరిస్తే బహుశా వాళ్ళకు ఇప్పటికైనా ఆ పొలం దక్కవచ్చు. ఆ చట్టానికి సంబంధించినవన్నీ మీకు తెలియాల్సిందే కాని నాకు తెలియదు. కాని నేనింకా పొలం స్వాధీనం చేసుకోలేదు కాబట్టి అది సాధ్యమవుతుందేమో!''

"కాని వదినా! వాళ్ళ దగ్గర అప్పు తీర్చేందుకు ఏముందీ? నా దగ్గరన్నా ఉంటే నేనయినా ఇచ్చి ఉండేవాణ్ణి.'' జ్వాలా ప్రసాద్ కొంచెం భావోద్రేకంతో అన్నారు.

జైదేయి జ్వాలా ప్రసాద్‌ను చూచింది. కొంత సేపటి వరకు ఆమె

చూపులు జ్వాలా ప్రసాద్ చూపుల్లో చిక్కుకొని పోయినాయి. ఉన్నట్టుండి జైదేయి లేచి నిలబడింది: "నేనిప్పుడే వస్తాను, జ్వాలా బాబూ!" అని చెప్పి ఆమె అక్కడినుండి వెళ్ళిపోయింది.

జైదేయి అలా వెళ్ళిపోవడం చూచి జ్వాలా ప్రసాద్ ఆశ్చర్యపడ్డారు. జైదేయి జ్వాలా ప్రసాద్ చెప్పదలచుకొన్న మాట పూర్తిగా చెప్పనియ్యనైనా లేదు. అసలు మాట ఎలా చెప్పుదామా అని ఆయన ఆలోచిస్తూనే ఉన్నారు. ఇంతలోనే పనిమనిషి వచ్చి అమ్మగారు లోపలికి పిలుస్తున్నారని జ్వాలా ప్రసాద్‌తో చెప్పింది.

జ్వాలా ప్రసాద్ జైదేయి గదిలోకి వెళ్ళేసరికి పనిమనిషి అక్కడినుండి తప్పుకుంది. జ్వాలా ప్రసాద్ జైదేయిని పూర్తిగా మరో రూపంలో చూచారు. చాలా విలువగల చీరె కట్టుకొని అక్కడ నిలబడ్డ జైదేయి జ్వాలా ప్రసాద్‌తో అన్నది: "జ్వాలా బాబూ! సరిగ్గా హోలీనాడు వచ్చి పండుగ విషయం జ్ఞాపకం చేసినందుకు వదినెతో హోలీ ఆడక తప్పదు." అంటూ జైదేయి జ్వాలా ప్రసాద్ ముందు వరహాల సంచి పెట్టింది: "జ్వాలా బాబూ! ఈ వంద వరహాలు తీసుకుని ఒకసారి మీదగ్గరికి వచ్చాను. అప్పుడు మీరు ఉద్యోగస్థులు, అది లంచమనుకొని తీసుకొనేందుకు ఒప్పుకోలేదు. ఈ రోజు నేను ఈ వంద వరహాలు మీరు ఆఫీసరని ఇయ్యడం లేదు. మా మరిది మీద అపేక్ష కొద్దీ ఇస్తున్నాను. ఇప్పుడు మీరు కాదనేందుకు వీల్లేదు. ఇకముందు మీరెప్పుడూ నా దగ్గర డబ్బు లేదని అనవద్దు. నా దగ్గర ఉన్నదంతా మీదే." అంటూ ఆమె ఆయన ముఖం మీద గుప్పెడు కుంకుమ పూసింది.

వరహాలసంచి తీసుకొని జ్వాలా ప్రసాద్ జైదేయి గదిలోనుంచి బయటకు వెళ్ళేసరికి ప్రదోష కాలమయింది. చంద్రుడుదయిస్తూ ఉన్నాడు. ఇంటి వెలుపల జనమంతా పాటలు పాడుకుంటూ సరస సల్లాపాలతో అటూ ఇటూ తిరుగుతున్నారు. జైదేయి నౌకర్లు జ్వాలా ప్రసాద్‌ను సాగనంపడానికి వాకిలి దాకా వచ్చారు. వాకిటి ముందు రాధాకృష్ణ మందిరంలో తలుపులు తెరచి ఉన్నాయి. పూజ జరుగుతూఉంది. జ్వాలా పసాద్‌కు దేవుడి దర్శనం చేసుకునేందుకు ధైర్యం చాలదు. అందరూ తనను చూచి నవ్వుతున్నారేమో, ఎగతాళి చేస్తూన్నారేమో అనిపించిందాయనకు. ఆయన చేతిలో వరహాలసంచి ఉంది. ఆయన

కాళ్ళు తడబడుతున్నాయి. ఏదో ఒక రకమైన ఆవేదన ఆయన మనస్సులో, కండ్లలో, శరీరంలో నిండి ఉంది. త్వరత్వరగా ఆయన ఇక్కాలో కూర్చొని ఘాటంపూర్‌కు వెళ్ళిపోయినారు.

ఏడు

ఠాకుర్ గజరాజసింగుగారి ఇంట్లో ఏర్పాటు చేసిన విందుకు మీర్ సఖావత్ హుసేన్ రావడం జ్వాలా ప్రసాద్‌కు ఆశ్చర్యకరంగా ఉంది. ఆయన మీర్ సాహబ్‌కు వంగి సలాంచేసి అన్నారు: "తమరీరోజు నియమాన్ని ఉల్లంఘించారే! తమరీ విందులో పాల్గొనడం గజరాజసింగు అదృష్టమని చెప్పాలి."

మీర్‌సాహబ్ నవ్వుతూ అన్నారు: "బాబూ! నియమం ఏర్పర్చుకొనేది దాన్ని ఉల్లంఘించడానికేనోయ్. గజరాజసింగుగారి వియ్యంకుడు రాజా చంద్రభూషణ్‌సింగు పిలవడం, నేను రాకపోవడమూనా! గజరాజసింగుకు ఆయనమీద ఎంత గురుత్వమో, నాకూ అంతే." తర్వాత ఆయన రాజా చంద్రభూషణ్‌సింగువైపు తిరిగి అన్నారు: "రాజాగారూ! ఇతడు చాలా మంచి కుర్రవాడు, మంచి ప్రవర్తన గలవాడు. ఇక్కడికి డిప్టీ తహసీల్దారుగా వచ్చాడు. నా కుడిభుజంలాగా పని చేస్తున్నాడు. తెలివిగలవాడు, బాధ్యత తెలుసుకొని నడుస్తాడు. చాలా విశ్వాసపాత్రుడు. ఈ ఇలాకా అంతా ఇతనికే ఒప్ప చెప్పాను. ఎక్కడనుంచి కూడా ఇతనికి వ్యతిరేకంగా ఒక్కమాట కూడా వినబడలేదు."

నవంబరు వచ్చింది. చలి ఆరంభమయింది. రాజా చంద్రభూషణ్ సింగు అలహాబాదునుండి కాన్పూరు మీదుగా తన ఇలాకాకు వెళుతున్నారు. ఠాకుర్ గజరాజసింగు బలవంతం చేస్తే ఘాటంపూర్లో దిగారు. ఆయన రాకను పురస్కరించుకుని ఈ విందు ఏర్పాటయింది.

రాజా చంద్రభూషణ్‌సింగు జ్వాలా ప్రసాద్‌ను ఇప్పుడు చాలా దగ్గరగా చూచారు. ఆయన కండ్లు మదిరాపానంతో ఎఱ్ఱబడినాయి. వ్యంగ్యంగా

నవ్వుతూ ఆయన మీర్‌సాహెబ్ అన్నారు: "వీరిని నేనింతకు ముందే చూచాను మీర్‌సాహెబ్‌గారూ! అంతకంటె ఎక్కువగా వీరిని గురించి విన్నాను. ఎంత నెమ్మదైన వారయినప్పటికీ న్యాయప్రియులు. తన కర్తవ్యాన్ని ఎంతో ఉత్సాహంగా నెరవేరుస్తారు." ఆ తర్వాత ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "మీరిక్కడనే ఉన్నారనే విషయం నేను గమనించలేదు. మీకు తాగడం నిషేధం కాదనుకుంటాను. తీసుకోండి. మీరే గ్లాసులో పోసుకోండి. పోయినసారి మీకు బర్‌జోర్‌సింగు గ్లాసులో పోసి ఇచ్చాడు. దానికి మీరతని కిచ్చిన ప్రతిఫలాన్ని తలుచుకుంటే మళ్ళీ మీకు గ్లాసులోపోసి అందించడానికి భయం వేస్తున్నది." . అంటూ రాజా చంద్రభూషణ్‌సింగు పెద్దగా నవ్వారు.

సంభాషణ కొంచెం శ్రుతిమించుతున్నదని గజరాజసింగు గమనించారు. అసలు విషయం తెలుసుకోకుండా జ్వాలా ప్రసాద్‌ను అనవసరంగా అవమాన పరుస్తున్నారు రాజా చంద్రభూషణ్‌సింగు. అందువల్ల గజరాజసింగు వెండిగ్లాసులో తానే స్వయంగా సారా పోసి జ్వాలా ప్రసాద్‌కు అందిస్తూ వియ్యంకుడు రాజా చంద్రభూషణ్‌సింగుతో అన్నారు: "రాజా సాహెబ్! డిప్టీ తహసీల్దారుగారి విషయంలో మీరు పొరపడుతున్నారు. వీరి వల్లనే బర్‌జోర్‌సింగు భార్యకూ, పిల్లలకూ స్వంత వ్యవసాయం మళ్ళీ దక్కింది."

ఇంత వరకూ ఈ దృశ్యాన్ని తటస్థంగా చూస్తూ నవ్వుతూ కూర్చున్న మీర్‌సఖావత్ హుసేన్ ఈ మాటలు వినేసరికి ఆశ్చర్యపడ్డారు: "జ్వాలా బాబు దయవల్ల బర్‌జోర్‌సింగు భార్యకు వెనుకటి పొలం మళ్ళీ వచ్చిందనే విషయం నాకు తెలియదే. అదేదో కొంచెం వివరంగా చెప్పండి. నేను కూడా వింటాను." అన్నారాయన.

జ్వాలా ప్రసాద్ ఈ ప్రసంగం అంతటితో ముగిస్తే బాగుంటుందనే ఉద్దేశ్యంతో అన్నారు: "అదేం లేదు. నేనా విషయం చెప్పటం మరిచి పోయాను. చాలా మామూలు విషయమే. మరెప్పుడయినా తమకు చెప్తాను."

కాని జ్వాలా ప్రసాద్‌ను ప్రశంసించడం గజరాజసింగుకు అవసరమని తోచింది. ముఖ్యంగా రాజా చంద్రభూషణ్‌సింగు మనస్సులో ఏర్పడిన భ్రాంతిని పోగొట్టేందుకు ఆయన ఎదుట అలా చెప్పడం మంచిదని

తోచింది. జ్వాలా ప్రసాద్ మనస్సులోని బింకును, సంకోచాన్ని గజరాజసింగు గమనించలేక పోయారు. "మీర్‌సాహెబ్! నంబరుదారు భార్య జ్వాలా ప్రసాద్ మాట వింటుంది కనుక ఆమెకు చెప్పి ఈ పొలం బర్‌జోర్‌సింగు పిల్లల పేరిట కౌలుకు వ్రాయించకూడదా అని నేను జ్వాలా ప్రసాద్‌ను అడిగాను. దానిమీద జ్వాలా ప్రసాద్ బర్‌జోర్‌సింగు భార్యకు వంద వరహాలిచ్చారు. దానితో బర్‌జోర్‌సింగు పొలం మీద చేసిన అప్పు తీరింది. ఆ పొలం తిరిగి ఇచ్చేసేందుకు జ్వాలా ప్రసాద్ జైదేయిని ఒప్పించారు. రాజా సాహెబ్‌కు ఈ సంగతులన్నీ తెలియవు. అందుకనే ఆయన జ్వాలా ప్రసాద్‌ను అపార్థం చేసుకున్నారు. అంతే కదూ రాజాసాహెబ్?"

గజరాజసింగు చెప్పిన మాటలకు అక్కడ కూర్చున్నవాళ్ళంతా చాలా ఆశ్చర్యపడ్డారు. ఠాకుర్ గజరాజసింగు చాలా గొప్ప రహస్యాన్ని బయట పెట్టారు. ప్రతి వాడి దృష్టిలో కూడా జ్వాలా ప్రసాద్‌పట్ల గౌరవం హెచ్చింది.

కాని మీర్‌సాహెబ్ మౌనంగా కూర్చున్నారు. ఆయన ముఖంలో సంతోషం లేదు, విషాదం లేదు. ఆయన ఏదో మరో విషయం ఆలోచిస్తున్నట్టు కూర్చున్నారు. ఆయన ఎదుట జరుగుతున్న సంభాషణలో ఆయనకేమీ ఆసక్తి కనిపించడం లేదు. గజరాజసింగు మీర్‌సాహెబ్‌లోని ఔదాసీన్యాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తూ అన్నారు: "తహసీల్దారు గారూ! జ్వాలాబాబంటే ప్రజలకెంత ఆనందమో చెప్పడానికి వీల్లేదు. ఇంత చిన్న వయస్సులో ఇంత పెద్ద పేరు ప్రతిష్ఠలు సంపాయించారు. పిన్న, పెద్ద అందరూ డిప్టీగార్ని ఎంతో పొగడుతారు."

ఇప్పుడు మీర్‌సాహెబ్ మాట్లాడక తప్పింది కాదు: "జ్వాలా ప్రసాద్ పట్ల మీకింత గౌరవం ఉన్నందుకు నాకు చాలా సంతోషం. జ్వాలాబాబు న్యాయ సమ్మతంగా పనిచేస్తున్నందుకు కూడా నాకు సంతోషం. జ్వాలా బాబు దయార్ద్ర హృదయుడని పేరు పొందినందుకు కూడ నాకు చాలా సంతోషమే. కాని జ్వాలాబాబు ఇంకా కుర్రవాడనే నా అభిప్రాయం. అతనికి ప్రపంచానుభవం తక్కువ. అయినా దీనిలో అంతగా విచారించ వలసిన దేమి లేదు. జీవితంలో ఎన్నో అనుభవాలు అవుతూ ఉంటాయి. ఒక్కొక్క అనుభవంతో మనిషి యోగ్యత కూడా ఎక్కువ అవుతూ ఉంటుంది.

మీర్‌సాహబ్ అన్న మాటలకు అందరికి ఆశ్చర్యమయింది. ఎవ్వరూ ఏమీ అనలేదు.

విందు కార్యక్రమం ముగిసిపోయిన తర్వాత మీర్‌సాహబ్ ఇంటికి వెళ్ళుతూ జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "బాబూ! నన్ను కొంచెం ఇంటి దాకా పంపించు. నీతో ఒకటి రెండు మాటలు మాట్లాడాలి కూడాను."

జ్వాలా ప్రసాద్ మనస్సు కొంచెం భారంగా ఉంది. మీర్‌సాహబ్ అన్న మాటలు మిగిలిన వాళ్ళ కర్థం కాకపోయినా జ్వాలాబాబుకు మాత్రం వాటి అంతరార్థం బాగానే గోచరించింది. ఆయనకు దేన్ని గురించి భయం వేస్తూ ఉందో, అది ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించింది. జంకుతూ జంకుతూ ఆయన మీర్‌సాహబ్‌తో కూడా ఆయన ఇంటికి వెళ్ళారు.

మీర్‌సాహబ్ దార్లో ఏమీ మాట్లాడ లేదు. ఇంటికి వెళ్ళిన తర్వాత ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "బాబూ! చాలా పొద్దు పోయింది. నీకు శ్రమ ఇచ్చానని అనుకోకు. నీతో మాట్లాడడం అవసరమని చెప్పి నిన్ను నాతో తీసుకువచ్చాను. నీకు తెలియదు జ్వాలాబాబూ! నీతో ఇప్పుడు మాట్లాడక పోతే రాత్రి నిద్రే పట్టదు."

జ్వాలా ప్రసాద్ గుండెలో దడగా ఉంది. "ఒంట్లో కులాసాగా ఉందా తమరికి?" అని అడిగారు.

మీర్‌సాహెబ్ నవ్వుతూ అన్నారు: "నాకు సంబంధించినంత వరకూ కులాసాగానే ఉన్నాను. నిన్ను గురించే నాకు దిగులుగా ఉంది. నీ కుశల క్షేమాలు అడిగేందుకే నిన్ను ఇంటిదాకా తీసుకు వచ్చాను." ఆ తర్వాత మీర్‌సాహబ్ మాట్లాడ లేదు.

జ్వాలా ప్రసాద్ మనస్సులోని సంశయం ఇప్పుడు భయంగా మారుతున్నది. మౌనంగా తలవంచుకుని ఆయన మీర్‌సాహబ్ వెయ్యబోయే ప్రశ్నలకు ఎదురు చూస్తున్నారు. ఆ ప్రశ్నలు బహుశా ఏమయి ఉంటాయో ఆయన అంతరాత్మకు తెలుసు.

చర్చనెలా ఆరంభించడం, అసలు విషయంలోకి ఎలా దిగడం అనే ఆలోచనలో మునిగిపోయి మీర్ సాహబ్ కొంచెం సేపటి వరకూ మాట్లాడలేదు. తర్వాత నైరాశ్యంతో నిట్టూర్పు విడిచి అన్నారు: "బర్‌జోర్‌సింగుకు వ్యతిరేకంగా వాఙ్మూలం ఇచ్చి బర్‌జోర్‌సింగు ఆత్మహత్య చేసుకున్న తర్వాత అతని భార్యకు వంద వరహాలిచ్చావా జ్వాలా

బాబూ! నీవు చేసిన పని మానవమాత్రుడు చేయ గలిగింది కాదు. దేవతలు చేసే పని. మీ తండ్రి నిన్ను చూచుకొని మురిసి పోవచ్చు. కాని మానవుడు నిజంగా దేవత కాగలడా అని నేనాలోచిస్తున్నాను. నేను గూడా ప్రపంచాన్ని చాలా చూచాను. నాకూ ఎంతో అనుభవం ఉంది. కాని నేను నా అనుభవాలను వేరే విధంగా మార్చుకోవాల్సి ఉంటుందా అని ఆలోచిస్తున్నాను.''

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పలేక మౌనంగానే ఉన్నారు.

మీర్ సాహెబ్ కూడా మౌనంగా ఉన్నారు. తానడిగిన ప్రశ్న యొక్క ప్రాముఖ్యాన్ని తానే గమనించి ఆ ప్రశ్నకు సరియైన సమాధానాన్ని కూడా తనలో తానే వెదుకుతున్నట్టు కనిపించారాయన. చుట్టుప్రక్కల ఉన్న నిబిడాంధకారం ఆయన ముఖాన్ని కప్పివేస్తూ ఉన్నది. అదే అంధకారం జ్వాలా ప్రసాద్ లోపల కూడా పేరుకొని పోతూ ఉన్నది. గాలిలో ఒక విధమైన పులకరింత ఉంది. దానికి జ్వాలా ప్రసాద్ అణువణువూ గగుర్పాటు పొందుతూ ఉంది. ఆ ధూసర శీతల వాతావరణాన్ని చీల్చుకొని మీర్‌సాహెబ్ కంఠం పలికింది. ఆయన అన్నారు: "బాబూ! వంద వరహాలంటే కాస్తా కూస్తా కాదు. ఇంత డబ్బు నీ దగ్గర ఉన్నదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. మీ తండ్రి సంగతి నాకు తెలుసు. కాబట్టి మీ కుటుంబం విషయం కూడా నాకు చూచాయగా తెలుసు. నీవు లంచం తీసుకోవని కూడా నాకు తెలుసు. సామాన్యంగా లంచం తీసుకొనని వాళ్ళు ఇతరులకు దానధర్మంగా ఇంత డబ్బియ్య లేరు.''

జ్వాలా ప్రసాద్ ఇప్పుడు కూడా సమాధానం చెప్పవలసిన అవసరమేమీ లేదు. మీర్‌సాహెబ్ తన ఆలోచనే చెబుతున్నారు, కాని జ్వాలా ప్రసాద్‌ను ఏమీ ప్రశ్నించ లేదు. కాని మీర్‌సాహెబ్ మాటల్లో సత్యం తెలుసు కోవాలనే ఉత్కంఠ జ్వాలా ప్రసాద్‌కు స్పష్టంగా గోచరించింది. జ్వాలా ప్రసాదులో దాగి ఉన్న నిజం బయట పడింది: "తహసీల్దార్‌గారూ! ఈ వరహాలు నావి కావు. నంబరుదారు భార్య జైదేయి బర్‌జోర్‌సింగు భార్యకు పొలం మీది అప్పు తీర్చి మళ్ళీ పొలం దక్కించుకునేందుకు ఈ వరహాలు నా చేత ఇప్పించింది.''

మీర్‌సాహెబ్ నుదురు ముడతలు పడింది: "ఈ పొలం కోసమే కదా

ప్రమదయాల్ ప్రాణాలు పోగొట్టుకున్నాడు. బర్‌జోర్‌సింగు ఆత్మహత్య చేసుకున్నాడు! ఆ పొలాన్ని మళ్ళీ బర్‌జోర్‌సింగు భార్యకు ఇచ్చేసేందుకు ఆమె డబ్బిచ్చిందా? ప్రపంచం చాలా విచిత్రమయింది బాబూ! దాన్ని అర్థం చేసుకోడం చాలా కష్టం. నంబరుదారు భార్య జైదేయి ఈ పొలాన్ని తనంతట తాను తిరిగి ఇచ్చేసిందా? దీనిలో ఏదో రహస్యముంది!" మీర్ సాహబ్ జ్వాలా ప్రసాద్‌ను నిశ్చలంగా చూడసాగారు. "ఈ రహస్యం నీ వరకే ఉంచుకో. ఇది ఎవ్వరికీ చెప్పకు. నీకు భార్య ఉంది, పిల్లవాడున్నాడు. పరువూ, ప్రతిష్ఠ ఉంది. ప్రపంచంలో ఇంకా నీవు ముందుకు వచ్చి అనేక విషయాలు సాధించ వలసిన రోజులెన్నో ఉన్నాయి. అలాంటప్పుడు నీవు నీలో ఉన్న రహస్యాలన్నీ ఎంతో మెలకువగా దాచి ఉంచుకోవాలి."

మీర్‌సాహబ్ చెప్పే ఒక్కొక్క మాట జ్వాలా ప్రసాద్ చైతన్యం మీద గొడ్డలి పెట్టులాగా తగులుతూ ఉంది. జ్వాలా ప్రసాద్ ముఖం వికలంగా విలవిలపోతూ ఉన్నది. ఆయన తలవంచుకొని "అది కాదండీ!" అని ఏదో చెప్ప బోయారు.

ఇంతలో మీర్‌సాహబ్ అడ్డు తగిలి అన్నారు: "లేదోయ్ జ్వాలా బాబూ! ఇక ఒక్క మాట కూడా చెప్పవలసిన పని లేదు. అపరాధి తన అపరాధాన్ని దాచుకొనేందుకు ప్రయత్నించే వరకే అపరాధిగా పరిగణింప బడుతాడు. మనిషికి తన అపరాధం ఇతరులకు చెప్పే ధైర్యం ఉంటే అప్పుడతని అపరాధం అపరాధం కాదు. కాని ఒక్క విషయం ఒప్పుకొని తీరాలి. ప్రపంచంలో అవగుణాలూ, అపరాధాలూ కొల్లలుగా ఉన్నాయి. కాబట్టి అపరాధం చేసినవాళ్ళు తమ అపరాధాలను అపరాధాలని తెలుసు కొని ఇతరులకు చెప్పకుండా ఉండడమే ప్రపంచానికి శ్రేయస్కర మవుతుంది. వ్యక్తులు తమ అవగుణాలను తమవరకే పరిమితం చేసు కోవడం అవసరం. అప్పుడే ఆ అపరాధాలను సరిదిద్దు కొనేందుకు, అవగుణాలను పోగొట్టుకునేందుకు సాధ్యమవుతుంది."

తాను చెప్పదలుచుకున్న విషయం చెప్పి మీర్‌సాహబ్ కొంచెంసేపు మౌనంగా ఉన్నారు. ఆయన లోపలి ద్వంద్వం ఆయన ముఖంలో ప్రతి బింబిస్తూ ఉంది. ఉన్నట్టుండి ఆయన చివుక్కున లేచి నిలబడ్డారు. తనకు ఇష్టం లేక పోయినప్పటికీ విధి లేక ఏదో నిర్ణయం చెయ్యవలసి

వచ్చినట్టుగా ఆయన ముఖముద్ర చెప్తూ ఉన్నది: "జ్వాలాబాబూ! ఎందుకో తెలియదుగాని, నీ మీద నా కొక రకమైన మమకారం ఏర్పడింది. నాకు వెనకా, ముందు ఎవ్వరూ లేకపోవడం వల్ల కాబోలు నిన్నే నా కుమారునిలాగా అనుకొంటు వచ్చాను. నిన్ను కుమారునిగా భావించి నప్పుడు నీవు చెడిపోకుండా కాపాడడం తండ్రిగా నా విధి అవుతుంది. నీవెంతో నెమ్మదైన వాడివీ, అమాయకుడివీని.. నీకు దూరంగా ఉండా లంటే నాకు నిజంగా కష్టమే. కాని అదంతా నేను సహిస్తాను. నిన్ను కాపాడడానికి నాకు ఒకే మార్గం తోస్తుంది—నిన్ను ఇక్కడి నుండి మార్చి వెయ్యాలి. కమిషనరుగారు నేను చెప్తే కాదనరు. అలహాబాదు జిల్లాలో సోరావ్ తహసీల్దారు వచ్చే సంవత్సరం రిటైరవుతున్నారు. నేను కమిషనరుకు చెప్పి నిన్నక్కడ తహసీల్దారుగా వేయిస్తాను. నీకు ఇంత త్వరగా ప్రొమోషను ఇయ్యాలంటే కొందరు అభ్యంతర పెట్టవచ్చు. కాని చెప్పాను గదా, ఇది నాకుర్రవానికి సంబంధించిన సమస్య. ఏదో విధంగా కమిషనర్ను నేను ఒప్పిస్తాను."

జ్వాలా ప్రసాద్ తన దుఃఖాన్ని ఆపుకోలేక పోయారు: "అయ్యా, నేనపరాధిని. కాని తమరు నన్ను తమ దగ్గర లేకుండా చెయ్యవద్దు. ఇక ముందు నావల ఇలాంటి పొరపాటు జరగదని తమకు నేను హామీ ఇస్తాను."

మీర్‌సాహెబ్ నవ్వుతూ అన్నారు: "జ్వాలాబాబూ! ఒకసారి అడుగు ముందుకు పడ్డ తర్వాత ఇక అది వెనుకకు రాదు. అందువల్ల నీవు చెప్పే మాటలను, నీవు పెట్టుకొనే ఒట్లను నమ్మలేను. మమకారం, న్యాయం-ఈ రెంటికీ పొత్తు కుదరనప్పుడు న్యాయానికే ప్రాముఖ్యం ఇయ్యాలనే విషయం నీకు తెలుసు. కాని అన్యాయం కూడా మమకారంతో కూడుకొని ఉండాలి. నిన్ను ఇక్కడి నుండి ప్రొమోషను మీదనే పంపిస్తున్నాను."

"నన్ను తమరు శిక్షించండి" అన్నారు జ్వాలా ప్రసాద్.

"నీకు నేనిస్తున్నది శిక్షలాంటిదే జ్వాలాబాబూ! ఘాటంపూర్ ఇలాకా కంటె సోరావ్ తహసీలు చిన్నదే అవుతుంది." అంటూ మీర్‌సాహెబ్ నవ్వారు.

మరుసటిరోజు ఉదయం లేవగానే మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్ దగ్గరికి వచ్చి కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ విచారంతో గంభీరంగా

కూర్చుని ఉన్నారు. ఆయనకు రాత్రి బాగా నిద్ర కూడా పట్టలేదు. గజరాజ సింగు తన ఇంట్లో ఏర్పాటు చేసిన విందులో జ్వాలా ప్రసాదును ప్రశంసించినప్పుడు మున్షీ శివలాల్‌కు ఆనందంగానే ఉంది. కాని తన కుమారుడు వందవరహాలు ఎవరికో ధర్మం చేశాడనే విషయం ఆయన సహించలేక పోతున్నారు. మున్షీ శివలాల్ ఇంతవరకూ తన కుమారుడు సచ్చరిత్రుడనీ, నిజాయితీ కలవాడనీ అనుకుంటున్నారు. కాని జ్వాలా ప్రసాద్ బిర్‌జోర్‌సింగు భార్యకు వంద వరహాలిచ్చాడనే సంగతి విన్నప్పటి నుండి ఈయన మనస్సులో శంకాపిశాచం ప్రవేశించింది. రెండు నెల్ల క్రితం ఆయన తమ్ముడు రాధేలాల్ పొలం కొనేందుకు రెండు వందల యాభైరూపాయలు అడిగితే జ్వాలా ప్రసాద్ తన జమా ఖర్చంతా చూపించి చివరకు తన దగ్గర నిలవ ఏమీ లేదని తేల్చేశారు. నిన్న రాత్రి ఈ వంద వరహాల మాట వినేసరికి మున్షీ శివలాల్ మనస్సు చివుక్కుమన్నది. ఎంతో వెమ్మదైనవాడు, అమాయకుడు అని తాననుకుంటున్న తన కుమారుడే తనకు తెలియకుండా కొన్ని రహస్యాలు దాచుతున్నాడని ఆయన బాధ పడ్డారు.

తండ్రిగారి ముఖవైఖరి చూచి జ్వాలా ప్రసాద్ సందేహించారు. శివలాల్ దగ్గర కూర్చుని అడిగారు: "బిర్‌జోర్‌సింగు భార్యకు నీవు వంద వరహాలిచ్చావనే విషయం నిన్న రాత్రే నాకు తెలిసింది. నాకెంతో ఆశ్చర్యం వేసింది. రాధా పొలం కొనాలని రెండువందల యాభై రూపాయలు అడిగితే నీవు నాదగ్గర లేదని చెప్పేశావు."

జ్వాలా ప్రసాద్ తడబడబడుతూ శివలాల్‌తో అన్నారు: "అవును, అది నాసొమ్ము కాదు. ఇంటి లెక్కంతా మీరే చూస్తారు కదా! వచ్చిన జీతం వచ్చినట్టు నేను మీకే ఇస్తున్నాను."

మున్షీ శివలాల్ మరింత గాంభీర్యంతో అన్నారు. "అవును, జీతం మాత్రం నీవు లెక్క ప్రకారం నాకు ఇచ్చేస్తావు. కాని ఈ పైసంపాద్యం ఎక్కడికి వెళ్లుతున్నదో నాకేం తెలుసు? ఇంతవరకూ నీవు పైసంపాద్యం జోలికి వెళ్ళడం లేదనే నేననుకుంటూ వచ్చాను. కాని నేను పొరబాటు పడ్డాను. ఇప్పుడు నా కసలు విషయం తెలిసింది."

జ్వాలా ప్రసాద్ కంఠం స్తంభించింది. "నేను మీకు నిజం చెప్తున్నాను. నాకు పైసంపాద్యం అంటూ ఏమీ లేదు. ఆ వరహాలు నావి కావు.

ఒక్క దమ్మిడీయైనా సరే లంచం తీసుకోవడం పాపమనే నేను భావిస్తాను. ఈ విషయం నేను ఒట్టు వేసుకుని చెప్పగలను.''

మున్షీ శివలాల్ చిక్కున పడ్డారు. ఒక్క క్షణం ఆయన ఆలోచించి చాలా కచ్చితంగా అడిగారు: ''మరి ఆ డబ్బెవరిచ్చారు? ప్రపంచమంతా ఆ డబ్బు నీవే ఆమె కిచ్చావని అనుకుంటున్నది. ఈ కలియుగంలో అంతటి దీనబాంధవుడెవడో చెప్పు. నాకు కూడా తెలిసి ఉంటుంది.''

జ్వాలా ప్రసాద్‌కు ఇష్టం లేక పోయినా సమాధానం చెప్పక తప్పింది కాదు: ''అలాగే చెప్తాను. కాని ఇంకెవ్వరితో చెప్పవద్దు. మీరు బలవంతం చేస్తున్నారు కాబట్టి మీకయినా చెప్తున్నాను. ఆ డబ్బు నంబరుదారు భార్య జైదేయి బర్ జోర్‌సింగు భార్యకు నా చేత ఇప్పించింది. ఆ డబ్బుతో ఆమె అప్పు తీర్చి పొలం మళ్ళీ కొనుక్కునేందుకు ఆమె అలా చేసింది.''

మున్షీ శివలాల్ ముఖంమీద కనిపించే విషాదరేఖలు అకస్మాత్తుగా విడిపోయాయి. ఆయన నేత్రాలు ఆనందంతో వెలుగ సాగాయి: ''అలాగా! ఇప్పుడర్థమయింది. నంబరుదారు భార్య జైదేయి సంగతి నాకు తట్టనేలేదు. అయితే మరి నంబరుదారు భార్య జైదేయి నీ మాట మీద ఈడబ్బు బర్ జోర్ సింగు భార్యకు ఇచ్చిందని నేను భావిస్తే అందులో పొరపాటేమీ లేదు.''

జ్వాలా ప్రసాద్ మళ్ళీ నిజం చెప్పాల్సి వచ్చింది: ''అవును, ఇలాంటి ప్రాపంచిక విషయాల్లో మీరెప్పుడూ పొరపాటు పడరు.''

నిజం చెప్పేసరికి మున్షీ శివలాల్ ముఖముద్ర మారింది. ఆయన నవ్వుతూ అన్నారు: ''అబ్బాయ్ జ్వాలా! నీ అదృష్టం పండింది. భలే పిట్టను కొట్టేశావు. కాని ఇకముందు ఇలా ఇతరులకు దాన ధర్మంగా డబ్బియ్యనని ఒట్టు పెట్టుకో. ఇల్లూ, వాకిలీ ఆస్తి, పాస్తిని ఏర్పరుచుకో. నంబరుదారు భార్య జైదేయి దగ్గర రొక్కం, సొమ్ము అంతా కలిసి ఎన్ని లక్షల ఆస్తో ఉంది.''

జ్వాలా ప్రసాద్ తన తండ్రి అన్నమాటకు సమాధాన మేమీ చెప్పలేదు. ఆయన మనస్సులో తన మీద, తన తండ్రి మీద, చివరకు ప్రపంచం మీదనే ఒకరకమైన విరక్తి ఏర్పడింది.

ఎనిమిది

త్రివేణీ స్నానంచేసి మున్షీ శివలాల్ తన బస చేరుకునేసరికి ఆయన చాలా అలిసిపోయారు. ఛింకీ పొయ్యిరాజేసి పులగం తయారుచేయడానికి ఏర్పాట్లు చేస్తూ ఉంది.

మున్షీ శివలాల్ త్రివేణీ తీరంలో కల్పావాసం చేస్తున్నారు. సోరావ్ వచ్చినతర్వాత ఆయన ప్రతి సంవత్సరం మాఘమాసంలో ఇలాగే కల్పావాసం చేస్తూ ఉన్నారు. ప్రయాగ సంగమం నుండి ఆయన బసకు దాదాపు ఒక ఫర్లాంగు దూరం ఉంటుంది. ఆ బస చాల జాగ్రత్తగా ఏర్పాటు చేయబడింది. నీటి భయంగానీ, గాలి భయంగానీ లేకుండా విశాలంగా ఉండేటట్టు ఆ పర్ణశాలను నిర్మించుకున్నారు.

ఛింకీ స్నానంచేసి వచ్చేసరికి ఒకవైపు మున్షీ శివలాల్ దుప్పటి కప్పుకొని పండుకొని ఉన్నారు. మరోవైపు పొయ్యి ఆరిపోయినట్టుగా ఉంది. మున్షీ శివలాల్ తల దగ్గరికి వచ్చి ఛింకీ అన్నది: "ఏమయింది, ఒంట్లో కులాసాగా ఉందా? పొయ్యి ఆరిపోయింది. పులగం ఉడుకు బట్టినట్టులేదు. పాలుమాలితే ప్రయోజనంలేదు. వెళ్ళి పొయ్యి వెలిగించండి. పులగం ఫలహారంచేసి హాయిగా పండుకొండి. మిమ్మల్ని కదిలించే వాళ్ళుండరు."

మున్షీ శివలాల్ దుప్పటిలోనుంచే సమాధానం చెప్పారు: "నీవే కొంచెం ఊదుదూ! పులగం ఉడుకుబట్టిన తర్వాత నాకు చెప్పు. నేనువచ్చి దించుకుని తింటాను. ఇప్పుడు నాకు లేవాలనిపించడం లేదు."

"అయ్యో రామ! అన్నం వండేచోటికి నే నెలా వెళ్లను బాబా! కల్పావాసం చేస్తున్నారు గదా బాబయ్యా కొంచెం అంటూ, సొంటూ ఉండద్దూ! నేను వంటగదిలోకి వెళితే వంటకు మైల సోకుతుంది."

"సోకితే సోకనీ! ఈ వంటతో నాకు విసుగు వేసింది. రాధూ భార్యో, వాడి కోడలో వచ్చారంటే ఆ మాత్రం కూడా వీలుండదు. పులగం తయారయిన తర్వాత పళ్ళెంలో వడ్డించి నన్ను పిలువు. ఇప్పుడు మాత్రం నేను లేచి రాలేను. ఈ రోజు చలి విపరీతంగా ఉంది."

మున్షీ శివలాల్ మాటలకు ఛింకీ నిలబడి పోయింది: "మీరనేది చాలా వింతగా ఉంది. మీరు నా చేతి వంట భోం చేస్తారా? రాత్రిపూట ఎటూ

నేనుచేసిన పూరీ కూరా తింటూనే ఉన్నారు. పగలు మీరు చేసుకుంటే బాగుంటుంది. చేసుకొనేందుకు అంత బద్ధకమయితే పాలుతాగండి. మధ్యాహ్నానికి రొట్టెలు చేసుకోవచ్చు.''

మున్షీ శివలాల్ గదుముతూ అన్నారు: ''అలా వీల్లేదు. నాకు చాలా ఆకలిగా ఉంది. పులగం తిని తీరాల్సిందే. నేను చెప్పిన మాట విని పులగం వండేసెయి.''

ఛింకీ కండ్లల్లో నీళ్ళు నిండాయి: ''మీకు దణ్ణం పెడతాను. నా చేత ఈ పాపం చేయించకండి. నేను వంటింట్లో అడుగు పెట్టను. మీ పుణ్య లోకం నా వల్ల చెడిపోవడం కుదరదు.''

మున్షీ శివలాల్‌కు కోపం వచ్చింది. ఆయన లేచి ఛింకీమీద చెయ్యి చేసుకున్నారు: ''మహా పుణ్యలోకంనుంచి ఊడిపడ్డట్టే మాట్లాడుతున్నావు! నా మాట విని పులగం చెయ్యి వెళ్ళి.'' తర్వాత మున్షీ శివలాల్ మళ్ళీ దుప్పటి కప్పుకుని పండుకున్నారు.

ఛింకీ మళ్ళీ మాట్లాడకుండా కన్నీరు తుడుచుకొంటూ వంటింట్లోకి వెళ్ళింది; పొయ్యి వెలిగించ సాగింది. పులగం ఉడుకుతూ ఉంటే పొయ్యిదగ్గర కూర్చుని ఛింకీ ఏదేదో అనుకొంటున్నది: ''గంగమ తల్లీ! నీవు సాక్ష్యం. ఈయన ఆచారం చెడగొట్టడానికి నేనేమీ చేయడం లేదు. ఆయన మతి చెడిపోయింది. ఆయన్ని క్షమించమ్మా. నేను వండిన అన్నంతింటే ఆయన ఆచారం చెడిపోతుంది. కాదని నేను వండకపోతే ఆయన ఆకలితో పండుకుంటారు. పైన కొట్టడానికి లేస్తున్నారు.''

''పులగం తయారయింది. వచ్చి తొందరగా తినేయండి. మధ్యాహ్నం డిప్టీ దొరగారి ఇంటికి వెళ్ళాల్సిన పనికూడా ఉంది కాబోలు!'' అన్నది ఛింకీ.

మున్షీ శివలాల్ లేచి చొక్కా, బనీను విడిచారు. ఉన్ని ఖాదీను కప్పుకొని పీటమీద కూర్చున్నారు. ''తీసుకురా! త్వరగా వడ్డించేసెయి. డిప్టీ సాహబ్ దగ్గరికి వెళ్లాల్సిన సంగతి నేను మరిచేపొయ్యాను.''

ఛింకీ వడ్డించింది. మున్షీ శివలాల్ తినడం ఆరంభించారు: ''ఇవ్వాళే చూస్తున్నాను పులగం రుచి. వంట చేతకానివాణ్ణి చెయ్యి చెయ్యి అంటే ఎలా చెయ్యడం. ఇంకొంచెం పులగం పెట్టు. కొంచెం ఉర్లగడ్డ కూర కూడా వెయ్యి. ఎంత రుచిగా ఉంది!''

ఛింకీ చందాతో పులగంతీసి మున్షీ శివలాల్ పళ్లెంలో వడ్డించే

సమయానికి సరిగ్గా మున్షీ రాధేలాల్ పర్ణశాలలోకి ప్రవేశించారు. రాధేలాల్ ఒంటరిగా రాలేదు. ఆయన భార్య కూడా వచ్చింది.

రాధేలాల్‌ను, ఆయన భార్యను చూచి ఛింకి తనేదో తప్పుచేశానని లేచి నిలబడి పక్కకు తొలిగింది. మున్షీ శివలాల్ అన్నారు: "రారా రాధూ! మంచి పనిచేశావు మరదల్ని కూడా తీసుకు వచ్చావు. ఇక్కడ నాకు అన్నాని కెంతో ఇబ్బందిగా ఉంది. ఇంట్లో అంతా కులాసా?"

రాధేలాల్ సమాధానం చెప్పారు: "ఆ, అంతా కులాసా అనే అనుకో. ఏం చెప్పనన్నయ్యా, ఎంత వెదికినా కిషన్ జాడ తెలియలేదు. కొంతమంది వాణ్ణి కాశీలో సాధువుల మఠాలో చూచారుట. ఇప్పుడు అక్కడినుండి కూడా తప్పించుకు పోయాడుట. ఒకతట్టు వాడికి పెండ్లి చేయాల్సిన రోజులు దగ్గరకి వస్తూ ఉన్నాయి. అటు వాడేమో కనిపించకుండా వెళ్ళి పోయాడు. జ్వాలాకు ఎంతో చెప్పాను-కాస్త వాడి జాడా కనిపెట్టరా అని. కాని జ్వాలాకు తీరితేగా!"

మున్షీ శివలాల్ భోంచేసి కాళ్ళూ చేతులూ కడుక్కుంటున్నారు. "అవును పెండ్లి చేయాల్సిన ఈడు వచ్చింది. కాని నా మాట విని వాడికిప్పుడల్లా పెండ్లి చేయకు. పరాయివాండ్ల పిల్లను తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుంటావు. మన కిషన్ సంగతి బొత్తిగా నమ్మడానికి వీల్లేదు. వీడు బొత్తిగా దేశదిమ్మరయి పోయినాడు.

మున్షీ రాధేలాల్ భార్యకు తన పిల్లవాణ్ణి గురించి వాళ్ళు అలా అనుకోడం బాగా లేదు. కంట తడి బెట్టుకుంటూ ఆమె అన్నది: మా కిషన్‌కు ఏమీ తెలియదు. ఎవరలా చేప్తే అలా చేస్తాడు. పెండ్లయితే అన్నీ సరిపోతాయి. బావగారూ! జ్వాలా పెద్ద ఆఫీసరు కదా! గట్టిగా పట్టుపడితే ఒక్కరోజులో కిషన్ జాడ కనుక్కో గలుగుతాడు. మా మాట జ్వాలా వినను కూడా వినడు. తన తమ్ముడు ఇలా చెడిపోతూ ఉంటే చూస్తూ ఊరుకోడం అతనికి మాత్రం ధర్మమా?"

జ్వాలాను గురించి చేసిన ఈ విమర్శ ఛింకి సహించలేక పోయింది: "అన్నింటికీ జ్వాలానంటే ఎన్నని చేస్తాడు? అప్పటికీ అన్ని పనులూ ఆయన చూచుకుంటూనే ఉన్నారు. ఇంకా ఇంటింటికి వెళ్ళి కిషన్‌ను వెదుక్కొని వస్తారా? అటు తహసీల్దారు పని చూచుకుంటారా, ఇటు కిషన్‌ను వెదుకుతూ దేశమంతా ప్రదక్షిణం చేస్తారా?"

రాధేలాల్ భార్య, కోపంతో అన్నది: "నీవు మాట్లాడక్కర్లేదు, ఛింకీ! చాలు, చాలు, జ్వాలాను వెనకేసుకుని వస్తున్నావు."

మున్షీ శివలాల్ కూడా మెల్లగా మందలించారు: "సీ కెందుకే ఇవన్నీ?" అంటూ రాధేలాల్ వైపు తిరిగి అన్నారు: "అయితే రాధా! ఇంకా మీరు భోజనం చేసినట్టులేదు. ఛింకీ, మిఠాయి దుకాణానికి వెళ్ళి ఒక సేరు పూరీ, మిఠాయి తీసుకుని రా?"

మున్షీ శివలాల్ భోంచేసిన ఎంగిలి పళ్ళెం ఎత్తుతు ఛింకీ అన్నది: "వంటిల్లు నేనిప్పుడే శుభ్రం చేసేస్తాను. ఈలోగా చిన్నమ్మగారు స్నానం చేసి వస్తారు. కాసేపట్లో భోజనం తయారయి పోతుంది. బజారు ఫలహారాలతో కడుపు నిండుతుందా ఎవరికైనా!"

రాధేలాల్ అన్నారు; "అక్కర్లేదు. ఇప్పుడు వంటిల్లు శుభ్రం చేయవలసిన పని లేదు. దూరప్రయాణం చేసి అందరం అలిసిపోయినాం. స్నానం చేసేవేళ కూడా దాటిపోయింది. వెళ్ళి పూరీ, మిఠాయి తీసుకురా!"

"అయితే నేనే పూరీ - కూరా చేస్తాను." అని ఛింకీ మరోసారి ప్రయత్నించి చూచింది.

ఈసారి రాధేలాల్ భార్య సమాధానం చెప్పింది: "అవునమ్మా! ఛింకీ రాణీ! వంటిల్లంతా నీకు స్వాధీనమై పోయిందిగా! బావగారికి నీ చేతి అన్నం పెట్టి ఆయన ఆచారం అంతా చెడగొట్టేశావు. ఇక మమ్మల్ని కూడా భ్రష్టులను చేయాలని చూస్తున్నావు. ఈయన నన్ను అనవసరంగా వెంటబెట్టుకొని వచ్చారు. ఛింకీరాణీ బావగారికి రొట్టెలుచేసి పెడుతూనే ఉంది."

రాధేలాల్ అన్నారు: "ఏమే ఛింకీ! అన్నగారి సంగతలా ఉంచు. అరవయ్యో పడిలో బడి ఆయన మతి భ్రష్టమై పోయింది. కాని ఆయనకు నీచేతి వంట పెట్టడానికి నీకెలాబుద్ధి పుట్టింది?"

ఛింకీ బిక్కు మొహం వేసికొని మున్షీ శివలాల్ వైపు చూసింది. మున్షీ శివలాల్ అన్నారు: "రోజూ నేనే వండుకుంటాను. ఈరోజు కూడా అన్నం వండడానికి ఏర్పాట్లన్నీ ఇది చేసేసింది. కాని గంగలో స్నానంచేసి వచ్చే సరికి నాకెక్కడ లేని బద్ధకం వేసింది. నీవే వండవే అని నేనే చెప్పాను." కొంచెంసేపు ఆగి ఆయన అన్నారు: "నాకు అన్నం వండిపెట్టినందువల్ల

దానికిగానీ, దానిచేతి అన్నం తిన్నందువల్ల నాకుగానీ కొంప మునిగిందేమీ లేదు. దీనిలో ఎవరికీ ఏమీ పాపం లేదనే నా ఉద్దేశ్యం."

రాధేలాల్ కొంచెం సంకోచిస్తూ అన్నారు: "అది నిజమేననుకో. కాని మన కులం వాళ్ళు దీన్ని పాపంగానే భావిస్తారు. పోనీ, అయిందేమో అయింది. ఇప్పుడిక మీ మరదలు వచ్చిందిగా. అదే వండుతుంది. నీవు ఛింకీ చేతి భోజనం తిన్నావనే విషయం ఎవరి చెవినీ పడకుండా ఉంచేదాలు."

ఛింకీ ఏదో తప్పుచేసిన దానిలాగా దిగులుపడి రాధేలాల్‌కు అతని భార్యకూ పూరీ, మిఠాయి తీసుక రావడానికి వెళ్ళింది. మున్షీ శివలాల్ బట్టలు వేసుకుని ఒక గంట ముందుగానే డిప్టీకలెక్టరు ఇంటికి బయలుదేరి వెళ్ళారు.

డిప్టీ కలెక్టర్ ఠాకుర్ ధమ్మన్‌సింగు తిరణాల ప్రదేశమంతా పర్యటించి అప్పుడే వచ్చారు. వాలు కుర్చీలో కూర్చుని ఆనాటి వార్తాపత్రిక చదువుతున్నారు. ఆయన లేచి మున్షీ శివలాల్‌కు స్వాగతం చెప్పారు: "రండి, శివలాల్‌గారూ! ఇవ్వేళ మీరు విశ్రాంతి తీసుకున్నట్టే లేరు. మీటింగు కింకా ఒక గంట టైముంది."

మున్షీ శివలాల్ అలసిపోయినట్టుగా ఎదురుగాఉన్న కుర్చీలో కూర్చున్నారు: "ఏం చెయ్యమంటారు చెప్పండి. మా తమ్ముడూ, మరదలూ వచ్చారు. నేనిలా వచ్చాను. విచిత్రమైన సమస్యలో చిక్కుకున్నారు వాళ్ళు. మా తమ్ముడి కొడుకు చాల రోజుల క్రితం ఇంటి నుండి వెళ్ళిపొయ్యాడు. ఎక్కడో సాధువుల్లో చేరిపోయాడని వినికిడి. కాశీలో ఒక సాధువుల మఠాలో కనిపించాడుట. కాని ఇప్పుడక్కడ నుంచి కూడా పారిపోయాడుట. బహుశా ఈ మాఘ తిరునాళ్ళకు వచ్చిఉంటవచ్చునని వాడికోసం వెతుక్కుంటూ వాళ్ళిక్కడికి వచ్చారు."

ఠాకుర్ ధమ్మన్‌సింగు కొంచెంసేపు తనలోతాను ఏదో ఆలోచిస్తూ ఉన్నారు. కొంచెం సేపటికి ఆయన అడిగారు: "అతని వయస్సెంత ఉంటుంది? అతని ఆనవాళ్లు నాకు చెప్పగలరా?"

"అదే, షుమారు ఇరవై నాలుగు-ఇరవై ఐదు సంవత్సరాల వయస్సుంటుంది. సన్నగా ఉంటాడు. అంత పొడుగూ కాదు, పొట్టీకాదు. మధ్య రకంలో ఉంటాడు. గోధుమవన్నె శరీరం, సోల మొహం, నొసటిమీద మచ్చ."

"దాదాపు ఇవే పోలికలు" అనుకున్నారు ఠాకుర్ థమ్మన్‌సింగు తనలో తాను.

"ఏమండీ ఠాకుర్‌గారూ! అనవాలెందుకడుగుతున్నారు?"

"ఈ రోజు ఉదయం దాదాపు ఇలాంటి పోలికలుగల యువకుడొకడు ఆడవాళ్ళ వెంబడిబడుతూ ఉంటే అతన్ని పట్టుకున్నారు. అతను కూడా సాధువులతోపాటు మాఘ తిరునాళ్ళలో తిరుగుతున్నాడు. తర్వాత అతనిక్కడనే కరీమన్ ఇంట్లోనే ఉంటున్నాడని తెలిసింది. అతన్ని ఇప్పుడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన పేరూ, చిరునామా చెప్పమంటే చెప్పడం లేదు. ఇప్పుడే ఈ మీటింగుకు పోలీసు ఇన్స్పెక్టర్ బిషన్ దయాల్ వస్తూనే ఉంటారు. ఆయనవల్ల పూర్తి వివరాలు తెలుస్తాయి. ఆ సాధువు దుష్ప్రవర్తన కలవాడనీ, ఊరికే తిరుగుతూ ఉంటాడని అనుకుంటున్నారు."

కరీమన్ పేరు విని మున్షీ శివలాల్ సందేహించారు. కాని తన సందేహాన్ని నివారించుకునేందుకు ఆయన అన్నారు: "అయితే అతను కిషన్ అయి ఉండడు. అతను కరీమన్ ఇంట్లో ఎలా ఉంటాడు! వాడి దుష్ప్రవర్తనను గురించి కూడా ఇంత వరకేమీ వినలేదు."

ఠాకుర్ థమ్మన్‌సింగు నవ్వుతూ అన్నారు: "అలా అనకండి! ఈ రోజుల్లో ఇలాంటి కుర్రవాళ్ళను గురించి ఏమీ చెప్పేందుకు లేదు. బిషన్ దయాలుకు చెప్పి మీటింగు కాగానే అతన్నే ఇక్కడికి పిలిపిద్దాం. మీరే అతన్ని చూచి పోల్చుకుందురుగాని."

పోలీస్ ఇన్స్పెక్టరు బిషన్‌దయాల్ ఆ సాధువును ఠాకుర్ థమ్మన్‌సింగు శిబిరానికి తీసుకు వచ్చారు. అక్కడికి పిల్చుకు వచ్చిన మున్షీ రాధేలాల్ అతన్ని చూడగానే కేక పెట్టారు: "అరే కిషన్, ఇలా అయిపోయినావేంరా? మా పరువంతా తీసేశావు గదరా!"

కిషన్‌లాల్ తన తండ్రిని చూడగానే పెద్దగా ఏడ్చాడు: "నన్ను రక్షించు నాన్నా! వీళ్ళు నా ప్రాణం తీసేస్తున్నారు. నన్ను రక్షించు." అంటూ అతను గిలగిల తన్నుకొని నేలమీదపడి పొయ్యాడు.

కిషన్‌లాల్ శరీరమంతా బొబ్బ లెక్కపోయింది. అక్కడక్కడ చర్మం లేచిపోయి రక్తం కారుతూ ఉంది. అతనికి బాగా దెబ్బలు తగిలినట్టు కనిపిస్తున్నది. ఇంకా దెబ్బలు తినడం పూర్తి అయినట్టుగా కూడా లేదు.

మున్షీ శివలాల్ పోలీసు ఇన్స్పెక్టర్ బిషన్ దయాల్‌ని అడిగారు: "ఇన్స్పెక్టరుగారూ! ఇతనికి ఇన్ని దెబ్బలెందుకు తగిలినాయండీ?"

"అలా దెబ్బలు తగలబట్టే ఒక వారం రోజులనుంచి కరీమన్ దగ్గర తను కాపురం ఉంటున్నాననే విషయం ఇతను బయట బెట్టాడు. తన పేరూ, ఊరూ ఏమీ చెప్పడం లేదు. అందువల్ల ఇతన్ని బాధించవలసి వచ్చింది. కరీమన్ ఇతన్ని గురించి చెప్పిన సంగతులన్నీ ఇతని నోట చెప్పించి ఋజువు చేసుకోవాలి గదా మరి! గొప్పవాళ్ళతో కూడిన విషయం!" అంటూ ఇన్స్పెక్టరు కిషన్‌లాల్ నన్వారు.

ఠాకుర్ థమ్మన్‌సింగు నవ్వుతూ అన్నారు: "పోనియ్యండి, పేరూ, ఊరూ తెలిసిపోయినాయి. ఉదయం ఇతను చేసిన అల్లరికి శిక్ష కూడా పూర్తిగా అనుభవించాడు. ఇక ఇతన్ని కొంచెం అదుపులో పెట్టండి మున్షి శివలాల్‌గారూ! ఇతన్ని ఏదయినా పనిలో ప్రవేశ పెట్టండి." ఈ మాటలు చెప్పి ఠాకుర్ థమ్మన్‌సింగు కిషన్‌లాల్ చేతి సంకెళ్ళు విడిపించారు.

మున్షీ శివలాల్ తిరిగి తన బసకు చేరుకునేసరికి ఆయనకు బయటికి లోపలి నుండి కేకలు వినిపిస్తున్నాయి. రాధేలాల్ భార్యకూ, ఛింకీకి మధ్య తీవ్రంగా వాగ్వాదం జరుగుతూ ఉంది. రాధేలాల్ భార్య ఛింకీని ఫతేపూర్ పంపించి తనిక్కడ ఉన్నన్నాళ్ళూ అక్కడ ఇల్లు జాగ్రత్తగా కాపాడే బాధ్యత దానికి ఒప్పచెప్పాలని చూస్తూ ఉంది. కాని ఛింకీ దానికి ఒప్పుకోటం లేదు. జ్వాలాప్రసాద్ భార్య యమునకూ, వాండ్ల పిల్లవాడు గంగాప్రసాద్‌కు పరిచర్య చేయడానికి వాళ్ళతో సోరావ్ వెళ్ళాలని దాని కోరిక. రాధేలాల్ భార్య ధోరణి చాలా తీవ్రరూపం ధరించింది. మున్షీ శివలాల్ తన బసను సమీపించేసరికి ఆయనకు రాధేలాల్ భార్య కఠోర కంఠం వినిపించింది: "బావగారి ఆచారం, నిష్ఠా అంతా చెడ గొట్టేసి ఇప్పుడు మాతో నోరు చేసుకుంటున్నావా? బావగారూ నీవంతే, జ్వాలా నీవంతే అయితే నీవే చూచుకో వాళ్ళ సంగతి. మేము ఈ రోజే వెళ్ళి పోతాం. నీవే రాజ్యమేలుకో. నీవు ఫతేపూర్ పోతేనే మేమిక్కడ ఉండేది. ఆయన వచ్చిన తర్వాత ఆయన్నీ, బావగారినీ కూర్చోబెట్టి నీ సంగతేదో తేలుస్తాను. నీ సంగతి నీవు మరిచిపోతున్నావు."

రాధేలాల్ భార్య కఠోర కంఠం విని మున్షీ శివలాల్ స్తంభించి

పొయ్యారు. మున్షీ శివలాల్ సంయుక్త కుటుంబానికి చెందినవాడు. ఈ కుటుంబంలో రాధేలాల్ భార్యదే పెత్తనం. ఈ పెత్తనానికి మున్షీ శివలాల్ అలవాటు పడ్డారు. బస లోపలికి వెళ్ళేందుకు ఆయనకు ధైర్యం చాలలేదు. అక్కడినుండి ఆయన వెనక్కి తిరిగారు.

ఎక్కడికి వెళ్ళాలో తెలియకుండా ఆయన తిరునాళ్ల చూస్తూ తిరుగుతూ ఉన్నారు. ఆయన మనస్సు బరువెక్కింది. ఆయన ప్రాణం ప్రహార పరంపరలతో విసిగి పోతున్నది. ప్రపంచమంతా మారిపోతున్నట్లు తోచింది.

సాయంత్రం కావచ్చింది. చలిగాలి విపరీతంగా వీస్తూ ఉంది. ఉత్తరం వైపునుండి చిన్న చిన్న మబ్బులు ఆకాశంలో తేలుతూ వస్తూ ఉన్నాయి. వాతావరణమంతా విక్షుబ్ధంగా మారిపోతూ ఉంది. మున్షీ శివలాల్ చాలా సేపు నిరుద్దేశ్యంగా నిష్ప్రయోజనంగా తిరిగారు. మాఘ తిరునాళకు జనం విపరీతంగా వస్తున్నారు. మరుసటి రోజు కాక ఆ తర్వాత రోజే మకర సంక్రమణం. చలి బాగా హెచ్చింది. ఆయన కాళ్ళిక ముందుకు సాగడం లేదు. అప్పుడాయన ఇష్టం లేకపోయినా విధిలేక తన బసకు తిరిగి వెళ్ళారు.

ఇప్పుడాయన బసలో చాలా సందడిగా ఉంది. తగాదా ఆగిపోయింది. ఛింకీ వంటకు కావలసిన ఏర్పాట్లు చేస్తూ ఉంది. మున్షీ శివలాల్ ఎవ్వరితో మాట్లాడకుండా నేరుగా మంచంమీద దుప్పటి కప్పుకొని పండుకున్నారు. మున్షీ రాధేలాల్, ఆయన భార్య, కిషన్‌లాల్, ఛింకీ–వీళ్ళ మాటలు వినబడుతూ ఉన్నాయి. ఈ మాటలు చాలా దూరంగా వినబడుతున్నట్లు మున్షీ శివలాల్‌కు అనిపించింది. అవి దూరంగానే లీనమైపోతున్నాయి. ఉండి ఉండి ఆయన ఉలిక్కిపడి లేస్తున్నారు. మాటలు వినబడుతున్నాయి. కాని ఆయనకవి బోధపడడం లేదు. మాటలు వినబడుతున్నాయే కాని వాటిలో ఆయనకు ఆసక్తి కనిపించడం లేదు. ఆ మాటలు కేవలం జీవన జాగరణాలకు తార్కాణంగానే ఆయన భావించారు. మున్షీ శివలాల్‌కు నిద్రపడుతూ ఉన్నది. కాని అది, పని లేక పోవడం వల్ల వచ్చిన నిద్ర. మాటిమాటికీ దూరం నుండి వినవచ్చే ఆ మాటలు ఆ నిద్రను పదే పదే భంగ పరుస్తూనే ఉన్నాయి. ఇంతలో ఎవరో ఆయన శరీరాన్ని కదిలించినట్లు తోచింది. ఆయన కండ్లు తెరచి

చూచారు. ఛింకీ తలవైపు నిలబడి ఆయనతో అంటూ ఉంది: "ఎంతసేపు నిద్రపోతారు? ఇక లేవండి. జ్వాలాబాబు వచ్చారు చూడండి. వంట కూడా తయారయింది."

జ్వాలా పేరు వినగానే మున్షీ శివలాల్ చటుక్కున లేచి కూర్చున్నారు.

శివలాల్ వేసుకున్న పర్ణశాలలో జనసంఖ్య చాలా పెరిగి పోయిందనే సంగతి ఆయన గమనించారు. నేలమీద తివాచీలు పరిచారు. ఆ తివాచీలమీద పరుపులు వేశారు. అతనెప్పుడూ చూడని ఆడవాళ్లెవరెవరో అక్కడ కూర్చుని ఉన్నారు.

జ్వాలా ప్రసాద్ శివలాల్ దగ్గరికివచ్చి ఆయన కాళ్లకు నమస్కరించారు. "ఈమె ఘాటంపూర్ నంబరుదారు భార్య జైదేయి నాన్నా! ఆమె లక్ష్మీ చందు భార్య. మాఘపు తిరునాళ్లకు ప్రయాగలో స్నానం చేయడానికి వచ్చారు. లక్ష్మీచంద్ నాకు వ్రాస్తే నేనతనికి అలాగే రమ్మని వ్రాశాను-ఎటూ మీ పర్ణశాల విశాలంగా ఉండనే ఉంది గదా అని. ఇక్కడ ఉండ డానికి వాళ్లకేమీ ఇబ్బంది ఉండదు. ఈరోజు సాయంత్రం బండికి వీళ్లంతా కాన్పూరునుండి వచ్చారు. నేను సోరావ్‌నుండి నేరుగా అలహా బాదు స్టేషనుకు వెళ్లి వీళ్ళను తీసుకువచ్చాను."

"మంచి పని చేశావు. మంచి పని చేశావు" అన్నారు మున్షీ శివలాల్. తర్వాత ఆయన మున్షీ రాధేలాల్, కిషన్‌లాల్, రాధేలాల్ భార్య కూర్చుని ఉన్న స్థలంవైపు చూపిస్తూ అన్నారు: "రాధూ, వాడి భార్య ఈ రోజు మధ్యాహ్నమే వచ్చేశారు. వాళ్ళు వచ్చిన ఒక జాముకల్లా కిషన్‌కూడా వచ్చేశాడు. అందరూ ఇక్కడనే చేరారు. అంతా భగవంతుని దయ" అంటూ శివలాల్ జ్వాలా ప్రసాద్ వైపు అర్థవంతంగా చూచారు.

జ్వాలా ప్రసాద్ తన తండ్రి చూపుల్లో ఉన్న అంతరార్థం గమనించి నట్టుగా అనేశారు: "నేను వెంటనే సోరావ్ వెళ్లాలి. ఎల్లుండికి అందర్నీ తీసుకుని గంగా స్నానానికి వస్తాను. కిషన్ని, బాబాయిని తీసుకుని నేను సోరావ్ వెళుతాను. వాళ్లతో అక్కడనే మాట్లాడుతాను."

మున్షీ శివలాల్ మనస్సు తేలిక పడింది. "అలా చేస్తే బాగానే ఉంటుంది. ఈ కిషన్ సంగతి కూడా ఏదో ఒక ఏర్పాటు చేస్తే బాగుంటుంది."

"అవును నాన్నా! నాకావిషయం తెలుసు. మీరేమీ దిగులు పెట్టుకో

వద్దు. మేమిద్దరమూ ఆలోచించి ఏదో ఒక మార్గం చూపించేందుకు ప్రయత్నిస్తాం.''

శివలాల్ మనస్సు మరింత తేలిక పడింది.

జ్వాలా ప్రసాద్ మళ్లీ చెప్పారు. "బహుశా రేపు లక్ష్మీచంద్ రావచ్చు. ఇక్కడ కలప కాంట్రాక్టు తీసుకున్నాడు. కొయ్యల్ని, చెక్క మిషను కొని కార్ఖానా పెట్టబోతున్నాడు. కాన్పూరులో వ్యాపారం బాగా పెంచేశా డతను. బట్టల వ్యాపారమే కాకుండా ఏదన్నా కొత్త వ్యాపారం కూడా సాగించాలని ప్రయత్నిస్తున్నాడు.''

మున్షీ శివలాల్ ఆశ్చర్యంతో జ్వాలా ప్రసాద్ వైపు చూచారు: "జ్వాలా, ఈ వడ్రంగి పని చెయ్యాలని అతనికెలా అనిపించిందో! ఏమన్నా పరువా, ప్రతిష్ఠా? వ్యాపారం పెంచాలనుకుంటే ఇక్కడకూడా ఒక బట్టలమిల్లు పెట్టగూడదూ!''

వైదేయి కొద్దిగా ముసుగు తొలగించి అన్నది: "అదే మామయ్యగారూ! నేను కూడా చెప్పి చూచాను. కొంచెం వంశ గౌరవం కూడా గమనించి పోవాలి గదా! కాని మరిదిగారు అతనకి తెలివి చెప్పవలసింది పోనిచ్చి అతన్నే సమర్థించారు. భగవంతుడి దయవల్ల ఘాటంపూర్ ఇలాకాలో మాకు కొరవేమీ లేదు. హాయిగా దర్జాగా జీవితం జరుగు తుంది. అదంతా పోనిచ్చి ఎక్కడెక్కడికో వెళ్లి ఏమేమో అవస్థలు పడతా నంటాడు మా లక్ష్మి. నాగపూర్ వెళ్లాడు. అక్కడి నుండి అలహాబాదు వచ్చాడు. కలప కార్ఖానా పెట్టాలని వాడి పట్టుదల.''

జ్వాలా ప్రసాద్‌కు నవ్వు వచ్చింది: "నాన్నగారూ! ఇది నవీనయుగం. మనం వడ్రంగి పని చేయాల్సిన పని ఏమీ లేదు. కలప సామాను తయారు చేసే కార్ఖానా పెడుతూన్నాడతను. వందలకొద్ది వడ్రంగులు ఆ కార్ఖానాలో పని చేస్తారు. యంత్రాల సహాయంతో అన్ని పనులూ అయి పోతాయి. మంచి మంచి కొత్తరకం నాజూకు సామానంతా తయారవు తుంది. లక్షల మీద వ్యాపారం సాగుతుంది. కొత్త ప్రపంచం కొత్త పద్ధతిలో నడుస్తుంది.''

ఈ కొత్త ప్రపంచం ఎలాంటి కొత్త పద్ధతిలో నడుస్తుందో మున్షీ శివలాల్‌కు అర్థం కాలేదు. అయినప్పటికీ నవీన యుగానికి చెందిన ఆయన కుమారుడు చెప్పింది తప్పుకాదనే ఆయన విశ్వాసం. "అవును,

అలహాబాదు పెద్ద పట్టణం, మన ప్రాంతానికి ముఖ్య పట్టణం. గవర్నరు గారు ఉండే చోటు. లావాదేవీలు, వ్యాపారం, డబ్బు అన్నీ ఇక్కడే ఉంటాయి.'' అన్నారు మున్షీ శివలాల్.

మున్షీ రాధేలాల్ ఈ చర్చలో పాల్గొనడానికి చాలా సార్లు ప్రయత్నించారు. తాను కూడా ఏదో విలువగల మాట అనాలని ఆయన ఉబలాట పడుతున్నారు. ఇక ఉండలేక అనేశారు: "అవును, వ్యాపారం లావాదేవీలు, డబ్బు-అన్నీ ఇక్కడ ఉన్న మాట నిజమే. కాని మన లావాదేవీలు, వ్యాపారాలూ ఇంగ్లీషువాళ్ళ పోటీకి తట్టుకుంటేనే మనకు వీటివల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుంది. అలహాబాదులో గవర్నమెంటు కొనుగోలుగల పెద్ద పెద్ద దుకాణాలన్నీ ఇంగ్లీషువాళ్ళ చేతుల్లోనే ఉన్నాయి. కనక లక్ష్మీచంద్ ఈ ఇంగ్లీషువాళ్ళతో పోటీచేసి నెగ్గవలసి ఉంటుంది జ్వాలా! ఇంగ్లీషు వాళ్ళతో పోటీ చెయ్యడం అంటే మాటలు కాదు. నేను పొరపాటు పడడంలేదు కదా జ్వాలాబాబూ!''

జ్వాలా ప్రసాద్‌కు చాలా ఆశ్చర్యం వేసింది. మున్షీ రాధేలాల్ చెప్పిన మాటల్లో నిజం ఉంది. అది వాస్తవికమైన సమస్య. జ్వాలా ప్రసాద్ ఈ విషయం ఎన్నడూ ఆలోచించలేదు. అందువల్ల ఈ విషయాన్ని గురించి కొంచెం ఆలోచించి ఆయన అన్నారు: "అవును, మిల్లులూ, ఫ్యాక్టరీలు అన్నీ ఇంగ్లీషువాళ్ళ చేతుల్లోనే ఉన్నాయి. ఈ కలప కార్ఖానా నడిపించడంలో కూడా ఇబ్బంది రావచ్చు. ఈ విషయమై నేను లక్ష్మీచంద్‌తో మాట్లాడుతాను. నేనీ విషయం అంతవరకు ఆలోచించ లేదు. కాని లక్ష్మీచంద్ కలకత్తా, బొంబాయి అన్ని ఊళ్ళూ తిరిగిన వాడు. అతనీ విషయం తప్పకుండా గమనించి ఉంటాడు.''

మున్షీ రాధేలాల్ తన ప్రత్యుత్పన్న మతికి లోలోపల మురుసుకుని మళ్ళీ అన్నారు: "అంతే కాదు. విదేశాలనుండి వచ్చే కొయ్యసామానుతో పోలిస్తే మన దేశంలో తయారయ్యే కొయ్య సామాను ఎందుకూ పనికిరాదు. విదేశాలనుండి కొయ్య సామాను ఎంతో తయారయి వస్తూ ఉన్నది. కాబట్టి జైదేయమ్మగారూ! ఈ విషయం లక్ష్మీచంద్‌కు తెలిసేటట్టు చెప్పండి. లేకుంటే మీ కోడలిచేత అతనికి చెప్పించి ఈ మిల్లుల జోలికి మీ లక్ష్మీచంద్ వెళ్ళకుండా చూడండి.''

జైదేయి జ్వాలా ప్రసాద్‌తో అన్నది: "జ్వాలాబాబూ! ఎల్లుండి లక్ష్మీ

చంద్ ఎటూ వస్తూనే ఉన్నాడు. కాబట్టి అతనితో ఈ విషయం మీరు మాట్లాడండి. నేను చెప్పితే వాడు ఏ మాత్రం లక్ష్యపెట్టడు. మీరు చెప్తే వినచ్చు."

ఒక మూలన లక్ష్మీచంద్ భార్య రాధ కూర్చుని ఈ సంభాషణ వింటూ ఉన్నది. అందులో కొన్ని విషయాలు ఆమెకు బోధపడు తున్నాయి. కొన్ని బోధ పడడం లేదు. కాని తన భర్తను విమర్శించడం మాత్రం ఆమెకు నచ్చలేదు. ఆమె తన అత్తగారి చెవిలో చెప్పింది. "అత్తయ్యా! చాలా పొద్దుపోతూ ఉంది. తిండి ప్రయత్నం చెయ్యనా?"

భోంచెయ్యాలనే విషయం జైదేయికి అప్పుడు గుర్తు వచ్చింది. "అలాగే తల్లీ! పూరీ-కూర చెయ్యి. ఛింకీ కూడా నీకు సాయం చేస్తుంది." తర్వాత ఆమె జ్వాలా ప్రసాద్‌తో అన్నది: "జ్వాలాబాబూ! భోంచేసిన తర్వాతనే సోరావ్ వెళ్ళండి. లేకుంటే రేపు ఉదయమే వెళ్ళవచ్చు. ఇప్పుడు బయలు దేరితే అర్ధరాత్రికి గాని చేరరు. చలి చాలా ఎక్కువగా ఉంది. ఇప్పుడు ప్రయాణం చెయ్యడం చాలా కష్టం."

"కష్టమేముందమ్మా, మేము ముగ్గురం మనుష్యులమున్నాం. ఒకితోడు జ్వాలా చేతుల్లో ఇక్కా ఉండనే ఉంది. పూరీ-కూర బజారు నుంచి క్షణంలో తెప్పించేసేయచ్చు. అనవసరంగా మీ కోడల్ని ఎందుకు శ్రమ పెడతారు?" అన్నారు మున్షీ రాధేలాల్.

మున్షీ శివలాల్ ఛింకీ వైపు చూచారు. అది మళ్ళీ పొయ్యి వెలిగిస్తూ ఉంది. "ఇటు చూడు ఛింకీ! అలా వెళ్ళి రెండు సేర్లు పూరీలు, రెండు సేర్లు మిఠాయి తీసుకురా! జ్వాలా తొందరగా వెళ్ళాలి."

ఛింకీ చాలా గట్టిగా సమాధానం చెప్పింది: "రూపాయలు కుప్పలుపోసి ఉన్నట్టు మాటిమాటికి పూరీ-మిఠాయి కొనుక్కు రమ్మంటారు. ఇదుగో నేను పొయ్యి వెలిగిస్తూనే ఉన్నాను. ఒక్క క్షణంలో వంటయి పోతుంది. అర్ధరాత్రి వేళ జ్వాలా ఊరికి పోవడమేమిటి? అది మాత్రం వీల్లేదు. లే రాధమ్మా, లేచిరా!"

తొమ్మిది

ఛింకీ గంగూకు కథ చెపుతూ ఉంది: "అనగా అనగా ఒక రాజు. ఆయనకు ఏడుగురు భార్యలు. ఆ యేడుగురు భార్యలకూ ఏడు భవనాలు ఉండేవి. ఒక్కొక్క రాణికి ఒక్కొక్క కొడుకు."

ఇంతలో రాధేలాల్ భార్య పిలిచింది: "ఛింకీ! సామాన్లగది తాళం చెవి కొంచెం ఇలా ఇయ్యి."

గంగూను ఒళ్ళో కూర్చో పెట్టుకునే ఛింకీ సమాధానం చెప్పింది: "ఏం కావాలమ్మా! ఇప్పుడే కొంచెం సేపట్లో వచ్చి మీకేం కావాలో తీసిస్తాను."

"నాకు తాళంచెవి కావాలన్నాను. నాకు కావలసినవి నేనే తీసుకుంటాను." అన్నది రాధేలాల్ భార్య కొంచెం హెచ్చు స్థాయిలో.

"మీకు కనిపించదమ్మా! నేనన్నీ గుర్తుగా పెట్టి ఉంచాను. మీరన్నిటినీ కలగా పులగం చేసేస్తారు. లే తండ్రీ! నేనిప్పుడే వస్తాను." అన్నది ఛింకీ గంగాప్రసాద్‌తో.

కాని పదేండ్ల గంగాప్రసాద్ మనస్సు కథలో లీనమయిపోయింది. "వీల్లేదు ఛింకీ! కథ చెప్పందే నేను నిన్ను కదలనియ్యను. మామ్మకు తాళం చెవి ఇచ్చేసేయి రాదూ! అంటూ గంగాప్రసాద్ ఛింకీ పైట కొంగుకు ముడివేసిన తాళంచెవి విప్పి రాధేలాల్ భార్యకు ఇచ్చేశాడు. ఆ తర్వాత "ఒక్కొక్క రాణికి ఒక్కొక్క కొడుకు. తర్వాత ఏమయింది?" అని ఛింకీని అడిగాడు.

ఛింకీ మనస్సు ఇప్పుడు కథ మీద ఏ మాత్రం లేదు. గంగాప్రసాద్ చెప్పే మాటలు కూడా దానికి వినబడటం లేదు. ఛింకీ దృష్టి రాధేలాల్ భార్య మీద ఉంది. ఆమె త్వర త్వరగా సామాన్ల గదిలోకి వెళ్తూ ఉన్నది. ఛింకీ గంగాప్రసాద్‌ను తన ఒడిలో నుంచి దించుతూ అన్నది: "ఇప్పుడే వస్తాను తండ్రీ! అందాకా నువ్వు బీఖూతో ఆడుకో." అంటూ ఛింకీ కూడా సామాన్ల గది వైపు వెళ్ళింది.

కాని ఛింకీ సామాన్ల గదిదాకా వెళ్ళలేదు. దారిలోనే మున్షీ శివలాల్ గదిలోనుంచి పెద్ద కేక విని ఆ వైపు వెళ్ళింది.

మున్షీ శివలాల్‌కు ఆరోజు చాలా తలనొప్పిగా ఉంది. కల్లో వాపంలో ఆయనకు జలుబూ, దగ్గూ చేసి ఇంతవరకూ తగ్గలేదు. మొదట

నాటువైద్యం చేసి చూచారు. కాని దానివల్ల ఏమీ నయం కాలేదు. కషాయానికీ, సారాయికీ బద్ధవైరమని వైద్యుడు చెప్పాడు. లంఖణం పెట్టమని వైద్యుడు చెప్పాడు. కాని మున్షీ శివలాల్‌కు లంఖణమంటే బొత్తుగా గిట్టదు. ఇలా ఒక నెల గడిచిపోయింది. చివరకు విసుగేసి మున్షీ శివలాల్ ఇంగ్లీషు వైద్యం ఆరంభించారు. రెండు రోజుల నుంచి ఆయన డాక్టరు దగ్గర మందు తీసుకుంటూ ఉన్నారు.

చింకీ గదిలోకి వెళ్ళుతూనే అన్నది: "ఏమయింది, చాలా బాధగా ఉందా?"

మున్షీ శివలాల్ చింకీ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అలాగే మూలుగుతూ ఉన్నారు.

చింకీ మున్షీ శివలాల్ తల వైపు, ఆయన తల ఒత్తుతూ కూర్చున్నది. అలా తల పిసికించుకొనడంవల్ల ఆయనకు కొంచెం హాయిగా ఉన్నట్లని పించింది. ఆయన మూలగడం నెమ్మదిగా తగ్గి చివరకు ఆగిపోయింది. ఆ తర్వాత ఆయన కండ్లు తెరిచి చింకీని చూచి అన్నారు. "ఎక్కడ ఉన్నావు నీవు ఇంత సేపు?"

"ఊరికే అలా గంగూను ఆడిస్తూ ఉన్నాను. నన్ను కొంచెం కేకవేస్తే వచ్చేదాన్ని కదా! నేనటు సామాన్ల గదివైపు చిన్నమ్మగారితో వెళ్ళుతూ ఉంటే దారిలో మీకేక వినిపించి ఇలా వచ్చాను."

మున్షీ శివలాల్ అడిగారు: "ఎందుకూ? ఆవిడతో సామాన్లగది కెందుకు వెళ్ళుతున్నావు?"

"గది తాళాలు నన్నడిగి తీసుకెళ్ళారామె. అక్కడ సామాన్లన్నీ నేను గుర్తుగా పెట్టుకున్నాను. ఆమెకు తెలియక అన్నిటినీ కలగా పులగం చేసేస్తారేమోనని ఆమెకు కావాల్సిన సామాను చూచి ఇవ్వచ్చుగదా అని నేనూ వెళ్ళుతున్నాను."

మున్షీ శివలాల్ మౌనంగా ఆలోచించడం మొదలు పెట్టారు! అధికారం, శక్తి ఒక చోటినుండి మరో చోటికి మారుతూ ఉన్నాయి. కుటుంబంలో ఇంతవరకూ అనుసరిస్తున్న పద్ధతి మారిపోతూ ఉన్నది. ఆయన మెల్లగా వినీ వినిపించనట్లు అన్నారు: "పోనీ నీవు తాళంచెవి రాధా భార్యకే ఇయ్యక పోయావా? ఇంటికి పెద్ద అదే కదా! మరి దానికి కోపం రాదూ?"

ఛింకీ మండిపడింది: "ఇంటి పెత్తనం జ్వాలా భార్యది. ఈ రాజ భోగమంతా జ్వాలా సంపాద్యంమీదనే జరుగుతూ ఉంది. అలాంటప్పుడు జ్వాలా భార్యను చిన్నపిల్లను చేసి మీ మరదలు పెత్తనం చెలాయిస్తూ ఉంటే ఊరికే ఉందామా?"

ఛింకీ అన్న మాట ముస్నీ శివలాల్‌కు కొంచెం ఎబ్బెట్టుగానే తోచింది. కాని దానికాయన ఏమీ సమాధానం చెప్పలేక పోయారు. "వీల్లేదు, ఏమయినా సరే, ఇంటిపెత్తనం రాధూ భార్యదే, తెలిసిందా! రాధూ భార్య జీవించి ఉన్నంతకాలం, ఇక్కడ ఉన్నంతకాలం, దానిదే ఈ ఇంటి పెత్తనం. అసలు మా యింటి విషయాల్లో జోక్యం కలుగచేసుకునేందుకు నీవెవరివి?" అన్నారాయన.

ఈ సమాధానానికి ఛింకీ కండ్లల్లో నీళ్ళునిండాయి. కాని ఆమె అలాగే ముస్నీ శివలాల్ తల ఒత్తుతూ ఉంది. ఇలా గదమటం, అక్రమంగా మాట్లాడడం ఇవన్నీ ఛింకీకి కొత్తవి గావు. జీవితమంతా ఇలాంటి అవమానాలనూ, అన్యాయాలనూ సహించడం దానికి నిత్యకృత్యమై పోయింది. అవి దాని జీవితంలో ఒక భాగంగా తయారయి పోయాయి. అది ఏడుస్తూ కూర్చుని అలాగే తల ఒత్తుతూ ఉంది. ముస్నీ శివలాల్ ఏమీ పట్టనట్టు హాయిగా పండుకున్నారు. ఛింకీ మనోభావాలనే కాదు, దాని ఉనికిని కూడా ఆయన గుర్తించినట్టు లేదు. ఆయనకు ఒంట్లో హాయిగా ఉంది, ఆయన మనస్సు ప్రశాంతంగా ఉంది. కొంచెంసేపటికి ముస్నీ శివలాల్‌కు నిద్ర పట్టింది. ఆయన నిద్రపోయిన తర్వాత ఛింకీ అక్కడినుంచి బయటికి వెళ్ళింది.

పొద్దు తిరిగిపోయింది. వంటింట్లో పూరీలు తయారవుతున్నాయి. రాధేలాల్ భార్య ఎదురుగా కూర్చున్న కిషన్‌కు పూరీలు వడ్డిస్తూ ఉన్నది. కిషన్ తింటూ ఉన్నాడు. కిషన్ ఉదయంనుంచి ఇంట్లో కనిపించనే లేదు. అతనికోసం రొట్టెలుచేసి వేరే మూత పెట్టి ఉంచారు. ఆ రొట్టెలన్నీ అలాఉంచి మళ్ళీ పూరీలు చేసిపెడుతూఉంటే ఛింకీ చూచి ఊరకుండలేక పోయింది. వంటింటి గుమ్మం ముందు నిలబడి అది కిషన్‌కు వడ్డించడం, అతను తినడం చూస్తూ ఉంది. కాని రాధేలాల్ భార్య గానీ, కిషన్ గానీ, ఆ సంగతే పట్టించుకోలేదు. వాళ్ళిద్దరిలో ఏ ఒక్కరు గూడా

ఛింకీని పలకరించనే లేదు. అది చాలా బాధపడి అక్కడినుంచి నేరుగా యమున గదిలోకి వెళ్ళింది. ఛింకీని చూడగానే యమున అన్నది: "ఎక్కడికి వెళ్ళావే ఛింకీ? చూడు, గంగూ ఎంత ఏడుస్తున్నాడో! ఛింకీ నన్ను వదిలేసి మామ్మతో వెళ్ళిందని అంటున్నాడు."

ఛింకీ యమున అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. అది గంగూను దగ్గర కూర్చోపెట్టుకొని యమున మంచం పక్కనే కింద కూర్చుంది. కాని దాని కండ్లలోనుండి ఎగతెగకుండా కన్నీళ్లు కారుతూ ఉన్నాయి.

యమున కొంచెముసేపటి వరకూ కన్నార్పకుండా ఛింకీని చూచింది. ఆమెకేదో భయం వేసినట్టు అడిగింది! "ఏమయింది ఛింకీ! ఎందుకు ఏడుస్తున్నావు? మామగారికి ఒంట్లో కులాసాగా ఉన్నదా?"

ఛింకీ కన్నీరు తుడుచుకుంటూ నెమ్మదిగా సమాధానం చెప్పింది: "ఆయన ఒంట్లో కులాసాగానే ఉంది. కాని ఇదంతా నేను చూస్తూ ఉండలేను తల్లీ!"

"చూస్తూ ఉండేదేమిటే? చెప్పేదేమిటో సరిగా చెప్పు." అన్నది యమున.

"వంటింట్లోకి వెళ్ళి మీరే చూడండమ్మా! వేడి వేడి పూరీలుచేసి కిషన్‌కు మింగపెడుతూ ఉన్నది. మధ్యాహ్నం వండిన వంటంతా మూతపెట్టి ఉంచింది. అదంతా దిబ్బలో పారేస్తుందో ఏమో!"

యమునకు నేతివాసన కొట్టింది. పరిస్థితి ఆమె కర్థమైపోయింది. "సామాన్లగది తాళంచెవి నీ దగ్గర ఉంది కదా! మరి అత్తయ్య బజారు నుండి నెయ్యి తెప్పించిందా?" అని అడిగిందామె.

"బజారునుండి తెప్పించడం కూడానా? దాని మొహానికితోడు. బలవంతంగా నాదగ్గరి తాళంచెవి తీసుకు వెళ్ళింది. ఫతేపూర్‌లో తనదే పెత్తనం కదా అని, ఇక్కడకూడా అలాగే పెత్తనం చలాయించాలని చూస్తూ ఉన్నది. ఇష్టంవచ్చినట్టు ఖర్చు పెట్టేస్తుంది. పాపం జ్వాలా బాబు కష్టపడి సంపాయించింది వీళ్ళంతా వచ్చి కాజేస్తున్నారు."

యమున తన మనస్సులో ఏర్పడుతున్న ఆవేదనను అణచుకొనేందుకు ప్రయత్నిస్తూ అన్నది: "పోనియ్యవే, ఛింకీ! వాళ్ళ అదృష్టంకొద్దీ వాళ్ళు తింటూ ఉన్నారు. వెళ్ళి గంగూను అలాలా త్రిప్పి ఆడించి తీసుకొనిరా."

"వాళ్ళ అదృష్టం కొద్దీ తినడం లేదు. వీళ్ళంతా, గంగూ పాలిటి అదృష్టం తింటూన్నారు. గంగూ చాలా అదృష్టవంతుడు, మహారాజు బిడ్డ. ముందు ముందు పెద్ద పెద్ద చదువులు చదవాలి. ఇల్లు, వాకిలి, ఆస్తి, పాస్తి సంపాయించాలి. గొప్పవాడు కావాలి. అతని అదృష్టం కొద్దీ వచ్చే సొమ్మంతా వీళ్ళు తినేస్తున్నారు." అంటూ ఛింకీ గంగాప్రసాద్‌ను తీసుకొని బయటికి వెళ్ళింది.

ఛింకీ ఈ చర్చను ముగించిన ధోరణి ఆ చర్చ చిరకాలం కొనసాగే లాగా చేసింది. వీళ్ళంతా గంగూ అదృష్టంమీద ఆధారపడి అతనికి దక్క వలసింది తినేస్తున్నారు. ఈ విషయం తలుచుకొని యమున నిశ్చేష్టు రాలయి పోయింది. ఛింకీ చెప్పిన మాటల్లో భయంకరమైన సత్యం దాగి ఉంది. ఆ సత్యాన్ని కాదనేందుకు వీల్లేదు. దాన్ని ఉపేక్షించి ఊరకుండేందుకు కూడా వీల్లేదు. ఇలా ఆలోచిస్తూ ఉండగానే రాధేలాల్ భార్య ఒక చిన్నపళ్ళెంలో పూరీ-కూరా తీసుకొని యమున గదిలోకి వచ్చింది. "ఇదిగో ఇప్పుడే సాయంత్రం టిఫిన్ తయారు చేశాను. కిషన్‌కు చాలా ఆకలిగా ఉందంటే, పొద్దుటి అన్నం ఎలా పెట్టనా అని పూరీ చేశాను. కొట్టెలు రాత్రికి తినచ్చులే, ఇప్పుడు పూరీ తినమని వాడికి పెట్టాను. ఇదిగో నీకూ, జ్వాలాకూ, గంగూకు తీసుక వచ్చాను. నీ దగ్గర ఉంచు."

యమున చిన్నత్తయ్య వైపు చూచింది. కాని ఆమెను ఏమనడానికీ ధైర్యం చాలలేదు. రాధేలాల్ భార్య యమున కండ్లల్లోని భావాన్ని గమనించి ఆ భావాన్ని నిరాకరించేందుకు అన్నది: "సామాన్ల గది తాళం చెవి నేను ఛింకీదగ్గరనుండి తీసేసుకున్నాను. మేమిక్కడ ఉండగా పనివాళ్ళమీద ఇల్లు వదలవలసిన పని ఏముంది? ఈ ఇంట్లో తిండీ తిప్పలు చూచే బాధ్యత నాది."

యమున అప్రయత్నంగా అనేసింది: "అవునత్తయ్యా! మంచిపని చేశావు. నేనుకూడా ఆ మాటే అనుకున్నాను. కాని అనవసరంగా మిమ్మల్ని శ్రమ పెట్టడమెందుకులే అని మానేశాను. ఎటు తిరిగీ ఫతేపూర్ వెళ్ళే వాళ్ళేగదా మీరంతా. ఇక్కడ పాపం ఛింకీయే ఇంటిపని అంతా చూచుకుంటూ ఉంటుంది. ఏ పనన్నా చెప్ప మాట్లాడకుండా చేసేస్తుంది. అందుకని సామాన్లగది తాళంచెవి దానికే ఇచ్చేశాం. మీరు వెళ్ళిపోయిన

తర్వాత మళ్ళీ ఇంటి సంగతులన్నీ అదే చూచుకోవాలి గదా! అందుకనే ఆ గది తాళాలు ఛింకీ దగ్గరనుండి తీసుకుని నీ కియ్యలేదత్తయ్యా! నీవే తీసేసుకున్నావు. మంచి పనిచేశావు.''

యమున చెప్పిందంతా మృదువుగా, శాంతంగా చెప్పింది. ఆ మాటల్లో వైరభావంకానీ తగాదావచ్చే విషయాలుకానీ ఏమీ లేవు. కాని ఆమె రెండు మూడు సార్లు రాధేలాల్ భార్య మళ్ళీ ఫతేపూర్ వెళ్ళే ప్రస్తావన ఎత్తడం రాధేలాల్ భార్యకు నచ్చలేదు. అలా అనడంలో రాధేలాల్ భార్యకు ఆ యింట్లో పెత్తనం కాని, ఉనికిగానీ శాశ్వతం కాదనే హెచ్చరిక ఆమెకు తోచింది. హెచ్చరికకు సమాధానంగా రాధేలాల్ భార్య అన్నది: ''నీవదంతాదిగులు పెట్టుకోకు. మేమిక్కడ ఉన్నన్నాళ్ళూ నీకా దిగులేమీ అక్కర్లేదు. ఫతేపూర్ ఇంటిని గురించి ఏదో ఏర్పాటు చేసేందుకు ఆయన ఫతేపూర్ వెళ్ళనే వెళ్ళారు. ఫతేపూర్ వాళ్ళంతా ఇక్కడికి రానైనా వస్తారు, లేకుంటే రామూ, శ్యామూ లేరూ, వాండ్లను అక్కడ ఉంచి ఇల్లూ వాకిలీ చూచే ఏర్పాటన్నా చేస్తారు.'' రాధేలాల్ భార్య ఈ మాటలు చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయింది.

యమున చేసిన హెచ్చరికకు రాధేలాల్ భార్య తలపొగరుగా సమాధానం చెప్పేసరికి యమున మనస్సులో బాధపడింది. కాబట్టి ఛింకీ చెప్పే మాటల్లో పొరపాటేమీ లేదు. గంగూ అదృష్టం మీద ఆధారపడి గంగూ పాలిటి భోగాలన్నీ అనుభవించేందుకు రాధేలాల్ సకుటుంబంగా ఇక్కడికివచ్చి పీఠంవేసి కూర్చుంటారు-జ్వాలాప్రసాద్ నెత్తిమీద!

యమునకు కొంచెంసేపు ఏమీ తోచలేదు. జంకుతూ జంకుతూ ఆమె మున్షీ శివలాల్ గారి గదివైపు వెళ్ళింది. మున్షీశివలాల్ మేల్కొని ఉన్నారు. యమున గది వాకిట్లోనే నిలబడి అడిగింది: ''ఇప్పుడు ఒంట్లో ఎలా ఉంది మామయ్యా! ఈ మందువల్ల ఏమన్నా గుణం కనిపిస్తూ ఉందా?''

''ఇప్పుడు నొప్పి చాలావరకు తగ్గింది. భగవంతుడి దయ!'' అన్నారు మున్షీ శివలాల్.

యమున మరేమీ అనలేదు. అలాగే వాకిలి నానుకొని నిలుచున్నది.

మున్షీ శివలాల్ మళ్ళీ అడిగారు: ''ఏమమ్మా! నాతో ఏదన్నా చెప్పాలా?'' ఉన్నట్టుండి ఇంతకుముందు ఛింకీతో జరిగిన సంభాషణ ఆయనకు గుర్తు వచ్చింది.

"చెప్పేదేమీ లేదు. చిన్నత్తయ్య ఇప్పుడే అంటున్నారు. చిన్నమామ గారి కుటుంబమంతా ఇక్కడికే వచ్చేస్తుందట. మీతో ఏమన్నా చెప్పారా?"

మున్షీ శివలాల్‌కు ఆ మాట వినేసరికి ఆశ్చర్యం వేసింది. "ఏమన్నావ్? రాధా కుటుంబం ఇక్కడికి వచ్చేస్తుందా? నాతో అలాంటి మాట ఏమీ చెప్పలేదే? ఫతేపూర్‌లో ఇల్లుంది, పొలముంది, అన్నీ ఉన్నాయి. మరి వాళ్ళంతా ఇక్కడికి రావల్సిన అవసర మేముంది?"

రాధేలాల్ భార్య యమున వెనకనే నిలబడి ఉంది. రాధేలాల్ భార్య తన వెనకనే వచ్చిందనే విషయం యమునకు తెలియదు. లేకుంటే ఆమె ఈ విషయం ఎత్తేదేకాదు. రాధేలాల్ భార్య ముందుకు వచ్చి అన్నది: "బావగారూ! మీ ఆరోగ్యం సరిగా లేనందువల్ల మీకు కులాసా చిక్కే వరకూ ఇక్కడే ఉందామని అనుకున్నాము. ఫతేపూర్లో రామూ, శ్యామూ, వాళ్ళ భార్యలూ ఉన్నారు గదా! ఇంటివిషయాలు వాళ్ళే చూచుకుంటూ ఉన్నారు. కిషన్ ఇక్కడనే ఉన్నాడు. ఆయన ఫతేపూర్‌నుండి వస్తూ బిషన్‌ను కూడా తీసుకు వస్తారు. వాడినికూడా ఎక్కడన్నా ఏదో పనిలో చేర్పాలి గదా! అంత మాత్రం జ్వాలా తలుచుకుంటే అయిపోతుంది."

రాధేలాల్ భార్య కర్కశ స్వరానికి మున్షీ శివలాల్ స్తంభించి పోయ్యారు. "అవును, నీవు చెప్పింది నిజమే. రాదేలాల్‌కు మాత్రం తెలియదూ! వాడు చేసేవి ఆలోచించే చేస్తాడు."

యమున పరాజయం పొందినట్టు విచారిస్తూ తన గదిలోకి వెళ్ళి పోయింది.

సాయంత్రానికి జ్వాలా ప్రసాద్ ఇంటికి వచ్చేసరికి యమున దిగులు పడుతూ ఉన్నట్టు కనిపించింది. జ్వాలా ప్రసాద్‌కు ఫలహారంపెట్టి యమున అన్నది. "మీరీ సంగతి విన్నారా! చిన్నత్తయ్య, చిన్నమామ కిషన్‌నూ బిషన్‌నూ, తీసుకువచ్చి ఇక్కడనే ఉండిపోతారుట. ఈమాట అత్తయ్య మామగారితో చెప్పింది."

జ్వాలా ప్రసాద్ ఆ వార్తవిని ఏమీ చలించలేదు. "అయితే దానిలో తప్పేముంది? ఇక్కడ ఉంటే పిల్లలిద్దరూ దారికన్నా వస్తారు. నాన్నకు కూడా మనశ్శాంతిగా ఉంటుంది.

యమున ఇక్కడ కూడా ఓడిపోయింది. కాని ఇక్కడ ఓడిపోవడం

ఆమెకు ఆశ్చర్యంగాలేదు. నిజానికి ఇక్కడ ఆమెకు విజయం లభించి ఉంటే ఆశ్చర్యంగా ఉండేది. కాని ఆమె ఇక ఎక్కువగా మాట్లాడలేదు.

సాయంత్రం సావకాశంగా యమున ఛింకీతో జరిగిందంతా చెప్పింది. ఛింకీ నవ్వుతూ అన్నది: వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు. "ఇక నేను పూనుకుంటే గాని ఈ చిన్నమ్మగారి పని తేలదు. మీరూరికే చూస్తూ ఉండండమ్మా, అంతా నేను చూచుకుంటాను." అన్నది ఛింకీ.

కొంచెంసేపటికి ఛింకీ మున్షీ శివలాల్ గదిలోకి వెళ్ళింది- దృఢ సంకల్పంతో.

అప్పుడు రాత్రి చాలా పొద్దయింది. మున్షీ శివలాల్ ఛింకీకోసం ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజులాగానే భీఖూ సారాబుడ్డి ఆయన తల వైపున పెట్టి ఉంచాడు. కాని తనంతట తాను గ్లాసులో పోసుకొని తాగే అంత శక్తి మున్షీ శివలాల్‌కు ఇంకా రాలేదు. ఛింకీ కనిపించగానే ఆయన దాన్ని గదుముతూ అన్నారు: "ఎక్కడ చచ్చావే ఛింకీ! ఎంత ఆలస్యమయింది! త్వరగా గ్లాసులో వేసియ్యి!"

ఛింకీ మెల్లగా సమాధానం చెప్పింది: "మీ యింట్లో జరుగబోతున్న మహాభారతాన్ని గురించి ఆలోచిస్తూ ఉన్నాను. మనస్సు సరిగా లేకపోతే గంగూను తీసుకొనిపోయి అలా తోటలో ఆడించుకొని వచ్చాను." ఆ తర్వాత ఛింకీ వెండిగ్లాసులో సారాయిపోసి ఆయన కిచ్చింది.

మున్షీ శివలాల్ సారాయి కొంచెంగా తాగి ఛింకీవైపు రెప్పవాల్చకుండా చూచారు. ఛింకీ అన్నమాట తగాదాలు లేవదీసే మాట. అందువల్ల ఆయన బిగ్గరగా అరిచారు: "మహాభారత మేమిటి నీ పిండాకూడు?"

కాని ఛింకీ ఈరోజు అన్నిటికీ సిద్ధపడి వచ్చింది. మున్షీ శివలాల్ బెదిరింపులకు అది భయపడలేదు. మెల్ల మెల్లగా మాట్లాడినా మంచి పటుత్వంతో అది సమాధానం చెప్పింది: "అదే, చూస్తున్నారుగా - జ్వాలా సంపాయించి పెడితే తినేందుకు వాళ్ల బాబాయి సకుటుంబంగా వచ్చి ఇక్కడ చేరుతున్నారంటే ఏమన్నమాట! కౌరవ సంతానం ఇక్కడ చేరుతున్నదన్న మాట."

"కౌరవ సంతానమా! ఏమిటి నువ్వు వాగేది?" మున్షీ శివలాల్ ఛింకీని గదుముతూ ఆగిపోయారు. ఛింకీ చెప్పిన దానిలో నిజం ఉండచ్చని ఆయనకు తోచింది. తాను ప్రతిక్షణం మృత్యువును తప్పించుకొనేందుకు

ప్రయత్నిస్తూ కాలక్షేపం చేస్తున్న పాండురాజుననీ, రాధేలాల్ ధృత రాష్ట్రుడిలాగా తన తర్వాత అధికారం సంపాయించడానికి వేచి ఉన్నట్టు ఆయనకు తోచింది. చూస్తే అంతా మహాభారతంలాగానే ఉంది. ఛింకీ అనేది తప్పేమీకాదు. ఈ ఆలోచనతో మనస్సును సమాధానపరుచు కునేందుకు గాను మున్షీ శివలాల్ గ్లాసులో మిగిలినదంతా మరో గుక్కలో ముగించేశారు. దానితో ఈ ప్రపంచమంతా మసక మసకగా గోచరిస్తూ ఉంది. మహాభారత కల్పన మరింత సాకారమయింది. మరో గ్లాసునింపి ఇయ్యమని ఛింకీకి సంజ్ఞ చేస్తూ శిథిలంగా శివలాల్ అన్నారు: "అవును, లక్షణాలన్నీ అలాగే కనిపిస్తున్నాయి. పది సంవత్సరాల తర్వాత మళ్ళీ ఇప్పుడు వీళ్ళంతా ఇక్కడికి చేరుతున్నారు. ఏం చెయ్యాలో తెలియటం లేదు."

"చేసేదేముంది? కిషన్‌కు ఎక్కడన్నా పని చూడమని జ్వాలా బాబుకు గట్టిగా చెప్పండి. సోరావ్‌కు దూరంగా ఉండాలి. జ్వాలా బాబు పెద్ద ఆఫీసరు గనుక ఆ మాత్రం చేయలేక పోడు. అప్పుడు రాధేలాల్, అతని భార్య కిషన్‌తో వెళ్ళిపోతారు. ఇక బిషన్ ఉన్నాడు. అతనుకూడా వాళ్ళతోటే వెళ్ళి అక్కడే ఏదన్నా పని చూచుకుంటాడు."

మున్షీ శివలాల్ ఛింకీని చాలా తీక్షణంగా చూచారు. అసలు విషయం ఆయనకు కొద్దికొద్దిగా బోధపడుతూ ఉన్నది. "ఏమన్నావు నీవు? రాధా, వాడి భార్య, బిషన్ వాళ్ళంతా కిషన్‌తోపాటూ సోరావ్‌కు దూరంగా ఎక్కడికో వెళ్ళతారూ? అదేగదూ నీవన్నది? ఇలాపొయ్యి, మిగిలింది గ్లాసులో పోసెయ్యి అలా చూస్తావేం?" అన్నారు శివలాల్.

ఛింకీ శివలాల్ చేతికి గ్లాసు అందిస్తూ అన్నది: "అవును, అదే నేను చెప్పింది."

మున్షీ శివలాల్ మళ్ళీ ఒక గుక్క తాగి అన్నారు: "నీవు చెప్పింది బాగానేవుంది. కాని ఈ కిషన్ ఒట్టి దేశదిమ్మరి. దానికితోడు పనికి మాలినవాడు. వీడివల్ల ఏ పనీ కాదు."

"అందుకనే మీ తమ్ముయ్యగారిని అతని కూడా పంపించండి. ఇంతటి పుత్రరత్నాన్ని కన్నందుకు, అతని సంగతి అయనే చూచుకుంటారు. జ్వాలా బాబుతో ఈ విషయం చెప్పడానికి నాకు ధైర్యంలేదు. మీరే చెప్పండి. అంతకాకపోతే నంబరుదారు భార్య జైదేయిగారి ఇంట్లో

నైనా సరే ఏదో పని ఇప్పిస్తే పోతుంది. వాళ్ళింట్లో ఎంతమందో పని వాళ్ళుంటారు. ఏదో ఒకపని ఉంటుంది.''

మరునాడుదయం మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్ కూర్చునే గదిలోకి వెళ్ళారు. జ్వాలా ప్రసాద్ ఆఫీసులో కాగితాలేవో చూచుకుంటున్నారు. శివలాల్ కొంచెం దూరంగా తొలిగి కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ తన తండ్రిని చూచి అన్నారు: ''ఏం నాన్నా! నాతో ఏమన్నా పనుందా? నన్ను రమ్మంటే వచ్చేవాణ్ణి కదా! మీరెందుకు వచ్చారు?''

''నేను వస్తే మాత్రం ఏమయింది? మన కిషన్‌కు ఏదయినా ఏర్పాటు చేయించమని నీకు చెప్పాలని వచ్చాను. ఈ విషయం నీవేమీ పట్టించు కోడంలేదు.''

''మరి నేనేం చెయ్యగలను కిషన్ విషయంలో. బాబాయే ఏమన్నా చెయ్యాలి.''

''వాడివల్ల ఏమీ ప్రయోజనం లేదు. నీవే ఏదో ఏర్పాటు చెయ్యాలి. ఎంత త్వరగా చేస్తే అంత మంచిది.''

జ్వాలా ప్రసాద్ చిక్కులో పడ్డారు: ''ఈ చదువురాని చవటకు ఏమేర్పాటు చేస్తాం?''

''ఆఫీసులోనో కచ్చేరీలోనో పనిచేసే అంతగా చదువు రాదనుకో. కాని ఏ జమీందారు దగ్గరో గుమాస్తాగానో మోతాదుగానో కుదిరిస్తే సరి పోతుంది. ఏవో వ్యాజ్యాలూ, వ్యవహారాలూ చూస్తూ ఉంటాడు.''

''అవును, అలాంటి పని ఏదన్నా ఉంటే చేస్తాడు. కాని ఇక్కడ ఈ తహసీల్లో అతనికి పని చూపించేంత పెద్ద జమీందారు కూడా లేడు.''

మున్షీ శివలాల్ గొంతు సరిచేసుకొని అన్నారు: ''నీవు మరోలా అనుకోకపోతే ఒకమాట చెప్పనా? వంశ గౌరవానికి సంబంధించిన విషయం కాబట్టి అలా అడుగుతున్నాను.''

''తెలుసు నాన్నా! కానీ మీ మాట నేను మరోలా అనుకోడం ఎలా జరుగుతుంది? చెప్పండి.''

మున్షీ శివలాల్ తన దృష్టిని జ్వాలా ప్రసాద్ నుండి తప్పించి అన్నారు: ''మాటంపూర్ నంబరుదారు భార్య జైదేయికి ఎవరన్నా గుమాస్తా లాంటివాడు కేసులు, దావాలు చూస్తూ ప్లీడర్ల చుట్టూ తిరిగేందుకు అవసర ముండవచ్చు. ఆమె నీమాట తీసివెయ్యలేదు. కిషన్‌కు అక్కడనే

ఏదో పని ఇప్పించేసేయ్. రాధూ, వాడి భార్య కూడా అక్కడకే వెళ్ళి ఉంటారు. పేరుకు కిషన్ని చేరిస్తే రాధూ తనే పనంతా చూచుకుంటాడు.''

తన తండ్రి చెప్పిన ఈ ఆలోచనకు జ్వాలా ప్రసాద్ నివ్వెరపోయి కొంచెంసేపు తన తండ్రివైపు చూస్తూ ఉన్నారు.

"ఏదో ఆలోచిస్తున్నావు?''

"అవును.. అదే ఆలోచిస్తున్నాను. ఈ విషయం కొంచెం జాగ్రత్తగా ఆలోచించాలి. కిషన్ సంగతి మీకు బాగా తెలుసు. అక్కడ ఉండే దంతా ఆడవాళ్ళే. లక్ష్మీచంద్ సంవత్సరానికి ఏ రెండు మూడు నెలలో ఫూటంపూర్లో ఉంటాడు. కిషన్ని అక్కడ చేర్చడం అంత మంచిది కాదేమోనని నా కనిపిస్తూ ఉంది.''

"అందుకనే గదా రాధూను కూడా వాడివెంట పంపించడం. రాధూతో పాటు వాడి భార్యకూడా అక్కడికే వెళ్ళి ఉంటుంది. తల్లిదండ్రుల అండదండల్లో ఉంటాడువాడు. ఈలోగా వాడికి పెండ్లికూడా అవుతుంది. పెండ్లి అయిన తర్వాత వాడి అలవాట్లు కూడా మారవచ్చు.'' కొంచెం సేపాగి మళ్లీ నెమ్మదిగా అన్నారు: "అలా చేయడంవల్ల నీకు కూడా మంచిదే. ఆ సంగతి నీవు గమనించే ఉంటావు.''

"అవును, ఆ విషయం నాకు తెలుసు.'' అన్నారు జ్వాలా ప్రసాద్ తప్పించుకునేందుకు. ఆ తర్వాత ఆయన కాగితాలను తిరగేయ్యటం మొదలు పెట్టే సరికి మున్షి శివలాల్ లేచి వెళ్ళిపోయారు.

జ్వాలా ప్రసాద్తో మున్షీ శివలాల్ ప్రస్తావించిన విషయాన్ని గురించి జ్వాలా ప్రసాద్ తనలోతాను చాలా తర్కించుకున్నారు. ఆ విషయాన్ని ఆయన అన్ని విధాలా పరిశీలించి చూచారు. కాని ఎలా చూచినా ఆ ఆలోచన సమర్థనీయంగా తోచడంలేదు. చివరకు రాధేలాల్కు నచ్చ చెప్పి ఆయన చేతనే ఈ విషయాన్ని నిరాకరింప చేయడం శ్రేయస్కర మని జ్వాలా ప్రసాద్ నిర్ణయించుకొన్నారు. ఇక రాధేలాల్ రాకకై ఆయన ఎదురు చూస్తున్నారు.

మూడు రోజులు గడచిన తర్వాత రాధేలాల్ తన కడగొట్టు కుమారుడు బిషన్లాల్తో సహా తిరిగి వచ్చారు. రాధేలాల్ గోరావ్ చేరుకునే సమయానికి జ్వాలా ప్రసాద్ క్యాంపుకు వెళ్ళారు. అన్నగారికి లాంచన ప్రకారం నమస్కరించి ఫతేపూర్లో తాను చేసి వచ్చిన ఏర్పాట్లను

ఆయనకు విశదీకరించారు. దాని సారాంశమేమంటే రామలాల్ బడి పంతులు ఉద్యోగం చేసుకుంటూ ఉన్నాడు. కాని శ్యామలాల్ పొలమంతా మక్తా మీద ఇచ్చేశాడు. స్వంత వ్యవసాయం అతనివల్ల అవడం లేదు. అది అలా ఉంచి శ్యామలాల్‌కు ఒక గ్రామంలో సగభాగం స్వాధీన మయింది. అది ఎలా అయిందంటే శ్యామలాల్ రెండు సంవత్సరాల క్రితం గఫూర్‌మియా చనిపోయిన తర్వాత అతని భార్యకు పరిచర్య చేసి ఆమె స్వాధీనంలో ఉన్న రహీంపురా గ్రామంలో ఎనిమిదణాల భాగం ఆమెచేత తన పేరిట వ్రాయించుకున్నాడు. సలీమా ఖర్చంతా అతనే భరిస్తూ ఉన్నాడు. కొన్ని రోజులక్రితం గఫూర్‌మియా అల్లుడు రహమత్ ఖాన్ శ్యామలాల్ మీద కేసుపెట్టాడు. ఆ కేసు జిల్లాకోర్టు నుంచి హైకోర్టుకు వెళ్ళింది. పండిత్ గిరిజాశంకర్ మిశ్ర అక్కడ సబ్‌జడ్జి. జడ్జిగారితో జ్వాలా ప్రసాద్‌కు బాగా పరిచయం ఉంది. జ్వాలా ప్రసాద్ ఈ విషయం జడ్జిగారితో ప్రస్తావించారంటే కేసు గెలిచిందన్న మాటే. ఈ విధంగా రహీంపురా గ్రామంలో ఎనిమిదణాల భాగం శివలాల్‌గారి దయిపోతూంది. మిగిలిన ఎనిమిదణాల భాగం కయూం మియా పేరిట ఉంది. అతనికి పిల్లా మేకా లేనందువల్ల ఆ ఉన్న జమీందారీని అమ్మేసి మెక్కా వెళ్ళాలని అనుకుంటున్నారు. కనుక దాన్ని కూడా చవుకగా కొనేయ్య వచ్చు.

మున్షీ శివలాల్ అన్నారు: "కాని డబ్బెక్కడనుంచి వస్తుంది? కయూంమియా తన భాగం ఎంత కమ్ముతున్నారసలు?"

"అదే చెప్తున్నాను. ఎనిమిదివేలకు ఆయన డిక్రి చేస్తారు. కాని డిక్రితోపాటు వెంటనే నాలుగు వేలు ఇయ్యాలాయనకి. మిగిలిన నాలుగు వేలు మూడు సంవత్సరాల్లో ఇచ్చేస్తాం. దీనికాయన ఒప్పుకున్నారు."

"మరి ఈ నాలుగు వేలు మాత్రం ఎక్కడినుండి వస్తాయి?" మున్షీ శివలాల్ అడిగారు."

"అదే చెప్తున్నాను." రాధేలాల్ కొంచెం జంకుతూ చెప్పారు: "ఒక వెయ్యి రూపాయలు నేను ఏదో విధంగా పోగుచేస్తాను. మరో వెయ్యి ఫతేపూర్‌లో ఎవరి దగ్గరనైనా తీసుకోవచ్చు. పోతే ఇక రెండు వేల రూపాయలు జ్వాలా ఎక్కడనైనా సర్దాల్సి ఉంటుంది. రెండు వేల రూపాయలే గదా! జమీందారీ జ్వాలా పేరిట వ్రాయిద్దాం."

"మరి గఫూర్‌మియా తాలూకు భాగం సంగతేమిటి? అతనితో కేసు నడిపించేందుకు ఖర్చు ఎలా వస్తుంది?"

"ఆ భాగం కూడా శ్యామూ జ్వాలా పేరిట వ్రాసేస్తాడు. అంటే రహీంపురా గ్రామం మొత్తం జ్వాలా పేరిట వచ్చేస్తుంది. జ్వాలాకు సంబంధించిన జమీందారీ అంటే పండిత గిరిజా శంకర్ మన తరపునే తీర్పు చెప్తారు."

మున్షీ శివలాల్‌కు ఈ ఆలోచన నచ్చింది. "జ్వాలా రాగానే ఈ విషయం నేను వాడితో మాట్లాడుతాను. వాడి దగ్గర డబ్బు లేకపోతే ఎక్కడనైనా అప్పుతీసుకుంటాడు. కాని రెండు వేల రూపాయలు మాత్రం నీవు పోగు చెయ్యాలి. నీవల్ల అవుతుంది కదా?"

"అలాగే అవుతుంది. ఒక వెయ్యి రూపాయలు నా పూచీ, ఒక వారంలోగా పోగు చేసేస్తాను. మిగిలిన వెయ్యి లాలా రామకిశోర్‌తో మాట్లాడి పెట్టాను. లాలా రామకిశోర్ ఒప్పుకున్నారు కూడాను. తహసీల్దారుగారి కుటుంబమంటే పరువూ, ప్రతిషా ఉంటుందన్నయ్యా!"

"తహసీల్దారుగారి కుటుంబమంటే పరువూ ప్రతిష్ఠా ఉంటుంది." ఆనందంతో మున్షీ శివలాల్ రాధేలాల్ మాటల్ని మరోసారి అన్నారు: "తహసీల్దారుగారి కుటుంబమంటే పొలముండాలి, ఆస్తి ఉండాలి. నీవు సరియైన మాట చెప్పావు రాధూ! ఏదో విధంగా నేనీ రెండు వేల రూపాయలకు ఏర్పాటు చేసేస్తాను."

పది

"ఇప్పుడేం చెయ్యాలని నీ ఉద్దేశ్యం?" జ్వాలా ప్రసాద్ బిషన్‌లాల్ని అడిగారు.

"నా ఉద్దేశ్యమేముంది? మీరు చెప్పినట్టే చేస్తాను. కాని ఒక మాట మాత్రం చెప్పడం మంచిది. నౌకరీ చెయ్యడం మాత్రం బహుశా నావల్ల కాదు."

"మరి వ్యవసాయం ఎందుకు చెయ్యకూడదు?" జ్వాలా ప్రసాద్ ప్రశ్నించారు.

జ్వాలా ప్రసాద్ అడిగిన ఈ ప్రశ్నకు విషన్‌లాల్ ఏమీ సమాధానం చెప్పలేదు. విషన్‌లాల్ కిషన్‌లాల్ కంటె రెండేండ్లు చిన్న. విషన్‌లాల్‌కు దుర్గుణాలేమీ లేవు. చదువులో అతనంత మందగొడి కూడా కాదు. సంవత్సరం క్రిందట అతను మిడిల్ ప్యాసయినాడు. కాని అతనిది కొంచెం మొండిపట్టు. ఒకరికిలొంగి పని చెయ్యడం అతనివల్ల కాదు. అందువల్లనే ఉద్యోగం చెయ్యడం అతనికిష్టం లేదు. బాగా వ్యాయామం చేసి చేవపట్టిన శరీరంతో పొడుగ్గా ఉంటాడు. కాని ముఖం భావ హీనంగా ఉంటుంది. కండ్లు తేలిపోతూ ఉంటాయి. విషన్‌లాల్ అంత చక్కటివాడు కూడా కాదు. అలా అని అనాకారి కూడా కాదు. అతను జ్వాలా ప్రసాద్‌ను తీక్ష్ణంగా చూస్తూ ఉన్నాడు.

జ్వాలా ప్రసాద్ విసుగుతో మళ్ళీ అడిగారు: "మరి వ్యవసాయం చేయటానికి నీ అభ్యంతర మేమిటీ అని అడుగుతున్నాను."

"వ్యవసాయం నేను చేశాను. కాని శ్యామూ అన్నయ్య నన్ను చెయ్య ద్దన్నారు. అందులో నా తప్పేమీ లేదు. ఆమాట నేను ఒట్టు పెట్టుకొని చెప్తాను. ఆయన రెండు గేదెల్ని పెంచారు. పదహారు సేర్ల పాలు ఇచ్చేవి. పల్లెటూళ్లో ఇన్ని పాలెక్కడ అమ్ముడు పోతాయి? అందుకని నేనందరికీ ఊరకనే పందారం చేసేవాణ్ణి. అందుకు శ్యామూ అన్నయ్య కోప్పడ్డారు. పాలను తోడుపెట్టి పెరుగుచెయ్యి, పెరుగును చిలికి వెన్న తియ్యి, వెన్న కాచి నెయ్యి చెయ్యి, అని ఎన్నో చెప్పేవారాయన."

"అయితే శ్యామూ చెప్పింది తప్పా? అన్నారు" జ్వాలా ప్రసాద్.

"తప్పేమీ లేదు. కాని నేనా పొలం పక్కనే ఒక పెద్ద వ్యాయామశాల ఏర్పాటు చేశాను. జగ్గు పైల్వాన్ను నాకు గురువుగా ఉండమని బతిమాలి అక్కడికి పిలిపించాను. ఆయన శిష్యులు కూడా నెమ్మదిగా అక్కడ పోగయివారు. పాలు-నెయ్యి వాండ్లకే ఉపయోగపడుతూ ఉండేవి. దానికి కోప్పడి శ్యామూ అన్నయ్య వ్యాయామశాలను అక్కడ నుండి ఎత్తే యించారు. జగ్గూనూ, ఆయన శిష్యులనూ అక్కడనుండి తరిమేశారు. నన్ను కూడా వెళ్ళగొట్టేశారు. ఇక నేను ఒట్టుపెట్టుకున్నాను- వ్యవ సాయం ఎప్పటికీ చేయనని. ఒకవేళచేసినా శ్యామూ అన్నయ్య చెప్పు

చేతల్లో ఎంత మాత్రం చెయ్యను. అందరూ నవ్వేసేశారు. బగ్గా మాస్టరు తాను వాకు నేర్పిన పట్టిప్పి నేను మరిచిపోవాలని శాపం కూడా పెట్టేశారు."

శివన్‌లాల్ మాటలకు జ్వాలా ప్రసాద్‌కు ఒకవైపు నవ్వు వస్తూఉంది. మరోవైపు కోపం కూడా వస్తూఉంది. ఇంతలో మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్ కూర్చున్న గదిలోకి వచ్చారు. శివలాల్‌తో పాటు రాధేలాల్ కూడా వచ్చారు– తన సహజమైన కుటిల మందహాసంతో పాటు.

జ్వాలా ప్రసాద్ లేచి తండ్రికీ, బాబాయికీ స్వాగతం చెప్పారు. మున్షీ శివలాల్ అన్నారు: "జ్వాలా! మీ బాబాయి ఏదో పెద్ద ప్రణాళిక వేసుకుని వచ్చారు. నీవు కూడా వింటే తెలుస్తుంది. అందులో నాకేమీ వ్యత్యాసం కనిపించడం లేదు. అది సానుకూలమే అయితే బాగానే ఉంటుందని నా నమ్మకం."

అందరూ కూర్చున్న తర్వాత జ్వాలా ప్రసాద్ ప్రశ్నార్థకంగా రాధేలాల్ వైపు చూచారు.

రాధేలాల్ కంఠం సవరించుకుని అన్నారు: "ఏం లేదోయ్, ఆ రహీంపురా గ్రామం లేదూ, ఫతేపూర్ దగ్గర? దాన్లో ఎనిమదణాల భాగం అంటే సగం మన శ్యామూ గపూర్‌మియా భార్య దగ్గర కొనేశాడు. శ్యామూ పేరిట అది రిజిస్టరయింది. దాన్ని వాడు స్వాధీనం కూడా చేసుకున్నాడు."

బిషన్‌లాల్ మధ్యలో అపాడు: "లేదు జ్వాలన్నయ్యా! ఇదంతా మోసం. సలీమా పిచ్చికి నల్లమందు పెట్టి, ఒట్టి దస్తావేజుమీద మన శ్యామూ అన్నయ్య ఆమెచేత వేలిముద్ర వేయించుకున్నాడు. తర్వాత ఆమె తన ఆస్తివంతా శ్యామూ అన్నయ్యకు ఇచ్చేసినట్టు దానిమీద రాయించారు. ఆ సంగతి తెలిసి రహమత్‌ఖాన్ శ్యామూ అన్నయ్యమీద కేసు పెట్టాడు. ఇంకా కేసు నడుస్తూనే ఉంది."

మున్షీ రాధేలాల్ బిషన్‌లాల్‌ని కోప్పడ్డారు: "మధ్యలో నీవవక తవకగా మాట్లాడకు" మళ్ళీ ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "ఈ బిషన్‌కూ, శ్యామూకు బొత్తిగా పడదు. అందుకనే వీడ్ని నా కూడా తీసుకు వచ్చాను. వీడు పూర్తిగా బగ్గూ మాస్టరుకు స్వాధీనమయి పోయినాడు. ఆ బగ్గూ రహమత్‌ఖాన్‌కు మామ అవుతాడు." ఆ తర్వాత ఆయన

బిషన్‌లాల్ని మళ్ళీ ఒకసారి మందలించారు: "ఖబడ్దార్! ఈ విషయంలో నీవు పల్లెత్తి ఒక్క మాట కూడా అనడానికి వీల్లేదు."

జ్వాలా ప్రసాద్ కూడా అన్నారు: "అవును బిషన్! ఇతరులు మాట్లాడేప్పుడు వాళ్ళ మాటకి అడ్డం రాకూడదు. సరే బాబాయ్! ఇక మీరు చెప్పదలుచుకున్నది చెప్పండి. అయితే రహమత్‌ఖాన్ శ్యామూమీద కేసు పెట్టాడు. ఆ తర్వాత ఏమయింది?"

"అయ్యేదేముంది? ఆస్తికి సంబంధించిన వ్యవహారం. నవ్వులా! పొలం శ్యామూ స్వాధీనంలో ఉన్నది. కేసు నడుస్తూ ఉంటుంది. ఒక ఏటితో అవుతుందా? హైకోర్టు ఉంది, ఆ తర్వాత ప్రీవీ కౌన్సిలుంది. అతను ఝుమ్మన్‌లాల్ కరణం లేడూ! అతను మన పక్షమే. కాగితాలన్నీ మనదగ్గర సిద్ధంగా ఉన్నాయి. రహమత్‌ఖాన్ అలహాబాద్ జిల్లాలో ఎక్కడో మారుమూలన ఉంటాడు. ఏపూటకాపూట గడుపుకుంటుంటాడు. అతనివల్ల అయేది కాదీ వ్యవహారం."

ఆ తర్వాత మున్షీ శివలాల్ అందుకున్నారు: "ఇప్పుడా కేసు పండిత్ గిరిజాశంకర్ సబ్‌జడ్జి లేరూ? ఆయన కోర్టులో ఉంది."

జ్వాలా ప్రసాద్ మున్షీ శివలాల్ ఆశయాన్ని గ్రహించారు. కాని మౌనంతో ఆ విషయాన్ని తప్పించి ఆయన రాధేలాల్‌తో అన్నారు: "అయితే బాబాయ్! మరి తర్వాత మీ ఆలోచన ఏమిటి?"

"అదే చెప్తున్నాను. రహీంపురా గ్రామంలో సగభాగం మనకు స్వాధీనమయిపోయినట్టే. ఇక మిగిలినసగం సంగతి ఉంది. కయూంమియా మక్కా వెళ్ళిపోతున్నారు. ఆయన తనభాగం అమ్మేస్తున్నారు. చాలా చౌకగా ఇయ్యడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు — అంటే నాలుగువేలు రొక్కం వెంటనే ఇచ్చేటట్టు, మిగిలిన నాలుగువేలు మూడేండ్లల్లో తీర్చేటట్టు. అందులో రెండువేల వరకూ మేము ఫతేపూర్‌లో ఏర్పాటు చేస్తాం. మిగిలిన రెండువేలు నీవుచూడు. ఈ సగం నీ పేరిట కొనుగోలవుతుంది. శ్యామూ పేరిటఉన్న సగం కూడా నీ పేరిటనే మార్చిస్తాం. అప్పటికి రహీంపురా గ్రామం పూర్తిగా నీ పేరిట ఏర్పడి పోతుంది."

బిషన్ ఇక సహించలేక నవ్వుతూ అన్నాడు: "అంతే జ్వాలన్నయ్యా! ఈ శ్యామూ వలలో నీవుకూడా చిక్కుకున్నావంటే భలే మజాగా

ఉంటుంది. నీ అధికారం, నీ పలుకుబడి చూచి పల్లెత్తుమాట అనడానికి ఎవరికీ ధైర్యం చాలదు.''

రాధేలాల్ బిషన్‌లాల్ చెవి మెలేస్తూ అన్నారు: "ఏంరా పెద్దమ్మా! మళ్ళీ నోరెత్తావ్? వీడు శ్యామూతో బద్ధవైరం సాధిస్తున్నాడు—నిష్ప్రయోజకుడు, దేశదిమ్మరి, కృతఘ్నుడు. వెళ్ళరా ఇక్కడినుంచి.''

బిషన్‌లాల్ మళ్ళీ మాట్లాడకుండా బయటికి వెళ్ళిపోయినాడు.

జ్వాలాప్రసాద్ కొంచెంసేపటి వరకూ ఆలోచించారు. అంతలోనే తానేదో నిర్ణయం చేసినట్టుగా అన్నారు: "ఈ రెండువేలు ఏర్పాటు చేయడం నా వల్ల కాదు. కయూంమియా తన పొలం మరొకరికి అమ్ముకోవచ్చని అతనికి మీరు చెప్పెయ్యండి.''

మున్షీ శివలాల్ చాలా తీవ్రంగా జ్వాలా ప్రసాద్ వైపు చూచి అన్నారు. "అలా వీల్లేదు. తరుముకొని వస్తున్న ఆస్తిని కాదనడం మంచిది కాదు. మున్షీ రామసహాయ్‌కి నేను వ్రాసేస్తాను. ఈ రెండు వేల రూపాయలు ఆయన సులభంగా సర్ద గలుగుతారు.'' తర్వాత ఆయన రాధేలాల్‌తో అన్నారు: "రాధూ! నీవు శ్యామూ భాగం జ్వాలా పేరిట వ్రాయించే ఏర్పాటు చేయించు.''

ఇప్పుడు జ్వాలా ప్రసాద్ చాలా దృఢంగా అన్నారు: "నాన్నా! నాకి శ్యామూ ఆస్థి అక్కర్లేదు, ఏమయినా సరే అక్కర్లేదు. సలీమా ఆ ఆస్థిని శ్యామూకు ఇచ్చింది. కనుక అది శ్యామూకే చెందుతుంది.''

"నీ పేరయితేనేం, శ్యామూ పేరయితేనేం.'' రాధేలాల్ అన్నారు: "సమిష్టి కుటుంబానికి సంబంధించిన ఆస్థిలో అన్నదమ్ములందరికీ సమానంగా భాగం ఉంటుంది.''

"అవును, నాకా విషయం తెలుసు. కాని రహీంపురా సగభాగం శ్యామూపేరిట ఉంటేనే బాగుంటుంది. ఫతేపూర్ పొలం కూడా శ్యామూ పేరిటనే ఉన్నది కదా! ఈ విషయంలో నన్నెందుకు బయటికి లాగుతారు?''

ఇక రాధేలాల్ బయటపడక తప్పింది కాదు: "అబ్బాయ్ జ్వాలా! అసలు విషయం చెప్తాను. విని కొంచెం అర్థం చేసుకో... అంటే సలీమా కూడా ఇప్పుడు అల్లుడితో చేరిపోయింది. తను నల్లమందు నిషాలో ఒళ్ళు

తెలియక పడి ఉంటే, ఆమెను మోసం చేసి ఆమె తల్లి ఈ పొలం శ్యామూ తన పేర పెట్టించుకున్నాడని అంటుందామె."

"అలాగా! మరి కిషన్ చెప్పింది వినేమన్నమాట! ఈ కాగితాలలో నన్ను కూడా చేర్చాలని మీకు లేకపోతే ఉన్నదున్నట్టు వాళ్ళతో ఎందుకు చెప్ప లేదు?" జ్వాలా ప్రసాద్‌కు రోషం వచ్చింది: "ఈ విషయంలో నా పేరు ఏ విధంగానైనా సరే నేను రానివ్వను. ఇది నా ప్రతిష్ఠకు సంబంధించిన విషయం."

జ్వాలా ప్రసాద్ అలా గట్టిగా చెప్పేసరికి మున్షీ శివలాల్‌కు తన కుమారుడు చెప్పేదానిలో తప్పేమీ లేదని తోచింది. ఆయన సగర్వంగా జ్వాలా ప్రసాద్‌ను చూచి అన్నారు: "అవును రాధా! జ్వాలా చెప్పేమాట బాగానే ఉంది. పరువూ, ప్రతిష్ఠగల పెద్ద ఆఫీసరు గదా! వాడికి చెడ్డపేరు రాకూడదు. శ్యామూ వ్యాజ్యంలో గెలిస్తే అప్పుడే ఆ పొలం జ్వాలా పేరిట పెట్టవచ్చు. ఇప్పుడలా చేయడం అంత మంచిపని కాదు. కేసు గెలిచేట్టు గట్టిగా ప్రయత్నించు."

"అవును నిజమే. కాని అసలు విషయమేమిటంటే ఈ కేసులో పటుత్వం తక్కువ అని ప్లీడర్లు చెప్పుతున్నారు. ఆమె వ్రాసిచ్చిన కాగితాన్ని రిజిస్టరు చేయించలేదు. కాని కాగితం మాత్రం భద్రంగా ఉంది. దానికి తోడు పొలం శ్యామూ స్వాధీనంలో ఉంది. జడ్జిగారికి కొంచెం నచ్చచెప్తే వ్యవహారం ప్రాణం పోసుకుంటుంది." తర్వాత ఆయన జ్వాలా ప్రసాద్ వైపు చూచి అన్నారు: "పండిత్ గిరిజాశంకర్ నీకు తెలుసుగదా! ఆయన దగ్గరనే ఈ కేసు నడుస్తూ ఉంది."

"అవును, ఒక విధంగా తెలుసు, మరొకరకంగా తెలియదు కూడాను. కాని ఈ కేసు విషయమై నేను పండిత్ గిరిజాశంకర్‌తో ఏమయినా సరే ఒక్క అక్షరం కూడా చెప్పను." తనకిష్టంలేని ఈ ప్రసంగాన్ని అంతటితో ముగించేందుకు జ్వాలా ప్రసాద్ లేచి నిలబడ్డారు: "డిప్టీ కలెక్టరు ఇక్కడ క్యాంపుకు వచ్చి ఉన్నారు. నన్ను రమ్మని కబురు చేశారు. ఆలస్య మవుతున్నది."

జ్వాలా ప్రసాద్ అలా నిక్కచ్చిగా సమాధానం చెప్పడం మున్షీ రాధేలాల్‌కు నచ్చలేదు. జ్వాలా ప్రసాద్ వెళ్ళిపోయిన తర్వాత ఆయన శివలాల్‌తో అన్నారు. "అన్నయ్యా! మన కుటుంబం జమీందారీ కుటుంబం

కావాలనే శ్యామూ ఇదంతా చేశాడు. నీవు జ్వాలాకు నచ్చచెప్పు. ఈ అవకాశం గనక పోతే మళ్ళీ ఇలాంటి అవకాశం రాదు. జ్వాలా ధోరణి చూస్తే అతనికి పొలమూ పుట్రా ఏమీ వీర్పడేటట్టేమీ కనిపించడంలేదు. తప్పు విలవచేసే ధోరణి కూడా అంతమాత్రంగానే ఉంది. అతనేం చేయక్కర్లేదు. అంతా చూచుకునేందుకు అన్నదమ్ములున్నారు గదా! అవకాశం చిక్కినప్పుడు పైపైన కొంచెం ప్రయత్నిస్తే చాలు.''

మున్షీ శివలాల్ నీరస పడినట్టుగా అన్నారు: "నీవు చెప్పేది నిజమే వోయ్. కాని ఏంచేస్తాం. పిల్లవాడు పెద్దవాడయినాడు. పెద్దవాడవడమే కాకుండా మన కుటుంబానికి గౌరవ ప్రతిష్ఠలు తెస్తున్నాడు. మరి వాణ్ణి కాదూ కూడదూ అని గదిమి చెప్పడం ఎలాగా? అయితే ఒక్కమాట చెప్తాను. చాలా మెలకువగా చెయ్యాలి.''

"చెప్పన్నయ్యా, నేను మెలకువగానే చేస్తాను.''

"కిషన్ విషయం నేనాలోచించాను. వాడికి ఎక్కడైనా పని చూపిస్తే వాడి అలవాట్లు మారవచ్చునని నేను జ్వాలాతో చెప్పాను. వాడికి పెండ్లీడు కూడా వచ్చింది కదా!''

రాధేలాల్ దీనంగా అన్నారు: "అవును, ఈ కిషన్ ఇంత పనికి మాలిన వాడయి వీధుల వెంబడి తిరుగుతాడని నేననుకోలేదు. కనీసం మిడిల్ పరీక్ష కూడా అవలేదు. వాడికేం పని చూపిస్తాడు పాపం జ్వాలా?''

"అదే చెప్తున్నాను. ఘాటంపూర్లో నంబర్దారు భార్య ఉందే, ఆమెను నీవు మాఘ తిరునాళ్ళలో చూచావు. ఆమెకు పెద్ద ఇలాకా ఉంది. ఒక తాలూకా అంతా ఆమె చేతిలో ఉంది. ఆమెతో జ్వాలాకు బాగా పరిచయం ఉంది. ఇంట్లో మనిషిగా చూచుకుంటుందామె జ్వాలాను. ఆమె దగ్గర కిషన్ని గుమాస్తాగా చేరిస్తే ఎలా ఉంటుందంటావు?''

మున్షీ రాధేలాల్ ముఖంలోని విషాద రేఖలన్నీ మాయమై పోయినాయి. విప్పారిన ముఖంతో ఆయన అన్నారు: "నిజంగానా అన్నయ్యా! అలా జరిగితే కిషన్ అదృష్టం పండిందన్న మాటే!''

"కిషన్ ఒక్కడిదే కాదు, కుటుంబానికుందా అదృష్టం అని చెప్పవచ్చు. కాని కిషన్తోపాటు నీవు కూడా వెళ్ళాలి. లేకుంటే వీడు చేసిన పనంతా చెడగొట్టేస్తాడు. పేరు వాడిది, పనంతా నీవే చేసుకోవాలి. తెలిసిందా!

దీనికి నీవు ఒప్పుకుంటే నంబర్‌దారు భార్యకు ఉత్తరం వ్రాసి మిమ్మల్ని అక్కడికి పంపిస్తాను.''

"ఇంతటి మంచి అవకాశాన్ని పోగొట్టు కుంటామా? నీవు చెప్పినమాట శిరసావహించి చేస్తాం. కాని మేము ఘాటంపూర్ వెళ్ళడం బహుశా జ్వాలాకు ఇష్టముండదేమో!''

"అవును, ఆ మాట వాస్తవమే. అందుకనే నేను ఉత్తరం వ్రాసి పంపుతాను. ఈ సంగతి జ్వాలాతో నీవేమీ చెప్పకు.''

మూడు రోజుల్లో మున్షీ శివలాల్ జ్వాలాకే నచ్చచెప్పి ఆయనచేత నంబర్‌దారు భార్యకు కిషన్ ఉద్యోగాన్ని గురించి ఉత్తరం వ్రాయించారు. పదిహేను రోజులకల్లా రాధేలాల్, రాధేలాల్ భార్య, కిషన్ ముగ్గురూ ఘాటంపూర్ బయల్దేరి వెళ్ళారు.

జ్వాలా ప్రసాద్ ఇంట్లో ఇప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. బిషన్‌లాల్ ప్రకృత్యా శాంతస్వభావం గలవాడు. జ్వాలా ప్రసాద్, యమున అంటే అతనికి చాల గౌరవ భావం ఉండేది. అసలెప్పుడూ తన పనిలోనే మునిగి ఉండేవాడు. మిగిలిన ముగ్గురు అన్నదమ్ములకూ అతనికీ హస్తి మశకాంతరంగా ఉండేది. గంగా ప్రసాద్ బిషన్‌లాల్‌తో చాలా కలిసి మెలిసి ఉండేవాడు. కాని బిషన్‌లాల్ అస్తమానం చేతులు కట్టుకుని ఇంట్లో కూర్చుండే ఘటంకాదు. ఎక్కువకాలం అతను బయట తిరుగు తూనే ఉండేవాడు.

ప్రతి మంగళవారం సోరాప్ గ్రామంలో సంత జరుగుతుంది. చుట్టు పక్కల ఊళ్ళనుంచేకాక చాలా దూరంనుంచి కూడా ఎంతోమంది ప్రజలు వస్తువులు కొనుక్కునేందుకు ఆ సంతకు వస్తారు. ఆ బజారుకు సుమారు ఆరు ఫర్లాంగుల దూరంలో ఊరిబయట ఒక మామిడితోట ఉంది. ఆ తోట నాది అన్నవాడెవడూ లేడు. అది అలాగే ఉండిపోయింది. ఆ తోటలో ఆంజనేయస్వామి దేవాలయం ఒకటి పాడుపడి ఉంది. అటూ ఇటూ తిరుగుతూ బిషన్‌లాల్ ఆ తోటలోకి వెళ్ళాడు. ఆ తోట అతన్ని చాలా ఆకర్షించింది. ఆ మామిడి తోటలో మంచి వ్యాయామశాల పెట్ట వచ్చునని అతనికి తోచింది. అదే సమయంలో ఘుమరూమిశ్ర కూడా అక్కడనే పనిలేక తిరుగుతూ ఉన్నారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాన్ని మంచి స్థితిలోకి తీసుకురావాలని

ఆయనకు ఆలోచన కలిగింది. బిషన్‌లాల్, ఘుమరూ మిశ్ర - ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ ఆ తోటనుండి ఊళ్ళోకి వచ్చారు. ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. బేచూ మిశ్ర తమ్ముడు ఘుమరూ మిశ్ర. కాశీలో సంస్కృతం చదువుకొనేందుకు వెళ్ళి రెండు నెల్ల క్రితం అక్కడినుంచి తప్పించుకువచ్చారు. ఘుమరూగారికి సంస్కృతంతో ఆగర్భ శత్రుత్వం ఉన్నట్టనిపించింది. ఈ వ్యాకరణ మహా సముద్రంలో మునిగితే ఇక ప్రాణాలు పోయినట్టే అని అనిపించిందాయనకు.

ఘుమరూ మిశ్ర వయస్సు దాదాపు ఇరవై, ఇరవై ఒక్క సంవత్సరాలు ఉండవచ్చు. బిషన్‌లాల్ పక్కన నిలుచుంటే పొడుగులోను, శరీర నిర్మాణంలోనూ అతనికి కొంచెం తక్కువగానే కనిపిస్తారు. నొసట బొట్టు పెట్టుకొని ఉండేవారు. వ్యాకరణం ఆయనకు రాలేదు: కాని సంస్కృత శ్లోకాలు చాలా నోటికివచ్చాయి. ఆయన ఆ శ్లోకాలను సస్వరంగా చదువుతూ ఉండేవారు. ఘుమరూ కాశీనుండి తప్పించుకొని వచ్చినందుకు బేచూ మిశ్ర చాలా కోప పడ్డారు. కాని ఘుమరూకు వయసు వచ్చింది. బలవంతంగా అతనిచేత ఏపనీ చేయించడం సాధ్యంకాని వయస్సది.

బేచూమిశ్ర సోరావ్‌లో డిప్టీ తహసీల్దారుగా పని చేస్తున్నారు. ఆయన సోరావ్ గ్రామవాసి. ఆయనకు ఆ వూరినుంచి ఎప్పుడూ మార్పు రాలేదు, వచ్చే అవకాశం కూడా లేదు. అది ఊళ్ళో చాలామందికి ఆశ్చర్యంగా ఉండేది. కాని బేచూమాత్రం ఆ వూళ్ళో పాతుకుపొయ్యాడు. ఆ వూరినుండి మరోచోటికి వెళ్ళడానికి ఆయన సిద్ధపడి వుంటే ఈ పాటికి ఆయన డిప్టీ కలెక్టరు అయ్యేవారు.

ఘుమరూ, బిషన్‌లాల్ - ఇద్దరికీ ఒకరిమీద మరొకరికి మక్కువ ఏర్పడింది. ఇద్దరూ పథకం తయారు చేసుకున్నారు. ఆ మామిడి తోటలో ఒక వ్యాయామశాల నిర్మించి అక్కడ బిషన్‌లాలు గురువుగా ఉండేటట్టూ, ఆంజనేయస్వామి దేవాలయం బాగుచేసి ఘుమరూ మిశ్ర అక్కడ అర్చకుడుగా ఉండేటట్టూ నిర్ణయించుకున్నారు. ఒక్క వారం గడిచేసరికి వ్యాయామశాలకు పది పన్నెండు మంది యువకులు పోగయ్యారు. జట్లు ఏర్పడ్డాయి. మరోవైపు ఆంజనేయస్వామి ఆలయంలో కూడా కైంకర్యం సక్రమంగా జరుగుతున్నది. నిత్యనైవేద్యాలు ఆరంభమయాయి.

హోలీ పండుగ దాటింది. చుట్టు ప్రక్కల పంట పండి కళకళ

లాడుతూ ఉంది. కోతలుకూడా అరంభమయినాయి. మంగళవారపు సంత జమాయించి జరుగుతూ ఉంది. చుట్టుప్రక్కల పల్లెలనుంచి జనం బెల్లం, ధాన్యం, మరి ఇతర సామాను తీసుకొని సంతకు వచ్చేవారు. సంతలో జన సమ్మర్దం హెచ్చింది. దానితోపాటు అంజనేయస్వామి అలయంలో భోగం, ప్రసాదం ఘుమఘుమలాడుతూ ఉంది. ఘుమరూ మిశ్ర ఘుమరూ పండిత్ అయినారు. బిషన్‌లాల్ కూడా బిషన్‌గురుగా మారిపోయారు.

ఆ మంగళవారపు సంతకు బుద్ధూసింగు ఎందుకు వచ్చారో, ఎవ్వరికీ కచ్చితంగా తెలియదు. ఎవరికి తోచినట్టు వాళ్ళనుకొంటున్నారు. సోరావ్‌లో ఉస్తాద్ బుద్ధూసింగుది ఒకటి వ్యాయామశాల ఉండేది. పది సంవత్సరాల క్రితం తూర్పు జిల్లాలన్నిటిలో ఆయన తనకు మించిన పైలవాన్ లేడనిపించుకున్నారు. కాని వయస్సు పెరిగి శరీరంలో దార్ఢ్యం తగ్గిపోయింది. ఠాకుర్ వీరభానుసింగ్ ఆయనకొక వ్యాయామశాల నిర్మించి పెట్టారు.

సోరావ్‌లో మరో వ్యాయామశాల ఏర్పడడంవల్ల ఆయన స్వాభిమానం దెబ్బ తిన్నదని కొంతమంది అంటున్నారు. కొత్తగా మరో వ్యాయామశాల బయలుదేరడం వల్ల ఆయన చాలా సంతోషిస్తున్నారని మరి కొందరంటు న్నారు. మొత్తంమీద ఏ కారణం వల్లనయితేనేం, ఉస్తాద్ బుద్ధూసింగ్ ఆ రోజు తన శిష్యుడు మైకూను వెంటబెట్టుకొని మంగళవారపు సంతకు రావడంలో ఆయన ఉద్దేశ్యం ఆ సంత చూద్దామని కాదు. ఊరి వెలుపల వెలిసిన ఆ వ్యాయామశాలను చూడాలనే ఆయన బయలుదేరారు.

ఉస్తాద్ బుద్ధూసింగ్ బిషన్‌గురు వ్యాయామశాల చేరేసరికి బిషన్ గురు ఎఱ్ఱ లంగోటా బిగించి అంజనేయస్వామి విగ్రహం ఎదురుగా నిలబడి బస్కీలు తీస్తున్నారు. ప్రతిరోజూ వందదండాలు, అయిదు వందల బస్కీలు తియ్యడం బిషన్‌లాల్ దిన చర్యలో మొదటి కార్యక్రమం. ఆ తర్వాత ఆయన మహావీర్ హనుమాన్ ఆశీర్వచనం పొంది వ్యాయామ శాలకువెళ్ళి తన శిష్యులకు వ్యాయామం నేర్పుతూ ఉండేవారు. బుద్ధూ సింగ్ వ్యాయామశాల చేరేసరికి బిషన్ గురువు దండాలు తీయడం ముగించి బస్కీలు అరంభిస్తున్నారు. ఆ కుఱ్ఱవాడు పూర్తిగా అయిదువందల బస్కీలు అనాయాసంగా తీయడం చూచి బుద్ధూసింగు ఒళ్ళు పులకరించింది.

"పెలాప్ బేటా పెలాప్" అన్నారాయన బయట నిలబడి కొంచెం దగ్గరగా.

బిషన్ గురు ఉస్తాద్ బుద్ధూసింగును అంతకుముందు ఎప్పుడూ చూడ లేదు. కాని బుద్ధూసింగ్ శరీర దార్ఢ్యాన్నీ, దర్పాన్నీ చూచి ఆయన ఎవరో ఆరితేరిన పహల్వాన్ అయి ఉంటారని బిషన్ గురు గ్రహించారు. బుద్ధూసింగ్ పక్కనే ఆయన శిష్యుడు మైకూ సింగ్ నిలబడి ఉన్నాడు. మైకూసింగ్ వయస్సులో బిషన్‌లాల్ తోటివాడే. కాని చూచేందుకు మైకూలాల్ కొంచెం ఊటాగా కనిపిస్తున్నాడు. పహల్వాన్ బుద్ధూసింగ్ మైకూలాల్‌ను చూచి అన్నారు: "చూచావా మైకూ! మరొకరు నీలాంటి వాడు తయారవుతున్నాడు."

మైకూసింగ్ వెంటనే బుద్ధూసింగ్ కాళ్ళకు నమస్కరించాడు: "గురువుగారూ! రెండు నిమిషాల్లో ఇతనికి చుక్కలు చూపించేస్తాను. ఉస్తాద్ బుద్ధూసింగ్ శిష్యుడంటే సామాన్యం కాదు."

బుద్ధూసింగ్ నవ్వారు: "నీవు శిష్యుడివేనోయ్, ఇతగాడు గురువు. ఏమోయ్, నీ పేరు బిషన్‌గురు కదూ! ఈ సోరావ్ గ్రామంలో మరో గురువు వ్యాయామశాల తెరిచాడని విని మనసు నిలవక చూచి పోదామని వచ్చాము. ప్రఖ్యాతిచెందిన బుద్ధూ పహల్వాన్ పక్కన బిషన్ గురు బిక్క మొహం వేసుకుని నిలబడ్డారు. ఘుమరూ పండిత్ ఇంతవరకూ గుడిలో కూర్చుని ఈ తమాషా అంతా చూస్తూ ఉన్నారు. ఇక తనుకూడా రంగంలోకి రాకపోతే వీల్లేదని ఆయనకు తోచింది. ఆయన బిషన్ గురువును ఒక పక్కకు వెళ్ళమని చెప్పి తను ముందుకు వెళ్ళారు. బుద్ధూ పహల్వాన్ ఎదుటికివెళ్ళి ఆయన అన్నారు: "బుద్ధూగురూ! చిలుం తయారుగా ఉంది. ఒక గ్లాసు తీసుకోండి. ఈ వ్యాయామశాల సంగతి వదిలెయ్యండి. ఇదేదో మేము నేర్చుకునే కుఱ్ఱవాళ్ళమంతా కలిసి ఏర్పాటు చేసుకున్నాం. దీన్లో మీరు కోపగించుకోవలసిందేమీ లేదు."

పహల్‌వాన్ బుద్ధూసింగు పెద్దగా నవ్వారు: "చిలుమూ, గంజాయి తాగే యీ కుఱ్ఱవాళ్ళకు వ్యాయామశాల పెట్టడం ఏం చేతవుతుంది అనేది నాకు తెలుసు. కాని ఈ సోరావ్ గ్రామంలో ఒకే వ్యాయామ గురువు ఉండాలి. అతను పహల్‌వాన్ బుద్ధూసింగే కావాలి కాని మరొకరవడానికి వీల్లేదు."

తర్వాత ఆయన బిషన్‌లాల్‌తో అన్నారు: "మరి నాచేత కంఠెం కట్టించుకో. కంఠెం నాదగ్గరనే ఉంది."

ఇప్పుడు బిషన్‌లాల్ సమాధానం చెప్పవలసి వచ్చింది. "కంఠెం ఏదో ఒక గురువు దగ్గరనే కట్టించుకోవడం జరుగుతుంది. జగ్గూ పహల్‌వాన్ నాకు కంఠెం కట్టేశారు. ఇక నేనే ఒకరికి కంఠెం కట్టేందుకు వచ్చాను."

బుద్ధూసింగు మైకూసింగు వైపు చూచి అన్నారు: "ఏమోయ్ మైకూ! విన్నావా ఈ కుఱ్ఱవాడి మాటలు. గురువుట గురువు! మరొకరికి కంఠెం కడుతాడుట. కొంచెం చవి చూపిస్తావా ఇతనికి నీ సంగతి?"

అప్పటికి చాలామంది జనం పోగయ్యారు. అక్కడ చేరిన జనమంతా రకరకాలుగా అనుకొంటున్నారు, కేకలు పెడుతున్నారు. అక్కడ నిలబడ్డ ప్రతివాడూ బుద్ధూసింగునే సమర్థిస్తున్నాడు. "కానియ్యండి, కానియ్యండి, ఎవరు గెలుస్తారో చూదాం" అని కేకలు వినబడుతున్నాయి.

ఘుమరూ పండిత్ మళ్ళీ జోక్యం కలుగచేసి కొన్నారు. గుంపుగా కూడిన జనంవైపు చూచి అన్నారు: "ఒట్టి పుణ్యానికి అక్రమంగా కుస్తీ పందెం చూచేందుకు వచ్చారాఅందరూ? అలా వీల్లేదు. మా బిషన్ గురుకూ మైకూసింగుకూ కుస్తీల పందెం ఖాయమే - వచ్చే మంగళవారం కాక ఆ పైమంగళవారం. బుద్ధూసింగ్ వ్యాయామశాలలోనైనా సరే, ఇక్కడైనా సరే! మా బిషన్‌గురువు అలా లొంగిపోయేవాడు కాడు. ఒకవేళ బిషన్‌గురువు మైకూ పహల్‌వాన్ చేతిలో ఓడిపోతే, బుద్ధూ గురువు అతనికి కంఠెం కట్టేసి తన శిష్యుడిగా చేసుకుంటారు. అలా కాకుండా మైకూ ఓడిపోతే బిషన్ గురువుతోపాటు అతని వ్యాయామశాల కూడా, శాశ్వతంగా నిలబడుతుంది. బుద్ధూ పహల్‌వాన్ ఇక ఈ వైపు ముఖం చూపించ కూడదు."

"దానికి నా అభ్యంతర మేమీ లేదు" అన్నాడు మైకూసింగు బిషన్‌లాల్ వైపు ఉపేక్షాభావంతో చూస్తూ.

రాత్రికి ఆంజనేయస్వామికి వచ్చిన కానుకలూ, ప్రసాదం తీసుకొని ఘుమరూ పండిత్ ఇంటికి వెళ్ళేసరికి బేచూమిశ్ర గదిలో సభ - వారంతా సమావేశమై ఉన్నారు. ఘుమరూను చూచి బేచూమిశ్ర పెద్దగానవ్వారు: "ఏమోయ్ ఘుమరూ! గుడిలో కైంకర్యం జోరుగా జరుగుతున్నట్టున్నదే. ఆంజనేయులు బాగా ప్రసన్నమవుతున్నట్టున్నారు."

ఘుమరూ పండిత్ అక్కడ కూర్చున్న వాళ్ళందరికి దేవుడి ప్రసాదం పంచిపెడుతూ అన్నారు: "ఇదిగో స్వామి ప్రసాదం తీసుకోండి. హనుమంతుడి ప్రతాపం మళ్ళీ ఆవిర్భవిస్తూ ఉంది. అన్నయ్యా! ఇవ్వేళ నిజంగా చాలా మజాగా ఉంది. పహల్వాన్ బుద్ధూసింగ్ శిష్యుడు మైకూ సింగుకు, బిషన్ గురువుకూ వచ్చే మంగళవారం కాక ఆ పైమంగళవారం కుస్తీలో పోటీ జరుగబోతూ ఉంది."

బేచూమిశ్ర కొంచెం అప్రమత్తుడై అడిగారు: "ఈ బిషన్ గురువు ఎవరోయ్?"

"అయ్యో! మీకు తెలియదూ? అతనే బిషన్‌లాల్, అంటే తహసీల్దారు గారి పినతండ్రి కుమారుడు. అతనూ, నేనూ కలిసే ఈ ఆలయం, వ్యాయామశాలా నడిపిస్తున్నాం. ఆలయం నేను నడిపిస్తున్నాను, వ్యాయామశాల అతను చూచుకుంటాడు."

బేచూమిశ్ర వయస్సు నలభైఅయిదు దాటింది. ఇంకా యాభై నిండలేదు. ఆయన సోరావ్‌లో సాంఘిక జీవితంలో ప్రముఖపాత్ర వహిస్తారు. బేచూమిశ్ర ఉద్యోగరీత్యా డిప్టీ తహసీల్దారయినా—ఊళ్ళో పంచాయితీ, పౌరోహిత్యం పనులుకూడా చూస్తూ ఉంటారు. బాధ్యతగల ప్రభుత్వోద్యోగి ఇలా ప్రవర్తించడం శ్రేయస్కరం కాదని డిప్టీ కలెక్టరు రెండు మూడు సార్లు హెచ్చరించారు కూడాను. కాని అలవాటు మానుకోడం ఎలా అంటారు బేచూమిశ్ర. లేకుంటే తానీపాటికి డిప్టీ కలెక్టరయి ఉండేవాడని ఆయన అంటారు. కాని బేచూమిశ్ర ధైర్యసాహసాలు కలవాడు. ఎవరికీ భయపడే రకం కాదు. కొంచెం కోపిష్ఠి కూడాను. అందువల్ల వద్దన్నా తగాదాలు తప్పవు. అందరికీ ఆయనమీద గౌరవ మర్యాదలు మెండు. దానికి కారణం ఆయన న్యాయ ప్రియుడవడమే కాక అందరితో కలుపుగోలుగా ఉండేవారు. అందరి కష్ట సుఖాలనూ కనిపెట్టి ఉండేవారు.

బేచూమీద జ్వాలా ప్రసాద్‌కు మంచి అభిప్రాయమే ఉంది. ఒక విధంగా జ్వాలా ప్రసాద్ బేచూ మిశ్రను గౌరవంగా చూచేవారు. ప్రభుత్వ విషయాల్లో ఆయన బేచూమిశ్ర సలహా ప్రకారం నడిచేవారు. జ్వాలా ప్రసాద్ మీద బేచూ మిశ్రకు కూడా అలాగే ఒక విధమైన

మమకారం ఉండేది. జ్వాలా ప్రసాద్ సచ్ఛరిత్రుడనీ, వ్యాయామప్రియుడనీ ఆయన చాలా సంతోషిస్తూ ఉండేవారు.

మైకూ సింగ్‌కూ, బిషన్ గురువుకూ పోటీ పడిందనే వార్త బేచూ మిశ్రకు చాల ప్రాముఖ్యం కలదిగా తోచింది. ముఖ్యంగా దానికి కారణమేమంటే కొద్ది రోజుల క్రితం ఠాకుర్ వీరభానుసింగ్ ఏదో సాంఘిక మర్యాద విషయంలో నాయకత్వాన్ని పురస్కరించుకొని బేచూమిశ్రను అవమాన పరిచారు.

ఆ వార్త వినగానే బేచూమిశ్ర లేచి నిలబడ్డారు. బట్టలు వేసుకొని ఆయన జ్వాలా ప్రసాద్ ఇంటివైపు వెళ్ళారు. దారిలో ఆయనకు పోలీసు ఇన్స్పెక్టరు శహబుద్దీన్ కనిపించారు. బేచూమిశ్ర నవ్వుతూ ఇన్స్పెక్టరు శహబుద్దీన్‌తో అన్నారు: "విన్నారా మియాగారూ! తహసీల్దారుగారి పిన తండ్రి కుమారుడు ఇక్కడికి వచ్చారుట. అతను చాలా గొప్ప ఉస్తాదట."

"అవును మిశ్రగారూ! నేనుకూడా చూచానతన్ని. బుద్ధూ పహల్వాన్ అతనిమీద కారాలు మిరియాలు నూరుతున్నారుట. ఏదో ఒకరోజు అతనిమీద తారసిల్లాలని చూస్తున్నారుట కూడా. ఈ బుద్ధూసింగ్‌కు ఎక్కడలేని గర్వం. అతనికి బుద్ధి చెప్పేందుకు ఎవరో ఒకరు పోటీ దొరకడం మంచిదే అయింది."

"అదేనోయ్. బుద్ధూ ఈ రోజు అక్కడికి వెళ్ళనుకూడా వెళ్ళాడు. తహసీల్దారుగారి పినతండ్రి కుమారునికీ, ఆ బుద్ధూసింగ్ శిష్యుడు మైకూ సింగ్‌కు ఇక పదిహేను రోజులకు మంగళవారం నాడు కుస్తీ జరుగుతుంది. కాబట్టి పోలీసుశాఖ తరపున దానికి కావల్సిన బందోబస్తు చెయ్యాలి."

"ఎంత చక్కటి వార్త వినిపించారండీ మిశ్రగారూ! చాలా రోజు లయింది ఇలాంటి కార్యక్రమం ఏర్పాటయి. ఈ రోజునుంచే ఏర్పాటు చేయడం మొదలు పెడతాను. ఠాకుర్ వీరభానుసింగ్‌తో మాట్లాడి ఈ కుస్తీ లను గురించి ఊరంతా టమ టమా వేయిస్తాను. కాని వీళ్ళిద్దరూ కుర్రవాళ్ళు. పెద్దవాళ్ళ జట్టుకూడా ఒకటుంటే టిక్కెట్లు బాగా అమ్ముడు పోతాయి."

బేచూమిశ్ర నవ్వుతూ అన్నారు: "అవును, ఈ బుద్ధూ సింగ్‌కు సమానమయిన జోడీ వెదకాలి. చూడండి మరి. అందుకే మీకి సంగతి చెప్పాను. తహసీల్దారుగారిని కూడా ఈ విషయంలో సలహా అడుగుదాం, రండి!"

పదకొండు

రాత్రి తొమ్మిది గంటల వేళ బలిష్ఠులైన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఇక్కాలో సోరామ్ రావడం చూచి పోలీస్ ఇన్స్పెక్టరు శహాబుద్దీన్ ఇక్కాను ఆపి వేశారు. "ఎవరు మీరు? ఏమోయ్, ఎక్కడినుండి తీసుకొస్తున్నావు వీళ్ళని?"

ఇక్కాలో కూర్చున్న పాతికేళ్ళ సన్నపాటి కుఱ్ఱాడొకడు సమాధానం చెప్పాడు: "బాబూ! మేము అలహాబాదునుండి ఈ ఇక్కాలో వస్తూఉన్నాం. అసలు మాది ఫతేపూరు. తహసీల్దారుగారితో పనిఉండి వస్తున్నాం."

"ఏ పని మీదన్నా రండి, అసలు మీరెవరో చెప్పారు గారు."

ఇక్కాలో ఉన్న వాళ్ళల్లో బలిష్ఠంగా ఒడ్డు పొడుగ్గా ఉన్న మరో వ్యక్తి అన్నారు: "అయ్యా! ఈ కుఱ్ఱాడి పేరు రహమత్ ఖాన్. ఒకప్పుడు ఫతేపూర్ జమీందారు. ప్రస్తుతమదంతా పోయి మావు కాపురస్థుడయినా డనుకోండి. నన్ను జగ్గూ పహల్వాన్ అంటారు. ఇతను మా బావమరిది కుమారుడు. అందువల్ల ఇతనితో నేనుకూడా వచ్చాను. తహసీల్దారుగారి తమ్ముడు బిషన్‌లాల్ నా శిష్యుడు. కొంచెం తహసీల్దారుగారి ఇంటికి వెళ్ళే దారి చూపిస్తే పుణ్యం ఉంటుంది.

బేచూమిశ్ర మోచేతితో శహాబుద్దీన్‌ను గుచ్చుతూ ఇక్కావాడితో అన్నాడు: "అదిగో ఎదురుగా చింతచెట్టు కనిపిస్తున్నది చూడు. దాని తర్వాత ఒక వంద అడుగుల దూరంలో ఒక వంపు వస్తుంది. అక్కడ ఆ వంపు తిరిగి ఒక ఫర్లాంగు దూరం వెళ్ళితే తహసీల్ వస్తుంది. తహసీల్‌కు ఎదురుగానే తహసీల్దారుగారి బంగళా కనిపిస్తుంది."

ఇక్కా వెళ్ళిపోయిన తర్వాత బేచూమిశ్ర అన్నారు: "సాయిబు గారూ! కుస్తీ పోటీకి కావలసిన ఏర్పాటంతా అయిపోయింది." ఇద్దరూ వడివడిగా నడువ సాగారు.

వీళ్ళిద్దరూ జ్వాలా ప్రసాద్‌గారి ఇంటికి వెళ్ళేసరికి జ్వాలా ప్రసాద్ జగ్గూమియా, రహమత్ ఖాన్‌తో మాట్లాడుతూ ఉన్నారు. బిషన్‌లాల్ బయటి బంగళాలో వాళ్ళిద్దరూ ఉండేందుకు ఏర్పాటు చేస్తున్నారు. శహాబుద్దీన్ తోపాటు బేచూమిశ్ర వెళ్ళేసరికి మాటలు ఆగిపోయాయి. జ్వాలా ప్రసాద్ లేచి వాళ్ళిద్దరికి స్వాగతం చెప్పారు: "రండి మిశ్రగారూ!

రండి శహాబుద్దీన్‌గారూ! ఇంత పొద్దుపోయిన తర్వాత రాత్రిపూట వచ్చారే! అంతా కులాసా గదా? ఏ మన్నా ముఖ్యమయిన విషయముందా?"

బేచూమిశ్ర కూర్చుంటూ అన్నారు: "అంతటి విశేషమేమీ లేదు. ఇంట్లోకూర్చుంటే ఏం తోచడం లేదు. తమ దర్శనం అయికూడా చాలా రోజులయిందని చెప్పి ఇలా బయలుదేరాను. వస్తూంటే దార్లో శహాబుద్దీన్ సాహబ్ కనిపించాడు. ఈ రోజు తహసీల్దారుగారింట్లోనే బాతాఖానీ వేద్దాం రమ్మంటే ఇతను నాకూడా వచ్చాడు. ఆ తర్వాత మిశ్రగారు జగ్గూ మియాను లాంతరు వెలుతురులో పరీక్షగా చూచి అన్నారు: "సోరావ్‌లో ఇటీవల కుస్తీలూ, వ్యాయామశాలలూ విపరీతంగా బయలుదేరినట్టున్నాయి. ఠాకుర్ వీరభానుసింగు ఆధ్వర్యంలో బుద్ధూసింగు వ్యాయామశాల నడుస్తూనే ఉంది. దొరగారి ఆధ్వర్యంలో దొరగారి తమ్ముడు బిషన్‌లాల్ అంటే బిషన్ గురువు కూడా మరొక వ్యాయామశాల ఆంజనేయస్వామి గుడి తోటలో స్థాపించారని వినికిడి."

జ్వాలా ప్రసాద్ సావధానంగా కూర్చుని అన్నారు: "ఈ వార్త ఎవరో అనుకుంటూ ఉంటే నేనుకూడా విన్నాను. కాని నేనా విషయమంతగా పట్టించుకోలేదు." కొంచెంసేపాగి జ్వాలా ప్రసాద్ కేక వేశారు: "ఒరేయ్ బిషన్, కొంచెం ఇలారా!"

బిషన్‌లాల్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. "నన్ను పిలిచారా?" అన్నాడు.

"డిప్టీ తహసీల్దారుగారు చెప్తున్నారు విన్నావా? ఆంజనేయస్వామి గుడి దగ్గర తోటలో నీవొక వ్యాయామశాల నడిపిస్తున్నావట నిజమేనా?"

బిషన్‌లాల్ దానికేమీ సమాధానం చెప్పలేదు. తలవంచుకొని మౌనంగా నిలబడి పోయినాడు.

అప్పుడు జగ్గూ పహల్‌వాన్ బిగ్గరగా నవ్వి అన్నారు: "సెబాష్ బిషన్! సోరావ్ రాగానే గురువయి పోయావా? జగ్గూ పహల్‌వాన్ శిష్యుడివి కదా మరి! అయ్యా, ఇతడు చాలా చురుకైనవాడు, నెమ్మదైన వాడు, మంచివాడు. కొంచెం జాగ్రత్తగా పట్టుకు వస్తే ఈ ప్రాంతంలో ఇలాంటి కుర్రాడు దొరకటం కష్టం."

బేచూమిశ్ర అవకాశం గమనించి అన్నారు: "అయ్యా! చాలా రోజులనుంచి సోరావ్‌లో నిశ్శబ్దంగా ఉందని శహాబుద్దీన్‌గారంటున్నారు.

కనుక పోలీసులచేత ఒక కుస్తీ పోటీ ఏర్పాటు చేయిస్తే ఎలా ఉంటుంది? అదృష్టవశాత్తు జగ్గూ పహల్‌వాన్ కూడా ఇక్కడికి వచ్చారు. బుద్ధూసింగు, జగ్గూ పహల్‌వాన్ ఉజ్జీని చూచేందుకు జనం పొర్లి పోతారు. బిషన్, మైకూసింగ్ కలిసి మరొక జట్టవుతుంది. ఇంకా నాలుగయిదు జట్లు పోలీసు జవాన్లతో ఏర్పాటు చేయవచ్చు."

కొంచెం ఆలోచించి జ్వాలా ప్రసాద్ అన్నారు: "అలాగే కానియ్యండి, ఆలోచన చెడ్డదేం కాదు."

బేచూమిశ్ర, శహబుద్దీన్‌ఖాన్ వెళ్ళిపోయిన తర్వాత జ్వాలా ప్రసాద్ జగ్గూ పహల్‌వాన్‌కూ, రహమత్‌ఖాన్‌కూ భోజనం ఏర్పాటు చేయించమని బిషన్‌లాల్‌కు చెప్పి పంపారు. బిషన్‌లాల్ అక్కడనుండి వెళ్ళిన తర్వాత జ్వాలా ప్రసాద్ మళ్ళీ చర్చ ఆరంభించారు: "రహమత్‌ఖాన్! శ్యామూతో మాట్లాడితేనే కాని ఇందులో నిజమెంతో అబద్ధం ఎంతో నేను తెలుసుకోలేను. కాని ఒక్కమాట మాత్రం నేను కచ్చితంగా చెప్పగలను. ఈ విషయాల్లో నేనేమీ జోక్యం కలుగజేసుకోలేదు. నాకివన్నీ ఏమీ తెలియవు కూడాను. నాకు సలీమా ఆస్తిమీద ఏమాత్రం ఆసక్తికూడా లేదు."

రహమత్‌ఖాన్ మాట్లాడబోయే ముందుగానే జగ్గూ పహల్‌వాన్ అన్నారు: "తమరి పేరు ప్రతిష్ఠలు తెలియని వాళ్ళులేరు. తమరు న్యాయ ప్రియులనీ, దయామయులనీ, మంచివారనీ, నిజాయితీ కలవారనీ అందరూ చెప్పుకుంటున్నారు. అందువల్లనే సలీమా భాగం తమ పేర వ్రాయించానని శ్యామలాల్ చెప్పినప్పుడు కనీసం నేనుమాత్రం నమ్మలేక పోయాను. అయ్యా! ఈ రహమత్‌ఖాన్ చాలా బీదవాడు. వ్యాజ్యాల్లోదిగే శక్తి అతనికి లేదు. మావ్‌లో గాజులమ్ముకొని పొట్ట పోసుకొంటున్నాడు. భార్యా, భర్తా రాత్రింబవళ్ళు చెమట ఓడ్చి పనిచేస్తేనేగాని రెండు పూటలూ తిండి గడవడం లేదు. ఆ పని వదిలేసి వ్యాజ్యాల్లో దిగాడంటే మలమల మాడిపోవాల్సి వస్తుంది."

జ్వాలా ప్రసాద్‌కు ఈ చర్చతో విసుగు పుట్టింది: "జగ్గూ పహల్‌వాన్! కేసు దాఖలయినప్పుడు అది చివరిదాకా సాగవలసిందే. దాని పర్యవసానం ఎలా ఉంటుందో ఓపికపట్టి ఎదురు చూడవలసి ఉంటుంది. కాని నాకు సంబంధించినంత వరకు నేను మాత్రం ఈ విషయంలో జోక్యం కలుగ చేసుకోనని గట్టిగా చెప్పగలను. ఆఫీసరను కలిసి

కొని ఈ విషయంలో వాళ్ళ అభిప్రాయాన్ని మార్చేందుకు కూడా ను ప్రయత్నించను. జడ్జిగారయిన పండిత్ గిరిజా శంకర్ చాల న్యాయమూర్తి. ఆయన మంచితనాన్ని నమ్ముకొని గట్టిగా ప్రయత్నించండి.''

జగ్గూ పహల్వాన్, రహమత్ ఖాన్ వచ్చిన ఉద్దేశ్యం నెరవేరింది. జ్వాలా ప్రసాద్‌ను గురించి వాళ్ళు విన్నదంతా నూటికి నూరు వంతులు నిజమేనని వాళ్ళకు తెలిసిపోయింది. మరుసటి రోజు ఉదయమే రహమత్ ఖాన్ వెళ్ళి పోయినాడు. కాని జగ్గూ పహల్వాన్ని మాత్రం బిషన్‌లాల్, బేచూమిశ్ర, శహబుద్దీన్‌ఖాన్ అందరూ కలిసి ఆపేశారు.

అదే రోజు సాయంత్రం పోలీసు ఇన్స్పెక్టర్ శహబుద్దీన్‌ఖాన్‌తో పాటు పండిత్ బేచూమిశ్ర కుస్తీల పోటీని గురించి ఠాకుర్ వీరభానుసింగుకు చెప్పేందుకు ఆయన ఇంటికి వెళ్ళారు. ఈ పోటీ పోలీసు డిపార్టుమెంటు తరపున ఏర్పాటవుతున్నది. అందులో ఫతేపూర్ నుండి జగ్గూ పహల్వాన్, సోరావ్‌నుండి బుద్ధూసింగ్ ముఖ్యమైన జట్టుగా పాల్గొంటారు. రెండో జట్టులో మైకూసింగు పహల్వాన్, బిషన్ పహల్వాన్ ఉంటారు. ఈ రెండు జట్లుగాక పోలీసు జవాన్లతో మరి అయిదు జట్లు ఏర్పడుతాయి. ఠాకుర్ వీరభానుసింగ్ బుద్ధూసింగ్‌ను పిలిపించి ఆయనకిసంగతి చెప్పారు. బుద్ధూ సింగ్ ఒక చాగాన దాని కొప్పుకోలేదు. కాని చివరకు అంగీకరించక తప్పలేదు.

కుస్తీ పోటీలకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశారు. అలహాబాదు నగరంలోనూ, మిగిలిన తహసీళ్ళలోనూ కూడా కరపత్రాలు పంచిపెట్టారు. వ్యాయామశాలల్లో ఉస్తాదులు తీవ్రంగా సన్నాహాలు చేస్తున్నారు.

పోటీలింకా రెండు రోజులకు జరుగుతయ్యనగా బుద్ధూ పహల్వాన్ బిషన్‌గురు వ్యాయామశాలకు వచ్చారు. ఆయన వచ్చినప్పుడు జగ్గూ ఉస్తాదు బిషన్ గురువుకు పట్లు నేర్పుతున్నారు. ఆ తర్ఫీదు ముగిసిన తర్వాత బుద్ధూ పహల్వాన్ జగ్గూ పహల్‌హాన్‌తో ఏకాంతంగా మాట్లాడారు: 'జగ్గూ ఉస్తాద్! నాపరువంతా నీ చేతిలో ఉంది. నీవు నన్ను కాపాడాలి.'

బుద్ధూ పహల్వాన్ అంత దీనంగా అడగడం చూచి జగ్గూ పహల్వాన్‌కు నవ్వు వచ్చింది: ''అయితే మరి నన్నేం చెయ్యమంటావ్?''

''ఏమని చెప్పను? ఠాకుర్ వీరభానుసింగ్ అండన బతుకుతున్నాను. ఈ కుస్తీలో ఓడిపోయినానంటే ఆకాస్త తొలగిపోతుంది.''

జగ్గూకు కూడా ఇటీవల కొంత ఆత్మవిశ్వాసం తగ్గుతూ వచ్చింది. బుద్ధూ సింగ్ మాటలు వినేసరికి అతనికి ధైర్యం వచ్చింది: "అవును ఇది విచారించ వలసిన విషయమే కాని ఏం చేద్దాం?"

బుద్ధూ పహల్‌వాన్ కొంచెం ఆలోచించి అన్నారు : "ఈ కుస్తీలో నిన్ను ఓడిపొమ్మని చెప్పడం తప్పే. అందుకని మనం ఈ కుస్తీలో సమానంగా పట్టుబట్టి ఎవరూ గెలవకుండా పోటీ ముగించేస్తే ఎలా వుంటుంది? అలా చేస్తే ఇద్దరికీ గౌరవం దక్కుతుంది."

జగ్గూ ఇప్పుడు తన అస్త్రం విసిరారు: "కాని ఒక షరతు. బిషన్ మైకూను ఓడించాలి."

బుద్ధూ పహల్‌వాన్ చిక్కున పడ్డారు. మైకూసింగ్ పైకివస్తున్న యువకుడు, ఉద్ధతుడు. అతనికి బిషన్‌లాల్ చేతిలో ఓడిపొమ్మని చెప్పి ఒప్పించడం దుష్కరమే కాదు, అసంభవమనే చెప్పాలి.

బుద్ధూసింగ్ దీనంగా అన్నారు: "మైకూసింగ్‌ను ఒప్పించడం నా వల్ల అయ్యేపని కాదు. మరో మార్గమేమైనా ఉంటే చూడు."

జగ్గూ ఉస్తాద్ సమాధానం చెప్పారు : "ఠాకురు వీరభానుసింగ్ మీద నీ జీవితం ఆధారపడివుందనే విషయం నిజమే. కాని ఈ బిషన్‌లాల్ తహసీల్దారుగారి తమ్ముడు. తహసీల్దారుగారి తమ్ముడు ఓడిపోతే తహసీల్దారుగారికి అవమానంగా ఉంటుంది."

బుద్ధూసింగ్ కొంచెంసేపు ఆలోచించారు : "నీవు చెప్పింది కూడా నిజమే. ఈ ఆఫీసర్ల పిల్లలతో నేననవసరంగా తగాదా తెచ్చిపెట్టుకున్నాను మైకూ రెచ్చగొట్టడంవల్ల ఇదంతా జరిగింది. సరే, బిషన్ చేతిలో ఓడిపోయేందుకు మైకూ ఒప్పుకోకపోతే అతనసలు రంగంలోకేరాడు. దానికి నీకు అభ్యంతరం లేదుకదా?"

"అలాగే"

పోటీ చూచేందుకు ఆరోజు ఎంతో దూరంనుండి కూడా జనం వచ్చారు. సోరావ్‌లో ఆరోజు ఒక పెద్ద తిరనాళ్ళలాగా ఉంది. చిన్నచిన్న జట్ల తర్వాత బిషన్‌గురు, మైకూసింగ్ పహల్‌వాన్‌ల పేర్లు పిలిచారు. బిషన్ లాల్ లంగోటా కట్టుకొని సిద్ధంగా వున్నాడు. వెంటనే మైదానంలోకి దూకాడు. కొంచెంసేపు మైకూసింగ్‌కోసం ఎదురుచూచిన తరువాత అతను మైదానంవదలి పారిపోయినాడని ప్రకటించడం జరిగింది. ప్రజల్లో గుస

గుసలు బయలుదేరాయి. కొంచెం అలజడి కూడా చెలరేగింది. కాని ఇంతలో బుద్ధూసింగ్ పహల్ వాన్, జగ్గూ పహల్ వాన్‌ల పేర్లు పిలిచారు.

బుద్ధూసింగ్, జగ్గూ పహల్‌వాన్లు కలయబడ్డారో లేదో ఇంతలో మైకూసింగ్ పరుగెత్తుకుంటూ పోటీ పందిరిలోకి ప్రవేశించాడు. మైకూ సింగ్ నేరుగా జ్వాలా ప్రసాద్ దగ్గరికి వెళ్ళి అన్నాడు: "అయ్యా! నేను భయపడి పారిపోలేదు. మా గురువుగారు బుద్ధూసింగ్ ఉన్నారే, ఆయన నన్ను బలవంతంగా గదిలో బంధించి వచ్చారు. తను మాత్రం జగ్గూ పహల్ వాన్‌తో చేరి ఇద్దరూ సమానంగా పట్టుపట్టి ఎవరూ గెలవకుండా ఉండాలని ప్రయత్నిస్తున్నారు." అక్కడ ఉన్న వాళ్ళందరికీ ఈ మాటలు వినపడేలాగా మైకూసింగ్ ఎలుగెత్తి చెప్పాడు.

మైకూసింగు మాటలకు ప్రజల్లో అలజడి బయలుదేరింది. కొంతమంది లేచి కేకలు వేయసాగారు – "ఇది పచ్చిమోసం, మా డబ్బు మాకు వాపసు చెయ్యాలి."

ఈ ఆపద తటస్థించేసరికి జగ్గూ పహల్ వాన్, బుద్ధూసింగ్ ఆశ్చర్యంతో మాట్లాడలేక పోయారు. జగ్గూ బుద్ధూసింగును ప్రశ్నార్థక దృష్టితో చూచాడు. బుద్ధూసింగు జగ్గూ చెవిలో చెప్పాడు: "వీడి తస్సదియ్య, ఈ మైకూగాడిక్కడి కెలా వచ్చాడు? నేను వీణ్ణి కట్టేసి వచ్చాను. ఎలా తలుపు బద్దలు గొట్టేసుకొని వచ్చాడో భగవంతుడికి తెలియాలి. ఇంత మంది జనం ఎదుట నేనేం చెయ్యలేక ఊరుకున్నాను. లేకుంటే వీడి మెడ నలిపివేసే వాణ్ణి."

బుద్ధూసింగ్ అబద్ధం చెప్పడంలేదని జగ్గూ గ్రహించాడు. బుద్ధూసింగు ముఖవైఖరి చూచి జగ్గూకు అతనిమీద జాలి వేసింది. అతను బుద్ధూసింగు చెవిలో చెప్పాడు: "దిగులుపడకు. నీవు నామాట విన్నావు. భగవంతుడు నీకు మేలుచేస్తాడు." ఇద్దరూ కొంచెంసేపు ఒకరినొకరు చూచుకున్నారు.

అప్పుడు జగ్గూ మైదానంలో నిలబడి పోటీ నడిపించే అధికార్లను బెదరిస్తూ అన్నాడు: "ఏమిటండీ ఈ గోలంతా? కుస్తీ లేదని చెప్తే మేమూ వెళ్ళిపోతాం.

జగ్గూ పహల్ వాన్ బెదిరించే సరికి జనం సర్దుకున్నారు. కేకలు తగ్గి

పోయాయి. బేచూమిశ్ర లేచి ప్రకటించారు: "కుస్తీ మళ్ళీ ఆరంభమవుతున్నది. మైకూసింగు విషయం తర్వాత విచారిద్దాం."

జగ్గూ పహల్‌వాన్, బుద్ధూ పహల్‌వాన్ మళ్ళీ కుస్తీ ఆరంభించారు. బుద్ధూసింగు కంటె జగ్గూ పహల్‌వాన్‌దే పైచెయ్యిగా అనిపిస్తున్నది. కాని బుద్ధూసింగు కూడా అంత సులభంగా లొంగిపోవడం లేదు. ఒకరిని మించి ఒకరు పట్లు పడుతున్నారు. దాదాపు అయిదు నిమిషాల వరకూ అలాగే నడిచింది. కాని మళ్ళీ జగ్గూ బుద్ధూసింగును కిందపడేసి మర్దించడం మొదలు పెట్టారు. కాని బుద్ధూసింగు ఏ మాత్రం ఓడిపోలేదు.

ప్రేక్షకులు చాలా ఉత్సాహంతో ఈ పోటీని చూస్తున్నారు. వాళ్ళకు చాలా తమాషాగా ఉంది. కాని ఇప్పుడిప్పుడే వాళ్ళకు కూడా విసుగు వేస్తూ ఉన్నది. మైకూసింగు చెప్పింది నిజమేమో అని కొంత మంది గుసగుసలు సాగించారు. అదే సమయంలో ఉన్నట్టుండి జగ్గూ పహల్‌వాన్ బుద్ధూసింగును ఒక్క దెబ్బతో కింద పడేసేందుకు ప్రయత్నించాడు. కాని తానే పడిపోయాడు. బుద్ధూసింగు అతనిరొమ్ము మీద కూర్చొని ఉన్నాడు. బుద్ధూసింగు లేచి మైదానం బయటికి పరుగెత్తుతూ వెళ్ళి జ్వాలా ప్రసాద్‌కు సలాం చేశారు. ఆ తర్వాత ఆయన ఠాకుర్ వీరభానుసింగ్ కాళ్లకు నమస్కరించారు. బుద్ధూసింగు జగ్గూ పహల్‌వాన్‌ను ఓడించాడని అందరూ కేకలు పెట్టారు. జగ్గూ పహల్‌వాన్ తలవంచుకొని బయటికి వెళ్ళారు.

ఇప్పుడు మైకూసింగు సంగతి విచారణకు వచ్చింది. బుద్ధూ సింగు జగ్గూ పహల్‌వాన్‌తో ముందుగా సంప్రతించాడన్న విషయం నిజం కాదని తేలింది. మైకూసింగు కొంచెం చిక్కున పడ్డాడు. అప్పుడు జగ్గూ పహల్‌వాన్ ముందుకు వెళ్ళి చెప్పాడు. "ఈ కుర్రవాడు ఏదో అపార్థం చేసుకున్నట్టున్నాడు. బిషన్ ఇక్కడనే ఉన్నాడు కాబట్టి కుస్తీ జరగనియ్యండి."

జనం కరతాళ ధ్వని చేసింది. కాని బిషన్‌లాల్ బిక్క మొహం వేశాడు. జగ్గూ మెల్లగా బిషన్‌లాల్ చెవిలో చెప్పారు: "ఏమిటోయ్! చూస్తున్నావ్? ముందుకు నడువు. భగవంతుడు సరిగా చూస్తే గెలుపు నీదే!" తర్వాత ఆయన బుద్ధూసింగుతో అన్నారు: "ఉస్తాద్, ఇద్దరూ యువకులు, అమాయకులు. తెలిసీ తెలియక తప్పు పట్టవచ్చు. కనుక పై నుండి మీరు కొంచెం చూస్తూ వుండండి."

ఇద్దరూ కలయ బడ్డారు. బుద్ధూసింగ్ మధ్యస్థులై నిలబడ్డారు. మైకూసింగు బిషన్‌లాల్‌తో కరచాలనం చేస్తూనే ఒక దెబ్బ విసిరేసరికి బిషన్‌లాల్ నేలకు గజం ఎత్తున ఎగిరి కింద పడ్డాడు. కాని ఎలా వచ్చాడోగాని బుద్ధూసింగు మైకూసింగుకు, బిషన్‌లాల్‌కు మధ్యనిలబడి ఉన్నాడు. బిషన్‌లాల్ బోర్లపడ్డాడు. బుద్ధూసింగు మధ్యలో అడ్డం వచ్చినందువల్ల బిషన్‌లాల్ మీద వెంటనే సవారీ చెయ్యడానికి మైకూసింగుకు అవకాశం చిక్కలేదు. పడగానే బిషన్‌లాల్ లేచి నిలబడ్డాడు. ఇంతలో బుద్ధూసింగు మైదానం మధ్యలో నుండి ఒకపక్కకు వచ్చేశాడు.

ఇప్పుడు బిషన్‌లాల్‌కూ, మైకూసింగుకు నిజమైన పందెం ఆరంభమయింది. అంతా చాలా వింతగా ఉంది. బిషన్‌లాల్, మైకూసింగు ఇద్దరూ మైదానం చుట్టూ పరుగులు తీస్తున్నారు. ముందు బిషన్‌లాల్, అతని వెనుక మైకూసింగు. కాని ఒకరినొకరు పట్టుకోలేకుండా ఉన్నారు. అందరూ నవ్వుతూ ఉన్నారు, కేకలు పెడుతున్నారు. అల్లరి చేస్తున్నారు. దాదాపు అయిదు నిమషాల వరకూ ఇదే పద్ధతిగా నడిచింది. చివరకు ప్రేక్షకుల హేళనను సహించలేక మైకూసింగు బిషన్‌లాల్‌ను పట్టుకున్నాడు. ఇద్దరూ కలియబడ్డారు. పట్టిన పట్టు విడవకుండానే ఇద్దరూ మైదానం చుట్టూ తిరుగుతున్నారు. వాళ్ళ పట్టును గమనిస్తూ వాళ్ళతోపాటు బుద్ధూసింగు కూడా తిరుగుతున్నాడు.

మైకూసింగుకు ఉన్నట్టుండి ఏదో తట్టుకున్నట్టనిపించింది. అతను పడిపోయినాడు. పడేముందు బోర్ల పడేందుకు అతను ప్రయత్నించాడు. కాని అతను కుడివైపు పడ్డాడు ... ఇంతలో బుద్ధూసింగు కంఠం వినిపించింది: "సెబాస్ బేటా! బిషన్‌లాల్‌దే గెలుపు." అంటూ ఆయన బిషన్‌లాల్‌ను మైకూసింగు పట్టునుండి విడిపించారు. బిషన్‌లాల్ పరుగెత్తుతూ వెళ్ళి తన ఉస్తాద్ జగ్గా పహల్‌వాన్‌కు సలాం చేశాడు. ఆ తర్వాత అతను తహసీల్దారుగారికి సలాం చేశాడు.

ఈ రెండు కుస్తీల్లో ఏదో పొరపాటు జరిగిందని ప్రేక్షకులందరూ అనుకుంటున్నారు. కాని అసలా పొరపాటేమిటి, ఎలా జరిగిందీ అనేది ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు. అది మైకూసింగుకు కూడా అర్థం కాలేదు. ప్రత్యక్షంగా కనిపించేదాన్ని కాదనడం ఎలా?

కుస్తీ అయిన మరునాడు పహల్‌వాన్ బుద్ధూసింగ్ జగ్గా పహల్‌వాన్‌ను

కలుసుకునేందుకు వచ్చారు. కిందటిరోజు సాయంత్రం జరిగిన కుస్తీలో తనకు వచ్చిన బహూమతి తాలూకు యాభై రూపాయలు అతని దగ్గర ఉన్నాయి. ఆయన ఆ యాభై రూపాయలు జగ్గూ పహల్‌వాన్ ముందు పెట్టి అన్నారు: "ఉస్తాద్, ఈ డబ్బు మీది. మీరు నా పరువు కాపాడినందుకు నేను కృతజ్ఞతా భారంతో వంగిపోతున్నాను. ఆ మైకూగాడున్నాడే, వాణ్ణి ఈరోజే నేను నా వ్యాయామశాల నుంచి వెళ్ళ గొట్టేశాను."

జగ్గూ పహల్‌వాన్ ఆ యాభై రూపాయలు తన రొంటిన దోపుకొని బిషన్‌లాల్‌తో అన్నారు: "ఇలా చూడవోయ్ బిషన్, బుద్ధూసింగ్ పహల్ వాన్ చేత కంకణం కట్టించుకో. గురువయేందుకు నీకింకా చాల కాలం పడుతుంది. నిన్న ఈయనే నీ పరువు కాపాడారు."

ఆ మధ్యాహ్నమే జగ్గూ పహల్‌వాన్ ఫతేపూర్‌కు బయలుదేరి వెళ్ళారు.

ఆ కుస్తీ పోటీలో జరిగిన విషయాలు బేచూమిశ్రకు అంతగా నచ్చలేదు. తహసీల్దారు గారి తమ్ముడు బిషన్‌లాల్ మైకూసింగును ఓడించి కూడా బుద్ధూసింగుకు శిష్యుడయినాడు. అతనితోపాటు బుద్ధూసింగుకు కూడా కీర్తి లభించింది. ఆయన తమ్ముడు ఘుమరూ ఆంజనేయస్వామి గుడికి అర్చకుడిగా అలాగే ఉండిపోయాడు.

అంతేగాక బేచూమిశ్రకు కొంచెం కష్టంగాతోచే మరోఘటన కూడా జరిగింది. వ్యాయామశాల, దేవాలయం ఉన్న తోట ఠాకుర్ వీరభానుసింగ్ జమీందారీ లోనిది. ఠాకూర్ వీరభానుసింగ్ ఆ తోటను శాశ్వతంగా బిషన్‌లాల్ పేరిట ఇనాంగా వ్రాసియిచ్చారు. అపట్టా ప్రకారం నాలుగు గొర్లతోట, అందులోఉన్న బావి, ఆంజనేయస్వామి ఆలయం—అన్నీ బిషన్‌లాల్‌కు స్వాధీనమయినాయి. కాబట్టి ఆ గుడిలో ఘుమరూ అర్చకుడిగా ఉండడమనేది బిషన్‌లాల్ అనుగ్రహంమీద ఆధారపడి ఉంది. మునుపటివలె అతనందులో భాగస్వామి కాదు.

ఇక ఎండలు చాలా హెచ్చుతూ ఉన్నాయి. కాని జ్వాలా ప్రసాద్‌గారి ఇంట్లో వాతావరణం ప్రశాంతంగానే వుంది. సివిల్‌కోర్టుకు వేసవిలో ఒక నెల సెలవు ఇచ్చేవారు. ఈ సెలవులారంభించగానే జడ్జి గిరిజాశంకర్ మిశ్ర సోరావ్‌లోఉన్న తన ఇంటికి వచ్చేశారు.

గిరిజాశంకర్‌మిశ్ర, బేచూ ఒకే వంశానికి చెందినవాళ్ళు. వాళ్ళఇండ్లు కూడా దగ్గరదగ్గరగానే ఉండేవి. యాభైసంవత్సరాల కిందట వాళ్ల పూర్వీ

కులు తగువులాడుకొని వేరుపడ్డారు. అప్పటినుండి ఈ రెండు తెగలవారు ఒకరినొకరు శత్రువులుగా చూచుకొనేవారు. కాని బ్రిటిషుపరిపాలనలో గిరిజాశంకర్, బేచూ ఇద్దరూ గవర్నమెంటు ఉద్యోగంలో చేరడంవల్ల వాళ్ళ విరోధం కూడా అంతరించి పోయింది. బేచూమిశ్ర గిరిజాశంకర్‌ను తన అన్నయ్యలాగా గౌరవించి ఆయన వాత్సల్యాన్ని సంపాదించారు. బేచూమిశ్ర ద్వారానే జ్వాలా ప్రసాద్‌కు గిరిజాశంకరుతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం మెల్లమెల్లగా ఘనిష్ఠమైన అనురాగంగా మారింది.

గిరిజాశంకర్ వచ్చిన సంగతి తెలుసుకొని మున్షీ శివలాల్ బేచూ మిశ్రగారి ఇంటికి వెళ్ళారు.

అందరూ లేచి మున్షీ శివలాల్‌కు స్వాగతం చెప్పారు. తర్వాత మున్షీ శివలాల్‌ను గిరిజాశంకర్ పక్కనే కూర్చోబెట్టి బేచూమిశ్ర అన్నారు: "మున్షీ గారూ! ఎండలు బాగా ఎక్కువయినాయి. వడగాలి కూడా కొడుతూ ఉంది. మామిడిపండ్ల రసంతో పానకం తయారయి ఉంది. తాగగానే చల్లదనం వస్తుంది."

మున్షీ శివలాల్ అన్నారు: "నన్ను క్షమించండి మిశ్రగారూ! నాకు ఒక వ్యసనం ఉండనే ఉంది."

"నోటి రుచి మార్చుకునేందుకు మరో వస్తువును కూడా అప్పుడప్పుడూ సేవించవచ్చు." అన్నారు గిరిజాశంకర్ నవ్వుతూ.

"జడ్జిగారూ! నోటి రుచి మార్చుకొనే వయస్సు గడిచిపోయింది. ఇప్పుడు కాటికి కాళ్ళుచాచి కూర్చున్నాను. ఆ ఘడియ ఎప్పుడు వస్తుందో తెలియదు. మీరు నమ్మండి – పాతికగ్లాసు కూడా తాగలేను. కుండలకు కుండలు తాగిన రోజులు కూడా ఉన్నాయి. సారాయి కూడా ఇప్పుడు మందులాగా తాగుతున్నాను."

పానకం తయారయి వచ్చింది. మున్షీ శివలాల్ అందరూ బలవంతం చేస్తే కాదనలేక పొయ్యారు. సగం తాగక తప్పిందికాదు.

ఆ పానక కార్యక్రమం ముగిసిన అరగంటలోగా బేచూమిశ్ర, గిరిజా శంకర్‌కు సంబంధించిన బంధువులూ, స్నేహితులూ వెళ్ళిపొయ్యారు. అందరూ వెళ్ళిపోయిన తర్వాత బేచూమిశ్ర అడిగారు: "మున్షీ గారూ! ఇప్పుడు కడుపు చల్లబడింది గదా! ఏదో పనిమీద వచ్చినట్టున్నారు?"

"అంతా భగవంతుని దయ. జడ్జిగారు వచ్చారని తెలిసి ఇలాచూచి పోదామని వచ్చాను. జ్వాలాకు క్షణంతీరదు గదా!" అన్నారు మున్షీ శివలాల్.

"అయ్యో, మీ కనవసరంగా శ్రమ ఇచ్చాను. ఒకటి రెండు రోజుల్లో నేనే అలా వద్దామని అనుకుంటున్నాను." అన్నారు గిరిజాశంకర్.

"నేను వస్తే మాత్రం తప్పేముంది? ఎవరో అన్నారు - దప్పికయిన వాడే బావిని వెదుక్కుంటూ వెళ్ళాలని. మా స్వంతపని ఒకటి ఉంది. జడ్జిగారు మన మనిషే కదా, ఆయన సాయం చేయకపోతే ఎవరు చేస్తారని వచ్చాను."

"అయితే చెప్పండి" అన్నారు గిరిజాశంకర్. కాని ఆయన మాటలు కొంచెం తడబడుతున్నాయి.

మున్షీ శివలాల్ గొంతు సవరించుకుంటూ అన్నారు: "అసలు విషయం చెప్తున్నాను. ఫతేపూర్‌లో మా జమీందారీ విషయం కొంచెం తగాదాలో పడ్డది. మీ కోర్టులో శ్యామలాల్‌కూ సలీమా తరఫున రహమత్ ఖాన్‌కూ మధ్య ఒక కేసు జరుగుతూ ఉంది."

"అవును. శ్యామలాల్ పేరిట ఆ గ్రామాన్ని సలీమా విక్రయించిందో, దానంగా ఇచ్చేసిందో, ఊరికే వ్రాసి ఇచ్చేసిందో స్పష్టంగా తెలియడం లేదు. నేను విక్రయించలేదు, దానం చెయ్యలేదూ, వ్రాసి ఇవ్వలేదు - అని సలీమా అంటుంది. ఆమెకు మత్తుమందు పెట్టి ఆమెచేత బలవంతంగా వేలి ముద్ర వేయించు కున్నారట."

"అబద్ధం చెబుతున్నదామె..." మున్షీ శివలాల్ కొంచెం ఉద్రేకంతో అన్నారు: "జ్వాలా దగ్గర ఆమె ఎన్ని వేలో తీసుకు వెళ్ళింది. ఏదో పండగనీ, పర్వమనీ, విందులనీ, వినోదాలనీ చెప్పి తీసుకు వెళ్ళేది. అల్లుడికి దానికీ పడదు."

గిరిజాశంకర్ ఏదయినా సమాధానం చెప్పేలోగానే బేచూమిశ్ర అన్నారు: "తహసీల్దారుగారు డబ్బిచ్చే కనక ఉంటే ఆయన అబద్ధం చెప్పరు. తహసీల్దారుగారు నేను డబ్బిచ్చానని ఏ మాత్రం చెప్పినా మీ కేసు గెలిచినట్టే అనుకోండి. దానికిగాను మీరు దిగులు పడవలసిన అవసరం లేదు."

మున్షీ శివలాల్ అన్నారు: "అసలు విషయ మేమిటంటే జ్వాలా

దఖిపిచ్చింది శ్యామలాల్‌కు గాని నేరుగా సలీమాకు ఇవ్వలేదు. అందువల్ల తను సలీమాకు దఖిపిచ్చానని అతను చెప్పడు.''

బేచూమిశ్ర సామాన్యుడు కాడు. వెంటనే అన్నారు: ''దానికేం, తహసీల్దారుగారు ఆ మాట చెప్పినా చాలు.''

''ఆ మాట నేను చెప్తే చాలదా? నేను జ్వాలా తండ్రిని గదా!'' అన్నారు మున్షీ శివలాల్ సంకోచిస్తూ.

ఈసారి గిరిజాశంకర్ సమాధానం చెప్పారు: ''శ్యామలాల్ జ్వాలా ప్రసాద్ పినతండ్రి కుమారుడు. రాధేలాల్ జ్వాలా ప్రసాద్‌కు స్వంత పినతండ్రి. వాళ్ళిద్దరి మాటలను నేను నమ్మేందుకు సిద్ధంకానప్పుడు నేను మీ మాట ఎలా నమ్మగలను? జ్వాలా సంగతి వేరు. అతను పెద్ద ఉద్యోగస్తుడు, గౌరవ మర్యాదలు కలవాడు. అతను అబద్ధం చెప్పడు. అతని మాటమీద నాకు నమ్మకముంది.''

మున్షీ శివలాల్ లేచి వెళ్ళుతూ అన్నారు: ''అయితే నేను వస్తాను. మీతో మాట్లాడమని జ్వాలాకే చెప్తాను. అసలీ ఆస్తిని శ్యామలాల్ జ్వాలా పేరిట వ్రాసేస్తున్నాడు. ఒకవేళ జ్వాలా సంకోచంవల్ల తానేమీ చెప్ప దలుచుకోకపోతే ఈ మాత్రం ప్రమాణం చాలదా?''

''చాలదు, ఎంత మాత్రం చాలదు. సమిష్టి కుటుంబంలో ఆస్తి ఎవరి పేరిట ఉన్నా ఒకటే. మున్షీగారూ! మీ కింతమాత్రం తెలియక పోలేదు. నమ్మకముండడం అవసరం. జ్వాలాబాబు కోర్టుకు రావాల్సిన అవసరం లేదు. అతను నాతో ఇక్కడ చెప్తే చాలు. కోర్టు సెలవులు కాగానే కేసు మళ్ళీ విచారణకు వస్తుంది. విచారణ పూర్తికాగానే తీర్పు చెప్పేస్తాను.''

ఇంటికి వచ్చి మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: ''జడ్జీ గారు గిరిజాశంకర్ ఈ ఊరికి వచ్చారు. ఈ రోజు నేనాయన్ని కలుసుకున్నాను. జ్వాలాబాబును చూడడం పడలేదని అనుకుంటున్నారు.''

''అవును, పని చాలా ఎక్కువగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లో వెళ్ళి చూచి వస్తాను.''

మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్ నుండి ముఖం తప్పించి అన్నారు: ''శ్యామూ కేసు విషయం నేనాయనకు చెప్పాను. సలీమాకు నేను దఖిపిచ్చానని జ్వాలా ప్రసాద్ చెప్పితే రహమత్ ఖాన్ కేసు రద్దు చేసేస్తా వని అన్నారాయన.''

"మరి....మరి నాన్నా.... నేను సలీమాకు డబ్బెప్పుడిచ్చాను? నాకామె ఎవరోకూడా తెలియదే. ఇంత వచ్చి అబద్ధం చెప్పడం నావల్లకాదు."

"అవును, నీవన్నమాట నిజమే. కాని పొలం కొనుక్కునేందుకు నీవు శ్యామలాల్‌కు డబ్బిచ్చావని నీవు చెప్పడంలో తప్పులేదు. శ్యామలాల్‌కు పొలం కొనుక్కునేందుకు నీ తరఫున నేను డబ్బిచ్చినమాట నిజమే. కాబట్టి అది అబద్ధంకూడా కాదు. ఆ డబ్బు సలీమా జమీందారీ కొనేందుకు ఇచ్చామో మరింకేదన్నా పొలంకొనుక్కునేందుకు ఇచ్చామో ఆ విషయం అనవసరం."

జ్వాలా ప్రసాద్ ముఖంలో వ్యంగ్యాత్మకమైన చిరునవ్వు వచ్చింది: "అవును, వెనుక ధర్మరాజన్నాడట-'అశ్వత్థామా హతః కుంజరో వా నరోవా' అని."

మున్షీ శివలాల్ చాలా పరుషంగా అన్నారు: "భారతకథ ఈ విషయంలో వర్తించదు."

"అవును, ఇది కలియుగం. కాని నా రథ చక్రం ఎప్పుడూ నేల నంటుకునే ఉంటుంది. కొంచెం కూడ నేల విడిచి పైకి లేవదు. నా కన్నీ తెలుసు. కాని ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగంలో ఉండడంవల్ల నేను అబద్ధం చెప్పడానికి వీల్లేదు. ఇక సగం సత్యం చెప్పినా ఆయుధాలు విసర్జించి ఊరికే కూర్చునేందుకు గిరిజాశంకర్ ద్రోణాచార్యుడేం కాదు. ఆయన న్యాయమూర్తి. ఆయన విచారిస్తారు. ఆ విచారణలో ఈ అర్థ సత్యం కూడా పూర్తి సత్యమయిపోతుంది. నేను అబద్ధం చెప్పననే విషయం ఆయనకు బాగా తెలుసు."

బేచూమిశ్రగారింట్లో చిలుం పానీయం ఆయన రెండు గుక్కలు తాగి నప్పటికీ అది బాగా పనిచేసింది. ఆయనకు తన కుమారుడు నిజం, నిజా యితీ అంటూ తన చేతి గొడ్డలితో తన్నుతాను కొట్టి వేసుకోడమే కాక తండ్రినీ, కుటుంబంలో మిగిలిన వాళ్ళనూ అప్రతిష్టపాలు చేస్తున్నాడని అనిపించింది. జ్వాలా ప్రసాద్ అన్నప్రతిమాటా ఆయనకు పరుషభాషల్లాగా అనిపించి అతను తన నవమాన పరుస్తున్నాడని భావించారు. మున్షీ శివలాల్ ఉన్నట్టుండి కోపంతో మండిపడ్డారు: "బయలుదేరాడురా ధర్మరాజును మించిన సత్యమూర్తి. ఇంత మంచి జమీందారీని చేతులార వదిలేసుకుంటున్నాడు. మా వాడింత నిష్ప్రయోజకుడవుతాడని నాకేం తెలుసు!"

మున్షీ శివలాల్ ఎలుగెత్తి అరుస్తున్నారు. ఛింకి, భీఖా, యమున, బిషన్ లాల్ - అందరూ గుమి కూడారు.

కోపం ఉన్మాదానికి రూపాంతర మంటారు. ఉన్మాదంలాగా కోపం కూడా అప్పుడప్పుడు ప్రకోపిస్తూ ఉంటుంది. ఆ సమయంలో మనిషి తన స్వాధీనంలో ఉండడు. మున్షీ శివలాల్ జ్వాలా ప్రసాద్ ఏమయినా సమాధానం చెప్తాడేమోనని కొంచెంసేపు చూచారు. కాని అతను సమాధాన మేమీ చెప్పకపోగా అక్కడ పెద్ద గుంపు చేరింది. మున్షీ శివలాల్ బిగ్గరగా అరిచారు: "మాట్లాడవేం గాడిద! నిన్ను పెంచి పెద్దవాణ్ణిచేశాను, చదువు చెప్పించాను. ఇదంతా నేను చెప్పినమాట వినకుండా నాకు శ్రీరంగనీతులు చెప్పడానికేనట్రా!"

ఈ క్రోధంతో జ్వాలా ప్రసాద్‌లోని సత్యనిష్ఠ, నిజాయితీ మరింత మెరుగులు పెట్టుకొని బయట పడ్డాయి. ఈసారి ఆయన చాలా గట్టిగా చెప్పారు: "మీరు కాదు, భగవంతుడే స్వయంగావచ్చి చెప్పినా సరే నేను నా నిజాన్ని నిజాయితీని వదలి పెట్టడానికి ఒప్పుకోను."

మున్షీ శివలాల్ చటుక్కున లేచి పక్కనే ఉన్న నిండుకుండ తీసుకుని అన్నారు: "ఇదిగో రా! నీ నిజానికి, నిజాయితీకి నేనే బలి అయిపోతున్నాను." అంటూ ఆయన రెండుచేతులతో ఆ నిండుకుండను గట్టిగా తన నెత్తి మీద వేసేసుకున్నారు.

దానితో మున్షీ శివలాల్‌కు దెబ్బతగిలి పడిపోయారు. అందరూ ఆయనదగ్గరికి పరుగెత్తుకొని వచ్చారు. మున్షీ శివలాల్‌కు కిందపడగానే స్పృహతప్పి పోయింది. ఆయన తల బద్దలయింది. తలలోనుండి రక్తం కారుతూ ఉంది.

ఆ రాత్రికే అలహాబాదు నుండి డాక్టరును పిలిపించారు. ఎన్నో మందులిప్పించారు. కాని మున్షీ శివలాల్‌కు మళ్ళీ స్పృహరాలేదు. ఒక వారం వరకు చావుబతుకులకు పోరాటం జరిగింది. ఏడోరోజు మున్షీ శివలాల్ కండ్లు తెరిచారు. ఆయన ఛింకిద్వారా జ్వాలా ప్రసాద్‌ను రమ్మని కబురు చేశారు. జ్వాలా ప్రసాద్‌ను చూడగానే ఆయన కండ్లకు నీళ్ళు వచ్చాయి: "నేను వెళ్ళిపోతున్నాను తండ్రీ! నన్ను క్షమించు. నీ తప్పేమీ లేదు. నాకు ఈ వార్ధక్యంనుండి ముక్తి లభించింది. అంతే చాలు."

జ్వాలా ప్రసాద్ ఏడుస్తూ అన్నారు: "అలా అనకు నాన్నా! నీకు నయమై పోతుంది."

మున్షీ శివలాల్ కనుసైగతో ఛింకిని పిలిచారు. అరిపోయే కంఠంతో నీరసంగా ఆయన అన్నారు : "ఈ ఛింకి ఉందే—దీన్ని నీ తల్లిలాగా చూచుకో. దాన్ని నీ మీద వదిలిపెట్టి వెళ్ళుతున్నాను." ఈ మాటలతో మున్షీ శివలాల్ శాశ్వతంగా కండ్లు మూసుకున్నారు.

పన్నెండు

ఇంటి కెదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో మున్షీ రాధేలాల్ జ్వాలా ప్రసాద్ పక్కన కూర్చుని మున్షీ శివలాల్ ఏడూడికి కార్యక్రమం తయారు చేస్తున్నారు: "జ్వాలా బాబూ! అన్నయ్య ఎంతో దర్జాగా జీవితం గడుపుకొన్నారు. వంశానికి గౌరవం తెచ్చారు. అసలు న్యాయంగా అయితే అయిదు వందలమంది బ్రాహ్మణులకు సమారాధన చేయించాలి. కాని ఈ కుగ్రామంలో అయిదు వందల మంది బ్రాహ్మణులు దొరకడం కష్టం. కనీసం నూట ఇరవైఅయిదు మందికయినా భోజనాలు పెట్టించాలి. ఇక పోతే మన బంధువులూ, స్నేహితులూ ఉంటారు. సోరావ్, ఫతేపూర్, అలహాబాద్‌లో అందరూ కలసి రెండు మూడు వందల మందయినా అవుతారు."

"అంటే దాదాపు అయిదారు వందల మందికి భోజనాలు ఏర్పాటు చేయాలన్న మాట." అన్నారు జ్వాలా ప్రసాద్.

"అవును తండ్రీ! అన్నయ్యను పుణ్యలోకానికి పంపించాలి. ఇలాంటి విషయాల్లో పొదుపు చేస్తే కుదరదు. మరెవరన్నా కొంచెం పొదుపు చేసినా పరవాలేదు, కాని నీవు తహసీల్దారువు. సోరావ్ గ్రామానికి అధిపతిలాంటి వాడివి. నీవు కబురు చేస్తే చాలు, నిమిషాల్లో సామానంతా వచ్చేస్తుంది."

జ్వాలా ప్రసాద్ నెమ్మదిగా అన్నారు: "కాని నేనిలా ఎప్పుడూ చేయలేదు. అలా చేయటం తప్పుకూడాను. అసలు సాంవత్సరీకాలకు ఇంత బ్రహ్మాండంగా చేయడం అవసరమా?"

"అవసరం లేకపోతే నేను నీకెందుకు చెప్తాను?" రాధేలాల్ తన అభిప్రాయాన్ని సమర్థిస్తూ అన్నారు: "అన్నయ్య ఎంతో పుణ్యాత్ముడు, ధన్యజీవి. ఆయనకు సద్గతి లభించాలంటే బ్రాహ్మణులకూ, బంధువులకూ సంతర్పణ చెయ్యాలి. రెవిన్యూ ఇన్స్పెక్టరు అంజదాలీకి నేనిప్పుడే కబురు చేస్తాను. కావాల్సినవన్నీ ఇంటికి వచ్చేస్తాయి."

ఛింకీ ఆ పక్కనే నిలబడి కన్నీటిబొట్లు బొటబొట రాలుస్తూ ఉన్నది. ఉండలేక అన్నది: "ఇలా అన్యాయంగా అక్రమంగా సామాన్లు తెప్పించి సంతర్పణ చేయిస్తే ఆయన పుణ్యలోకానికి కాదు, నరకానికి వెళ్ళుతారు. అదంతా వీల్లేదు. ఇరవై ఒక్క బ్రాహ్మణులను భోజనానికి పిలువు. మిగిలినవాళ్ళు చుట్టాలూ పక్కాలూ యాభై అరవైమంది ఉంటారు. అంత వరకు చేస్తే చాలు. దానికయ్యే ఏర్పాటు నేను చూచుకుంటాను. నీవా దిగులు పెట్టుకోకు."

ఈ విషయంలో ఛింకీ జోక్యం కలుగజేసుకోవడం మున్షీ రాధేలాల్‌కు నచ్చలేదు: "మళ్ళీ నీవు అడ్డము వచ్చావ్! చేశావులే మహా ఏర్పాటు! మా పరువు కాస్త తీసెయ్యడానికి సిద్ధమయినావు."

ఛింకీ ధైర్యంచేసి జ్వాలా ప్రసాద్‌తో అన్నది: "ఇక నేను ఈ యింట్లో ఉండనూ, మాట్లాడనూ! వీండ్ల అన్యాయాల్లో అక్రమాల్లో చిక్కి ఆయన ప్రాణాలు విడిచేశారు. ఇప్పుడు జ్వాలాబాబును కూడా ఈ అక్రమంలోకి లాగుతున్నారు. ఇదంతా చూస్తూ నేనిక్కడ వుండలేను." అంటూ అది ఏడుస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఛింకీ వెళ్ళిపోయిన తర్వాత జ్వాలా ప్రసాద్ అన్నారు: "బాబాయ్, ఛింకీ చెప్పిన మాట సరియైనదనే నా అభిప్రాయం. ప్రజలదగ్గర బలవంతంగా రాబట్టినందువల్ల ప్రజల మనస్సు బాధపడుతుంది. నాదగ్గర అంత డబ్బులేదు. అందువల్ల ఈ విషయం కొంచెం స్తిమితంగా ఆలోచించండి."

అదే సమయంలో శ్యామలాల్ గంగా ప్రసాద్‌ను జ్వాలా ప్రసాద్ దగ్గరికి లాక్కుని వచ్చాడు: "చూడన్నయ్యా, ఈ గంగూ చేసే పనులు .

బిషన్, వాడి స్నేహితులతో కలిసి చిలుం తాగుతున్నాడు. భీఖూ వాణ్ణి కాదని చెప్పడం పోనిచ్చి తనుకూడా తాగడం మొదలు పెట్టాడు.''

జ్వాలా ప్రసాద్ కానీ రాధేలాల్ కానీ ఏమన్నా అనేలోగానే భీఖూ వచ్చి మిఠాయి పళ్ళెం ముందు పెట్టి అన్నాడు: "ఇదుగో ఆంజనేయస్వామి ప్రసాదం. గంగూ పరీక్ష ప్యాసయినాడు కదూ! అందుకని గుడిలో అందరికీ ప్రసాదం పంచిపెట్టారు. మేమంతా ప్రసాదంలాగా కొంచెం కొంచెం తీసుకున్నాం. గంగూ కూడా తీసుకున్నాడు. అక్కడికి ఈ శ్యామూ తయారయినాడు – పానకంలో పుడకలాగా. అప్పటినుంచి అనవసరంగా గంగూను ఏడిపిస్తున్నాడు. ఇతనికి బొత్తిగా సిగ్గులేదు. అక్కడ బిషన్‌ను నానామాటలని వచ్చాడు.''

భీఖూ మాటలకు ధైర్యం తెచ్చుకొని గంగూ మరీ పెద్దగా ఏడ్వసాగాడు. అతని ఏడ్పువిని ఛింకీ ఇంట్లోనుంచి పరుగెత్తుకుంటూ బయటికి వచ్చింది. ఎంతో ఆప్యాయంగా గంగూ చెయ్యి పట్టుకొని అన్నది: "పువ్వులాంటి పసిపిల్లవాణ్ణి ఇలా గదుముతారా? పద నాన్నా! మంచిరోజులు వచ్చాక వీళ్ళను బాగా ఏడిపిద్దుగాని.'' గంగా ప్రసాద్‌ను ఏవో మంచిమాటలతో బుజ్జగిస్తూ ఛింకీ అతన్ని లోపలికి తీసుకుపోయింది. ఛింకీ వెనక భీఖూ కూడా మిఠాయిపళ్ళెం తీసుక పోయినాడు.

ఛింకీ, భీఖూ వెళ్ళగానే శ్యామలాల్ అన్నాడు: "అన్నయ్యా! ఈ అలగా జనాన్నంతా ఇక్కడ పోగుచేయడం చాలా పొరపాటయింది. నోటికి వచ్చినట్టు మాట్లాడుతారు వీళ్ళు.''

రాధేలాల్ తన కొడుకుకు తెలియజెప్పారు: "ఏం పరవాలేదులేవోయ్. జ్వాలా ఒట్టి నెమ్మదివాడు, మంచివాడు. ఇప్పుడు నేనున్నానుగా ఇంటికి పెద్దను. కొంచెమాగితే వీళ్ళందర్నీ కమ్మెచ్చును పట్టకొస్తాను.''

జ్వాలా ప్రసాద్ తండ్రీ కొడుకుల సంభాషణ వినీ విననట్టు శ్యామలాల్‌ని అడిగారు: "అయితే శ్యామూ! ఫతేపూర్ పొలం సంగతి ఏంచేశావు? ఈసారి పంట బాగా పండిందనుకుంటాను?''

"అవును, పంటకేమీ బాగానే పండింది. కాని ఏం చెప్పనన్నయ్యా! ప్రపంచమంతా మోసమే. మనదగ్గర పొలం కౌలుకు తీసుకొన్న రైతులే మనల్ని మోసం చేసేందుకు చూస్తున్నారు. మనకు చెల్లించవలసిన మక్తా చెల్లించడం లేదు. బహుశా కేసు పెట్టవలసి వుంటుంది.''

"మరి ఆ డెబ్బైగార్లస్వంత వ్యవసాయం సంగతి ఏమయింది?"

"దాన్ని పాలికిచ్చేశాం. కాని ఆ కేశవసింగు ఉన్నాడే. వాడింత టక్కరి అవుతాడని నేననుకోలేదు. పంట కోసుకుని ఆ రాత్రే ధాన్యమంతా ఎక్కడనో మాయం చేసేశాడు. అడిగితే ఈ సంవత్సరం పంటంతా పాడయిపోయిందని చెప్పాడు. మొత్తంమీద ఏడుపుట్ల గోధుమలూ, అయిదుపుట్ల శనగలూ తేలాయి. అందులో నాలుగుపుట్ల గోధుమలూ, ఒకపుట్టి శనగలూ విత్తనాలకూ, పెట్టుబడిదార్లకూ ఖర్చయి పోయినాయి. ఇకపోతే మనభాగం ఒకపుట్టి గోధుమలూ, ఒకపుట్టి శనగలూ కని పించాయి. అవి అమ్మేసి నేను శిస్తు చెల్లించాను. దానితోపాటు పదిహేను రూపాయలు నా చేతివి కూడా పడ్డాయి."

జ్వాలా ప్రసాద్ ముఖంమీద లేత చిరునవ్వు కనిపించింది. "వ్యవసాయం అంటే మాటలు కాదోయ్ శ్యామూ! కష్టపడి పనిచేయాలి."

"అవునన్నయ్యా! నీవు చెప్పింది నిజం. కాని నాగలి పట్టడం నావల్ల కాదు. అది మన కుటుంబానికే అప్రతిష్ఠ. అదిగాక ఫతేపూర్‌లో ఉండి ఇంత చిన్న పొలం వ్యవసాయం చేసుకోడంవల్ల ప్రయోజనంకూడా లేదు. రహీంపురా గ్రామం మనకు వచ్చిఉంటే అదో రకంగా ఉండేది. ఈ కాస్త పొలంమీద స్వంత వ్యవసాయం చేసుకొని రోజులు గడపడం కష్టం."

"మరి ఆ పొలం అమ్మేసేయ గూడదూ?" అన్నారు జ్వాలా ప్రసాద్.

ఇప్పుడు రాధేలాల్ అందుకున్నారు: "జ్వాలా బాబూ! పొలం అమ్మే ఆలోచన చేయకు. ఇంకా వీలుంటే కోనే ఏర్పాటు చేయాలి. అన్నయ్య సాంవత్సరీకాలు కాగానే శ్యామూను తీసుకొని నేను ఫతేపూర్ వెళ్ళుతాను. నాదగ్గర కొంచెం పైకముంది. ఏదీ కాకపోతే వీర్‌పూరా గ్రామం మూడణాలవంతు అమ్మకానికి వస్తున్నది. అది కొనేస్తాం. మనం మన మర్యాద కూడా కాపాడుకోవాలి గదా మరి."

ఇలా మాట్లాడుతూ ఉండగానే ఇంటి వైపు ఒక ఇక్కా వస్తున్నట్టు కని పించింది. 'ఎవరయి ఉంటారబ్బా?' అని ఆలోచించారు రాధేలాల్. అక్కడినుండే కేకవేశారు: "ఎవరు?"

ఇక్కా సరిగ్గా ఇంటిముందు ఆగింది. దానికి తెర కట్టిఉంది. రాధేలాల్ పెద్ద కుమారుడు రామలాల్ తెరే బయట ఉన్నాడు. అతను ఇక్కా దిగుతూ అన్నాడు: "నేనే నాన్నా! స్కూలు వేసవి సెలవులకు మూసేశారు.

అందర్నీ తీసుకుని వచ్చాను.'' ఇక్కాలోనుంచి రామలాల్ భార్య, శ్యామ లాల్ భార్య, ముగ్గురు పిల్లలు దిగటం జ్వాలా ప్రసాద్ చూదారు.

శ్యామలాల్ పరుగెత్తుకుంటూ వెళ్ళి సామాను దించుకొన్నాడు. ఇంట్లో అంతా అలజడిగా ఉంది. కోడళ్ళిద్దరూ అత్తగారి కాళ్ళకు నమస్క రించారు, యమునను కౌగిలించుకున్నారు. ఇంట్లో లోపలి వరాండాలో రెండు మంచాలు పడి ఉన్నాయి. వాటిమీద కూర్చుని ఆడంగులంతా కుశల ప్రశ్నలడగి ముచ్చట్లు మొదలు పెట్టారు. రామలాల్ బయటికి వచ్చి అందరితో కలిసి కూర్చున్నారు.

''ఏమోయ్ జ్వాలా! కులాసా? పెద్దనాన్న ఏడూడి వస్తూన్నది కదా అని స్కూలుకు కూడా సెలవులవడంతో ఇలా బయల్దేరి వచ్చేశాం.'' తరువాత అతను శ్యామలాల్ వైపు తిరిగి అన్నాడు: ''ఏం శ్యామూ! ఇలా అయితే పొలం పనులెలా సాగుతాయి? నీ విక్కడికి వచ్చి కూర్చున్నావు అక్కడేమో పొలం అన్యాక్రాంతమయ్యే స్థితి వచ్చింది. నాన్నా! కొంచెం జాగ్రత్తగా చూచుకుంటే మంచి ఆదాయమే వస్తుంది. కాని వీడికక్కడ కాలు నిలువదు గదా! ఇవ్వేళ సోరాప్, రేపు ఫతేపూర్, ఎల్లుండి అలహా బాద్? సమయాని కక్కడ లేకపోతే వచ్చేది కాస్తా వెనక్కు పోతుంది.''

రామలాల్ వచ్చీ రాగానే ఈ విచారణలోకి దిగేసరికి శ్యామలాల్ కు కోపం వచ్చింది: ''తమరున్నారుగా అక్కడ. తమరే చూచుకో గూడదూ ఆ పొలం విషయాలన్నీ?''

రామలాల్ సగర్వంగా సమాధానం చెప్పాడు: ''మరి యేమను కొన్నావేమిటి? రైతుల దగ్గర నేను పూర్తిగా మక్తా వసూలు చేశాను. అంతే కాదు. మన పొలం పక్కనే ఉన్న ఎనిమిది గొర్ల పొలం ఠాకుర్ బచ్చూ సింగ్ దగ్గర కొనేశాను. సగం పైకం చెల్లించాను. ఇక షుమారు మూడు వందల రూపాయలు కావాలి. జ్వాలా, నీవు సర్దాలి ఆ మాత్రం.''

''అది బాబాయి సర్దుతారు. బాబాయి పొలం కొనేందుకని కొంత పైకం దాచి ఉంచారు.''

ఈ సంభాషణతో జ్వాలా ప్రసాద్ మనస్సు ఏదో చిరాకుగా ఉంది. ఈ ప్రసంగాన్నింతటి ముగించేందుకు ఆయన భీఖూను పిలిచారు: ''ఇదిగో వస్తున్నాను'' అంటూ భీఖూ బయటికి వచ్చి అడిగాడు: ''ఏం బాబూ, పిలిచారా నన్ను?''

"వంట అయిందో లేదో పిన్ని నడిగి కనుక్కో. చాలా పొద్దు పోయింది. నాకు ఆకలిగా కూడా ఉంది. వీళ్ళుకూడా వచ్చారు కదా! నేను తొందరగా భోంచేసి పడుకుంటాను. చాలా అలసటగా ఉంది."

"వంటయి చాలాసేపయింది. వంటమనిషి ఇంటికి గూడా వెళ్ళి పోయింది. పిన్ని పూరీలు చేస్తూవుంది. రామలాల్ స్నానం పానం చేసేలోగా నీవు భోంచేసెయ్. రేపు మళ్ళీ క్యాంపుకు గూడా వెళ్ళాలి."

"అవునవును, బాగా జ్ఞాపకం చేశావు" అని జ్వాలా ప్రసాద్ లేచారు.

మున్షీ శివలాల్ సాంవత్సరీకం నాడు ఇంట్లో అందరూ తెల్లవారేలోగానే ఇక్కాలు కట్టించుకుని గంగాస్నానానికి ఫాఫామావు వెళ్ళారు. మధ్యాహ్నానికి అందరూ గంగాస్నానం చేసి తిరిగి వచ్చారు. వాళ్ళంతా ఇంటికి వచ్చేసరికి తహసీల్ కచ్చేరీలో గూర్చుని వాళ్ళకోసం ఎదురు చూస్తున్న కిషన్‌ని చూచి ఆయన అడిగారు: "అరే కిషన్, నీవా! నీవు వస్తున్నావని మాకు మాటమాత్రం కబురన్నా చేశావు గాదే! ఇంతకూ ఫాఫామావు వెళ్ళి వస్తున్నావా లేదా? అక్కడన్నా కలుసుకోలేదు. ఉన్నట్టుండి ఇలా వచ్చేశావేం? అరే, ఇదేమిటి? ఎక్కడన్నా పడ్డావా?"

"లేదు. పెదనాన్న సాంవత్సరీకాలు గదూ అన్నట్టు! నంబరుదారు భార్య నన్నిక్కడికి రానియ్యనే లేదు. కాని అయిదారురోజుల క్రితం నాకొక కలవచ్చింది. పెదనాన్న ఆ కలలో కనిపించారు. కిషన్, అందరూ వచ్చి నీవు రాకపోతే చాలా దిగులేస్తుందిరా అన్నారు. ఆ కల వచ్చిన తర్వాత నాకక్కడ కాలు నిలువలేదు. ఒకరకంగా మనస్సు పిచ్చెక్కింది. నేరుగా నేను నంబరుదారుగారి భార్యదగ్గరకు వెళ్ళాను. ఆ రోజే కాన్పూరునుండి లక్ష్మీచంద్ కూడా వచ్చారు. నే నీ కలసంగతి చెప్పేసరికి నంబరుదారుగారి భార్య ఏమీ అనలేదు. కాని ఈ లక్ష్మీచంద్ ఉన్నాడే-అతను పెదనాన్ననూ, జ్వాలాన్నయ్యనూ చెడా బడా తిట్టడం మొదలుపెట్టాడు. నేను విని సహించలేక నాకు తోచినట్టు నేనూ అనేశాను. అంతే, నానోట మాట వచ్చిందో లేదో లక్ష్మీచంద్ నలుగురు మనుష్యుల్ని పిలిపించి నన్ను చితకగొట్టించాడు. మూడు రోజులదాకా కదలడానికి వీల్లేకపోయింది. మొన్నరాత్రి ఫూటంపూర్ నుండి బయల్దేరాను.

కిషన్‌లాల్ శరీరంమీద అక్కడక్కడ కట్టుగట్టి ఉన్నాయి. కొన్ని

గాయాల మచ్చలు కనిపిస్తున్నాయి. రాధేలాల్ జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "విన్నావా జ్వాలా?"

జ్వాలా ప్రసాద్ తల గీక్కుంటూ అన్నారు: "అవును, అంతా విన్నాను. కాని నమ్మలేకుండా ఉన్నాను. లక్ష్మీచంద్ అలాంటివాడు కాడు. కిషన్ నిజం చెప్పడంలేదని నా అనుమానం."

బిషన్‌లాల్ కూడా అక్కడేఉండి ఈ సంభాషణ సావధానంగా వింటున్నాడు. ఇక ఉండలేక పెద్దగానవ్వి అన్నాడు: "కిషన్‌కీ, నిజానికీ మొదటినుంచీ వైరమేగదా అన్నయ్యా! దెబ్బలెక్కడో తగిలాయి. ఏదో చేయరాని పనిచేసి దెబ్బలు తిని ఉంటాడు. కాని లక్ష్మీచంద్‌ను అనవసరంగా ఆడిపోసుకుంటున్నాడు."

రాధేలాల్ బిషన్‌లాల్‌కు ఒకటంటించి అన్నారు: "అధిక ప్రసంగీ! నోరు మూస్తావా లేదా? నీకు నీ అన్నదమ్ములంటే బొత్తుగా గిట్టదు. అస్తమానం వాళ్ళను విమర్శిస్తూ ఉంటావు."

రామలాల్, శ్యామలాల్ కూడా బిషన్‌లాల్‌కు దేహశుద్ధి చేసేందుకు తయారవుతున్నారు. ఇంతలో జ్వాలా ప్రసాద్ బిషన్‌లాల్‌తో అన్నారు: "బిషన్, నీవిక్కడినుంచి వెళ్ళు. ఇతరులు మాట్లాడుతూ ఉంటే మధ్యలో అడ్డు రావద్దని నీకెన్నిసార్లు చెప్పాను. అది చాల చెడ్డ అలవాటు." తర్వాత ఆయన కిషన్‌లాల్‌తో అన్నారు: "సరే, అదంతా అలాఉంచి ముందువెళ్ళి స్నానంచేసి గుడ్డలుమార్చుకో. తర్వాత ఆలోచిద్దాం మిగిలిన విషయాలు."

జ్వాలా ప్రసాద్ ఆరోజు ఆఫీసుకు సెలవు వ్రాసేశారు. మరునాడు ఆఫీసుకు వెళ్ళేసరికి బైదేయి ఉత్తరం ఒకటి ఆయనపేరిట వచ్చింది. దానిలో ఆమె ముఖ్యంగా ఉత్తరంలో వివరించేందుకు వీలులేని కొన్ని కారణాలవల్ల కిషన్‌లాల్‌ను నౌకరినుండి తీసివేయవలసి వచ్చిందని వ్రాసింది. ఈ విషయంలో కిషన్‌లాల్ చెప్పే మాటలనే మాత్రం నమ్మద్దనీ, శ్రావణమాసంలో ఆమె అలహాబాదు వచ్చినప్పుడు సోరావ్ కూడా వచ్చి ఆయనతో అన్ని విషయాలూ మాట్లాడుతాననీ వ్రాసింది.

మున్షీ శివలాల్ సాంవత్సరీకాలయిపోయిన తర్వాత జ్వాలా ప్రసాద్ నలువైపులా చూదారు. తన పరిసరాలను తానే గుర్తుపట్టులేక పోతున్నారు. ఆయన పినతండ్రిగారి కుటుంబమంతా ఆయన ఇంట్లోనే చేరింది.

తహసీల్దారుగారి విశాలభవనం ఆయనకు ఇరుకిరుగ్గాఉన్నట్టు కనిపించింది. తన యింట్లోనే తనకు ప్రాముఖ్యం లేనట్టుగా ఆయనకు అనిపించింది.

ఒకరోజు జ్వాలా ప్రసాద్ కచ్చేరీలో పని ముగించుకొని వచ్చే సమయంలో బేచూమిశ్ర ఆయన దగ్గరికివచ్చి అన్నారు: "ఈ సంవత్సరం వర్షాలు కొంచెం ముందుగానే వచ్చేటట్టున్నాయి. ఇంకా జ్యేష్ఠమాసం పూర్తికానేలేదు. ఈ రోజు మధ్యాహ్నం నుండి మబ్బులేచింది. వడగాలిపోయి పైరుగాలి మళ్ళింది."

జ్వాలా ప్రసాద్ ఆకాశం వైపు చూస్తూ అన్నారు: "అవును, వాతావరణం ఈరోజు ఉన్నట్టుండి చల్లబడింది. కాని ఆషాఢమాసం ఆరంభించగానే వర్షాలు కురవడం పరిపాటే. ఈసారి ఎండలు కూడా విపరీతంగా కాచాయి."

బేచూమిశ్ర కొద్దిగా నవ్వుతూ అన్నారు: "ఆంజనేయస్వామి గుడి తోటలో మామిడికాయలు బాగా కాచినట్టున్నాయి. నిన్న అయిదు బండ్లల్లో మామిడిపండ్లు అమ్మకానికి అలహాబాద్ వెళ్ళాయి. పోనీలెండి. మీ తమ్ముడు శ్యామలాల్ ఏదో పనిలో ప్రవేశించాడు."

జ్వాలా ప్రసాద్ ఆశ్చర్యంతో బేచూమిశ్రను చూచారు: "అయిదు బండ్ల మామిడిపండ్లు అలహాబాదు పంపించాడా శ్యామూ? నాకీ విషయమేమీ తెలియదే! ఆ పాడుపడ్డ తోటలో ఒక్కసారి అయిదుబండ్ల మామిడి పండ్లు ఎలా పండాయి?"

"ఆ విషయం నాకు తెలియదు. నాకు కూడా ఆశ్చర్యం వేసింది. ఈసారి పంట తక్కువగా ఉందని మా ఘుమరూ కూడా అంటున్నాడు. రండి, చల్లగా ఉంది, కొంచెం అలా చూచి వద్దాం. ఈరోజు శనివారం. బజార్లో అంగళ్ళు కూడా ఉండవు. పదండి, ఈరోజు మనం కూడా స్వామిని దర్శనం చేసుకుని వద్దాం."

బేచూమిశ్ర ముఖంలోని వ్యంగ్యం గమనించి జ్వాలా ప్రసాద్ అడిగారు: "ఎందుకు? అసలు సంగతేమిటో మీరు స్పష్టంగా చెప్పడం లేదు."

"ఎలా చెప్పను జ్వాలాబాబూ! విషయమంత పెద్దది కాకపోయినా అనవసరంగా మీపేరు చెడిపోతూ ఉన్నది. అందుకని మీతో చెప్పక తప్పడం లేదు. ఇటీవల ఆంజనేయస్వామిగుడి తోటచుట్టుపక్కల ఉన్న

ఆ తోట యజమాన్లు రిపోర్టు చేస్తున్నారు. ఈ దొంగతనం చేసే వ్యక్తివి వాళ్ళు ఆనవాలు కూడా పట్టారు. వాళ్ళందరూ శ్యామలాల్ పేరు చెప్తున్నారు. అయిదు బండ్ల మామిడిపండ్లు మన శ్యామలాల్ అలహాబాదు పంపించాడని వినడంతో ఆ సందేహం నిజంగా మారిపోయింది. పోలీస్ ఇన్స్పెక్టరు శహబుద్దీన్ ఆ రిపోర్టర్లను అణచివేశారు. కాని శ్యామలాల్‌ను ఆయన విచారించడం మాత్రం జరిగింది. తాను అలహాబాద్ పంపించిన మామిడిపండ్లన్నీ ఆ తోటలో పండినవేనని శ్యామలాల్ చెప్పాడు.''

జ్వాలా ప్రసాద్ నుదురు ముడుతలు పడింది: "అలాగా! అంతవరకు వచ్చిందీ! పదండి, కనుక్కుందాం.''

ఆంజనేయస్వామి గుడికి వెనుక భాగంలో ఉన్న బావి దగ్గరి మామిడి చెట్టు కింద ఘుండీ స్వామి అగ్ని హోత్రం స్థాపించారు. ఘుండీ స్వామి కోరిక మీద కిషన్‌లాల్ ఆ స్థలానికి ఆవరణం ఏర్పరిచాడు. ఘుండీ స్వామికి ముఖ్య శిష్యుడు-కిషన్‌లాల్. ఆ వూరికి చెందిన యువకులు మరి నలుగురైదుగురు కూడా అక్కడ చేరారు. కిషన్‌లాల్ చిలుమునింపి ఘుండీ స్వామికి అందించాడు. ఘుండీ స్వామి నసాళానికంటేటట్టు ఒక్క గుక్క పీల్చారు. ఒక గజం ఎత్తు పొగలేచింది. నిప్పురవ్వల్లాగా మండుతున్న కండ్లతో ఘుండీ స్వామి అన్నారు: "తీసుకోవోయ్ శిష్యా! నీవు కూడా ప్రసాదం పుచ్చుకో.'' అంటూ ఆయన చిలుంగొట్టం కిషన్‌లాల్ చేతికిచ్చారు.

ఇటు కిషన్‌లాల్ గంజాయి పీలుస్తూనే ఉన్నాడు, అటు అదే వైపు వస్తున్న జ్వాలా ప్రసాద్, బేచూమిశ్ర ఘుండీస్వామికి కనిపించారు. చుట్టు పక్కల కూర్చున్నవాళ్ళు తహసీల్దారుగార్ని చూడగానే లేచి నిలబడ్డారు. అగ్ని కుండంలో మరో కట్టె ముక్కను వేస్తూ ఘుండీ స్వామి కిషన్‌లాల్‌ను హెచ్చరించారు: "మీ పెద్దన్నయ్య వస్తున్నాడు జాగ్రత్తరోయ్.'' అలా అంటూనే ఆయన కంఠస్వాయి హెచ్చింది: "తీవిగలవాడు. ధర్మం, న్యాయం, మర్యాద కల మనిషి. కాని డబ్బుకు ఎప్పుడూ ఇబ్బంది పడుతుంటాడు. అయితే త్వరలోనే చాలా డబ్బు దొరుకుతుంది- వేలకొలది రూపాయలు, వెండి, బంగారం, వజ్రాలు!'' ఇంతలో జ్వాలా ప్రసాద్, బేచూమిశ్ర - ఇద్దరూ ఘుండీ స్వామి అగ్ని హోత్రందాకా వచ్చేశారు. ఘుండీ స్వామి జ్వాలా ప్రసాద్‌వైపు చూచి "ఇదుగో అబ్బాయ్,

ఈ భస్మం తీసుకో.'' అంటూ అగ్ని కుండంలో నుంచి ఒక చిటికెడు భస్మం తీసి జ్వాలా ప్రసాద్ పిడికిట్లో పెట్టేశారు. ''ఇక పిడికిలి మూసెయ్యి! అంతే, ఇక తెరిచి చూడు.''

జ్వాలా ప్రసాద్ పిడికిలి తెరిచి చూచుకొని ఆశ్చర్య పోయినారు. ఆయన పిడికిట్లో బూడిద లేదు, ఎఱ్ఱని రాయి ఉంది. బేచూమిశ్ర తొంగి చూచారు: ''అరే, ఇది గోమేధికం లాగా ఉందే!''

ఘుండీస్వామి నవ్వారు: ''నీకు కేతువు ప్రతికూలుడుగా ఉన్నాడోయ్! అందువల్ల భోలా నాథుడు నీకు గోమేధికం ఇచ్చాడు. దీన్ని ఉంగరంలో పొదిగించి వేసుకో. ఆరు నెలల్లో భూమిలో పాతబడిన ధనము దొరుకుతుంది.''

బేచూమిశ్ర మనస్సులో జ్వాలా ప్రసాద్‌మీద కొంచెం ఈర్ష్య ఏర్పడింది. జ్వాలా ప్రసాద్‌కు మామిడి తోటలో పండ్లు చూపించేందుకు తానాయన్ని అక్కడకు తీసుకు వచ్చాననే సంగతి మిశ్రగారు మరిచి పోయినారు. ఘుండీస్వామి తనకు కూడా ఏదన్నా భస్మంలాంటిది ఇస్తే బాగుండునని ఆయన ఆశిస్తూ ఉన్నారు. ఇంతలో దక్షిణం వైపున్న తోట యజమాని జుమ్మన్‌మియా, మరి ఇద్దరు మనుష్యులు శ్యామలాల్‌ను చెయ్యి పట్టుకొని లాక్కొని వస్తున్నారు. జుమ్మన్‌మియా కేకలు పెడుతున్నారు: ''గజదొంగరా వీడు. ఈరోజున పట్టుపడ్డాడు. పెద్ద తహసీల్దారు తమ్ముణ్ణని చెప్పుకుంటాడు. ఇక మా తోటలో అడుగు పెట్టావా, కాళ్ళూ చేతులూ విరిచి పారేస్తాను. చెట్లమీది సగం కాయలు పూర్తి అయిపోయి నాయి.'' ఇంతలో జుమ్మన్‌మియాకు జ్వాలా ప్రసాద్, బేచూమిశ్రా కనిపించారు. శ్యామలాల్‌ను ఆవైపు ఈడ్చుకుంటూ వెళ్ళి జుమ్మన్‌మియా అన్నారు: ''ఏమండీ తహసీల్దారు గారూ! ఇతన్ని తమరు మా తోటలో మామిడి పండ్లను చూచేందుకు ప్రయోగించారా? పగలు ఎక్కడ ఎన్ని పండ్లున్నాయో ఆచూకీ పట్టి రాత్రిపూట కోసుకొని వెళ్ళుతాడు. ఈరోజు పట్టుపడ్డాడు. మా తోటంతా నష్టంచేశాడీదొంగ.''

ఈ అలజడి విని గుడిలో జనమంతా అక్కడినుండి ఈ గలభా జరిగే చోటికి వచ్చారు. ఘుండీ స్వామి దగ్గర ఉన్న జ్వాలా ప్రసాద్, బేచూ మిశ్రకూడా ఇప్పుడే సమస్యపై దృష్టి మరల్చారు. దీని నిజానిజాలు తెలుసుకునేందుకే బేచూమిశ్ర జ్వాలా ప్రసాద్‌ను అక్కడికి తీసుకుని

వచ్చారు. బేచూమిశ్ర జుమ్మన్‌మియాతో అన్నారు: "అంత కోపగించుకోవలసిన అవసరంలేదు జుమ్మన్‌మియా! శ్యామలాల్ మామిడిపండ్లు కోస్తూ ఉండగా నీవు చూడ లేదు గదా! ఇకముందు మీకేమీ నష్టం రాకుండా చూచే భారం మాది. సరేనా! ఈ విషయం విచారించి నిజానిజాలు తెలుసుకునేందుకే తహసీల్దారుగారు ఇక్కడికి వచ్చారు." తర్వాత ఆయన అక్కడ పోగయిన గుంపును గదిమారు: "ఎందుకిలా గుంపుగా కూడారిక్కడ? వెళ్ళండిక్కడినుంచి."

జుమ్మన్‌మియా తనతో వచ్చిన మనుష్యులతోపాటు తన తోటకు వెళ్ళారు. ఆయనతోపాటు గుంపుకూడా తగ్గిపోయింది. జ్వాలా ప్రసాద్ మొహం చిన్న బుచ్చుకుని తలవంచుకొని అక్కడనే నిలబడిపోయినారు. ఇంతలో ఘుండీస్వామి వికటాట్టహాసం వినిపించింది: "ఏమిటో ఆలోచిస్తున్నాడు మనవాడు. ఇందులో విచారించవలసిందేమీ లేదు. ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. చేసినవారికి చేసుకున్నంత! ఈ శ్యామ లాల్ చాలా అదృష్టవంతుడు. సంపత్తి ఇతని దగ్గరికి పరుగెత్తుకుంటూ వస్తుంది." ఆ తర్వాత ఘుండీస్వామి బేచూమిశ్ర వైపు తిరిగి అన్నారు: "ఏమోయ్, నీ సంగతేమిటి? ఇదుగో నీవుకూడా ప్రసాదం తీసుకో. ఘుండీస్వామికి పక్ష పాతమని అనుకుంటున్నావేమో!" అలా అంటూనే ఘుండీస్వామి హోమ కుండంలో నుంచి చిటికెడు భస్మంతీసి బేచూమిశ్ర పిడికిట్లో పెట్టారు. పిడికిలిమూసి మళ్ళీ తెరిచేసరికి అందులో పగడం కనిపించింది.

ఘుండీస్వామి మళ్ళీ బిగ్గరగా నవ్వారు: "నీకు అంగారకుడు సరిగాలేడు. తమ్ముణ్ణి ఆంజనేయస్వామి సేవలోదించడం మంచిదయింది. లేకుంటే అంతా సర్వనాశన మయిపోయేది. ఈ పగడం దగ్గర ఉంచుకో. మంగళవారంనాడు ఉపవాసం ఉండు. ప్రతిరోజూ సాయంత్రంపూట ఆంజనేయస్వామిని దర్శించుకో."

అప్పుడు వాళ్ళదగ్గర నిలబడిఉన్న కిషన్‌లాల్ అన్నాడు: "భలే మోసగాడివోయ్ ఘుండీస్వామీ! గోమేధికం, పగడం కొల్లలుగా... పంచిపెడుతున్నావా? ఎవరి పిడికిట్లోనైనా వజ్రం, మాణిక్యం, ... తెప్పించు చూద్దాం." ఆ తర్వాత అతను జ్వాలా ప్రసాద్‌తో అన్నాడు: "మీరుకూడా ఈ టక్కరివాడి వలలో పడిపోతున్నారా? శ్యామూ, కిషన్-

ఇద్దర్నీ స్వాధీనం చేసుకొని మన తోటలో ఆశ్రయం ఏర్పరచుకున్నాడు. రాత్రింబవళ్ళు గంజాయి తాగుతాడు. ఇప్పుడు ఆడవాళ్ళు కూడా వస్తున్నారట. ఏమోయ్ ఘుమరూ మండిత్, నిజమేనా?"

ఘుమరూస్వామి దగ్గర తన శిష్యుల్లో ఒకణ్ణి ఉంచి ఈ తమాషా చూచేందుకు ఇక్కడికి వచ్చాడు. "అన్నయ్యా! ఇతను మాకు ప్రాణ సంకటంగా తయారయినాడు. ఒకరివిమించి మరొకర్ని ఎంతమంది రాడీలనో ఇక్కడ చేరుస్తున్నాడితను. దేవుడికి వచ్చే కానుకల్లో సగ భాగం తనకు రావాలని అంటున్నాడు."

జ్వాలా ప్రసాద్ నిశ్చేష్టుడై ఎంతో విచారంతో అలాగే నిలబడి అందరు చెప్పేదీ వింటున్నారు. అంతా చూస్తున్నారు. కానీ దేవుడి కానుకల్లో సగభాగం సంగతి విన్న తర్వాత వేచామిశ్రా కూడా ఆలోచించడం మొదలు పెట్టారు. ఆయన ఘుండీస్వామిని అడిగారు: "ఇక్కడ ఇంకా ఎన్నాళ్ళు మకాం చెయ్యాలని తమ సంకల్పం స్వామీజీ?"

"భోలానాథుని ఇచ్ఛ! మనదేముంది? భూతనాథుడు, 'ఒరే ఘుండీ వెళ్ళరా' అని ఏ క్షణంలో అంటే ఆ క్షణంలో వెళ్ళతాను. ఈ కుఱ్ఱ వాళ్ళంతా ఏమేమో అంటుంటారు. కాని మేము విషం తాగేవాళ్ళం. అన్నింటినీ తాగేస్తాం. కాని యీ మూడో కన్ను ఎప్పుడు తెరిస్తే అప్పుడు వీళ్ళంతా భస్మమై పోతారు. కాని దానికి ఈశ్వరుని సంకల్పం కావాలి."

ఇప్పటికి జ్వాలా ప్రసాద్ తెప్పరిల్లుకున్నారు. ఆయన చాలా గట్టిగా అన్నారు: "నీవు రేపు ఉదయమే ఇక్కడినుండి వెళ్ళిపోవాలని ఈశ్వర సంకల్పం. రేపు సాయంత్రం మళ్ళీ నేనిక్కడికి వస్తాను. అప్పుడు నీ విక్కడ కనిపించావా, వెంటనే పోలీసులకు ఒప్ప చెప్పేస్తాను. డిప్టీ తహసీల్దార్‌గారూ! పోలీస్ ఇన్స్పెక్టరు శహాబుద్దీన్‌తో చెప్పి వెంటనే ఇక్కడ ఇద్దరు పోలీసు జవానులను డ్యూటీలో ఉంచండి."

పదమూడు

ఛింకీ రొప్పుతూ ఉన్నది. దానినోట మాట రావడం లేదు. యమున కాళ్ళ దగ్గర కూర్చుని ఏదో గొణుగుతూ ఉంది: "ఆ భగవంతుడి మనస్సులో ఏముందో తెలియదు. వీళ్ళంతా కలిసి ఏం చెయ్యాలను కుంటున్నారో అర్థం కావడం లేదు. గంగమ్మ తల్లీ! మా జ్వాలానూ, గంగూనూ చల్లగా కాపాడు తల్లీ!"

యమున ఖంగారుపడుతూ అడిగింది: "ఏమిటయిందే? అంత ఖంగారు పడుతున్నా వెందుకు?"

"కొంచెం కండ్లు తెరుచుకొని చూస్తే ఎటుచూచినా అగుపిస్తుంది. నీవు రాణిలాగా కండ్లు మూసుకుని నిశ్చింతగా పండుకున్నావు. ఒక వైపు వాళ్ళంతా నిన్ను దోచేసుకుంటున్నారు. ఇదంతా నేను చూస్తూ ఉండలేను. అగమ్యగోచరంగా ఉంది."

ఛింకీ తను చెప్పదలచుకున్న విషయాన్ని ఉపక్రమించే విధానం యమునకు బాగా తెలుసు. ముఖం చిట్లించుకుంటూ అన్నదామె: "ఛింకీ, రోజూ నీవీ మాట చెప్తూనే ఉంటావు. ఆయనతో నేనీ మాటంటే వాళ్ళ అదృష్టం కొద్దీ వాళ్ళు తింటున్నారులే అంటారు. నీవేమో రోజుకొక కొత్త కథ తీసుకొస్తావు. ఏం చెయ్యాలో తెలియడం లేదు."

ఛింకీ కోపంతో లేచి నిలబడింది. "అవునమ్మా, రాణీ, నేనే కథలు కల్పిస్తున్నాను. మీ పెద్ద తోడికోడలికి పదిహేను తులాల కంటె, ఎనిమిది తులాల కాలి కడియం చేయించారు. తెలుసా? ఇప్పుడే కంసాలి దగ్గరినుంచి తీసుకొచ్చేరు. అది కూడా నేను కల్పించిన కథేనా మరి? దోచుకోనీ వాళ్ళను! నాదేం పోయింది? నోరులేని గంగూను పనికి మాలిన వాణ్ణి చేసేస్తారు."

యమున ఆశ్చర్యంతో మంచంమీది నుంచి దిగింది: "అలా అనకు ఛింకీ! నా మాట సరిగా అర్థం చేసుకో. బావగారు ఈ సొమ్ములు చేయించిన మాట నిజమేనా? ఎప్పుడు చేయించారు? నీవు చూచావా?"

ఛింకీ సమాధానం చెప్పలేదు. శ్యామలాల్ భార్య గదిలోకి రావడం అది చూచింది. ఆ సమయంలో తానక్కడ నుంచి తొలగి పోవడమే మంచిదనుకొంది ఛింకీ. శ్యామలాల్ భార్య ఛింకీ వెళ్ళిపోయిన తర్వాత

యమునతో అన్నది: "అక్కా! పెద్దక్కకు ఇప్పుడే కంటె, కడియాలు చేయించుకు వచ్చారు. నేను పక్కగదిలో వాకిటి దగ్గర నిలబడి ఉన్నాను. బావగారి మాటలు నాకు వినిపించాయి. నలభై తులాల కడియాలు, పదిహేను తులాల కంటె అని చెప్తున్నాడు బావగారు. ఈ సొమ్ములు చేయించిన సంగతి ఎవరికీ తెలియకూడదని చెప్తున్నారాయన."

రాధేలాల్‌గారి కుటుంబంలో శ్యామలాల్ భార్యను అందరూ చులకనగా చూస్తారు. ఆమెకు సంతానం లేకపోవడమే దానికి కారణం. శ్యామలాల్ భార్య పుష్టిగా, పొడుగ్గా ఉంటుంది. కొంచెం నల్ల రూపున ఉంటుంది. అనాకారి అని చెప్పినా చెప్పచ్చు. నోరుకూడా అంత మంచిది కాదు. కాని పని పాటలు చక్కగా కష్టపడి చేస్తుంది. ఇంటిల్లపాదికి ఆమె ఒక్కతే వంటచేసి పెడుతుంది. తనొక్కతే ఇంటెడు పనిచేస్తుంది. కాని ఇంట్లో ఎవ్వరికీ ఆమె అంటే లెక్కలేదు. అప్పుడప్పుడూ యమునకు ఆమె మీద జాలి వేస్తుంటుంది. అందువల్ల ఆమె యమునతో అన్నది: "అక్కా! సొమ్ములంటూ నాకు కాళ్ళకు గొలుసులుతప్ప మరేమీ లేవు. అవి కూడా అరిగిపోతున్నాయి. నీవన్నా బావగారికి చెప్పి నాకు మంచి గొలుసులు చేయిద్దూ. పెద్దక్క సొమ్ముల్తో నిండిపోతున్నది. నాకున్నవి కూడా విరిగిపోతున్నాయి. అంతా అయోమయం! అక్కయ్యా!"

ఆ సమయంలో యమున అంతకంటే అయోమయంలో ఉంది. అయితే ఛింకీ ఇంతకుముందు చెప్పింది, ఇంతవరకు చెప్తూ వచ్చింది, అంతా అక్షరాల నిజం అని ఆమెకు తోచింది. యమున చూస్తూ ఉండగానే ఆమెను వాళ్ళంతా దోచుకోవాలని చూస్తున్నారు. అప్పుడు బయట జోరున వర్షం కురుస్తూ ఉన్నది. జ్వాలా ప్రసాద్ ఆఫీసునుండి వచ్చే వేళయింది. ఆఫీసూ, ఇల్లూ ఎదురెదురుగానే ఉన్నప్పటికీ ఆ వానలో జ్వాలాప్రసాద్ ఇల్లు చేరేలోగా చప్పగా తడిసిపోతారు. యమున శ్యామలాల్ భార్యతో అన్నది: "నేనాయనకు చెప్తాను. కాని ఆయన డబ్బంతా చిన మామగారికే ఇచ్చేస్తారు. అందుకని నీవు మామయ్యకు చెప్పడం మంచిది. నేను కూడా నీతో వచ్చి చెప్తాను."

శ్యామలాల్ భార్య భయపడుతూ అన్నది: "ఎందుకు? నాకు నాలుగు పెట్టించేందుకా? ఆయన స్వభావం నీకు తెలుసు గదా! ఇక అత్తయ్య సంగతి చెప్పనే పనిలేదు. నన్ను చూస్తే ఆమె కస్సుమంటుంది. ఈ

ముసలి ముండను ఇక మళ్ళీ నోరెత్తకుండా ఏదో ఒక రోజు కాలికింద పడేసి తొక్కేద్దామనిపిస్తుంది.''

యమున నవ్వుతూ అన్నది: "అయ్యో పాపం! అత్తగారిని అలా అనచ్చుటే?'' శ్యామలాల్ భార్య కంట తడి పెట్టింది: "ఏం చెయ్యనక్కా! ఓర్చుకొనేందుకు కూడా ఒక మితం లేదూ! ఈ ఇంట్లో వాళ్ళతో ప్రాణాలు విసిగి పోతూ ఉన్నాయి. ఏదో ఒక రోజు కిరసనాయిలు మీద పోసుకొని నిప్పంటించుకొని తీరుతాను.''

శ్యామలాల్ భార్య మనస్సులో బాధను అర్థం చేసుకుని యమున అన్నది: అలా చేసుకోవాల్సిన అవసరం లేదు. నాకొక ఆలోచన తట్టింది. ఛింకీని నేను చిన మామగారి దగ్గరికి పంపిస్తాను. మీ అత్తగారికీ, మామ గారికీ ఈ ఇంట్లో ఎవరిని చూచినా భయముందీ అంటే, ఛింకీని చూస్తేనే.''

సరిగా అదే సమయంలో చింకీ గదిలోకి వచ్చింది. అది చాలా ఖంగారు పడుతూ ఉంది. గదిలోకి వస్తూనే అన్నది: "చిన్నయ్యగారితో కాదు, నేను జ్వాలాతోనే చెప్పేస్తాను. ఆయన వచ్చే వేళయింది. కాని ఆయన గొడు గెక్కడుందో కనిపించడం లేదు. భీఖూ ఇల్లంతా వెదికాడు. ఎక్కడ మాయమయిందో కనిపించలేదు.''

"మధ్యాహ్నం నన్నడిగి ఆయన గొడుగు తీసుకొని వెళ్ళారు. ఒక గంటలో తెచ్చిస్తానన్నారు. వెళ్ళి ఆయన్ని అడుగు.'' అన్నది యమున.

"ఎవరి నడగను. భూత పిశాచాల్ని అడగాల్సిందే! చిన్నయ్యగారెక్క డికి వెళ్ళారో తెలియదు. ఆయన కొడుకులు కూడా ఎక్కడా జాడా పోబడా లేదు. ఇప్పుడేం చేసేటట్టు? వాన జోరున కురుస్తూ ఉంది.''

ఇలా గొడుగు వెతుకుతూ ఉండగానే జ్వాలా ప్రసాద్ బేచూమిశ్ర గొడుగు వేసుకొని ఇంటికి వచ్చేశారు. భీఖూ చేత బేచూమిశ్ర గొడుగు తిరిగి పంపిస్తూ ఆయన యమునతో అన్నారు: "ఎంత సేపటి నుంచో నేనెదురు చూస్తూ ఉన్నాను. నా గొడుగు పంపిస్తావేమోనని. ఏమ యింది?''

"ఆ గొడుగు మధ్యాహ్నమే మీ బాబాయి తీసుకెళ్ళారు. ఒక గంటలో తిరిగి వస్తానని చెప్పి వెళ్ళారు. ఇంతవరకు రాలేదు. ఆయనతో పాటు మీ పెద్దన్నయ్య కూడా వెళ్ళినట్టుంది.''

జ్వాలా ప్రసాద్ గుడ్డలు మార్చుకున్నారు. వాన తగ్గిపోయింది. వాన

తగ్గినప్పటి నుంచి ఉక్క పొయ్యడం మొదలెట్టింది. జ్వాలా ప్రసాద్ ఆఫీసు కాగితాలు ముందు వేసుకున్నారు. కాని ఆయనకు ఇంట్లో ఉండడం దుర్భరమని తోచింది. ఆయన యమునతో అన్నారు: "ఠాకుర్ వీరభాను సింగుగారి ఇంటికి వెళ్ళి చాలా రోజులయింది. వాళ్ళింటికి వెళ్ళివద్దామా అని అనుకొంటున్నాను. ఆయన భార్య నిన్నొక్కసారయినా తీసుకు రాలేదని ఎన్నోమార్లు అడిగింది. నేను ఇక్కా కట్టిస్తాను. అంతలోకి నీవు సిద్ధంకా."

"ఇదుగో నేను నిమిషంలో తయారవుతాను. ఈలోగా మీరు కొంచెం ఫలహారం చెయ్యండి" అంటూ యమున వంటింట్లోకివెళ్ళి జ్వాలా ప్రసాద్‌కు పూరీ ఫలహారం పంపించింది. జ్వాలా ప్రసాద్ ఫలహారం చేస్తున్నారు. ఈలోగా ఛింకీ శ్యామలాల్ భార్యకు చేసిన వాగ్దానం ప్రకారం జ్వాలా ప్రసాద్‌తో చెప్పదలుచుకున్న విషయం మొదలు పెట్టింది: "శ్యామూ భార్య కాలి అందెలు పూర్తిగా అరిగి పొయ్యాయి. పెద్ద కోడలికి ఈరోజే కడియాలూ, కంటె చేయించుకుని వచ్చారు. నాకు నాలుగందెలన్నా ఎవ్వరూ చేయించేవాళ్ళులేరని పాపం శ్యామూ భార్య ఏడుస్తూ ఉంది. నీకు చెప్తానులే అని నేను చెప్పాను."

శ్యామలాల్ భార్యకు ఆ కుటుంబంలోగల ప్రాధాన్యం జ్వాలా ప్రసాద్‌కు బాగా తెలుసు. ఆయనకు ఆమెమీద సహానుభూతి కూడా ఉంది. "అలాగేలే ఛింకీ! రేపు పాత అందెలు నాకిచ్చేసేయి. కంసాల్ని పిలిపించి కొత్తవి చేయిద్దాం. అది సరేకాని వదినెకు కడియాలు, కంటె చేయించిన మాట నిజమేనా?"

"నిజం కాకపోతే నేను అబద్ధం చెప్తానా? ఈరోజు ఉదయం రామూ సొమ్ములు తీసుకవచ్చి వాళ్ళ అమ్మకూ భార్యకూ ఇచ్చాడు. ఎవ్వరికీ చెప్పకుండా దాచుకోండని కూడా చెప్పాడు. అక్కడనే వున్నందువల్ల ఇదంతా నేను చూచాను."

జ్వాలా ప్రసాద్ మనస్సు చివుక్కుమన్నది. కాని ఆయన ఆ విషయమై ఎక్కువ మాట్లాడలేదు.

యమునను తీసుకొని జ్వాలాప్రసాద్ ఠాకుర్ వీరభానుసింగ్‌గారి ఇంటికి వెళ్ళేసరికి మున్షీ రాధేలాల్ తనకొడుకు రామలాల్‌తోసహా అక్కడనే ఉన్నారు. యమున లోపలికి వెళ్ళింది. జ్వాలా ప్రసాద్ ఠాకుర్

వీరఖానుదగ్గర బయటి గదిలో కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ రాగానే మున్షీ రాధేలాల్ అన్నారు: "నీవు సరిగ్గా సమయానికి వచ్చావోయ్ జ్వాలా! రామూకు ఇక్కడనే స్కూల్లో పని ఇప్పించేందుకు ప్రయత్నిస్తా వని అంటున్నారు ఠాకుర్‌గారు. ఇంట్లో నలుగురూ ఒకరక్కడ ఒకరిక్కడ ఉండేకంటే అందరూ ఒక చోటనే ఉండడం మంచిదని అనుకుంటూ ఉన్నాం."

జ్వాలా ప్రసాద్ అప్రయత్నంగా అనేశారు: "అయితే మరి ఫతేపూర్లో ఇంటివిషయాలెవరు చూచుకుంటారు బాబాయ్? నేనిక్కడ ఉంటున్న ఇల్లుకూడ గవర్నమెంటుది కదా! అందులో ఇంతమంది ఉండేందుకు వసతికూడా తక్కువే."

జ్వాలా ప్రసాద్ వేసిన ప్రశ్నకు ఠాకుర్ వీరఖాను సమాధానం చెప్పారు: "ఇంటి విషయం మీరేమీ విచారించకండి తహసీల్దారుగారూ! నేనీ యిల్లువదిలేసి కొత్తయిల్లు కట్టుకోబోతున్నాను. ఈ యింట్లో ఉండి ఉండి విసుగేస్తూన్నదని అంటున్నది మా ఆవిడ కూడా. ఈ యిల్లు నేను మీకిచ్చేస్తాను. విశాలంగా ఉంటుంది. మీ కుటుంబానికంతా బాగా సరి పోతుంది. మీకేమీ ఇబ్బంది ఉండదు."

జ్వాలా ప్రసాద్ అన్నారు: "ఠాకూర్‌గారూ! మీరెంతో మంచివారు. కాని మీ యింట్లో నేను ఉండేందుకు ప్రభుత్వం ఒప్పుకోదు. ఈ విషయాలు మీకంత సులభంగా అర్థం కావు."

ఠాకూర్ వీరఖాను నవ్వుతూ అన్నారు: "నాకన్నీ తెలుసు తహ సీల్దారుగారూ! మీరా దిగులేమీ పెట్టుకోవద్దు. ఈ యింటిని నేను మీ పేరిటనో, గంగూ పేరిటనో విక్రయించేస్తాను. ఈ యిల్లు కట్టి ఇప్పటికి డెబ్బై సంవత్సరాలు దాటాయి. ఇప్పుడు దీనివిలువ మాత్రం ఏముంటుంది? దీన్ని నేనిలా వదిలేసి వెళ్ళితే రెండు మూడేళ్ళకల్లా ఇది శిథిలమైపోతుంది. ఒట్టి స్థలం ఖరీదుకు మీకి యిల్లు వచ్చేస్తుంది. అయినా మీకెందుకు గొడవంతా! మున్షీ రాధేలాల్ అన్నీ చూచుకుంటారు."

జ్వాలాప్రసాద్ ఆ విషయాన్ని తప్పించేందుకు అన్నారు: "ఆ విషయం అలా వదిలేయండి. మీరు కొత్తయిల్లు కట్టుకునేందుకు కనీసం సంవత్సరం, రెండు సంవత్సరాలన్నా పడుతుంది. ఇంకా పునాదుల్లోనే ఉందిగదా!"

"అవును, ఎలాగయినా ఏడెనిమిదినెలలు పడుతుంది-పూర్తిగా ఒక సంవత్సరమనుకోండి." ఠాకూరు వీరభానుసింగు కూడా ఒప్పుకున్నారు.

"అందాక ఏదో విధంగా జరుపుకుంటాం లెండి. ఇప్పుడు మాత్రం జరగటంలే!" అన్నారు మున్షీ రాధేలాల్. తర్వాత ఆయన లేచినిలబడ్డారు: "ఇక మీరు మాట్లాడుకోండి, నేను వెళ్ళివస్తాను. మధ్యాహ్నం ఠాకూర్ సాహబ్‌తో కలిసి అలహాబాదు వెళ్ళివచ్చాను. అక్కడ రామూ సంగతి నిశ్చయమయిపోయింది. పదిహేను రోజుల్లో ఉత్తర్వులు జారీ కావచ్చు. ఒకటి రెండు రోజుల్లో రామూను తీసుకొని ఫతేపూర్ వెళ్ళి రావాలి. అక్కడ ఉద్యోగానికి రాజీనామ ఇవ్వడం, ఇంటి సంగతీ, పొలం సంగతీ అన్నీ విచారించుకొని వాటికేదో ఏర్పాటుచేసి రావాలి." ఆ తర్వాత రామలాల్‌ను తీసుకొని మున్షీ రాధేలాల్ వెళ్ళిపోయినారు.

వాళ్ళు వెళ్ళిన తర్వాత కొంచెంసేపు వరకూ జ్వాలా ప్రసాద్, ఠాకూర్ వీరభానుసింగ్ మౌనంగా కూర్చున్నారు. తర్వాత వీరభానుసింగ్ అడిగారు:

"ఏమండీ తహసీల్దార్‌గారూ! ఏదో పరధ్యానంలో ఉన్నట్లు కనిపిస్తున్నారే? వీళ్ళు మీతో ఇక్కడ వుండడం మీ కిష్టం లేదా?"

జ్వాలా ప్రసాద్ తడుముకుంటూ అన్నారు: "అబ్బే ... మరేనండీ .... అదేమీ లేదు."

ఠాకుర్ వీరభానుసింగ్ భార్య బలవంతంచేస్తే జ్వాలా ప్రసాద్, యమున ఆ రోజు అక్కడనే భోంచేశారు. భోంచేసేముందు జ్వాలా ప్రసాద్ ఠాకుర్ వీరభానుసింగుతోపాటు కొంచెం సారాయి తాగారు. అందువల్ల ఆయన కొంచెం చురుకుగా కనిపిస్తున్నారు. ఆయనలో అదో రకమైన సాహసం చేకూరింది. 'ఏమయినా సరే అలా అవడానికి వీల్లేదు - ఎంత మాత్రం వీల్లేదు. మానవుడు నరకాన్ని నిర్మించేందుకు సమర్థుడయితే దాన్ని ఆపేందుకు కూడా అతనికి సామర్థ్యముంది' అని ఆయన మనస్సులో అనుకొన్నారు.

జ్వాలా ప్రసాద్ ఇంటికి తిరిగి వెళ్ళేసరికి అర్ధరాత్రయింది. అప్పుడు ఛింకీ ఒక్కతే గంగాప్రసాద్ తలవైపు కూర్చుని మేల్కొని ఉంది. భీఖా బయట వాకిలి దగ్గర కూర్చుని నిద్రకండ్లతో తూగుతున్నాడు. జ్వాలా ప్రసాద్, యమున గదిలోకి రాగానే ఛింకీ అక్కడినుండి వెళ్ళిపోయింది.

కాని జ్వాలా ప్రసాద్ దాన్ని ఆపి అడిగారు: "ఛింకీ, కొంచెం ఉండు. విన్నాక సలహా అడగాలి."

ఛింకీకి ఆశ్చర్యం వేసింది. ఇంతవరకూ దాన్ని సలహా అడిగిన వాళ్ళెవరూలేరు. తనంటత తానే అదీ సలహాలు ఇస్తూ వచ్చింది. దాన్ని సలహా అడగడం ఇది మొదటసారి. అది అక్కడనే కిందకూర్చుని అన్నది: "ఏమిటో అడగండి."

జ్వాలా ప్రసాద్ అన్నారు: "ఠాకుర్ వీరభానుసింగుగారి మేడ మనకు కావాలని బాబాయి అయన్ని అడిగారు. ఆయన కొత్త మేడ కట్టుకుంటు న్నారు. రామూ అన్నయ్య ఫతేపూర్‌లో ఉద్యోగం మానుకుని ఇక్కడ సోరావ్‌లోనే ఒక స్కూల్లో చేరుతున్నారు. బాబాయి వీటన్నిటికీ ఏర్పాటు చేసేశారు. ఇక మన కుటుంబమంతా కలిసి ఇక్కడనే ఉంటుందని కూడా ఆయన చెప్పారు."

"అయ్యో కర్మ! మీకు ముప్పు తీసుక వచ్చేందుకు చేరారు వీళ్ళంతా ఇక్కడ! దొంగలు, మోసగాండ్లు. పనికిమాలిన సంతంతానూ! ఇదంతా చూస్తూ మీరు ఊరుకుంటారా మరి?"

"దాన్ని గురించి సలహా అడిగేందుకే నిన్ను ఆగమన్నాను ఛింకీ! ఏం చెయ్యాలో తోచటం లేదు."

"చేసేదేముంది! మీ బాబాయికి పిల్లలు తనూ వెళ్ళి ఫతేపూర్‌లో ఉండమని కచ్చితంగా చెప్పేసెయండి."

ఇంతలో భీఖా కండ్లు తెరిచాడు. ఛింకీ చెప్పిన చివరి వాక్యం అతనికి అర్థం కావడంలేదు. వాకిలి దాటి మెల్లగా గదిలోకి వచ్చి అడుగుతున్నాడు: "ఏమిటయిండి బాబూ! అమ్మ ఎవరిమీద కోప పడుతున్నది?"

ఛింకీ సమాధానం చెప్పింది: "కోపపడడం లేదోయ్, ఈ ఆపదనుండి బయటపడడం ఎలాగా అని చూస్తున్నాను. మన జ్వాలా బాబు ప్రాణం విసిగించేందుకు ఈ ఫతేపూర్‌వాళ్ళు పోగయ్యారు. సోరావ్‌లో వచ్చి పీఠం వేసుకున్నారు."

"ఇది చాలా గొడవగానే ఉంది. నాకు వీళ్ళను చూస్తేనే భయ మేస్తుంది. వీళ్ళు మనుష్యులు కారు. దయ్యాలని అనిపిస్తుంది." అన్నాడు భీఖా.

జ్వాలా ప్రసాద్‌కు నిషా తగ్గిపోయేకొద్దీ ఆయన ధైర్యం క్షీణించిపోతూ

ఉన్నది. ఒకసారి మళ్ళీ తనలోఉన్న ధైర్యాన్నంతా సమకూర్చుకొని ఆయన అన్నారు: "భీఖూ, వీళ్ళంతా ఇక్కడ ఉండడం నా కిష్టంలేదని రేపుదయమే మా బాబాయికి చెప్పేసేయ్. అందర్నీ తీసుకొని అయన్ని ఫతేపూర్ వెళ్ళమని చెప్పు."

భీఖూ కండ్లార్పుతూ అన్నాడు. "వాళ్ళంతా కలిసి నన్ను కొట్టేందుకు వస్తే మీరొచ్చి రక్షిస్తారా? అది నావల్ల కాదు బాబూ! మీరే చెప్పండి వాళ్ళతో."

జ్వాలా ప్రసాద్ తలపట్టుకొని అన్నాడు: "అదే కదటోయ్, పిల్లి మెడలో గంట కట్టేదెవరూ అనేదే సమస్య. పోనీలే. నేనిదంతా రేపు ఉదయం ఒక కాగితంలో రాసిస్తాను. నీవు దాన్ని తీసుకెళ్ళి బాబాయి కిచ్చేసేయ్."

"దానికేం, ఆ పని నేను చేసేస్తాను." అంటూ భీఖూ ఆవలించాడు: "అది సరే కానిండి. అలహాబాదునుంచి ఎవరో మీ కియ్యమని ఒక ఉత్తరం ఇచ్చిపోయినారు. అదిగో మీ దిండుకింద పెట్టాను, చూచుకొండి."

ఛింకీ, భీఖూ వెళ్ళిన తర్వాత జ్వాలా ప్రసాద్ తన దిండుకింద ఉన్న ఉత్తరం తీసి చూచుకున్నారు. ఆ ఉత్తరం జైదేయి పంపించింది. జైదేయి అలహాబాదుకు వెళ్లి జబ్బుపడింది. అందువల్ల ఆమె సోరావ్ రాలేక పోయింది. జ్వాలా ప్రసాద్‌కు వీలుంటే యమునను కూడా తీసుకొని ఒకసారి అలహాబాదు వస్తే బాగుంటుందని ఆమె అందులో వ్రాసింది. రెండు మూడు రోజులు సెలవుపెట్టి రాగలిగితే మరీ మంచిదని వ్రాసింది.

జ్వాలా ప్రసాద్ నవ్వుతూ యమునతో అన్నారు: "నంబర్‌వారు భార్య వ్రాసింది. అలహాబాదు వచ్చి జబ్బుపడింది. మనల్ని అక్కడికే రమ్మని వ్రాసింది. ఎల్లుండి ఆదివారం. రేపు రాత్రికి బయలుదేరి వెళ్ళుదాం. సోమవారం అమావాస్య ఆఫీసుకు సెలవు. సోమవారం రాత్రికో, మంగళ వారం ఉదయమో మనం తిరిగి రావచ్చు."

"అవును, అలహాబాదు వెళ్ళుదామని నేనే చెపుదామను కొంటున్నాను. కాని తీరా మీరేమంటారోనని ధైర్యం చాలక అనలేదు. ఈ యిల్లు మన ప్రాణానికి వచ్చింది. ఎక్కడికన్నా వెళ్ళితే బాగుండుననిపిస్తున్నది."

జ్వాలా ప్రసాద్ కండ్లల్లో కాంతి వచ్చింది: "అలహాబాదు వెళ్ళి నేను రాముూ సోరావ్ రాకుండా చేస్తాను. మన కిషన్ చేసిన ఉపద్రవం

సంగతి కూడా నంబర్‌దారు భార్యవల్ల తెలుసుకోవచ్చు. కాని మనం ఆమెను చూచేందుకు వెళ్ళుతున్నామనే విషయం ఇంట్లో ఎవ్వరికీ తెలియ గూడదు. డిప్టీ కలెక్టరుగారి ఇంట్లో వాళ్ళ పిల్లవానికి చెవులు కుడుతున్నా రని మనం వెళ్ళుతున్నామని చెప్పు.''

"అలాగే, అలాగే, మీరా దిగులేం పెట్టుకోకండి'' అన్నది యమున. పన్నెండేళ్ళ క్రితం ముప్పై ఐదేళ్ళ వయస్సులో ఉన్న జైదేయి పాతికేళ్ళ పిల్లలా కనిపించింది. ఇప్పుడామె అరవైఏళ్ళ ముసలమ్మలా అయి పోయింది. ఆమె వెంట్రుకలు దాదాపన్నీ నెరిసి పోయినాయి. ముఖమంతా ముడతలు పడిపోయింది. శరీర విన్యాసంలో మార్పేమీ రాలేదు గాని ఆమె బాగా బలహీనమై పోయింది. కండ్లల్లో కాంతి కూడా తగ్గిపోయింది.

జైదేయికి రెండు సంవత్సరాల నుండి శీత జ్వరం పట్టుకుంది. ఆయుర్వేద వైద్యుల దగ్గర, యూనానీ, హకీముల దగ్గర ఎన్నో మందు లిప్పించారు. విభూతి పెట్టించారు. మంత్రాలు వేయించారు. కాని ఆ చలి జ్వరం మాత్రం ఆమెను వదల్లేదు. ఒక నెలా అరనెలా తగ్గినట్టే తగ్గుతుంది. కాని మళ్ళీ కనిపిస్తుంది. జ్వాలా ప్రసాద్, యమున ఆమె గదిలోకి ప్రవేశించిన సమయంలో ఆమె జ్వరంతో ఒళ్ళు తెలియకుండ పండుకుని ఉంది. లక్ష్మీ చందు భార్య రాధ ఆమె తలదగ్గర కూర్చుని ఉంది.''

ఆరు నెల్ల క్రితం లక్ష్మీచంద్ సివిల్ లైన్సులో ఒక బంగళా కొన్నాడు. అలహాబాదు వచ్చినప్పుడు అతనక్కడనే ఉంటాడు. జ్వాలా ప్రసాద్ కూడా అలహాబాదు వెళ్ళినప్పుడు అక్కడనే బసచేసేవారు. పనివాళ్ళు జ్వాలా ప్రసాద్ సామాన్లు దించారు. జ్వాలా ప్రసాద్ బయటి గదిలో కూర్చున్నారు. యమున లోపలికి వెళ్ళింది. ఆమె నేరుగా జైదేయి గదిలోకి వెళ్ళింది.

రాధ యమున కాళ్ళకు నమస్కరించి ఆమె కూర్చునేందుకు ఒక కుర్చీ వేసింది: "అత్తయ్యకు పదిహేను రోజులనుంచి చలి జ్వరం వస్తున్నది. దీపం పెట్టగానే చలితో జ్వరం ప్రారంభమవుతుంది. అర్ధ రాత్రికి ఒళ్ళంతా చెమటలు పట్టడంతో జ్వరం విడిచి పోతుంది. పగలంతా కులాసాగా తిని తిరుగుతారు. మామూలుగా పని చేసుకుంటారు. కాని ముఖమంతా తమలపాకులా పాలిపోయింది. ఆయన వారం రోజుల కింద కాన్పూరునుండి ఫూటంపూర్ వెళ్ళారు. ఈ పరిస్థితి చూచి ఆయన

ఇక్కడ డాక్టర్లచేత మందులిప్పించాలని మమ్మల్ని అలహాబాదు తీసుకు వచ్చారు. కాని ఇంగ్లీషుమందులు వాడడం అత్తయ్య కిష్టంలేదు. చివర కాయనకు విసుగుపుట్టి నిన్ననే కాన్పూరు వెళ్ళారు. అక్కడేదో అవసర మైన పని ఉన్నదట.''

రాధా యమునల సంభాషణతో జైదేయికి స్పృహ వచ్చింది. కండ్లు మూసుకునే ఆమె అడిగింది: "ఎవరమ్మా?''

రాధ జవాబు చెప్పింది: "తహసీల్దారుగారి భార్య యమునత్తయ్య వచ్చిందత్తయ్యా! మామయ్యగారు బయట కూర్చుని ఉన్నారు.''

జైదేయి ప్రయత్నించి కండ్లు తెరిచింది: "మరిదిగారు వచ్చారా? చెల్లీ, నీవుకూడా వచ్చావా అమ్మా! చాలా సంతోషం. రాధా! మరిదిగారిని ఇక్కడికే గదిలోకి పిలవక పొయ్యావా!

జ్వాలా ప్రసాద్ గదిలోకి రాగానే రాధ ముసుగు వేసుకుంది.

రాత్రి చాలా పొద్దుపోయింది. దూరంగా వున్న గడియారంతో పదకొండు కొట్టింది. జైదేయికి జ్వరం విడిచే వేళ అవుతూ ఉన్నది. ఆమె రాధతో అన్నది: "రాధా! మరిదిగారికీ, యమునకూ భోజనం ఏర్పాటు చూడు వెళ్ళి. నీతో యమునను కూడా తీసుకెళ్ళు, నీకు కొంచెం సాయంగా ఉంటుంది. అందాకా నేను మరిదిగారితో మాట్లాడుతూ ఉంటాను.''

జైదేయి జ్వాలా ప్రసాద్‌తో ఏకాంతంగా మాట్లాడాలని అనుకుంటున్నదనే విషయం స్పష్టంగానే తెలుస్తూ ఉంది. రాధ యమున చెయ్యిపట్టుకొని ఆమె చెవిలో రహస్యంగా చెప్పింది: "ఇలారా అత్తయ్యా! అత్తగారు జ్వాలా మామయ్యకు చెప్పబోయే విషయం నేను నీకు వివరంగా చెప్తాను. మామయ్యకు నీవు విశదంగా చెపుదువుగాని.''

వంటింట్లోకి వెళ్ళి రాధ యమునతో అన్నది: "అత్తయ్యా! జ్వాలా మామయ్య పినతండ్రి కుమారుడు ఘాటంపూర్ వచ్చాడే మా యింట్లో గుమాస్తాగా పని చేసేందుకు! వాడింత దుర్మార్గుడూ, తిరుగుబోతూ అని మాకేం తెలుసు!''

రాధ చెప్పేమాటవిని యమున స్తంభించి పోయింది. ఈ కిషన్‌లాల్ ఇంతగా దిగజారి పోగలడా అని ఆమెకాశ్చర్యం వేసింది.

జైదేయి కూడా జ్వాలా ప్రసాద్‌కు అదే వృత్తాంతం ఏడుస్తూ విని

పించింది. జ్వాలా ప్రసాద్ ఆ విషయమంతా విని కోపంతో మండిపడ్డారు. ఆయన జైదేయితో అన్నారు: "వదినె గారూ! మీరొక వారంపాటు సోరాప్ వచ్చి ఉండకూడదూ! మీ ఎదుటనే నేసీ విషయం తేల్చేస్తాను. వీళ్ళంతా చేరి నాకు ఊపిరి తిప్పుకోకుండా చేసేస్తున్నారు."

"జ్వాలా బాబూ! నా సంగతి మీరు చూస్తూనే ఉన్నారు కదా! ఈ జ్వరం నన్ను వదిలేటట్టు లేదు."

"వదినా! ఒక్క మాట చెప్తాను. మరోలా అనుకోవద్దు."

"అయ్యో, అలా అంటారేంబాబూ! నేనెప్పుడయినా మీరు చెప్పినమాట కాదన్నానా?"

"రేపు ఉదయంనుంచి ఇంగ్లీషుమందు ఆరంభించాలి. డాక్టరు బ్రైట్ నాకు బాగా తెలుసు. ఆయన ఈ ఊరికంతా గొప్ప డాక్టరు. ఆయన వల్లనే ఈ వ్యాధి నయంకావాలి."

"జ్వాలా బాబూ! ఇంగ్లీషుమందు నా కిప్పించకు బాబూ! వైద్యరాట్ నిత్యానంద్ అలహాబాదులో పేరుపడ్డ వైద్యుడు. ఆయన మందు ఆరంభించాను."

జ్వాలా ప్రసాద్ చిరాకుగా అన్నారు: "ఇప్పటికి రెండు సంవత్సరాల నుండి ఈ వైద్యులూ, హకీములూ మందిస్తూ వచ్చారు. ఇక ఈ మందులతో లాభంలేదు. రేపే నేను డాక్టర్ బ్రైటును పిల్చుకు వస్తాను."

జైదేయి అలసటతో కండ్లు మూసుకుని అన్నది: "మీ యిష్టం! ఇక నేను చెప్పేదేముంది! లక్ష్మి చెప్తే కాదన్నాను. కాని నీ మాట కాదనడం నావల్ల కాదు. జ్వాలా బాబూ! మూడు రోజులకో నాలుగు రోజులకో ఒకసారి నన్ను చూచిపోతూ ఉండండి. మీరెలా చెప్తే అలాగే చేస్తాను."

మరుసటి దినం డాక్టర్ బ్రైట్ వచ్చి జైదేయిని పరీక్ష చేశారు. స్పష్టంగా క్రానిక్ మలేరియా. ఆయన మందు వ్రాసిచ్చి చెప్పారు: "నిర్లక్ష్యంవల్ల ఆరోగ్యం చాలావరకు చెడిపోయింది. స్ప్లీన్ పెరిగింది. మూడు రోజుల్లోనే జ్వరం తగ్గిపోతుంది. కాని ఒక నెలదాకా మందు తీసుకోవాలి."

జ్వాలా ప్రసాద్ సోమవారమంతా ఇంట్లోనే గడిపారు. బయట కొంచెం కొంచెంగా చినుకులు పడుతూ ఉన్నాయి. అది కూడా కాక ఆయన మనస్సుకూడా చాలా ఆలోచనలతో నిండి ఉండడంవల్ల ఆయనకు

ఎక్కడికీ వెళ్ళాలని అనిపించలేదు. సోమవారం సాయంత్రం ఆయన జైదేయి దగ్గర సెలవుతీసుకొని యమునతో సోరావ్ చేరారు.

జ్వాలా ప్రసాద్ మనస్సులో తన పినతండ్రి వాళ్ళమీద కచ్చితంగా అసహ్యాభావం ఏర్పడింది. అలహాబాదు నుంచి వచ్చి ఆయన యమునను ఇంట్లోపెంచి తాను నేరుగా ఠాకుర్ వీరభానుసింగుగారి ఇంటికి వెళ్ళారు- ముఖ్యంగా రామలాల్‌కు సోరావ్‌లో ఉద్యోగం ఇప్పించవద్దని చెప్పేందుకుగాను. అప్పుడు ఉదయం తొమ్మిది గంటలయింది. మున్షీ రాధేలాల్ వీరభానుగారి ఇంట్లోనే కూర్చుని ఆయనతో ముచ్చట్లు చేస్తున్నారు.

ఠాకుర్ వీరభానుసింగు లేచి జ్వాలా ప్రసాద్‌కు స్వాగతం చెప్పారు. ఆయన పక్కన కూర్చున్న పెద్ద మనుష్యులు కూడా లేచి నిలబడ్డారు. మున్షీ రాధేలాల్ అన్నారు: "అరే, అప్పుడే వచ్చేశావే జ్వాలా! ఈరోజే నీవు తిరిగి వచ్చేస్తావని నేననుకోలేదు. లేకుంటే రాజా సాహెబ్‌ను ఆపివేసేవాణ్ణి. నిన్ను చూడాలని ఎంతో అనుకొన్నారు. శ్యామూ ఆయనతో వెళ్ళాడు. ఇక్కడనే ప్రతాపగఢ్‌లో ఆయన ఇలాకా ఉంది - ఇక్కడికి ఇరవై కోసులు."

జ్వాలా ప్రసాద్ తన పినతండ్రి మాటలకేమీ సమాధానం చెప్పలేదు. ఆ మాటలు తాను విననట్టు నటించారు. అది గమనించి ఠాకుర్ వీరభానుసింగు అన్నారు: "తహసీల్దారుగారూ! రాజా సాహెబ్ నాకు మామగారవుతారు. ప్రతాపగఢ్ జిల్లాకు ఆయన ఇలాకాదారు. ప్రస్తుతం ఆయన చిక్కునపడి ఉన్నారు. చేతులు ఖాళీ చేసుకున్నారు. డబ్బు విషయంలో ఆసక్తి కూడా లేదు. కొంత పొలం ఠాకట్టులో ఉంది. మరి కొంత అమ్ముడు పోయింది. కాని చాలా ఠీవిగల మనిషి. ఆయన్ని మీరు చూస్తే చాలా ఆనందించేవారు."

జ్వాలా ప్రసాద్ అప్రసన్నంగా సమాధానం చెప్పారు: "అవును, ఆయన్ని కలిసికొనలేక పోవడం నాకు కూడా చాలా విచారంగానే ఉంది. ఆయన్ని గురించి ఇతరులు చెప్పగా కూడా విన్నాను. పోనీలేండి. ఇందుతో మునిగిపోయిందేముంది ? మీ బంధువులయినప్పుడు మరోసారి చూడవచ్చు. అది అలా ఉంచి మీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలని

వచ్చాను. మీరు శ్రమ అనుకోకుండా అయిదు నిమిషాలసేపు బయటికి రాగలరా ?"

ఒంటరిగా తీసుకెళ్ళి ఠాకుర్ వీరభానుసింగుతో జ్వాలా ప్రసాద్ చెప్పారు: "రామలాల్‌కు మీరిక్కడ సోరావ్‌లో ఉద్యోగం ఇప్పించకండి. అతను ఫతేపూర్ నుండి ఇక్కడికి రావడం నాకు ఇష్టం లేదు."

ఠాకుర్ వీరభానుసింగ్ ఆలోచిస్తూ అన్నారు: "దాదాపు అంతా నిర్ణయమయిపోయింది. మీరీ సంగతి నాకు ముందుగా చెప్పిఉంటే బాగుండేది. మీ మూలంగానే నేను దీనికోసం ప్రయత్నించాను."

"అలాగే నాకోసమే ప్రయత్నించండి - అతనేపరిస్థితిలో కూడా ఇక్కడికి రాకుండా ఉండేట్టు." జ్వాలా కొంచెం చిరునవ్వుతో అన్నారు: "మా బాబాయికి కూడా మీరు ఎక్కువ చనువియ్యకండి. మీతో ఇదే నా మనవి."

ఠాకుర్ వీరభానుసింగు కొంచెంసేపు ఆలోచించి అన్నారు: "తహసీల్దారుగారూ! నాకు మీ కుటుంబానికి సంబంధించిన విషయాలు అంత వివరంగా తెలియవు గదా! కాని నే నింతవరకు చేసిందంతా మీకోసం మీకు సహాయం చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే చేశాను. లేకుంటే నాకు వీళ్ళందరితో సంబంధమేముంది? ఇక మీరు వెళ్ళి నిశ్చింతగా ఉండండి."

జ్వాలా ప్రసాద్ బయటినుంచే వెళ్ళిపొయ్యారు.

ఆ రోజు సాయంత్రం జ్వాలా ప్రసాద్ జైదేయిని చూచేందుకు అలహాబాదు వెళ్ళాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఆ రోజు ఆఫీసు పని చేసేందుకు కూడా ఆయన మనస్సు ప్రసన్నంగా లేదు. ఇంటికి వచ్చేసరికి భారతయుద్ధం జరుగుతున్నది. శ్యామలాల్ భార్య తన్నులుతింటూ కేకలు పెడుతూ ఏదేదో అంటున్నది: "చెప్తాను. వెయ్యి సార్లు చెప్తాను. నా కాళ్ళకు ఉన్నవే నాలుగందెలు. అవికూడా అరిగిపొయ్యాయి. ఎన్నిసార్లు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోరు. పెద్దకోడలికి సొమ్ములమీద సొమ్ములు చేయిస్తున్నారు."

జ్వాలా ప్రసాద్ తన బాబాయి గది దగ్గరికి వెళ్ళి వాకిట్లోనే నిలబడి అడిగారు: "బాబాయ్, ఏమిటివంతా! ఒక ఆడ కూతుర్ని ఇంతమంది మగాళ్ళు దావ గొడుకుంటే ఎంత అసహ్యంగా ఉంది! పాపం ఆమె ఒళ్ళంతా బద్దలయిపోతున్నది. దుర్మార్గానికి, కటికతనానికి కూడా ఒక హద్దంటూ ఉండాలా లేదా?"

మున్షీ రాధేలాల్ లోపలినుంచే సమధానం చెప్పారు: "పాపం! ఆమెను పాపంతల్చిన వాళ్ళకు పాపం. అది మనిషి కాదు, రాక్షసి. ఎప్పుడన్నా చూడు దానినోట ఛండాలపు తిట్లు! అత్తతో, తోడికోడళ్ళతో ఎప్పుడూ తగాదాలే. ఒట్టి ముదనష్టపు ముండ! అప్పుడప్పుడూ రెండుమూడు నెల్లకోసారి దానికి దేహశుద్ధి చెయ్యకపోతే లాభంలేదు. ఒంటరిగా ఎవ్వరూ దానిమీద చెయ్యి చేసుకోలేరు. మనల్నే అది పచ్చడి పచ్చడి చేసేస్తుంది."

జ్వాలా ప్రసాద్ చాలా ధైర్యం తెచ్చుకొని అనేశారు: "బాబాయ్, ఈ యింట్లో ఇలాంటివి జరగేందుకు వీల్లేదు. అది మాత్రం ఖాయం." ఈ మాటలు అంటూనే ఆయన త్వరత్వరగా తన గదిలోకి వెళ్ళిపొయ్యారు.

ఆరోజు రాత్రి జ్వాలా ప్రసాద్ అలహాబాదు వెళ్ళేసరికి లక్ష్మీచంద్ అక్కడనే ఉన్నాడు. ఆ రోజు మధ్యాహ్నమే అతను కాన్పూరునుండి అలహాబాదుకు వచ్చాడు. జైదేయికి మూడు రోజుల క్రితమే జ్వరం తగ్గిపోయింది. ఇప్పుడామె చాలా ఆరోగ్యంగానే కనబడుతూ ఉంది. అసలు జైదేయి జ్వాలా ప్రసాద్ కోసం ఎదురుచూస్తున్నట్టే ఉంది. జ్వాలా ప్రసాద్ బండిచప్పుడు వినబడగానే ఆమె వరాండాలోకి వచ్చింది: "రండి జ్వాలా బాబూ! ఈసారి అమ్మాయిని కూడా తీసుకరాలేదే!

మరునాడు కాక మూడోరోజు జైదేయిని, లక్ష్మీచందును, రాధను తీసుకొని జ్వాలా ప్రసాద్ సోరావ్ చేరుకున్నారు. వాళ్ళంతా వచ్చేసరికి కిషన్‌లాల్ బయట బావి ఒడ్డుమీద కూర్చుని పండ్లు తోముకుంటున్నాడు. లక్ష్మీచంద్, రాధ, జైదేయీలను చూడగానే అతను పండ్లుతోమే పుల్లను పారేసి అక్కడినుండి వెళ్ళిపోతున్నాడు. అతను వెళ్ళడంచూచి జ్వాలా ప్రసాద్ కేకపెట్టారు: "నీవెక్కడికి వెళ్ళుతున్నావు కిషన్! కొంచెం ఇలారా."

కిషన్ జ్వాలా ప్రసాద్ మాట వినిపించుకోకుండా పారిపోవడం మొదలు పెట్టాడు. జ్వాలా ప్రసాద్ బిగ్గరగా అరిచారు: "ఎవరక్కడ? ఈ కిషన్ని కొంచెం పట్టుకొండి."

బిషన్‌లాల్ అప్పుడే వ్యాయామశాలనుండి వచ్చేశాడు. జ్వాలా ప్రసాద్ కేకవిని అతను కిషన్‌లాల్ వెంట పరుగెత్తాడు. ఈలోగా కిషన్ని పోలీసులు పట్టుకున్నారు. బిషన్‌లాల్ వెళ్ళి అతన్ని పోలీసుల దగ్గర నుంచి విడిపించుకొని జ్వాలా ప్రసాద్ ముందుకు లాక్కొచ్చాడు. ఈ

గందరగోళంతో ఇంట్లోఉన్న రాధేలాల్, రామలాల్ బయటికి వచ్చారు. "ఏమిటయింది బిషన్? కిషన్ని అలా లాక్కొస్తున్నావెందుకు?" అని అడిగారు రాధేలాల్.

"జ్వాలన్నయ్య వీణ్ణి రమ్మని పిలిస్తే రాకపోగా పరిగెత్తి పారిపోతూ ఉన్నాడు. జ్వాలన్నయ్యా పట్టుకొండిరా వీణ్ణి, అని కేకేసేసరికి పోలీసులు వీణ్ణి అటకాయించారు. నేను పోలీసుల దగ్గరనుంచి వీణ్ణి తప్పించుకొని తీసుకొస్తున్నాను."

జ్వాలా ప్రసాద్ కిషన్‌లాల్‌తో అన్నారు: "అంత భయమెందుకు బాబాయ్! నంబరుదారు భార్య కొడుకునూ, కోడల్నీ తీసుకుని వచ్చారు. కిషన్‌లాల్ చేసిన పనికి వాడే మొహం పెట్టుకొని వస్తాడిక్కడికి? అయినా వాడికి దానికి శిక్ష లభించనే లభించింది. కాని లక్ష్మీచంద్‌ను గురించీ వాళ్ళ అమ్మను గురించీ లేనిపోని మాటలు కల్పించి మనకు చెప్పడం మాత్రం చాలా పొరపాటు. ఆ మాట వాడితో చెప్పేందుకే నేను పిలిపించాను."

"ఏం చేద్దాం. వీడు మన వంశానికే కళంకం తెచ్చేందుకు పుట్టాడు." మున్షీ రాధేలాల్ ఎంతో దీనంగా ఏడుపు ముఖం పెట్టుకొని అన్నారు: "లక్ష్మీచంద్! ఈ పనికిమాలిన వాడు చేసిన పనికి వాడి తరపున నేను క్షమాభిక్ష వేడుకుంటున్నాను. వాణ్ణి క్షమించు."

తన తండ్రి అన్న మాటలకు బిషన్‌లాల్ నవ్వాడు: "ఎంత మందిని ఇలా క్షమించమని అడుగుతావు నాన్నా! కిషనన్నయ్య మాత్రం మారేటట్టు లేడు. వీడు తాను చెడ్డ పేరు తెచ్చుకోడమే కాకుండా మన కందరికీ చెడ్డపేరు తెచ్చేందుకు పుట్టాడు."

యమున బయటికి వచ్చి జైదేయినీ, రాధనూ లోపలికి తీసుకెళ్ళింది. లక్ష్మీచందూ, రాధా ఆ సాయంత్రమే అలహాబాదు తిరిగి వెళ్ళి పోయినారు. జైదేయి మాత్రం యమున బలవంతం చేస్తే కొద్ది రోజులు సోరావ్‌లో ఉండి పోయింది. మరునాడు జ్వాలాప్రసాద్ కూడా క్యాంపు మీద వెళ్ళారు.

మూడు రోజుల తర్వాత జ్వాలా ప్రసాద్ క్యాంపు నుండి తిరిగి వచ్చే సరికి శ్యామలాల్ సోరావ్‌లోనే ఉన్నాడు. శ్యామలాల్ ఆయనతో చెప్పాడు: "అన్నయ్యా! రాజా సాహబ్ ఈ రోజు ఠాకుర్ వీరభాను ఇంటికి వచ్చారు. ముఖ్యంగా మీతో కలిసి మాట్లాడాలని అన్నారు."

"అవును, నాకు తెలుసు, ఆయన నాతో ముఖ్యంగా కలుసుకోవాలని

అనుకుంటారని. ఆయన బిజ్జూ గ్రామం నీ పేరిట పెట్టారు కదూ. ఆ విషయంలో నాతో మాట్లాడేందుకే ఆయన నన్ను కలుసుకోవాలని అనుకుంటున్నారనుకుంటాను.'' అన్నారు జ్వాలా ప్రసాద్.

అప్పటికి మున్షీ రాధేలాల్ కూడా అక్కడికి వచ్చారు. ఆయన ఆశ్చర్యంతో అడిగారు: "కాని నీకీ విషయం ఎలా తెలిసింది? నాకూ, శ్యామూకు తప్ప ఈ విషయం మరి ఇంకెవరికీ తెలియదే. ఠాకూర్ వీరభానుసింగుకు కూడా తెలియదు.''

"నాలుగయిదు రోజుల క్రితం అలహాబాదు నుంచి లాలా ఘన శ్యామదాస్ నా దగ్గరికి వచ్చారు. ఆయన దగ్గర రాజా సాహెబ్ మూడు గ్రామాలు తాకట్టు పెట్టారు. ఆ మూడింటిలో బిజ్జూ కూడా ఉంది. అందువల్ల ఆ విషయమంతా ఆయన చెప్పేశారు. అంతేకాదు, అనవసరంగా కోర్టుకెక్కి అపఖ్యాతిపాలు కావద్దని హెచ్చరించారు కూడా.''

రాధేలాల్ అన్నారు: "అరే, కేసు జరుగుతూనే ఉంది. రాజా సాహబ్ గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారు కూడాను. కాని ఆ కేసుతో మనకేం సంబంధం? కేసు నెగ్గకపోతే మిగిలిన రెండు గ్రామాలతోపాటు మన బిజ్జూ కూడా పోతుంది. లేకుంటే చెక్కు చెదరకుండా జమీందారీ చేతికి వచ్చేస్తుంది.''

"మరి ఆయన నాతో మాట్లాడేదేముంది?'' అని ప్రశ్నించారు జ్వాలా ప్రసాద్.

"నీవు ఆఫీసరువు కదా! ధనవంతులందరూ ఉద్యోగస్తుల్ని కలుసుకుంటూనే ఉంటారు. ఠాకుర్ వీరభానుసింగ్ ఈ రోజు రాత్రి విందు ఏర్పాటు చేసి మిమ్మల్ని పిలిచారు. అక్కడనే రాజా సాహబ్‌తో మాట్లాడడం కూడా అయిపోతుంది.''

జ్వాలా ప్రసాద్ అంతకుమించి తర్కించలేదు. ఆయన స్నానంచేసి భోంచేశారు. స్నానం, భోజనం అయ్యేసరికి మధ్యాహ్నం దాటిపోయింది. రాత్రి విందుకు యమునతో కూడా జ్వాలా ప్రసాద్ ఠాకుర్ వీరభాను సింగుగారి ఇంటికి వెళ్ళాలి. ఈ విషయం యమున కూడా ఆయనకు చెప్పింది. ఈ విందుకు వెళ్ళడం ఎలా తప్పించుకోవాలో ఆయనకు తోచడం లేదు. యమునతో అన్నారాయన: "నీవు బండి కట్టించుకొని ఠాకుర్ వీరభానుసింగుగారి ఇంటికి వెళ్ళు. నాకు బేచూ మిత్రతో

కొంచెం పని ఉంది. ఆయన్ని ఒక విషయంలో సలహా అడగాలి. ఆయన దగ్గరనుంచి నేను నేరుగా అక్కడికి వచ్చేస్తాను. ఈ విషయం నీవు ఠాకుర్ గారి భార్యకు చెప్పు."

యమున అన్నది: "అలాగే, కాని శ్యామూ భార్యకు అందెలు చేయించాలి. పాపం అందరూ ఆవిడనే వేధిస్తారు. సొమ్ముల దుకాణం దారిలోనే ఉంటుంది. కాబట్టి ఈ ఎనిమిది అందెలిచ్చి పదహారు అందెలు చేసి పెట్టమని చెప్పండి. దానికి పట్టే వెండి అతన్నే వెయ్యమనండి." ఆ మాట చెప్పి యమున శ్యామూ భార్య అందెలు జ్వాలా ప్రసాదుకిచ్చింది.

ఆ రోజు జ్వాలా ప్రసాద్ బేచూమిశ్రగారి ఇంటికి కాలి నడకనే బయలు దేరారు. దేవీదయాల్‌గారి సొమ్ముల దుకాణం బేచూమిశ్రగారి ఇంటికి వెళ్ళే దారిలోనే ఉంది. జ్వాలా ప్రసాద్ దేవీదయాల్‌గారి దుకాణం ముందు ఆగగానే దేవీదయాల్ లేచి ఆయన్ని లోపలికి రమ్మని ఆహ్వానించాడు: "తమరు శ్రమపడి స్వయంగా వచ్చేశారు. రేపటికల్లా తయారవుతుంది, వచ్చి తీసుకెళ్ళమని రామలాల్‌కు చెప్పాను."

"ఏమిటి తయారయేది?" జ్వాలా ప్రసాద్ ఆశ్చర్యంగా అడిగారు.

"అదేనండీ, మీ వాళ్ళకు చంద్రహారం చేయిస్తున్నారు. చూడండి, ఎంత చక్కగా ఉందో! ఇంకా మెరుగు పెట్టలేదు. మెరుగు పెట్టిన తర్వాత చూడండి, ఎలా ఉంటుందో!" అంటూ దేవీదయాల్ ఒక చక్కని చంద్రహారం బయటికితీసి జ్వాలా ప్రసాద్‌కు చూపించాడు.

జ్వాలా ప్రసాద్ ఆ గొలుసును అటూ ఇటూ తిప్పి చూచి అడిగారు· "దీని తూకమెంత ఉంటుంది?"

"మొత్తం ఒకటింపావు తులం ఉంటుంది. కాని చూచేందుకు అయిదు తులాలకు పైగా ఉన్నట్టు కనిపిస్తుంది. అలహాబాదులో శ్రీమంతులందరూ నా దగ్గరనే చంద్రహారం చేయిస్తారు. మా పనివాడంటే ఈ చుట్టు పక్కల అంతా పేరు" దేవీదయాల్ సగర్వంగా చెప్పాడు.

జ్వాలా ప్రసాద్ కొంచెంసేపు ఆలోచించి అడిగారు: "ఇటీవల మా యింట్లోకని ఏమయినా సొమ్ములు చేసిచ్చావా?"

"అదికూడా అడగాలా బాబయ్యా! శ్రీమంతులూ, ఉద్యోగస్తులూ సొమ్ములు చేయిస్తూనే ఉంటారు. దాన్ని గురించి అంత ఆలోచించే దేముంటుంది? ఇంతవరకు నేను చేసిన సొమ్ములన్నీ రామలాల్‌గారే

స్వయంగా వచ్చి తీసికెళ్ళారు. డబ్బు విషయంలో ఆయన మహా గట్టి వాడండోయ్!'' అంటూ దేవీదయాల్ నవ్వాడు.

"సరేకాని, ఆ లెక్క ఏదో నేను కూడా చూడాలి. డబ్బు నేనే ఇయ్యాలి కదా! అవునా కాదా?'' అన్నారు జ్వాలా ప్రసాద్.

"తమరు ప్రభువులు. ఈ రూపాయణాల లెక్క మీకెందుకండీ! సంవత్సరం మొత్తంమీద అయిన రొక్కం ఒక్కసారే తీసుకొంటాం. తమలాంటి శ్రీమంతుల దగ్గర దీపావళికి ముందు బిల్లు పంపించు కొంటాను. రెండు మూడు వందల రూపాయలు తమకొక లెక్కా. చేతి చిలుము వదిలినట్టుంటుంది.''

శ్యామూ భార్య అందెలు జ్వాలా ప్రసాద్ దేవీదయాల్‌కు ఇస్తూ అన్నారు: "రేపు మధ్యాహ్నంలోగా పదహారు అందెలు చేసి రేపటివరకు అయిన మొత్తం లెక్క తీసుకొని నా దగ్గరకు రావాలి. అందులో మళ్ళీ పొరపాటేమీ ఉండకూడదు. నేనెక్కడా అప్పు పెట్టననే విషయం నీకు తెలుసు గదా!''

పధ్నాలుగు

మరునాడు జ్వాలా ప్రసాద్ చాలా ఆలస్యంగా నిద్రలేచారు. నిద్ర లేచి కండ్లు తెరిచేసరికి కొద్దిగా తలనొప్పి అనిపించింది. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి ఆరంభించిన వర్షం కొద్దిగా తగ్గు మొహం పట్టింది. వాతావరణంలో అదోరకమైన ఉల్లాసం కనిపిస్తూ ఉంది. కైదేయి పూజ ముగించుకుని యమున దగ్గర కూర్చుని రాత్రి విందు విశేషాలు వింటున్నది.

ఆ రోజు ఆదివారం. కచ్చేరీకి సెలవు. బంట్రోతు ఆఫీసుకు వచ్చిన ఉత్తరాలు తహసీల్దారుగారి ఇంటికే తెచ్చి ఇచ్చాడు.

జ్వాలా ప్రసాద్ తన పని ముగించుకుని స్నానం చేసేసరికి పది గంటలయింది. మబ్బులు తేలిపోతున్నాయి. సూర్యభగవానుడు మధ్య

మధ్య కనిపిస్తూ ఉన్నాడు. జ్వాలా ప్రసాద్ ఫలహారం చెయ్యనని చెప్పే శారు. తన ఆఫీసు గదిలో కూర్చుని ఆయన ఉత్తరాలు చూచుకుంటున్నారు. మున్షీ రాధేలాల్‌ని రమ్మని ఆయన భీఖూ ద్వారా కబురుచేశారు.

మున్షీ రాధేలాల్ శ్యామలాల్‌ను తీసుకొని రాజా సాహబ్‌ను చూచేందుకు బయలుదేరబోతున్నారు. ఇంతలో భీఖూ వెళ్ళి ఈ మాట చెప్పాడు. మున్షీ రాధేలాల్ శ్యామలాల్ని తీసుకొని జ్వాలా ప్రసాద్ గదిలోకి వచ్చారు. శ్యామలాల్ని చూచి జ్వాలా ప్రసాద్ అన్నారు: "నీవు కూడా రావడం మంచిదయింది. బాబాయ్! నిన్న నేను రాజా సాహబ్ సరోహన్‌తో మాట్లాడాను. ఆయన వకీలు బాబూ బటేశ్వరీ ప్రసాద్ కూడా ఆయన ప్రక్కనే ఉన్నారు."

"అవును, బటేశ్వరీ బాబూ మన ఫతేపూర్ వాడే. సీమకు వెళ్ళి వచ్చారని ఆయన కులం వాళ్ళు ఆయన్ని వెలివేశారు. కాని చాలా పేరు ప్రఖ్యాతులుగల వకీలు. అలహాబాదులో ఆయనకొక పెద్ద భవంతి ఉంది."

"అవును, ఆయన నాకా విషయాలన్నీ చెప్పారు. చాలా ఆప్యాయంగా మాట్లాడారు. కూర్చోండి, తొందర పనేమన్నా ఉందా?"

"అబ్బే, అంత తొందరేమీ లేదు. శ్యామూ, నేనూ కలిసి రాజా సాహబ్ దగ్గరికి వెళ్ళాలని బయల్దేరుతున్నాం. ఆయన ఈ రోజు సాయంత్రం సరోహన్ వెళ్ళుతున్నారు. వెళ్ళేలోగా ఆయన్ని ఒకసారి చూచివద్దామని. అంతకంటె మరేం లేదు."

"ఇంకా సాయంత్రం అయేందుకు చాలా వ్యవధి ఉంది. మీతో కొన్ని ముఖ్యమయిన విషయాలు మాట్లాడాలి."

మున్షీ రాధేలాల్ కూర్చున్నారు. శ్యామలాల్ అన్నారు: "నేను కూడా ఉండాలా? నేను వెళ్ళిపోతే మీకభ్యంతరం లేదు కదా!

"లేదు, నీవు వెళ్ళవచ్చు. నేను మాట్లాడాల్సింది బాబాయితోనే."

శ్యామలాల్ వెళ్ళిపోయిన తరువాత జ్వాలా ప్రసాద్ రాధేలాల్‌తో అన్నారు: "బాబాయ్, నాన్నగారు ఎందుకు చనిపొయ్యారో, ఎలా చని పొయ్యారో మీకు తెలుసా?"

మున్షీ రాధేలాల్ తడుముకుంటూ అన్నారు: "అవును, నీవే కదా చెప్పావు. ఆయన కింద పడ్డారు. నీళ్ళ కుండ ఆయన తలమీదపడి పగిలిందని."

"కాదు. ఆయనే నీటికుండను తలమీద వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు." జ్వాలా ప్రసాద్ నిష్కరుణంగా అన్నారు: "మీకందరికీ ఈ విషయం తెలుసు. ఆయన ఒళ్ళు తెలియని కోపంలో నీటికుండను తన తలమీద వేసుకున్నారు. మీరు పన్నిన మాయాజాలంలో చిక్కి నేను అబద్ధం ఆడేందుకు సిద్ధపడలేదని ఆయనకు కోపం వచ్చింది."

మున్షీ రాధేలాల్ అన్నారు: "అయిపోయిందేదో అయిపోయింది. ఆ కేసులో కూడా మనం ఓడిపోయినాం. ఇప్పుడా కథంతా మళ్ళీ ఎందుకు? నిన్ను బలవంతం చెయ్యడం ఆయనదే పొరపాటు."

"బాబాయ్, ఆ విషయమంతటితో అయిపోలేదు. సరోహన్ రాజాగారు శ్యామలాల్ పేరిట ఈ బిజ్జూ గ్రామం వ్రాసి యిచ్చారే, దానికిగాను బలి కావలసిన దెవరూ అని మిమ్మల్ని అడుగుతున్నాను."

"దానికి నీకూ సంబంధ మేముందసలు? రాజాగారు, శ్యామలాలూ ఆ సంగతి చూచుకుంటారు. దానికోసం నిన్ను అబద్ధం చెప్పమని ఎవరంటున్నారు? ఏ తగాదా లేకుండా జమీందారీ దానంతట అదే వచ్చేస్తుంది. ఇంటికి వచ్చిన లక్ష్మిని నిరాకరించరాదని శాస్త్రాలు కూడా చెప్తున్నాయి."

జ్వాలా ప్రసాద్ ఏదో చెప్పబోతూ ఉన్నారు, కాని మధ్యలో ఆగిపోయారు. దేవీదయాల్ పదహారు అందెలూ, లెక్క కాగితం తీసుకొని వచ్చి గది బయట నిలబడి ఉన్నాడు. జ్వాలా ప్రసాద్ బయటికి తొంగి చూస్తూ అన్నారు: "ఎవరు? దేవీదయాల్, లోపలికి రా."

దేవీదయాల్ చేతిలోనుంచి అందెలు తీసుకుంటూ జ్వాలా ప్రసాద్ భీఖాను పిలిచారు. భీఖా గది ప్రక్కనే నిలబడి ఉన్నారు. వేంటనే అతను గదిలోకి వచ్చాడు.

అందెలను భీఖాకిచ్చి జ్వాలా ప్రసాద్ అన్నారు: "ఈ అందెలు మీ వదినె కిచ్చిరా. వస్తూ, వస్తూ, రామూను కొంచెం పిలుచుకురా. నేను పిలిచానని చెప్పు."

"వాడెందుకూ!" అని అడిగారు మున్షీ రాధేలాల్ సందేహిస్తూ.

"రామూ అన్నయ్య దేవీదయాల్‌గారి దుకాణంలో కొన్ని సొమ్ములు చేయించారు. ఇదిగో దాని తాలూకు లెక్క." జ్వాలా ప్రసాద్ చాలా స్తిమితంగా సమాధానం చెప్పారు.

రాధేలాల్ దేవీదయాల్ వైపు తిరిగి అన్నారు: ఏమోయ్! ఇది

రామలాల్ స్వంత ఖాత. తహసీల్దారుగారికి దీనితో సంబంధమేమిటి?”

దేవీదయాల్ సమాధానం చెప్పేలోగానే జ్వాలాప్రసాద్ అందుకున్నారు: “బాబాయ్, దేవీదయాల్‌కు రామలాల్‌తో ఏం సంబంధం. అతనికి తెలిసిన వాణ్ణి నేను. కొనడం - అమ్మడం అంతా తహసీల్దారుగారి ఇంటి కోసం అనే అందరూ అనుకుంటారు. కనుక ఆ బాధ్యతంతా నాది. అదిగాక ఇతనీ లెక్క నా దగ్గరికి తనంతట తనే తీసుకురాలేదు. నేను తీసుకు రమ్మంటేనే తెచ్చారు.” జ్వాలా ప్రసాద్ ఆ లెక్క కాగితం చూచుకున్నారు.

ఈలోగా రామలాల్ కూడా గదిలోకి వచ్చాడు. దేవీదయాల్ని చూస్తూనే రామలాల్ అన్నాడు: “ఏం షాహుకారు! తహసీల్దారుగారి దగ్గరికి ఈ లెక్కంతా ఎందుకు తెచ్చావ్? మా మాట మీద నీకు నమ్మకంలేదా?”

జ్వాలా ప్రసాద్ లెక్క కాగితం చదివారు. కాలి కడియాల జత తూకం నూట ఇరవై తులాలు. కంటె ఒకటికి తూకం నలభైఐదు తులాలు. వెండి ఇచ్చింది నలభై తులాలు. పైన వేసిన వెండి నూట ఇరవై అయిదు తులాలు. మొత్తం కిమ్మతు డెభై యైదు రూపాయలు. మజూరీ కంటెకూ, కడియాలకూ కలిపి తులానికి రెండణాలు చొప్పున ఇరవై రూపాయల పదణాలు. మొత్తం తొంభై రూపాయల పదణాలు. జ్వాలా ప్రసాద్ దేవీదయాల్ని చూచి అన్నారు: “ఏమోయ్, మరి చంద్రహారం ఖరీదు దీనిలో వేయలేదే?”

“అయ్యా! చంద్రహారం సాయంత్రానికల్లా తయారయి పోతుంది. రేపు చంద్రహారంతో పాటు దాని కిమ్మతు కూడా రాసుకొస్తాను. షుమారు అరవై రూపాయల దాకా దాని కిమ్మత్తు తేలవచ్చు.”

“మంచిది, ఇక నీవు వెళ్ళు. చంద్రహారంతో పాటు దాని లెక్క కూడా రేపుదయం నాకిచ్చేసేయ్.” అన్నారు జ్వాలా ప్రసాద్.

దేవీ దయాల్ వెళ్ళిన తర్వాత జ్వాలా ప్రసాద్ రామలాల్‌తో అన్నారు: “మొత్తం అన్నీ కలిసి నూట యాభైయైదు రూపాయల పదణాలు అవుతాయి. దేవీ దయాల్‌కు రేపుదయం ఈ పైకం ఇచ్చేసెయ్యాలి. కనుక నూట యాభైయైదు రూపాయలు మీరు నాకు తెచ్చియండి.”

రామలాల్ తన తండ్రి వైపు చూచాడు. రాధేలాల్ సమాధానం చెప్పారు: “రామూ దగ్గర డబ్బెక్కడ ఉంది? నెలకు పన్నెండు

రూపాయలు చొప్పున వాడు తన జీతమంతా దేవీ దయాల్‌కు ఇస్తూ పోతాడు. ఒక సంవత్సరంలో అప్పు తీరుతుంది.''

''కాని జీతం వచ్చేందుకు ఇతనికిక్కడ ఉద్యోగమేది?'' జ్వాలా ప్రసాద్ అడిగారు.

''ఒకటి రెండు రోజుల్లో ఉద్యోగం ఇచ్చినట్టు ఉత్తర్వు వచ్చేస్తుంది.'' అన్నాడు రామలాల్.

''ఈ ఉత్తర్వు రావడం కల్ల. రేపు సాయంత్రానికి మీరు ఫతేపూర్ వెళ్ళిపోతున్నారు, సకుటుంబంగా. అర్థమయిందా? అక్కడికి వెళ్ళి ఉన్న ఉద్యోగం జాగ్రత్తగా చూచుకొండి.''

జ్వాలా ప్రసాద్ చెప్పే మాటలు విని మున్షీ రాధేలాల్ బిక్క మొహం వేశారు. కాని రామలాల్‌కు జ్వాలా ప్రసాద్ ధోరణి నచ్చలేదు: ''అంటే మీరు నన్నూ, నా కుటుంబాన్నీ ఇక్కడినుంచి వెళ్ళ గొడుతున్నారన్న మాట!''

జ్వాలా ప్రసాద్ ఉద్రేకంతో అన్నారు: ''నేను మిమ్మల్ని వెళ్ళగొడుతున్నానని మీరనుకుంటున్నారు. కాని మీరుండవలసిన చోటికి మిమ్మల్ని పంపిస్తున్నానని నేననుకుంటున్నాను. మీకు ఫతేపూర్‌లో ఉద్యోగం ఉంది. శ్యామలాల్‌కు ఆస్తి, పొలం ఉంది. బాబాయి అన్ని పన్లూ జాగ్రత్తగా చూచుకుంటారు. కిషన్‌లాల్‌కు పెండ్లిచేసి మీ అండదండల్లో వాణ్ణి సరియైన మార్గంలో పెట్టండి.''

రాధేలాల్ కెవ్వున కేకపెట్టారు: ''ఎక్కడ ఉన్నావురా అన్నయా! వింటున్నావా మనవాడి మాటలు? హాయిగా స్వర్గంలోకి వెళ్ళి కూర్చున్నావు. మమ్మల్ని నరకంలో పారేసి పోయినావు. నాశనమయిపోతాడు జ్వాలా! జ్వాలా నాశనమయి పోతాడు.'' ఈ మాటలంటూ మున్షీ రాధేలాల్ రెండు చేతులతో తల మోదుకొన సాగారు.

ఇల్లంతా గగ్గోలయి పోయింది. అన్ని మూలలనుండి జనం పోగయినారు. జనం గుమిగూడేకొద్దీ మున్షీ రాధేలాల్ జ్వాలా ప్రసాద్‌ను తిట్టే స్థాయి మరింత హెచ్చుతూ ఉంది. ఈ లోగా లోపలి నుంచి జైదేయి వచ్చి జ్వాలా ప్రసాద్ గదిలోకి వెళ్ళింది. జ్వాలా ప్రసాద్ చెయి పట్టుకొని ఆమె అయన్ని లేవదీసింది: ''ఇక్కడినుండి వచ్చేసెయ్యండి అరుచుకోనియ్యండాయన్ని'' అని లోపలికి తీసుకుపోయింది.

జ్వాలా ప్రసాద్ లోపలికి వెళ్ళి తలుపులు వేసుకున్నారు. కాని ఏం జరిగినా సరే మున్షీ రాధేలాల్ కంఠస్థాయి మాత్రం తగ్గలేదు. ఆయన కేకలుపెట్టి నోటికి వచ్చినట్టు చెడా మడా జ్వాలా ప్రసాద్‌ను అనరాని మాటలు అంటున్నారు. కొంతసేపటికి రామలాల్ కూడా రాధేలాల్‌తో కలిసి తిట్టడం మొదలుపెట్టాడు.

పదిహేను నిమిషాలు భీఖూ మాట్లాడకుండా ఈ తమాషా చూస్తూ ఉన్నాడు. ఆ తర్వాత ఊరుకోలేక రామలాల్ దగ్గరికి వెళ్ళి అతని చెయ్యి పట్టుకొని అన్నాడు: "మీ అబ్బను తీసుకొని మర్యాదగా లోపలికి వెళ్ళు. ఇక్కడ ఇలా నాటక మాడేందుకు వీల్లేదు."

రామలాల్ భీఖూను ఇష్టం వచ్చినట్టు అసహ్యమైన మాటలు మాట్లాడుతూ స్థాయి హెచ్చించాడు. ఇప్పుడు భీఖూకు కోపం వచ్చింది. రామలాల్‌తో అన్నాడతను: "నోరు మూసుకొని లోపలికి వెళ్ళుతారా లేకుంటే జవాన్లను పిలిపించి మరమ్మతు చేయించాలా? జ్వాలా బాబు తిండి తిని ఆయన్నే ఆడిపోసుకుంటున్నారా? అంతమాత్రం విశ్వాసం లేదు మీకు!"

అప్పుడు భీఖూ వెనుక సజంగా ఇద్దరు జవాన్లు నిలబడి ఉన్నారు. ఆ సంగతి మున్షీ రాధేలాల్ గమనించారు. రాధేలాల్ రామలాల్ చెయ్యి పట్టుకొని అన్నారు: "రా రామూ! అప్పుడే ఏమయింది. వీళ్ళు మనల్ని వీళ్ళచేత కొట్టిస్తారు కూడా! పద, వెళ్ళుదాం. ఇవ్వాళే ఇక్కడినుంచి వెళ్ళిపోదాం. ఈ పాపిష్ఠి యింట్లో ఇక నేను మెతుకు ముట్టను. ఒక్క గుక్క కూడా నీళ్ళు తాగను. అమ్మకూ, అమ్మాయికీ మన సామానంతా కట్టేసేయ్యమని చెప్పు. శ్యామూ, కిషన్ ఎక్కడున్నారో వెతుక్కొని రండి." రాధేలాల్ రామలాల్ని తీసుకొని లోపలికి వెళ్ళారు.

రాధేలాల్, రామలాల్ లోపలికి వెళ్ళిపోయిన తర్వాత బయటి అలజడి తగ్గిపోయింది. కాని లోపల అలజడి హెచ్చింది. సామాన్లు విసిరికొట్టడం ఒకరినొకరు తిట్టుకోడం, అందరూ కలిసి ఎవరినో తిట్టడం మొదలయినవన్నీ ఆరంభమయినాయి. ఇదంతాచూచి జైదేయికి విసుగు పుట్టి జ్వాలా ప్రసాద్‌తో చెప్పింది: "జ్వాలా బాబూ! ఇంట్లో చాలా చిరాకుగా ఉంది. లేకుంటే మీరు అలా ఎక్కడికయినా వెళ్ళిరండి. అక్కడ పరిస్థితి అంత కంతకూ శ్రుతి మించుతూ ఉంద."

"కాని తిండి సంగతి ఎలా అని చూస్తూన్నాను" అన్నారు జ్వాలా ప్రసాద్.

"తిండికి సంబంధించిన వరకు ఈరోజు ఏకాదశి అనుకుంటే సరి పోతుంది" అన్నది జైదేయి నవ్వుతూ: "ఒక బెడదను శాశ్వతంగా వదిలించుకొనేందుకు ఒకరోజు ఉపవాసం చేస్తే మాత్రం తప్పేముంది? అసలీ రోజు అందరికీ ఉపవాసమే అయ్యేటట్టుంది."

జ్వాలా ప్రసాద్‌కు కూడా నవ్వు వచ్చింది: "లేదు వదినెగారూ! అలా ఉపవాసం ఉన్నందువల్ల లాభం లేదు." తర్వాత కొంతసేపటికి ఆయన యమునతో అన్నారు: "నీవూ, ఛింకీ అలా వరాండాలోకి వెళ్ళి ఏం జరుగుతున్నదో చూడండి. వదినెగారూ! లేకుంటే మీరు కూడా వీళ్ళతో వెళ్ళండి. నేనీలోగా నా గదిలోకి వెళ్ళి ఆఫీసు ఉత్తరాలు చూచు కుంటాను." అంటూ జ్వాలా ప్రసాద్ తన గదిలోకి వెళ్ళారు.

వంట గదిలో శ్యామలాల్ భార్య నిర్లిప్తంగా వంట చేసేస్తున్నది. తిట్టు కోడం, కొట్టుకోడం, ఏడవడం అదంతా రామలాల్ భార్య, రాధేలాల్ భార్య వరకే పరిమితమై ఉంది. మున్షీ రాధేలాల్ పెద్దగా కేకలు పెడుతున్నారు: "నేను మెతుకు ముట్టను, గుక్కెడు నీరు కూడా తాగను. ఆకలి దప్పులతో ఇక్కడనే ప్రాణాలు విడుస్తాను. అన్నయ్య ప్రాణాలు వీడే తీశాడు. నేను కూడా వాడి చేతిలోనే పోతాను. అనుభవించనీ వాణ్ణే ఈ తహసీల్దార్ గిరినీ, ఈ భోగ భాగ్యాలనూ, ఈ ఉద్యోగ తీవిని. వీడికి నరకంలో కూడా చోటు దొరకదు."

ఛింకీ సహించలేక పోయింది. అది మున్షీ రాధేలాల్ దగ్గరికి వెళ్ళి అన్నది: "ప్రాణాలు విడవదలుచుకుంటే ఇప్పుడే విడిచేసేయి. ఇలా తిట్టడంవల్ల ప్రాణాలు పోవు. ఇలాంటి పనులు చేయడం వల్లనే ఇప్పుడిలా అయింది. అంత మొనగాడివయితే ప్రాణాలియ్యి చూద్దాం. నేను కూడా చూస్తాను ఎలా ఇస్తావో!"

విషయం చాలా విషమించింది. విషమించడమే కాదు బెడిసింది - అనే విషయం రాధేలాల్ భార్యకు ఇప్పుడర్థమయింది. మున్షీ రాధేలాల్ ఛింకీని కూడా ఇష్టం వచ్చినట్టు ఎలుగెత్తి తిట్టడం మొదలు పెట్టాడు. కన్నీరు తుడుచుకుంటూ రాధేలాల్ భార్య అన్నది: "ఏమే ఛింకీ! ఇంత

ధైర్యం వచ్చిందికే నీకు – చిన్నా పెద్దా లేకుండా ఇలా మాట్లాడు తున్నావు!"

"లేకేం, ఈయనకు నేను భయ పడేదేముంది? ఈయనేమన్నా నాకు పెట్టిపోస్తున్నాడా? మా అబ్బాయి జ్వాలా బాబును ఆడిపోసుకుంటుంటే మేము చూస్తూ ఊరుకోమా? జ్వాలా బాబును అన్ని విధాలా వేధిస్తూ ఉన్నారు. ఇక అలా చేసేందుకు వీల్లేదు. ఇల్లూ, వాకిలీ అంతా ఉంది. అక్కడికి వెళ్ళి ఉండమన్నాడు జ్వాలా బాబు. దానికింత కోపమెందుకు? ఏదన్నా తప్పు మాటన్నాడా? పొలం కొని యిచ్చాడు, చేతయినంత వరకూ సాయం చేస్తూనే ఉన్నాడు. అప్పటికీ తృప్తి లేదాయె. ఆయన ప్రాణం విసిగిస్తున్నారు, అదంతా వీల్లేదు."

రాధేలాల్ భార్య రాధేలాల్ని మాట్లాడ నియ్యలేదు: "ఇలా నోరు పారేసుకున్నందువల్ల లాభం లేదు. ఇక ఫతేపూర్ వెళ్ళి ఏర్పాటు చూచు కోవడం మంచిది. మెల్లగా తప్పించుకు పోవడం మంచిది. ఊరికే ప్రాణాలు తీసికోవడం వల్ల ప్రయోజన మేముంది?"

రాధేలాల్ మండి పడ్డారు: "నేనంత సులభంగా ప్రాణాలు తీసుకుం టానా? కాని మనం ఈ సాయంత్రంలోగా ఈ పాపిష్ఠి కొంప వదిలిపెట్టి తీరాలి. ఈ కొంపలో నేనిక అన్నం తినను, మీరెవ్వరూ తినేందుకు కూడా నేనొప్పుకోను. శ్యామూ భార్యను వంటింట్లో నుంచి బయటికి వచ్చెయ్యమని చెప్పు."

శ్యామలాల్ భార్య త్వర త్వరగా రొట్టెలు కాలుస్తూ ఉన్నది. రాధేలాల్ భార్య ఆజ్ఞాపించకముందే ఆవిడ యమున చెవిలో చెప్పింది: "వంటంతా చేసేశాను. నీవేం దిగులు పడకు అక్కా! ఇక వెళ్ళి ఫతేపూర్ వెళ్ళేందుకు ఏర్పాటు చేస్తాను."

ఉన్నట్టుండి యమునకు శ్యామలాల్ భార్యకు తాను చేయించిన అందెల సంగతి జ్ఞాపకం వచ్చింది. ఆమె శ్యామ్‌లాల్ భార్యతో చెప్పింది: "నీ అందెలు తయారయి వచ్చాయి. ఇదిగో ఇప్పుడే తీసుకొని వస్తా నుండు."

అప్పుడే రాధేలాల్ భార్య వంటింటి దగ్గరికి వచ్చింది: "లేచిరా యిక తల్లీ! వంట చేసినమటుకు చాల్లే. ఇక వెళ్ళి సామాను కట్టేసేయి." శ్యామలాల్ భార్యతో ఈ మాట చెప్పి రాధేలాల్ భార్య అటునుంచి అటే వెళ్ళిపోయింది.

శ్యామలాల్ భార్య యమునకోసం ఎదురు చూస్తూ ఉంది. యమున పదహారు అందెలు తీసుకొని వచ్చి ఆమెకిచ్చే సరికి ఆమె ముఖం చేటంత యింది. త్వర త్వరగా అందెలు వేసుకొని ఆమె యమునతో అన్నది: "పోనీలే అక్కా! వీళ్ళు వెళ్ళిపోతే మీ ప్రాణాలకు హాయిగా ఉంటుంది."

ఈలోగా మళ్ళీ రాధేలాల్ భార్య కేక వినిపించింది: "ఇంకా ఏం చేస్తున్నావే? వంట చాలించేసి బయటికి రమ్మని చెప్పలేదూ! కట్టాల్సిన సామానంతా అలాగే ఉంది."

శ్యామలాల్ భార్య అక్కడినుంచే సమాధానం చెప్పింది: "ఇప్పుడే వస్తున్నా నత్తయ్యా! కొంచెం కాళ్ళూ చేతులూ కడుక్కొని వస్తున్నాను." ఆమె యమునతో మళ్ళీ చెప్పింది: "నిన్ను వదలి పోవాలంటే నాకు చాలా దిగులుగా ఉందక్కయ్యా! కాని మేమంతా వెళ్ళడమే మీకు మంచిది. ఆ విషయం నాకు బాగా తెలుసు." అలా అంటూనే ఉంది. శ్యామలాల్ భార్యకు కండ్లల్లో నీళ్ళు నిండాయి.

శ్యామలాల్ భార్య అలా కంట తడిపెట్టు కొనడం చూచి యమునకు జాలి వేసింది. ఆమె శ్యామలాల్ భార్యను కౌగలించుకొంది. తన కాలి గొలుసు తీసి ఆమె కిస్తూ అన్నది: "నీకు నేనేమీ సొమ్ములు చేయించలేదు. ఇదిగో నా కాలి గొలుసు తీసుకెళ్ళు. నేను మరొకటి చేయించుకుంటాను. జాగ్రత్తగా దాచుకో దీన్ని. వీళ్ళు నిన్నెప్పుడైనా బాధిస్తే ఏదో విధంగా నాకు కబురు చెయ్యి."

శ్యామలాల్ భార్య త్వర త్వరగా ఆ గొలుసు తన పైట కొంగున మూట కట్టుకుని యమున కాళ్ళకు నమస్కరించింది. ఆ తర్వాత ఆమె చాలా వేగంగా అక్కడినుండి వెళ్ళి పోయింది.

మధ్యాహ్నమయింది. జ్వాలా ప్రసాద్‌గారి ఇంట్లో అంతా నిశబ్దంగా ఉంది. మున్షీ రాధేలాల్ వాళ్ళు భోజనం చెయ్యమంటే చెయ్యమని అలిగి కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ తన గదిలో ప్రశాంతంగా కూర్చోలేక పొయ్యారు. బండి కట్టించుకొని ఆయన పక్క ఊళ్ళో స్నేహితుడి దగ్గరికి వెళ్ళారు. అక్కడినుండి మధ్యాహ్నని కల్లా తిరిగి వచ్చారు. ఈలోగా శ్యామలాల్, కిషన్‌లాల్ కూడా వచ్చేశారు. అందరూ సామాను సర్దుకోడంతో సతమతమవుతున్నారు.

యమున జ్వాలా ప్రసాద్‌ను భోజనానికి రమ్మని పిలిచింది. ఆయన

భోజనాల గదిలోకి వెళ్ళి చూచేసరికి అక్కడ యమున తప్ప ఇంకెవ్వరూ లేరు. ఇంట్లో నిశబ్దంగా ఉంది. "మిగిలిన వాళ్ళంతా ఎక్కడ ? వాళ్ళు భోం చెయ్యరా ?" అని అడిగారాయన.

యమున సమాధానం చెప్పేలోగానే వంటింటి వాకిలి పక్కనే నిలబడి ఉన్న ఛింకీ చెప్పింది: "చిన్నయ్యగారు నేనిక ఈ యింట్లో అన్నం తిననని ఒట్టు పెట్టేసుకున్నారు. తను పెట్టుకుంటే పెట్టుకున్నారు. కాని ఇంట్లో అందరిచేత అలాగే ఒట్టు పెట్టించారు. అదేం న్యాయం చెప్పండీ ?"

జ్వాలాప్రసాద్ వడ్డించిన పళ్ళెం వదిలి లేచారు. చేతులు, ముఖం కడుక్కొని ఆయన రాధేలాల్ గదిదగ్గరికి వెళ్ళి బయటనే నిలబడ్డారు. ఆయన రాధేలాల్‌తో ఏం మాట్లాడ లేదు. రాధేలాల్ భార్యతో అన్నారు: "పిన్నీ ! మీరంతా ఈ ఇంట్లో భోం చెయ్యమని ఒట్టు పెట్టుకున్నారా ? అది న్యాయమేనా ?"

ఈ ప్రశ్నకు సమాధానం రాధేలాల్ చెప్పారు: "అవును. మమ్మల్ని ఇంత అవమానం చేసిన తర్వాత ఈ యింట్లో మేము ఏ మొహం పెట్టుకొని భోంచేస్తాం ? మా దృష్టిలో నీవు చనిపోయినట్టే లెక్క."

జ్వాలా ప్రసాద్ వెనకనేవచ్చి నిలబడ్డ ఛింకీ ముందుకు వచ్చి అన్నది: "పోయింది నీవూ, నీ పిల్లలూ! నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావు. మా అయ్యగార్ని ఇలా మాట్లాడి మీరేం తింటారో చూస్తాంగా !"

జ్వాలా ప్రసాద్ ఛింకీని గదుముతూ అన్నారు: "ఛింకీ ! నీవిక్కడి నుంచి వెళ్ళు. నీవు మళ్ళీనోరెత్తేవు జాగ్రత్త !" తర్వాత ఆయన రాధేలాల్ భార్యతో అన్నారు: "విన్నావు గదా పిన్నీ ! మీకు నేనిక బతికినవాడి కిందలెక్క కాదు. ఇక మీరు చూచుకొండి మీ కుటుంబం, మీ వంశం సంగతి. ఫతేపూర్‌లో మన ఇల్లూ, పొలం, ఆస్తి అంతా నేను చనిపోయి మీకు వీలు రాసిచ్చాననే అనుకోండి. ఇక నాకా యింటితోగాని, ఆస్తితోగాని ఏమీ సంబంధం లేదు."

రాధేలాల్ భార్య వెంటనే పరిగెత్తి వెళ్ళి జ్వాలా ప్రసాద్ కాళ్ళమీద పడింది: "అయ్యో బాబూ ! మేము బతికి ఇంకా అలాంటి రోజు కూడా చూడాలా ? బాబూ ! మమ్మల్ని క్షమించు. భగవంతుడు మాకేదో గొప్ప కష్టమే తెచ్చి పెడుతున్నాడు. అందుకే ఆయన మతి చెడిపోయింది. నిన్ను నేను నా కన్న కొడుకులాగా పెంచాను. నా మాటవిని ఆయన్ని

క్షమించు.” ఈ మాట అంటూనే రాధేలాల్ భార్య జ్వాలా ప్రసాద్ కాళ్ళు గట్టిగా పట్టుకుంది.

రాధేలాల్ భార్య జ్వాలా ప్రసాద్‌ను తన కన్న కొడుకు లాగా పెంచిన మాట నిజమే. జ్వాలా ప్రసాద్ కండ్లు చెమర్చాయి. తన కాళ్ళు పట్టుకున్న పిన్నిని వంగి లేవదీసి అన్నారు: “ఇదేమిటి పిన్నీ! నాకీ పాపం ఎందుకు ఒడిగడతావు? కోపంలో ఒళ్ళు తెలియక నే నన్న మాటలకు నేనే క్షమించమని అడుగుతున్నాను. బాబాయ్! ఈ కోపంవల్ల మనం సాధించ గలిగేదేమీ లేదు. నేను మీకు చెప్పిందంతా మీకూ నాకూ కూడా శ్రేయస్కరంగా ఉంటుందనే చెప్పాను. పిల్లలకు కష్టపడి శ్రమ చేసి నిజాయితీగా జీవించమని చెప్పండి. వాళ్ళు అలా పైకి వచ్చేందుకు నేను అన్ని విధాలా తోడ్పడుతాను. నా దగ్గర ఉన్నందువల్ల వీళ్ళంతా తిరుగు బోతులూ, సోమరులూ, మోసగాండ్రూ, దొంగలూ అయిపోతున్నారు. వాళ్ళ జీవితం చక్కబరచడం కూడా మీ కర్తవ్యమే కదా!”

రాధేలాల్ తాను ఉదయం నుంచి అన్న మాటలూ, చేసిన చేష్టలూ క్రోధావేశంలో చేసినవే అనే విషయం ఇప్పుడిప్పుడే బోధ పడుతున్నది. ఇప్పుడు అతనికి మనస్సులో పశ్చాత్తాపం కలుగుతూ ఉంది. ఆయన జ్వాలా ప్రసాద్ అన్న మాటలకు సమాధాన మేమీ చెప్పలేదు. కాని ఆయన కండ్లల్లో నుంచి అశ్రు బిందువులు రాలుతున్నాయి.

జ్వాలా ప్రసాద్ రాధేలాల్ చెయ్యి పట్టుకొని లేవదీశారు: “బాబాయ్! వెళ్ళి భోంచేద్దాంరా! మీరు భోంచెయ్యక పోతే ఇంట్లో ఇంకెవ్వరూ భోంచెయ్యరు. ఒక వేళ పొరపాటున నా నోట ఏదైనా పరుషమైన మాట వచ్చి ఉంటే నన్ను క్షమించండి.”

రాధేలాల్ మనస్సులోని ఆవేదన పొంగి పొంగి వస్తూ ఉన్నది. జ్వాలా ప్రసాద్‌తో పాటు ఆయన వంట గదిలోకి వచ్చి జ్వాలా ప్రసాద్ ప్రక్కనే కూర్చుని భోజనం చేశారు. భోజన సమయంలో ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: “అబ్బాయ్ జ్వాలా! నీ అన్నదమ్ముల సంగతి నీకు తెలియనిది కాదు. ఒకరిని మించిన నిష్ప్రయోజకులు మరొకరు. నీ దగ్గర ఉంచితే వాళ్ళు బాగుపడతారు కదా అనుకొన్నాను. కాని నేనలా అనుకోడం పొరబాటయింది. ఇక మా జీవితం ఎలా జరగాలనేదే ప్రశ్న.”

జ్వాలా ప్రసాద్ అన్నారు: “దానికేం బాబాయ్! పొలం కావలసినంత

కొన్నాం. రామూ ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు. కిషన్‌లాల్ని, శ్యామలాల్ని సాయంగా పెట్టుకొని మీరు పొలం పని చూస్తూ ఉండండి. మీకేమీ ఇబ్బందిలేకుండా జరుగుతుందని నేననుకుంటాను. ఏదయినా అవసరముంటే నాకు వ్రాయండి. నాకు చేతనయినంత వరకూ నేను సాయం చేస్తాను."

రాధేలాల్ కండ్లు చెమర్చాయి : "బాబూ ! నీ అండ మాకు చాలా అవసరం. నీవు మమ్మల్ని వదలిపెట్టకు."

సాయంత్రంలోగానే రాధేలాల్ గారి సామానంతా సర్దుకొని కట్టెయ్యడం అయిపోయింది. అందరూ భోంచేశారు. శ్యామలాల్ మూడు బండ్లు మాట్లాడారు. అవన్నీ వచ్చేశాయి. ఆ రోజు ప్రతాపగఢ్‌లో ఏదో కుస్తీల పోటీ ఉంటే బిషన్‌లాల్ అక్కడికి వెళ్ళాడు. సామానంతా బండ్లకెక్కించిన తర్వాత రాధేలాల్ భార్య జ్వాలా ప్రసాద్‌కు చేతులు జోడించి చెప్పింది: "అబ్బాయ్ జ్వాలా ! బిషన్ని చూడడం పడలేదు. వాడు ఒట్టి అమాయకుడు. కొంచెం వాడి సంగతి విచారిస్తూ వాణ్ణి కనిపెట్టి ఉండు."

"బిషన్ సంగతి మీరేం విచారించ నక్కర లేదు పిన్నీ ! ప్రపంచంలో వాడికి అయిష్టులంటూ ఉండరు."

బండ్లు బయలుదేరి అలహాబాదు వైపు వెళ్ళాయి. జ్వాలా ప్రసాద్ తన గదిలోకి వచ్చి కూర్చున్నారు. ఆయన మనస్సు తేలికపడింది. కాని ఆయనచుట్టు ప్రక్కలా ఏదో కరుణ బంధురమైన వాతావరణం ఏర్పడింది. ఒక సంవత్సరంనుంచీ ఇంట్లో ఉన్న అలజడి, చీకాకూ అంతా ఒక్క క్షణంలో అంతరించిపోయింది. ఎక్కడ చూచినా స్వచ్ఛమైన వాతావరణం కనిపిస్తూ ఉంది – కాని శుష్కంగా, నీరసంగా ఉన్నది. ఆయన మనస్సు తేలికగా ఉన్నదే కాని ఆయన ప్రాణానికి హాయిగా లేదు. లోపల ఏదో బాధగా ఉన్నది. ఆయన ఎంతోసేపు అలాగే ఆలోచిస్తూ కూర్చున్నారు. ఎప్పుడు చీకటి పడిందో ఆయనకు తెలియనే తెలియదు. ఉన్నట్టుండి ఆయన ఉలిక్కి పడ్డారు. వెనక్కు తిరిగి చూచేసరికి జైదేయి కనిపించింది. ఆమె ఆయన భుజంమీద చెయ్యివేసి ఆయన్ని కదిలించి చెపుతూ ఉంది: "లేవండి జ్వాలా బాబూ ! ఈ చీకటి గదిలో కూర్చుని ఏమిటి ఆలోచిస్తున్నారు ? బయటికి రండి."

జ్వాలా ప్రసాద్ చెయ్యి పట్టుకొని ఆమె పంచలోకి తీసుకువెళ్ళింది.

అప్పుడు యమున వంటగదిలో ఉంది. ఛింకీ ఆమెకు సాయం చేస్తూ ఉంది. పంచ నానుకొని ఉన్న లోపలి వరాండాలోనే భీఖూ గంగా ప్రసాద్‌కు పక్క అమర్చాడు. జైదేయి యమునను పిలిచింది: "యమునా! వంటగది వదలిపెట్టి ఈయన సంగతి కొంచెం విచారించు. కొంచెంసేపు ఇక్కడికి వచ్చి కూర్చో. పూరీ - కూరే గదా చేయాల్సింది! ఈలోగా ఛింకీ కూర చేస్తుంది. పూరీ మనమిద్దరం కలసి చేసేద్దాం."

యమున వంటగదిలో నుంచి బయటికి వచ్చింది. ఆమె కా సమయంలో ఎంతో హాయిగా ఉన్నట్టు తోచింది. భీఖూ గంగా ప్రసాద్‌ను తీసుకొని బయటికి వెళ్ళాడు. ఛింకీ వంటగదిలో కూర చేస్తూ ఉంది. జ్వాలా ప్రసాద్, యమున, జైదేయి ఏవో మాటల్లో దిగారు.

జైదేయి అన్నది: "జ్వాలా బాబూ! లక్ష్మి భార్యకు అయిదో నెల. కనేందుకు ప్రయాగకు తీసుకెళ్ళడమే మంచిదని నేనను కుంటున్నాను. అలహాబాదులో బంగళా కూడా తీసుకున్నాం కదా! లక్ష్మి కూడా అలహా బాదు, కాన్పూరు మధ్య తిరుగుతూ ఉంటాడు. ఘాటంపూర్ వెళ్ళేందుకు వాడికి తీరనే తీరదు."

యమున అన్నది: "అక్కా! నీవు కూడా అలహాబాదుకే వచ్చి ఉండ గూడదూ! ఘాటంపూర్‌లో ఏముంది, అంటి పెట్టుకొని ఉండేందుకు? పని వాళ్ళ మీద కాపురం జరుగుతుందా? నన్నడిగితే ఘాటంపూర్ వదిలేసి ఇక్కడ అలహాబాదులోనే వచ్చి ఉండడం మంచిది."

"అవును యమునా! లక్ష్మి కూడా అదే మాట చెప్తాడు. కాన్పూరులో గాని అలహాబాదులోగాని ఉండమంటాడు. కాన్పూరులో కూడా వాడొక పెద్ద ఇల్లు కొన్నాడు - వాళ్ళ నడుమ. కాని నాకా యిల్లంతగా నచ్చలేదు. ప్రయాగ పుణ్య క్షేత్రంకదా, అక్కడనే ఇక జీవిత శేషం గడుపుదామని ఒక్కొకసారి అనిపిస్తుంది."

"అవునక్కా! అదే మంచిది. పుణ్య క్షేత్రమే కాకుండా మనకు రాజధాని కూడాను. లక్ష్మి భార్య ఏమంటుంది?"

"దానికి కాన్పూరు మీదనే అభిమానం, దాని పుట్టిల్లు కాన్పూరేగా. కాని దాని ఇష్టాయిష్టాలకు పెద్ద ప్రాముఖ్య మేముంది? లేతవయస్సు. అమాయకురాలు! రెండుమూడు నెల్లతర్వాత నీవు అలహాబాదు వచ్చి లక్ష్మి భార్య కనేవరకూ నా దగ్గర ఒక నెలపాటు ఉండాలి. జ్వాలా బాబూ!

వింటున్నారా మేమనుకునేది. యమునను ఒక నెలపాటు అలహాబాదు నా దగ్గరికి పంపించాలి.''

''అలాగే, కావలిస్తే ఇప్పుడే మీతో తీసుకెళ్ళండి.'' అంటూ జ్వాలా ప్రసాద్ నవ్వారు: ''వదినెగారూ! మీకు మాపైన సంపూర్ణమైన అధికారం ఉంది.''

అప్పుడే జ్వాలా ప్రసాద్‌కు గంగా ప్రసాద్ భీఖూ మాటలు వినిపించాయి. భీఖూ అంటున్నాడు: ''ఇప్పుడే గదా స్కూళ్ళు తెరిచారు. ఒకటి రెండు నెలల దాకా చదువు చెప్పరు. ఇంటి దగ్గర కూడా అట్టే చదివే పని ఉండదు. వెళ్ళి భోంచేసి పండుకో. ఇంత ఉడక పోస్తూ ఈ గదిలో కూర్చుని ఎక్కడ చదువుతావు బాబూ!''

గంగా ప్రసాద్ దానికి చెప్పిన సమాధానం కూడా వినిపిస్తున్నది: ''వీల్లేదు. ఈసారి నేను క్లాసులో ఫష్టు రావాలి. నాలుగు మార్కులు తగ్గడంవల్ల పోయినసారి నేను సెకండు వచ్చాను. ఈసారి నన్నెవ్వరూ ఓడించలేరు.''

బైదేయి నవ్వింది: ''ఈ గంగూ మిమ్మల్ని కూడా మించుతాడు. కాని ఇక్కడ సోరావ్‌లో ఇతని చదువు ఎలా సాగుతుంది?''

జ్వాలా ప్రసాద్ ఉన్నట్టుండి ఉలిక్కి పడ్డాడు. గంగా ప్రసాద్ అయిదో తరగతి ప్యాసయి ఆరులోకి వచ్చాడు. సోరావ్‌లో ఆరో తరగతి తర్వాత ఇంగ్లీషు చదువు లేదు. ఆ తర్వాత గంగా ప్రసాద్‌ను బయటి కెక్కడికయినా చదువుకునేందుకు పంపాలి. ఈ విషయాన్ని గురించి తా నింతవరకు ఆలోచించనే లేదని జ్వాలా ప్రసాద్‌కు ఆశ్చర్యం వేసింది. గడచిన రెండు సంవత్సరాల నుండి ఈ సమస్యను గురించి ఆలోచించేందుకు ఆయనకు తీరిక లేకపోయింది. ఆయన అన్నారు: ''అవును వదినెగారూ! మీరు సరిగ్గా గుర్తుకు తెచ్చారు. గంగూ చదువును గురించి నేను ఆలోచించనే లేదు. సోరావ్‌లో పెద్ద చదువు లేదు. ఫతేపూర్ పంపడం జరగదు. దీన్ని గురించి ఇక ఆలోచించాలి.''

బైదేయి నవ్వింది: ''దీనిలో ఆలోచించేదేముంది జ్వాలా బాబూ! అలహాబాదు కూడా మీ ఊరే. గంగూను నాకు ఒప్ప చెప్పేసేయండి. లక్ష్మి పెద్దవాడయి తనంతట తాను తిరుగుతున్నాడు గదా! ఇక గంగూను చూచుకుంటూ ఉంటాను.''

జ్వాలా ప్రసాద్ యమున వైపు చూచారు. యమున జ్వాలా ప్రసాద్ వైపు చూచింది. ఇద్దరూ ఒకరి భావాలనొకరు చూపుల్లోనే గమనించారు. యమున జైదేయి భుజంమీద చెయ్యివేసి చెప్పింది. "అక్కా! గంగూ నా పిల్లవాడంటే నీ పిల్లవాడన్న మాటే! వాడికి బాగా చదువు రావాలి. వాళ్ళ నాన్నకంటే గూడా గొప్పవాడు కావాలి. కనుక గంగూ సంగతి ఇక నీకే ఒప్ప చెపుతున్నాను. ఈయన ఉద్యోగంతో ఈయనకు తీరికే ఉండదు. అదికాక ఒక సంవత్సరంలో ఈయనకేదో ప్రమోషనూ, ట్రాన్స్ఫరూ రావచ్చునని కూడా అంటున్నారు. ఈ హడావిడిలో గంగూ చదువు ఇక్కడ సాగడం కష్టం."

జైదేయి యమునను కౌగలించుకుంది. "యమునా రాణీ! నీ వెంత మంచి దానవమ్మా! నాకు సొంత చెల్లెలి లాంటిదానివి. గంగూ నాకు లక్ష్మి కంటె తక్కువయిన వాడు కాదు. ఇక నేను ప్రయాగ వదిలి ఎక్కడికీ వెళ్ళను. లక్ష్మికి కాన్పూరంటే ఇష్టం. కాని నేను మాత్రం ప్రయాగలోనే ఉంటాను." జైదేయి నుదురు మీది ముడతలు మాయమైనాయి. ఆమెకు తన వయస్సు పది సంవత్సరాలు వెనక్కి నడిచినట్టు తోచింది.

రెండవ ప్రకరణం

ఒకటి

సోమేశ్వర శాస్త్రి ఆకాశం కేసి రెప్పవాల్చకుండా కొంచెంసేపు చూచాడు. ఆయన ముఖంలో అదోవిధమైన జాలికనిపిస్తున్నది. ఆ జాలిలో నుండి ఒక దీర్ఘాలోచన తొంగి చూస్తూంది. ఆయన కండ్లలో తారళ్యం తొణికిస లాడుతుంది. ఎంతో గంభీరంగా ఆయన తనలో తాను ఇలా అనుకున్నాడు: "ఇప్పుడు మనం పూర్తిగా బానిసలమై పోయినాం. ఇంగ్లండు దొర ఢిల్లీలో సామ్రాజ్యం స్థాపించడానికి వస్తున్నాడు. భారత దేశంలోని రాజులూ, మహారాజులూ ఆయనకు దాసోహం అంటారు. ఆయనకు కానుకలు సమర్పిస్తారు. ఆయన్ని తమ ప్రభువుగా స్వీకరిస్తారు."

"అయితే శాస్త్రిగారూ! దీనికి మీరు దిగులు పడుతున్నారా?" అన్నాడు శ్రీ కిశోరీరమణ్ తమలపాకుల పళ్లెం ఆయన ముందుకు జరుపుతూ.

శ్రీ కిశోరీరమణ్ బరేలీలో అసిస్టెంటు సివిల్ సర్జన్. పచ్చని వన్నె, ఒడ్డు పొడుగు, పుష్కలమైన దేహం. యౌవనందాటి ప్రౌఢావస్థలో ప్రవేశిస్తున్న వయస్సు. శ్రీ కిశోరీరమణ్ బరేలీలో చాల ప్రఖ్యాతిగల డాక్టరు. గవర్నమెంటు ఇచ్చే జీతం కాక ప్రైవేటు ప్రాక్టీసు మీద నెలకు రెండు మూడు వందలు ఆదాయం వస్తుంది.

సోమేశ్వర శాస్త్రి ముఖంమీద సన్నని చిరునవ్వు కనిపించింది. కాని ఆయన గంభీర ముఖ ముద్రలో ఆట్టే మార్పురాలేదు. గుబురు గుబురుగా గొంగళి పురుగులా పెరిగి పెదిమలను పూర్తిగా కప్పివేసిన ఆయన మీసాలను దాటి ఆ చిరునవ్వు అంత సులభంగా బయటకు రావడం లేదు. "లేదు డాక్టరుగారూ! ఇదంతా మన మంచికేనని తోస్తున్నది. ఏదో విధంగా ఈ మ్లేచ్ఛుల పరిపాలన తప్పిపోయింది. దేశంలో అరాజకత్వం అంతరించింది. దుండగాలు తగ్గిపోయాయి. అంతటా శాంతి భద్రతలు చేకూరినాయి. కాని ఒక్క విషయం మాత్రం వుంది - విదేశీయులెప్పటి కయినా విదేశీయులే అవుతారు."

సోమేశ్వర శాస్త్రి బరేలీలో డిప్టీకలెక్టరుగా పనిచేస్తున్నాడు. ఆయన వయస్సు దాదాపు యాభై ఉంటుంది. దీర్ఘకాయం. ఉజ్వల ముఖ కాంతి,

గోధుమవన్నె, ఆయన సంస్కృతం చక్కగా చదువుకొన్నాడు; పూర్వాచార పరాయణుడు కూడాను. కాని శాస్త్రిగారు స్పష్టవాది, ఖచ్చితమైన మనిషి - కొంచెం తగాదాలో దిగే స్వభావం కూడా. ఉన్నట్టుండి సోమేశ్వర శాస్త్రి సహజంగా పక్కన నవ్వాడు: "డాక్టరుగారూ! ఈ విదేశీయులు మనలో ఎంత మార్పు తీసుక వచ్చారో గమనించారా? అదిగో, మీర్‌సాహబ్ ఇలా వస్తున్నారు చూడండి. ఈయన తండ్రికి పొడుగాటి గడ్డం ఉండేది. ఎప్పుడూ శేర్వాణీ వేసుకొని చేతిలో జపమాల త్రిప్పుకొంటూ ఉండేవారు. మరి ఈయనగార్ని చూడండి. కోటు, పైజామా, మట్టసమైన గడ్డం, ఎదురుపడ్డ వాండ్లను బెదరగొట్టే వంకరలు తిరిగిన కోర మీసం, నోట్లో చుట్ట."

సోమేశ్వర శాస్త్రి అంటూన్న మాటలు కొద్దిగా మీర్ జాఫరాలీ చెవిలో పడ్డాయి. చిరునవ్వుతో మీర్ సాహబ్ ఆయనను సమీపించాడు. "ఏమండీ శాస్త్రిగారూ! నన్ను గురించే ఏదో చెప్పుకుంటున్నట్టున్నారు: సరేకానిండి, మీ సంగతి కూడా కొంచెం చెప్పకూడదూ! చూడండి డాక్టరుగారూ! నేనోవార్త విన్నాను. మన శాస్త్రిగారు ఆర్యసమాజంలో చేరారట! ఏమండీ శాస్త్రిగారూ! నేను విన్నది పొరపాటు కాదుకదా!"

"అయితే మీకు దీన్ని గురించి దిగులెందుకండీ? మా హిందూమతంలోని మిథ్యాచారాలవల్ల మా మతం సారహీనమైపోయింది. ఈ చనువు తీసికొని మహమ్మదీయులు, క్రైస్తవులు లక్షలాది హిందువులను తమ మతంలోకి లాక్కున్నారు. ఇప్పుడు హిందూమతాన్ని కట్టుదిట్టం చేయడానికి ప్రయత్నిస్తున్నది మా ఆర్యసమాజం. ఆర్య సంప్రదాయానికి మరల జీవంపోసి హిందూమతానికి దిగ్విజయం చేకూర్చడానికి ఇది కృషి చేస్తున్నది."

మీర్ జాఫరాలీ బరేలీలో పోలీసు శాఖలో డిప్టీ సూపరింటెండెంటుగా పని చేస్తున్నాడు. ఆయన్ని కొంతవరకు యువకుడనే చెప్పవచ్చు. పొడుగాటి ఎముక పుష్టిగల దేహం. విప్పారిన గోధుమ వన్నె. మీర్ సాహబ్ తాను పఠాను వంశానికి చెందిన వాణ్ణని చెప్పుకొంటాడు. అసలు మీర్‌సాహబ్‌కు మతమంటే ఏమాత్రం ఆసక్తిలేదు; ఉపాసాలంటే గిట్టదు. నమాజు చదవడం కూడ మానేశాడు. కాని మత విషయాలపై గంటల తరబడి చర్చించడం ఆయనకొక వృత్తిలా అయిపోయింది. మీర్

సాహెబ్ ముఖం చిట్లించుకొని అన్నాడు: "శాస్త్రిగారూ! కొంచెం స్తిమితంగా ఆలోచించండి. ఈ ధోతీరాయళ్ళు ప్రపంచాన్ని జయిస్తారట. చచ్చిపోయేముందు చీమకు రెక్కలు విప్పారినట్లుగా హిందూమతంలో ఆర్యసమాజం బయలుదేరింది. అంతేకదండీ, జోనాథన్‌గారూ!" చదరంగం ఆడడానికి తోడు వెదుకుతూ ఆ దారిని పోతున్న జోనాథన్ డేవిడ్‌ని మీర్‌సాహెబ్ పిలిచాడు.

మిస్టర్ జోనాథన్ డేవిడ్ నల్లరూపున పొట్టిగా బక్కచిక్కి ఉండేవాడు. ఆయన వయస్సు నలభై సంవత్సరాలే ఐనా చూడడానికి యాభై సంవత్సరాల వాడిగా ఉండేవాడు. జోనాథన్ డేవిడ్ బరేలిలో సబ్‌జడ్జిగా పనిచేసేవాడు. గడ్డం మీసం శుభ్రంగా చేసుకొంటాడు. మీర్‌సాహెబ్ పిలుపు నందుకొని జోనాథన్ డేవిడ్ పలికాడు: "మీర్! మీరు వచ్చారా? నేను మీకే వెదుక్కుతున్నాన్. హలో డాక్టర్! ఈ దినం బ్రిజ్ లేదా?" తరువాత ఆయన మీర్‌సాహెబ్‌ను సమీపించారు: "మీర్, నన్ను పిల్చారు మ్యాన్, ఏంటి చెప్పండి."

మీర్‌సాహెబ్ ఫక్కుమని నవ్వాడు: "డేవిడ్ సాహెబ్! మాటల్లో ఇంకా కొంచెం దేశీతనం మిగిలి ఉంది. ఇంకొంచెం అభ్యాసం చెయ్యాలి. అప్పటికి ఆంగ్లో ఇండియన్‌తో సరి తూగుతారు."

"ఏంటి మీరు చెప్పేది మీర్! మనము ప్యూర్ యూరోపియన్. సెవెన్ జనరేషన్సు వెనుక మా ఫోర్ ఫాదర్సు హిందూస్థాన్ వచ్చారు - సౌత్‌కి. అక్కడనే ఉండిపోయారు. డాక్టర్! సెవెన్ జనరేషన్స్ ఇన్ ఇండియా, అండ్ ఇన్ సౌత్!" జోనాథన్ డేవిడ్ అభినయ పూర్వకంగా రెండు చేతులు చాచి అన్నాడు: "అండ్ ది రిజల్ట్."

"అయ్యో తమరే!" అన్నాడు డాక్టరు కిశోరీ రమణ్ చాల గంభీరంగా. "ఒకటి పైన ఒకటి ఏడు పొరల్లో హిందూస్తానీ నల్ల చర్మం పేరుకొని ఉంది. ఏడు తరాలు, ఏడు పొరలు. నల్లనేరేడు కూడా మిమ్మల్ని చూచి బెదరి పోవలసిందే డేవిడ్‌గారూ! కాని నేను మాత్రం సర్జన్ని. ఈ నల్ల పొరలెన్ని ఉన్నా వాటి అడుగున నీ సిసలైన తెలుపు వన్నె నాకు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఆ మేక్‌గిల్ మహా సివిల్ సర్జన్నను కొంటాడు. కాని వాడికి కండ్లుండి చస్తేగా, గుడ్డిమొహం! అందుకనే

వాడికి నీ తెల్లతోలు కనిపించలేదు. అందువల్ల నిన్ను యూరోపియన్ క్లబ్బులో అడుగుపెట్టనియ్య లేదు.''

సోమేశ్వర శాస్త్రి ఇంతవరకు మౌనంగా ఈ సంభాషణ వింటున్నారు. ఇక ఆయన ఉండబట్టలేక అన్నారు: ''ఈ యూరోపియనులు దుర్మార్గులు. మిమ్మల్ని తమ క్లబ్బులోకి ఏమైనా సరే రానియ్యరు జోనాధన్‌గారూ! మీరు నా మాటవిని మతం మార్చుకొని శుద్ధిపొందండి. ప్రాణాలు కాపాడు కోడానికి మహమ్మదీయులుగా మారిపోయిన వారినీ, కరువు బాధ పడలేక క్రిస్టియనులయిన వారినీ మరల హిందూమతంలో చేర్చుకొని వారిని శుద్ధి చేయవలెనని మా సంకల్పం. కాబట్టి డేవిడ్‌గారూ! ఈ అవకాశాన్ని ఉప యోగించుకోండి.''

జోనాధన్ డేవిడ్ కానీ, మీర్‌జాఫరాలి కానీ దీనికి తగిన సమాధానం చెప్పేలోగా డాక్టరు కిశోరీ రమణ్ అన్నాడు: ''శాస్త్రిగారూ! డేవిడ్ గారి కయితే శుద్ధి చేయవచ్చుగాని ఈయన సతీమణికి ఎలా శుద్ధి చేయగలరండీ! ఆమె ప్యూర్ యూరోపియన్. యూరోపియన్ క్లబ్బులోకి మన జోనాధన్ డేవిడ్‌గారికి ప్రవేశం లేదుగాని ఈయన గారి సతీమణి అక్కడికివెళ్ళి రోజూ టెన్నిస్ ఆడుతుంది. డాన్సు చేస్తుంది.''

మీర్‌జాఫరాలీ అన్నాడు: ''జోనాధన్ గారంటే మీరేమనుకున్నా రేంటి? ఈయనగారు తనను యూరోపియను క్లబ్బులో చేర్చుకోమని చిన్న దొరగారికి ఒక మెమొరాండం పంపారు. ఈయన సతీమణి ఆ మెమొ రాండం తీసుకొని స్వయంగా లెఫ్టినెంటు గవర్నరు దగ్గరకు వెళ్ళారు. ఆయన ఆమెతో ఒక గంటసేపు మాట్లాడారు.''

సోమేశ్వర శాస్త్రి జోనాధన్ డేవిడ్ వైపు చూచారు: ''ఏమండీ డేవిడ్‌గారూ! మీర్‌సాహెబ్ చెప్పేది నిజమేనా?''

చాల బిక్కమొహం వేసికొని, జాలిపుట్టేటట్టు జోనాధన్ డేవిడ్ సోమేశ్వర శాస్త్రి వైపు చూచాడు: ''అవును శాస్త్రిగారూ! కాని ఆ లెఫ్టినెంటు గవర్నరు ఎంక్వైరీ చేస్తానని మా ఆవిడతో చెప్పారు. కమీషనరూ, కలెక్టరూ, డిస్ట్రిక్టు జడ్జి అందరూ ఒప్పుకొన్నారు. కాని ఈ పనికి మాలిన సివిల్ సర్జన్ అంటాడు - నేను గనక క్లబ్బులో అడుగు పెట్టానంటే, నన్ను గేటు బయటకు గెంటేస్తాడట. ఈ దుర్మార్గుడు క్లిమెంట్సు కూడా వాడికి వంత పాడుతాడు మీర్‌గారూ! ఆయన మీ పోలీసు

సూపరింటెండెంటు కూడాను.'' మాట ముగిస్తూనే జోనాధన్ డేవిడ్ 'బాయ్' ని పిలిచి చెప్పాడు—''ఒక చిన్న పెగ్, వెల్ మ్యాన్! మీరు కూడా తీసుకొంటారా మీర్? రెండు చిన్నవి!''

సోమేశ్వర శాస్త్రిగారి చిరునవ్వు ఆయన మీసాలను దాటి బయటకు వచ్చింది: ''మిస్టర్ డేవిడ్, ఈ కాప్టను క్లిమెంట్సు గంగా ప్రసాద్‌ను రోజూ యూరోపియన్ క్లబ్బుకు పిలిపించి అతనితో టెన్నిస్ ఆడుతాడట నిజమేనా?''

కిశోరీ రమణ్ పెద్దగా నవ్వాడు: ''శాస్త్రిగారూ! మా సివిల్ సర్జన్ మాక్‌గిల్ నన్నుగూడా నాలుగయిదు పర్యాయాలు యూరోపియను క్లబ్బుకు తీసుకు వెళ్లారు. కాని మన జోనాధన్ డేవిడ్‌గారంటే ఆయన కెందుకో తెలియదుకాని బొత్తిగా పడదు. ఈయన ముఖం చూస్తేనే ఆయన మండిపడతారు.''

బేరా రెండు విస్కీ గ్లాసులు తీసుకు వచ్చి ఒకటి జోనాధన్ డేవిడ్‌కూ, మరొకటి మీర్ సాహబ్‌కూ ఇచ్చాడు. జోనాధన్ డేవిడ్ ఒక గుక్కలో అర్ధ గ్లాసు ఖాళీచేశాడు. తరువాత ఆయన చప్పబడి ఇలా అన్నాడు: ''వెల్ శాస్త్రీ! నాకు అదృష్టం కలిసిరాలేదు. విదేశం వెళ్ళాను. అసలయిన దొరసాన్ని పెండ్లిచేసి కొన్నాను. మా డాడీ నా పేరు ఆంగ్లో ఇండియన్లలో చేర్చారు. కాని ఈ దిక్కుమాలిన వెధవలు మాక్‌గిల్, క్లిమెంట్సు నన్ను నేటివ్ క్రిస్టియన్ అనే అంటారు. శాస్త్రిగారూ! ఇది నా దురదృష్టం కాకపోతే మరేమిటి చెప్పండి! అటు చూడండి, గంగా ప్రసాద్ వస్తున్నాడు: ఇవ్వేళ నీవు యూరోపియన్ క్లబ్బుకు టెన్నిస్ ఆడడానికి వెళ్లలేదా? చెప్పవోయ్, మ్యాన్!''

గంగా ప్రసాద్ సమీపిస్తూ అన్నాడు: ''ఏం లేదు డేవిడ్‌గారూ! నేను ఈ రోజు రాత్రి బండికిగాని, రేపు ఉదయం గాని అలహాబాదు వెళ్లాలి. ఢిల్లీ దర్బారును ఏర్పాటుచేసే కమిటీలో నా పేరు వచ్చింది. రెండు మూడు నెలలు ఢిల్లీలో ఉండాల్సి వస్తుంది. అంతా ఏర్పాటు చేయాలిగా మరి!''

జోనాధన్ డేవిడ్ చాల ఆశ్చర్యంతో గంగా ప్రసాద్ వైపు చూచాడు: ''నీవు చాలా అదృష్టవంతుడవోయ్ గంగా ప్రసాద్! ఎంత జూనియరువో! సర్వీసులోచేరి ఇంకా రెండు సంవత్సరాలయిందో లేదో ఢిల్లీ

దర్బారు ఏర్పాటు చేయడానికి నిన్ను పంపిస్తున్నారు. మీర్! మిమ్మల్ని పంపిస్తారేమో ననుకొన్నాను. కాని గంగా ప్రసాద్ వెళ్లుతున్నాడు!"

గంగా ప్రసాద్ ఢిల్లీ వెళ్ళుతున్నాడన్న వార్త వినగానే మీర్‌జాఫరాలీ మనస్సు చివుక్కుమంది. "జోనాథన్‌గారూ! ఇది క్లిమెంట్సు చేసిన ద్రోహం. ఈయనగారు రోజూ ఆయనతో టెన్నిసు ఆడుతారు. ఆయన్ని ముఖస్తుతి చేస్తుంటారు. మరి ఆయన ఈయనను పంపించక నన్ను పంపిస్తాడా!"

కిశోరీ రమణ్ బిగ్గరగా అన్నాడు: "గంగా ప్రసాద్! నీవు దొరవారి నెటూ కలుసుకోబోతున్నావు గనుక ఆయనకు డేవిడ్‌గారి రిప్రజెంటేషన్ను గురించి కొంచెం హెచ్చరించి చూడు. జోనాథన్ డేవిడ్‌ను యూరోపియన్ అనో లేకుంటే కనీసం ఆంగ్లో ఇండియన్ అనో ప్రకటిస్తూ హుకుం జారీ చేయమని చెప్పు."

జోనాథన్ డేవిడ్ చాలా గంభీరంగా అన్నాడు: "ఇతడేం చెప్పగలడు కింగ్ ఎంపరర్‌తో? నేటివ్ ఎవ్వడూ ఆయన దగ్గరకు వెళ్లడం అసాధ్యం. అక్కడకు నేను నా మిసెస్‌ను పంపుతాను."

గంగా ప్రసాద్ సన్నపాటి పొడుగాటి యువకుడు. అలహాబాదులో బి.ఎ. ప్యాసయాక డిప్టీ కలెక్టరుగా చేరాడు. గంగా ప్రసాద్ డిప్టీ కలెక్టరు కావడానికి జ్వాలాప్రసాద్ చేసిన ముఖస్తుతితోపాటు లక్ష్మీచంద్ పలుకుబడి కూడ సహకరించింది. కాని ఇందులో గంగాప్రసాద్ యోగ్యత కూడ కొంత పాత్ర వహించలేక పోలేదు. బి. ఏ. లో అతనికి సెకండు క్లాసు వచ్చింది. కాని ఆట పాటల్లోను, విద్యార్థి జీవితంలోని సాంఘిక కార్య కలాపాల్లోనూ అతడెంతో ఉత్సాహంగా పనిచేసేవాడు. సివిల్-లైన్సులో జైదేయిగారి బంగళాలో ఉండడం అతనికి అన్ని విధాల సౌకర్యంగా ఉండేది. అందువల్ల అలహాబాదులోని మోర్ సెంట్రల్ కాలేజి లోని విద్యార్థులందరిలో అతడు మంచి ఆటగాడుగా పేరు గడించాడు. క్రికెటులోను టెన్నిసులోను అతని ఖ్యాతి భారతదేశ మంతటా వ్యాపించింది.

గంగా ప్రసాద్ అప్పుడు ఏదో ఆలోచనలో మునిగి ఉన్నాడు. జోనాథన్ డేవిడ్ అన్న మాటకు చిరునవ్వుతో మాత్రమే సమాధానం చెప్పాడు. ఆ తర్వాత అతడు వాళ్ళను వదిలేసి బ్రిజ్ టేబిలు దగ్గరకు వెళ్ళాడు. గంగాప్రసాద్ అక్కడనుండి వెళ్ళిపోగానే మీర్‌జాఫరాలి అన్నాడు:

"సోమేశ్వర శాస్త్రిగారూ! ఈ కుర్రాణ్ణి చూదారా! ఏమిటీవి! ఏమి దర్పం! సిసలైన జమిందారీ హోదా ఇతనిది!"

సోమేశ్వర శాస్త్రి కాసేపు మౌనంగా ఉండి అన్నారు: "తండ్రీ కొడుకులకు చాలా వ్యత్యాసం ఉంది. కాని కుర్రాడు మంచి మర్యాదస్థుడు, సహృదయుడు, ఉత్సాహవంతుడు. ఏమంటారు మీర్‌సాహబ్! ఈ మాట మీరు ఒప్పుకొని తీరాలి. నవీన యుగానికి చెందినవాడు. ఈ క్రొత్త ప్రపంచంలో ఇతను బాగా వృద్ధికి వస్తాడు."

"ఆ! వృద్ధికి వస్తాడు చూద్దాంగా! అప్పుడే అతన్ని గురించి పిర్యాదులు రావడం మొదలయింది. ఇతడు పెట్టే దుబారా ఖర్చంతా ఇతనికెక్కడ నుండి వస్తుందో ఎలా వస్తుందో భగవంతుడికి తెలియాలి. ఇతను లంచ గొండి అని ఎవ్వరూ ఎక్కడా ఎప్పుడూ చెప్పుకోగా వినలేదు. నేను చెప్తు న్నాను వినండి. ఏదోరోజు ఈ అబ్బాయి తగాదాలో చిక్కుకుంటాడు. మీరు పెద్దలు, ఇతని తండ్రికి మీరు స్నేహితులు. కనక మీరు కొంచెం ఇతన్ని మందలించండి." అన్నాడు మీర్ జాఫరాలీ.

కిశోరీ రమణ్ బిగ్గరగా నవ్వాడు: "అయ్యో, అసూయ పడుతున్నారా మీర్‌సాహబ్‌గారూ! మీరు అన్నిరకాల అవకతవకలూ చేసి కూడా తప్పించు కుంటారూ! పాపమా గంగా ప్రసాద్ మాత్రం చిక్కుల్లో పడి పోవాలి? ఏమండీ శాస్త్రిగారూ! ఏమంటారు మీరు?"

సోమేశ్వర శాస్త్రి గంభీరంగా అన్నాడు: "డాక్టర్, మీర్‌సాహబ్ చెప్పినదాన్లో పొరబాటు లేదు. గంగా ప్రసాద్ ధైర్యశాలి అవడమే మీర్‌సాహబ్‌కు ఆయనకు గల భేదం. అతడు ఇంగ్లీషు వాళ్లతో సరి సమానంగా వ్యవహరిస్తాడు. వాళ్ళతో కలిసి మెలిసి తిరుగుతాడు. కనకనే అతనికి తెల్లవాళ్ళతో ఇంతటి చనువు ఏర్పడింది. కాని డాక్టరు గారూ! ఇదే అతనిలో లోపం కూడాను. అతడు స్వాభిమాని అవడం వల్ల ఇతరులను ముఖస్తుతి చేయలేడు. అభిమానమే అపరాధానికి మూలం అనేది కూడా నిజమే. మన మీర్‌సాహబ్ ఒట్టి పిరికిపంద. ఈయన సూపరింటెండెంటు ఈయన్ని అనరాని మాటలంటాడు. కాని ఈయన మొహంలో ఏమాత్రం మార్పు వస్తే ఒట్టు. మీర్‌సాహబ్ అందరికీ కావలసిన వాడు. గంగా ప్రసాద్ మనసులోని స్వాభిమానమే అతనికి పరమ శత్రువు. గంగా ప్రసాద్‌కు మనసులో ఒకటి, బయట కొకటి కాదు.

కాని మీర్‌సాహబ్ మనసులో అనుకొనే దానికీ బయటచెప్పేదానికి ఎంతో వ్యత్యాసముంటుంది. డాక్టరు గారూ! ఈ ప్రపంచం రెండు నాలుకలతో పలుకుతుంది. అలా రెండు నాలుకలతో పలికిన వాడే ఈ ప్రపంచంలో చలామణి అవుతాడు.''

మీర్ జాఫరాలీ సోమేశ్వర శాస్త్రి అన్నమాటలకు కోపగించుకో లేదు. "అరే శాస్త్రి! నీవు కూడా చాలా కాలాంతకుడవోయ్. పదండి జోనాథన్‌గారూ, కాసేపు బ్రిడ్జ్ ఆడదాం రండి.''

జోనాథన్ డేవిడ్ చెయ్యి పట్టుకొని మీర్ జాఫరాలీ బ్రిడ్జ్ రూంలోకి ప్రవేశించేసరికి గంగా ప్రసాద్ ఆట ముగించి లేవబోతూ మీర్‌సాహబ్ దగ్గరకువెళ్ళి అన్నాడు: "మీర్‌సాహబ్, కొంచెం నాతోటి వస్తారా? మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. మిష్టర్ డేవిడ్, మీ స్నేహితుణ్ణి మీ దగ్గరనుంచి తీసుక వెళుతున్నందుకు క్షమించండి.''

గంగా ప్రసాద్ మీర్ జాఫరాలీని తీసుకొని క్లబ్బు అవరణం దాటి బయటకు చేరాడు. మీర్ సాహబ్‌కు ఏమీ తోచక అడిగాడు: "సరేకాని అబ్బాయ్, నన్ను నీవెక్కడికిలా తీసుకెళ్ళుతున్నావ్?''

"మిస్టర్ క్లిమెంట్సు బంగళాకు!'' అన్నాడు గంగా ప్రసాద్. "మిమ్మల్ని కూడా ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేసే కమిటీలోకి తీసుకోవలసిందని ఆయనకు నేను చెప్పాను. ఆయన దాదాపు ఒప్పుకున్నట్టే కనిపించారు. మీరు కూడా వెళ్ళి ఆయనతో మాట్లాడితే మిమ్మల్ని కూడా అక్కడికి తీసికెళ్ళడానికి ఆయన ఒప్పుకుంటారనే నేననుకుంటాను.''

"నిజమా నాయనా?'' అని కృతజ్ఞతా సూచకంగా ప్రశ్నించాడు మీర్ సాహబ్ గంగాప్రసాద్ చేతిని తన చేతితో నొక్కుతూ—"నీవు గనక నన్ను ఢిల్లీ దర్బారుకు చేర్చావా నీకు జీవితాంత బానిసగా పనిచేస్తాను.''

వీళ్ళిద్దరూ కలసి మిస్టర్ క్లిమెంట్స్ బంగళా దగ్గరకు వెళ్ళేసరికి మిస్టర్ క్లిమెంట్స్ వరాండాలో కూర్చుని ఢిల్లీ దర్బారు ప్లాను చూచుకుంటున్నారు. ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేయవలసిన భారం ఉత్తర్ ప్రదేశ్ లెఫ్టినెంటు గవర్నరు పై ఉంది. ఉత్తర ప్రదేశ్ లెఫ్టినెంటు గవర్నరుకు కృపా పాత్రులు మిస్టర్ క్లిమెంట్స్. గంగా ప్రసాదునూ, మీర్‌జాఫరాలిని చూడగానే మిస్టర్ క్లిమెంట్సు అన్నాడు: "హలో గంగా ప్రసాద్! నీవు

ఢిల్లీ ఎప్పుడు చేరుకుంటున్నావు? నేను మాత్రం అక్కడికి వెంటనే వెడుతున్నాను.”

“రేపుదయం నేను అలహాబాదు వెళ్ళుతున్నాను సార్, అక్కడనుండి ఒకవారం తరువాత ఢిల్లీలో హాజరవుతాను. భార్యనూ, బిడ్డల్నీ అలహాబాదు చేర్చాలిగా మరి!”

“అలాగేచెయ్; కాని ఒక వారంలోగా తప్పక రావాలి. నీ వెందుకు వచ్చావోయ్ మీర్? ఏమన్నా విశేషమా?”

జవాబు గంగాప్రసాద్ చెప్పాడు: “అతన్ని నేను నాకూడా తీసుకొచ్చాను సార్! మీర్‌సాహబ్ కూడా ఢిల్లీ దర్బారుకు రావాలని ఉబలాట పడుతున్నారు. క్యాప్టన్‌గారితో మీరే స్వయంగా వెళ్ళి చెప్పుకోగూడదా అన్నాను. తమతో మాట్లాడాలంటే మీర్‌సాహబ్‌కు అమిత భయం. బలవంతంగా నేను నా కూడా పిలుచుకు వచ్చాను.”

మిస్టర్ క్లిమెంట్సు గంగా ప్రసాద్ మాటలకు నవ్వాడు: “గంగా ప్రసాద్, ఈ మీర్ నాకు భయపడతాడా? ఏమిటి నీవనేది? ఇతడొక గ్రామ సింహంలాంటివాడు. ఇతనితో సరిపోగల వంచకుడు నీకు మరొకడు దొరకడు. ఏం మీర్, నేను తప్పు చెప్పడం లేదుగదా! నువ్వు నంబరువన్ బద్‌మాష్‌వు కదూ!”

అత్యంత వినయంతో మీర్ జాఫరాలీ అన్నాడు: “దొరవారు చెప్పింది కాదనే ధైర్యం నాకెక్కడ ఉందండీ? దొరవారు సెలవిచ్చిన దాన్ని కాదనడం కంటే అమర్యాదకరమైన విషయం మరొకటి ఉండదు.”

మిస్టర్ క్లిమెంట్సు గంగా ప్రసాద్ వైపు చూదారు: “వింటున్నావా గంగా ప్రసాద్! ఎంతటి ఆత్మవంచకుడో! అలాంటివాణ్ణి నీవు ఢిల్లీ దర్బారుకు తీసుకొని వెళ్ళమంటావా!”

మరీ మృదువుగా అన్నాడు మీర్: “క్షమించాలి ప్రభువులు. ఈ పోలీసు డిపార్టుమెంటులో అందరూ ఇలాంటివారే ఉంటారు. అయ్యా! ఒక మాట చెపుతాను, నాలాంటివాళ్ళు దొరగారి కొలువులో లేకపోతే సామ్రాజ్యం ఒక్కరోజయినా నిలబడలేదు. ఏర్పాటు చేసేదంతా మేమే గదా!”

ఈ మాటకు మిస్టర్ క్లిమెంట్సు బిగ్గరగా నవ్వాడు: “బాగా చెప్పావోయ్ మీర్, బాగా చెప్పావ్! సరే గంగా ప్రసాద్, వ్యవస్థాపకుల

జాబితాలో నేను మీర్ జాఫరాలీ పేరుకూడ చేర్చేస్తున్నాను. వెళ్ళే ఏర్పాటు చూచుకోమని ఈ తుచ్ఛుడికి చెప్పేసేయ్.''

మీర్ సాహెబ్ ముఖం విప్పారింది. ఆయన క్లిమెంట్సుకు వంగి సలాం చేశాడు.

మీర్ జాఫరాలీని క్లబ్బులో వదిలిపెట్టి గంగాప్రసాద్ ఇల్లు చేరాడు. గంగా ప్రసాద్ ఇంత తొందరగా ఇంటికి రావడంతో ఆయన భార్య రుక్మిణికి ఆశ్చర్యం వేసింది. రుక్మిణి ప్రక్కింటి కృష్ణమూర్తి గారింటికి వెళ్ళడానికి సిద్ధమవుతున్నది. గంగా ప్రసాద్‌కు రెండేళ్ల పిల్లవాడు న్నాడు. పేరు నవల్ కిశోర్. వాణ్ణి వరండాలో కూర్చోబెట్టుకొని భీఖూ ఆడిస్తున్నాడు. వంటమనిషి వంటగదిలో వంట చేస్తూవుంది. గంగా ప్రసాద్‌ను చూడగానే భీఖూ అన్నాడు: ''ఇయ్యాల చాల తొందరగా వచ్చారే అబ్బాయిగారు. అమ్మాయి ఇప్పుడే వకీలు గారింటికి వెళ్ళాలను కొంటున్నది.''

గంగా ప్రసాద్ ముఖంలోని చిరునవ్వును చూచి అతడేదో శుభవార్త తెచ్చివుంటాడని రుక్మిణి గమనించి అడిగింది: ''ఏమండీ! చాల సంతోషంగా కనిపిస్తున్నారు. ఏమయినా ప్రమోషను వచ్చిందా?''

''ప్రమోషనే అనుకో. ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేయడానికి ఢిల్లీ రమ్మని పిలుపు వచ్చింది. తయారుకా నీవుకూడా ఢిల్లీ దర్బారు చూడడానికి! ఢిల్లీ అంటే ఏమనుకొన్నావ్. చాలా ప్రాచీన నగరం - ఎఱ్ఱకోట! కుతుబ్ మీనార్! వాటితోపాటు ఢిల్లీ దర్బార్ కూడాను!''

రుక్మిణి దిగాలుపోయి చూచింది: ''బాగానే వుంది. మీతోటి నేను ఢిల్లీ వీధుల్లో తిరుగుతూ వుంటే లోకులేమనుకొంటారు? బారెడు ముసుగు వేసుకొని మీతో నేను వెళ్ళుతూ వుంటే చూచేవాళ్ళు నవ్వరూ?''

''ఇంకా ముసుగు లెందుకే పిచ్చిదానా! ఈ పూర్వాచారాలన్నీ వదలి పెట్టాలి. భీఖూ, మనం సామానంతా సర్దుకోవాలి. రేపు ఉదయం బండికి గాని, మధ్యాహ్నం బండికి గాని మనం బయలుదేరి వెళ్ళాలి. మూడు నెలలపాటు అక్కడ ఉండాల్సి వుంటుంది. తెలిసిందా! చలి గుడ్డలు కూడా వెంట తీసుకపోవాలి.''

భీఖూతో రుక్మిణి అన్నది: ''లేదు భీఖూ, ఆయన ఎప్పుడూ అలాగే

ఏవో అర్థంలేని మాటలు అంటుంటారూ. ఢిల్లీ దర్బారుకు ఆడవాండ్లు వెళ తారా ఎక్కడన్నా! నీవే చెప్పు భీఖూ!"

భీఖూకు నవ్వు వచ్చింది. "ఎందుకు వెళ్లగూడదమ్మగారూ! గౌను వేసుకొంటే మీరు కూడ దొరసానులైపోతారమ్మా. ఇంగిలీసు కూడా కాస్త నేర్చుకున్నారంటే అబ్బాయిగారి మోజు తీరిపోతుంది. పరపంచం మారింది కదా! కొత్త పరపంచంలో కొత్త కొత్త సంగతులు నేర్చుకోవద్దూ మరి!"

"అయ్యో రామ! నీవు కూడా అదేమాట అంటూన్నావా భీఖూ!" అన్నది రుక్మిణి. మళ్ళీ ఆమె గంగా ప్రసాద్ వైపు తిరిగింది: "మూడు నెలలపాటు వుండాలా? ఎప్పటికి చేరాలి మీరక్కడికి?"

"ఓ వారంలోగా చేరాలి. రెండు మూడు రోజులు ఆలస్యమైనా ఫర్వా లేదు. కాని మూడు నెలలవరకు నీవిక్కడ ఒంటరిగా ఎలా వుంటావనేదే సమస్య" అన్నాడు గంగా ప్రసాద్.

"మమ్మల్ని అత్తయ్యగారి దగ్గర బాందాలో వదిలి పెట్టండి లేకుంటే అలహాబాదులోనైనా సరే." అన్నది రుక్మిణి: "సంవత్సరం దాటిపోయింది. అటు ఆ అత్తయ్యనూ చూడలేదు, ఇటు జైదేయి అత్తయ్యనూ చూడడం పడలేదు. అలహాబాదు నుండి ఉత్తరం కూడా వచ్చింది. ఆమె ఆరోగ్యం బాగుండడం లేదుట."

"అవును, నేను కూడా అదే ఆలోచిస్తున్నాను. నిన్ను అలహాబాదు తీసుకువెళ్ళతాను." అన్నాడు గంగాప్రసాద్. "భీఖూ లేకుండా నాకు ఢిల్లీలో జరగదు. వాణ్ణి నేను నాకూడానే తీసుకువెళతాను. కనుక మీరిద్దరూ తయారుకండి. రేపు ఉదయం బండికి మనం అలహాబాదు వెళ్ళాలి. నేను బాందాకు నాన్న పేరిట ఉత్తరం వ్రాసేస్తాను. ఆయన అలహాబాదు వచ్చి నిన్ను తీసుకొని వెళతారు."

అలహాబాదు వస్తున్నామని జైదేయికి వెంటనే టెలిగ్రాం ఇచ్చాడు గంగా ప్రసాద్.

మర్నాడుకాక ఆమరుసటిరోజు ఉదయం గంగా ప్రసాద్ సకుటుంబంగా అలహాబాదు చేరేసరికి జైదేయి పంపిన టాంగా స్టేషనులో సిద్ధంగావుంది. సామానుతో సహా అందరూ జైదేయమ్మ బంగళాకు చేరారు.

అక్కడ జైదేయి ఒంటరిగా లేదని గంగా ప్రసాద్ గమనించాడు. ఆయన తండ్రి జ్వాలా ప్రసాద్ కూడా అక్కడనే ఉన్నారు. జ్వాలా

ప్రసాద్ ఒక్కవారం సెలవు తీసుకొని జైదేయిని చూడడానికి అలహాబాదు వచ్చాడు.

జైదేయి చాల నీరసించి పోయింది. మలేరియా ఆమెను పట్టుకొని వేధిస్తూ వుంది. ఆయుర్వేదం మందులే వాడుతున్నారు. క్వాలా ప్రసాద్ వచ్చీరాగానే ఆయుర్వేదచికిత్స ఆపి వేయించాడు. ఇంగ్లీషు మందులతో ఆమె జ్వరం రెండు రోజుల్లో తగ్గిపోయింది. జైదేయి రుక్మిణిని చూడగానే ఉప్పొంగి పోయింది: "బాబూ గంగూ! అమ్మాయిని తీసుకువచ్చావా? చాలా మంచి పని చేశావు. నేను ఒంటరిగానే ఉన్నాను. లక్ష్మీ భార్యకు పిల్లలతో ఇంట్లో పనులతోటి బొత్తిగా తీరడమే లేదు ఇక్కడికి రావడానికి. అదికాక అది ఇక్కడకువస్తే లక్ష్మీ సంగతి చూచేవాండ్లెవరున్నారు?"

"అయితే పిన్నీ! నీవు కాన్పూరు వెళ్లగూడదూ?" అన్నాడు గంగా ప్రసాద్.

"ఇప్పుడు చివరి రోజుల్లో ప్రయాగ పుణ్యక్షేత్రం వదలి కాన్పూరు వెళ్లనా తండ్రీ!" జైదేయి ముఖంలో చిరునవ్వు వెలవెల పోయింది: "లేదు తండ్రీ! ఇక నా శరీరం ఈ త్రివేణి తీరంలోనే బూడిదయిపోతుంది. అరవై దాటింది. మరి నాలుగైదు సంవత్సరాలనుకో!" ఈ మాట లంటూనే జైదేయి కంట తడిపెట్టింది. కొంచెంసేపటికి మళ్ళీ అన్నది: "లక్ష్మీకి నా మీద కోపం. కాన్పూరు రా, కాన్పూరు రా అంటాడు. నేను వాడికెంతో చెప్పి చూచాను - అబ్బాయ్, అలహాబాదులో కూడా కట్టెల అడితి ఉన్నది కదా! అమ్మాయి రాధను, పిల్లలను తీసుకొనివచ్చి ఇక్కడనే ఉండకూడదూ అని, కాని రాధ పుట్టిల్లు కాన్పూరు కావడంలో అది పుట్టింటిని వదలి పెట్టలేకుండా ఉంది." జైదేయి వైరాగ్యంతో నిట్టూర్పు విడిచింది: "కాన్పూరులోనే ఉండనీ. అక్కడనే సుఖంగా ఉంటే అంతే చాలని భగవంతుణ్ణి వేడుకుంటున్నాను."

జైదేయి కంఠంలో ఏదో విచిత్రమైన ఆవేదన ఉంది. చేసేది లేక ఆమె తనలో ఆవేదనను మింగుతున్నట్లు అక్కడ ఉన్న వాండ్లకందరికీ తోచింది. గంగా ప్రసాద్ అన్నాడు: "దీనికి దిగులు పడడం ఎందుకు పిన్నీ! కావాలంటే నేను అలహాబాదుకు ట్రాన్స్ఫరు చేయించుకుంటాను. అయినా గవర్నమెంటు ఉద్యోగం ట్రాన్స్ఫర్లు ఎప్పుడూ ఉంటాయి. ఇక్కడనుంచి మళ్ళీ మరో చోటికి ట్రాన్స్ఫరు కావచ్చు."

గంగా ప్రసాదు చెప్పిన మాటలు వినగానే వైదేయి దిగులంతా మాయమై పోయింది. ఆమె జ్వాలా ప్రసాద్ వైపు చూస్తూ అన్నది: "అక్కర లేదు తండ్రీ! నీవంత ప్రయాస పడవలసిన పనిలేదు. మరిదిగారున్నారు కదా! ప్రతినెలా వస్తూపోతూ వుంటారు. అయిదారు సంవత్సరాల తర్వాత ఆయన పెన్షను పుచ్చుకుంటారు. ఇక్కడికి మార్చించుకోమని ఈయనతో నేను చెప్పాను. సర్వీసు చివర కొద్ది సంవత్సరాలు ఇక్కడ అలహాబాదులోనే గడపమని. ఇల్లు కట్టించడానికి ఈయన స్థలంకూడా తీసుకొన్నారు. లూకర్‌గంజ్ అని ఇక్కడ ఒక ముహల్లా (పేట) తయారవుతున్నది. ఇక్కడకు వస్తే ఇల్లు కూడా తయారవుతుంది.

ఇప్పుడు గంగా ప్రసాద్ తండ్రివైపు చూచాడు: "మొన్న నేను బరేలీ నుండి మీకు ఒక ఉత్తరం వ్రాశాను. విషయమేమంటే ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేసే కమిటీలో నాపేరు చేర్చారు. మూడు నెల్లపాటు నేను ఢిల్లీలో ఉండాలి. భీఖాను నాకూడా తీసుక వెళుతున్నాను, భీఖా లేక పోతే నాకక్కడ ఇబ్బంది అవుతుందేమోనని."

జ్వాలా ప్రసాద్ ముఖం ఉల్లాసంతో నిండిపోయింది. "అలాగా, చాలా మంచివార్త చెప్పావు తండ్రీ! అందుకనే అమ్మాయిని కూడా తీసుకొని వచ్చావు. విన్నావా వదినా, మీ అబ్బాయి ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేయడానికి వెళుతున్నాడు."

ఈ వార్త విన్న వైదేయి జ్వాలా ప్రసాద్‌కంటె ఎక్కువగా ఆనందించింది: "జ్వాలాబాబూ! నేను చెప్పాను కదా! మన గంగు ఏదో ఒక రోజు కలక్టరయి తీరుతాడు. కాని బావగారూ! అమ్మాయి మాత్రం కనీసం ఒక నెల నా దగ్గర ఉండాలి. వీలుంటే యముననుగూడా ఇక్కడకు పంపితే కొన్నాళ్ళిక్కడనే కలిసి వుంటాం."

"అలాగే వదినా! అమ్మాయిని బాందా తీసుక వెళ్ళతానని నేనన్నానా? గంగూకు నీవే చదువు చెప్పించావు. ఎంతో ఉల్లాసంగా వాడి పెండ్లి జరిపించావు. కనక గంగూ, వాడి భార్యపైన నాకెంత అధికారం వుందో నీకంత కంటే ఎక్కువే వుంది." అన్నారు జ్వాలా ప్రసాద్ నవ్వుతూ.

జ్వాలా ప్రసాద్ సెలవు ముగియగానే మూడు రోజుల్లో బాందా వెళ్లి పోయాడు. ఆయన వెళ్లిన తరువాత రెండు రోజులకల్లా గంగా ప్రసాద్

ఢిల్లీ వెళ్ళాలి. ఢిల్లీకి వెళ్ళేముందు గంగా ప్రసాద్ వైదేయి కాళ్ళకు నమస్కరించి అన్నాడు: "పిన్నీ! ఒక మాట అడగాలి."

"అవున్లే! తెలుసు నాకు, నీవడగబోయే దేమిటో, ఢిల్లీ వెళ్ళుతున్నావు గదూ, డబ్బు కావాలి, ఎంత కావల్సి వస్తుంది?"

"పిన్నీ! అక్కడ మూడు నెలలు ఉండాల్సి వస్తుంది. అవసరమయితే మరో నెల పట్టవచ్చు. జీతం వస్తూనే వుంటుందనుకో........."

వైదేయి గంగా ప్రసాద్ మాట కర్థం తగిలింది: "అవునవును, నీ కెంత జీతం వస్తుందో నాకు తెలుసు. నీ అలవాట్లను గురించి కూడా లక్ష్మి నాకు చెప్పాడు. జవాబుదారీగల ఆఫీసరువయినావు. కొంచెం తెలివి తేటలతో మెలగడం మంచిది."

"అవును పిన్నీ! నాకు తెలుసు. లక్ష్మి అన్నయ్యకు డబ్బు ఖర్చు పెట్టడమంటే మహాచిరాకు. కాని ఢిల్లీలో రాజులూ, మహారాజులూ వస్తుంటారు. గొప్ప గొప్ప వారితో కలిసి తిరగాలంటే, మరి వారి ముందు......" అంటూ గంగా ప్రసాద్ ఆగిపోయాడు.

"అవునోయ్, నాకు తెలుసది. నీవు కూడా ఏ మహారాజుకూ తీసిపోవు." అంటూ వైదేయి చాలా ఆప్యాయంగా గంగా ప్రసాదు తల నిమురుతూ అన్నది: "నేను చెబుతున్నాను గదా, నీముందు ఆ రాజులు మహారాజులూ బానిసల్లాగా కనిపిస్తారు. ఎంతైతే సరిపోతుందో చెప్పు. ఢిల్లీ వెళ్లి దర్జాగా జరుపుకో, మనస్సు చిన్నపుచ్చుకోకు."

"దాదాపు అయిదు వందలు సరిపోవచ్చు." అన్నాడు గంగా ప్రసాద్.

"అయిదు వందలతో ఏమవుతుందోయ్! నీసంగతి నాకు తెలియదూ?" అని వైదేయి వందరూపాయల నోట్లు పది లెక్కపెట్టి తన పెట్టెలో నుండి తీసి గంగా ప్రసాద్‌కు ఇచ్చింది: "ఇవి చాలకపోతే మళ్లీ వ్రాయి. అంతే గాని మనస్సులో బాధపడవద్దు. తెలిసిందా?"

నవ్వుతూ అన్నాడు గంగా ప్రసాద్! "పిన్నీ, నీ వెంత మంచిదానివో. కాని నీవల్ల నా అలవాట్లు చెడిపోతున్నాయి. నా ఠీవి చూచి అందరికి అసూయ కలుగుతున్నది."

వైదేయి కూడా నవ్వింది: "వాళ్ళను కుళ్ళుకోనీ, ఏడ్వనీ. పగవారి ఏడ్పు నీకు మంచిదే అవుతుంది. నీవు ఏ రాజులకూ, మహారాజులకూ తీసిపోగూడదు. అన్నట్టు నీవు చెప్పావు గదూ ఢిల్లీలో రాజులు, మహా

రాజులు వస్తుంటారని, రత్నాల కాంతులతో ఢిల్లీ ధగ ధగ లాడి పోతుంటుంది కాబోలు. నీ చెయ్యి బోసిగా ఉంది. కొంచెముందు ఇప్పుడే వస్తాను." అంటూ జైదేయి తన పెట్టెతెరచి ఒక వజ్రాల ఉంగరం బయటకు తీసింది. "ఎవరో ఒక రాజా ఆయన దగ్గర ఈ ఉంగరం కుదువ పెట్టి పోయాడు. పదకొండు గురిగింజలుంటుంది దీని బరువు. ఈయన అతనికి అయిదువేల రూపాయలిచ్చారు. మళ్లీ అతడీ ఉంగరం తీసుకు వెళ్లడానికి రాలేదు. నీవా ఉంగరం పెట్టుకుని వెళ్ళు. గొప్పగొప్ప రాజులు, మహారాజుల దగ్గర కూడా ఇలాంటి విలువగల ఉంగరం ఉండదు."

ఉంగరంలోని వజ్రాలకాంతికి గంగా ప్రసాద్ కండ్లు మిరుమిట్లు గొల్పి నట్లయింది. ఇంత పెద్ద వజ్రం నిజానికి అతనింతవరకు ఎప్పుడూ చూడ లేదు. పల్చని నీలవర్ణం, తళ తళలాడే కాంతి, బెల్జియంలో తయార యింది. గంగా ప్రసాద్ వేలికి ఆ ఉంగరం అతికినట్టు సరిపోయింది. గంగా ప్రసాద్ ఆ ఉంగరం తనకోసం ప్రత్యేకంగా ఆర్డరిచ్చి చేయించు కున్నాడా అన్నట్టుంది.

గంగా ప్రసాద్ జైదేయిని కౌగలించుకొన్నాడు: "పిన్నీ, పిన్నీ, నీవు మా అమ్మకంటే ఎక్కువ. నీకు నా మీద ఎంత అపేక్ష! ఎంత వాత్సల్యం!" ఈ మాటలు అంటూనే గంగా ప్రసాద్ కండ్లుచెమర్చాయి.

రెండు

లక్ష్మీచందుకు 'సర్' బిరుదు వస్తుందని ఎవ్వరూ కలలో కూడా అనుకో లేదు.

ఢిల్లీ దర్బారుకుగాను లక్ష్మీచందు యాభైవేల రూపాయలు చందా ఇచ్చాడు. లక్ష్మీచందుపై అధికార్ల ఒత్తిడే దీనికి కారణం. లక్ష్మీచందు

ఉత్తర భారతదేశంలో విదేశీ వస్త్ర విక్రేతల్లో అందరికంటె గొప్ప వర్తకుడని పేరు పడ్డాడు. కాని అతడంతటితో తృప్తి పడలేదు. బి.ఏ. వరకు ఇంగ్లీషు చదువు చదువుకొన్నందువల్ల ప్రభుత్వంలో అతనికి మంచి పలుకుబడి ఏర్పడింది. దానితో అతనొక గుడ్డల మిల్లు, ఒక పంచదార మిల్లు, రెండు నూనెల మిల్లులు కాన్పూరులో ఆరంభించాడు. అవికాక అలహాబాదులో ఒక కలప కార్ఖానా కూడా పెట్టాడు. ఈ వ్యాసంగంలో సహజంగా అతను కొంతవరకు వ్యాజ్యాలు వ్యవహారాలు కూడా జరిపించ వలసి వచ్చింది. డబ్బుతో ఆడుతున్నాడతను. కోట్లకొలది లాభం వచ్చే అవకాశం ఉన్నప్పుడు యాభైవేల రూపాయలు ఖర్చుపెట్టి అధికారుల మెప్పు సంపాదించుకోవడం లక్ష్మీచందుకు శ్రేయస్కరమనిపించింది. జనవరి మొదటివారంలో అతని పెద్ద పెద్ద కేసులు రెండు హైకోర్టులో అప్పీలుకు వచ్చాయి. అందుకని అతడు డిశంబరు చివరి వారంలోనే అలహాబాదు చేరాడు. 1912 జనవరి మొదటితేదీ 'పయొనియర్' లో క్రొత్త సంవత్సరం బిరుదులు పొందిన వారి జాబితాలో తన పేరు చూడగానే లక్ష్మీచందు సంతోషంతో గంతులు వేశాడు.

ఉదయంనుండి లక్ష్మీచందు నభినందించేవారు గుంపులు గుంపులుగా వచ్చి పోతున్నారు. ప్రతిచోటునుండి అభినందన సందేశాలతో తంతులు రావడం ఆరంభించాయి. జైదేయి లక్ష్మీచందుకు ఆరతి పట్టింది; గంగా స్నానం చేయించింది. గంగాస్నానం చేయించిన తర్వాత దేవుడికి పూజ చేయించి ప్రసాదం పంచిపెట్టారు. ఇంటికి వచ్చి లక్ష్మీచందు అన్నాడు :- "అమ్మా, మొదటి బండిలోనే నేను కాన్పూరు చేరుకోవాలి; అక్కడ నాకోసం ఎంతమందో ఎదురు చూస్తుంటారు. ఇప్పుడే నేను కాన్పూరుకు టెలిగ్రామ్ పంపించాను." అతడు కాసేపాగి మళ్లీ అన్నాడు: "ఇంత పెద్ద బిరుదు వచ్చిందంటే కాన్పూరు మిల్లులో పనిచేసే వేలకొలది కార్మికులు, బయట నగర వర్తకులు అనేకమంది నన్ను చూడడానికి వస్తారు. నీవు కూడా నాతో బయలుదేరి ఒక్క వారంపాటు కాన్పూరులో ఉండి వస్తే బాగుంటుంది. తర్వాత మళ్ళీ తిరిగి రావచ్చు."

అలాగే ఆ సాయంత్రం బండికి లక్ష్మీచందు జైదేయితో సహా కాన్పూరుకు బయలు దేరాడు.

రాత్రి తొమ్మిది గంటలకు రైలు కాన్పూరు చేరింది. స్టేషనులో లక్ష్మీ

చందుకు స్వాగతం చెప్పడానికి జనులు కిక్కిరిసి వున్నారు. ప్రఖ్యాత నగర వర్తకులు, లక్ష్మిచందు దగ్గర పనిచేసే కార్యకర్తలు — అందరూ అక్కడ హాజరైయున్నారు. రైలు ఆగగానే 'లక్ష్మిచందు కీ జయ్' అంటూ అందరూ అతనికి స్వాగతం చెప్పారు. పుష్పమాలలు వేశారు. స్టేషను బయట ఊరేగింపుకు అన్ని ఏర్పాట్లూ చేయబడి ఉన్నాయి - మిలిటరీ బ్యాండు, గ్యాసు బెలూన్లు, యాభై అరవై బండ్లూ ఏర్పాటు చేశారు. జైదేయి పరదా వేసిన బండిమీద నేరుగా ఇల్లు చేరుకుంది. పూవులతో అలంకరింపబడిన ఒక రథంమీద లక్ష్మిచందును కూర్చోబెట్టి ఊరేగింపు చేశారు.

రాధ జైదేయి పాదాలకు మ్రొక్కి ఆమెకు స్వాగతం చెప్పింది. ఆమె బంగళా దగ్గర కూడా ఆ సమయంలో చాలా గుంపు చేరింది. లక్ష్మి చందుకు సంబంధించిన చుట్టాలూ పక్కాలూ ముఖ్యంగా ఆడవాళ్ళంతా అక్కడ చేరారు. నౌకర్లు, హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. చెట్లకు నీళ్లుపోసే బదలూను పిలిచి రాధ చెప్పింది: "బదలూ! అమ్మగారిని ఆమె గదిలోకి తీసుకెళ్లు. ఆమెకు కావలసినవి చూచేందుకు భరోసీని అక్కడ ఉంచేసేయ్." తర్వాత ఆమె అత్తగారి వైపు తిరిగింది. "ఏం చెప్పనత్తయ్యా! ఈయన మిల్లులో పనిచేసే వాళ్ళు ఊళ్ళో వ్యాపారస్థులూ కలిసి ప్రాణం తీశారు. ఊరేగింపు జరిపించాల్సిందే నన్నారు. ఏం చెయ్యం మరి - ఇదంతా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అందరికీ ఇక్కడనే భోజనం - ఇప్పుడే ఏర్పాటు చేయాలి. ఎంత కాదన్నా మూడు నాలుగు వందలమంది అవుతారు. ఇప్పుడు నేనీ ఏర్పాటంతా చేయాలి. ఊరేగింపు ఇంటికి చేరేసరికి ఎంత పొద్దు పోతుందో చెప్ప లేము. అర్ధరాత్రి అయినా ఆశ్చర్యం లేదు. కనక నీవు కొంచెం ఎంగిలి పడి విశ్రాంతి తీసికో. ఎంతసేపని కాచుకొని వుంటావు?"

జైదేయి చాలా నిర్లిప్తంగా రాధవైపు చూచింది. తన కొడుకును తనకు కాకుండా చేసి ఈ యింటికి యజమానురాలై కూర్చున్న ఆ రాధవైపు ఒక్కసారి చల్లని నిట్టూర్పు విడిచి లేచి నిలుచుంది. "అవునమ్మా రాధా, నిజం చెప్పావు. అందరినీ జాగ్రత్తగా విచారించి వాండ్ల అన్నపానాలు చక్కగా చూచుకో. నా తండ్రి నందరూ చల్లగా దీవించి వెళ్ళాలి. నాకు

మాత్రం ఇప్పుడు ఆకలి అవడం లేదు. చాలా అలసటగా ఉంది, కొద్దిగా పాలు తాగి పండుకొంటాను.''

నవ్వుతూ అంది రాధ : "కాదత్తయ్యా! కొంచెం తీపి తినక తప్పదు. విందు భోజనాలను గురించి నీవేమీ దిగులు పెట్టుకోబోకు. ఇక్కడ విందులు, పార్టీలు, ఊరేగింపులూ-ఇవన్నీ నిత్యకృత్యాలై పోయినాయి. ఇంత పెద్ద అస్థానాన్ని చురుకుదనం, తెలివితేటలు లేకుండానే సమర్థిస్తున్నానా అత్తయ్యా?'' అంటూ నౌకరు వైపు తిరిగి ఇలా చెప్పింది: "వెళ్లి మిఠాయి తీసుకురా. ఒక గ్లాసు గంగాజలం కూడా పట్టుకురా. ఇటు చూడు, రాగి చెంబునిండా గంగాజలం పోసి అమ్మగారి గదిలో పెట్టి ఉంచు.''

అల్పాహారం చేసి జైదేయి మౌనంగా తన గదిలోకి వెళ్ళింది. మూడవ అంతస్తులో ఏమాత్రం శబ్దంలేని ఏకాంత స్థలంలో ఆమెకు గది ఇచ్చారు. గది చాలా విశాలంగా చక్కగా అలంకరింపబడి ఉంది. అప్పటికే భరోసీ గదిలో హాజరయి ఉంది. అదే జైదేయికి పక్కవేసి ఉంచింది. జైదేయి పక్కవైపు పండుకుంది. భరోసీ ఆమెకాళ్ళు పిసకడం మొదలు పెట్టింది. "చాల్లేవే, నాకంత అలసటగా లేదు. నీవు వెళ్ళి మా కోడలికి కొంచెం సాయం చెయ్యి'' అన్నది జైదేయి భరోసితో.

మరునాడు జైదేయి స్నానం, పూజ ముగించుకుని మూడవ అంతస్తునుండి కిందికి దిగి వచ్చింది. ఇంట్లో సందడి మొదలైంది. లక్ష్మీచందు పిల్లలు జైదేయి చుట్టూ చేరారు. జైదేయి ఆ పిల్లలతో హాయిగా కాలక్షేపం చేస్తూ ఉన్నది.

రాధ పుట్టింటికి సంబంధించిన ఆడవాళ్ళంతా అక్కడ ఉన్నారు. రాధకు సంబంధించిన బలగం బంధువర్గమంతా ఉంది. కానీ జైదేయి పుట్టింటి వైపు వారెవ్వరూ అక్కడ కనిపించ లేదు. జైదేయి సందర్భం కల్పించుకొని రాధనడిగింది: "అమ్మాయ్, బుద్ధూ, మున్నూ వాళ్ళు ఎవ్వరూ కనిపించడం లేదే ? వాళ్ళను పిలిచారో లేదో!''

రాధ దీనికి స్పష్టంగా సమాధానం చెప్పలేదు. "అత్తయ్యా, ఏ మొహం పెట్టుకుని పిలవడం వాళ్ళను ! అదిగాక మేమెవ్వరినీ పిలిచింది కూడా లేదు. అందరూ వాళ్ళంతట వాళ్ళే అభినందించడానికి వచ్చారు. వాళ్ళు కక్ష గట్టి మమ్మల్ని అభినందించడానికి రాకపోతే ఇందులో మా తప్పే ముంది ?'' అంటూ రాధ మరో పనిలో మునిగిపోయింది.

బుద్ధూలాల్, మున్నూలాల్ బైదేయికి అన్న కొడుకులు. వాళ్ళకు తోళ్ల దుకాణం ఉండేది. ఒకప్పుడు వాళ్లు కాన్పూరులో ప్రసిద్ధ వర్తకులుగా పేరు పొందారు. కాని ఇటీవల చాలా సంవత్సరాలుగా వాళ్ల స్థితిగతులు చెడిపోయినాయి. లక్ష్మీచందు బైదేయీ అన్న సుఖ్ఖూలాల్ దగ్గర చదువుకున్నాడు. లక్ష్మీచందు మామ సుఖ్ఖూలాల్ కూడా అతన్ని తన కన్న కొడుకుకంటె ఎక్కువగా చూచేవాడు. సుఖ్ఖూలాల్ చనిపోయే నాటికి బుద్ధూలాల్ వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు. మున్నూలాల్ పదిహేనేండ్ల వాడు. సుఖ్ఖూలాల్ తన ఇద్దరు కుమారులను లక్ష్మీచందు చేతుల్లో పెట్టి కండ్లు మూసుకున్నాడు. లాలా సుఖ్ఖూలాల్ దగ్గర పదిహేనిరవై లక్షలదాకా రొక్కం ఉన్నదని అందరూ అనుకున్నారు. కాని లక్ష్మీచందు తీరా లెక్క చూచేసరికి మొత్తం డెబ్భైవేల రూపాయలు పిల్లలకు మిగిలిందని తేలింది. దీనికితోడు సుఖ్ఖూలాల్ చనిపోయిన తర్వాత ఒక సంవత్సరంలోగానే లక్ష్మీచందు కాన్పూరులో ఒక చక్కెర మిల్లు, ఒక నూనె మిల్లు ప్రారంభించాడు. చుట్టాలూ, పక్కాలూ రకరకాలుగా అనుకున్నారు. సుఖ్ఖూలాల్ బావమరిది గిరిధారీలాల్ పిల్లల తరపున లక్ష్మీచందుపై వ్యాజ్యం కూడా వేయించాడు. రెండు సంవత్సరాలు కేసు నడిచింది. ఈ రెండు సంవత్సరాల్లో బుద్ధూలాల్, మున్నూలాల్ స్థితి మరింత దిగజారిపోయింది. కేసు ఓడిపోయే లక్షణాలు చూచి గిరిధారీలాల్ రాజీ చేయించాడు. ఈ వ్యవహారం నడిపించడంలో లాలా గిరిధారీలాల్ దగ్గఱ దాదాపు లక్షరూపాయల వరకు రొక్కం కూడింది. సుఖ్ఖూ, బుద్ధూల కంపెనీపై దాదాపు లక్షరూపాయల అప్పయింది.

లక్ష్మీచందు ఏదో కరణీకం చేశాడని బైదేయికి తెలుసు. గిరిధారీలాల్‌కు యాభైవేల రొక్కం ఇచ్చి ఈ రాజీ అయ్యేటట్టు చేశారని కూడా ఆమెకు తెలుసు. ఒకటి రెండు పర్యాయాలు ఆమె తన అన్న కొడుకుల తరపున లక్ష్మీచందుతో మాట్లాడడానికి ప్రయత్నించింది. కాని రాధా, లక్ష్మీచందూ ఆ చర్చ పెరిగేందుకు అవకాశమే ఇవ్వలేదు. బైదేయికి కాన్పూరులో ఉండడం ఇష్టం లేక పోవడానికి ఇది ముఖ్యమైన కారణం.

సంధ్యవేళ బైదేయి తన పుట్టింటికి వెళ్ళింది. తన తండ్రిగారి యింటి పరిస్థితి చూచి ఆమె స్తబ్ధురాలైపోయింది. ఆమె తండ్రి కట్టించిన పెద్దమేడ ఇప్పుడు రెండు భాగాలయింది. రెండు భాగాలకు మధ్య ఒక గోడ తయా

రయింది. జైదేయి వదినె ఆమెను మర్యాదగా లోపలికి రమ్మని పిలిచింది. కాని ఆమె ప్రవర్తనలో సౌహార్థము గాని మమకారముగాని కనిపించలేదు.

ఇంట్లో వాతావరణం కలహాలతో చాలా భయావహంగా ఉంది. బుద్ధూలాల్, మున్నూలాల్ ఆస్తులు పంచుకున్నారు. ఆమెకక్కడికి వెళ్లిన తర్వాత ఒక క్రొత్తవిషయం తెలిసింది. మున్నూలాల్‌కు లక్ష్మీచందు నడిపించే గుడ్డల మిల్లులో దలారి పని దొరికింది. ఇది బుద్ధూలాలుకూ, అతని తల్లికీ గిట్టలేదు. కోర్టు వ్యవహారాల్లో సుఖ్ఖూలాల్ - బుద్ధూలాల్ కంపెనీ పరిస్థితి చాలావరకు చెడిపోయింది. ఈ తగాదాతో మున్నూలాలుకు విసుగు పుట్టింది. ఈ దలారీ పనిలో మున్నూలాలుకు దాదాపు నెలకు వెయ్యి రూపాయలు ఆదాయం వస్తూ ఉండేది. అందుకని అతను తన సోదరునితో ఆస్తి పంచుకొని సుఖ్ఖూలాల్ - బుద్ధూలాల్ కంపెనీ నుండి వేరు పడ్డాడు.

జైదేయి పుట్టింట్లో దాదాపు రెండు మూడు గంటలసేపు ఉంది. అక్కడ పరిస్థితి ఆమెకు చాలా భయావహంగా, కటువుగా తోచింది. ఆ వాతావరణంలో ఆమెకు చాలా చిరాకు వేసింది. వెంటనే ఆమె తన కుమారుడి ఇంటికి తిరిగివచ్చింది. ఆమె తిరిగివచ్చేసరికి లక్ష్మీచందు భోజనం చేస్తున్నాడు. తల్లిని చూడగానే అతని ముఖంపై చిరునవ్వు వచ్చింది: "చూచావా అమ్మా మీ అన్నకొమాళ్ళను. ఇప్పుడు ఒకరిపై ఒకరు వ్యాజ్యాలు వేసుకొంటున్నారు. నేను కొంచెము సాయం చేస్తాం గదా అనుకుంటే బుద్ధూకు కోపంవచ్చింది. వాళ్ళ అమ్మ ఎక్కడలేని వైరం సాధించింది. పాపం మున్నూలాల్ నా మాట విన్నాడని వాడిపై కూడా వాళ్ళు కక్ష పూనారు."

జైదేయి దీనికి చాలా పరుషంగా జవాబు చెప్పగలిగేది. కాని చల్లని నిట్టూర్పుతో ఆమె చెప్పింది. "ఇదంతా ఈశ్వరుని లీల, దీనికెవరూ ఏమీ చేయగలిగింది లేదు."

ఎప్పటివలె జైదేయి తన అన్న కుమాళ్ళ తరపున చాలా తీవ్రంగా వాదిస్తుందని లక్ష్మీచందు అనుకున్నాడు. కాని అతనికి ఆశాభంగం కలిగింది. అతను మళ్ళీ మాటలు సాగించాడు: "అమ్మా, అలహాబాదులోని ఫ్యాక్టరీ అమ్మాలనుకుంటున్నాను. అందువల్ల నాకు లక్షరూపాయల లాభం వస్తుంది."

వైదేయికి ఆశ్చర్యం వేసింది. "అమ్మడం ఎందుకు? కలప ఫ్యాక్టరీ అక్కడ చక్కగానే నడుస్తున్నది గదా?"

"ఆ, నడుస్తూనే ఉంది. లేకపోతే ఎవరైనా నాకు లక్షరూపాయలు లాభం ఇచ్చి కొనడానికి తయారవుతారా? కాని నేనిక్కడ కాన్పూరులో ఉంటూ దాన్ని సరిగా చూచుకోలేక పోతున్నాను. అనవసరంగా డబ్బు దానిలో దిగబడి ఉంది. ఇక్కడ నేను మరో బట్టల మిల్లు నడిపించ బోతున్నాను. ఆ కలప ఫ్యాక్టరీమీద వచ్చే డబ్బుతోపాటు ఇంకొంచెం పెట్టుబడి పెట్టి ఈ మిల్లు ప్రారంభిస్తాను. కాన్పూరులో ఉండి నేను దాని మంచి చెడ్డలు శ్రద్ధగా చూచుకోగలుగుతాను.

వైదేయి భయపడుతూ భయపడుతూ అడిగింది: "మరి అలహాబాదులో ఆ ఇల్లు సంగతి ఏమనుకొన్నావు? అదిగూడ అమ్మేస్తావా?"

లక్ష్మీచందు నవ్వాడు: "లేదమ్మా! అలహాబాదులో ఇల్లు నీదిగదా! అదిగాక అలహాబాదు మన రాష్ట్రానికి రాజధాని. అక్కడ హైకోర్టుంది. నిత్యం వ్యాజ్యాలూ వ్యవహారాలూ జరుగుతూనే ఉంటాయి. ఈ వ్యవహారాలకోసం రావడం పోవడం తప్పదు."

వైదేయి ప్రాణం కుదుట పడింది. కొంచెంసేపాగి ఆమె అన్నది: "అంతా బాగానే వుంది కాని చందూ! ఇక నీవు రావడం పోవడం తగ్గి పోతుంది."

లక్ష్మీచందు అన్నాడు: "అందుకనే నేనెంతగానో చెప్పాను - ఇక్కడ కాన్పూరులో వచ్చి ఉండమని. నేను చెప్పింది నీకు అర్థమైతేగదా! గంగానది కాన్పూరులో మాత్రం లేదూ! అక్కడకు వెళ్ళి ఉండాల్సిన పని ఏమిటి? ప్రయాగ గొప్ప పుణ్యక్షేత్రమనే అనుకో, అయితే నీ పేరిట అక్కడ ఒక ధర్మసత్రం కట్టిస్తాను."

వైదేయికి నవ్వు వచ్చింది. "ధర్మసత్రం నేను చనిపోయిన తరువాత కట్టించు.........."

రాధ అందుకుంది: "అత్తయ్యకక్కడ ఒంటరితనమేముంది! నౌకర్లు చాకర్లూ అందరూ ఉన్నారు గదా! పెద్ద బంగళా, ఊళ్లో తిరగడానికి బాంగా, దేనికి కొరవ? అన్నిటికంటె మించింది పుణ్యతీర్థం త్రివేణి. మనం వెళ్ళి ఉండడానికి తగిన స్థలం. అత్తయ్యకు కాన్పూరులో ఉండడం ఇష్టం లేకపోతే దానివల్లవచ్చే నష్టం మాత్రం ఏమిటి?"

వైదేయి దృష్టి రాధవైపు మరలింది. ఆమె చూపుల్లో ఔదాసీన్యం, కృతజ్ఞత మేళవించాయి. కాన్పూరులో ఇంటి యజమానురాలు వైదేయి కాదు, రాధ అని స్పష్టంగా తేలిపోయింది. వైదేయి కాన్పూరులో వచ్చి ఉండడం అంటే రాధ చెప్పు చేతల్లో ఉండడమే అని దాని అర్థం. లేకుంటే ఇంట్లో రోజూ తగాదాలే. ఆమె లక్ష్మీచందుతో అన్నది: "కోడలు చెప్పిన మాట నిజమే బాబూ! అక్కడ నేను హాయిగానే ఉన్నాను. నౌకర్లూ చాకర్లూ అందరూ ఉన్నారక్కడ. పైన ఇక ముందు మాయా, మమకారం వదులుకొని భగవంతుని స్మరించవలసిన రోజులు. ఎప్పుడు పిలిపించుకొంటాడో తెలియదు. కనక అక్కడనే అలహాబాదులో ఉండి పూజలూ పునస్కారాలూ చేస్తూ ఉంటాను. నీవు వృద్ధికి రావడం, నూరు కాలాల పాటు వర్ధిల్లడం నాకు కావలసింది. దానికోసమే ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను."

ఒక వారం రోజులు కాన్పూరులో ఉండి వైదేయి అలహాబాదు తిరిగి వచ్చింది. మాఘమాసం వచ్చేసింది.

మూడు

ఢిల్లీ దర్బారునుండి తిరిగివచ్చి గంగా ప్రసాద్ సకుటుంబంగా బరేలీ చేరేసరికి అక్కడ వాతావరణంలో చాలా సంచలనం కనిపించింది. బరేలీలో ఆర్యసమాజం తొలి సమావేశం చాలా కోలాహలంగా జరుగుతూ ఉంది. పెరేడ్ గ్రౌండులో పెద్ద పెద్ద పందిళ్ళు వేశారు. ప్రతిరోజూ గొప్ప గొప్పవారు వచ్చి ఉపన్యాసాలిస్తున్నారు. దేశంలో ప్రసిద్ధికెక్కిన భజన సమాజాలన్నీ అక్కడికి చేరాయి. ఈ సమావేశాలకు ప్రాణం పోశారు స్వామీ జటిలానంద్. స్వామీ జటిలానంద్ ఆర్యసమాజ సిద్ధాంతాలను బోధించే గొప్ప ప్రవక్త. ఆయన వాక్కులో నుండి నిప్పులు కురిసేవి. స్వామీ జటిలానంద్ చేతయితే తనతో శాస్త్రార్థం చేయవలసిందని అన్ని

మతాలవారిని ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని అంగీకరించారు, అల్లామా వహాశీ.

మరునాడు కాక ఆ మరుసటి దినం అల్లామా వహాశీకి, జటిలానంద స్వామికి మధ్య శాస్త్రార్థం జరుగబోతుంది.

పందిరినిండా జనం క్రిక్కిరిసి ఉన్నారు. పోలీసు జమానులు కూడా అక్కడ చాలామంది హాజరయి ఉన్నారు. శాస్త్రార్థానికి నిర్ణేతగా మిస్టర్ ప్రేటర్‌ను నియమించారు. ఆయనగారు రావడం కొంచెం ఆలస్య మయింది. మిస్టర్ ప్రేటర్ వచ్చీరాగానే వేదికపైకి వెళ్ళారు. ఆయన ప్రక్కన ఆ సమయంలో మీర్ జాఫరాలీ, సోమేశ్వర శాస్త్రి, మిస్టర్ జోనాధన్ డేవిడ్ కూర్చుని ఉన్నారు. వీరందరూ కూర్చోగా వేదిక మీద ఇంకా అయిదారు కుర్చీలు ఖాళీగా మిగిలి ఉన్నాయి. వేదికకు ఎదురుగా ఒక మనిషి బాగా కూర్చోడానికి వీలైన పెద్ద పెద్ద ఆసనాలు మూడున్నాయి. వాటిలో మధ్య దానిమీద జటిలానంద స్వామి ఆసీనులై యున్నారు. కుడివైపు దానిమీద అల్లామా వహాశీ కూర్చున్నారు. ఎడమ వైపు ఆసనం మీద ఫాదర్ మసీహ్ కూర్చున్నారు.

మిస్టర్ ప్రేటర్ లేచి శాస్త్రార్థానికి సంబంధించిన నియమాలను వివరిం చారు. మొట్టమొదట అల్లామా వహాశీ స్వామీ జటిలానంద్‌ను ప్రశ్నిస్తారు. దానికి స్వామీ జటిలానంద్ సమాధానం చెపుతారు. ఈ ప్రశ్నలూ, సమాధానాలూ నిర్ణేతకు తృప్తికరంగా లేకపోతే మరల ప్రశ్నలకూ, సమాధానాలకూ అవకాశం వుంటుంది. ఆ తర్వాత అదే విధంగా ఫాదర్ మసీహ్ స్వామీ జటిలానంద్‌ను ప్రశ్నిస్తారు. స్వామీ జటిలా నంద్‌కు తర్వాత సమాధానాలు చెప్పే భారం అల్లామా వహాశీపై వుంటుంది. అప్పుడు కూడా అదే పద్ధతి అవలంబించాల్సి వుంటుంది. చివర సమాధానం చెప్పేది ఫాదర్ మసీహ్.

మిస్టర్ ప్రేటర్ ఈ నియమాలు ప్రకటించగానే మండపమంతా నిశ్శబ్ద మయిపోయింది. జటిలానంద స్వామి పద్మాసనంలో కూర్చుని ఓంకార నాదం చేశారు. ఆయన అనుచరులందరూ హర్షధ్వని చేశారు. అల్లామా వహాశీ ఒక పెద్ద దిండు నానుకొని కూర్చున్నారు. ఆయన చేతిలో జపమాల ఉంది. ఆయన కండ్లు మూసుకొని ఉన్నారు. చేతిలో జపమాల అతి వేగంతో తిరుగుతూ ఉంది. ఉన్నట్టుండి అల్లామా వహాశీ ఉలిక్కి పడ్డారు.

ఆయన నిప్పురవ్వల లాంటి ఎఱ్ఱని కండ్లు తెరచారు. మోకాళ్లపై కూర్చుని బిగ్గఱగా ఆయన ప్రశ్నించారు: "అల్లా అనుమతితో రసూల్ అనుగ్రహాన్ని పొంది నేను నిన్ను ప్రశ్నిస్తున్నాను. ఓ బోడి తల స్వాముల వారూ! నీవు తల గొరిగించుకోవడమేకాక మీసాలు కూడా గొరిగించేశావు. గడ్డం శుభ్రంగా తీసేశావు. నిన్ను పుట్టించిన భగవంతుడు నీ తలపై వెంట్రుకలు మొలిపించాడు. మీసాలు మొలిపించాడు. గడ్డంపై వెంట్రుకలు మొలిపించాడు. కాని నీ ఆకారం చూస్తే నీవు భగవంతుణ్ణి ఒట్టి పనికిరాని వాడిగా లెక్క గట్టినట్టు తెలుస్తున్నది. తల గొరిగించుకొని గడ్డాలూ మీసాలూ తీసేసుకొన్నందువల్ల నీవు భగవంతుని కంటె ఎక్కువ తెలివిగల వాడివని అనుకుంటున్నట్టుంది. ఈ వెంట్రుకలు మొలిపించిన భగవంతుడు చాల తెలివితక్కువ పనిచేశాడని నీ భావం కాబోలు. నీ చేష్టల వల్ల నీ భగవంతుని పనికిరానితనం బయట పడుతున్నది. ఓ బోడితల జటిలానంద స్వాముల వారూ! ఈ విధంగా నీ చేష్టలతో భగవంతుని తెలివితక్కువ తనాన్ని బయట పెట్టడం కృతఘ్నత, పచ్చిమోసం."

ఈ ప్రశ్నకు సోమేశ్వర శాస్త్రి ఉత్తేజితులైనారు. ఆయన కలక్టరుతో అన్నారు: "అయ్యా, ఇది ప్రశ్నకాదు, హేళన."

మిస్టర్ ప్రేటర్ నవ్వుతూ మీర్‌జాఫరాలీ వైపు చూచారు: "నీవేమంటావు మీర్?"

"దొరగారు న్యాయ నిర్ణేతలు. నిర్ణయం తమరే చేయాలి. ప్రశ్నించే పద్ధతి సరిగా లేకపోవచ్చు, కాని ప్రశ్న నాకేమీ ఎబ్బెట్టుగా కన్పించడం లేదు. ఇందులో తమరికి గానీ నాకు గానీ అంటే మనందరికిగానీ అవమానకరమైనది ఏమీ ఉన్నట్టు తోచడం లేదు."

తరువాత మిస్టర్ ప్రేటరు జోనాథన్ డేవిడ్ వైపు చూచారు: "ఏం మిస్టర్ డేవిడ్! నీ అభిప్రాయమేమిటి?"

జోనాథన్ డేవిడ్ వెంటనే సమాధానం చెప్పారు: "ఇదేం ప్రశ్న? ఇది చాల అసభ్యమైన ప్రశ్న: ఇలాంటిదానిని అడగనీయరాదు."

ఇప్పుడు మిస్టర్ ప్రేటర్ గంగా ప్రసాద్ వైపు తిరిగారు: గంగా ప్రసాద్ నవ్వుతూ అన్నాడు: "ప్రశ్న సరియైనది. ప్రశ్న అడిగే పద్ధ చాల సహజంగా ఉంది."

కొంచెంసేపు ఆలోచించి మిస్టర్ ప్రేటర్ అన్నారు: "ప్రశ్న అడిగే

పద్ధతి మాకు కొంచెం తప్పుగా తోచినప్పటికీ, ప్రశ్నచాల ప్రధానమయినది. అల్లామా వహాశీ హేళనగా ఈ ప్రశ్న అడిగారు కాబట్టి స్వామీ జటిలానంద్ కూడ అలాగే దీనికి సమాధానం చెప్పటానికి ఏలాటి అభ్యంతరమూ లేడు.''

ప్రేక్షకులు కరతాళ ధ్వనులు చేశారు: "ఎంత సబబైన నిర్ణయము, ఎంత చక్కని న్యాయము!"

ఇప్పుడు జటిలానంద స్వామి ఎలుగెత్తారు: "మహర్షి దయానంద్‌కు జయమగుగాక! మా మతమే ననుసరించి ప్రపంచంలో మూడు రకాల తత్వాలు పనిచేస్తాయి – పరమాత్మ, ఆత్మ, ప్రకృతి. అల్లామా అనబడే వహాశీ! నా శరీరం ప్రకృతిలోని భాగం. నా ప్రాణం ఆత్మకు చెందినది. ఈ ఆత్మకు ప్రకృతికి అధిపతి పరమాత్మ. ఆత్మను ప్రకృతిని సృష్టించిన వాడు పరమాత్మ అయినప్పటికీ, ఆయన ఈ రెంటినీ తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించమని స్వేచ్ఛగా వదిలిపెట్టాడు. ఓ అల్లామా వహాశీ! నీ ప్రశ్న ఒట్టి నాటకం వంటిది. ప్రకృతి అసంపూర్ణం కాకుంటే నీకు జామా ఉండదు, పైజామా ఉండదు. ప్రకృతిలో అడవులున్నాయి. అయినా మనుష్యుడు ఉద్యానవనాలు నిర్మించుకొన్నాడు. ప్రకృతిలో మంచు పడుతుంది, చలిగాలి వీస్తుంది. మనుష్యుడు ఇల్లు కట్టు కొంటాడు. దుప్పటి కప్పు కొంటాడు. మనయొక్క ఈ ఆత్మ ఉందే, అదే ప్రకృతిని సరిదిద్దుతుంది. ఇప్పుడు నా జవాబు విను. నేను తల గొరిగించుకున్నాను. గడ్డాలు, మీసాలు తీసేశాను. దీనికి కారణమేమిటో తెలుసా? ప్రకృతిలో ఉండే నిరుపయోగమైన వస్తువుల్లో చిక్కుకొని తలకు చమురురాచు కోవడం, రోజూ గడ్డం మీసం సరిగా ఉందో లేదో చూచుకోవడం, మొదలు పెడితే....... వీటన్నిటిని మించిన పరమాత్మ దగ్గరికి నా ఆత్మ చేరుతుందా? అది సరేగాని, ఓ అల్లామా! మీ అల్లా పర్వతాలు సృష్టించాడు, అడవులు సృష్టించాడు, సింహాలను పుట్టించాడు, నక్కలను సృష్టించాడు, పందులను పుట్టించాడు, పాములను పంపించాడు...... ఇవన్నీ సృష్టించిన తర్వాత నిన్ను సృష్టించడంతో మీ అల్లా ఎంత వెఱ్ఱి వెంగళాయ అనిపించుకొన్నాడో చెప్పడానికి వీల్లేదు. అల్లాను గురించి మూర్ఖ శబ్దం వాడడం తప్పు. మూర్ఖుడాయన కాదు నీవే అల్లామా!"

జటిలానంద స్వామి చెప్పిన ఈ సమాధానానికి ఒక వైపునుండి హర్ష ధ్వనులు వచ్చాయి. మరోవైపు నుండి అలజడి లేచింది: "కొట్టండిరా

వీణ్ణి. కాఫర్‌రా వీడు. ఖుదాను వెళ్ళివాడంటున్నాడు.'' మిస్టర్ ప్రేటర్ లేచి నిలబడి అల్లరి నణచి వేశారు: "ప్రశ్నకు తగిన జవాబు. కొట్లాటల్లో దిగినవారిని అరెస్టు చేసేస్తాం. పోలీసువాండ్లు ఇక్కడనే ఉన్నారు. ఈ ప్రశ్నలో స్వామీజీ గెలిచారు. ఇప్పుడు ఫాదర్ మసీహ్ జటిలానంద స్వామిని ప్రశ్నిస్తారు.'' అని అన్నారు.

ఫాదర్ రామ్ ఇలాహీ ఇంతవరకు నిశ్చింతగా కుర్చీలో కూర్చుని ఉన్నారు. మిస్టర్ ప్రేటర్ ఆజ్ఞాపించగానే ఆయన లేచి నిలబడ్డారు. ఆయన ఆకాశం వైపు చూచి ఇంగ్లీషులో ప్రార్థన చేశాడు: "ఓ తండ్రీ! నీ వెలుగును ఈ ప్రపంచంలో ప్రసరింపజేయుడానికి నాకు శక్తి నిమ్ము.'' అని ఆయన జటిలానంద స్వామి వైపు చూచాడు.

జటిలానంద స్వామి విజయ గర్వంతో ఫాదర్ మసీహ్ వైపు కొట్ట వచ్చినట్టు చూస్తున్నారు—మేక పిల్లను సింహం చూచినట్లు. ఫాదరు ఉపక్రమించారు. "స్వామీజీ! ఆర్య సమాజ్‌లో విగ్రహారాధన నిషిద్ధమనీ, గుడికి వెళ్లడం తప్పుగా భావించబడుతుందనీ అంటారు. నిజమేనా? ఆర్యసమాజ్‌లో పూజా విధానం, సంధ్యా వందనం, అగ్ని హోత్రం, యజ్ఞం అన్నీ కావాలని అంటారు, నిజమేనా?'' జటిలానంద స్వామి జవాబు చెప్పారు: "ఫాదరుగారూ! భగవంతుడు నిరాకారుడు. మీ క్రైస్తవ మతము కూడా ఈ మాటను అంగీకరిస్తుంది. ఆయన అంతటా ఉంటాడు. కాబట్టి గుడి, మసీదు, చర్చి, ఇవన్నీ నిష్ప్రయోజనములే. ప్రాచీన మహర్షులు, మునులు, యజ్ఞం చేసేవారు. భగవదారాధనకు ఇదే సర్వోత్తమమైన విధానం.''

ఫాదర్ మసీహ్ ఇప్పుడు దెబ్బతీశారు: "స్వామిజీ! హిందువులు శవాన్ని దహనం చేస్తారుగదా! మరి మీ యజ్ఞగుండం కూడా ఒక రకమైన చితేకదా! దానిలో మీరు స్వాహా స్వాహా అంటూ రోజూ మీ పరమాత్మను కాల్చివేసేస్తుంటారు కదా? అంటే మీ పరమాత్మను మీరు శవంగా భావిస్తారన్నమాట. అతన్ని కాల్చడానికి రోజూ మీరు యజ్ఞం చేస్తుంటా రన్నమాట.''

ఫాదర్ మసీహ్ అడిగిన ఈ ప్రశ్నకు జటిలానంద స్వామికి కొంచెం ఆవేశం వచ్చింది: "ఫాదర్, నీవు వట్టి మూర్ఖుడవు. మేము యజ్ఞం చేసేది ఆత్మశుద్ధికోసం, అంటే మేము మా పాపాలను దహించి వేస్తాం.

ఈ విధంగా మేము మా పాపాలను దహింపజేసుకొని పరమాత్ముని ఆరాధిస్తాం.''

ఫాదర్ మసీహ్ నవ్వాడు: "స్వామీ! పాపానికి శరీరం ఉండదు. పరమాత్మకు శరీరముండదు. మరి మీరు అగ్నిహోత్రంలో చితిపేర్చి కాల్చేది మీ పాపాలనో లేక పరమాత్మనో అనే విషయం మాకెలా తెలుస్తుంది?''

జటిలానంద స్వామి మండిపడ్డాడు: "ఏమిటలా శుద్ధం బద్ధం లేకుండా వాగుతున్నారండీ ఫాదరుగారూ! పరమాత్మ ఎక్కడనైనా కాలిపో గలడా? ఆయనకి జరామరణాలు లేవు. ఇలాంటి తెలివి తేటలతో బి. ఏ. ఎలా పాసయ్యావయ్యా?''

ఫాదర్ మసీహ్ బదులు చెప్పాడు: "అర్థంలేని ప్రసంగం చేస్తున్నది నేను కాదు, నువ్వు. పాపానికి శరీరమే లేనప్పుడు అది ఎలా కాలి పోతుంది? అంతేకాక పాపానికి కాలిపోయే లక్షణమేలేదు. అంటే పాపమే ఒక రకమైన అగ్ని. దానిలోపడి అందరూ భస్మమైపోతారు. కాబట్టి అగ్ని హోత్రమనీ, యజ్ఞమనీ అన్నీ బోధించిన మీ పూర్వీకులు, ఋషులు, మునులు ఉన్నారే వాండ్లంతా అజ్ఞానులు, మూర్ఖులు, అడవిజాతివాండ్లు. ఎవరైనా నిప్పుతోటి తమ తల్లిదండ్రులను పూజిస్తారా స్వాములూ? కాబట్టి మీ సంధ్యలూ, అగ్నిహోత్రాలూ, అన్నీ అజ్ఞానానికి తార్కాణాలు, ఆత్మవంచనలు.''

జటిలానందస్వామి ఏదో సరియైన సమాధానం కోసం కండ్లు మూసు కొని ఆలోచిస్తున్నారు. కాని ఆయన దగ్గర దీనికిక సమాధానం లేదని అనుకున్నారు మిస్టర్ ప్రేటర్. ఆయన లేచి చెప్పారు: "ఈ ప్రశ్నలో ఫాదర్ మసీహ్ నెగ్గారు. ఇప్పుడు అల్లామా వహాశీ వంతు. ఆయన ప్రశ్నకు సమాధానం చెపుతారు.''

మిస్టర్ ప్రేటర్ నోట ఈ మాటలు వినబడగానే గట్టిగా కరతాళ ధ్వనులు వినబడ్డాయి. జటిలానందస్వామి లేచి నిలుచున్నారు: "నేనిక శాస్త్రార్థం చెయ్యను. ఇదంతా అన్యాయం. క్రైస్తవ మతంమీద పక్షపాత మిది.'' అంటూ స్వామీజీ తన శిష్యవర్గంతో సహా ఒక్కుమ్మడిగా లేచి వెళ్ళిపోయారు.

స్వామీజీ బయటకు వెళ్ళగానే స్వామీజీ శాస్త్రార్థాన్ని వదలి పారిపోయా

రనీ, శాస్త్రార్థం ఇంతటితో సమాప్తమనీ కలెక్టరుగారు ప్రకటించారు. దీనితో శాస్త్రార్థం ముగిసింది.

గంగా ప్రసాద్ ఇల్లు చేరుకున్నాడు. అదంతా ఒక నాటకాల ప్రపంచంలా అతనికి తోచింది. జటిలానంద్, వహాళీ, మసీహ్, ప్రేటర్-వాళ్ళందరూ కలిసి ఒక విచిత్రమైన నాటకం ఆడారు.

నాలుగు

రైలు అలహాబాదు స్టేషనులో ఆగేసరికి గంగా ప్రసాద్ మనస్సు చాలా భారంగా ఉంది. అతను జైదేయి బంగళా చేరేసరికి అక్కడ వాతావరణం అంతా ఏదో తొక్కటగా ఉన్నట్టు తోచింది. ఆ సమయంలో భిఖా వరండాలో ఉన్నాడు. గంగా ప్రసాద్ టాంగాలో రావడం చూచి అతను సామాను దించడానికి పరుగెత్తి వెళ్ళాడు. సామాను దించుతూ అతనిలా అన్నాడు: "ఎక్కడ ఆలస్యమయింది బాబూ? నీవెక్కడ ఉన్నావో ఏమో మాకు తెలియకపోయె. లేకుంటే కబురు చేసేవాళ్ళం. అమ్మగారు ఎంతసేపటినుంచో నీకోసం కలవరిస్తున్నారు."

"ఏమయిందేమిటి? పిన్నమ్మ ఆరోగ్యంగా ఉందా!"

"అదే బాబూ! మిమ్మల్ని చూడడానికి ఆమె కండ్లల్లో ప్రాణాలు పెట్టుకుని ఉంది. డాక్టరు లాభంలేదని చెప్పిపొయ్యారు. నేరుగా ఆమె గదిలోకి వెళ్ళండి బాబూ! మీ నాన్నగారు ఆరు రోజులనుండి ఇక్కడనే ఉన్నారు. ఇప్పుడక్కడే ఆమె గదిలో కూర్చుని ఉన్నారు. లక్ష్మీచందు కూడ మొన్నటిరోజు వచ్చారు."

గంగా ప్రసాద్ నేరుగా జైదేయి గదిలోకి వెళ్ళాడు.

జైదేయి కండ్లు మూసుకుని మగతగా పండుకుని ఉంది. కాని లోపల ఏదో బాధను అణచివేసికోవడంవల్ల ఆమె మూతి వంకర పోయినట్టు అనిపిస్తున్నది. జ్వాలా ప్రసాద్ కూడా కండ్లుమూసుకుని ఆమె తలవైపు

కూర్చున్నారు. ఆయన నిద్రపోతున్నట్టు కనిపించారు. గంగా ప్రసాద్ కాళ్లచప్పుడు వినపడగానే జ్వాలా ప్రసాద్ కండ్లు తెరిచారు. "వచ్చావా తంద్రీ! వదినె చెప్పింది నిజమయింది. నీవు తప్పకుండా వస్తావని నిన్నరాత్రి ఆమె నాతో చెప్పింది. నీవు బరేలీలో లేవా? నేను రెండు టెలిగ్రాములిచ్చాను. నీ దగ్గరనుండి జవాబే రాలేదు."

"అవును నాన్నా, నేను కలకత్తా వెళ్ళాను. అక్కడ వారంలో అవుతుందనుకొన్న పని ఇన్నిరోజులు పట్టింది."

"నిన్న రాత్రినుండీ ఈమెకు స్పృహలేదు. అప్పుడప్పుడు మధ్యలో కండ్లుతెరచి నీవు వచ్చావా అని అడుగుతుంది: మళ్ళీ వెంటనే స్పృహతప్పి పడుకుంటుంది." ఈమాట అంటూనే జ్వాలా ప్రసాద్ కొంచెం బిగ్గరగా అన్నారు: "వదినా! నీమాట నిజమయింది, గంగూ వచ్చాడు."

జైదేయి కండ్లు తెరిచింది. కొంచెంసేపటి వరకు ఆమె రెప్పవాల్చకుండా గంగా ప్రసాద్ వైపు చూచింది. తర్వాత ఆమె చాలా హీనస్వరంతో అన్నది: "ఏదీ, కొంచెం దగ్గరకు రామ్మా - ఇంతకూ నీవెక్కడున్నట్టు బాబూ! నిన్ను చూడడానికి నా ప్రాణాలు కొట్టుకొంటున్నాయి. కాని నిన్ను చూడకుండా నా ప్రాణం పోదని నేను మరిదిగారికి చెప్పాను. అలాగే నీవూ వచ్చావు. భగవంతుడు నా మొర ఆలకించాడు." ఆ తర్వాత ఆమె జ్వాలా ప్రసాదు నడిగింది: "మరిదిగారూ! లక్ష్మి ఎక్కడ?"

"ఓ అరగంటయింది ఎక్కడకో వెళ్ళాడు. కమిషనర్‌గారింటికి వెళ్ళు తానని నాకు చెప్పి వెళ్ళాడు. కావలిస్తే ఎవరినైనా పంపించి పిలిపిస్తాను. ఏమయినా అనవసరమైన పనుందా?"

"ఆఁ, పని ఉందనుకోండి. కాని వాడు వచ్చినప్పుడే చూద్దాం." అంటూ ఆమె మళ్ళీ గంగా ప్రసాదును పలకరించింది: "సమయానికి వచ్చావు బాబూ! ఒక్కరోజు ఆలస్యమైనప్పటికి నిన్ను నేను చూచే దాన్నికాదు, నన్ను కూడా నీవు చూడగలిగే వాడివికావు."

జైదేయి కండ్లు మూసుకుంది. గంగా ప్రసాద్ తల నిమురడంవల్ల ఆమె కెంతో హాయిగా ఉంది. ఆమె మూతి వంకర పోయింది. జైదేయికి సహజంగా ఉండే ముఖముద్ర తిరిగి వచ్చింది. జైదేయి కొంచెంసేపు దాకా గంగా ప్రసాద్ తలమీద నుండి చెయ్యి తియ్యలేదు. ఆమె గంగా ప్రసాదుతో మాట్లాడనూ లేదు. అది గమనించి గంగా ప్రసాదే ఆమె

చేతిని తన తలమీద నుండి తీసి ఆమె ప్రక్కన పెట్టి అన్నాడు. "ఇదేమిటి నాన్నా! ఈమెకు స్పృహ తప్పినట్టుంది! "స్పృహ తప్పి ఇప్పటికి రెండు రోజులయింది. ఈమె ఇంతవరకూ ఎలా బ్రతికి ఉన్నదా అని డాక్టర్లు కూడ ఆశ్చర్యపోతున్నారు. వెళ్లి నీవు గుడ్డలు మార్చుకొని స్నానం చెయ్యి. ఈమెకు స్పృహ వచ్చి నిన్ను పిలవమంటే నేను పిలుస్తాను."

గదిలోనుండి బయటకు వచ్చేసరికి గంగా ప్రసాద్‌కు తన భార్య కనిపించింది. అక్కడనే అతను వాళ్ళమ్మను కూడా చూచాడు. కాని ఎవ్వరితోనూ, విశేషంగా మాట్లాడలేదు. వాతావరణం చాలా విచిత్రంగా ఉదాసీనంగా తయారయింది. స్నానంచేసి అతను భోంచేశాడు. ఆ తర్వాత డ్రాయింగ్ రూములోకి వచ్చి కూర్చున్నాడు.

మధ్యాహ్నానికి లక్ష్మీచంద్ ఇంటికి తిరిగి వచ్చాడు. గంగా ప్రసాద్‌ను చూచి అతను పలకరించాడు: "అమ్మయ్యా, వచ్చావా నీవు! ఇంతకూ నీవు ఎక్కడ ఉన్నట్టు? నీకోసం ఎంత విచారించామో! ఉత్తరాలు వ్రాశాం, టెలిగ్రాములిచ్చాం. కాని నీవెక్కడ మాయమయ్యావో జాడా జవాబు లేదు. అమ్మ నీకోసం కలవరిస్తూ ఉంది. ఆమెను చూచావా?"

"చూచాను. ఒకటి రెండు నిమిషాలసేపు ఆమెకు స్పృహ వచ్చింది. మళ్ళీ ఒళ్ళు తెలియలేదు. అయితే, నీవు కాన్పూరునుండి ఒక్కడివే వచ్చావా? వదినెను పిల్లల్ని తీసుకరాలేదా? ఇక్కడ పరిస్థితి ఇప్పుడో ఇంకాసేపటికో అన్నట్టుంది కదా!"

లక్ష్మీచంద్‌కు నవ్వువచ్చింది: "లేదు, ఒంటరిగానే వచ్చాను. నేనిక్కడకువచ్చి చాలా ధర్మసందేహంలో చిక్కున్నాను. మూడు రోజులయింది నేను వచ్చి. ఒకటి రెండు రోజులనుకొని వచ్చాను. కాన్పూరులో పనులన్నీ ఎక్కడివక్కడ నిలబడి ఉన్నాయి. ఇప్పుడే సివిల్ సర్జన్ను కలుసుకొని వచ్చాను. ఏమీ చెప్పడానికి వీల్లేదంటాడాయన. ఏ క్షణంలోనైనా ఈమె చనిపోవచ్చు. లేక ఇంకా నాలుగురోజులు పట్టినా పట్టనూవచ్చు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు."

"దీన్లో అర్థంకాకపోయేదేముంది అన్నయ్యా! ఉండిపోవాలి మరినీవు."

"అవును, ఉండిపోవాల్సినమాట నిజమే." అన్నాడు లక్ష్మీచంద్ కొంచెం పరధ్యానంతో. "ఎవరి చావుకైనా ఎదురుచూస్తూ ఉండడం ఎలాగో ఉంటుంది. కాని నేనదేపని చేస్తున్నాను ప్రస్తుతం. నేనే కాదు

ఇంట్లో అందరూ చేస్తున్న పనికూడా అదే. కాని నీ వెక్కడ మాయమయి పోయ్యావో చెప్పావు గాదు మరి!''

"కలకత్తా వెళ్ళాను. అక్కడ నా స్నేహితుడొకడు రమ్మని వ్రాశాడు. లాలా రాధా కిషన్-బహుశా నీవు పేరువిని ఉంటావు. నీకతడు తెలిసి ఉండవచ్చు కూడ. అయన తండ్రి గోపి కిషన్ ప్రస్తుతం కాన్పూరులో ఉంటున్నారు.''

"తెలియకేం. వాడు గోపీకిషన్‌గారి కుమారుడు రాధాకిషన్ గదూ! రాయ్ బహదూర్ అయిపోయినాడు. కలకత్తాలో సొమ్ముల వ్యాపారం చేస్తున్నాడు కదూ! తెలిసింది, అయితే, ఆయన దగ్గరకి వెళ్ళావా? ఎలా ఉంది కలకత్తాలో పరిస్థితి? రాజధాని ఇప్పుడు అక్కడ నుంచి ఎత్తేశారు గదూ!''

" రాజధాని లేక పోతేనేం. మునుపటిలాగే సందడి, సంచలనం, సంబరం అన్నీ అలాగే ఉన్నాయి. కలకత్తా వైఖరి చూచి నాకు గాబరా వేసింది.''

లక్ష్మీచందుకు నవ్వు వచ్చింది: "నీకు గాబరా వేసిందా? చాలా ఆశ్చర్యంగా ఉందే! నీవలా గాబరా పడేవాడివి కాదే.'' అంటూనే లక్ష్మీ చందు చాలా సేపటి నుండి రెప్పవాల్చకుండా గంగాప్రసాద్ వ్రేలి ఉంగ రాన్ని చూస్తూ ఉన్నాడు. "ఈ ఉంగరం చాలా అందంగా ఉంది. దీనిలో పొదిగిన వజ్రం కూడా చాలా పెద్దదిగా ఉంది. ఈ ఉంగరాన్ని నేనెక్కడనో చూచినట్టు తోస్తున్నది. కలత్తాలో కొన్నావా ఇది?''

"లేదు. ఇది నాకు పిన్నమ్మ ఇచ్చింది.'' అన్నాడు గంగా ప్రసాద్ కొంచెం సందేహిస్తూ.

లక్ష్మీచందు ముఖంలో రంగులు మారాయి: "అందుకనే దీన్ని ఎక్కడనో చూచినట్టు అనిపించింది నాకు.''

ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు. అదే సమయంలో జ్వాలా ప్రసాద్ కైదేయి గదిలో నుంచి బయటకు వచ్చారు. ఆయన డ్రాయింగు రూములోకి వచ్చి అన్నారు: "లక్ష్మీ, వదినెకు స్పృహ వచ్చింది. నిన్నూ, గంగూనూ పిలుస్తున్నది.''

వజ్రాల ఉంగరం సంగతి వినడంతో లక్ష్మీచందు ముఖంలో వచ్చిన మార్పు అలాగే ఉండిపోయింది. 'పద లోపలికి' అన్నాడతను లేస్తూను.

వైదేయి తలుపు వైపు చూస్తూనే వుంది వాళ్ళకోసం. ఆమె తల వైపున జ్వాలా ప్రసాద్ కుర్చీమీద కూర్చున్నారు. ఆమె మంచం ప్రక్కన రెండు కుర్చీలు వేసి ఉన్నాయి. వాటిలో ఒకదాని మీద లక్ష్మీచందు, మరోదాని మీద గంగా ప్రసాద్ కూర్చున్నారు. వైదేయి కొంచెంసేపు ఇద్దరినీ మౌనంగా చూచింది. ఆమె కండ్లు చెమర్చినాయి. తర్వాత కొంత సేపటికి చాలా హీన స్వరంతో ఆమె అన్నది: "ఇప్పుడు నాకు చివరి గడియలు వచ్చాయి. నాయనా లక్ష్మీ! నేను నీకోమాట చెప్పాలనుకొన్నాను. ఇది నా ఆఖరుకోరిక."

"అలాగే, చెప్పమ్మా? నీ చివరి కోరిక తప్పక నెరవేరుస్తాను." అన్నాడు లక్ష్మీచందు.

వైదేయి కొంచెం అలసటతో చెప్పింది: "ఈ గంగూను నేను నిన్ను పెంచినట్టే పెంచాను. అందుకని గంగా ప్రసాదుకు కూడా నేనేదైనా ఇద్దామనుకొన్నాను. నీకు చాలా ఆస్తిపాస్తులున్నాయి గదా! పాపమితను ఉద్యోగం చేసికొని బతుకుతున్నాడు. నా దగ్గర కొంచెం రొక్కం ఉంది. ఆ పెట్టెలో నగలున్నాయి. అవన్నీ గంగూకు ఇద్దామని ఉంది నాకు. గంగూ ఇక్కడ లేడని మరిదిగారితో ఈ మాట అంటే ఆయన ముందు నీతో చెప్పమన్నారు."

లక్ష్మీచందు నవ్వాడు – చాలా శుష్కంగా, కర్కశంగా: "అందుకనేనా గంగూ, గంగూ అని కలవరిస్తున్నావు. గంగాప్రసాద్ మొదట వచ్చి వుంటే నాతో ఇన్ని మాటలు చెప్పవలసిన అవసరమే ఉండేది గాదు. నాకు వినవలసిన అవసరమూ ఉండేది కాదు. ఈ వజ్రాల ఉంగరం గంగూకు నన్నడిగే ఇచ్చావా? చాలా విచిత్రంగా మాట్లాడుతున్నావే అమ్మా!"

వైదేయి కండ్లు మూసుకున్నది. ఏదో భయంకరమైన బాధ సహించలేక ఆమె నోరు మళ్ళీ వంకర తిరిగింది. తర్వాత కొంచెంసేపటికి ఆమె తెప్పరిల్లుకొంది. కొంచెం ఆగి ఆమె మూసిన కన్ను మూసినట్టే మాట్లాడడం మొదలు పెట్టింది: "నాకున్నది నేనిచ్చాను. ప్రతి విషయం నిన్నడగాలంటే నావల్ల అవుతుందా బాబూ! ఇప్పుడు నీవిక్కడకు వచ్చావు కాబట్టి అడుగుతున్నాను నిన్ను."

లక్ష్మీచందు అందుకున్నాడు: "మంచి పనిచేశావమ్మా, నన్నడిగావు

చివరకు. లేకుంటే నీవు నీవారిని వెళ్లిపోయే దానివి, ఇక్కడ వీళ్ల స్థితి దుస్థితి అయ్యేది. గంగా ప్రసాద్‌పైన నేను దొంగతనాన్ని ఆరోపించి అరెస్టు చేయించేవాణ్ణి. బాబాయికి ఇదంతా తెలుసు. అందుకనే ఆయన నీకీ సలహా ఇచ్చారు. ఇదిగో నేను చెప్తున్నాను విను! ఈ డబ్బు మీద ఎవరికీ ఏమాత్రం అధికారం లేదు. ఈ డబ్బు నాది. కనక నీవు గంగూకు ఏమీ ఇవ్వడానికి వీల్లేదు. ఇది మాత్రం ఖాయం. ఇతనికి నీవు చదువు చెప్పించావు. ఇతనికోసం నీవు వేలకు వేలు ఖర్చు పెట్టావు. అంతేగాక ఇతనికి ఈ వజ్రాల ఉంగరం ఇచ్చావు. ఇంకా నీవితనికి ఏమేమి ఇచ్చావో నాకు కొంచెం చెపితే బాగుంటుంది.”

జైదేయి ఇప్పుడు కండ్లు తెరిచింది. “అబ్బాయ్ చందూ! అంత నీచానికి దిగకు బాబూ! ఎవరికన్నా ఇవ్వడానికి నేను నాదగ్గర ఉంచుకొన్నది మాత్రమేముంది? ఉన్నదంతా నీకూ, నీ భార్యకూ ఒప్పచెప్పేశాను. ఆ పెట్టెలో నావి కొన్ని నగలు, పది పదిహేను వేల రొక్కం ఉంది. మహావుంటే పాతిక ముప్పైవేల వరకు ఉండవచ్చు. భగవంతుడు నాకు కోట్లకు కోట్లు ఇచ్చాడు. ఇంత చిన్న విషయానికి ఇంత రాద్ధాంతం చేస్తావెందుకురా!”

లక్ష్మీచందు కొంచెం ఉద్రేకంతో అన్నాడు: “కోట్లకు కోట్లని అన్నావే, అవి ఈ వందలతో వేలతోనే కూడుతాయమ్మా! గజానికి ఒక్క పైసా లాభంవస్తే, మిల్లు మొత్తంమీద లక్షల లాభం పోగవుతుంది. ఇదంతా నాది. నేను దాన్ని ఎలా వదలుకోవడం? అయిందేదో అయింది. ఇక నేను వీళ్ళకు ఒక్క దమ్మిడి ఇవ్వడానికి కూడా ఒప్పుకోను. అది మాత్రం ఖాయం.”

లక్ష్మీచందు కోపంవల్ల జైదేయికి మరింత చిరాకు వేసింది: “అంతా అబ్బగుణాలే వచ్చాయిరా నీకు చందూ! కాని .... కాని నీవు నన్ను ఆపలేవు.” నీరసించిన చేతులతో తన బంగారు గొలుసులోనుంచి తాళపు చెవి తీసి గంగాప్రసాదుకు ఇయ్యబోతు జైదేయి అన్నది: “నా వస్తువు నేను ఇయ్యడానికి నాకు పూర్తిగా హక్కున్నది. నీవు నన్ను ఆపడానికి వీల్లేదు. ఇదిగో గంగూ తాళంచెవి........” కాని లక్ష్మీచందు ఇదంతా ఊహించి తగిన జాగ్రత్తలోనే ఉన్నాడు. అతను తల్లి చేతిలోనుంచి

తాళం లాక్కున్నాడు: "మహా ఇద్దావులే గంగాప్రసాదుకు తాళం చెవి. ముదనష్టం ముండ!"

ఇప్పుడు గంగాప్రసాదు లేచాడు, జైదేయిని తిట్టడం సహించలేక లక్ష్మీచందు చెయ్యి పట్టుకుని అతడన్నాడు: "పిన్నిని తిట్టడానికి నీకు నోరెలా వచ్చిందిరా? సిగ్గులేకపోతే సరి!"

అప్పటికే లక్ష్మీచందు పూర్తిగా ఒళ్ళు తెలియని స్థితికి వచ్చాడు: "తిడతాను, మళ్ళీ తిడతాను, ఈ పాడు ముండను. ఈమె సంగతి మాకు తెలియక పోతేగా?"

జైదేయి కేక పెట్టింది: "అయ్యో రామ!" ఆ తర్వాత మళ్ళీ ఆమెకు స్పృహ తప్పింది.

అప్పుడు జ్వాలా ప్రసాద్ పిచ్చెక్కినట్టు లేచి నిలబడ్డాడు: "లక్ష్మీచంద్ ముందు గదిలోనుంచి బయటకు వెళ్ళు! ఊఁ, నడువు ముందు! నీ ఆస్తి పాస్తులన్నీ నీదగ్గరే ఉంచుకో. అవి ఎవ్వరికీ అక్కర్లేదు. పాపమీ మహాతల్లిని ప్రశాంతంగా ప్రాణాలు వదలనీ. వెళ్ళు గంగూ! నీవు కూడ వెళ్ళు ఈ గదిలో నుంచి. ఈ దురదృష్టరాలిని ప్రశాంతంగా చని పోనివ్వండి. జ్వాలా ప్రసాద్ పిచ్చికేకలు పెడుతున్నారు.

గంగా ప్రసాద్ తలవంచుకొని బయటకు వెళ్ళాడు. కానీ లక్ష్మీచందు లోని అగాయిత్యం మరీ ప్రజ్వరిల్లింది: "వెళుతున్నాను. కాని ఒక్కమాట గుర్తుంచుకోండి. ఈ యింట్లో ఏ వస్తువైనా చెక్కు చెదిరిందంటే తండ్రికీ కొడుక్కీ కూడా చీకటిగది కాపరం తప్పదు." అంటూ చాలా వేగంగా అతను బయటకు వెళ్ళాడు.

ఈ మాటలకు ఇంట్లో ఉన్న నౌకర్లూ అందరూ గది బయట పోగయ్యారు. మృత్యుచ్ఛాయలు ప్రసరిస్తున్న ఆ యింటిలో నలువైపులా భయంకరమైన హింసావృత్తి అలముకొన్నట్టుంది. జ్వాలా ప్రసాద్ చాలా బాధపడుతూ కుర్చీలో కూర్చున్నారు. ఆయన వదినను పలుకరించడానికి ప్రయత్నించారు: "వదినా, వాళ్ళందరూ వెళ్లారు. కండ్లు తెరువు."

కాని జైదేయి నిశ్శబ్దంగా నిర్జీవంగా పడిఉంది. ఏదో భయంకరమైన మానసిక బాధతో ఆమె నోరు చాలా వంకర తిరిగి పోయింది. జైదేయి దురవస్థ చూచి జ్వాలా ప్రసాద్ కండ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. చేతులు జోడించి ఇంటి కప్పువైపు చూస్తూ ఆయన ఏదో గొణగసాగారు: "హే

భగవాన్, వదినెగారేదయినా పాపం చేసిఉంటే ఆ శిక్ష నాకు విధించు. ఆమె బాధను తొలగించి, ఆమెను త్వరగా నీ సన్నిధికి చేర్చుకో తండ్రీ!" వంకర పోయిన ఆమె నోరు నెమ్మదిగా సరిఅవుతూ ఉంది. కాని ఆమెకు మళ్లీ స్పృహ మాత్రం రావడం లేదు.

సాయంత్రం ఆరు గంటలకు డాక్టరు వచ్చారు. జైదేయిని పరీక్షచేసి ఆయన అన్నారు: "పరిస్థితి చాలా చెడిపోయింది. బహుశా ఈమెకు మళ్ళీ స్పృహ రాకపోవచ్చు. ఇక మందు ఆపేయండి. గంగాజలం మాత్రం ఇస్తూ ఉండండి."

జ్వాలా ప్రసాద్ అన్నారు: "డాక్టరు గారూ! మూడు రోజుల నుండి ఈమె గంగాజలంతోనే ఉంది. మందు మీరెప్పుడో మాన్పించారు గదా!

"అవును, అమాటే మరచిపోయాను. నా కాశ్చర్యం వేస్తూ ఉంది. ఈమె ఇంతవరకు ఎలా బ్రతికి ఉందా అనీ!"

లక్ష్మీచందు అందుకొన్నాడు: "డాక్టరు గారూ! నేను మూడు రోజుల నుంచి ఇక్కడ ఉండిపోయాను. నా పనులన్నీ ఎక్కడి వక్కడ ఆగి పోయాయి. ఇంకా ఎంతకాలం ఈమె పరిస్థితి ఇలా ఉంటుంది?"

డాక్టరుగారు కొంచెం పరుషంగా జవాబు చెప్పారు: "రేపు మీరు ఈమె దహన సంస్కారాలు చేసి కాన్పూరు వెళ్ళగలరను కొంటాను."

డాక్టరు మాటల్లోని పారుష్యానికి లక్ష్మీచందు నవ్వాడు — కటువైన నవ్వు: "కాన్పూరు వెళ్ళడమనేది ప్రశ్నకాదు డాక్టరు గారూ! ఇక్కడ వీళ్ళ వ్యవహారమంతా నేను సరిచూచుకోవాలి. ఈ వ్యవహారాలకు గాను నాకు పదిహేనిరవై రోజులు పడతాయి ఇక్కడ. వీళ్ళందరినీ ఇక్కడి నుండి పంపించడమే అసలు నా సమస్య. దానికోసమే నేను విచా రించడం. సరే, మంచిది వెళ్ళిరండి."

డాక్టరును సాగనంపడానికి లక్ష్మీచందు, జ్వాలా ప్రసాద్ ఇద్దరూ బయటకు వచ్చారు. డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత లక్ష్మీచందు జ్వాలా ప్రసాద్‌తో అన్నాడు: "బాబాయిగారూ! కోపంలో నేనేమన్నా అని వుంటే వేరేగా భావించకండి. మీరే ఆలోచించండి. ఎదుట పరచిన విస్తరి ఎవరన్నా తీసుక వెళ్ళుతుంటే ఊరికే ఉండడం ఎలాగా? అన్నట్టు ఒక మాట వినండి. నేను మా గుమాస్తాకూ ప్రైవేటు సెక్రెటరికీ, టెలిగ్రాం ఇచ్చాను. వాళ్ళు నా భార్యనూ పిల్లల్నీ తీసుకొని ఒకటి రెండు రోజుల్లో

వచ్చేస్తారు. దీనివల్ల మీకు కొంచెం ఇబ్బందిగానే ఉంటుందనుకోండి. కాని మరేం చెయ్యను, తప్పిందికాదు. ఎలాగయినా మేమిక్కడ రెండు మూడు వారాలు ఉండాల్సి ఉంటుంది.''

జ్వాలా ప్రసాద్ ఆకాశం వైపు చూచి అన్నారు: ''మంచి పని చేశావు. అందర్నీ పిలిపించడం మంచిదే. ఈ రాత్రి దాటదనే అనుకొంటాను. రేపు ఉదయానికి అంతా ముగిసిపోతుంది.'' అంటూ జ్వాలా ప్రసాద్ వైదేయి గదిలోకి వెళ్ళారు.

మధ్యాహ్నం జరిగిన దారుణ ఘట్టం తర్వాత గంగా ప్రసాద్ ఊళ్ళోకి వెళ్ళాడు. రాత్రి దాదాపు తొమ్మిది గంటలకు అతను తిరిగి వచ్చాడు. రాగానే అతను నేరుగా వైదేయి గదిలోకి వెళ్ళాడు. వైదేయి ఒళ్ళు తెలియకుండా పండుకునే వుంది. ఆమె తలవైపున జ్వాలా ప్రసాద్ కుర్చీలో ప్రతిమలా కండ్లుమూసుకుని అలాగే కూర్చుని ఉన్నాడు. జ్వాలా ప్రసాద్ గంగా ప్రసాద్‌ను చూచి అన్నారు: ''కూర్చో గంగూ! ఈ వేళ రాత్రి ఎంత దీర్ఘంగా ఉందో అంత భయంకరంగా కూడా ఉంది.''

''మూడు రాత్రులనుండి జాగరణ చేస్తున్నావు నాన్నా! కొంచెం సేపు పండుకో వెళ్ళి. అప్పటిదాకా నే నిక్కడ కూర్చుంటాను.'' అన్నాడు గంగా ప్రసాద్.

జ్వాలా ప్రసాద్ చిరునవ్వుతో సమాధానం చెప్పారు: ''ఇంకో రాత్రి! ఇదే చివరి రాత్రి! ఈ రాత్రి కూడ మేలుకుంటాను. టైమెంతయింది?''

''తొమ్మిది గంటలా పదినిమిషాలు'' అని చెప్పాడు గంగా ప్రసాద్ గడియారం చూచుకుని.

''ఇక వెళ్ళు. నువ్వు వెళ్ళి అన్నం తిను. చూడు, లక్ష్మీచందు మాటలను లక్ష్యపెట్టకు. ప్రతి వ్యక్తి తన సహజ గుణాలననుసరించే పని చేస్తాడు. ఈ లక్ష్మీచందుకూ, ఇతని తండ్రి ప్రభుదయాల్‌కూ ఏమాత్రం తేడా లేదు.''

ఈ మాటలన్నీ తను వింటున్నట్టుగానే వైదేయి కండ్లు తెరిచింది: ''సరిగా చెప్పారు మరిదిగారూ! ఏమీ భేదం లేదు తండ్రీ కొడుకులకు, నా కడుపున పుట్టాడు కదా అని ఏదో ఆశ పడ్డాను. కాని అందువల్ల ఏమీ మార్పు కనిపించలేదు.''

వైదేయి కంఠంలో ఉన్న నీరసమంతా పోతూ ఉంది. ఆమె వంకర

తిరిగిననోరు సరిగ్గా వచ్చింది. "ఎలా వుంది వదిన గారూ ఇప్పుడు ?" అని అడిగారు జ్వాలా ప్రసాద్.

"చాలా హాయిగా ఉంది మరిదిగారూ, నా రోగమంతా పోయినట్టుంది. అబ్బాయ్ గంగూ, చాలా ఆలస్యం చేశావోయ్ ఇక్కడకు రావటానికి నీవు............ అంతా అదృష్టం. ఇక భోంచేయి వెళ్ళి. అందాక నేను మరిదిగారితో మాట్లాడుతూ ఉంటాను."

"అలాగే పిన్నీ, నేనిప్పుడే భోంచేసి వస్తాను." అని గంగా ప్రసాద్ బయటకు వెళ్ళాడు. జైదేయి నవ్వింది. "భోంచేసి వస్తాడు - అందాక నేనిక్కడ కాచుకుని ఉంటాననుకుంటున్నాడు పాపం!"

కొంచెంసేపు ఆగి మళ్ళీ జైదేయి పలుకరించింది: "చాలా దాహంగా ఉంది మరిదిగారూ! కొద్దిగా గంగాజలం ఇవ్వండి. చూడండి, గంగాజలంలో కాసిని తులసీ దళాలు కూడా వేసి ఇవ్వండి. ఇదే చివరి దాహమేమో! ఎవరికి తెలుసు!"

జ్వాలా ప్రసాద్ వెండిపాత్రలో తులసీదళం వేసి గంగాజలం తెచ్చారు.

"మరిదిగారూ! నన్ను కొంచెం లేపి కూర్చోబెట్టండి. చివరిసారి గంగాజలం పండుకొని ఎలా తాగను!"

జ్వాలా ప్రసాద్ జైదేయిని లేవదీసి కూర్చోబెట్టారు. ఆమెను ఆనుకొని, తనుకూడ ప్రక్కనే కూర్చున్నారు. జైదేయి ఒక గుటక గంగాజలం మింగింది. ఆమెకు కొద్దిగా తేపువచ్చింది: "నన్ను నేలమీద పండుకో బెట్టండి మరిదిగారూ! నేను వెళ్ళుతున్నాను!" అన్నది.

జ్వాలా ప్రసాద్ జైదేయిని మంచంమీదనుంచి తన చేతుల్లోకి తీసుకొనే సరికి ఆమెకింకొక పెద్ద తేపు వచ్చింది. దానితో ఆమె ప్రాణాలు విడిచింది.

అయిదు

"నీవా ?" ఆశ్చర్యంతో అన్నారు జ్వాలా ప్రసాద్ జ్ఞాన ప్రకాశ్‌ను చూచి.

"అవును బావా! నేనే. ఆదివారం బొంబాయిలో ఓడ దిగాను. సోమవారం అక్కడనుండి రైల్లో బయలుదేరి ఇప్పుడే అలహాబాదు చేరుకున్నాను. స్టేషను నుండి నేరుగా ఇక్కడికే వస్తున్నాను."

"నీవు వస్తున్నావని మాట మాత్రం కబురు పంపితే నేను స్వయంగా స్టేషనుకు వచ్చేవాణ్ణిగదా! అంటూ జ్వాలా ప్రసాద్ నౌకరు కుఱ్ఱాణ్ణి పిలిచారు: "గిరిధారీ! జ్ఞాన్‌బాబు సామాను లోపలపెట్టు. జ్ఞాన్ బాబు వచ్చారని ఇంట్లో చెప్పు."

జ్ఞాన ప్రకాశ్ మున్షీ రామసహాయ్ గారి కడగొట్టు కొడుకు. ఆయన 1912 లో బారిష్టరు చదవటానికి ఇంగ్లండు వెళ్ళారు. ఆయన ఇంగ్లండులో ఉండగానే మున్షీ రామసహాయ్ చనిపోయారు. ఆయన తల్లి ఆయన ఇంగ్లండు వెళ్ళక ముందే చనిపోయింది. రాజపురాలో ఆయన అన్న సత్య ప్రకాశ్ జమీందారీ వ్యవహారాలు చూచుకుంటూ ఉంటారు. ఇద్దరన్న దమ్ముల మనస్తత్వాల్లో భూమ్యాకాశాల మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంది. అందువల్లనే జ్ఞాన ప్రకాశ్‌కు ఇంటిమీద ఎక్కువ మమకారం లేకుండా పోయింది. బొంబాయినుండి ఆయన నేరుగా అలహాబాదు వచ్చేశారు. అక్కడనే వకీలుగా స్థిరపడిపోవాలని ఆయన సంకల్పం.

సామాను లోపల పెట్టించిన తరువాత జ్వాలా ప్రసాద్, జ్ఞానప్రకాశ్-ఇద్దరూ డ్రాయింగు రూములో కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ ప్రశ్నించారు: "మరి రాజపురా ఎప్పుడు వెళ్ళాలనుకుంటున్నావు? నీవు వస్తున్న విషయం సత్యప్రకాశ్‌కు తెలియజేసే ఉంటావనుకొంటాను."

జ్ఞాన ప్రకాశ్ చిరునవ్వుతో సమాధానం చెప్పారు: "ఇంగ్లండులో బయలు దేరే ముందుగా నాకిక డబ్బు పంపించవద్దని అన్నగారికి వ్రాశాను. ఇప్పుడప్పుడే రాజపురా వెళ్ళాలనే ఆలోచన ఏమీ లేదు. ప్రస్తుతం అలహా

బాదులో స్థిరపడాలని వుంది. జనవరి మొదటితేదీ నుండి ప్రాక్టీసు మొదలు పెట్టాలని సంకల్పం. మొదట హైకోర్టులో పేరు నమోదు చేయించు కోవాలి. అదీగాక ఇప్పుడింటికి వెళ్ళానంటే పెద్ద తగాదా అవుతుంది. సముద్రం దాటి పరదేశం వెళ్ళి వచ్చాను కదా అని వాళ్ళంతా ప్రాయ శ్చిత్తం చేసికో, అది చేసికో, ఇది చేసికో అని వేధిస్తారు. అదంతా ఎవరు పడతా రక్కడికి వెళ్ళి ?''

జ్వాలా ప్రసాద్ నవ్వుతూ అన్నారు : ''అవునోయ్, నీవు చెప్పింది నిజమే. పల్లెటూళ్ళలో ఇంకా ఈ చాదస్తం పూర్తిగా ఉంది. సత్య ప్రకాశ్‌ను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఈ చాదస్త వ్యవహారాల్లో అతడు కొమ్ములు తిరిగిన బ్రాహ్మణులని కూడ మించి పొయ్యారు.'' కొంచెం సేపు ఆగి ఆయన మళ్ళీ అన్నారు : ''కాని నీవు ఇంగ్లండులో చాలా కాలం ఉండి పొయ్యావు. మామయ్య నీ కోసం కలవరించి కలవరించి పొయ్యాడు.''

కొంచెం గాంభీర్యంతో అన్నాడు జ్ఞానప్రకాశ్ : ''మరి నేనేంచెయ్యను. మీరే చెప్పండి ? నేనక్కడికి వెళ్ళి వెళ్ళకముందే యుద్ధం మొదలయింది. యుద్ధంరోజుల్లో మరి అక్కడనుండి ఎలా రావడం ! యుద్ధం అయిపోయే సరికి నేను అమెరికాలో ఉన్నాను. అక్కడనుండి ఇంగ్లండుకు తిరిగి వచ్చే సరికి లండన్‌లో భారత రాజకీయాల అలజడి ఆరంభమయింది. మనదేశం నుండి సుహృద్భావ సంఘాలు ఒకటి తరువాత మరొకటి అక్కడకి వస్తూ వుంటే ఇక్కడికి రావడానికి బుద్ధిపుట్టలేదు.''

''కాని ఈ రాజకీయాలు ఇంకా కొనసాగుతాయి. ఎలాగయితేం, నీవు తిరిగి వచ్చావు. అంతే చాలు ! నీవు కిరస్తానీ మతం పుచ్చుకుని అక్కడనే ఏ దొరసాన్నో కట్టుకున్నావేమోనని సత్యప్రకాశ్ అనుకున్నారు. అలాంటివే ఏవో గాలి వార్తలు ఇక్కడ వినవచ్చాయి నిన్ను గురించి. నేను గూడా వినడం తటస్థించింది.''

''అవునవును. వార్తలు వినవస్తూ ఉంటాయి. అందులో నిజం ఉండ వచ్చు, లేక పోవచ్చు. అక్కడ మిషనరీలకు మనల్ని కిరస్తానీలుగా మార్చాలని అట్టే కుతూహలం ఉన్నట్టు కనిపించ లేదు. ఈ గొడవంతా ఇండియాలోనే కనబడుతుంది. ఇక పెండ్లి విషయం అడిగావు. ఇది కూడా అయ్యేదే కాని మధ్యలో ఆగిపోయింది. నన్ను పెండ్లి చేసికోవా లని అనుకొన్న అమ్మాయికీ అయిన సంబంధం ఒకటి ఉంది. అతను

జర్మనీ యుద్ధంలో చనిపోయాడని మొదట తెలిసింది. కాని అతను నిజంగా చనిపోలేదు. అతన్ని అరెస్టుచేశారు. మా పెండ్లికి సరిగ్గా ఒక వారం ముందు అంటే 1919 ఫిబ్రవరి ఎనిమిదవ తేది అతను ఇంగ్లండు తిరిగి వచ్చాడు. అంతటితో నా వివాహ ప్రసంగం ముగిసిపోయింది.''

''జ్వాలా ప్రసాద్ మనసులో 'అమ్మయ్యా' అనుకొని సంతోషించారు. ''పోనీ, అదీ మంచిదే అయింది. ఈశ్వరుడు చేసేదంతా మన మేలుకే చేస్తాడు. మళ్లీ తిరిగి వచ్చావు. కాబట్టి ఇక ప్లీడరు పని ఆరంభించు. నీ పెండ్లి విషయమై చాలామంది అడిగారు. దేశాంతరాలు తిరిగి వచ్చిన వాడివి కాబట్టి నీకు నచ్చిన పిల్లను నీవే నిర్ణయించుకో. ఇక్కడ సంబంధాలకేముంది! బనారస్ నుంచి రాయబహదూర్ కన్హయ్యాలాల్ ఈ రోజు ఉదయమే వచ్చి నిన్ను గురించి విచారించి వెళ్ళారు. పిల్ల అందంగా ఉంటుంది. ఎంట్రెన్సు చదువుతూఉంది. నేనా అమ్మాయిని చూశాను. వాళ్ళింట్లో ఘోషా అదీ ఏమీ లేదు. ఆ అమ్మాయి అదృష్టంకొద్దీ నీవు వచ్చేశావని ఆయనకు కబురు చేస్తాను.''

''కానీ రేపు నేను అమృతసర్‌కు బయలుదేరి వెళ్ళుతున్నాను. ఈ రోజు డిశంబరు 22 వ తేది. డిశంబరు 26 అక్కడ కాంగ్రెస్ సమావేశం''

''అయితే నీవా కాంగ్రెస్ సభలకు వెళ్ళడం చాలా అవసరమా?'' అని అడిగారు జ్వాలా ప్రసాద్.

''అవసరమనేది ప్రపంచంలో ఏదీ లేదు. కాని మనదేశంలో ఉదయిస్తున్న ఈ నూతన చైతన్యాన్ని ఒక్కసారి కళ్ళారా చూద్దామని వుంది. ఇప్పుడీ కాంగ్రెస్ సభలు జరుగబోయే అమృతసర్‌లో కదా జలియన్ వాలాబాగ్ హత్యలు జరిగాయి. నన్నడిగితే మీరు కూడా నాతో వస్తే బాగుంటుంది.''

జ్వాలా ప్రసాద్ నాలుక కొరుక్కొంటూ అన్నాడు: ''అమ్మమ్మో! నా పెన్షను నాకు దక్కనియ్యి. ఈ రాజకీయాందోళనలు బయలుదేరుతాయి. అణగిపోతాయి. కాని బ్రిటిష్ ప్రభుత్వం యథాప్రకారంగా రాజ్యమేలుతునే ఉంటుంది. మధ్యలో నేను పెన్షను పోగొట్టుకోవడం ఎందుకు?''

అప్పుడు గోడ గడియారంలో పది కొట్టింది: ''అరే! అప్పుడే పది గంటలయిందే. లే, భోంచేద్దాం వెళ్ళి. నీ పక్కతయారయి ఉంటుంది. వెళ్ళి రాత్రికి హాయిగా నిద్రపో. ఈ రోజు ఇరవై రెండో తేది, రేపు

ఇరవై మూడు. నీవిక్కడ ఇరవై నాలుగు బయలుదేరినా ఇరవై అయిదు ఉదయానికి అమృతసర్ చేరుతావు. ఇరవై ఆరున కదా కాంగ్రేస్. రేపే వెళ్ళాల్సిన అవసరమేముంది? రేపంతా ఇక్కడ విశ్రాంతిగా ఉండు.”

జ్వాలా ప్రసాద్ రెండు సంవత్సరాల క్రితం రిటైరయినారు, ఇప్పుడు ఆయన జార్జిటౌన్‌లో ఇల్లుకూడ కట్టుకున్నారు.

మరునాడు ఉదయం జ్ఞాన ప్రకాశ్ నిద్రలేచేసరికి తొమ్మిది గంటలయింది. బయట పొగమంచు కమ్ముకొని మసక మసకగా ఉంది. జ్వాలా ప్రసాద్ త్వరత్వరగా తయారయి గుడ్డలు వేసుకొన్నారు. చలిగాలి తీవ్రంగా వీస్తూవుంది. జ్ఞాన ప్రకాశ్ మనస్సులో ఒక రకమైన ఉత్సాహం, స్ఫూర్తి కనిపిస్తూ ఉంది. జ్వాలా ప్రసాద్ గుడ్డలు వేసుకొని వరండాలో సిద్ధంగా కూర్చుని ఉన్నారు. పోర్టికోలో ఆయన టాంగా సిద్ధంగా నిలబడి ఉంది. జ్ఞానప్రకాశ్ కనిపించగానే ఆయన అన్నారు: నీకు చాలాసేపు నిద్ర పట్టినట్టుంది. వెళ్ళి టిఫెను తీసుకో. నాకు స్టేషనుకు వెళ్ళాల్సిన పని ఉంది. ఇప్పుడే గంగూ దగ్గరినుండి టెలిగ్రాం వచ్చింది. వాడీరోజు అలహాబాదు వెళ్ళుతున్నాడు. వాణ్ణి తీసుక రావడానికి స్టేషనుకు వెళ్ళాలి. క్రిస్మస్ సెలవులకు వస్తున్నాడు. బండి పదకొండు గంటలకు వస్తుంది.”

జ్ఞాన ప్రకాశ్ కూర్చుంటూ అన్నాడు. “భేష్, బాగుంది. అమృతసర్ వెళ్ళేలోగా అతన్ని కలుసుకోవడం అవుతుంది. ఎక్కడ పని చేస్తున్నాడతనిప్పుడు?”

“జోన్పూరులో ఉంటున్నాడు: అక్కడినుండి వస్తున్నాడిప్పుడు. వాడు వస్తూనే ఉన్నాడు గదా! వాడినే అడుగు క్షేమ సమాచారాలు.”

“ఒంటరిగానే వస్తున్నాడా, అతని భార్య కూడా వస్తున్నదా?”

“అన్నట్టు నీకు చెప్పడం మర్చిపోయ్యాను. వాడి భార్యా, బిడ్డలూ ఇప్పుడిక్కడనే ఉన్నారు. వాడి పిల్లవాడు ఇక్కడ చదువుచున్నాడు. వాడి భార్య కూడా ఇక్కడకు వచ్చి ఒక నెల అయింది. వాడి భార్య సాక్షాత్తు లక్ష్మీదేవి.”

జ్ఞాన ప్రకాశ్ నవ్వారు: “ఇంకేం, మీకు ఒంటరితనం లేకుండా ఇదో వ్యాసంగం. పదండి, నేను కూడా మీతో స్టేషనుకు వస్తాను. అక్కడినుండే అటు ఊళ్ళోకి వెళ్ళుతాను.”

జ్ఞాన ప్రకాశ్ గంగా ప్రసాద్ కంటే మూడు సంవత్సరాలు పెద్ద.

కాని వాళ్ళిద్దరి మధ్య ఒక రకమైన ఘనిష్ఠమైన అనురాగం ఏర్పడింది. జ్ఞాన ప్రకాశ్ అలహాబాదులో మోర్ సెంట్రల్ కాలేజీలోనే బి.ఏ.యల్.యల్.బి. చదివాడు. గంగా ప్రసాద్‌తో కలిసి ఎప్పుడూ తిరుగుతుండేవాడు. జ్ఞాన ప్రకాశ్‌ను చూడగానే గంగా ప్రసాద్ ముఖంపై వెలుగు వచ్చింది. తండ్రి పాదాలకు నమస్కరించి తర్వాత జ్ఞాన ప్రకాశ్‌ను కౌగలించుకొన్నాడు. "అరే! చాలా తమాషాగా కలిసి కొన్నామే. ఇంగ్లండులో మహా సరదాగా కాలం గడిపినట్టున్నావు. మమ్మల్ని పూర్తిగా మరిచి పొయ్యావు. దొరసాన్ని వెంటబెట్టుకు వచ్చావా లేదా?"

జ్ఞాన ప్రకాశ్ నోటిమీద వ్రేలు వేసుకొని అన్నాడు: "అడగాల్సినవన్నీ ఒక్కసారే అడిగేస్తావేమిటోయ్? ఇంటికి పద, ఒంటరిగా అన్నీ చెపుతాను. నిన్నరాత్రే వచ్చాను. మీరింటికి వెళ్ళండి. ఇప్పుడే నేను గంటా రెండు గంటల్లో వచ్చేస్తాను. భోంచేశాక మనమలా వెళ్దాం. అప్పుడు సరదాగా కబుర్లు చెప్పుకుందాం."

కలుసుకోవాల్సిన వాండ్లను కలుసుకొని దాదాపు ఒంటి గంటకు జ్ఞాన ప్రకాశ్ ఇల్లు చేరాడు. జ్వాలా ప్రసాద్, గంగా ప్రసాద్ ఇద్దరూ అతని కోసం ఎదురు చూస్తున్నారు. భోంచేసిన తర్వాత ఇద్దరూ కాలినడక సాగించారు. గవర్నమెంటు హౌసుదాటి అల్ఫ్రెడ్ పార్కులో ప్రవేశిస్తూ జ్ఞాన ప్రకాశ్ అన్నాడు: "అయితే గంగూ, చెప్పుమరి ఎటు వెళదాం? ఎన్నాళ్ళు మకామిక్కడ?"

"రెండవ తేది కచ్చేరీ తెరుస్తారు. మధ్యాహ్నానికి జోన్పూరు వెళ్ళాలి. అంతవరకూ నన్నడిగే వాడు లేడు. న్యాయంగా నేను సెలవుల్లో కూడా జిల్లా వదలి ఉండడానికి వీల్లేదు. కాని కలెక్టరుకు నా మీద చాలా అభిమానం. ఆయన నాకు పర్మిషనిచ్చారు. ఇక నీ కార్యక్రమమేమిటో చెప్పు."

"నా కార్యక్రమమేముంది? చాలా సింపిల్. ఈ సాయంత్రంలోగా ఒక బంగళా అద్దెకు తీసుకోవాలి. ఇంతకుముందే కొన్ని బంగళాలు చూచి వచ్చాను. రేపు ఉదయం మెయిలు బండిలో అమృతసర్ వెళ్ళాలి. కాంగ్రెస్ మహాసభలు జరుగుతున్నాయి. ఆ మహాసభలు చూడాలని ఉంది."

గంగా ప్రసాద్ కొంచెం గాంభీర్యంగా చూచి అన్నాడు: "అది సరే

కాని మామయ్యా, కాంగ్రెసుకు కొంచెం దూరంగా వుంటే మంచిది. దీనిలో ఏమీ లేదు.''

ఆ మాటలు విని జ్ఞాన ప్రకాశ్ బిగ్గరగా నవ్వాడు: ''సరిగ్గా నీవిలాగే అంటావని అనుకొన్నానోయ్. డిస్ట్రిక్ట్ కలెక్టరువు కదా! మజాగా హాయిగా జీవితం గడుస్తుంది. కాని యూరపునుంచి వచ్చిన నన్నడుగు చెపుతాను. మనం బానిసలం, అనాగరికులం, అస్పృశ్యులం. నీకివన్నీ అనుభవానికి రాలేదు. ఇండియా దాటి బయటకు వెళ్ళితేనే కాని ఈ అనుభవం కలగదు. లక్షల కొలది ప్రజలకు భాగ్య విధాతనుచేసి నిన్ను అధికార మదంతో బొమ్మలాగా తయారు చేస్తున్నది ఈ ప్రభుత్వం.''

''మామయ్యా, నీవు చెప్పేమాటలో తప్పేంలేదు. కాని.........కాని నా పరిస్థితిని నేను చూచుకుంటే నాకు బాధపడవలసిన అవసరమేమిటి చెప్పు. ఆ మాటకు ఎవరికైనా ఇంక కావలసిందేమిటి? ఏదో ఒక వ్యవస్థ అంటూ ఉంది. ప్రాణాలకు, ఆస్తిపాస్తులకు కావలసిన భద్రత ఉంది. అన్ని పనులూ యథా విధిగా జరిగిపోతున్నాయి. ఇక మన బ్రిటిష్ సామ్రాజ్యం సంగతి చెప్పేదేముంది? ఎంత గొప్పదో ఈ సామ్రాజ్యం! ప్రపంచంలో అయిదో భాగం ఈ సామ్రాజ్యం క్రింద ఉంది. జర్మనీని చిటికలో తొక్కి వేసేసింది ఈ బ్రిటిష్ సామ్రాజ్యం.''

''అవునవును, జర్మనీని అణగదొక్కింది ఈ సామ్రాజ్యం! కాని జర్మనీని ఓడించింది ఎవరో నీవేమైనా ఆలోచించావా? ఈ మహా యుద్ధంలో ఎంతమంది భారతీయులు మరణించారో నీకు తెలుసా? ఇంగ్లీషువాళ్ళ తరపున భారతీయులే పోరాడారు. ఘూర్ఖాలు, సిక్కులు, పఠాన్లు, బిలోచీలు, రాజపుత్రులు, గఢ్‌వాలీలు, తెలంగులు, మహారాష్ట్రులు—ఈ సైనికులందరూ భారతదేశంనుండి వెళ్ళారు. యాభై లక్షల భారత సేన కలగజేసుకుంటేనే గాని జర్మనీని ఓడించడం సాధ్యం కాలేదు. గంగూ, ఇప్పుడివన్నీ ఏకరువు పెట్టినందువల్ల ప్రయోజనమేమీ లేదు. మనకు 'డొమీనియన్ స్టేటస్' వచ్చి తీరాలి.''

ఆల్ఫ్రెడ్ పార్కుదాటి వాళ్ళిద్దరూ కత్రానుండి సిటీ వైపు వెళ్ళే మెయిను రోడ్డు చేరారు. అక్కడనుండి వాళ్ళు ఊరివైపు వెళ్ళకుండా సివిల్ లైన్సు వైపు మళ్ళారు. గంగా ప్రసాద్ నీరసంగా అన్నాడు: ''మామయ్యా నీవు చెప్పేదంతా నిజమే. నా సంగతే చూడు డిప్టీ కలెక్టరు పనితోనే జీవితం

తెల్లవారి పోతుందనిపిస్తున్నది. మహా అయితే! బహుశా జాయింటు మేజిస్ట్రేట్ చేస్తారేమో! కాని నిన్నగాక మొన్న పుట్టిన ఇంగ్లీషువాడు నాపై ఆఫీసరయి కూర్చుని నా మీద అధికారం చలాయిస్తాడు. అందుకని మామా "డొమినియన్ స్టేటస్" గనక వస్తే ప్రొమోషన్లను గూర్చి కలలు కనడానికైనా అవకాశం ఉంటుంది."

"అలారా దారికొచ్చి" అన్నారు జ్ఞాన ప్రకాశ్ నవ్వుతూ. "అయితే వస్తావా నాతోటి అమృతసర్ ?"

ఉలిక్కి పడ్డాడు గంగా ప్రసాద్ : "ఒళ్ళు దగ్గర ఉందా మామా. నన్ను అమృతసర్ - కాంగ్రెస్‌కు రమ్మంటున్నావా ? గవర్నమెంటుదాకా ఈ వార్త వెళ్ళిందంటే ఏదయినా ప్రమోషనువచ్చే అవకాశం ఉంటే అదంతా దీనితో ఖాళీ. ఈరోజుల్లో సి.ఐ.డి వాండ్ల సంగతి నీకేం తెలుసు ?"

"అరే పిచ్చివాడా ! సి.ఐ.డి. లకు భయపడతావేంట్రా. నా పేరు జ్ఞాన ప్రకాశ్ అయితే నీపేరు రామ ప్రకాశ్ అనుకో. అంటే నీవు నా తమ్ముడి వన్న మాట. అంతా ఎరుగని ముఖాల మధ్య మనల్ని అడిగేదెవరు ? సి.ఐ.డి.లు నాయకుల వెంట తిరుగుతారు. అదీగాక ఇండియాలో గూఢ చారులు ఎంత పనికిరాని వాండ్లో నీకిపాటికి తెలిసే వుండాలి. అంతే కాదు, పంజాబు పోలీసులకు నీవెవరివో, నేనెవరినో ఏం తెలుస్తుందోయ్ ? కాబట్టి బయలుదేరు నాతో. అక్కడ ఏం జరుగుతుందో చూద్దాం. అక్కడ దేశనాయకులందరూ కనిపిస్తారు. ముఖ్యంగా మిస్టర్ గాంధీని చూడ వచ్చు. ఎప్పుడైనా యీ కాంగ్రెసు సభలకు వెళ్ళావా ?"

"ఇంతవరకు వెళ్ళలేదు. కాని నీవిసారి నానోరూరిస్తున్నావు, నీతో రావాలనే అనిపిస్తున్నది. కాని నాన్నకి ప్రోగ్రామంతా తెలియకుండా చూడాలి. అంటే ఏదో సాకు చెప్పాలి, అంటే అబద్ధం ఆడాలి ! ఏమయినా సరే ఆయన నన్ను కాంగ్రెస్ సభలకు వెళ్ళనియ్యరు. అది మాత్రం ఖాయం."

"దానికింత ఆలోచనెందుకోయ్. ఇంతవరకూ నీ కార్యక్రమమేమిటో నాన్నకు చెప్పలేదుకదా ! చాలా అవసరంగా ఆగ్రా, మధుర, అలీగఢ్, మేరఠ్, ఎక్కడికో ఒక కార్యక్రమం తయారు చేయి. అలీగఢ్‌లో నీ పాత స్నేహితులెవరైనా ఉన్నారనుకో."

"అవును. అన్నట్టు అలీగఢ్‌లో సోమేశ్వర శాస్త్రి గారున్నారు. నాన్నకు ఆయనతో పరిచయం కూడా ఉంది". అన్నాడు గంగాప్రసాద్.

"అలాకాదు, శాస్త్రిగారివల్ల లాభంలేదు. ఆయన మీ నాన్నకు తెలుసు కాబట్టి పట్టుబడిపోతావు. మీ నాన్నకు తెలియని వాళ్ళెవరైనా ఉంటే చూడు."

గంగాప్రసాద్ కొంచెం ఆలోచించాడు! "మీరఠ్‌లో కృష్ణ చంద్ర మిశ్ర ఉన్నాడు, అసిస్టెంట్ సర్జన్!"

"భేష్! అయితే ఆ శ్రీ కృష్ణ చంద్రమిశ్రగారి కుమారుని కేశఖండన మహోత్సవానికో, ఉపనయన మహోత్సవానికో వెళ్ళుతున్నావన్న మాట!"

"అబ్బే, ఈ పుష్యమాసంలో అలాంటి శుభకార్యాలేవీ జరగవు." అన్నాడు గంగాప్రసాద్.

"భలే చిక్కు తెచ్చిపెట్టావోయ్ నీవు. అయితే పుష్యమాసంలో మనిషి చావడానికి వీలుందా? కనక నీవు అతని తండ్రిగారి కర్మాంతరాలకు వెళు తున్నావనుకో. దీనిలో ఏమీ మడత పేచీ లేదుకదా!"

"నిజమే. మూడు సంవత్సరాల క్రింద అతని తండ్రిగారు చనిపోయారు గూడా!"

"ఇంకేం! అతని తండ్రి సంవత్సరం క్రింద చనిపోయాడని చెప్పి అతని ఏడూడికి వెళ్ళుతున్నానని చెప్పేసేయి. ఇరవై ఆరో తేదీ ఏడూడి. ఇరవై ఏడు అతను నిన్ను వెళ్ళనియ్యడు. చాలా రోజులకు కలుసు కొంటారు గదూ మరి! కాబట్టి ఇరవై ఎనిమిది బయలుదేరి ఇరవై తొమ్మిదికి తిరిగి ఇక్కడికి చేరుకుంటావు. ఒకరోజు, అరరోజు దారిలో ఆలస్యం కావచ్చు గదా!"

ఇరవై అయిదు ఉదయం ఇద్దరూ స్టేషనుకు వచ్చారు. జ్ఞానప్రకాశ్ అమృతసర్‌కు రెండు థర్డ్‌క్లాసు టిక్కట్లు తీసుకొన్నాడు. గంగాప్రసాద్‌కు ఆశ్చర్యం వేసింది: "థర్డ్‌క్లాసులో వెళ్ళగలమా మామయ్యా? విపరీతమైన గుంపు, దూర ప్రయాణం!"

"అవునోయ్ తెలుసు! అందుకనే థర్డుక్లాసు టిక్కెట్లు తీసుకున్నాను. హాయిగా నిద్రపోయి ప్రయాణం చేయవచ్చు. ఇంటర్‌లో స్థలం దొరకడం కష్టం. నాయకులంతా అమృతసర్ వెళుతున్నారు కాబట్టి సెకండు క్లాసులో

15

స్థలం దొరుకుతుందో దొరకదో చెప్పడం కష్టం. ఫస్ట్ మన హోదాకు తగినట్లుగా ఉంటుంది. ఫస్టులో వెళ్ళితే దార్లో ఎవరన్నా తల బిరుసు తెల్లదొర మనకు తారసిల్లి సామాన్లతోపాటు మనల్ని కూడా బయటకు నెట్టి కొట్టడానికి సిద్ధమైనా కావచ్చు. ఇప్పుడు వాటన్నిటికీ అవకాశం లేదు. థర్డ్ క్లాసులో హాయిగా నిద్రపోయి ప్రయాణం చేద్దాం.''

ఆరు

ఛింకీకి దహన సంస్కారాలు చేసి త్రివేణి నుంచి భీఖూ ఇంటికి తిరిగి వచ్చేసరికి బాగా చీకటి పడింది. ఛింకీ తలలో కొరివి పెట్టగానే జ్వాలా ప్రసాద్ ఇంటికి వచ్చేశారు. కాని దాయాదులతోపాటు భీఖూ చివరి వరకు అక్కడనే ఉండవలసి వచ్చింది. ఆ రోజు ఉదయంనుంచీ జల్లు పడుతూ ఉంది. మధ్య మధ్య కొద్ది కొద్దిగా వాన కురుస్తూ ఉంది. జ్వాలా ప్రసాద్ వరండా లోపలిభాగంలో పరధ్యానంగా కూర్చుని ఉన్నారు. పక్కన యమునా, పిల్లలూ కూడా ఉన్నారు. ఇల్లంతా దుఃఖంతో నిండి ఉంది. భీఖూ రాగానే జ్వాలా ప్రసాద్‌తో అన్నాడు: ''బాబు గారూ! అంతా ముగిసిపోయింది. ఇక మీరు వెళ్ళి తిండి తినే ఏర్పాటు చూచుకోండి. పిల్లల సంగతి చూడాలి ముందు.''

''మరి నీవో?'' అని అడిగారు జ్వాలా ప్రసాద్.

''నే నీ రోజు ఉపోషం ఉంటాను. బయటగదిలో పండుకొని నిద్ర పోతాను.''

''బయటగదిలో ఎక్కడ పండుకుంటావు భీఖూ? మీ అమ్మ గదిలోనే నిదురపో. ఈ రోజు రాత్రినుంచి అక్కడ దీపం కూడా పెట్టాలి. ఛింకీ నీకోసం ఇచ్చిపోయిన సామానంతా భద్రం చేసుకో. నీవు వచ్చేసరికి

దానికి స్పృహ తప్పిపోయింది. ఒళ్ళు తెలిసినంత సేపు నీకోసం కలవరిస్తూనే ఉంది. పాపం తను దాచిందంతా నీ కివ్వాలని అనుకొన్నది.”

“దాచిందేముంది బాబూ, ఉన్నదంతా మీదేకదా, మీ దగ్గరే ఉంచండి. నాకు మాత్రం వెనకా ముందూ ఎవరున్నారు! గంగూ ఒక్కడే. అతను కూడా మీ పిల్లవాడే.” అన్నాడు భీఖూ.

“అలా కాదు భీఖూ: నీ వున్నంత కాలం ఈ ఆస్తి నీదే. నాకు తెలిసినంతవరకూ ఛింకీ దగ్గఱ దాదాపు వెయ్యిరూపాయల దాకా రొక్కం, రెండు మూడు వందలకు నగలూ ఉండాలి. నీకు వివాహమయితే కోడలికి ఇస్తానని ఎప్పుడూ అంటూ ఉండేది. చనిపోయేవరకు ఎలాగైనా భీఖూను పెండ్లిచేసికోమని చెప్పు బాబూ అని నాతో అనేది.”

భీఖూకు నవ్వు వచ్చింది: “ఇప్పుడిక పెండ్లి మృత్యు దేవతను చేసికోవలసిందే బాబూ! యాభై దాటింది. ఇంతవరకు పెండ్లి చేసుకోనివాణ్ణి ఇప్పుడు చేసుకుంటానా? పెండ్లి చేసుకోక పోతేనేం, నాకూ ఇల్లూ, వాకిలీ, పిల్లలూ అంతా ఉన్నట్టే. గంగా బాబుతో నా జీవితమంతా గడిచిపోతుంది.” కొంచెంసేపు ఆగి అతను మళ్ళీ అన్నాడు: “బాబూ, మీరు మరోలా అనుకోకుండా ఉంటే ఓ మాట మీకు చెప్పాలి బాబయ్యా!”

“అలాగే చెప్పు. ఇందులో అనుకునేదేముంది భీఖూ?” “నేననేదేమంటే మీరూ అమ్మగారూ వెళ్ళి చిన్నబాబు దగ్గఱ ఉండకూడదా అని. చిన్నబాబు భార్య ఏడాదిలో సగం రోజులు ఇక్కడనే అలహాబాదులో ఉండడంచేత చిన్నబాబును ఒంటరిగా అక్కడ వదలిపెట్టి ఉండడం మంచిదికాదేమో అనిపిస్తున్నది. మీరిద్దరు అక్కడికివెళ్ళి ఉన్నారంటే చిన్నబాబు కొంచెం జాగ్రత్తగా ఉంటారు!”

గంగాప్రసాద్‌ను గురించి జ్వాలా ప్రసాద్‌కు సంతోషకరమైన వార్తలు వినబడడంలేదు. అతని దుష్ప్రవర్తనను గురించిన వార్తలు స్థానిక వర్గాలను దాటి ప్రాంతీయాధికారులదాకా వెళ్ళాయి. జ్వాలా ప్రసాద్ గంగాప్రసాద్‌తో ఈ విషయమై సూక్ష్మంగా హెచ్చరించడం గూడా జరిగింది. కాని దానివల్ల గంగాప్రసాద్‌లో ఏమాత్రం మార్పురాలేదు. యమున జ్వాలా ప్రసాద్‌తో అన్నది: “భీఖూ చెప్పేది బాగానే వుంది. ఇక్కడ అలహాబాదులో ఏముంది కాబట్టి, మనం పిల్లవాణ్ణికూడ విడిచిపెట్టి

ఇక్కడ ఉండడానికి! ఈ యిల్లు అద్దెకిచ్చేద్దాం. యాభై అరవై రూపాయలు ఆదాయమన్నా వస్తుంది. అదీగాక రెండుకాపరాలు నడపడంవల్ల అయ్యేఖర్చన్నా కొంచెం తగ్గుతుంది. మీరు కూడా వచ్చి జోన్నూరులో ఉండకూడదా అని అమ్మాయి నాతో చాలాసార్లు చెప్పింది. పెద్ద బంగళా, ఒంటరిగా ఉండడం దానికి కష్టంగా కూడా ఉంటున్నది. నేనే ఎందుకులే అని ఊరుకుంటూ వచ్చాను. కాని ఇప్పుడర్థమయింది అమ్మాయి అలా ఎందుకనేదో.''

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: ''అలాగే. ఆలోచిద్దాం దీన్ని గురించి.''

''ఇందులో ఆలోచించేదేముంది? మీరు జోన్నూరు వెళ్ళి ఉండడం తప్పదు. అలా చేయడమే చిన్నబాబుకు మేలవుతుంది. మన వంశగౌరవం దక్కుతుంది. ఇష్టంవచ్చినట్టు డబ్బు ఎదపెడతూ ఉన్నారట చిన్నబాబు. రెండు మూడు వేల అప్పయిందని కూడా విన్నాను బాబూ.''

జ్వాలా ప్రసాద్ నివ్వెర పోయారు: ''ఏమిటీ? అప్పయిందా? అప్పెలా అయింది?''

''ఇదంతా నేను మీకు చెప్పానని చిన్నబాబుకు చెప్పేరు! నా ప్రాణం తీసేస్తారు. ఏం చెప్పను బాబూ, చిన్నబాబంటే నాకు భయం వేస్తుంది. ఇంతకూ చిన్నబాబు ఎవరినో ఉంచుకొన్నారుట. దానికయ్యే ఖర్చుగాక రోజూ సారాయి తాగడానికయ్యే ఖర్చుతోడయితే మరి చూచుకోండి బాబూ. అప్పుకాకెక్కడికి పోతుందో!''

జ్వాలా ప్రసాద్ చాలా గంభీరంగా అన్నారు: ''అంతవరకు వచ్చిందీ!'' యమునవైపు చూచి అన్నారు: ''ఈ సంగతిని గురించి అమ్మాయి నీతో ఎప్పుడూ చెప్పలేదుటే?''

యమున కండ్లల్లో నీళ్ళు తిరిగాయి: ''కళకళగా నవ్వుతూ ఉండడం అది ఎప్పుడో మానేసింది. కాని పల్లెత్తి ఒక్కమాట చెప్పదు. దానికి జోన్నూరులో ఉండడం సంతోషంగా ఎందుకు లేదో ఇప్పుడు నాకర్థమవుతున్నది.''

జ్వాలా ప్రసాద్ చటుక్కున అనేశారు: ''వల్లగాదు. మనం వెంటనే జోన్నూరు వెళ్ళి అక్కడ ఉండాలిసిందే. జోన్నూరులో ఉంటే అన్నీ చక్కబడతాయి. రేపు జ్ఞానప్రకాశ్‌ను కూడా సలహా అడుగుతాను.''

ఇటీవల నాలుగయిదు రోజుల నుండి జ్ఞానప్రకాశ్‌కు పొత్తిగా తీరిక లేకుండా వుంది. కలకత్తా కాంగ్రెసు సభలకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశంలో తొలిసారి పెద్ద ఎత్తున తీవ్రమైన స్వాతంత్ర్యోద్యమ నిర్వహణకై నవ చైతన్యంతో ప్రజానీకం ముందంజవేస్తున్నది. జ్ఞానప్రకాశ్‌లో ఆ చైతన్యస్ఫూర్తి పూర్తిగా కనిపిస్తున్నది. స్వల్పకాలంలోనే జ్ఞానప్రకాశ్ గాంధీజీ అనుచరుల్లో అగ్రగణ్యుడయ్యాడు. జ్వాలాప్రసాద్ జ్ఞానప్రకాశ్ దగ్గరకు వెళ్ళేసరికి జ్ఞానప్రకాశ్‌తో పాటు కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు కూర్చుని ఉన్నారు. ఏదో విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతూఉంది. జ్ఞానప్రకాశ్ అంటున్నారు: "మనలాంటి విద్యావంతులయిన మధ్యవర్గంపైననే బ్రిటీష్ సామ్రాజ్యం ఆధారపడి ఉంది. జమీందారులు వారికి సంబంధించినంత వరకు రాజులకనుకూలంగా ఉండి రాజుల నిరంకుశ స్వభావాన్ని ప్రోత్సహించి చదువురాని అమాయకులైన ప్రజలపై అధికారం చలాయించడం అలవాటు. కాబట్టి ఇలాంటి జమీందార్లు బ్రిటీష్ సామ్రాజ్యానికే ద్రోహదమిస్తారనడంలో సందేహం లేదు."

రాజబిహారీకి జ్ఞానప్రకాశ్ చెప్పిన ఈ మాట నచ్చలేదు. ఆయన గొప్ప జమీందారు. ఆయన చాల బాధపడుతూ అన్నారు: "అదేమిటిలా అంటారు? ఈ సామంతరాజులు, జమీందార్లేకదా 1857 లో తిరుగుబాటు చేసింది! చారిత్రకమైన ఈ సత్యాన్ని మీరు నిరాకరించడానికి ప్రయత్నిస్తున్నారు."

జ్ఞానప్రకాశ్ ప్రశాంతంగా జవాబు చెప్పారు: "రాజాగారూ, చరిత్ర నిజమే, కాదనలేదు. కాని చారిత్రిక సంఘటనలను వివరించి చెప్పడంలో తప్పొప్పులు ఉండవచ్చు. 1857 లో జరిగిన తిరుగుబాటు, విప్లవం లేక విద్రోహం - దానికి మీరేపేరైనా ఇవ్వండి - అది ఎలా పరిణమించిందో మీకు తెలియనిదికాదు. ప్రజాసామాన్యం దానియందు ఆసక్తి కనబరచలేదు. కనుకనే అది జయప్రదం కాలేదు. ఈనాటి పరిస్థితులను 1857 లోని పరిస్థితితో పోల్చడం కూడా భావ్యంకాదు. చరిత్ర తిరగేసినందువల్ల మనకేవో క్రొత్తవిషయాలు తెలుస్తాయనుకోవడం కేవలం భ్రమ. చరిత్ర గతించింది. మాటిమాటికి పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి.

ప్రమాణాలు మారుతాయి, విలువలు మారుతాయి, వ్యక్తులు మారిపోతారు. వీటితోపాటు అన్నిటిని మించి మానవ చైతన్యం వికసిస్తూ ఉంటుంది.''

జ్ఞానప్రకాశ్ చేసే తత్వబోధకు జయనాథ్‌పాండేకు విసుగుపుట్టి ఆయన అడిగారు: ''నామాట విని ఈ సిద్ధాంతాలూ, రాద్ధాంతాలూ వదలిపెట్టి అసలు విషయానికి రండి. ప్లీడరుపని వదలి పెట్టడం, చదువులు మానేయడం, కౌన్సిల్‌ను బహిష్కరించడం, బిరుదులను వదలి పెట్టడం - వీటన్నిటివల్ల స్వరాజ్యం వస్తుందని మీరు గుండెపైన చేయిపెట్టు కొని చెప్పగలరా?''

జ్ఞానప్రకాశ్ సమాధానం చెప్పారు: ''కాని మనం ఈ పనులన్నీ సక్రమంగా చేయగలిగి ఉండాలి. మీరే ఆలోచించండి. ముప్పైమూడు కోట్ల భారతీయులమీద సుమారు రెండులక్షలమంది ఇంగ్లీషువాళ్ళు అధి కారం చలాయిస్తున్నారు. ఇందులో ఒకటిన్నర లక్షదాకా సైనికులే ఉంటారు. పోతే మిగిలిన యాభైవేలమంది ఆంగ్లేయులు మన భారత దేశంలో ప్రభుత్వం నడిపిస్తున్నారు. ఇది ఎలా సాధ్యమయిందనేదే మనం ఆలోచించవలసిన ముఖ్యసమస్య. దాదాపు పది - పదిహేను లక్షలమంది భారతీయులు ఇంగ్లీషు చదువు చదువుకుని, ఇంగ్లీషువారి క్రింద పనిచేస్తూ, సమస్తదేశం ఇంగ్లీషువారికి బానిసగా ఉండేందుకు ఇంగ్లీషువారికి తోడ్పడు తున్నారు. వీరివల్లనే ఇది సాధ్యమవుతున్నది. వీళ్ళుకనక ఇంగ్లీషు వాళ్ళతో సహకరించకపోతే భారతదేశాన్ని ఇంగ్లీషువాళ్ళు పరిపాలించ గలగడం అసంభవమవుతుంది. అంతేకాదు, భారతదేశంలో వాళ్ళు ఉండడానికి కూడా సాధ్యంకాదు.''

రాజబిహారీ తడుముకుంటూ అన్నారు: ''అంటే ఏమన్నమాట - ప్రభుత్వంలో పనిచేసే భారతీయులంతా ఉద్యోగాలు వదలుకుంటే ఈ స్వరాజ్యం వస్తుంది. అంటే తేలిపోయింది. ముప్పందుం వడ్లు దంపి, వినాయకుడికి ఉండ్రాళ్ళు పెట్టేదీ లేదు, వినాయకుడు వరాలిచ్చేదీ లేదు. గవర్నమెంటు ఉద్యోగస్తులు పెద్ద పెద్ద జీతాలు తీసికొని హాయిగా కాలం గడుపుతుంటే వాండ్లకేం పట్టింది ఈ స్వరాజ్యమూ, పోరాట మూను! ఇక మిగిలింది ప్లీడర్లూ, విద్యార్థులూను. ప్లీడర్లు ప్రాక్టీసు వదులు కోవాలి. విద్యార్థులు చదువు మానేసి చవటలు కావాలి. సరేకానీండి,

జ్ఞానప్రకాశ్ గారూ! ఒకరిసంగతెందుకు, మీ సంగతి చెప్పండి. మీరు ప్లీడరుపని మానేయడానికి తయారేనా ?''

లాలా శీతల ప్రసాద్‌కు నవ్వు వచ్చింది: "ఈయన ప్లీడరు పని ఆరంభిస్తేకదటయ్యా వదలుకోడానికి! కాని నూరు చెప్పండి, ఈ ఉద్యమంలో గాంధీని మనం అనుసరించడమే మంచిదని నాకు తోస్తున్నది. సహకార నిరాకరణం ఒక్కసారి సాగిందంటే చాలు బ్రిటిష్ ప్రభుత్వం రాజీకి వస్తుందని నాకు నమ్మకం ఉంది. జ్ఞానప్రకాశ్ చెప్పిన విషయం నాకు బాగా నచ్చింది. మన సహకారనిరాకరణం చక్కగా జరిగిందంటే ఈ రెండు లక్షలమంది ఇంగ్లీషువాళ్ళు మరుసటి రోజే పడవలెక్కి పారి పోతారు.''

కొంచెం సేపు అందరూ మౌనంగా ఉన్నారు. అప్పుడు జ్ఞానప్రకాశ్ అన్నారు: "సహకార నిరాకరణం ఓ రకంగా ఆరంభంకానే అయింది. ఈ సహకార నిరాకరణానికి ఖిలాఫత్ ఉద్యమం వల్ల చాలా శక్తి చేకూరింది. మన దేశంలోని మహమ్మదీయుల్లో ఇంగ్లీషువాళ్ళ పట్ల తీవ్రమైన వ్యతిరేక భావన చెలరేగింది. మద్రాసులో జరిగిన ఖిలాఫత్ పరిషత్తులో మనదేశంలోని ముసల్మానులందరూ సహకార నిరాకరణో ద్యమాన్ని సిద్ధాంతరీత్యా అంగీకరించారు. ఈ ముసల్మానులందరూ వస్తుతః భారతదేశానికి చెందిన వాళ్ళే అనికూడా ముసల్మానులు తెలుసు కున్నారు. ఇప్పుడిప్పుడే మరొక వార్త తెలిసింది. బ్రిటిష్ ప్రభుత్వం పట్ల నిరసన తెలుపుతూ భారతదేశం వదలిపెట్టి అఫ్ఘనిస్థాన్ వెళ్ళడానికి ప్రయత్నిస్తున్న వేలకొలది ముసల్మానులను అఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం తమ దేశంలోకి రానియ్యలేదట. సహాయనిరాకరణానికి ఇంతకుమించిన అవకాశం మరొకటి రాబోదని మీరు సులభంగా ఊహించవచ్చు. ఎంతో కష్టంమీద ఇప్పటికి హిందూ, ముస్లిం ఐక్యభావం ఏర్పడింది. మనం ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. ఇప్పుడేర్పడిన ఈ ఐక్యాన్ని బలపరచాలి.''

"అవునవును. ప్రస్తుతం ఐక్యం కనిపిస్తూంది. కాని ఇది ఇంగ్లీషు వాళ్ళను వ్యతిరేకించడానికి ఏర్పడ్డ ఐక్యం. అంతకుమించి మరేవిధమైన ఐక్యభావం నాకు గోచరించడంలేదు. టర్కీ విషయంలో ఆంగ్లేయులు

అన్నమాట తప్పినందువల్ల ఈ ముసల్మానులందరూ మీవైపు చేరారు.’’ అన్నాడు రాజబిహారీ.

రాజబిహారీ విసరిన ఈ వ్యంగ్యోక్తికి జ్ఞానప్రకాశ్ చిరునవ్వుతో సమాధానం చెప్పారు: ‘‘రాజబిహారీ గారూ! కారణాలను గురించి విచారించకండి. అవి గతానికి సంబంధించినవి. హిందువులు, ముసల్మానులు కలిసి ఇంగ్లీషువారికి వ్యతిరేకంగా నిలబడి ఉన్నారనేదే ఇప్పటి ప్రత్యక్ష సత్యం. దీనికి కారణాలు వేరు వేరుగా ఉండవచ్చు. కాని ఈ వ్యతిరేక భావాన్నీ, అసంతృప్తినీ, పురస్కరించుకొని బయలుదేరే విప్లవంతో హిందువులకూ, ముసల్మానులకూ, మధ్యనున్న భేదభావం పూర్తిగా అంతరించిపోతుంది. మనం ఏకకంఠంతో గాంధీజీ అనుచరులం కావాలి.’’

రాజబిహారీకి నవ్వువచ్చింది: ‘‘మేముమాత్రం కండ్లు మూసుకొని గాంధీజీని అనుసరిస్తాం. కలకత్తా కాంగ్రెస్‌లో మేము గాంధీజీ తీర్మానాన్నే బలపరుస్తాం. ఇందులో మీకు సందేహం అక్కర్లేదు. మిగిలిన వాండ్లందరు కూడా గాంధీజీనే అనుసరిస్తారని అనుకుంటాను.’’

అక్కడఉన్న అందరూ సమవేతంగా గాంధీజీపట్ల భక్తిశ్రద్ధలు వ్యక్త పరచారు.

అందరూ వెళ్ళిపోయిన తర్వాత జ్ఞానప్రకాశ్ జ్వాలా ప్రసాద్‌ను పలకరించారు: ‘‘ఏమిటి విశేషం, చాలా దిగులు పడ్డట్టు కనిపిస్తున్నారు?’’

జ్వాలా ప్రసాద్ చాలా నీరసంగా అన్నారు: ‘‘ఏంలేదు జ్ఞానూ, గంగూ విషయం మనకు మించిపోతూ వున్నది. వాణ్ణి చక్కబరచడమెలాగా అని నీతో ఆలోచిద్దామని వచ్చాను.’’ ఆ తర్వాత జ్వాలా ప్రసాద్ జరిగినదంతా జ్ఞానప్రకాశ్‌కు వివరంగా చెప్పారు.

జ్వాలా ప్రసాద్ చెప్పిందంతా వినేసరికి జ్ఞానప్రకాశ్ ముఖంపై విషాదరేఖలు ఏర్పడ్డాయి: ‘‘ఇలాంటి అనుమానం నాకు కూడా వేసింది. శక్తి, సంపదలతో పాటు అరిష్టమొకటి అంటిపెట్టుకొని ఉంటుంది. వాని వల్లనే మనిషి వివేకం, సంయమం, కోల్పోయి తన ప్రవర్తనను, శీలాన్ని చెడగొట్టుకుంటాడు. మరి దీన్ని గురించి ఏంచేస్తే బాగుంటుందో ఆలోచించారా?’’

‘‘నాకేమీ బోధపడటం లేదు జానూ! మేము జోన్పూరు వెళ్ళి వాడి

దగ్గరే ఉంటే బాగుంటుందని అంటాడు ఖీఖా. మీ అక్కయ్యకు కూడా ఖీఖా చెప్పిన సలహా నచ్చింది. ఎందుకోగాని నాకు జోన్పూరు వెళ్ళా లంటే అంత బాగుండటం లేదు. గంగూ ఎప్పుడైనా మర్యాదకైనా సరే జోన్పూరు రమ్మని నాతో అనలేదు. వాడు మాకు దూరంగా ఉండాలని ఎందుకు ప్రయత్నిస్తున్నాడో ఇప్పుడు నాకర్థమయింది.''

జ్ఞానప్రకాశ్ కొంచెం ఆలోచించి అన్నారు: "బావా! ఇంటి యజమానివి నీవు. నీవు గంగాప్రసాద్‌కు తండ్రివి. నీవే దీనిలో జోక్యం కలగజేసు కోవాలి. గంగాప్రసాద్ అనలేదని మీరు ఎదురు చూడడమెందుకో నాకు బోధపడడం లేదు!''

"ఎందుకంటే వాడికి నా మీద వుండే అభిమానం, గౌరవం చెడకుండా ఉండాలని. అక్కడికి వెళ్ళిన తర్వాత మాటలు కలవక పోవడంవల్ల తగాదాలకు దిగితే నా మీద ఉన్న అభిమానం, మర్యాద కాస్తపోతుంది. అంటే నా పిల్లవాణ్ణి నా చేతులారా పోగొట్టుకున్నట్టవుతుంది.'' చాలా నిరుత్సాహంగా అన్నారు జ్వాలా ప్రసాద్.

"కాని అలా అని గంగూను నిరాశ్రయంగా నిరాధారంగా వదలి వేస్తే వాడు దక్కుతాడా మరి? గంగాప్రసాద్ చెడిపోకుండా చూడడం నీకు కావలసింది. ఇదొక విధంగా చావు బ్రతుకుల సమస్య. నీవక్కడికి వెళ్ళి నందువల్ల పరిస్థితి తప్పకుండా బాగుపడుతుంది. అతని వ్యవహారం చాలా వరకు చెడిపోనే పోయింది. నేను రెండు మూడు రోజుల్లో కలకత్తా వెళు తున్నాను. ఈరోజు ఆగస్టు 29వ తేదీ. సెప్టెంబరు నాలుగు నుండి కలకత్తాలో కాంగ్రెసు సమావేశం బ్రహ్మాండంగా జరుగబోతూవుంది ఆ విషయమే మేమింతవరకు మాట్లాడుతూ ఉన్నాము. సెప్టంబరు పదికో పదకొండుకో నేను కలకత్తా నుండి నేరుగా జోన్పూరుకు వస్తాను. ఒక వారంలోగానే మీరందరు జోన్పూరుకు చేరుకోండి.''

"మరి ఇక్కడ అలహాబాదులో ఇంటి సంగతి....?''

"ఈ యింట్లో ఎవరినైనా అద్దెకు ఉంచెయ్యండి. నా స్నేహితుడు మన్ మోహన్ బెనర్జీ ఇల్లు కావాలని వెదుకుతున్నాడు. డెబ్బై ఎనభై రూపాయల్లో కావాలట. నీవు సరేనంటే ఆయనతో మాట్లాడుతాను.''

నీరసించిన కంఠంతో జ్వాలా ప్రసాద్ అన్నారు: "అలాకాదు. అద్దెకియ్యడానికి నేనాయిల్లు కట్టలేదు. నీవే ఆ యింట్లో ఉండకూడదూ?

ఎలాగైనా నీకు ఇల్లు కట్టడానికి ఇంకా ఒకటి రెండు సంవత్సరాలు పడు తుంది. అప్పటిదాకా మా యింట్లో ఉండు. నీవిప్పుడున్న యిల్లు మన్ మోహన్ బెనర్జీకి ఇచ్చివేయి.''

జ్వాలా ప్రసాద్ తిరిగి యింటికి వెళ్ళేసరికి అతనికి తనకాళ్ళు తనను బలవంతంగా ఎక్కడికో లాక్కెళుతున్నట్టు అనిపించింది. ఏమిటిదంతా? ఇదంతా ఇలా ఎందుకు జరుగుతున్నది? ఎలా జరుగుతున్నది? అతనికేమీ బోధపడడం లేదు. ఇంట్లో నలుమూలలా విచిత్రమైన ఔదాసీన్యం వ్యాపించింది. ఆయన ఇంటికి రాగానే గంగాప్రసాద్‌కు ఒక ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరంలో తను సకుటుంబంగా జోన్పూరు వచ్చి ఉండాలని అనుకుంటున్నట్టు వ్రాశారు.

ఉత్తరం వ్రాసిన నాలుగోరోజు కల్లా గంగాప్రసాద్ దగ్గర నుండి జవాబు వచ్చింది. గంగాప్రసాద్ తన తండ్రి ప్రస్తావించిన విషయాన్ని సంతోషంతో ఆమోదించాడు. కాని కొద్ది రోజుల్లోనే మరోచోటికి ఉద్యోగంలో మార్పు రావచ్చునే విషయం కూడ అతడా ఉత్తరంలో హెచ్చరించాడు. గంగాప్రసాదు వ్రాసిన ధోరణిలో వాండ్ల అమ్మ, నాయన తన దగ్గరికి తప్పకుండా రావాలనే భావం జ్వాలా ప్రసాదుకు కనిపించలేదు. అయినా, ఒకవారం తర్వాత యమున, రుక్మిణీ, గంగా ప్రసాదు పిల్లలను తీసికొని ఆయన జోన్పూరు బయలుదేరారు. అంతకు మూడు రోజులు క్రితమే భీఖూ జోన్పూరు చేరాడు.

జ్వాలా ప్రసాదుతోపాటు పిల్లాజెల్లా ఇంటికి వచ్చినప్పటి నుండి గంగా ప్రసాదు జీవిత విధానంలో ఒక వ్యవస్థ ఏర్పడింది. ఎక్కువ సమయం అతడు ఇంట్లోనే గడుపుతున్నాడు. త్రాగడం కూడ అతను తన స్నేహితు లెవరైనా వచ్చినప్పుడు వాళ్ళతో మాత్రమే తాగుతున్నాడు. గంగాప్రసాద్ ప్రవర్తనలో వచ్చిన మార్పుకు జ్వాలా ప్రసాద్ సంతోషించారు. తాను జోన్పూరు రావడం మంచిదే అయిందని ఆయన భావించారు. రుక్మిణి ముఖంలో కూడా కాంతి వచ్చింది. ఇల్లాంతా ఉల్లాసంతో కళకళలాడుతూ ఉంది.

కాని గంగాప్రసాద్ ముఖంలో ఏదో ఒక విచిత్రమైన విషాదం భాసిస్తూ ఉంది. అతను మనస్సులో ఏదో బాధ పడుతున్నట్టు భారంగా కనిపిస్తున్నాడు. గంగాప్రసాదు మనస్సులోని ఈ గాంభీర్యాన్ని

గమనించి, జ్వాలా ప్రసాదు కూడ ఆశ్చర్యపడుతున్నారు. కాని ఈ విషయాన్ని గురించి గంగాప్రసాదుతో చర్చించడం మంచిదికాదని ఆయన అనుకున్నారు. ఈ విచారం క్షణికమనీ, త్వరలోనే ఇది అంత రించిపోతుందని ఆయన భావించారు.

ఆరోజు ఆదివారం. అంతకుముందు శనివారం సాయంత్రమే తన స్నేహితుణ్ణి ఎవరినో చూడడానికి గంగాప్రసాదు బనారస్ వెళ్ళాడు. జ్వాలా ప్రసాద్ వరండాలో కూర్చుని మనుమడు నవల్‌కిశోర్‌కు ఏవో పాఠాలు చెపుతున్నారు. నవల్ వయస్సు పదమూడు సంవత్సరాలు. ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అతని ప్రక్కన అతని చెల్లెలు విద్య కూర్చుని లెక్కలు వేసుకుంటున్నది.

మధ్యాహ్నం కాగానే జ్వాలా ప్రసాద్ పిల్లలకు చదువు చెప్పడం ఆపివేశారు. అక్టోబరు సగపడ్డది. కాని ఇంకా ఎండలు తగ్గలేదు. జ్వాలా ప్రసాద్ స్నానం చెయ్యడానికి బావి దగ్గరికి వెళ్ళుతూ వుండే సమయంలో ఆయనకు ఒక టాంగా తన యింటివైపు వస్తున్నట్టు కనిపించింది. ఆ బండిలో జ్ఞానప్రకాశ్ వైపు తిరిగి ఆయన అన్నారు: "అరే నీవా జ్ఞానూ !"

జ్వాలా ప్రసాద్ జ్ఞాన ప్రకాశ్ సామాన్లు దింపించారు. తర్వాత జ్ఞాన ప్రకాశ్‌తో వచ్చి వరండాలో కూర్చున్నారు: "సెప్టెంబరు పదకొండుకల్లా వస్తానన్నావు. కాని దసరా అయిపోయిన తర్వాత గాని వచ్చావు కావు."

"అవునుబావా! కలకత్తాలో దుర్గ పూజలు చాలా బాగా జరుగుతాయి. కాంగ్రెసు మహాసభలు ముగిసిన తర్వాత అక్కడ ఉండిపోయాను. అదీకాక బెంగాలులో ఇప్పుడు రాజకీయంగా ఎన్నో మార్పులు వస్తున్నాయి. బెంగాల్ కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత కాంగ్రెస్ సభ్యులు తమలోతాము మరో ప్రంటు ఏర్పాటు చేసుకుంటున్నారు. అందుకని అక్కడ ఉండి ఇవన్నీ గమనిస్తూ ఉన్నాను. ఇప్పుడు నేను కలకత్తానుండి నేరుగా వస్తున్నాను. అయితే రాత్రి బనారస్‌లో ఆగి ఉదయం బయలుదేరి నేరుగా జోన్పూరు వచ్చేశాను. నిన్న రాత్రి బనారస్‌లో యు. పి. కార్యకర్తల సమావేశం ఉండడం వల్ల అక్కడ దిగాల్సి వచ్చింది."

"గంగూ కూడా తన స్నేహితుణ్ణి ఎవరినో కలిసికోడానికి నిన్న బనారస్ వెళ్ళాడు. రేపు ఉదయానికల్లా వచ్చేస్తాడు."

"గంగూ బనారస్ వెళ్ళాడా! అయితే నేను చూచింది నిజమేనన్న మాట!" అని తనలో తాను మెల్లగా అనుకున్నారు జ్ఞానప్రకాశ్.

జ్వాలా ప్రసాద్ అడిగారు : "అయితే నీవు గంగూని చూచావా?"

"అవును, చూచాను, కాని చాలాదూరం నుంచి చూచాను. ధోవతి, చొక్కా వేసికొని ఉన్నాడు. అందువల్ల సరిగ్గా పోల్చుకోలేకపొయ్యాను. అదికాక చీకట్లో వెలుగు తక్కువగా ఉండడంవల్ల ఎవరోలే అనుకున్నాను. సరేలే, దానికేం కాని, ఇక్కడ పరిస్థితి ఎలా ఉంది?"

"నాకేమీ విచారకరమైన విషయం కనిపించడం లేదు. సరిగా వేళకు వెళ్లుతాడు, మళ్ళీ వేళకు తిరిగి వస్తాడు. చాలా మర్యాదగా, పద్ధతి ప్రకారం ఉంటాడు. అంతేకాదు. ఇంట్లో అందరి సంగతీ విచారిస్తాడు." అంటూంటే జ్వాలా ప్రసాద్ ముఖం సంతోషంతో విప్పారుతున్నట్లు స్పష్టంగా గోచరిస్తూ ఉంది.

జ్ఞానప్రకాశ్ చిరునవ్వుతో అన్నారు : "నేను చెప్పలేదూ? మీరిక్కడికి రావడం మంచిదే అయింది. నాకు చాలా సంతోషంగా ఉంది. కాని మీరేదో దిగులుపడుతూ ఉన్నట్టున్నారే?"

"రుక్మిణికి ఉదయంనుంచి నొప్పులు వస్తున్నాయి. గంగూ ఇక్కడలేడు. అమ్మాయికి కనేరోజులు. మంత్రసానిని పిలుచక రమ్మని భీఖాను పంపించాను. ఏ క్షణంలో నైనా కనవచ్చు. అంతే మరేంలేదు."

"మంత్రసాని కోసం మనిషిని పంపారా? లేడీ డాక్టరును పిలిపించ గూడదూ? ఇంకా ఆ పాత పద్ధతుల్లోనే నడుస్తున్నారు. ఉండండి, నేనిప్పుడే సివిల్ ఆస్పత్రికి వెళ్ళి లేడీ డాక్టరును, నర్సును పిలుచుకు వస్తాను." అని జ్ఞానప్రకాశ్ లేచి నిలబడ్డారు.

అప్పుడే మంత్రసాన్ని వెంట బెట్టుకుని భీఖా రావటం కనిపించింది.

"అలాగేకాని కొంచెంసేపు ఆగు. మంత్రసాని వచ్చిందికదా! ఏం చెబుతుందో చూద్దాం. ఈలోగా నేను స్నానంచేసి వస్తాను. నీవుకూడా గుడ్డలు మార్చుకుని స్నానం చేసేసేయి."

జ్వాలా ప్రసాద్ స్నానంచేసి జ్ఞానప్రకాశ్ దగ్గరకి వచ్చారు. అదే సమయంలో లోపలినుండి భీఖా వచ్చాడు: "బాబయ్యా! చిన్నమ్మగారికి

మగపిల్లవాడు పుట్టాడు. సరిగ్గా శమయానికి తీసుకొచ్చాను మంత్రసాన్ని.''

జ్వాలా ప్రసాద్ ముఖం చేటంతయింది. ఆయన లేచి నిలబడ్డారు. జేబులోనుంచి రెండు రూపాయలు తీసి భీఖాకు ఇచ్చారు: ''ఈ రెండు రూపాయలకు కాన్లూ, ఏగాన్లూ మార్చుకురా వెళ్ళి. పిల్లవాడికి తల్లికి దిగదీసి బయట పంచిపెట్టు. చూడు. భజంత్రీలనుకూడ కేకవెయ్యి. పురోహితుణ్ణికూడ వెంటబెట్టుకురా.''

భీఖా నవ్వాడు: ''ఇదిగో ఇప్పుడే బాబయ్యా! దొమ్మరిసాన్ని పిలుచుకు రావడానికి సునియాను పంపిస్తున్నాను. దారిలో అదే బ్రాహ్మణ్ణి పిలుచుకు వస్తుంది. నేను భజంత్రీలకోసం వెళుతున్నాను. వస్తూ వస్తూ అంగట్లో చిల్లర మార్చుకువస్తాను.''

గంగాప్రసాద్ బనారస్‌నుండి అర్ధరాత్రివేళ వచ్చాడు. అంత పొద్దుపోయినా ఇంట్లో హడావిడిగానే ఉంది. జ్వాలా ప్రసాద్, జ్ఞానప్రకాశ్ నిద్రపొయ్యే ప్రయత్నంలో ఉన్నారు. జ్ఞానప్రకాశ్‌ను చూడగానే గంగాప్రసాద్ అన్నాడు: ''మామయ్యా, నీకోసం మేము ఎదురుచూదాం. కలకత్తాలో చాలారోజులు పట్టినట్టుంది. ఎప్పుడు వచ్చావ్?''

''ఇవ్వేళ మధ్యాహ్నమే నేను వచ్చేశాను. నిన్న బనారస్‌లో ఆగవలసి వచ్చింది. నిన్ను నేను బెనారస్‌లో చూదాను. కాని సరిగ్గా గుర్తు పట్టలేకపోయాను. నీవుకూడ ఏదో తొందర పనిలో వెళుతున్నట్టున్నావు. అందుకని నిన్ను పిలవనుకూడాలేదు. మళ్ళీ నేను పొరపాటు పడుతున్నానేమో అనుకున్నాను. కాని........'' జ్ఞానప్రకాశ్ అర్ధవంతమైన చిరునవ్వుతో గంగాప్రసాద్ వైపు చూదారు: ''నా కండ్లకు సామాన్యంగా పొరబాటు పడడం అంటూలేదు. నీవే అయి ఉంటావు.''

సమయంకాని సమయంలో జ్ఞానప్రకాశ్ తర్కించడం మొదలు పెడతాడేమో అని గంగాప్రసాద్‌కు అనుమానం వేసింది. ఇది గమనించి జ్వాలా ప్రసాద్ అక్కడినుండి లేచిపోతూ అన్నారు: ''ఒంటిగంట కావస్తున్నది. ఇక వెళ్ళి పడుకుంటాను. పగలంతా వచ్చే పోయేవాండ్లతో అలసటగా ఉంది.''

''అలాగే, వెళ్ళి నిద్రపో బావా!'' అంటూ జ్ఞానప్రకాశ్ గంగాప్రసాద్ వైపు తిరిగారు: ''పిల్లవాడు మంచి గడియల్లో పుట్టాడోయ్.

చాలా అదృష్టవంతుడవుతాడు. ఇంట్లోకి వెళ్ళు. ఇంతకు ముందే స్నానం చేయించారు. కొడుకును చూచుకుని గుడ్డలు మార్చుకొని వెళ్ళి నిద్రపో. బనారస్‌లో నేను చూచింది నాకంత నచ్చలేదు. ఆ సంగతి రేపు మాట్లాడుతాను.''

''మామయ్యా, నా ఉద్దేశ్యం ఇప్పుడే మాట్లాడుకుంటే బాగుంటుందని. మనమిద్దరం తప్ప మరెవ్వరూ లేరు. అప్పుడు నా ప్రక్కన ఉన్నది మల్లి. నాన్నవాండ్లు వచ్చిన తర్వాత ఇక్కడ ఈ గొడవ ఎవరు పడతారని దాన్ని నేను జోన్పూరునుండి బెనారసు పంపించాను. నేను చేసిందాంట్లో పొరబాటేంలేదు కదా!''

''మంచిపనే చేశావు. కాని అందువల్ల నీ ఖర్చు పెరిగిపోయింది. బనారస్‌లో మల్లికయ్యేఖర్చు, నీకు బనారస్ రాకపోకలకయ్యే ఖర్చు. నీ ఆర్థిక పరిస్థితి కూడా అంత బాగాలేదని నా అభిప్రాయం.''

''అవును. ఆర్థిక పరిస్థితి నిజంగానే బాగాలేదు. కాని ఇటీవల అలహాబాదులో కాపురం లేకపోవడం వల్ల కొంత ఖర్చు తగ్గిపోయింది. మరో విషయం మామయ్యా, ఇక్కడ జోన్పూరులో అందరు గుసగుసలు మొదలు పెట్టారు. వాళ్ళ నోరు కూడ మూయించాలి కదా!''

జ్ఞానప్రకాశ్ కొంచెంసేపటి వరకు ఆలోచనలో మునిగిపోయారు. తర్వాత ఆయన చాలా కచ్చితంగా అన్నారు: ''గంగూ! ఈ మార్గం వదలి పెట్టడం నీకు సాధ్యం కాదా? ఇది సర్వనాశనానికి దారితీసే మార్గం. నా మాట విను.''

గంగాప్రసాద్ కూడ గంభీరంగా అన్నాడు: ''ఇది చెడుదారి అని నాకు కూడా తెలుసు. అప్పుడప్పుడు నాకు అలాగే అనిపిస్తుంది. కాని జీవితమే ఒక చెడుదారి అని మరోక్షణంలో అనిపిస్తుంది. చివరకు మనకందరికీ మరణమే శరణ్యమైనపుడు ఇలా చేస్తే ఏమవుతుందో అని విచారించడం నన్నడిగితే అనవసరమంటాను. ఈరోజు మన ఎదుట ఉన్నదే నిజం. రేపటి సంగతి ఎవరికీ తెలియదు. దాన్ని గురించి విచారించినందువల్ల ప్రయోజనమూ లేదు.''

కొంచెం అలసటతో జ్ఞానప్రకాశ్ సమాధానం చెప్పారు: ''స్థూలంగా చూచేందుకు తప్పేమీలేదని కనిపించే ఒక దృక్పథమిది. కాని అదృష్టం వల్లనో దురదృష్టం వల్లనో మనకు ఆలోచించే శక్తి స్వభావం ఉంది. ఈ

వివేకాన్ని ఎలా పోగొట్టుకోగలవో చెప్పు గంగాప్రసాద్! నీ కుటుంబం పెరుగుతూఉన్నది. ఆ మాట నీవు గుర్తుంచుకోవాలి. నీ ఖర్చులు చాలా ఎక్కువ అనే విషయం నాకు తెలుసు. నీవు అన్యాయంచేసి లంచం తీసుకో లేవని కూడా నాకు తెలుసు. కాబట్టి నీవు అప్పుల పాలవడంలో ఆశ్చర్యంలేదు.''

''అలీరజా ఇక్కడికి వచ్చినప్పటినుండి తగ్గిపోయింది. లేకుంటే ఈ పాటికి అస్థితి వచ్చి ఉండేదే.''

''కాని అలీరజా ఇక్కడ ఎంతకాలం వుంటాడు? నీవు అతను కలిసి ఎంతకాలం ఉండగలరు? లేదు గంగూ! నీవు నీ అలవాట్లను మార్చు కొని తీరాలి. ఇదంతా నీవు మానివేయాలి. నీకు భార్యా, పిల్లలూ ఉన్నారు. గౌరవంతో బ్రతికే వంశం నీది. నీకు కూడా పరువూ, ప్రతిష్టా ఉన్నాయి.''

గంగాప్రసాద్ కాసేపు మౌనంగా ఉన్నాడు. తర్వాత చప్పబడిన కంఠంతో అన్నాడు: ''భార్యా, పిల్లలు, వంశం, సంఘం, పరువు, ప్రతిష్ట,- ఈ సంకుచిత బంధాలతో జీవితాన్ని బంధించేసి దాన్ని ఎంత అనాకారంగా నీరసంగా చేశామో! ఈ బంధాలను విచ్ఛిన్నం చేసుకోకపోతే మానవుడు జీవితంలో ఏమీ చేయలేడు. నీవు రాజకీయాల్లో పనిచేస్తున్నావు. కాబట్టి నీకిదంతా తెలిసిఉండాలి. జైలుకు వెళ్ళడం, అంటరానివారితో భేదం లేకుండా వ్యవహరించడం, భార్యా, పిల్లల వ్యామోహంలోపడి పిరికి తనానికి గురికాకుండా ఉండడం - వీటన్నిటికీ సిద్ధమయితేనే కాని ఈనాడు తీవ్ర రాజకీయాల్లోకి దిగడం సాధ్యంకాదు. మరి నీవుకూడ పరువు, ప్రతిష్ట, కులం, గోత్రం అంటున్నావు. కలకత్తాలో నీవు ఖిలాఫత్ తీర్మానాన్ని ఆమోదింపజేసి వచ్చావు. నీ నోటినుండి ఇలాంటి మాటలు వింటుంటే నాకు ఆశ్చర్యంగా ఉంది.''

గంగాప్రసాద్ తర్క వాదానికి జ్ఞానప్రకాశ్ నవ్వారు: ''చాలా తెలివిగల వాడివైనావోయ్ గంగూ! నీవు చెప్పినదానిలో తప్పేమీ లేదు. కాని అది కేవలం అర్థసత్యం. ప్రపంచంలో సామాన్యంగా వర్తించే ప్రమా ణాలను ఎదుర్కొనడంలోనే వాస్తవిక జీవితం ఉందనీ, అదే జీవితం లోని పురోగమనమనీ నీవు వాదిస్తే నేను కాదనను. కాని ఈ తిరుగుబాటు రెండు రకాలుగా ఉంటుంది: ఒకటి విశ్వాసంమీద ఆధారపడి ఉంటుంది.

మరొకటి అవిశ్వాసం మీద ఆధారపడుతుంది. నీవనుసరించే మార్గం అవిశ్వాసానికి సంబంధించింది. నా మార్గం విశ్వాసానికి సంబంధించింది.''

''విశ్వాసం అనీ, అవిశ్వాసం అనీ ఏదో కొత్త చిక్కు తెచ్చి పెట్టావే. మావయ్యా! అది కొంచెం వివరించుదూ!''

''అవును తండ్రీ! కొంచెం జాగ్రత్తగా విను. కుటుంబం, పరువు, ప్రతిష్ఠ—ఇవన్నీ ఉన్నాయే, వాటికి మించిన విలువలు కూడా కొన్ని ఉన్నాయి. త్యాగం, సమర్పణం వంటివి. వీటిని గమనించి నడిచే వారి మార్గం విశ్వాస మార్గం. అలాంటివారికి జీవితంలో సామాన్యంగా గుర్తించబడే విలువలపై అవిశ్వాసం కంటె త్యాగం, సమర్పణ భావం, సత్యం వంటి విలువలపై విశ్వాసమే ఎక్కువగా ఉంటుంది. కాని కొంతమందికి ఉచ్ఛస్థాయికి చెందిన ఈ విలువలపై విశ్వాసముండదని వేరే చెప్పనక్కరలేదు. కనీసం జీవితంలో పరువు ప్రతిష్ఠలపైన కూడా అలాంటివారికి విశ్వాసం ఉండదు. అలాంటివారి మార్గం అవిశ్వాసమార్గమని నా అభిప్రాయం. అంటే నీవనుస రిస్తున్న మార్గం అవిశ్వాసమార్గమన్నమాట. మాబోటి వారనుసరించేది విశ్వాసమార్గం. సరేకాని, చాలా పొద్దుపోయింది, అలసిపోయి వచ్చావు. ఇంకా నీకు లోపలికి వెళ్ళవలసిన పనుంది. ఆ తర్వాత గుడ్డలు మార్చు కొని నిద్రపోవాలి. నేనిక వెళ్ళి నిద్రపోతాను. నేను చెప్పిన విషయాన్ని గురించి మాత్రం నీవు కొంచెం ఆలోచించు. రేపు మళ్ళీ మాట్లాడు కుందాం.'' గంగాప్రసాద్ గొప్ప చిక్కులో పడ్డాడు. దీర్ఘాలోచనతో తేజో రహితుడై కూర్చునిఉన్న అతన్ని అక్కడ వదిలేసి జ్ఞానప్రకాశ్ పడక గదిలోకి వెళ్ళాడు.

ఏడు

ఊపిరాడకా ఊపిరాడడం లేదు. అతనికి మాటలు తడబడుతున్నాయి. రాగానే అతడు కుర్చీమీద కూర్చున్నాడు. శ్వాస చాలా వేగంగా సాగుతూ

ఉంది. అతడు తనలో తానేదో అనుకుంటున్నాడు : "అమ్మయ్యో ! ప్రళయం వచ్చేటట్టు కనిపిస్తూంది. జోన్పూరులో ఇంత పెద్ద ఆందోళన జరుగుతుందని అనుకోలేదు. ఇంతకూ ప్రపంచం ఏ తట్టు వెళ్ళుతున్నట్టో తెలియడం లేదు."

"నరకానికి వెళ్ళుతున్నదనుకో. నీకేంకాలేదు గదా ? ఇంత గాబరా పడుతున్నావెందుకు ? అసలేమయిందో నాకూ చెప్పుదూ !" అన్నాడు నవ్వుతూ గంగాప్రసాద్."

"అయ్యో అయ్యగారూ ! గాబరా పడుతున్నానంటా రేమిటి ? కండ్లార చూచి కూడా నమ్మలేకుండా ఉన్నాను. అటలా మసీదునుండి ఊరేగింపు బయలుదేరినప్పుడు యాభై అరవై మందికి మించిలేరు. ఇంతలో ఇంత మంది ఎక్కడినుండి వచ్చారో ఖుదాకే తెలియాలి."

గంగాప్రసాద్‌కు నవ్వు వచ్చింది : "యాభై అరవై మంది గుంపు కాదది. పది పన్నెండు వేల మంది ఉన్నారని నాకు వార్త అందింది. పల్లెటూరి నుండి ప్రజలు గోమతిలో స్నానం చేయడానికి వచ్చారు. ఈ రోజు మాఘ పూర్ణిమ. ఆ ఊరేగింపులో ఈ యాత్రికులు కూడా కలిశారు. దీనిలో ఆశ్చర్యపడవలసిన విషయం నాకేమీ కనిపించడం లేదు."

"అంతటితో కాలేదు బాబూ ! ఆ తరువాత సంగతి వినండి. ఆశ్చర్యపడిపోతారు కథంతా విన్నారంటే. మహాత్మాగాంధీ మాట మీద కాంగ్రెసు అనుమతితో తాను ప్లీడరుపని ఈ రోజుతో మానేస్తున్నానని ఫరహ్‌తుల్లా అందరిముందు చెప్పివేశారు. అంతేకాదు. పోలీసిన్స్పెక్టర్ విక్రమసింహ్ కూడా తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. ఊరేగింపు ముగిసిన తర్వాత పెద్ద బహిరంగ సభ అయింది. ఆ సభలోనే ఈ ప్రకటనలన్నీ జరిగాయి. నేను వెంటనే కాలికి బుద్ధి చెప్పి ఇలా వచ్చేశాను. లేకుంటే నాకు కూడా ఒకసారి రాజీనామా ఇయ్యాలనిపించింది. ఎంత ఉత్సాహం ! ఎంత ఆవేశం అనుకున్నారక్కడ !"

"ఫరహ్‌తుల్లా ప్లీడరు పని మానేశాడా ? నీవు చెప్పేది నిజమేనా ? ఆయన చాలా గొప్ప ప్లీడరని పేరు సంపాదించారు. విక్రమసింహ్ సంగతి నాకంత ఆశ్చర్యంగా లేదు. చాలా తలబిరుసువాడు, నోరు దుడుకు కూడాను. గవర్నమెంటు ఉద్యోగం అతనివల్ల కాదు. కాని ఫరహ్‌తుల్లా

అలాంటివాడు కాడు. అతను ప్లీడరు పని ఎందుకు వదిలేశాడో నాకు బోధ పడటం లేదు. ఆయన ఆర్థిక పరిస్థితి కూడా అట్టే బాగా లేదని వినికిడి.''

''అట్టే బాగా యేమిటి బాబూ! అసలాయన ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. అతని తండ్రి గుడ్డలు నేసేవాడు. కాని ఖర్చు విపరీతంగా పెట్టేవాడు. ఆయన సంపాదించిందంతా ఈయన చదువుకోసం ఖర్చు పెట్టాడు. ఆయన చనిపోయేసరికి అప్పుమాత్రమే మిగిలిందని అంటారు. ఇక ఈ ఫరహ్‌తుల్లా ఉండనే ఉన్నాడు. ఈయన చాలా మంచి ప్లీడరని పేరు. కాని ఆదాయం లేని కేసులు తీసుకుంటాడు. ఎవరెంత ఇస్తే అంత తీసుకుంటాడు. డబ్బుతీసుకోవడం అతనికి బొత్తుగా చేతకాదు. దానికి తోడు నాయకత్వంమీద వ్యామోహంతో ఖర్చులు మరీ పెంచుకున్నాడు. సమీ ఉల్లాకు ఉద్యోగం పోయినప్పటినుండి వీధుల వెంబడి తిరుగు తున్నాడు. ఈయన చిన్న తమ్ముడు అలహాబాదులో మోర్ సెంట్రల్ కాలేజీలో చదువుతున్నాడు. ఈయనకు ముగ్గురు పిల్లలు. రెండు పెండ్లిండ్లు చేసుకున్నాడు మియాసాహెబ్. మరి ఇప్పుడీయన ప్లీడరుపని మానేయ డానికి సిద్ధపడ్డాడు. తెలివితక్కువకు కూడా కొంత హద్దంటూ ఉండాలి.''

''అయితే ఆ మీటింగులో ఇంకా ఏమేమి జరిగింది?'' అని అడిగాడు గంగాప్రసాద్.

''అది మీటింగేమిటి బాబూ! అదంతా ఒక హంగామా అనడం మంచిది. అసలు జరిగిందేమిటంటే నేను పుత్తూలాల్ సారాయి దుకాణం తనిఖీ చేసి ఇంటికి వస్తున్నాను. కొంచెం దూరం వచ్చేసరికి టాంగా ఆగి పోయింది. ఎదురుగా పెద్ద ఊరేగింపు సాగుతూవుంది. దాదాపు అరగంటసేపు నిలబడ్డ తర్వాతగాని ఊరేగింపు వరుస పూర్తిగాలేదు. అక్కడి నుండి ఇంటికి వెళ్ళాను. కాసేపు విశ్రాంతి తీసుకుని గుడ్డలు మార్చుకున్నాను. ఆ తర్వాత మీ దగ్గఱకు రావాలని బయలుదేరాను. అప్పుడండీ, అటలా మసీదు దగ్గరికి వచ్చే సరికండీ, ఒక పెద్ద మీటింగు జరుగుతూ వుంది. అక్కడ ఏం జరుగుతుందో చూచి పోదామని అను కున్నాను. అప్పుడు టాంగా ఆపి గుంపులో చేరాను. అప్పుడు అక్కడ ఏం జరుగుతున్నదంటారేమో! ఫరహ్‌తుల్లా మీటింగు నడిపిస్తున్నారు. ఆయన కటూ ఇటూ ఖద్దరు గుడ్డలు వేసుకుని ఇంకా పదిపన్నెండు మంది ఉన్నారు. అందులో కొంతమంది 'జమైయత్ ఉల్మా'కు సంబంధించినవాళ్ళు. కొంత

మంది కాంగ్రెసు వాళ్ళు. అప్పుడు మరి ఈ ఫరహ్‌తుల్లా కూడా ఖద్దరు గుడ్డలు కట్టుకుని ఉపన్యాసం ఇస్తున్నారు. కలకత్తా కాంగ్రెసులో ఏం జరిగిందో అంతా చెపుతూ ఆయన అన్నారు – "ఒక సంవత్సరంలోగా దేశానికి స్వరాజ్యం సంపాదించగలమని గాంధీజీ చెప్పారట. ఖిలాఫత్ లీగు కాంగ్రెస్‌లో కలిసిపోయిందనీ, మౌలానా ముహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ కాంగ్రెసు నాయకులయినారని కూడా ఆయన చెప్పారు. ఆ తర్వాత గాంధీగారి మాట ప్రకారం ప్రజాసేవకై తను ప్లీడరుపని మాని వేస్తున్నానని అన్నారాయన. జనం ఆయనను ఎంతో పొగిడారు. గట్టిగా చప్పట్లు కొట్టారు. ఆయన మెడలో పూలదండలు వేశారు. ఆయన తర్వాత విక్రమసింహ్ వచ్చాడు. ఆయన కూడా ఖద్దరులోనే ఉన్నాడు. సహకార నిరాకరణాన్ని గురించి ఆయన పెద్ద ఉపన్యాసం ఇచ్చి తను గవర్నమెంటు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చానని చెప్పారు. అప్పుడండీ, నాకు మహా భయం వేసింది. గుండెల్లో ఏదో ఆవేశం పొంగి పొంగి పైకి వచ్చింది. నేను కూడా ఉపన్యాసం చేస్తానేమోనని నాకు భయమేసింది. వెంటనే నేనక్కడినుండి బయలుదేరి వచ్చాను."

గంగాప్రసాదుకు నవ్వు వచ్చింది: "చాలా తెలివిగల పనిచేశావు అలీరజాసాహబ్. అక్కడినుండి బయటపడ్డావెలాగయితేనేం."

గంగాప్రసాద్ ఆ రోజు ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. జ్వాలా ప్రసాద్ ఇంట్లో అందర్నీ తీసుకొని మాఘస్నానాలకు అలహాబాదు వెళ్ళారు. పదిహేను రోజుల వరకు వాళ్ళు అక్కడనే ఉంటారు.

ఉద్యమం సాగుతూ ఉంది – చాలా తీవ్రంగా, అతి విచిత్రంగా, సమ్మెలు సాగుతున్నాయి. రాట్నాలు నడుస్తున్నాయి ; ఖాదీ ఉద్యమం, స్వదేశీ ప్రచారం ఉత్సాహంగా పురోగమిస్తున్నాయి. విదేశీ వస్తువులను ప్రజలు బహిష్కరిస్తున్నారు, ఊరేగింపులు సాగుతున్నాయి. ప్రభుత్వాన్ని బాహాటంగా నిందిస్తున్నారు. ఆంగ్లేయులను దూషించడం అలవాటయి పోయింది. జోన్పూరులో ఈ ఉద్యమాన్ని అణచేఖారం ప్రభుత్వం గంగాప్రసాదుకు ఒప్పచెప్పింది. అతను కూడా చాలా శ్రద్ధాసక్తులతో నిర్దాక్షిణ్యంగా తన బాధ్యతను నిర్వహిస్తున్నాడు. జోన్పూరులో జైలు నిండి

పోయింది. ప్రజలపై జరిమానాలు అపరిమితంగా వేస్తున్నారు. జోన్పూరులో ఉన్న కార్యకర్తల్లో ఎక్కువమంది జైళ్లలోకి చేరిపోయారు.

ఎనిమిది

నవల్ పాడుతున్నాడు: "అంటున్నారు కరాచీ ఖైదీలు రెండేండ్లకు మరి తిరిగి వత్తమని."

అది విని విద్య కూడ ప్రారంభించింది : "అలీముహమ్మదు తల్లి చెప్పినది." ఆ తర్వాత చరణం ఆ అమ్మాయి మరచిపోయింది. నవల్ దానిని పూరించాడు : "అసువు లొసగు మాందోళన కొరకని!"

జ్ఞానప్రకాశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయానికి వెళ్ళాలని దుస్తులు వేసుకుని బయలుదేరుతున్నారు. ఆయన నవ్వుతూ నవల్ చెంపమీద చిన్న లెంపకాయ వేశారు: "తండ్రి జాయింట్ మేజిస్ట్రేట్ అయినాడు. కొడుకు విప్లవగేయాలు పాడుతున్నాడు:" అప్పుడే విద్య పరిగెత్తుకుంటూ వచ్చి జ్ఞానప్రకాశ్ కాళ్ళకు చుట్టుకుంది: "తాతయ్యా, నాకు బొమ్మ తెచ్చి పెట్టడం మరిచిపోవు కదూ! ఎల్లుండి మన పక్కింటి మాలతివాండ్ల బొమ్మకు పెండ్లిచేస్తారట. నేనుకూడ నా బొమ్మకు పెండ్లిచేస్తాను."

అదే సమయానికి జ్వాలా ప్రసాద్ పూజ ముగించుకొని లేచారు. జ్ఞానప్రకాశ్ బయటకు వెళ్ళడానికి తయారయి ఉండడం చూచి జ్వాలా ప్రసాద్ అన్నారు: "అరే, ఇవ్వేళ అప్పుడే బయలు దేరావే? ఇంకా పదిగంటలే అయింది. ఏమన్నా విశేషమా?"

"విశేషమేముంది బావా! ప్రభుత్వం కాంగ్రెస్ స్వయంసేవక దళం చట్ట విరుద్ధమని ప్రకటించిందని విన్నాను. దీన్ని గురించి మేము ఆలోచించుకోవాలి. అంతేకాకుండా ఈ కాంగ్రెసు ఉద్యమాన్ని ఇంకా తీవ్రతరం చేయడానికి మార్గం కూడ వెతకాలి."

జ్వాలా ప్రసాద్ కూర్చోబోతూ అన్నారు : "ఎప్పటిదాకా సాగుతుంది మీ ఉద్యమం ?"

"ఆరంభించింది ఇప్పుడిప్పుడే కదా! ఇది ఈ ఉద్యమంలో ప్రథమ ఘట్టమనుకో. ఈరోజున ప్రభుత్వపు జైళ్ళన్నీ నిండిఉన్నాయి. ఈ ఉద్యమాన్ని అణగదొక్కడానికి ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నదో ఈ ఉద్యమం అంత పురోగమిస్తున్నది."

జ్వాలా ప్రసాద్ అంగీకరించారు : "అవును. మీ ఉద్యమం సాగుతూనే ఉంది. కాని ఈ ఉద్యమానికి ముసల్మానులు చాలా బలం చేకూర్చారు. గాంధీమహాత్ముని బుద్ధి కౌశలం నాకు భాలా నచ్చింది. అలీ సోదరులను అరెస్టుచేయడంతో దేశంలో జ్వాలలు బయలుదేరినాయి."

"అవునవును. ప్రజల్లో చైతన్యం చాలా తొందరగానే మేల్కొం టున్నది." అని సమాధానం చెప్పారు జ్ఞానప్రకాశ్.

ఈలోగానే గంగాప్రసాద్ వచ్చి మౌనంగా ఒకమూల కూర్చునిఉన్నాడు. ఉండబట్టలేక అతడన్నాడు: "మావయ్యా! ప్రజలు మేల్కొడంలేదు, నిద్రపోవడమూ లేదు. అసంతృప్తితో బాధ పడుతున్న కొంతమంది వ్యక్తులు మాత్రమే ఈ ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. ఇక ఈ ఉద్యమం అంతరించిపోయే సమయం సమీపించిందని నా అభిప్రాయం. జైలుకు వెళ్ళడానికి వాలంటీర్లు ఇక దొరకడం లేదు. జ్వాలలు బయలు దేరాయని మీరనుకొంటున్నారే ఇవన్నీ బ్రిటిష్ ప్రభుత్వం గమనిస్తూనే ఉంది. హింసాత్మక చర్య ఆరంభించిందంటే చాలు, ఉద్యమం ఒక్క క్షణంలో నశించి పోతుంది."

గంగాప్రసాద్ అలా తిరిగి తిరిగి బయటనుండి ఇప్పుడే వచ్చాడు. ఆయనను టోన్పూరునుంచి కాన్పూరు మార్చారు. అఫిషియేటింగు జాయింట్ మెజిస్ట్రేట్‌గా భారతీయోద్యోగిని నియమించడం — అఫిషి యేటింగు హోదాలో అయినా సరే—సామాన్యమయిన విషయం కాదు. టోన్పూరులో ఈ ఉద్యమాన్ని అణచివేయడంలో గంగాప్రసాదు చూపించిన చాకచక్యమే దీనికి ముఖ్యకారణం. కాన్పూరు నుండి కాంగ్రెసుకు చాలా ధన సహాయం లభిస్తూ ఉంది. కాబట్టి ఈ ఉద్యమానికి మూలాధారమేదో కనిపెట్టడానికి గంగాప్రసాద్ సమర్థుడని భావించడం జరిగింది. గంగా

ప్రసాద్ 'ఛార్జి' పుచ్చుకోడానికి కాన్పూరు వెళ్ళుతున్నాడు. కాన్పూరులో అన్ని ఏర్పాట్లు చేసేదాకా అతని కుటుంబం అలహాబాదులో ఉంటుంది.

జ్ఞానప్రకాశ్ గంగాప్రసాద్‌తో అన్నాడు: "అయితే నీవు కమిషనరును కలుసుకొని వచ్చావన్నమాట. ఏమంటాడాయన ?"

గంగాప్రసాద్ చిరునవ్వుతో సమాధానం చెప్పాడు. "ఏమనేదేముంది? అణగదొక్కండి, అణగదొక్కండి, అణగదొక్కండి. ఒక్కటే తిరుమంత్రం. ఏమయినా సరే, బ్రిటిష్ ప్రభుత్వం మనదేశాన్ని వదలిపెట్టి వెళ్ళడానికి సిద్ధంగా లేదు. కాబట్టి ఈ ఉద్యమాన్ని అణగదొక్కి తీరాలి. ఈరోజు సాయంత్రం బండికి వెళ్ళుతున్నాను. రేపు కాన్పూరులో ఛార్జితీసుకుంటాను. ఈ ఉద్యమానికి కాన్పూరునుండి లక్షల కొద్ది రూపాయలు ఎలా వస్తున్నాయో కనిపెట్టి ఆ మార్గాన్ని అరికట్టే ఉపాయం కూడా వెదకాలి."

జ్ఞానప్రకాశ్ చాలా దీనంగా అన్నారు: "గంగూ, నేనొక్కమాట చెపుతాను, వింటావా ?"

"మావయ్యా, రాజకీయాలకు సంబంధించినంత వరకు నేను ప్రభుత్వాన్నే సమర్థిస్తాను. ఆ విషయంలో నాకేమయినా నచ్చచెప్పడానికి ప్రయత్నించ వద్దు."

జ్ఞానప్రకాశ్ మళ్ళీ మరోమాట అనలేదు. ఆయన కూర్చుని మౌనంగా ఆలోచించడం మొదలుపెట్టారు. గంగాప్రసాద్ అలా సమాధానం చెపుతాడని ఆయన అనుకోలేదని మాత్రం ఆయన కండ్లల్లో కానవచ్చే ఔదాసీన్యం స్పష్టంగా చెపుతున్నది.

గంగాప్రసాద్ లోపలికి వెళ్ళాడు. ఆరోజే అతను ప్రయాణానికి సిద్ధం కావాలి. జ్వాలా ప్రసాద్ కూడా తన కుమారుని వెనకనే వెళ్ళారు. ఒకమూలన కూర్చుని ఇదంతా గమనిస్తున్న నవల్ జ్ఞానప్రకాశ్ దగ్గఱ చేరాడు! "తాతయ్యా! పెద్ద వాళ్ళమయ్యాక మేముకూడ జైలుకువెళ్ళుతాం. దిగులుపడకు. భారతమాతాకీజై."

జ్ఞానప్రకాశ్ నవ్వుతూ అన్నారు: "లేదు తండ్రీ! నేను దిగులుపడడం లేదు. భగవంతునిదయ ఉంటే మీకు జైళ్ళకు వెళ్ళవలసిన అవసరం కూడా ఉండదు. మనదేశ స్వాతంత్ర్యం వల్ల వచ్చే ఆనందాన్ని మీరే అనుభవిస్తారు. సరే, స్కూలుకు వేళయింది."

నవల్, విద్య – ఇద్దరూ తర్కించుకుంటూ వాదించుకుంటూ లోపలికి

వెళ్ళారు. జ్ఞానప్రకాశ్ ఏదో ఆలోచిస్తూ కూర్చున్నారు — ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుంది. అప్పుడే పోర్టికో క్రింద ఒక టాంగా నిలబడి ఉంది. జయనాథ్‌పాండేతోపాటు మరో యువకుడు జట్కాలోనుండి దిగుతున్నాడు. జ్ఞానప్రకాశ్ వరండాలోకి వచ్చి వాళ్ళిద్దరినీ లోపలికి పిలిచారు: "రండి పాండేగారూ! చాలా ఆలస్యం చేశారే!"

"అవునండీ, ఈయనను వెదకడంలో ఆలస్యమైపోయింది. ఈయనే నేను చెప్పిన వ్యక్తి శ్రీ గేందాలాల్. ఈ సంవత్సరం ఈయన యం. ఏ. ప్యాసయ్యారు. లెదర్ ఫ్యాక్టరీ పెట్టాలని ఆలోచిస్తున్నారు."

గేందాలాల్ జ్ఞానప్రకాశ్‌కి వంగి సలాం చేశాడు. జ్ఞానప్రకాశ్ దానికి సమాధానంగా "రండి లోపలికి" అన్నారు.

గేందాలాల్ ధోతీ, చొక్కా, చొక్కాపైన "ఓపెన్ కోటూ" వేసుకొని ఉన్నారు. అతనంత పొడుగరీ కాదు పొట్టీకాదు. మధ్యరకంలో బాగా గట్టిపడిన శరీరం. గుండ్రని ముఖం, ముఖంమీద మచ్చలు, చామని చాయగా ఉన్నాడు. అతని తలమీద తలపాగా ఉంది. వయస్సు దాదాపు పాతికేండ్లు ఉండవచ్చు. అతను కొంచెం జంకుతూ డ్రాయింగు రూములోకి ప్రవేశించాడు. జయనాథ్ జ్ఞానప్రకాశ్ ఇద్దరూ కూర్చున్నారు. కాని గేందాలాల్ నిల్చునే ఉన్నాడు. కూర్చోడానికి అతనికి ధైర్యం చాలినట్టులేదు. "కూర్చోండి గేందాలాల్ గారూ, నిలబడ్డారెందుకు?" అన్నాడు జ్ఞానప్రకాశ్.

"అలాగేనండీ, మరేం పరవాలేదు. నిలుచున్నందువల్ల నాకేం కష్టంగా లేదు. పాండేగారు నన్ను జట్కాలో తీసుకువచ్చారు. మామూలుగా నేను నడిచే వెళ్ళుతూంటాను."

జ్ఞానప్రకాశ్ లేచి గేందాలాల్ చెయ్యిపట్టుకుని అన్నారు: "అయ్యో కూర్చుందురూ! ఇక్కడ అలాంటి భావాలేమీ అక్కర్లేదు. అంటూ సొంటూ అనే భేదం మేమెప్పుడో వదిలేశాం. గాంధీమహాత్ముడు దీనికై నడుం కట్టుకున్నాడు."

జయనాథ్‌పాండే అన్నారు: "ఈ ఉద్యమాన్ని అసలు స్వామీ దయానంద్ ఆరంభించారు కదండీ జ్ఞానప్రకాశ్ గారూ! కాని ఈ నాటికి గాని అది సరిగ్గా కొనసాగడం లేదు. ఇంతకూ కూర్చోవోయ్, గేందాలాల్! మనమంతా సమానమే."

గేందాలాల్ ఒదుక్కుని ఓ కుర్చీమీద కూర్చున్నాడు. కొంచెం ఆలోచించి అడిగాడు: "అయ్యా, మరి సెలవియ్యండి. నన్నేదో అడగాలను కున్నారట!"

జ్ఞానప్రకాశ్ అడిగారు: "మీరు విదేశీ పద్ధతిలో ఏదో లెదర్ ఫ్యాక్టరీ పెడుతున్నారని నేను విన్నాను?"

"అవును, ఇంకా ఫ్యాక్టరీ పెట్టేదాకా రాలేదు. పెట్టాలని మాత్రం ప్రయత్నిస్తున్నాను, కాని డబ్బుదొరకడం లేదు. గవర్నమెంటుకు వ్రాసి కూడా ఇప్పటికి సంవత్సరమయింది. ఎవరన్నా అప్పడిగితే పెద్ద పెద్ద వడ్డీలడుగుతున్నారు. అదిగాక లాభంలో సగం వారిది."

జయనాథ్ పాండే అందుకున్నాడు: "ఈ షరతుల మాట చెప్పకండి. వాటిప్రకారం పోతే ఫ్యాక్టరీ బాగా సాగడం మొదలు పెట్టేసరికి అప్పిచ్చినవాడే యజమానిఅయి కూర్చుంటాడు. గేందాలాల్ గారు ఫ్యాక్టరీ వదలిపెట్టి బయటికి నడవాల్సి వస్తుంది. లేదా అక్కడ నౌకరీ చేయాలి. అంతేకదూ గేందాలాల్. నేను చెప్పేదాన్లో ఏమన్నా పొరబాటుందా? అందుకని ఇప్పుడల్లా ఫ్యాక్టరీ ప్రారంభించే ఆలోచన మానేయమని ఈయనతో నేను చెప్పాను."

"అవునండీ పాండేగారూ! మీరు చెప్పినట్టు ఆ ఆలోచన మానేస్తున్నాను. ఒక్కొక్కప్పుడు మనస్సులో ఉద్రేకం పుట్టుకవస్తుంది. విదేశీ చర్మం కంటె ఎంతో మంచి చర్మం మనం తయారుచేయవచ్చు. కాని దానికి తగ్గ అవకాశం దొరకాలి కదా! అంతటా మోసం, అన్యాయం."

ఇప్పుడు జ్ఞానప్రకాశ్ అసలు విషయం ఎత్తాడు: "గేందాలాల్ గారూ! ఈ ఉద్యమాన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"అయ్యా, ఈ ఉద్యమం సంగతి అడుగుతున్నారా? దీన్ని గురించి నా అభిప్రాయమంటూ ఏముంటుంది? ఇవన్నీ మీకు సంబంధించిన విషయాలు. మేము అంటరాని వాళ్ళం. మాకీ విషయాలెందుకు బాబూ! మేము తరతరాల దాకా మీకు బానిసత్వం చేయడానికి పుట్టాం."

గేందాలాల్ చెప్పేమాటల్లో ఒక విధమైన పారుష్యం స్పష్టంగా గోచరించింది జ్ఞానప్రకాశ్‌కి. "కాదు గేందాలాల్. అలా అంటరాని వాళ్ళమని మీరు మిమ్మల్ని అనుకోవద్దు. కులీనులమైన మేము మీకు అన్యాయంచేసి మీకు బ్రతుకుతెరువు లేకుండా చేసినందుకు ఫలితంగా

వెయ్యి సంవత్సరాల దాస్యం అనుభవించాం. ఈ రోజు మనదేశంలోని ప్రతివ్యక్తి అస్పృశ్యుడనిపించుకొని అవమానం పొందుతున్నాడని అన్నాడాయన.

గేందాలాల్‌కు జ్ఞానప్రకాశ్ చెప్పినమాట అర్థమయినట్టు లేదు. "అయ్యా, మరి నన్ను పిలిపించిందెందుకో చెపుతారా ?" అని అడిగాడతను.

"గేందాలాల్‌గారూ! దేశంలో ఇంత ఆందోళన జరుగుతున్న విషయం మీకు తెలిసిందేగదూ! దీనిలో మీరు కూడ ఎందుకు పాల్గొన గూడదు ?"

"ఆందోళన జరుగుతున్నదా? మేము పాల్గొనడమా ?" అని ప్రశ్నించాడు గేందాలాల్. "ఏదో జరుగుతున్నదని మాత్రం మాకు తెలుస్తున్నది. కాని ఇదంతా ఏమిటో మాకెవరూ చెప్పనూ లేదు, మాకు బోధపడనూలేదు. బహుశా మాకది బోధపడదేమో కూడ! ఎలా బోధపడుతుంది మరి? మేమేమీ చదువుకున్న వాళ్ళం కాదాయె. నా ఉద్దేశ్యంలో మేమొకవేళ చదువుకున్నప్పటికీ దానివల్ల ప్రయోజనం కూడా లేదు. నేనే ఉన్నాను. చదువుకోడానికి చదువుకున్నాను. కాని ఎక్కడా ఉద్యోగం దొరకదు. ఇతరులు నన్ను ముట్టుకోడానికే సిద్ధంగా లేనప్పుడు నన్ను ఆఫీసుల్లో తమ సరసన కూర్చో బెట్టుకుంటారా? అది మిషన్‌స్కూలు కాబట్టి ఎవరూ ఏమనలేక పొయ్యారు. లేకుంటే నన్ను చదవనిచ్చే వాళ్ళుకూడా కాదు."

అదే సమయానికి గంగాప్రసాద్ గదిలోకి వచ్చాడు. అతను కోటూ, పాంటూ వేసుకొని టైకట్టుకొని ఉన్నాడు. గేందాలాల్ జంకుతూ లేచి నిలబడ్డాడు. గంగాప్రసాద్‌కు వంగి సలాం చేశాడు. గంగాప్రసాద్ దానికి సమాధానంగా తల ఊపి అన్నాడు: "కూర్చో, నిలబడ్డం దేనికి ?"

గేందాలాల్ మళ్ళీ ఒదుక్కుని కూర్చునాడు. అప్పుడు జ్ఞానప్రకాశ్ గంగాప్రసాద్‌కు అతన్ని పరిచయం చేశాడు: "ఇతని పేరు శ్రీ గేందాలాల్. యం. ఏ., ప్యాసయినారు. చర్మకారుడవడంచేత లెదర్ ఫ్యాక్టరీ పెట్టాలని చూస్తున్నారు."

ఉన్నట్టుండి గంగాప్రసాద్ మండిపడ్డాడు: "మాలవాడా? నీ వీ గదిలోకెలా వచ్చావ్? వెళ్ళు బయటకు, వెళ్ళుముందు."

గంగాప్రసాద్ ఇలా ప్రవర్తిస్తాడని జ్ఞానప్రకాశ్ ఊహించను కూడా

లేదు. ఆయన గంగాప్రసాద్ చెయ్యి పట్టుకొని అడిగారు: "ఏమిటి నీవు మాట్లాడేది గంగూ! ఇతనితో మాట్లాడాలని ఇతన్ని నేను పిలిపించాను. ఈ ఉద్యమంలో మన దేశంలోని అస్పృశ్యులు పాల్గొనడం లేదు. ఈ దేశంలో దాదాపు ఆరుకోట్లమంది హరిజనులున్నారు. వీళ్ళ సహకారం మనకు కావాలి."

చటుక్కున లేచి నిలబడ్డ గేందాలాల్ జ్ఞానప్రకాశ్ మాటలకు అడ్డు తగిలాడు: "అవును. ఇప్పుడు మా సహకారం కావాలి. ఆ తర్వాత మమ్మల్ని పాతిపెట్టేయండి. మాకు కూర్చోడానికే అధికారం లేనప్పుడు, ఇక మాట్లాడేదేముంటుంది? ఆందోళన చెయ్యండి, స్వరాజ్యం సంపాదించండి. కాని మమ్మల్ని కనీసం బ్రతకనియ్యండి. మేమంతా మీకు చాకిరి చెయ్యడానికే పుట్టినట్టుంది." ఎవరి సమాధానానికీ ఎదురు చూడకుండానే వెళ్ళిపోయాడు గేందాలాల్.

గేందాలాల్ వెళ్ళిపోయిన తరువాత జ్ఞానప్రకాశ్ గంగాప్రసాద్‌తో అన్నారు: "నీవు నవయుగానికి చెందిన యువకుడవు, చదువుకొన్నవాడివి, ఉదార స్వభావం కలవాడివి కదా ఇలా ప్రవర్తించవని అనుకొన్నాను. కాని నేను పొరపాటు పడ్డానని అనిపిస్తుంది. ఏమయినా సరే, ఈ ఆరుకోట్ల అస్పృశ్యులను పోగొట్టుకోడానికి వీల్లేదు."

గేందాలాల్ వెళ్ళిపోగానే గంగాప్రసాద్ తాను సరిగా ప్రవర్తించలేదని తెలుసుకొన్నాడు. కాని తాను చేసిన పనిని సమర్థించడం తన పరమ కర్తవ్యంగా భావించి అతడిలా అన్నాడు: "అవును. ఈ ఆరుకోట్ల హరిజనులూ, దాదాపు ఏడెనిమిది కోట్ల ముసల్మానులు! అయితే మరి ఈ పదమూడు పధ్నాలుగు కోట్ల జనుల సమస్య పరిష్కరించగలిగితే గదా స్వరాజ్యం సంగతి ఆలోచించగలిగేది! నాకు స్వరాజ్యంతోనూ పనిలేదు, ఇలాంటి వారి సమస్యలను పరిష్కరించ వలసిన అవసరమూ లేదు. నేనీ సాయంత్రం బండికి కాన్పూరు వెళ్ళుతున్నాను."

జయనాథ్ పాండే కూడా లేచి నిలబడ్డారు. ఆయన జ్ఞానప్రకాశ్‌తో అన్నారు: "గేందాలాల్‌ను గురించి మీరేమీ చింతించకండి. అతడు మనవాడే." గంగాప్రసాద్ వైపు తిరిగి మళ్ళీ ఆయన అన్నారు: "గంగాబాబూ, ముసల్మానుల సమస్య పరిష్కారమయి పోయింది. ఇక అస్పృశ్యుల సమస్య నెమరొ్కనడానికి గాంధీమహాత్ముడు కంకణం కట్టు

కున్నాడు. ఇప్పుడింతకుముందే గేందాలాల్ వెళ్ళిపొయ్యాడు. అంటే అస్పృశ్యులు మనకు వేరయి పొయ్యారని అనుకోవలసిన పనిలేదు. అతనెక్కడికి వెళ్ళగలడు, మనవాడు, మనతోనే ఉంటాడు.''

పాండేగారి మాటలు గంగాప్రసాద్‌కు ఎంతవరకు నచ్చాయో చెప్పడం కష్టం. పాండే వెళ్ళిపోయిన తర్వాత గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్‌తో ఇలా అన్నాడు: ''మామయ్యా, మీరు చేస్తున్న ఆందోళన జయప్రదం కాబోదని మాత్రం చెప్పగలను. స్వాతంత్ర్యం పొందే అర్హత సంపాదించుకోడానికి మనకింకా వందల కొలది సంవత్సరాలు పడుతుంది. అదికాక స్వాతంత్ర్యం, సామ్యం అనే నూతన చైతన్యం మనకు ఇంగ్లీషువారి వల్లనూ వారి భాషవల్లనూ లభించిందని కూడ మీరు అంగీకరిస్తారు కదా! కాబట్టి ముందు మనం చదువులో ఆరితేరాలి. ఆ తర్వాతనే స్వాతంత్ర్యం గురించి ఆలోచించడం సాధ్యమవుతుంది. ఇక ఈ ఉద్యమం సంగతి అంటారా! దీనికొక తీరూ తెన్నూ ఏ రకమైన ఏర్పాటూ లేకుండా ఆరంభించడం జరిగింది. కాబట్టి దీనికి పరాజయం తప్పదు.''

గంగాప్రసాద్ అన్న మాటలకు జ్ఞానప్రకాశ్ ఏమీ బదులు చెప్పలేదు. బహుశా ఆయన వాదనలో దిగే 'మూడ్' లో ఉన్నట్టు లేరు. ''అయితే ఈ సాయంత్రం నీవు వెళ్ళడం ఖాయమన్నమాట. కాని బాబూ, ఈ ఉద్యమాన్ని గురించి నీకు కొంచెం సహానుభూతి ఉండేలాగా చూడు.'' అన్నారాయన.

గంగాప్రసాద్ కాన్పూరు చేరిన మరుదినమే ఛార్జి తీసుకొన్నాడు.

చలి హెచ్చింది. గంగాప్రసాద్‌కు ఒక కొత్త వులెన్ సూటు కుట్టించుకుంటే బాగుంటుందని అనిపించింది. కాన్పూరు వచ్చిన తర్వాత సంఘంతో అతనికి ప్రమేయం కూడా పెరిగి పోయింది. కాన్పూరులో చాలా మిల్లులుండడంవల్ల అక్కడ ఇంగ్లీషువారి సంఖ్య ఎక్కువగా ఉండేది. నిత్యం వాళ్ళతో రాక పోకలు జరుగుతూ ఉండేవి. నవల్‌ను అతడు కాన్వెంట్‌లో చేర్చాడు. ఆనాడు ఆఫీసు పని పూర్తికాగానే అతడు గుడ్డ కొనుక్కోడానికి నేరుగా ఊళ్ళోకి వెళ్ళాడు.

గంగాప్రసాద్ గుడ్డ కొనుక్కొని ఇంటికి తిరిగి వెళ్ళే సమయంలో బజారులో జనం అట్టే లేరు. ఇంటికి వెళ్ళేసరికి కలెక్టరుగారు అతనితో ఏదో

ముఖ్య విషయం మాట్లాడాలని మరునాడు ఉదయం ఏడు గంటలకు రమ్మని కబురు చేశారని తెలిసింది.

గంగాప్రసాద్ కలెక్టరు దగ్గరకి వెళ్ళేసరికి ఆయన వరాండాలో కూర్చుని టీ త్రాగుతున్నారు. గంగాప్రసాదుకు టీ కలుపుతూ ఆయన అన్నారు: "మిస్టర్ గంగాప్రసాద్! చాల గంభీరమైన వార్త అందింది. నిన్న బొంబాయికి యువరాజు వచ్చినపుడు గుంపులపై పోలీసులు కాల్పులు జరుపవలసి వచ్చింది."

గంగాప్రసాద్ ఉలిక్కిపడ్డాడు: "గుంపులపై కాల్పులు జరిగాయా? చాల విచారకరమైన విషయమే. యువరాజుగారు ఏమనుకొన్నారో ఏమో!"

కలెక్టర్ అన్నారు: "యువరాజుగారేమనుకొన్నారో అనే విషయం కంటె ఈ ఆందోళన ఇంతగా ఎలా ప్రబలింది అనేది ముఖ్యమైన విషయం. యువరాజు రాకను బహిష్కరించడం జరుగుతుందని మనకు తెలుసు. కాని ఈ బహిష్కరణ ఇంత ఉగ్రరూపం ధరిస్తుందనీ ఇంత దారుణంగా మారుతుందనీ మనం ఊహించలేదు. ఇక్కడ ఊళ్ళో పరిస్థితి ఎలా ఉందో గమనించావా?"

"పరిస్థితి కాన్పూరులోకూడ సరిగ్గాలేదు. నిన్న గుడ్డలు కొనుక్కోడానికి అలా ఊళ్లోకి వెళ్ళాను. మూల్‌గంజ్ దగ్గర చాలామంది విదేశీ గుడ్డలను తగులబెట్టి చాలా ఆవేశంతో ఉపన్యాసాలిచ్చారు. బజారులో ఏదో కొంత ఆందోళనగా ఉంది. వర్తకులు విదేశ వస్త్రాలను అంగళ్ళలో లేకుండా చూచుకొంటున్నారు. ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియకుండా ఉంది. విదేశీ గుడ్డ బజార్లలో కనిపించడంలేదు. ఈ స్వదేశీ ఉద్యమం తీవ్రరూపం ధరిస్తూ ఉంది. విదేశీ వస్త్రాలమ్మే అంగళ్ళపై త్వరలోనే దాడి జరుగవచ్చునని అనిపిస్తున్నది."

"అలాగా!" కలెక్టరు చాల విచారకరంగా అన్నారు: "మిష్టర్ గంగాప్రసాద్! మనం తగిన జాగ్రత్తలో ఉండాలని గవర్నమెంటు నుండి ఆదేశం వచ్చింది. యువరాజు మద్రాసు మీదుగా కలకత్తా వెళ్ళుతున్నారట. డిశంబరు 25 వ తేదీ కలకత్తాలోనే ఆయన క్రిస్మస్ పండుగ జరుపుకుంటారట. గవర్నర్ జనరల్‌కూడా ఆ సమయంలో అక్కడనే ఉంటారట. జనవరిలో యువరాజు ఉత్తర భారతదేశంలో పర్యటిస్తారట.

బొంబాయిలో జరిగిన ఘటనలు తిరిగి ఇక్కడ జరగకుండా మనం జాగ్రత్త పడాలి. ఇప్పటినుండే తగిన ఏర్పాట్లు చేయాలి.''

"అవును, అలాగే చేద్దాం. కాని ఎలాంటి ఏర్పాట్లు చేయడమనేది ప్రశ్న.'' అన్నాడు గంగాప్రసాద్.

"నా ఉద్దేశ్యంలో కాంగ్రెసు నాయకులూ, కార్యకర్తలూ ఎవ రెవరున్నారో వారిపేర్లన్నీ తెలుసుకొని ఒక జాబితా తయారు చేయాలి. డిశంబరు చివరి వారంలో వీళ్ళందర్నీ అరెస్టు చేయాల్సి ఉంటుంది. ఈ కాంగ్రెస్ స్వయంసేవకసంఘం ఉందే, దీనికి డబ్బు ఎక్కడినుండి వస్తుందో నీవు కనిపెట్టాలి.'' కలెక్టరు కొంచెంసేపు ఆగి మళ్ళీ అన్నారు: "మిస్టర్ గంగాప్రసాద్! కాంగ్రెసుకు ఈ డబ్బంతా ఎక్కడనుంచి వస్తున్నదో నీవు ఊహించగలవా? ఇక్కడ కాన్పూర్లో పెద్దపెద్ద జమీందార్లూ, తాలూకాదార్లూ కూడా లేరు కదా!''

గంగాప్రసాద్ మనస్సులో మూల్‌గంజ్ వర్తకుడన్న మాటలు మెదలుతూ ఉన్నాయి: "స్వదేశీ ఉద్యమంవల్ల దేశీ మిల్లుల అదృష్టం పండినట్లు కనిపిస్తుంది.'' కొంచెం జంకుతూ అన్నాడతడు: "ఈ ఉద్యమంవల్ల లాభం పొందేవారి దగ్గరినుంచి అంటే మిల్లు యజ మానులు, వర్తకుల దగ్గరి నుంచి - వాళ్ళకు ఈ డబ్బు వస్తున్నదను కొంటాను.''

కలెక్టరు గంగాప్రసాద్ వైపు ఏదో గమనిస్తున్నట్లు చూచాడు: "మిస్టర్ గంగాప్రసాద్! నీవు నిజంగా చాలా తెలివిగల వాడివి. ఇంత చిన్న విషయం నాకింతకు ముందు ఎందుకు బోధపడలేదో నాకాశ్చర్యంగా ఉంది. ఈ ఉద్యమం అన్నిచోట్లా ఆగిపోయినప్పటికీ, బొంబాయి, కలకత్తాలో ఎందుకు తీవ్రరూపం ధరిస్తున్నదో నాకిప్పుడు పూర్తిగా తెలిసిపోయింది. కాన్పూరు కూడా వాణిజ్య కేంద్రమే. కాని ఇక్కడి మిల్లు యజమానులు ఎక్కువమంది ఆంగ్లేయులు. లేకుంటే రాజభక్తులు. మిస్టర్ గంగాప్రసాద్! ఈ మిల్లు యజమానుల్లోనూ, వర్తకుల్లోనూ ఎవరెవరికి కాంగ్రెస్‌తో గాఢమైన సంబంధం ఉందో కొంచెం జాగ్రత్తగా కనిపెట్టు.''

ఆరోజు సాయంత్రం గంగాప్రసాద్ లక్ష్మీచంద్ ఇంటికి వెళ్ళాడు. లక్ష్మీచంద్ ఊళ్ళో ఇంటిలో కచ్చేరీ పెట్టుకుని, ఉండడానికి సివిల్

లైన్సులో బంగళా కట్టుకున్నాడు. లక్ష్మీచంద్ ఉంటున్న బంగళానుండి గంగాప్రసాద్ బంగళా దాదాపు ఒకమైలు దూరం ఉంటుంది. గంగా ప్రసాద్ లక్ష్మీచంద్ బంగాళాకు చేరేసరికి చీకటి పడింది. లక్ష్మీచంద్ బయట గదిలో కూర్చుని ఏవో కాగితాలు చూచుకుంటున్నాడు. ఇద్దరు గుమాస్తాలు అతనికి సాయం చేస్తున్నారు. గంగాప్రసాద్ తన కార్డు పంపించగానే లక్ష్మీచంద్ కాగితాలన్నీ మూసేసి అవన్నీ సర్దుకోమని గుమాస్తాలకు చెప్పి వాళ్ళను మరునాడు ఉదయం రమ్మని చెప్పాడు. ఆ తరువాత అతను బయట వరండాలోకివచ్చి గంగాప్రసాద్‌ను కలిసికొని : "అరే నీవా గంగాప్రసాదువా? కార్డు పంపడమెందుకు? మనలో మనకు ఇవన్నీ ఎందుకోయ్! రా లోపలికి రా!" అన్నాడు.

లక్ష్మీచందూ, గంగాప్రసాదూ డ్రాయింగు రూములోకి వెళ్ళి కూర్చు న్నారు: "ఎక్కడ ఉండడం ఇప్పుడు? ఇక్కడికి కాన్పూరు ఎప్పుడు వచ్చావ్? ఏం విశేషం?" అని అడిగాడు.

ఆనాడు జైదేయి చావుబ్రతుకుల్లో ఉన్నప్పుడు తల్లినితిట్టి తననూ తన తండ్రిని అవమాన పరిచిన ఆ లక్ష్మీచందుతో ఈ నాటి లక్ష్మీచందును గంగాప్రసాద్ తనలో తాను పోల్చుకుంటున్నాడు. ఇప్పుడా లక్ష్మీచంద్ తనతో ఎంతో ఆత్మీయంగా నవ్వుతూ మాట్లాడుతున్నాడు. దీనితో గంగా ప్రసాదుకు తన మనస్సులో ఏదో విచిత్రమైన మార్పు జరుగుతున్నట్టు తోచింది. అతనిలోని గాంభీర్యం అంతరించి అతని ముఖం మీద చిరు నవ్వు కనిపించింది. అతని మాటల్లో మార్దవం కనిపించింది. "ఏడు రోజుల క్రిందట ఇక్కడికి కాన్పూరుకు జాయింట్ మేజిస్ట్రేటుగా వచ్చి చేరాను. రాగానే పనిలో దిగబడి పోయాను. కొత్త ఊరు, కొత్త బాధ్యతలు కొత్త సమస్యలు. ఈ రోజు మన లక్ష్మీచంద్ సాహబ్‌ను చూద్దామని పించింది. కాస్త తీరిక చూచుకుని ఇలా వచ్చాను."

"భేష్, భేష్, నా తమ్ముడు గంగూ కాన్పూరుకు జాయింట్ మెజిస్ట్రేటా ఎంత సంతోషం! ఇంతవరకూ మనదేశం వాళ్ళెవరూ ఈ పదవిలోకి రాలేదు. నాకెంత గర్వంగా ఉంది. స్వాగతం, సుస్వాగతం." అంటూ లక్ష్మీచంద్ చటాలున లేచాడు: "ఉండవోయ్, మీ వదినెకు కూడా ఈవిషయం చెప్పి వస్తాను. నిన్ను గురించి అడగని రోజు లేదు. నాకేమో నీ అడ్రసైనా తెలియదాయె. నీవేమో ఉత్తరాలు వ్రాయడమే

మానేశావు." అంటూ లక్ష్మీచంద్ ఇంట్లోకి వెళ్ళాడు. అయిదు నిమిషాలయిందో లేదో రాధతోసహా అతను బయటకు వచ్చాడు.

రాధ చాలా లావెక్కింది. చూడడానికి కొంచెం అసహ్యంగా కూడా ఉంది. ఒంటినిండా సొమ్ములు పెట్టుకుని నడివయస్సులో ఉన్న ఆమెను చూచి గంగాప్రసాద్ ఫలానా అని పోల్చుకోలేక పోయాడు. చివరకతను లేచి నిలబడి ఆమెకు నమస్కారం చేశాడు. "సుఖంగా ఉండు నాయనా! అయినా తెలియక అడుగుతాను గాని వచ్చే ముందు ఒక ఉత్తరం ముక్క వ్రాస్తే స్టేషనుకు కారుపంపించక పోయామా! ఎక్కడ దిగావు? కులాసాగా ఉన్నావా?" అన్నదామె.

లక్ష్మీచంద్ నవ్వుతూ అన్నాడు: "ఈయనగారు కాన్పూరుకు జాయింట్ మేజిస్ట్రేట్ సాహెబ్ అయి వచ్చారు. ఇక ఈయన కులాసాకు కొరవేముంటుంది! పెద్ద బంగళా, కావలసినంత మంది జమాన్లు, నౌకర్లు! మనల్ని చూడటానికి రావడమే గొప్ప. అయితే గంగూ! అమ్మాయిని కూడా తీసుకు వచ్చావా లేదా? బాబాయి, పిన్నీ కులాసా? అలహాబాదులో ఆయన ఇల్లు కట్టుకొని రిటైరయిన తరువాత అక్కడనే ఉంటున్నారని విన్నాను."

"అవునన్నయ్యా! నాన్నగారు అలహాబాదులో బంగళా కట్టుకున్నారు జార్జిటౌనులో. కాని అక్కడ నాన్న, అమ్మ ఒంటరిగా ఏముంటారు! ఏదో నచ్చచెప్పి వాళ్ళనిక్కడికే తీసకొని వచ్చాను. మా వాళ్ళు కూడా ఇక్కడనే ఉన్నారు. నాన్న మీ దగ్గరికి రావాలనే అనుకుంటున్నారు. కాని ఇంకా ఇల్లు, సామాను సర్దుకోవడంతో తీరిక దొరకడం లేదు. అదికాక నా దగ్గర జట్కాబండి ఒక్కటే ఉండడంతో అది ఎప్పుడూ నాతోటే ఉంటున్నది. ఆదివారం నాడిక్కడికి వస్తామని అంటున్నారు."

"అదేమిటోయ్, ఇంకా జట్కాబండితోనే జరుపుతున్నావా! ఈపాటికి నీవు కారు తీసుకొని ఉండాల్సింది. జట్కా గిట్కా మామూలు డిప్టీ కలెక్టర్లకు సరిపోతుంది. నీవు జాయింట్ మెజిస్ట్రేటువు కదటోయ్." అన్నాడు లక్ష్మీచంద్. కొంచెంసేపు ఆలోచించి అతను మళ్ళీ ఇలా అన్నాడు: "రేపు సాయంత్రం మీ యింటికి నేను స్వయంగా వస్తాను. బాబాయిని చూడాలి. ఆయనతోపాటు మీవాళ్ళను కూడా నేను మా యింటికి తీసుకు వస్తాను. అమ్మాయి, పిల్లలు అందరూ ఇక్కడే భోం

చేస్తారు. తీరికగా ఉంటే నీవు కూడా ఇక్కడే భోం చెయ్యి. అయితే మరి మా చప్పిడి భోజనం నీకు రుచిస్తుందో లేదో!" అంటూ లక్ష్మీచంద్ కొద్దిగా నవ్వాడు.

గంగాప్రసాద్‌కు కూడా నవ్వు వచ్చింది: "అదేం కాదుగాని రేపు యస్. పి. గారింట్లో నాకు డిన్నరుంది. నేను తరువాత ఎప్పుడైనా వస్తానులే!"

గంగాప్రసాద్ ఇంటికి వెళ్ళి తను లక్ష్మీచంద్ గారింటికి వెళ్ళి వచ్చిన విషయాలన్నీ జ్వాలా ప్రసాద్‌తో చెపుతూ అన్నాడు: "రేపు సాయంత్రం అతను మిమ్మల్ని అందర్నీ వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళడానికి వస్తాడు. ఎంతో అప్యాయంగా మాట్లాడాడు నాన్నా!"

జ్వాలా ప్రసాద్ ముఖంలో గాంభీర్యం కనిపిస్తూ ఉంది: "గంగూ! నీవు వాళ్ళ ఇంటికి వెళ్ళకుండా ఉంటే బాగుండేది."

"నేనేం చెయ్యను నాన్నా! కాన్పూరులో ఉన్న మిల్లు యజమానుల్లో పేరు గలవాడు. పుర ప్రముఖుడు. 'సర్' బిరుదు పొందినవాడు. ప్రభుత్వంలో మంచి పలుకుబడి గలవాడు. అతనితో నేను స్నేహంగా ఉండక తప్పదు. కాని నాకేం పరవాలేదు నాన్నా! అలాంటి భయమేమీ లేదు. గడచిపోయిన విషయాలు మరిచిపోవడం మంచిది. ఎంతకాకపోయినా బాబాయిగారి కుమారుడు కదా? ఒకప్పుడు మనమంతా అయినవాళ్ళమే."

గంగాప్రసాద్‌లో ఆపేక్ష, బంధుప్రేమ అనే భావాలు లేకపోవడం జ్వాలా ప్రసాద్‌కు చాలా కొరవగా ఉంటూ వచ్చింది. అలాంటిది తన కుమారుడి నోట ఇలాంటి మాటలు వినేసరికి ఆయన తన కుమారునిలో ఒక క్రొత్త మార్పు గమనించి సంతోషించారు: "అవును గంగూ! నీవు చెప్పింది నిజం. కాని లక్ష్మీచంద్.......ఎందుకో తెలియదు కాని అతని మీద నాకెప్పుడూ మంచి అభిప్రాయం కలుగలేదు. సరేపోనీ! రానియ్యతన్ని, వాళ్ళింటికి వెళ్ళుదాం."

మరునాడు సాయంత్రం దాదాపు ఆరుగంటలకు లక్ష్మీచంద్ ఒక క్రొత్త ఓవర్‌లాండు కారు తీసుకొని గంగాప్రసాద్ బంగాళకు వచ్చాడు. గంగాప్రసాద్ లక్ష్మీచందుకోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. లక్ష్మీచంద్ డ్రాయింగు రూములోకి రాగానే "గంగూ! ఇలా రా ఒక్క నిమిషం

నాతోటి. నేనొక క్రొత్త కారు కొన్నాను, ఈరోజే. ఎలా ఉందో చూడు'' అని గంగాప్రసాద్‌ను బయటికి పిల్చుకుపోయాడు.

''నీ దగ్గర రెండు కార్లున్నాయి కదా! నిన్న నేను చూదాను. కాని ఈ కారు చాలా బాగుంది. రెండు మూడు నెలల్లో నేను కూడా ఒక కారు కొనాలని అనుకుంటున్నాను.'' అన్నాడు గంగాప్రసాద్.

కారు చూచి ఇద్దరూ గదిలోకి వచ్చారు. గంగాప్రసాద్ లక్ష్మీచంద్ వచ్చిన వార్త వాళ్ళ నాన్నకి చెప్పాడు.

జ్వాలా ప్రసాద్ బయటకు వచ్చారు. లక్ష్మీచంద్ లేచి నిలబడ్డాడు: ''నమస్కారం బాబాయ్, మీరంతా ఇక్కడికి వచ్చేశారని నిన్ననే గంగా ప్రసాద్ చెప్పాడు. ఒకప్పుడు మనమెంతో ఆత్మీయంగా ఉండేవాళ్ళం. ఆ రోజులన్నీ గుర్తుకువచ్చాయి. గంగాప్రసాద్‌ను చూడగానే కడుపునిండి పోయింది–నా చిట్టి తమ్ముడు కదూ! మీరంతా కులాసా గదా! మీ ఆరోగ్యం బాగా ఉంటున్నది కదా!''

లక్ష్మీచంద్ మాటల్లోని ఆత్మీయత జ్వాలా ప్రసాద్‌ను ఆకర్షించింది. ఆయన లక్ష్మీచంద్‌ను కుశల ప్రశ్నలడిగారు. యమున, రుక్మిణి, పిల్లల్ని తయారు కమ్మని చెప్పారు.

అందర్నీ తయారుచేసుకుని జ్వాలా ప్రసాద్ బయటకు వచ్చేసరికి లక్ష్మీచంద్, గంగాప్రసాద్ రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. బొంబాయిలో జరిగిందంతా పేపర్లలో వచ్చింది. దాన్ని గురించి ప్రజలు రకరకాలుగా చెప్పుకుంటున్నారు. ''స్వదేశీ ఉద్యమం అని ఏదో అంటున్నారే, దీనివల్ల స్వరాజ్యం వస్తుందా? అచ్చం మనదేశంమీద ఆధారపడి మనం మాత్రం ఉండగలమా! అలా ఉండడానికి మనదేశంలో అన్ని పరిశ్రమలెక్కడ ఉన్నాయి? విదేశీ వస్తువులు కొనుక్కోక తప్పదోయ్.'' అంటున్నాడు గంగాప్రసాద్.

లక్ష్మీచంద్ సమాధానం చెపుతున్నాడు: ''అవును తమ్ముడూ! ఈ ఉద్యమంవల్ల స్వరాజ్యం రాదని నీవు చెప్పిన మాట నిజమే. కాని మన దేశంలో పరిశ్రమలను వృద్ధికి తీసుకురావాల్సిన అవసరంకూడా వుంది. ప్రజల్లో స్వదేశాభిమానం లేకపోతే పరిశ్రమలు వృద్ధికి రాలేవు. మన దేశంలో పరిశ్రమలిప్పుడిప్పుడే ఆరంభించాయి. మరి ప్రారంభ దశలోనే మనం విదేశాలతో పోటీకి నిలబడలేము. దేశంలో ప్రజలంతా అభి

మానంతో మాకు చేయూతనిస్తే మేము పెట్టుబడి పెట్టి పరిశ్రమలను నడిపించి దేశం స్వయంపోషకం అయేటట్లు చేయగలం. ప్రజలు ముతక గుడ్డలయినాసరే ఖద్దరే కట్టుకోవడానికి సిద్ధమయితే, మెల్లమెల్లగా ఇంకా ఎన్నో మిల్లులు బయలుదేరుతాయి దేశంలో. అప్పుడు మేము ఇంకా సన్నని బట్టలు తయారు చేయగలుగుతాం. కనక సహకార నిరాకరణంలో ఈ స్వదేశీ ఉద్యమం మాత్రం నాకు బాగా నచ్చింది. ఇక స్వరాజ్యం, ఖిలాఫత్ ఇవన్నీ నిరుపయోగమైనవని నా నమ్మకం.'' అంటూ లక్ష్మీచంద్ నవ్వేశాడు.

జ్వాలా ప్రసాద్ దుస్తులు వేసుకొని బయటకు రావడంచేత లక్ష్మీచంద్ రాజకీయ చర్చను అంతటితో ఆపేశాడు: ''ఇక నీ విక్కడికి వచ్చేశావు గదా గంగూ! తీరికగా మాట్లాడుకోవచ్చు. ఏదైనా అవసరముంటే నాకు కబురుచేయి. ఏ రకమైన సహాయం కావలసివచ్చినా నేనున్నాను. ఇదుగో చూడు గంగూ! నీవు నా తమ్ముడి వంటివాడివి. నా తమ్ముడు ఇక్కడ పెద్ద ఆఫీసరుగా పని చేస్తున్నాడు. మరి అతనికి కారు కావాలి. ఈరోజు నేను కొన్న ఈ కారు నీకోసమే. ఆ కారులోనే నేను మీ యింటికి వచ్చాను. ఆ కారులోనే మీవాళ్ళను తీసుకువెళుతున్నాను. కంపెనీ వాళ్ళ తరపున ఒక నెలవరకు డ్రైవర్ను కూడా తీసుకున్నాను. అతని జీతం కూడా ఈ కారు ధరలోనే కలిసి ఉంది. ఈ కాగితాలన్నీ జాగ్రత్తగా ఉంచుకో! ఈ డ్రైవరు నీకు డ్రైవింగు నేర్పుతాడు. కావాలంటే మరో డ్రైవర్ను మాట్లాడి పెడతాను. ఇంటికి వెళ్ళి ఈ కారు తిరిగి నీకు పంపిస్తాను. దీనిలోనే డిన్నరుకు వెళ్ళు.''

గంగాప్రసాద్ చాలా రోజులనుంచి కారు కొనుక్కోవలెనని ఆలోచిస్తున్నాడు. కాని డబ్బు కూడకపోవడంవల్ల కొనలేక పోతున్నాడు: ''అన్నయ్యా! ఎందుకిదంతా, నేను కొనుక్కుంటాను గదా!'' అన్నాడు మర్యాదగా.

''నీవు కొంటే ఒకటి, నేను కొంటే ఒకటా? దీనిలో పెద్ద మునుచుకు పోయేదేముంది?'' అంటూ అతను జ్వాలా ప్రసాద్తో అన్నాడు: ''ఇక వెళ్ళుదామా బాబాయ్? వాహనం లేకపోవడంవల్ల మీరు మాయింటికి తరుచుగా రాలేకపోతున్నారు. గంగూ నాకన్ని విషయాలు చెప్పాడు. అందుకని ఈ గొడవంతా ఎందుకని నేననుకున్నాను. ఒక కారు, ఒక

జట్కా-కారు తమ్ముడికి, జట్కా ఇంట్లోవాళ్ళకి. కనీసం ఈ రెండన్నా లేకపోతే ఈ రోజుల్లో పని జరగదు బాబాయ్."

క్రమంగా గంగాప్రసాద్, లక్ష్మీచంద్ కుటుంబాల్లో మళ్ళీ ఘనిష్ఠ సంబంధం ఏర్పడింది.

డిశంబరు మూడో వారంలో బెంగాలులోనేకాక, ఉత్తర భారతదేశ మంతటా 'క్రిమినల్ లా ఎమెండ్‌మెంట్ ఆక్టు' అమల్లోకి వచ్చింది. బెంగాల్లోనూ, యు. పి. లోనూ కాంగ్రెసు నాయకులనందరిని అరెస్టు చేశారు. డిశంబరు 25 వ తేది 'యువరాజు' కలకత్తా చేరుకున్నారు. కాని అక్కడ జరిగిన సమ్మెలూ, ఉత్తర భారతదేశమంతటా జరిగిన సమ్మెలూ ప్రదర్శనలూ పరిస్థితిని విషమింపజేశాయి. డిశంబరు 25 వ తేది కలకత్తాలో సమ్మె జరిగిన విషయం తెలియగానే కలెక్టరు గంగాప్రసాద్‌ను మాట్లాడడానికి పిలిపించారు. ఆ మీటింగులో మిగిలిన జిల్లా అధికార్లు కూడా ఉన్నారు. కాని ఈ ఉద్యమాన్ని ఆపివేయడానికి ఉపాయం ఎవరూ చెప్పలేకపోతున్నారు. అందరూ చెప్పే సమాధానం ఒకటే - అణగద్రొక్కి వేయండని.

అహమ్మదాబాదు కాంగ్రెసులో ఈ ఉద్యమాన్ని ఇంకా తీవ్రంగా కొనసాగించాలని నిర్ణయం జరిగింది. ఆ కాంగ్రెసు సభలకు జ్ఞానప్రకాశ్ వెళ్ళాడు. అక్కడనుండి తిరిగివచ్చేటప్పుడాయన నేరుగా అలహాబాదు వెళ్ళకుండా ఢిల్లీమీదుగా కాన్పూరు వచ్చారు. ఆరోజు 1922 జనవరి మొదటితేది. గంగాప్రసాద్ ఇంటికి ఎంతోమంది వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అదే రోజు సాయంత్రం లక్ష్మీచంద్ నూతన సంవత్సర సందర్భంగా తన ఇంట్లో డిన్నర్ ఏర్పాటు చేశాడు.

జ్ఞానప్రకాశ్ గంగాప్రసాద్ బంగళా చేరేసరికి సాయంత్రమయింది. గంగాప్రసాద్ కుటుంబంలో వాళ్ళందరూ ఆ రోజు మధ్యాహ్నమే లక్ష్మీచంద్‌గారి ఇంటికి వెళ్ళారు. గంగాప్రసాదు డ్రాయింగు రూములో కూర్చుని తనకోసం వచ్చినవాళ్ళతో మాట్లాడుతూ ఉన్నాడు. అప్పటికి విస్కీబాటిలు ఒకటి పూర్తిగా అయిపోయింది. రెండోది కూడా సగం అయిపోయింది. జ్ఞానప్రకాశ్ వస్తున్నాడని తెలియగానే అతను గదిలోనుండి బయటకువచ్చి జ్ఞానప్రకాశ్ చెయ్యి పట్టుకొని 'రా మామయ్యా రా లోపలికి,

ఢిల్లీ మీదుగా వస్తున్నట్టున్నావ్' అంటూ మరో గ్లాసు తీసుకురమ్మని బంట్రోతుకు చెప్పాడు: "కొత్త సంవత్సరం మామయ్యా! నీకు నా శుభా కాంక్షలు. చాలా అలసిపోయినట్టున్నావ్!" అంటూ విస్కీ బాటిలు జ్ఞాన ప్రకాశ్ ముందు పెట్టాడు.

అక్కడ కూర్చున్నవాళ్ళంతా లేచి వెళ్ళిపోయినారు. జ్ఞానప్రకాశ్ ఒక్క గుటకలోనే గ్లాసులో నాలుగోవంతు ఖాళీచేశారు. నిజంగా ఆయన చాలా అలసి ఉన్నారు. బాగా దప్పిక కూడా వేసినట్లుంది. "బావ ఎక్కడ? ఇల్లంతా బోసిగాఉందే! పిల్లలు కూడా కనిపించడం లేదు!" అని అడిగారు.

"అందరూ లక్ష్మీచంద్ ఇంటికి వెళ్ళారు. ఈరోజు వాళ్ళింట్లో నూతన సంవత్సరమని పెద్ద డిన్నరు ఏర్పాటు చేశారు. ఆఫీసర్లనందరినీ పిలిచారు. నేను కూడా రాత్రి ఎనిమిది గంటలకు అక్కడకు వెళ్ళాలి. అయితే మరి కాళ్ళూ చేతులూ కడుక్కొని గుడ్డలు మార్చుకుంటావా మామయ్యా! డిన్నరు సూట్ కూడా తెచ్చుకు వచ్చావనుకుంటాను." అంటూ అతను గంట మోగించాడు. గంట మోగగానే భీఖా గదిలోకి వచ్చాడు: "మామయ్య స్నానం చేస్తారు. స్నానాల గదిలో వేడి నీళ్ళు పెట్టు" అని భీఖాకి చెప్పాడతను.

తర్వాత అతను జ్ఞానప్రకాశ్ వైపు తిరిగి అన్నాడు: "అయితే మామయ్యా రాజీ కుదరలేదు. మరి మీరందరూ కలిసి ఏం నిర్ణయించారు అహమ్మదాబాదు కాంగ్రెస్‌లో?"

"ఉద్యమాన్ని ఇంకా తీవ్రంగా సాగించడం, దేశమంతటా సత్యాగ్రహం ఆరంభించడం." అన్నారు జ్ఞానప్రకాశ్ నవ్వుతూ. "ఇప్పుడు పోరాటంలో కొంత ఉత్సాహం కనిపిస్తుంది. యువరాజుకు స్వాగతం ఎలా జరిగిందో నీవు చూస్తూనే ఉన్నావుగా."

గంగాప్రసాద్ ముఖంలో రంగులు మారాయి. "గొప్ప చిక్కు తెచ్చి పెడుతున్నావు మామయ్యా! ఈ సహాయనిరాకరణం, సమ్మెలూ ఇవన్నీ మా ప్రాణానికి వచ్చాయి. వాటికి తోడు ఈ సత్యాగ్రహం, పన్నులు మాని వేయడం." కొంచెంసేపు ఆలోచించి మళ్ళీ అన్నాడు: "కాని మీ సత్యాగ్రహం ఒకరకంగా బాగానే ఉంది. దీనివల్ల మేమీ ఉద్యమాన్ని త్వరలోనే అపివేయ గలుగుతాము."

అప్పుడు జ్ఞానప్రకాశ్ అందుకున్నారు: "సత్యాగ్రహంవల్ల మా ఉద్యమం ఆగిపోతుందా? ఏమిటి నీవనేది!"

"అవును. ఆగిపోతుంది. ఈ గుంపులో సామాన్యజనం మధ్య ఈ సత్యాగ్రహం దురాగ్రహం అయిపోతుంది. నాయకులందరూ జైళ్ళల్లో చేరుతారు. మంచీ చెడ్డలు చెప్పి నడిపించే వాళ్ళెవరూ ఉండరు. అప్పుడు జనం హింస నాశ్రయిస్తారు. మళ్ళీ జలియావాలాబాగ్ లాంటి ఘటనలు జరుగుతాయి. అంతే, దాంతో ఉద్యమం సమాప్తం."

జ్ఞానప్రకాశ్ ప్రయాణం బడలికతో అలసిపోయి ఉన్నారు. వాగ్వాదం చేసే ఓపిక లేనట్టుంది. మిగిలిన విస్కీ త్రాగుతూ అన్నారు: "ఈ విషయం మళ్ళీ తీరికగా చర్చిద్దాం. అది సరేకాని, లక్ష్మీచంద్‌గారి ఇంటికి నన్ను బలవంతంగా లాక్కెడుతున్నావు. దానివల్ల ప్రమాదమేమీ లేదుకదా!"

"మామయ్యా! దీనిలో తప్పేముంది? ఇంట్లో అందర్నీ పిలిచాడు. మరి నిన్ను వదలిపెట్టి ఏలా వెళ్ళగలను? లక్ష్మీచందుకు నీవు కూడా బాగా తెలిసిన వాడివే కదా? "సర్" బిరుదు పొందాడు. శాంపేన్ గేంపేన్ అంతా బ్రహ్మాండంగా డిన్నరు ఏర్పాటు చేస్తాడు. నీకు విదేశం జ్ఞాపకం వస్తుంది."

జ్ఞానప్రకాశ్ లోలోపల నవ్వుకున్నారు: "సరేకానియ్, ఈ విందులోనే అతన్ని కలుసుకోవడం కూడా అవుతుంది."

కాళ్ళూ, చేతులూ కడుక్కొని విదేశంలో కుట్టించిన సూటు వేసుకొని జ్ఞానప్రకాశ్ బయటకు వచ్చేసరికి ఆయన బంగళా ఎదురుగా గంగాప్రసాద్ కారు కనిపించింది. "లక్ష్మీచంద్ నీకోసం కారు పంపించాడా?" అని అడిగాడాయన.

గంగాప్రసాద్‌కు నవ్వు వచ్చింది. "లేదు మామయ్యా! ఇది నాకారే. జాయింట్ మెజిస్ట్రేటుగా పనిచేసేటప్పుడు మరి నాకు కారుండవద్దూ. అయినా నీవన్నమాటలో పొరబాటు లేదు. ఈ కారు లక్ష్మీచందే నాకు 'ప్రజెంట్' చేశాడు. అన్నయ్యలాంటి వాడు కదూ! అదికాక కారు కొనుక్కోడానికి నా దగ్గర డబ్బు మాత్రం ఎక్కడ ఉంది? ఇంకా జోన్పూరులో చేసిన అప్పు తీరలేదు."

జ్ఞానప్రకాశ్‌ను చూచి లక్ష్మీచంద్ నివ్వెరపడ్డాడు. అతను జ్ఞానప్రకాశ్‌ను అలహాబాదులో చాలాసార్లు చూదాడు, మాట్లాడాడు. కాని

ఈసారి అతన్నిచూచి అతనిపేరు వినడంతోనే లక్ష్మీచంద్ అలా నివ్వెర పాటు చెందడం గంగాప్రసాద్‌కు కొంచెం వింతగా తోచినప్పటికీ జ్ఞాన ప్రకాశ్‌కు అందులో ఆశ్చర్యపడవలసిన దేమీ కన్పించలేదు. "మీరు అహమ్మదాబాదు కాంగ్రెసునుండి వస్తున్నారా?" అని అడిగాడు లక్ష్మీచంద్ జ్ఞానప్రకాశ్‌ను.

"అవునండీ, ముఖ్యంగా మిమ్మల్ని కలుసుకోడానికి కాన్పూరులో దిగాను. ఇక్కడినుండి అలహాబాదు వెళతాను." అన్నారు జ్ఞానప్రకాశ్.

"రేపు మధ్యాహ్నం ఆఫీసులో కలుసుకుందాం" అని లక్ష్మీచంద్ మిగిలిన అతిథులకు స్వాగత సత్కారాలు చెయ్యడంలో మునిగిపోయాడు. జ్ఞానప్రకాశ్ కూడ జ్వాలా ప్రసాదుతో మాటల్లోకి దిగారు.

జ్ఞానప్రకాశ్‌కూ, లక్ష్మీచంద్‌కూ జరిగిన ఈ సంభాషణ గంగా ప్రసాద్‌కు బోధపడలేదు. ఇంటికి వెళ్ళిన తర్వాత గంగాప్రసాద్ జ్ఞాన ప్రకాశ్‌ను అడిగాడు: "నీవు యూరోపియన్లను తలదన్నే వేషంలో ఉన్నప్పటికీ నీవు కాంగ్రెస్ వాడివనీ, అహమ్మదాబాదు కాంగ్రెసునుండి వస్తున్నావనీ లక్ష్మీచంద్‌కు ఎలా తెలిసింది మామయ్యా?"

"అయితే చెప్తాను విను. కాని ఈ మాట నేను కాన్పూరు జాయింట్ మెజస్ట్రేట్‌తో చెప్పడంలేదు. నాకు ఆత్మ బంధువు, మిత్రుడు అయిన గంగాప్రసాద్‌తో చెపుతున్నానని మాత్రం గుర్తుంచుకో. సర్ లక్ష్మీచంద్ కోటీశ్వరుడు. అవునా కాదా? మరి మా ఉద్యమమంతా ఈ కోటీశ్వరుల మీదనే ఆధారపడి ఉంది. ఉద్యమం సాగడానికి మాకు డబ్బు కావాలి. మాకు కావలసిన డబ్బు ఈ కోటీశ్వరుల వల్లనే వస్తుంది. ఒక విధంగా ఆంగ్లేయుల ఆధిపత్యం వాళ్ళ పెట్టుబడిదారీ విధానం మీదనే ఆధారపడి ఉంది. ఇండియాతో వ్యాపారంచేసి ఇండియాలోని సంపదనంతా కాజేస్తు న్నారు. కాబట్టి బ్రిటిషువారి ఈ పెట్టుబడిదారీ విధానానికి ప్రబలశత్రువు లెవరైనా ఉన్నారంటే మనదేశంలోని ఈ కోటీశ్వరులే."

గంగాప్రసాద్‌కు ఆనాడు బట్టల వర్తకుడన్న మాటలు మళ్ళీ జ్ఞాపకం వచ్చాయి. "ఈ స్వదేశ ఉద్యమంవల్ల దేశీ మిల్లుల అదృష్టం పండినట్లు కనిపిస్తున్నది." వెంటనే అతడన్నాడు: "తెలిసిపోయింది మామయ్యా! అయితే ఈ ఉద్యమంకోసం లక్ష్మీచంద్ దగ్గర డబ్బు తీసుకు పోవడానికి వచ్చావన్నమాట. కాని ఈ లక్ష్మీచంద్ ఇటు

గవర్నమెంటుకూ అటు కాంగ్రెసుకూ కూడా డబ్బిస్తున్నాడంటే ఆశ్చర్యంగా ఉంది.''

"అంతేకాదు. నీకు కారు కొనిచ్చాడు.'' అన్నారు జ్ఞానప్రకాశ్. "కాని గంగూ! ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ కోటీశ్వరులు విపరీతంగా లాభాలు కొడతారు. అందులో కొంత భాగం గవర్నమెంటుకిచ్చి కావలసిన సౌకర్యాలన్నీ పొందుతారు. ఈ లాభంలో కొంత భాగం అతను కాంగ్రెసుకు కూడా ఇస్తాడు. అందువల్ల స్వదేశీ ఉద్యమం బాగా కొనసాగుతుంది. అతని సరుకు బాగా అమ్ముడు పోతుంది. అతనుచేసే అన్యాయాలకూ, అక్రమాలకూ ప్రభుత్వోద్యోగులు ఏమీ చేయకుండా కండ్లుమూసుకొని ఉండడానికి అతను జాయింట్ మేజస్ట్రేటయిన గంగాప్రసాద్‌కు కూడా ఈ లాభంలో కొంతభాగం ముట్టచెప్తాడు. ఈరోజుల్లో డబ్బు అన్ని పనులూ చేయిస్తుంది.'' అంటూ జ్ఞానప్రకాశ్ బిగ్గరగా నవ్వారు.

తొమ్మిది

కాన్పూరులో సార్వజనిక సమ్మె జరిగింది. ప్రజల్లో చాలా ఉద్రేకం కనిపిస్తూఉంది. అంతకు ముందురాత్రి జైలులో ఒక కాంగ్రెసు కార్యకర్త మరణించాడు. జైలుకు సంబంధించిన అధికారులు క్రూరంగా ప్రవర్తించడంవల్ల అతను మరణించాడని ప్రజలంటారు. కాదతడేదో వ్యాధితో సహజంగా మరణించాడని అధికార్లంటారు. మొత్తంమీద ఆ కాంగ్రెసు స్వయంసేవకుని శవ యాత్రకు ప్రత్యేకమైన ఏర్పాటు జరిగింది. ఈయాత్ర మెస్టను రోడ్డును సమీపించేసరికి పాతిక ముప్పైవేల మంది జనులు పోగయ్యారు. ప్రజల్లో ఒక విధమైన ఆగ్రహం, అహాయిత్యం కనిపిస్తూ ఉంది.

పోలీసు అధికార్లు ఈ పరిస్థితిని గమనించి చాల విచారంతో గంగా ప్రసాద్‌కు వాస్తవ పరిస్థితి తెలియపరచారు. అధికార్లు బాగా ఆలోచించిన తర్వాత ఈ యాత్రను సివిల్ లైన్సు దాకా వెళ్ళనీయ కూడదని నిర్ణయించారు. అక్కడ చాలామంది ఇంగ్లీషువాళ్ళ బంగళాలున్నాయి. ప్రజల ఆవేశం, ఉద్రేకం చూస్తే ఏ క్షణంలోనైనా వాళ్ళు హింసాత్మక చర్యలకు తయారుకావచ్చునని తోస్తున్నది. ఈ పరిస్థితి నెదుర్కొనడానికి వెంటనే సాయుధ పోలీసుల జట్లను పిలిపించడం జరిగింది.

దాదాపు రెండువందల మంది సాయుధ పోలీసులు, మామూలు పోలీసులతో సహా గంగాప్రసాద్ మెస్టన్ రోడ్డునుండి సివిల్ లైన్సుకు వెళ్ళే రోడ్డు నడుమ నిలబడ్డాడు – శవ యాత్రనక్కడనే ఆపి వేయాలని. ఆ కాంగ్రెసు కార్యకర్త యొక్క శవాన్ని జైలునుండి నేరుగా భైరవఘాట్ స్మశానానికి తీసుకు వెళ్ళారు. శవంతోపాటు స్వయంసేవకుని దగ్గర బంధువులు కూడా ఉన్నారు. శవయాత్ర ఆ నడిరోడ్డు దగ్గరకు రాగానే జనాన్ని ఆపివేశారు.

ఆ జనానికి ముందు కాంగ్రెసు జండాలు పట్టుకుని స్వయంసేవికలు నిలబడి ఉన్నారు. వాళ్ళతోపాటు ఇంకా చాలమంది ఆడవాళ్ళు కూడా ఉన్నారు. వాళ్ళందరివెనుక కాంగ్రెసు స్వయంసేవకులూ, కార్యకర్తలూ ఉన్నారు. అందరివెనుక కాన్పూరు పురజనులు గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు. గంగాప్రసాద్ ముందుకు వచ్చి జనాన్ని వెనక్కు వెళ్ళవలసిందని చెప్పాడు. సివిల్‌లైన్సులో జనం ప్రవేశించడానికి వీల్లేదని ఉత్తర్వుచేశాడు. ఆ మాటలు విని అయిదుగురు కాంగ్రెసు నాయకులు ముందుకువచ్చారు. జనం తిరిగి వెళ్ళడానికి వీల్లేదనీ, సివిల్ లైన్సు మీదుగా స్మశానానికి వెళ్ళి ప్రజలందరూ తమకోసం ప్రాణాలర్పించిన వీరునికి శ్రద్ధాంజలి అర్పించి తీరవలసిందేననీ, వాళ్లు చెప్పారు. ప్రజలు ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను అనుసరించే పద్ధతిలో లేరు. కాని అహింయిత్వంతో కూడిన చర్యలేమీ జరుగవని వాళ్ళు గంగా ప్రసాద్‌కు హామీ ఇచ్చారు.

జనంలో అలజడి హెచ్చుతూ ఉంది. ప్రభుత్వాన్నీ, ప్రభుత్వోద్యోగులనూ అనరాని మాటలు అంటూ ఉన్నారు. కాంగ్రెస్‌కీ జయ్, మహాత్మాగాంధీకి జయ్, స్వాతంత్ర్యానికి జయ్, భారతమాతా కీ జయ్ అని కేకలు పెడు

తున్నారు. గంగాప్రసాద్ ప్రక్కనే అసిస్టెంటు సూపరింటెండెంటు, తెల్ల దొర నిలబడి ఉన్నాడు. అటూ ఇటూ యూరోపియను సార్జంట్లూ ఆంగ్లో ఇండియన్లూ పిస్తోళ్ళు నడుముకు బిగించుకుని నిలబడి ఉన్నారు. అప్పుడు గంగాప్రసాద్ కాన్పూరు నగరం మొత్తంలో నూటనలభైనాలుగో సెక్షను అమలుచేసి పదిహేను నిమిషాల్లో జనంఅంతా పారిపోవాలసి ఆదేశించాడు.

అప్పుడే జనం వెనుకనుండి ఒక మట్టిపెళ్ళ వచ్చి అసిస్టెంటు సూపరింటెండెంటు ఎడమచేతికి తగిలింది. వెంటనే అతడు మండిపడి పిస్తోలు చేతికందుకొని గుంపుమీదికి ఉరికాడు. గంగాప్రసాద్ అతని చెయ్యి పట్టుకొని క్రిందికి దించాడు. కాని అప్పుడే గుంపునుండి మట్టిపెళ్ళల వర్షం కురిసింది. అందులో ఒక పెళ్ళ గంగాప్రసాద్‌కు తలపై తగిలింది. అప్పుడు గంగాప్రసాద్ లాఠీచార్జీ చేయమని పోలీసులకు ఆజ్ఞాపించారు. గుంపును చెదరగొట్టమని గుఱ్ఱాలమీద ఉన్న పోలీసులకు చెప్పాడు. గంగాప్రసాద్ ఆజ్ఞాపించగానే గుఱ్ఱపు రౌతులు, పోలీసులు జనంమీదికెగబడ్డారు.

జనంలో అలజడి బయలుదేరింది. కాని కాంగ్రెసు స్వయంసేవకులు, స్వయంసేవికలు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడి లాఠీదెబ్బలు తింటున్నారు. అయిదు నిమిషాల్లో గుంపంతా మాయమై పోయింది. గాయపడ్డ వాళ్ళు మాత్రమే మిగిలిఉన్నారు. ఆ లాఠీఛార్జీలో గాయపడ్డవాళ్ళు రెండువందలకు మించే ఉన్నారు. వాళ్ళల్లో దాదాపు పాతికమంది ఆడవాళ్ళు కూడా ఉన్నారు. దగ్గర దగ్గర యాభైమంది తీవ్రంగా గాయపడ్డారు. వాళ్ళను వెంటనే ఆస్పత్రిలో చేర్చారు. మిగిలినవాళ్ళని పోలీసులు స్వాధీన పరచుకొన్నారు.

మరునాడు గంగాప్రసాద్ ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి అతని గదిలో జ్ఞానప్రకాశ్, సత్యవ్రత్ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. దాదాపు ముప్పైమంది ఆ ఉదయమే ఆస్పత్రినుండి విడుదల అయినారు. మిగిలిన ఇరవైమందికి చికిత్స జరుగుతూఉంది. కాని అందరూ తెప్పరిల్లుకుంటూనే ఉన్నారు. క్రిందటిరోజు సాయంత్రం అరెస్టు చేయబడిన అయిదుగురు నాయకులకూ గంగాప్రసాద్ ఒక్కొక్కనెల శిక్ష విధించాడు. దానితో అతని మనస్సు కుదుటపడింది. దుస్తులు మార్చుకొని అతను వాళ్ళిద్దరి దగ్గరకి వచ్చి కూర్చున్నాడు. భిఖూ వాళ్ళ ముగ్గురికి టీ

ఫలహారం ఇచ్చి వెళ్ళాడు. గంగాప్రసాద్ ధైర్య విశ్వాసాలతో జ్ఞాన ప్రకాశ్ వైపు చూదాడు: "ఇక చెప్పండి మీ ఆలోచన లేమిటో!"

"ఆలోచన ఏముంది? నీకు మావల్ల చిరాకు లేకుండా చేస్తున్నాను. కనీసం నీకయినా శాంతి లభిస్తుంది. ఇక ఈ ఉద్యమాన్ని పట్టణాలనుండి పల్లెల్లోకి తరలిస్తున్నాం. పల్లెటూళ్ళలో శిస్తులియ్యడం మానేసి సామూహిక సత్యాగ్రహం చేయించడానికి మేము కార్యక్రమం తయారు చేశాం. ఇక్కడి జాయింట్ మెజిస్ట్రేటుకు పల్లెటూళ్ళతో ఏమీ సంబంధం లేదుకదా! ఈ పద్ధతిలో మూడు నాలుగు నెలల్లోనే ప్రభుత్వం కాళ్ళ బేరానికి వచ్చి ఏదో పరిష్కారం చేసుకుంటుంది."

"అయితే మామయ్యా! మీరు నిజంగా గ్రామాల్లో సామూహిక సత్యాగ్రహం సాగించబోతున్నారా? ఈ సామూహిక సత్యాగ్రహం అనేది చాలా భయంకరమైన అస్త్రం. కొంచెం ఆలోచించి పని చెయ్యండి! ఇంతవరకు మీరు సాధించిన కొద్దీ గొప్ప విజయం దీనితో తుడుచుకు పోతుంది."

కొంచెం ఆలోచించి జ్ఞానప్రకాశ్ అన్నారు: "నాకు తెలుసు గంగూ! మేము సాధించిన ఈ విజయం మా నిష్క్రియత్వంవల్ల కూడా నశించి పోతుంది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని లొంగదీయగలిగింది సామూహిక సత్యాగ్రహమనే ఈ అస్త్రమొక్కటే. ఇప్పుడిక ఈ ఉద్యమం లక్షల కోట్ల సంఖ్యలోఉన్న రైతులదాక ప్రసరించాలి. ఒక వారం తర్వాత అలహాబాదులో యు. పి. కాంగ్రెసు కార్యకర్తలందరూ సమావేశమయి ఈ ఉద్యమాన్ని గ్రామాల్లో ఎలా ప్రవేశపెట్టాలో నిర్ణయిస్తారు."

అప్పుడే కలెక్టరుగారి బంట్రోతు కలెక్టరుగారి దగ్గరినుండి ఒక ఉత్తరం తెచ్చాడు. ఆ ఉత్తరం చదువుకుని గంగాప్రసాద్ ఆశ్చర్యపోయినాడు. "నేనిప్పుడే ఒక గంటలో వస్తున్నానని" చెప్పి అతను బంట్రోతును పంపించేశాడు. బంట్రోతు వెళ్ళగానే కలెక్టరు వైపు చేయించి పంపిన ఆ నోటును గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్‌కు ఇచ్చాడు: "ఇది కొంచెం చదువు మామయ్యా! చాలా విషాదకరమైన వార్త వినిపిస్తున్నాను!"

"ఆ, ఏమిటిది?" అని బిగ్గరగా అరిచారు జ్ఞానప్రకాశ్ ఆ నోటు చదువు కొని. "ఈ చౌరీచౌరా వార్త అసత్యం, అతిశయోక్తి. ఇరవైఒక్క మంది పోలీసులనూ, ఒక సబ్‌ఇన్స్పెక్టరునూ నిలువున కాల్చివేశారా?

పోలీసు స్టేషన్ను తగుల బెట్టారా? నాకు నమ్మకం లేదు. ఏం గంగూ! ఈ వార్త నిజమేనంటావా ?''

''మీకు నమ్మకంలేకపోతే లేకపోవచ్చుకాని ప్రభుత్వం సేకరించే వార్తల్లో అసత్యం ఉండదు. పల్లెటూళ్ళలో ఇలా సామూహిక సత్యాగ్రహం, ఈ విధ్వంస చర్యలు మంచివి కాదనీ, ఇవి భయంకర పరిణామాలకు దారితీయగలవని నేను నీకు మొదటనే చెప్పాను. ఇలాంటివి రెండు మూడు ఘటనలు జరిగితే చాలు, అంతటా సైనిక పరిపాలన అమలులోకి వస్తుంది. పంజాబులో అమలుచేసిన మార్షల్ లా కంటె కూడా ఇది భయంకరమైంది. ఈ సైనిక పరిపాలనను సమర్థించడం కూడా సులభమే.''

దీనికి జ్ఞానప్రకాశ్ ఏమీ బదులు చెప్పలేదు. కాని సత్యవ్రత్ చాల గట్టిగా సమాధానం చెప్పారు: ''మెజస్ట్రేటు గారూ! చాలా సంతోషం. ఒక యు. పి. లోనే కాదు భారతదేశమంతటా మార్షల్ లా అమలు చేయడం మంచిది. ఇంగ్లీషువాళ్ళు దేశమంతటా వ్యాపింపజేసిన రాజ్యాంగ తంత్రం కంటె ఈ మార్షల్ లాయే నయం. మనం బానిసలమనే మాట దేశంలో ఉన్న ప్రజలకందరికీ ఒకసారి తెలియనన్నా తెలుస్తుంది. తామంతా సివిలియన్స్ అనిపించుకుంటూ ప్రభుత్వంలో ఉద్యోగం చేసే మన దేశీయుల వల్లనే కదా ఈ ప్రభుత్వం నడుస్తున్నది!''

సత్యవ్రత్ అన్నమాట గంగాప్రసాద్‌కు కొంచెం కష్టంగా తోచింది. అందులో తనమీద కూడా ఒక విసురు విసరడం జరిగిందని అతను గమనించాడు. కాని సత్యవ్రత్ అన్నమాటను అతను కాదనడానికి వీల్లేదు. సత్యవ్రత్ వైపు అతను తీక్ష్ణంగా చూచాడు - అనుభవంలేని నవ యువకుడు, ఇంత గొప్ప సత్యాన్ని ఎంత సులువుగా చెప్పగలిగాడితను! కాని సత్యవ్రత్ అన్నమాటకు మరో పక్షం కూడా ఉంది. ''మరి యీ భారతీయ సైన్యం మాట ఏమిటి సత్యవ్రత్ ? 1857 లో జరిగిన తిరుగుబాటు నణచివేయడానికి ఉపయోగపడిన ఈ సైన్యం మాట ఏం చెపుతావు? ఈ సైన్య సహాయంతోనే కదా ఇంత పెద్ద దేశాన్ని బ్రిటిషు వాళ్ళు తమ స్వాధీనం చేసుకున్నారు. కాబట్టి సత్యవ్రత్! ఈ మార్షల్ లా చాలా ప్రమాదకరమయినది. దీన్ని కోరుకోకు!'' అన్నాడు గంగాప్రసాద్.

ఆ మాటలకు సత్యవ్రత్ లేచి నిలబడ్డారు: "మేజిస్ట్రేటుగారూ. దాస్యాన్ని ప్రతిఘటించడం, దాస్యంతో పోరాడడం మన ధర్మం అనే మాట నాకు బాగా తెలుసు. ఈ తిరుగుబాటువల్ల ఏం జరుగుతుంది. ఈ పోరాటంవల్ల ఏం ఫలితం లభిస్తుంది అని ఆలోచించడం, తర్కించడం, పిరికిదనం. ఈ పిరికిదనం వల్లనే భారతదేశీయులమైన మనం గొర్రెలలాగ తయారయ్యాం. సరే ఇక మీరు కలెక్టరాఫీసుకు వెళ్ళండి. నేను కాంగ్రెసాఫీసుకు వెళుతున్నాను. బహుశా అక్కడికి కూడా ఏదో వార్త అంది ఉంటుంది. ఈ పరిస్థితి విషమించకుండా ఏం చేయాలో మేము కూడా ఆలోచించుకోవాల్సి ఉంటుంది. పదండి జ్ఞానప్రకాశ్‌గారూ! ఇక్కడకూర్చుని మీరేం చేస్తారు?"

"ఔను మామయ్యా! నీవు కూడా వెళ్ళు" అన్నాడు గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్‌తో.

"కాని ఈ చౌరీచౌరా వార్త ఇతరులకు తెలియచేయవద్దు. లేకుంటే ప్రభుత్వంలోని రహస్యాలను బయటకు చేర వేస్తున్నానని నా మీద నేరారోపణ చేయడం జరుగవచ్చు. ప్రభుత్వం ఈ వార్తను ప్రజలకు మరో రూపంలో చూపించవచ్చు. ఏది ఎలా అయినా జైలుబయట ఉన్న ప్రముఖ కాంగ్రెసు నాయకుల్లో మీ కిద్దరికి నా సలహా ఏమంటే ఈ ఉద్యమం ఇంతటితో ఆపివేయడం మంచిదని. మనదేశం వాళ్ళు మన దేశం వాళ్ళనే ఇలా చంపివేయడం, కాల్చివేయడం మొదలు పెడితే దేశంలో అంతర్యుద్ధం ఆరంభమవుతుంది. దేశమంతటా దోపిళ్ళు, అరాజకత్వం వ్యాపిస్తాయి."

మరునాడు చౌరీచౌరా వార్త దేశమంతటా వ్యాపించింది. మొత్తంమీద దారుణమైన ఘటన జరిగింది. జనం క్రోధావేశంలో ఎంత ఉగ్రరూపం దాల్చగలదో అర్థమయింది. ప్రభుత్వోద్యోగుల్లోనూ, కార్య కర్తల్లోనూ ఒక రకమయిన భయం ఏర్పడ్డది. ఆ భయంవల్ల వాళ్ళ మనస్సులో కాంగ్రెసు కార్యకర్తలంటే ఒక రకమైన ఆక్రోశం బయలు దేరింది. యుద్ధానికి నాంది జరిగింది. దేశమంతటా కాంగ్రెసు పార్టీలో ఒక విధమైన ఆవేశం చెలరేగింది.

ఆ రోజు కొద్దిగా తుంపరలు పడ్డాయి. అంతకుముందు రాత్రి నుంచే చలి ఆరంభమయింది. గంగాప్రసాద్ కచ్చేరికి వెళ్ళడానికి సిద్ధంగా

ఉన్నాడు. అదే సమయంలో జ్ఞానప్రకాశ్ అతని గదిలోకి వచ్చారు: "గంగూ! ఈ బండికే నేను అలహాబాదు వెళ్ళుతున్నాను. నిన్నరాత్రి కాంగ్రెసు కమిటీనుండి టెలిగ్రాం వచ్చింది. నన్ను వెంటనే రమ్మని కబురు చేశారు. ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి వ్రాసిన ఉత్తరం కూడా ఇప్పుడే ఈ పోస్టులో అందింది. విచిత్రమైన స్థితి ఏర్పడింది."

గంగాప్రసాద్ కుతూహలంతో జ్ఞానప్రకాశ్ వైపు చూచాడు: "ఏమిటి మామయ్యా! ఎలాంటి స్థితి ఏర్పడింది. నాకు చెప్పగలిగిందయితే చెప్పు."

"పేపర్లో నీవు చదివే ఉంటావు - గాంధీమహాత్ముడు ఈ సామూహిక సత్యాగ్రహాన్ని ఉపసంహరించుకోవాలని చెప్పారు. బార్డోలీలో ఫిబ్రవరి 12 వ తేదీన కాంగ్రెసు కార్యవర్గ సమావేశం జరుగబోతున్నదనే విషయం కూడా చదివి ఉంటావు. ఆ సమావేశంలో గాంధీగారి ఈ సంకల్పాన్ని ఆమోదించ బోతున్నారట."

గంగాప్రసాద్ ప్రాణానికి హాయిగా ఉన్నట్టు తోచింది. "నేను చెప్ప లేదా మామయ్యా! మహాత్మాగాంధీ నిజంగా దేశంలో పరిస్థితి చక్కగా గమనించారు. ఆయన చేస్తున్న పని చాలా మంచి పని. దీనిలో మీరు విచారించవలసిందేమీ లేదు."

"ముందడుగు వేసి మళ్ళీ వెనుకంజవేయడం పరాజయాన్ని సూచిస్తుంది. విజయం తటస్థపడుతున్నప్పుడు మనం వెనుకకు నడుస్తున్నాం."

గంగాప్రసాద్ నవ్వుతూ అన్నాడు: "విజయమే తటస్థపడుతున్నదో వినాశమే తటస్థపడుతున్నదో మీకంటే గాంధీమహాత్మునికి ఎక్కువగా తెలుసు. అది సరేకాని నీవు అలహాబాదుపోయి చేసే పనేముంది మామయ్యా? నాన్న ఇంతవరకు రాలేదు. ఇవ్వేళ పదకొండో తేది. నీవు లేకపోతే నాకు తోచదు. నా మాటవిని ఓవారం రోజులపాటు ఇక్కడనే ఉండు. నీవు లేకపోతే కాంగ్రెసులో పని ఏమీ ఆగిపోవడం లేదు."

జ్ఞానప్రకాశ్ కొంచెం విసుక్కుంటూ చాలా కటువుగా అన్నారు: "పని ఆగిపోతూనూ ఉన్నది, సాగిపోతూనూ ఉన్నది. ఈ ఉద్యమం కొన సాగే ఏర్పాటు చేయవలసిన భారం నా మీద ఉంది. కాని ఇప్పుడు దానికి డబ్బు కూడా దొరికేటట్టు కనిపించడం లేదు. కాన్పూరులోని వర్తకులూ, మిల్లు యజమానులూ ఏవో సాకులు చెప్పడం మొదలుపెట్టారు. నిన్న

పూర్తిగాలేదనే స్థితికి వచ్చారు. లక్ష్మీచంద్ యాభైవేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చాడు. కాని నిన్న నిర్మొహమాటంగా ఒట్టి చేతులు చూపించాడు.''

గంగాప్రసాద్ నవ్వాడు: ''సెబాష్! సర్ లక్ష్మీచంద్ తెలివిగలవాడు! ఉద్యమం సాగేవరకు మీకు సహాయం చేస్తాడు. ఆ తర్వాత పోరాటం, అరాజకత్వం మొదలయాక అతను మీతో మాట్లాడుతాడా? సరే, అయితే మీరు వెళ్ళండి. కాంగ్రెసు వాళ్ళను అనవసరంగా ధనసహాయం కోసం ఎదురు చూడవద్దని చెప్పిరండి. కాని వెళ్ళగానే మా నాన్ననూ, పిల్లల్ని వెంటనే పంపించే ఏర్పాటు చేయండి.''

జ్ఞానప్రకాశ్‌కు సామాన్యంగా కోపం రాదు. కాని ఆ సమయంలో ఆయన ముఖం మటమటలాడిపోతూ ఉంది: ''పంపిస్తానందర్నీ. రాక పోతే బలవంతంగా బండి ఎక్కిస్తాను. కాని గంగూ! ఈ లక్ష్మీచంద్ పరమ నీచుడు. ఈ స్వదేశీ ఉద్యమంలో ఇతనికి దాదాపు అయిదారు లక్షల లాభం వచ్చింది. ఈ స్వల్ప కాలంలోనే మరో గుడ్డల మిల్లు పెట్టబోతున్నాడు. కాని అవసరం వచ్చినప్పుడు పూర్తిగా ఒట్టి చేతులు చూపించాడు. అలహాబాదులో ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీకి నేను మొహ మెలా చూపించను? అలహాబాదులో కాంగ్రెస్ కార్యకర్తలను, స్వయం సేవకులను ప్రోగుచేసి ర్యాలీ చేయించాలని అనుకొన్నాము. దానికే దాదాపు రెండు మూడు వేలు ఖర్చవుతుంది. అక్కడ మా దగ్గర ఖజానా అంతా ఖాళీ అయిపోయింది. ఈ రోజు ఉదయం నేను లక్ష్మీచందు దగ్గరకు వెళ్ళి అయిదు వేలు మాత్రమే అడిగాను. కాని నా దగ్గర కాసీ లేదన్నాడు. వందరూపాయల నోట్లు అయిదంటే అయిదుతీసి చూపించి నా దగ్గర ప్రస్తుతం ఉన్నదింతేనని చెప్పాడు. నిన్ననే ఎవరికో మూడు లక్షలు చెల్లించవలసి వచ్చిందట.''

''అయితే నిన్ను ఒట్టి చేతులతో పంపించాడా మామయ్యా! అలహాబాదు వెళ్ళడానికి ఛార్జీ—గట్రా అయినా దగ్గర ఉందా, లేకుంటే నేనియ్యనా?'' అని అడిగాడు గంగాప్రసాద్.

జ్ఞానప్రకాశ్ ఆక్రోశంతో అన్నారు: ''అబ్బాయ్. నీ దగ్గర దారి ఖర్చులు అడిగి తీసికొని పోయేటంత చవటను గాదు నేను. లక్ష్మీచంద్ లేదు లేదని అంటూనే ఉన్నాడు. అతని చేతిలో ఉన్న అయిదు వందల

రూపాయలు నేను లాగేసుకున్నాను - చచ్చినవాడి పెండ్లికి వచ్చిందే చాలని మరో అయిదు వందలు అక్కడ ఇక్కడ పోగుచేశాను. ప్రస్తుతం నా దగ్గర ఒక వెయ్యి రూపాయలు ఉన్నాయి. మరో వెయ్యి కావాలి. ఏం చెయ్యాలో బోధపడడం లేదు!"

గంగాప్రసాద్ చాలా హుషారుగా ఉన్నాడు: "మామయ్యా! పది నిమిషాలపాటు నీవు శాంతిసభలో చేరేందుకు ఒప్పుకుంటే ఈ రోజు నీకు వెయ్యి రూపాయలిప్పిస్తా" నన్నాడు.

జ్ఞానప్రకాశ్ ఆశ్చర్యపడ్డారు: "శాంతిసభా! నన్ను శాంతిసభలో చేరమంటున్నావా? ఒళ్ళు దగ్గర పెట్టుకొనే మాట్లాడుతున్నావా అబ్బాయ్?"

గంగాప్రసాద్ నవ్వాడు: "నీవు కాదులే. మీ అన్న రావు సాహెబ్ సత్యప్రకాశ్ ఈ శాంతిసభకు ప్రెసిడెంటు గదా! పోనీ కాని ఇంత చిన్న మాటకు అంత కోపగించుకోడం ఎందుకు? నాకేమీ దురుద్దేశం లేదు. నీవిప్పుడు డబ్బుకోసం ఇబ్బంది పడుతున్నావు కనక నీకు ఎలాగైనాసరే ఒక వెయ్యిరూపాయలు సహాయం చేద్దామని. లేకుంటే ఇది నీ సొంత డబ్బు పెట్టుకోవాల్సి ఉంటుందనుకొంటాను. అంతేనా మామయ్యా?"

"అవును, సొంతడబ్బే పెట్టుకోవాల్సి ఉంటుంది." అన్నారు జ్ఞానప్రకాశ్ నీరసంగా: "కాని శాంతిసభలో నేను చేరడం ఎలా సంభవం? చేరితే మాత్రం డబ్బు ఎలా వస్తుంది?"

"ఎలా వస్తుందంటే ఇక్కడ నూర్ అహమద్ మంజూర్ అహమద్ అనే పేరిట ఒక ఫర్మ ఉంది. వాళ్ళక్రింద రెండు జేనరీలున్నాయి. ఖాన్ బహదూర్ నూర్ అహమద్ చాలా రాజభక్తుడు. నిన్న నేనతనితో శాంతి సభను గురించి ప్రస్తావించాను. ఒక వెయ్యి రూపాయలు చందా ఇస్తానని వాగ్దానం చేశారు. నేనతనికొక చీటీ వ్రాసిస్తాను. అతని దగ్గరికి వెళ్ళితే నీకు డబ్బు వస్తుంది. అయితే సూటు వేసుకొని వెళ్ళాలి."

"మరి చందాకు రసీదో?" అని అడిగారు జ్ఞానప్రకాశ్.

"రసీదు నేను పంపిస్తానతనికి. అసలు విషయమేమంటే లక్ష్మీచంద్ ఈ శాంతిసభకుగాను రెండువేల రూపాయలు చందా ఇచ్చాడు. కాని అతనికి నేనింకా రసీదివ్వలేదు. వచ్చే డబ్బంతా నేను బ్యాంకులో జమ కడుతుంటాను - శాంతిసభ ఖాతాలో. కాని రసీదులు తర్వాత మెల్లగా

ఇస్తుంటాను. కనుక లక్ష్మీచంద్‌కు వెయ్యి రూపాయలకే రసీదిస్తాను. నాదగ్గర డబ్బుంటే నిన్ను ఈ పాపిష్టి ఖాన్ బహదూర్ దగ్గరకు పంపించేవాడ్నే కాదు."

జ్ఞానప్రకాశ్ ముఖంపై కాంతిహీనమైన చిరునవ్వు కనిపించింది. "అయితే మరి నీపీ తప్పుడు లెక్కలు రాయడంలోకూడ ఆరితేరావన్న మాట!"

"ఇదంతా నీకోసం చేస్తున్నాను మామయ్యా! లేకుంటే కాంగ్రెసుకూ, నాకూ బద్ధవైరం!"

జ్ఞానప్రకాశ్ పొద్దున బండికి పోలేదు. డబ్బు తీసుకుని సాయంత్రం బండికి అలహాబాదు వెళ్ళారు.

అనుకున్నట్లుగానే బార్డోలీలో జరిగిన కాంగ్రెసు కార్యవర్గ సమావేశం సామూహిక సత్యాగ్రహాన్ని ఆపివేయాలని గాంధీమహాత్ముడు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ఆమోదించింది. దేశమంతటా ఒక విధమైన నైరాశ్యం, అసంతృప్తి వ్యాపించాయి. అయినప్పటికీ తీవ్రవాదులు ఒక వర్గంగా ఏర్పడి ఉద్యమాన్ని కొనసాగించడానికి సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 24 వ తేది ఢిల్లీలో అఖిల భారతీయ కాంగ్రెసు మహాసభ సమావేశం కాబోతూ ఉన్నది. జ్ఞానప్రకాశ్, సత్యవ్రత్ ఆ మహాసభలో సభ్యులు. సత్యాగ్రహాన్ని ఆపివేయడం చాలామంది సభ్యులకు నచ్చలేదు. కాని ప్రముఖులంతా జైళ్ళల్లో ఉన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యుల్లో, ఉత్సాహం ఉంది కాని కార్యవిధానం ఎలా ఉండాలి అనేది వాళ్ళకు తెలియదు. సత్యాగ్రహమనేది మహాత్మాగాంధి ప్రవేశ పెట్టింది కాబట్టి దాన్ని ఆయనే నడిపించాలి. కాని అధిక సంఖ్యాకుల కోరికను మన్నించి గాంధీజీ చివరకు వ్యక్తిగత సత్యాగ్రహం కొనసాగించడానికి అంగీకరించారు. అయితే ఇందులో కూడా చాలా మెలకువగా ప్రవర్తించడం అనవసరమని ఆయన హెచ్చరించారు. ఈలోగా నిర్మాణాత్మక కార్యక్రమం ద్వారా ప్రజలను సత్యాగ్రహానికి సిద్ధం చేయాలని ఆయన ఊహ. ఈ నిర్మాణాత్మక కార్యక్రమానికి సంబంధించిన వివరాలన్నీ మహాత్మాగాంధీ దగ్గరనే ఉన్నాయి.

సత్యవ్రత్ ఢిల్లీనుండి కాన్పూరు వచ్చేశాడు. కాని జ్ఞానప్రకాశ్ నేరుగా అలహాబాదు వెళ్ళిపోయ్యారు. కాంగ్రెసును పునర్వ్యవస్థీకరించవలసిన

అవసరం ఏర్పడింది. అలహాబాదులో కాంగ్రెసు కార్యకర్తల సమావేశం ఒకటి ఏర్పాటు కాబోతూఉంది. ఉద్యమం సాగడానికి కావలసిన ద్రవ్యం సంపాయించి ఒక ఫండు ఏర్పాటుచేయాలని కూడా ఆయన సంకల్పించారు. అలహాబాదులో జరిగే ఈ క్యాంపుకు కాన్పూరునుండి కూడా కాంగ్రెసు కార్యకర్తల జట్టు ఒకటి వెళ్ళుతూఉంది.

గంగాప్రసాద్ ఆనాడు ఆఫీసునుండి కొంచెం ఆలస్యంగా వచ్చాడు. అక్కడి ప్రభుత్వోద్యోగులను కలెక్టరు ఆనాడు పిలిపించి ముందు ముందు కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎలా ఎదుర్కోవాలి అనే విషయాన్ని చర్చించారు. ఆ మీటింగులో కలెక్టరు చేసిన కొన్ని సూచనలు గంగాప్రసాద్‌కు నచ్చలేదు. అసలా సూచనల గురించి కలెక్టరుకే నమ్మకం లేదు. కాని అవి పైనుండి వచ్చాయి. ఆరోజు అతను చాలా అలసిపోయి ఉన్నాడు- శారీరకంగానూ, మానసికంగా కూడాను. అతని మనస్సులో అతనికి తెలియకుండానే ఈ ఉద్యమం అంటే అదోరకమైన సహానుభూతి ఏర్పడింది. ఉద్యమాన్ని గురించి చర్చించిన తరువాత ఆ మీటింగులో హోలీపండుగకు హిందువులు ముసల్మానులపై రంగు చల్లితే దానివల్ల ఏర్పడగల అశాంతిని గురించి కూడా కలెక్టరుగారు హెచ్చరించారు. ఈ హెచ్చరిక గంగాప్రసాద్‌కు చాలా విచిత్రంగా తోచింది. కాని అక్కడ ఉన్న ముస్లిం అధికారులు కలెక్టరుగారు చెప్పిన మాటలను బలపరుస్తూ ముసల్మానుల మనస్సుల్లో ఏర్పడగల క్రోధావేశాలను వ్యక్తపరచినందుకు గంగాప్రసాద్‌కు మరింత ఆశ్చర్యం వేసింది. గంగాప్రసాద్ తనలో తాను తర్కించుకుంటున్నాడు - వందలకొలది సంవత్సరాలనుండి హోలీ పండుగ జరుగుతూ వచ్చింది. కాని ఎప్పుడూ అల్లర్లు జరగలేదు. హిందువులు, ముసల్మానులు కలసి హోలీపండుగ జరుపుకుంటూ వచ్చారు. కాని ఇప్పుడు హోలీపండుగ సందర్భంలో మత కలహాలు ఏర్పడవచ్చునని భయపడవలసిన అవసరమేమిటో అతనికి బోధపడడం లేదు.

మిస్టర్ హేరిసన్ ఇచ్చిన డిన్నరులో మొత్తం పన్నెండుమంది ఉన్నారు. అందులో ఆరుగురు భారతీయులు. వాళ్ళల్లో నలుగురు హిందువులు, ఇద్దరు ముసల్మానులు - సర్ లక్ష్మీచంద్, రాజా శివకుమార్, రాయ్ బహదుర్ గోపీనాథ్, గంగాప్రసాద్, ఖాన్ బహదుర్ నూర్ అహమద్, నవాబ్ అశ్‌ఫాక్ హుసేన్. అందరూ వచ్చిన తర్వాత మధుపానం, ముచ్చట్లు మొదలుపెట్టేసరికి అది రాజకీయమైన డిన్నరని గంగాప్రసాదుకు తోచింది. ఆంగ్లేయుల్లో కాన్పూరు కలెక్టరూ, పోలీసు సూపరింటెండెంటు తప్ప మిగిలిన నలుగురూ మిల్లు యజమాన్లు.

మిస్టర్ హేరిసన్ ఒక మోతాదు ఎక్కువగా తాగినట్టున్నాడు. లేకుంటే అంత ఎక్కువ హుషారుగా కనిపించేవాడు కాడు. "ఇంతా ఆ గాంధీకి ఆరు సంవత్సరాల శిక్షమాత్రమేనా? దేశమంతటా తిరుగుబాటు లేవదీసిన ఆ ద్రోహిని తుపాకితో కాల్చవలసింది. ఏం సర్ లక్ష్మీచంద్, ఏమంటావ్?"

లక్ష్మీచంద్ అతని మాటకు సమాధానం చెప్పలేదు. బదులు చెప్పింది రాయ్‌బహదుర్ గోపీనాథ్: "పోనియ్యండి, పీడవదలింది. నా వ్యాపారమంతా చెడగొట్టాడీ దుర్మార్గుడు. మాంచెస్టరునుండి అయిదు లక్షల గుడ్డలు తెప్పిస్తున్నాను. నాకు చాలా విచారమయింది."

ఖాన్ బహదుర్ నూర్ అహమద్ అన్నాడు: "ఎంత మంచి మాట చెప్పారండీ గోపీనాథ్‌గారూ! ఇతను వట్టి తగాదా మనిషి. ఎలా నిప్పు పెట్టాడో దేశమంతటా!"

ఈ మాటలతో మిస్టరు హేరిసన్‌కు మరీ హుషారెక్కింది: "ఇప్పుడా మంట ఆరిపోయింది. ఈ పార్టీ అతను జైలుకు వెళ్ళాడనే సంతోషాన్ని తెలపడానికే నేనిస్తున్నాని మీకు చెప్పాలని నా ఆశయం."

గంగాప్రసాద్ తనతోటి భారతీయ మిత్రుల వైపు చూదాడు. ఎవరి ముఖం మీద కూడా ఏమాత్రం నిరసన కనిపించలేదు. అతని పొగరుబోతుతనాన్ని అందరూ సహించి ఊరుకున్నారు. కాని గంగాప్రసాద్ ఉండబట్టక అనేశాడు: "మిస్టర్ హేరిసన్! ఈ డిన్నర్ ఇయ్యడంలో ఇంత కుత్సితమైన భావన ఉన్నదని మాకు ముందే తెలియ జేస్తే కనీసం

నేను మాత్రం ఇక్కడికి వచ్చేవాణ్ణికాదు. నాతోపాటు బహుశా మరి నలుగు రయిదుగురు కూడా వచ్చేవాళ్ళు కారు.''

డిన్నరు కాహ్వానింపబడిన అతిథులందరూ గంగాప్రసాద్ మాటలకు నివ్వెరపోయినారు. మిస్టర్ హేరిసన్ కాన్పూరులో ఉన్న కోటీశ్వర్లల్లో ప్రముఖుడు. మిల్లు యజమాని. తాను ఇంగ్లండులో పెద్ద లార్డు కుటుం బానికి చెందినవాణ్ణి అని ఆయన చెప్పుకుంటాడు. దానికి తోడు ఆయన చాల కోపిష్టి అని కూడా పేరు పొందాడు. గంగాప్రసాద్ అన్న మాట విని ఆయన మండిపడ్డారు: "అయితే దుర్మార్గుడు, నీచుడు, అసత్య వాది, మోసగాడు అయిన ఆ గాంధీని నీవు మహాత్ముడంటావా ?''

కారణం లేకుండా హేరిసన్ ఇలా దుర్భాషలాడేసరికి గంగాప్రసాద్‌కు మరింత ఆవేశం వచ్చింది: "మిస్టర్ హేరిసన్, అలాంటి మహాపురుషుణ్ణి ఇలా దూషించడం నీ నీచత్వాన్ని నిరూపిస్తుంది. ఆయన రాజకీయ భావాలతో మనం ఏకీభవించకపోవచ్చు. కాని ఆయన గొప్పతనాన్నీ, మంచితనాన్నీ, నిజాయితీని కాదనేవారు ఉండరు.''

హేరిసన్ లేచి నిలుచున్నాడు: "నీవు నన్ను నీచుడని అంటావా - నల్ల వాడివి! మేము నిన్ను దగ్గర దీసినందుకు ఇదా ఫలితం! మళ్ళీ అను చూస్తాం. నీ నోరు వాయిస్తాను.''

గంగాప్రసాద్ రొమ్ము విరుచుకుని ఎదుట నిలబడి అన్నాడు: "నీవు నీచుడివి, దుష్టుడివి, భ్రష్టుడివి!''

పెద్ద గొడవయిందక్కడ. వచ్చిన అతిథులందరూ వాళ్ళిద్దరిని ఆపారు. తప్పు హేరిసన్‌దని స్పష్టంగా తెలుస్తున్నది. అందరూ, ముఖ్యంగా మిల్లు యజమానులైన ఆంగ్లేయులు చెప్పినదానిమీదట మిస్టర్ హేరిసన్ మహాత్మా గాంధీని గురించి తానన్న దుర్భాషలను ఉపసంహరించుకున్నాడు. ఆ తర్వాత గంగాప్రసాద్ కూడా తన మాటలను ఉపసంహరించు కున్నాడు. వాతావరణం మళ్ళీ శాంతించింది. అతిథులు భోజన కార్య క్రమం సాగించారు.

మరునాడు గంగాప్రసాద్ నేరుగా కలెక్టరు దగ్గరకు వెళ్ళాడు. "మిస్టర్ గంగాప్రసాద్! ఈ హేరిసన్ మొదటి నంబరు దుర్మార్గుడు.'' అన్నారు కలెక్టరు.

"సార్! అతను తాగిఉన్నాడు. నేను కూడా బాగా తాగాను." అన్నాడు గంగాప్రసాద్ సర్దుకుంటూ.

"లేదు, అందులో నీ తప్పేమీ లేదు. కాని ఈ హేరిసన్ నీ అంతు కనుక్కోవాలని చూస్తున్నాడు. అతను అధికారరీత్యా నీ మీద కంప్లైంటు వ్రాసి నా ద్వారా కమిషనరు దగ్గరికి పంపిస్తున్నాడు. ఇదిగో అతను వ్రాసిన కంప్లైంటు," అంటూ కలెక్టరు హేరిసన్ వ్రాసి పంపిన ఉత్తరం గంగాప్రసాద్ చేతికిచ్చారు.

గంగాప్రసాద్ ఆ ఉత్తరం చదువుకొని ఊరుకున్నాడు. గంగాప్రసాద్ కాంగ్రెస్ వాడని అతను నేరారోపణ చేశాడు. గడచిన రాత్రి జరిగిన సంఘటనకు కాయలు పూతలు కల్పించి అతను వివరించాడు. ఉత్తరం చదువుకొని గంగాప్రసాద్ కలెక్టరుతో అన్నాడు: "ఇదంతా అబద్ధమని తమకు తెలిసిన విషయమే."

"అవును. పచ్చి అబద్ధం. నేను వ్రాయవలసిన నోటు దీనిమీద వ్రాస్తున్నాను. కాని నీవు కూడా కమిషనరును ఒకసారి కలుసుకోవడం మంచిది. ఈ హేరిసన్ మాటలకు కమిషనరు ఎక్కువ విలువ ఇయ్య వచ్చు. కమిషనరు మనస్సులో నిన్ను గురించి చెడ్డ అభిప్రాయం ఏర్పడిం దంటే నీ భవిష్యత్తంతా పాడయిపోతుంది. నేనీ కంప్లైంటు కమిషనరు దగ్గరికి పంపేలోగా నీవు జరిగిందంతా కమిషనరుకు నీవు చెప్పవలసి నట్లు చెప్పి ఉంచడం మంచిది. నేను వ్రాసే నోటు నీకనుకూలంగానే ఉంటుంది."

కలెక్టరు దగ్గరనుండి వచ్చిన తర్వాత గంగాప్రసాద్ నాలుగు రోజులు సెలవు కావాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. కలెక్టరు సెలవు వెంటనే మంజూరు చేశారు.

అలహాబాదు వెళ్ళగానే గంగాప్రసాద్ కమిషనరును కలుసుకున్నాడు. గంగాప్రసాద్ చెప్పిన మాటలు విని ఆయన అన్నారు: "అయితే నీవు గాంధీ మహాపురుషుడని భావిస్తావా? నాగరికత తెలిసీ తెలియని ఆ బుడుద్దాయి మహాత్ముడని నీ అభిప్రాయమా?" కమిషనరు-అడిగిన ప్రశ్నలో వ్యంగ్యం ఉంది.

గంగాప్రసాద్ చాలా గట్టిగా సమాధానం చెప్పాడు: "అయ్యా!

ఆయన రాజకీయాదర్శాలతో నేను ఏకీభవించకపోయినప్పటికీ, ఆయన శీల సౌజన్యాలను గౌరవించడంలో పొరబాటు లేదనుకుంటాను. బ్రిటిషు జాతి ఇతరుల గుణగణాలను గౌరవించడాన్ని కూడా సహించనంత సంకుచితమైన బుద్ధిగలదని నేననుకోను.''

కమిషనరు పండ్లు బిగబట్టి అన్నారు: ''బ్రిటిషుజాతి ఇంత సంకుచిత స్వభావంకలది కాకపోవచ్చును. కాని ఒకవ్యక్తి కావచ్చును. నీవు చెప్పిందంతా నిజమే అయితే హేరిసన్ చేసిన కంప్లైంటు నిన్నేమీ చేయలేదు.''

గంగాప్రసాద్ తృప్తి పడ్డాడు: ''వస్తాను సార్'' అని అతడు వెళ్ళిపోతుండగా కమిషనరు ఆపాడు: ''మిస్టర్ గంగాప్రసాద్! అయిందేమో అయింది. కాని ఇకముందు ఒకమాట మాత్రం జ్ఞాపకం పెట్టుకోవడం మంచిది – ఆంగ్లేయులు ఆంగ్లేయులే, భారతీయులు భారతీయులే! ఒకరు పాలకులు, మరొకరు పాలితులు. ఈ మాట నీకు కటువుగా తోచవచ్చు. కాని ఇది యథార్థం. కాబట్టి ఇకముందు ఇలాంటి విషయాల్లో నీవు మౌనంగా ఉండడం మంచిది.''

కమిషనర్ చెప్పిన సలహాను వెంటనే పాటించి గంగాప్రసాద్ 'మంచిదండీ' అని వెళ్ళిపోయాడు.

సహకార నిరాకరణోద్యమం ఆగిపోయినట్టయింది. దేశమంతటా నైరాశ్యం వ్యాపించింది. కాంగ్రెస్ కార్య విధానాన్ని గురించి మళ్ళీ ఆలోచించవలసిన అవసరం వచ్చింది. అంటే ప్రజలంతా ఈ ఉద్యమంతో విసిగి పొయ్యారన్నమాట. సహకార నిరాకరణం కంటె సహకరిస్తూనే ప్రతిఘటించడం మంచిదేమోనని అందరూ బాహాటంగా చర్చించసాగారు.

కాని గంగాప్రసాద్‌కు తన మనస్సులో ఏదో విచిత్రమైన మార్పు కలుగుతున్నట్లుతోచింది. సహకార నిరాకరణోద్యమం ఇలా కుంటుపడిపోవడం అతనికి నచ్చలేదు. అతనిలో ఏదో అశాంతి ప్రవేశించింది. ఆ అశాంతికి కారణం అతనికే తెలియడం లేదు. జులై చివరి వారంలో ఉన్నట్టుండి అతనికి అశాంతికి కారణమేమిటో ఒకసారిగా తెలిసిపోయింది. నిష్కారణంగా అతన్ని ఏటాకు డిప్టీ కలెక్టరుగా మార్చారు. గవర్నమెంటు ఆర్డరు అతని చేతికి అందే సమయంలో అతను ఫలహారంచేస్తూ ఉన్నాడు. ఫలహారం సగంలో వదిలేసి లేచాడు. అంటే అతనికి వచ్చిన బహుమతి ఇదేనన్నమాట!

సహాకార నిరాకరణోద్యమాన్ని అణచివేయడానికి అతను చేసిన కృషిని గురించి అధికారులు చర్చించుకునే వారు. అది చూచి గంగా ప్రసాద్ తనకు త్వరలోనే ప్రమోషను వస్తుందనీ, జాయింట్ మెజ స్ట్రేటుగా పర్మనెంటు చేస్తారనీ అనుకుంటూ వచ్చాడు. కాన్పూరులో అంతకుముందు జాయింట్ మెజస్ట్రేటుగా పనిచేస్తున్న ఆయన 1923 జూన్ వరకు సెలవు పొడిగించాడు. అందువల్ల ఈలోగా తనకు మార్పురాదని అనుకున్నాడు. దుస్తులు వేసుకొని అతడు వెంటనే కలెక్టరు దగ్గరికి వెళ్ళాడు. అతన్ని చూడగానే కలెక్టరన్నారు: "మిస్టర్ గంగాప్రసాద్, నీకు ట్రాన్స్ఫరయినందుకు నాకు చాలా విచారంగా ఉంది. కాని వేరే మార్గం లేకపోయిందనుకుంటాను. కాన్పూరు జాయింట్ మెజస్ట్రేటుగా ఐ. సి. యస్. ఆఫీసరే పనిచేయడం ఆనవాయితీ. బహుశా కొంతమంది ఐ. సి. యస్. ఆఫీసర్లు కొత్తగా తయారయి వచ్చినట్టున్నారు. వాళ్ళ నెక్కడో అక్కడ వెయ్యాలి గదా మరి!"

"అయితే ఏ ఐ. సి. యస్ ఆఫీసరునో ఇక్కడికి జాయింట్ మేజస్ట్రేటుగా పిలిపించి ఉండాల్సింది సార్! ఐ. సి. యస్. ఆఫీసరు కోసం కేటాయించిన ఈ స్థానంలో నన్నెందుకు నియమించారో మరి?"

"అప్పుడు సహకార నిరాకరణోద్యమం చాల తీవ్రంగా సాగుతున్నందు వల్ల ఆ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి మంచి సామర్థ్యం, అనుభవంగల వ్యక్తి కావలసి వచ్చాడు. అందువల్ల నిన్ను పిలిపించారేమో ననుకొంటాను."

గంగాప్రసాద్ చాలా కటువుగా అన్నాడు: "అయితే ఇప్పుడు ఆ ఉద్యమం ఆగిపోయింది! అంతేగా మరి! ఉద్యమం అయిపోగానే నేను భారతీయోద్యోగిని కాబట్టి పాలల్లో ఈగలాగ నన్ను తీసి పారేస్తున్నారు."

కలెక్టరు గంగాప్రసాదు ముఖంలోకి తీవ్రంగా చూచి కొంచెం గాంభీర్యంతో అన్నారు: "మిస్టర్ గంగాప్రసాద్! ఈ ఐ. సి. యస్ అనేది ఉందే దీనిలో సమర్థులయిన ఆంగ్ల యువకులకు ప్రవేశం దొరుకుతుంది. భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వానికి ఈ ఐ. సి. యస్. ఆఫీసర్లే పునాది. బాధ్యతతో కూడిన ప్రభుత్వోద్యోగాలలో ఈ ఐ. సి. యస్ ఆఫీసర్లే ఉంటారు. కాన్పూరులో జాయింటు మెజస్ట్రేటు పని కూడ బాధ్యతతో కూడిందిగా భావించబడుతుంది."

గంగాప్రసాద్‌కు కొన్ని నెలల క్రితం కమిషనరు తనతో అన్న

మాటలు గుర్తుకు వచ్చాయి. కమిషనరు చెప్పిన మాటలనే మళ్ళీ ఒప్ప చెప్పాడు: "అవునండీ నాకు తెలుసు, అంగ్లేయులు ఏనాటికైనా అంగ్లేయులే, భారతీయులు భారతీయులే. ఒకరు పాలకులు, మరొకరు పాలితులు. ఈ ఐ. సి. యస్ అనేది పాలక వర్గానికి చెందిన సంస్థ." గంగాప్రసాద్ ముఖంమీద ఒక కటువైన మందహాసం కనిపించింది: "అయ్యా మరి మీకు ధన్యవాదాలు. నేనిక అడుగవలసినదేమీ లేదు. నా ప్రశ్నలకు సమాధానం వచ్చింది."

గంగాప్రసాద్ మాటలకు కలెక్టరుకు కోపం వచ్చి ఉండవచ్చు. కాని అతని మాటల్లో ఎంత అసహాయమైన కటుత్వం ఉందో కలెక్టరు గమనించారు. ఆయనకు గంగాప్రసాద్ పై కొంచెం సానుభూతి ఏర్పడింది: "బ్రిటిషు ప్రభుత్వం వైఖరిని త్వరలోనే మార్చుకోవాల్సి ఉంటుందనుకుంటాను. నీకు అన్యాయం జరిగిందని నేను ఒప్పుకుంటాను. ఒకసారి నీవు చీఫ్ సెక్రెటరీని కలుసుకుంటే బాగుంటుందనుకుంటాను. నీ రికార్డు చాల్గా మంచిది. నిన్ను ఏటాకు ఎందుకు పంపిస్తున్నారో నా కర్థం కావడం లేదు."

చీఫ్ సెక్రెటరీ దగ్గరకి గంగాప్రసాద్ వెళ్ళాడు. "మిస్టర్ గంగాప్రసాద్! ప్రస్తుతం నిన్ను ఏటాకు పంపిస్తున్నందుకు నాకు చాలా విచారంగా ఉంది. అసలు నిన్ను కాన్పూరునుంచి కదలించేవాణ్ణి కాదు. కాని....కాని.....పోనీలే అదంతా ఇప్పుడెందుకు? ప్రతివాడు కొన్ని కొన్ని పరిస్థితులకు లొంగిపోతాడు. వీలయితే డిశంబరుదాకా సెలవు పెట్టు. జనవరిలో నిన్నెక్కడికైనా మంచిచోటికి మారుస్తాను. అప్పటికి పరిస్థితులు సర్దుకోవచ్చు."

చీఫ్ సెక్రెటరీ ఐ. సి. యస్ విషయమే ఎత్తనందుకు గంగాప్రసాద్‌కు ఆశ్చర్యం వేసింది. చీఫ్‌సెక్రెటరీని లొంగదీసిన పరిస్థితులేమయి ఉంటాయో కూడా అతనికి బోధపడటం లేదు. అతడు అక్కడనే సెలవుకు దరఖాస్తు వ్రాసి ఇచ్చాడు. దాన్ని వెంటనే చీఫ్ సెక్రెటరీ మంజూరు కూడా చేశాడు.

గంగాప్రసాద్ వీడ్కోలు సందర్భంలో లక్ష్మీచంద్ ఒక పార్టీ ఏర్పాటు చేశారు. దానికి పురప్రముఖులు, వర్తకులు, మిల్లు యజమాన్లు, ప్రభుత్వోద్యోగులు వచ్చారు. ఆ పార్టీకి వచ్చిన వాళ్ళందరూ గంగాప్రసాద్ వెళ్ళి

పోతున్నందుకు విచారం తెలియజేశారు. పార్టీ ముగిసిపోయిన తర్వాత అందరూ వెళ్ళిపోతున్నారు. అప్పుడు హేరిసన్ గంగాప్రసాద్ దగ్గరకి వచ్చాడు. పైశాచికమైన సంబరంతో మిడిసిపోతున్నది అతని ముఖం. అతను మెల్లగా గంగాప్రసాద్ చెవిలో గొణిగాడు. "ఇక ముందు ఇంగ్లీషు వాళ్ళతో ఇలా పేచీపడి పొగరుబోతుతనాన్ని చూపించకు" అని నవ్వుతూ వేగంగా అతను వెళ్ళిపోయాడు.

హేరిసన్ మాటలు వినగానే గంగాప్రసాద్ మనస్సులో విద్యుత్తు ప్రవహించినట్లయింది. చీఫ్ సెక్రెటరీని లొంగదీసిన పరిస్థితు లేమయి ఉంటాయో ఇప్పుడతనికి బోధపడింది.

వానలు తగ్గిపోయాయి. వర్షాకాలం చివర వాతావరణంలో సహజంగా వ్యాపించే ఉమ్మదం ఇప్పుడెక్కువగా కనిపిస్తూ ఉంది. ఆగస్టు నెలంతా అలహాబాదులో గడిపిన తర్వాత జ్ఞానప్రకాశ్‌తో కలిసి దక్షిణాదికి వెళ్ళుదామని గంగాప్రసాద్ నిశ్చయించుకున్నాడు. కాని గంగాప్రసాద్ లోపల ఏర్పడ్డ మంట నానాటికి హెచ్చుతూ ఉంది. అసహ్యమైన పొగరుబోతు ఇంగ్లీషువాడి చేతిలో తను ఓడిపోయాననే విషయం అతన్ని మాటిమాటికి బాధిస్తూ ఉన్నది. ఈ పరాజయానికి మూలకారణం అతను భారతీయుడయి ఉండటం, ఆంగ్లేయుల వర్ణ విద్వేషం. తనకు తెలియకుండానే అతను జ్ఞానప్రకాశ్‌కు ఆప్తుడయి పోతున్నాడు. సత్యం, న్యాయం, మానవత - ఇవన్నీ బానిస అయిన వాడికి నిరర్థకం అని తోచింది. తాను బానిస అవడంవల్ల యజమాని చెప్పుచేతల్లో నడిచే పెంపుడు జంతువుతో తాను సమానమని, తనలో చైతన్యం కానీ భావన కానీ ఉండడానికి ఆస్కారం లేదనీ అతను గ్రహించాడు. తనలో చెలరేగుతున్న విప్లవాన్ని అతనెంత అణచుకోవాలని ప్రయత్నిస్తున్నాడో అదంత ఉబికి వస్తూంది.

ఒక రోజు అతను ఊళ్ళో తిరిగి తిరిగి ఇంటికి వచ్చేసరికి వరాండాలో జ్ఞానప్రకాశ్, ఫరహ్‌తుల్లా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. గంగాప్రసాద్ ఫరహ్‌తుల్లా వైపు తిరిగి అన్నాడు: "నమస్కారమండీ ఫరహ్‌తుల్లాగారూ! ఎప్పుడొచ్చారేమిటి?"

"మీ దయవల్ల సుఖంగానే ఉన్నామండీ:" అన్నాడు ఫరహ్‌తుల్లా. తర్వాత గంగాప్రసాద్ వైపు తిరిగి అతడన్నాడు: "ప్రస్తుతం నేను

అలహాబాదుకు వచ్చి ఉంటున్నాను. జ్ఞానప్రకాశ్‌గారిని విచారించి పోదా మని ఇక్కడికి వచ్చాను.''

అందరూ కూర్చున్న తర్వాత గంగాప్రసాద్ అడిగాడు: "అయితే మీరు ట్రోన్నూరు వదిలేశారా? ఏమలా చేశారు?''

ఫరహ్‌తుల్లా నవ్వాడు: "వదిలేయడమేముందీ? వదిలి పెట్టేటట్టు చేశారందరూ కలిసి. రెండు మూడు నెలలు ఇక్కడ అలహాబాదులోనే ఉండి కాంగ్రెసు పని చూచుకుందామను కున్నాను. అబ్దుల్ హక్ నన్ను గురించి ఎంతో దుష్ప్రచారం చేసి అక్కడి ముసల్మానులనందర్నీ నాకు దూరం చేశాడు. నాకేమి చేయాలో తోచలేదు. అలీరజా కూడా అతనికి తోడయ్యాడు. అతను పూర్తిగా అధూయిత్యానికే సిద్ధమయ్యాడు. పోని య్యండి. అదంతా ఎందుకిప్పుడు. మీరు చాలా రోజులు సెలవు పెట్టారట! ఇప్పుడే జ్ఞానప్రకాశ్‌గారు చెప్తున్నారు.''

జ్ఞానప్రకాశ్ అందుకున్నారు: "ఫరహ్‌తుల్లా సాహబ్! సంఘంలోని దురాచారాలను తొలగించడానికి మతస్థాయిని దాటి పోవాలి. మన సంఘంలోని దురాచారాలను తొలగించడానికి మహాత్మాగాంధీ నడుం కట్టుకున్నారు. కాంగ్రెస్ కార్యక్రమం రాజకీయరంగానికే కాక సాంఘిక వ్యవస్థకు కూడా సంబంధించిందనే విషయం మీకు బాగా తెలుసు.''

"అవునవును. అందుకనే నేను కాంగ్రెసులో చేరాను, గాంధీ నాయక త్వాన్ని అంగీకరించాను. కాని నేను ముసల్మాను మతానికి చెందినవాణ్ణి. సత్యం, సమానత్వం మీద నా మతం ఆధారపడి ఉంది అనే మాట నేనెలా మరచిపోగలను? అప్పుడప్పుడు నా మనస్సులో ఒక ధర్మసందేహం ఉదయిస్తూ ఉంటుంది. నేనిప్పుడు అనుసరిస్తున్న మార్గం సరియైందా కాదా అని ఆలోచన వస్తూ ఉంటుంది. ఇస్లాం మతాన్ని కూడా సంస్కరించడం సాధ్యమా అని అనిపిస్తుంది. మళ్ళీ ఇదంతా ఎందుకులే అనుకుంటాను. మంచితనంతో నిజాయితీగా ఉంటూ భగవంతుని భక్తులకు సేవచెయ్యడమే మన కర్తవ్యం. భక్తుల సేవ కూడా మతంలో ఒక భాగం. నా జీవితానికి ఒకే ఆదర్శం ఉంది. అదే మా మతం.'' అని అంటూనే ఫరహ్‌తుల్లా నవ్వాడు: "పోనియ్యండింతట ఈ గొడవ! నేను చేసిన పని మంచిదో లేకుంటే అబ్దుల్ హక్, అలీరజా చేసేది మంచిదో భగవంతుడే నిర్ణ యిస్తాడు. నేను మంచితనాన్ని, న్యాయాన్ని వదలలేను. గాంధీకూడా

ఈ మంచితనాన్ని, న్యాయాన్నే అనుసరిస్తున్నారు. మహాత్మాగాంధీకి మరో బలం ఉంది – అది అహింస. నాకు అహింస అంటే అభిమానం. అందువల్ల నాకెవరిమీద కోపంగానీ ద్వేషంగానీ లేదు.''

ఫరహ్‌తుల్లా వెళ్ళిన తర్వాత గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్‌ను పలుకరించారు: ''నిన్నొక విషయంలో సలహా అడగాలి. కాన్పూరునుండి నాకు మార్పు వచ్చినందువల్లనే నేనిన్ని రోజులు సెలవుపెట్టానని నీకు తెలుసు. కాని నాకీ ట్రాన్స్ఫరు ఎందుకు వచ్చిందో నీకు తెలియదు.''

''ఆ విషయం నీవు నాకు చెప్పలేదు. నిన్నడిగితే బాగుండదనుకొని ఊరుకొన్నాను.''

''కనకనే ఈ రోజు నీకు చెప్తున్నాను. మట్టు మర్యాదలేని ఇంగ్లీషు వాడొకడు గాంధీమహాత్ముణ్ణి గురించి అవమానకరంగా మాటాడితే నేనతన్ని చెడామడా తిట్టాను. అదే కారణం.'' హారిసన్‌తో జరిగిన వ్యవహారమంతా గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్‌కు వివరంగా చెప్పారు.

''మంచిపని చేశావోయ్ గంగూ! నేను కాంగ్రెసులో ఎందుకు చేరిందీ నీకిప్పుడు బాగా అర్థమై ఉంటుంది.''

''నీకు తెలుసు మామయ్య! నీతోపాటు నన్నుకూడా కాంగ్రెసులో చేర్చుకోడానికి నేను ఒప్పుకోకపోవడం తప్పని తెలుస్తున్నది. ఇప్పుడని పిస్తూఉంది . . . .లేదు, అనుకొంటున్నాను – మరి నేనుకూడా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి కాంగ్రెసులో చేరుదామని –''

జ్ఞానప్రకాశ్ ఆశ్చర్య పడ్డారు: ''నీకేం పిచ్చి పట్టిందా ఏం? రాజీనామా ఇచ్చి ఏం చేద్దామని? నీకు భార్యా, బిడ్డలు ఉన్నారు. వాళ్ల సంగతి ఏమవుతుంది మరి? రెండేళ్ళల్లో నవల్ కాలేజీ చదువుకు వస్తున్నాడు. పిల్లపెండ్లికి వస్తుంది. నాకు తెలిసినంతవరకు నీవు ఈ ఉద్యోగంలో మిగిలించిందీ లేదు.''

''అవును. మొత్తం అంతాకలసి రెండు మూడు వేలుంటాయి బ్యాంకులో. నాన్నదగ్గర కూడా అంతా కలసి మూడు నాలుగు వేలకు ఉంటాయి. ఈ అయిదారు వేలుపెట్టి అలహాబాదులో వ్యాపారం చేద్దామని అనుకుంటున్నాను.''

జ్ఞానప్రకాశ్‌కు నవ్వు వచ్చింది: [1] ''కాయస్థులబిడ్డ వ్యాపారం చేస్తా

[1] ఉత్తరదేశంలో కాయస్థులు ఒక కుల విశేషానికి చెందినవారు. వీరు చాలా మేధావులని పేరు.

డట - జాయింటు మెజిస్ట్రేటు పనిచేసి, కూడబెట్టిందంతా ఖాళీ చేసుకుంటా వోయ్ అబ్బాయ్!''

''సరే వ్యాపారం కాకపోతే కాకపోయింది. దగ్గరున్న సొమ్ములన్నీ అమ్మితే దాదాపు ఏడువేల రూపాయలు వస్తాయి. నా వజ్రాల ఉంగరమొక్కటే చాలు రెండువేలు చేస్తుంది. అన్నీ పది పన్నెండు వేలు పోగుచేసి మంచి ఇల్లు కడతాను. దగ్గర దగ్గర నెలకు వందరూపాయలు అద్దె వస్తుంది. ఉండడానికి ఈ యిల్లు ఉండనే ఉంది. నాన్న పెన్షను, ఇంటిమీద వచ్చే అద్దె - రెండూ పెట్టుకొని హాయిగానే కాలక్షేపం చేయవచ్చు.''

''ఆ చేయవచ్చు. కాని త్రాగడం మానేసి మాలాగా సాదాగా ఉండగలిగితే,'' అన్నారు జ్ఞానప్రకాశ్. ''ఇంతా రెండు, మూడు, మహా అయితే ఆరేడేండ్ల వరకూ ఈ కష్టాలు. స్వరాజ్యం వచ్చిందంటే చిక్కులన్నీ తీరి హాయిగా ఉంటుంది.''

గంగాప్రసాద్ చేసిన నిశ్చయానికి జ్వాలాప్రసాద్‌కు లోలోపల బాధ వేస్తూఉంది. ఆయన గంగాప్రసాద్‌కు నచ్చచెప్పడానికి చాలా ప్రయత్నించారు. కాని జ్ఞానప్రకాశ్ అంత స్పష్టంగా కాకపోయినా మొత్తం మీద గంగాప్రసాద్‌నే సమర్థిస్తున్నారు. రెండు రోజులవరకు ఇంట్లో కొంచెం తర్జన భర్జనలూ, ఆలోచనలూ జరిగాయి. మూడోరోజు జ్వాలా ప్రసాద్ లొంగిపోయారు.

సాయంత్రం పూట గంగాప్రసాద్ జ్ఞానప్రకాశ్ కూర్చుని రాజీనామా తయారుచేశారు - చాల మర్యాదగా కటువుగా ఉండే మాటల్లో. జ్వాలా ప్రసాద్ సలహా ప్రకారం రాజీనామాలో అక్కడక్కడ కొన్ని మార్పులు కూడా చేయడం జరిగింది. ఆ తర్వాత జ్ఞానప్రకాశ్ ఆ రాజీనామా లేఖను టైపు చేశారు. గంగాప్రసాద్ ఆ లేఖపై చాలా ధైర్యంగా సంతకం చేశాడు. గంగాప్రసాద్ దానిపై సంతకం చేసేసరికి జ్వాలా ప్రసాద్ తనను తాను ఆపుకోలేక పోయారు. ఆయన ఆ గది బయటకు వెళ్ళారు. ఆయన కండ్లల్లో నీళ్ళు నిండినాయి.

జ్వాలా ప్రసాద్ గదిలోనుండి వెలుపలికి వచ్చేసరికి ఫరహ్‌తుల్లా వరండాలోకి వస్తూ ఆయన్ను అడిగారు: ''జ్ఞానప్రకాశ్‌గారు ఇంట్లో ఉన్నారా అండీ!''

ఫరహ్‌తుల్లా చాలా ఖంగారు పడుతున్నారు. ఆయన చేతిలో 'పయోనియర్' ప్రత్యేక సంచికకు సంబంధించిన ఒక పేజీ ఉంది. కాని జ్వాలా ప్రసాద్ అదంతగా గమనించలేదు. ఏదో పరధ్యానంలో అన్నారు: "గదిలోనే ఉన్నారు, రండి." అని ఫరహ్‌తుల్లాతోపాటు తను కూడా మళ్ళీ గదిలోకి ప్రవేశించారు.

ఫరహ్‌తుల్లా వాకిట్లోనుండే కేకేశాడు: "కొంప మునిగింది జ్ఞాన ప్రకాశ్‌గారూ! ముల్తాన్‌లో నిన్న హిందూ ముస్లిం అల్లర్లు జరిగాయి."

"ఆఁ, హిందూ ముస్లిం అల్లర్లా? ముల్తానులోనా? ఏమిటి మీరనేది?"

"అవునండీ! ఇదిగో పయోనియర్ స్పెషల్ ఎడిషను. ఏం కావల్సి ఉందో భగవంతుండికే తెలియాలి."

ఒకరి తరువాత ఒకరు అందరూ ఈ వార్త చదువుకొన్నారు. కాసేపు ఆ గదిలోని వాతావరణం నైరాశ్యంతో నిండిపోయింది. కొంచెంసేపు అందరూ మౌనంగా ఉన్నారు.

ఫరహ్‌తుల్లా అన్నారు: "ముసల్మాన్లలో ఈ జ్వాలను రగుల్కొల్పింది ఎవరో తెలియదు. నన్ను రాత్రి బండికి ముల్తాను రమ్మని కబురుచేశారు. హిందూ ముస్లిం ఐక్యానికి ఇది గొడ్డలిపెట్టు."

జ్ఞానప్రకాశ్ తటాలున అన్నారు: "అయితే హిందూ ముస్లిం ఐక్యాన్ని నాశనం చేయడానికి ప్రభుత్వం మళ్ళీ పన్నాగం పన్నిందన్నమాట!"

గంగాప్రసాద్‌లో క్షీణించి నిద్రించిన వ్యక్తిత్వం ఒక్కసారి మేల్కొన్నట్టులయింది: "మావయ్యా! నీవు పొరపాటు పడుతున్నావు. ఈ ఐక్యం అనేది ఎప్పుడూ లేదు. కృత్రిమ సాధనాలతో ఇది కల్పించబడింది. కృత్రిమ సాధనాలతోనే ఇది నాశనం కూడ అవుతుంది."

ఫరహ్‌తుల్లా ఆశ్చర్యంగా గంగాప్రసాద్ వైపు చూచారు: "ఏమిటండీ మీరనేది?"

గంగాప్రసాద్‌కు ఏదో పూనినట్టయింది: "నేను చెపుతున్నది సరిగానే చెప్తున్నాను ఫరహ్‌తుల్లా గారూ! మనకు ఈ బానిసత్వం నుండి ఇప్పుడప్పుడే విముక్తి లభించేటట్టు కనిపించడం లేదు. ఈ అల్లర్లు ఇంకా ఎక్కువవుతాయి. విపరీతంగా పెరుగుతాయనే నా కనిపిస్తుంది. ఇది వాటికంతా నాంది. హిందూ ముస్లిముల మధ్య ఈ భేదభావం పుట్టుకతో వచ్చిందని ఆరోజు మీరు సెలవిచ్చారు. నాకిప్పుడు దానిపైన నమ్మకం

కలిగింది. ఆధారభూతమైన ఈ భేద భావాన్ని తొలగించడానికి ఇంకా వందలకొలది సంవత్సరాలు పడుతుంది. ఈ వందలకొలది సంవత్సరాలు కాచుకొని కూర్చునే ఓపిక ఎవరికుంది? చూచావా మామయ్యా! నాకో గొప్ప ప్రమాదం తప్పిపోయింది. దాస్యాన్ని అనుభవించడం తప్పనప్పుడు - ఆనందంగా నవ్వుతూ పాడుతూ అనుభవించడం మంచిది." అంటూ గంగాప్రసాద్ తన చేతిలో ఉన్న రాజీనామా దరఖాస్తును చింపి వేసి ముక్కలు ముక్కలు చేసేశాడు.

మూడవ ప్రకరణం

ఒకటి

నవల్ కండ్లు తెరచాడు. అతని దృష్టి ఎదురుగా టేబిలు మీద ఉన్న అలారం టైంపీసు మీద పడింది. మూడున్నర అయింది. కిటికీలోనుంచి గదిలోకి వెలుతురు వస్తూ ఉన్నది. అతనికి లేవాలనిపించక పోయినా లేచి కూర్చున్నాడు. ఈ రోజు ఉదయమే అతను పరీక్షల్లో చివరి పేపరు వ్రాశాడనే సంగతి అతనికున్నట్టుండి జ్ఞాపకం వచ్చింది. ఇక అతను పట్టుపట్టి పరీక్షలకు చదువ నక్కరలేదు. రాత్రిళ్ళు నిదుర కాయవలసిన పని లేదు. హాస్టలు గదిలోనే బందిఖానాలాగా పట్టుబడి ఉండవలసిన అవసరం లేదు. అతనిలో ఒక రకమైన ఉత్సాహం పొంగి వస్తూ ఉన్నది. గది తలుపు తెరచి అతను కుర్చీలో కూర్చున్నాడు – దాలి పోయినట్టు.

ఎదురుగా మార్చినెల్లో కాచే నులి వెచ్చని పసిడి వన్నెల ఎండ కనిపిస్తూ ఉంది. పచ్చని గడ్డితో మఖమల్ లాగా మెత్తగా ఉన్నలాన్‌లో రంగు రంగుల పూలు పూచి అంచుల నలంకరించినట్లున్నాయి. నవల్ చూపులను ఆ పూలు ఆకర్షించాయి. అతని మనస్సులో రకరకాల ఆలోచనలు బయల్దేరాయి. రక రకాల రంగుల్లో లెక్కలేనన్ని పూలు విచ్చలవిడిగా పూచాయి. కాని ఈ పూలన్నీ ఎక్కడినుండి వచ్చాయి? ఈ వర్ణ వైవిధ్యానికి మూలం ఏమిటి – ఆ చిన్న చిన్న విత్తనాలా ? ఆ మొక్కలకు పోసిన నీళ్ళా? లేక ఆ పూలు పూచే ఋతువా?

ఈ పూలు పూస్తాయి, మళ్ళీ వాడిపోతాయి. మరి యీ పుయ్యటం, వాడిపోవటంవల్ల ప్రయోజనం ఏమిటో?

ఈ సందేహం, ఈ ప్రశ్న–ఇవన్నీ ఒక్క పూల విషయంలోనే కాదు; సమస్త సృష్టికీ వర్తిస్తాయి. మనుష్యుడు పుడతాడు, చనిపోతాడు. పుట్టడం గిట్టడం ఇది ప్రకృతి నియమం. ఉన్నట్టుండి నవల్ చూపులు ఎదురుగా టేబిలుమీద పెట్టిఉన్న హిస్టరీ పుస్తకం మీదికి వెళ్ళాయి. ఆ పుస్తకాన్ని అతడు పరీక్షకు వెళ్ళేటప్పుడు టేబిలు మీద పెట్టి వెళ్ళాడు. ఆ పుస్తకాన్ని చూచేసరికి నవల్ ముఖంమీద చిరునవ్వు వచ్చింది.

ఉదయం పరీక్ష పేపరులో ఒక ప్రశ్న వచ్చింది: "మొగల్ సామ్రాజ్య పతనమునకు కారణములను వివరింపుడు."

ఆ ప్రశ్నకు సమాధానం వ్రాసేముందు నవల్ కొంచెం ఆలోచించాడు. బ్రిటిషు సామ్రాజ్య నిర్మాణమే మొగల్ సామ్రాజ్య పతనానికి కారణం, అని వ్రాద్దామని అనిపించిందతనికి. కాని చివరకతను ఆ సమాధానం వ్రాయకుండా తను పుస్తకంలో చదివిన కారణాలే వ్రాశాడు. పుస్తకాల్లో వ్రాసిన కారణాలు సరియైనవి కావని నవల్‌కు అనిపించింది. ఏర్పడడం, నశించడం - పాతది నశిస్తుంది, కొత్తది ఏర్పడుతుంది-ఇది వేదాంతి చెప్పే సమాధానం, చరిత్రకారుడు చెప్పవలసిందికాదు.

ఈ పూల చరిత్ర ఎవరు వ్రాస్తున్నారు. ప్రతి సంవత్సరం వసంత ఋతువు రాగానే అనేక రకాల పూలు పూస్తాయి. వేసవిరాగానే అన్నీ వాడి పోతాయి. కాని నిర్హేతుకంగా ఈ సౌందర్యసృష్టి, మళ్ళీ నిర్హేతుకంగానే ఆ సౌందర్య నాశనం ఎందుకు జరుగుతుందో నవల్‌కు బోధపడడంలేదు.

నవల్ ఒళ్ళు విరుచుకుంటూ లేచి నిలబడ్డాడు. మూలనున్న స్టౌవ్ వెలిగించి అతను టీ చెయ్యడానికి నీళ్ళు పెట్టాడు. ఆ తర్వాత మళ్ళీ అతను కుర్చీలో కూర్చుని బయటి లాన్‌వైపు చూస్తూ ఉన్నాడు. ఉన్నట్టుండి చాలా దూరంనుండి కోకిల కంఠం అతనికి వినిపించింది. ఆ కోకిల కంఠం ఎంత తియ్యగా ఉందో చెప్పడానికి వీల్లేదు. మధుమయ వసంత గాన మాధుర్యమంతా ఆ కోకిలారావంలోనే ఇమిడి ఉన్నదా అనిపించింది. అనాయాసంగా ఆ కోకిల కంఠం కొంచెము సేపట్లోనే ఉషా మధుర కంఠంగా పరిణమించింది.

ఉష - అనంత సౌందర్యాన్ని మూట కట్టుకొని ఉదయించింది. ఆమె మధుర కంఠానికి అతడు ముగ్ధుడైపోతాడు. ఆమె లావణ్యానికి అతడు మైమరచిపోతాడు. నవల్ దగ్గరకువచ్చి ఉష అడుగుతుంది - "ఏదో ఆలోచిస్తున్నారే!" నవల్ మళ్ళీ తెప్పరిల్లుకొని అంటాడు: "ఏమిలేదు. భగవంతుడు నీలాంటి అందగత్తెను ఇంకెవ్వరినైనా సృష్టించాడా అని ఆలోచిస్తున్నాను." నవల్ చెప్పిన ఈ సమాధానానికి ఉష పక్కుమని నవ్వుతుంది. ఆ నవ్వులో ఎన్నో పువ్వులు రాలినట్లు తోస్తుంది. "పొండి, మీరూనూ" అంటూ ఆ అమ్మాయి అక్కడినుండి పారిపోతుంది. కాని ఎంతో దూరం వెళ్ళదు. కొంచెం దూరం వెళ్ళి ఆగుతుంది. మళ్ళీ వెనక్కి

వచ్చి చాలా గంభీరంగా అతనికి కొంచెం దూరంగా కూర్చుంటుంది. ఏ చరిత్రను గురించో సాహిత్యాన్ని గురించో చర్చలు ప్రారంభించి అతనితో కాలక్షేపం చేస్తుంది.

ఉష ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో కూర్చున్నది. ఓ వారం క్రిందట ఆమె పరీక్షలయి పోయాయి. దాదాపు ఒక నెలనుండి అతను ఉషను కలుసుకోలేదు. తన పరీక్షల హడావిడిలో ఉన్నాడు. ఈ రోజుతో అతని పరీక్షలు కూడ అయిపోయాయి.

ఉష రాయ్‌బహాదుర్ కామతానాథ్ గారి అమ్మాయి. రాయ్‌బహాదుర్ కామతానాథ్, గంగాప్రసాద్ చాలా దగ్గరి స్నేహితులు. నవల్‌కిశోర్ రాయ్‌బహాదుర్ కామతానాథ్ గారి ఇంట్లో చాలా చనువుగా తిరుగుతూ ఉంటాడు. వాళ్ళ ఇంట్లో పిల్లవాడి లాగానే ఉంటాడు. తన అమ్మాయి ఉషను నవల్‌కిచ్చి పెండ్లి చేయాలని రాయ్‌బహాదుర్ కామతానాథ్ కోరిక. ఈ విషయం నవల్‌కు తెలుసు. ఉషకు కూడా తెలుసు. నవల్ ముఖంలో లేత చిరునవ్వు కనిపిస్తుంది. ఎదురుగా స్టౌ వైపు చూస్తాడు — నీళ్ళు కాగుతున్నాయి.

నవల్ లేచి టీ తయారుచేశాడు. అలవాటు ప్రకారం అక్కడినుండే కేక వేశాడు: "ప్రేమశంకర్! ప్రేమశంకర్! టీ తయారయింది!"

గది తలుపు తెరుచుకొని మూసిన చప్పుడు వినిపించడంతో ప్రేమ శంకర్ గదిలోకి వచ్చాడు.

"ఏమోయ్ నవల్! ఈ రోజు పేపరు ఎలా వ్రాశావు?" అని అడిగాడు ప్రేమ శంకర్.

"బాగానే వ్రాశాను. హై సెకండ్‌క్లాసు ఖాయం. ఫస్టుక్లాసు వచ్చిందాకా నమ్మకం లేదు" అన్నాడు నవల్.

"అదే నీతో వచ్చిన చిక్కు. ఫస్టుక్లాసు నీకు తప్పకుండా వచ్చేది కొంచెం కష్ట పడ్డట్టయితే. పోనీలే. ఇప్పుడు మాత్రం మునిగి పోయిందేమీ లేదు" అంటూ ప్రేమశంకర్ కుర్చీలో కూర్చున్నాడు.

టీ తాగుతూ ప్రేమశంకర్ అన్నాడు: "నవల్! నీవు కష్టపడి పని చేస్తావు కాని దేనికోసంకూడా ప్రయత్నించవోయ్. నీకు ప్రయత్నించ కుండానే అన్నీ లభించాయి. అప్రయత్నంగానే నీకన్నీ లభిస్తూఉన్నాయి. మరి యిక కార్యక్రమం ఏమిటి?" అని అడిగాడు కొంచెంసేపు ఆగి.

"కార్యక్రమమా! అప్పుడే చెప్పడం కష్టం. కాని బహుశా సెప్టెంబరులో ఇంగ్లండు వెళ్ళవచ్చు. అక్కడనే ఐ.సి.యస్. కు ప్రయత్నిస్తాను. పాస్‌పోర్టు తయారయి వచ్చింది. అక్కడ ఉండడానికంతా నాన్నగారు ఏర్పాటు చేస్తున్నారు."

ప్రేమశంకర్‌కు నవ్వు వచ్చింది: "నీవు ఐ.సి.యస్. అవుతావని నాకు కచ్చితంగా తెలుసు. కాని నేనడగడం ఇప్పుడు వెంటనే నీ కార్యక్రమం ఏమిటి అని. నీ ధర్మమా అంటూ సాయంత్రం నీ దగ్గర టీ తాగుతున్నాను. నీవిక్కడినుండి వెళ్ళిపోయావా అంటే అదికూడా సున్న అనుకో."

ప్రేమశంకర్ ఎల్.ఎల్.బి. ఫైనల్ చదువుతున్నాడు. అతను వయస్సులో నవల్‌కంటె చాలా పెద్దవాడు. కాని చూడడానికి అతనూ, నవల్ ఒకే వయస్సులో ఉన్నట్టు కనిపిస్తారు. ప్రేమశంకర్ అంత పొడుగూ కాదు, పొట్టీకాదు. మధ్యరకంలో పచ్చనివన్నెలో అందంగా ఉంటాడు. లోతైన నల్లని పెద్ద పెద్ద కండ్లకు అమర్చినట్టు కనుబొమ్మలూ ముద్దులు మూట గట్టినట్టుంటాయి. అతని వ్యక్తిత్వంలోనే అదోరకమైన మార్దవం ఉంది. అతని పలుకులో ఒక తియ్యదనం ఉంది. కండ్లు ఎప్పుడూ దేన్నో పరధ్యానంగా చూస్తున్నట్టు ఉంటాయి. ప్రేమశంకర్ ఎం.ఏ. ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. ఆ తర్వాత అతను ప్లీడరు కోర్సు చదువుతున్నాడు.

"నేనిక్కడ మరో వారం వరకూ ఉంటాను. ఫతేపూర్‌లో మాబాబాయి ఒకరున్నారు. ఆయన పిల్లవాడి పెండ్లికి మా నాన్నవాళ్ళు నన్నుకూడా రమ్మని వ్రాశారు. నేను వెళ్ళేప్పుడు ఈ టీ సామానంతా ఇక్కడే వదలిపెట్టి పోతాను. సుఖాయ నీకు టీ పెట్టిస్తాడు. నీవు వెళ్ళేప్పుడు ఈ సామానతనికిచ్చేయి. అతను మా యింటికి చేరుస్తాడు" అన్నాడు నవల్.

"ఇదంతా నావల్ల అయేది కాదు. టీ త్రాగడం అనేది నీ వల్లనే నా కలవాటయింది. నీవు వెళ్ళిన తర్వాత ఈ అలవాటు కూడా పోతుంది" అన్నాడు ప్రేమశంకర్ నవ్వుతూ.

ఉన్నట్టుండి నవల్‌కి ఏదో జ్ఞాపకం వచ్చింది: "నిన్న సాయంత్రం నీవు సివిల్ లైన్సులో ఎవరో ఇంగ్లీషువాడితో తిరుగుతూ ఉన్నావట—జీవన్ నాతో ఈ రోజు మధ్యాహ్నం చెప్పాడు. ఎవరతను? అతన్ని మాకు కూడా పరిచయం చేస్తూ."

ప్రేమశంకర్ చెప్పాడు: "ఎవరో టూరిస్టట. సివిల్ లైన్సులో కలుసుకొన్నాం. ఏదో మామూలు పరిచయమే" అంటూ కొంచెం నవ్వుకున్నాడు. "ఏ విషయమైనా లోకానికి తెలియకుండా ఉండదు. గోరంతను కొండంతగా చేసి నలుగురూ చెప్పుకుంటారు."

ప్రేమశంకర్ ఏదో మాట దాస్తున్నాడని నవల్‌కు తెలిసిపోయింది. అంతకుమించి అడగడం మంచిది కాదనుకున్నాడు. ప్రేమశంకర్ కూడా టీ పూర్తిగా తాగాడు. "ఊరకనే అడిగాను. కాని పరీక్షలయిన తర్వాత నీ కార్యక్రమమేమిటి?" అని అడిగాడు నవల్.

ప్రేమశంకర్ జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించాడు: "నా కార్యక్రమం ఏమిటో నాకే తెలియదు. నాకు ఇల్లూ లేదు, వాకిలీ లేదు. పరీక్షలయిన తర్వాత ఎక్కడికి పోవాలో, ఏం చేయాలో, ఆలోచిస్తాను." అంటూ ప్రేమశంకర్ లేచి నిలబడ్డాడు: "నీవు బహుశా ఈ రోజు ఎక్కడికన్నా బయటకు వెళ్ళాలనుకొంటున్నావేమో. నీకాలస్య మవుతుంది. నేనిక వెళ్ళి పుస్తకాల్లో మునిగిపోతాను."

ప్రేమశంకర్ పల్చని లాల్చీ వేసుకుని ఉన్నాడు. మూడు రోజుల నుండి అతను దుస్తులు మార్చినట్టు లేదు. లాల్చీ చాలా మాసిపోయి నట్లుంది. అతను వేసుకున్న చారలపైజామా కూడా చాలా మురికిగా ఉంది. "అది సరేకాని నీవు కొంచెం దుస్తులన్నా మార్చుకో" అన్నాడు నవల్.

"అన్నట్టు దుస్తులు మార్చుకోడం కూడా మరచిపొయ్యాను" అంటూ ప్రేమశంకర్ నవ్వాడు: "ఈ రోజుల్లో జీవితం ఎంత జటిలమయి పోయిందో చూడు. శుభ్రమైన బట్టలు కావాలి. అంటిపట్టి పని చేయ డానికి సిగరెట్టు కావాలి. ఇంకా ఏమేమో కావాలి. ఈ 'కావాలి' అనే దానికి డబ్బుకావాలి. డబ్బుతో ఉంది అంతా. పోనీ ఇదంతా ఎందుకులే ఇప్పుడు. నీ కాలస్యమవుతున్నది. నేనిక వెళ్ళుతాను" అంటూ, ప్రేమశంకర్ వెళ్ళిపోయాడు.

నవల్ స్నానంచేసి దుస్తులు వేసుకునేసరికి అయిదు గంటలయింది. గోడకు తగిలించిన టెన్నిస్ రాకెట్ తీసుకున్నాడు. అతనా రాకెట్ తాకి నెలరోజులయింది. రాకెట్ తీసుకొని సైకిలుమీద అల్ఫ్రెడ్ పార్కు వైపు వెళ్ళాడు.

రెండు సెట్లు ఆడేసరికి అతను అలసిపోయాడు — ఒక నెలనుండి

అలవాటు తప్పిపోవడం వల్ల. కాని ఆటలో మార్పేమీ రాలేదు. కొంచెం సేపు విశ్రాంతి తీసుకొని అతను రాయ్‌బహాదుర్ కామతానాథ్ గారి ఇంటికి వెళ్ళాడు.

రాయ్‌బహాదుర్ కామతానాథ్ బంగళా ముఠ్ఠీ గంజ్‌లో ఉండేది. బయటనుంచి చూస్తే మామూలు బంగళా లాగానే కనిపించేది – పొడుగాటి గోడ, గోడ పొడుగునా చిన్న అంగళ్ళు, గోడ మధ్యలో ఒక పెద్ద గేటు ఆ గేటులోనుంచి లోపలికి వెళ్ళితే ఒక పూలతోట, ఆ తోట దాటితే రెండంతస్తుల మేడ – రాయ్‌బహాదుర్‌గారిది కనిపిస్తుంది. ముందుభాగమంతా రాతికట్టడం. అసలు మేడకు కూడ ఒక సింహద్వారముంది. అటూ ఇటూ చిన్న చిన్న వసారాలలాంటి వున్నాయి. ఆ సింహద్వారం దాటినతర్వాత మళ్ళీ ఒక తోటఉంది. ఆ తోట దాటగానే ఆడవాళ్ళకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన వాకిలి ఉంది. బయటివాకిలి మగవాళ్ళది.

నవల్‌ను కూర్చోమని చెప్పి కామతానాథ్ అన్నారు: "ఏమోయ్ నవల్! చాల రోజుల తర్వాత కనిపిస్తున్నావు. పరీక్షల్లో బాగా వ్రాశావా?"

"బాగానే వ్రాశాను. హై సెకండ్ క్లాస్ వస్తుంది."

"అయితే మరి ఫారిన్ వెళ్ళడం ఎప్పుడు?" కామతానాథ్ ఏదో స్ఫురించినట్లు అన్నారు: "నీవు కూడా మాతో స్విట్జర్లాండు రాగూడదూ! ఫారిన్ ఏలాగా వెళ్ళాలి కాబట్టి మాతోనే వచ్చేసేయ్."

కామతానాథ్ మాటలకు నవల్ ఆశ్చర్యపడ్డాడు: "ఈరోజే గదా చివరి పేపరయింది. రిజల్టు రావాలి గదా! ఆ తర్వాతనే ఫారిన్ వెళ్ళడమనేది ఆలోచించాల్సి ఉంటుంది."

"అరే, నీవు పాసవడాని కేమిటోయ్! రిజల్టంటావా, టెల్‌గ్రాం ద్వారా స్విట్జర్లాండుకు తెప్పించు. మేము కూడ ఏప్రిల్ చివరికి గాని వెళ్ళం. ఇంకా నెలపైగా వ్యవధి ఉంది."

అప్పుడే తల దువ్వుకొని ఉష బయటకు వచ్చింది. మాట్లాడకుండా కుర్చీలో కూర్చుంది. రాయ్‌బహాదుర్ కామతానాథ్ ఉషతో అన్నారు: "అమ్మాయ్! నాకో ఆలోచన తట్టింది. నవల్ ఐ.సి.యస్. కోసం ఎటూ ఫారిన్ వెళ్ళుతూనే ఉన్నాడు. మనతో స్విట్జర్లాండు రమ్మని నేనంటున్నాను. అక్టోబర్లో మనం ఇండియాకు వచ్చేస్తే అతను అటునుండి అటే ఇంగ్లండు వెళ్ళిపోవచ్చునని చెప్పాను."

ఉష ముఖం చేటంతయింది : "భలే బాగుంది నాన్నా ! చక్కటి ఆలోచన తట్టింది నీకు. నవల్ బాబూ ! నీవు మాతో కూడా తప్పక రావాలి. ఇక తప్పించుకోడానికి వీల్లేదు."

కామతానాథ్ భార్య వెంటనే అందుకుంది: "అబ్బాయ్ నవల్ ! నీవు కూడా ఉంటే నా కెంతో నిశ్చింతగా ఉంటుంది. ఈయన సంగతి నీకు తెలుసుగదా ! ఇక ఉష అంటావా, పసిది. నీ వుంటే ఇక దిగుల్లేదు."

నవల్ చాలా క్లిష్ట పరిస్థితిలో పడ్డాడు. ఈ ప్రస్తావన అనుకోకుండా వచ్చింది. దీని కతడు సిద్ధపడి లేడు. "మామయ్యా ! ఈ సంగతి నేను నాన్నగారిని అడగాల్సి ఉంటుంది. నాన్నగారు సరేనంటే అలాగే వస్తాను."

కామతానాథ్‌తో ఆయన భార్య అంది : "నేను చెప్పిన మాట విని మీరు కలెక్టరు గారికి రేపే ఉత్తరం వ్రాయండి. మీరు చెప్పిన మాట ఆయన కాదనరు. నవల్ చెప్పే మాటలో పొరపాటు లేదు. దేశం కాని దేశం వెళ్ళడం గదా మరి, నాన్నగారి నడగకుండా ఎలా వస్తాడు పాపం !"

"వ్రాయడం గీయడంతో లాభం లేదు. రేపో ఎల్లుండో నేనే స్వయంగా మిరాపుర్ వెళ్ళి వస్తాను. ఎంత దూరం కాబట్టి ! దీనికోసం గంగాప్రసాద్ పెద్ద డబ్బు ఏర్పాటు చేయవలసిన పనికూడ లేదు. నవల్ మనతోకదా రావడం. ముగ్గురికి ప్యాసేజి బుక్ చేస్తాను."

ఇలా రాయ్‌బహాదూర్ దగ్గర మొహమాట పడడం నవల్‌కు నచ్చలేదు. "నేను ముందు నాన్నగారి నడిగిన తర్వాతనే నాకు ప్యాసేజి తీసుకుందురు గాని. కావాలంటే మీరు నాన్నగారికి ఉత్తరం వ్రాసినా సరే లేకుంటే ఆయన్నొకసారి కలుసుకున్నా సరే" అన్నాడు నవల్ మళ్ళీ ఒకసారి.

"గంగాప్రసాద్‌ను ఒప్పించడం నా మీద వదిలేయ్" కామతానాథ్ ఆత్మవిశ్వాసంతో అన్నారు : "నీవు మాత్రం రేపే ఉషను తీసికుని సివిల్ లైన్సులో డేవిడ్‌సన్ దగ్గరకు వెళ్ళు. నీవొక సూటు కుట్టించుకో, ఉషకు కూడా కావలసిన గుడ్డలకు ఆర్డరిచ్చేసేయి."

"అలాగే" అని అతను ఉష వైపు తిరిగాడు : "ఈ మాటల్లోపడి నిన్ను అడగడమే మరచిపొయ్యాను. పరీక్షల్లో ఎలా రాశావు ? నా పరీక్షలవల్ల నీ దగ్గరకు రావడమే పడలేదు."

ఉష కొంచెం సిగ్గుపడుతూ అన్నది : "మీరు రాకపోతే మాత్రమేం. చదువు చెప్పింది మీరేకదా ! ఈసారి సెకండ్ క్లాసు వస్తుంది. కాని

బి.యే.లో నాకెవరు చెపుతారు?'' అంటూ కిలకిలా నవ్వింది: "స్వెట్జర్లాండుకు నేను పుస్తకాలు తీసుకునే వస్తాను. అక్కడే చదువు చెప్తురుగాని.''

నవల్ నవ్వాడు: "అక్కడ దేశం చూడడానికి తిరగడంతో మనకు తీరితేగా చదువుకోడానికి. అయితే మరి రేపు సాయంత్రం సిద్ధంగా ఉండు. నేనిక వెళ్ళుతాను. ఆలస్యమైపోతున్నది.'' అంటూ నవల్ లేచినిలబడ్డాడు.

"బాగుంది. ఫోంచెయ్యకుండా ఎలా వెళ్ళుతారు?'' అంటూ నవల్ చెయ్యిపట్టుకుని కూర్చోపెట్టింది ఉష.

రాయ్‌బహాదూర్ కామతానాథ్ గారి ఇంట్లో ఫోంచేసి నవల్ కాలేజీ హాస్టలుకు తిరిగి చేరేసరికి పదకొండు గంటలయింది. ఈరోజు అతనికి చాలా ఉల్లాసంగా ఉంది. అతను తన గది దగ్గరికి వెళ్ళేసరికి ప్రేమ శంకర్ గది తలుపులు తెరిచి ఉన్నాయి. అతను లోపల కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు. నవల్ కనిపించగానే ప్రేమశంకర్ లేచి నిలబడ్డాడు: "ఏం విశేషం? సాయంత్రం చాలా మజాగా గడిపినట్టున్నావు.''

ప్రేమశంకర్‌ను చూస్తే అతను సాయంత్రం పూట ఎక్కడికో బయటకు వెళ్ళి వచ్చినట్టు తోస్తున్నది. "అది సరేకాని, నీ సంగతి చెపుదూ! నీవు కూడా బయటకు వెళ్ళినట్టున్నావు, అవునా?''

ప్రేమశంకర్ కొంచెం గంభీరంగా అన్నాడు: "నవల్! సాయంత్రం నేను నీకు అబద్ధం చెప్పాను. అంటే నిజం చెప్పలేదన్నమాట. సాయంత్రం నీవు ఇంగ్లీషు వాళ్ళను గురించి అడిగావే, వాళ్ళదగ్గరికే ఈ రోజు నేను వెళ్ళాను. చాలా విచిత్రమైన వాళ్ళుగా కనిపిస్తున్నారు వాళ్ళు. ఇంగ్లీషు వాళ్ళే అయినప్పటికీ ఇంగ్లీషు ప్రభుత్వమన్నా, ఆంగ్ల సామ్రాజ్యమన్నా వాళ్ళకు బొత్తుగా గిట్టదు.''

"ప్రేమశంకర్, నాకు కూడా వాళ్ళను కలుసుకోవాలని ఉంది. పరిచయం చేస్తావా?'' అని అడిగాడు నవల్ చాలా కుతూహలంతో.

తల ఊపుతూ ప్రేమశంకర్ అన్నాడు: "లేదు. నిన్ను అనవసరంగా చిక్కులో పెట్టడం ఇష్టంలేక సాయంత్రం నీకు అబద్ధం చెప్పి వెళ్ళాను. వాళ్ళు కమ్యూనిస్టులయినా అయిఉండాలి. లేకుంటే బ్రిటిషు వాళ్ళ తరపున గూఢచారులయినా అయిఉండాలి. ఈ యిద్దరిలో ఎవరితోనైనా స్నేహితం చెయ్యడం కనీసం నీకు ప్రమాదకరం కావచ్చు.''

నవల్ ప్రేమశంకర్ వైపు చాలా తీవ్రంగా చూచాడు: "కాని నీవీ ప్రమాదంలోకి ఎందుకు దిగుతున్నావోయ్ శంకర్!"

"నా జీవితమంతా పోరాటంతో నిండిఉండడం చేత. నాన్నగారెప్పుడు పోయారో నాకు గుర్తులేదు. మా అమ్మ నాకు చదువు చెప్పించింది. నన్ను చదివించడానికి మా అమ్మ ఎంత కష్ట పడిందో ఎలాంటి అవమానాలకు గురి అయిందో నీవు ఊహించను కూడా లేవు. మా బాబాయి మమ్మల్ని ఎన్నో బాధలు పెట్టాడు. మా అమ్మ నన్ను తీసుకొని ఇల్లు వదలిపెట్టి వచ్చింది. ఆమె చదువుకున్నదవడం వల్ల టీచరుగా చేరి నన్ను చదివించింది. నేను ఇంటర్మీడియట్‌లో ఉండగా మా అమ్మ చనిపోయింది. ఆమె నాకు రెండువేల రూపాయల రొఖ్ఖం ఇచ్చిపోయింది. ఆమె సొమ్ములన్నీ కలసి పదిహేను వందల రూపాయలకు వచ్చాయి. అప్పటినుంచీ నేను హాస్టల్లో చేరి చదువుకుంటున్నాను. ప్రపంచంలో నా అనే వారెవ్వరూ నాకు లేరని అనిపిస్తూ ఉన్నది. మూడున్నర వేలల్లో ప్రస్తుతం నా దగ్గర అరు వందలు మాత్రమే మిగిలిఉన్నాయి. అవి కూడా ఎప్పుడో అయిపోతాయి."

"కాని నీవు చెప్పిన ఈ కథలో ఎక్కడా నా ప్రశ్నకు సమాధానంలేదే!" అన్నాడు నవల్.

"ఉన్నదనుకుంటే ఉంది. లేదనుకుంటే లేదు. నేను యం.ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయిన సంగతి నీకు తెలుసు. ఎన్నిచోట్లకో అప్లైచేశాను. కాని ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఒకటి రెండు ప్రైవేటు స్కూళ్లల్లో ఉద్యోగం దొరికే అవకాశం కనిపించింది. కాని తొంభై రూపాయలు జీతం ముట్టినట్టు సంతకం పెట్టాలని షరతు. నాకు నిజంగా ఇయ్యబోయేది యాభై రూపాయలు. విసుగుపుట్టి నేను చివరకు యల్.యల్.బి లో చేరాను. ఈ వకీలు వృత్తిలో కూడా భయంకరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని నాకు తెలుసు. ఇలా మెల్లమెల్లగా ప్రమాదాలతో చెలగాటం నాకు సరదా అయిపోయింది."

నవల్ కొంచెంసేపు మాట్లాడలేదు. తర్వాత నిట్టూర్పు విడుస్తూ అన్నాడు: "నాకు బోధపడుతున్నది శంకర్! అయినప్పటికీ నీకు జీవితంలో విజయం తప్పక కలుగుతుందని నాకనిపిస్తున్నది. నిరాశచెంది ప్రమాదాల్లోఅడుగుపెట్టడం మంచిదికాదు. వీళ్ళతో పరిచయ సంబంధాలు నీవు మానివేయి."

ప్రేమశంకర్ నవ్వాడు: "నీవు చెప్పిన సలహాకు ధన్యవాదాలు. కాని ఇప్పుడు అడుగు వేసేశాను. అది సరేకాని నేను మరిచేపోయాను. మీ తాతయ్య నీ కోసం వెదుకుతూ ఉన్నారు. రెండుసార్లు వచ్చారు - తొమ్మిదిన్నరకోసారి, మళ్ళీ పదిన్నరకు మరోసారి. నీవు రాగానే ఇంటికి పంపించమని చెప్పిపోయారు. చాలా ముఖ్యమైన పని ఉన్నదట."

నవల్ గడియారం చూచుకొన్నాడు: "ఇప్పుడు చాలా పొద్దుపోయింది. రేపుదయం వెళ్ళుతాను."

"కాదు. ఇప్పుడే వెళ్ళు. రాగానే పంపించమని మరీ మరీ చెప్పారు."

నవల్ కొంచెం విచారంతో అడిగాడు: "ఏమిటసలు విషయం? చాలా దిగులుపడి ఉన్నారా? ఏమన్నా చెప్పారా నీకు?"

"ఏమీ చెప్పలేదు. కానీ చాలా దిగులుపడి ఉన్నట్లు కనిపించారు. వెళ్ళి కనుక్కుంటే బాగుంటుంది. అసలు పరిస్థితి యేమిటో!"

నవల్ తన గదిలోకి వెళ్ళకుండా హాస్టలు నుండి నేరుగా ఇంటివైపు వెళ్ళాడు. అతని గుండెలో దడగా ఉంది. అకస్మాత్తుగా ఏదో భయం అతన్ని ఆవరించింది.

అతనింటికి చేరేసరికి జ్వాలా ప్రసాద్ వరండాలో కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉన్నారు. నవల్‌ను చూడగానే ఆయన లేచారు: "నీ కోసం చాలా సేపటినుంచి ఎదురు చూస్తున్నాను బాబూ! మనకు చాలా విపరీతమైన ఆపద వచ్చింది."

'అంతా కులాసా?' అని అడిగాడు నవల్.

"అదే లేనిది. మీ నాన్నకు జబ్బుచేసింది. నాలుగు రోజుల క్రితం నెత్తురు కక్కుకున్నాడు. నూటమూడు డిగ్రీల జ్వరం కాస్తూ ఉన్నది. సివిల్ సర్జనుకు చూపించాము. ఊపిరి తిత్తులు రెండూ చెడిపొయ్యాయని చెప్పాడు. ఎక్స్‌రే తీయించాలి. మిర్జాపుర్‌లో నయమయే జబ్బుకాదిది."

నవల్‌కు ఖంగారు పుట్టింది: "తాతయ్యా! నాకు ముందుగా కబురు చెయ్యలేదేం. ఇప్పుడేం చేయడం?"

"నీకు పరీక్షరోజులు కదటోయ్! ఈరోజే కదా నీకు పరీక్షలైపోయింది. ఇక్కడికి డాక్టర్ శేర్‌వుడ్ కోసం వచ్చాను. సివిల్ సర్జన్‌కు సాధ్యమయే వ్యాధి కాదిది" అన్నారు జ్వాలా ప్రసాద్. ఈ రోజు నేను డాక్టరు శేర్‌వుడ్‌ను

కలిసికొన్నాను. ఆయన రేపు మధ్యాహ్నం పన్నెండు గంటలకు బయలు దేరుతారు. నీవు కూడా సిద్ధంకా.''

నవల్ కిశోర్ స్తంభించిపోయి చదికిల బడ్డాడు: ''మనకిది చాలా క్లిష్ట సమయం నవల్. ఈశ్వర సంకల్పమేమిటో తెలియదు. అనుకొన్న దొకటి, అయిందొకటి.''

జ్వాలా ప్రసాద్ ముఖం మీద చర్మం ముడతలుపడి వద వదలాడుతూ ఉంది. ఆయన కండ్లల్లో కాంతి క్షీణించి పోతూఉంది. ఆయనకు ఉన్నట్టుండి చాలా ముసలి తనం వచ్చినట్టు కనిపించింది నవల్‌కు. ''ధైర్యంతో ఉండు తాతయ్యా! రేపు డాక్టరు శేర్వుడ్ వస్తేగాని అసలు వ్యాధి ఏమిటో తెలియదు.'' అన్నాడు నవల్.

జ్వాలా ప్రసాద్ బావురుమన్నాడు: ''గుండె రాయిచేసుకోవడం తప్ప వేరే మార్గం లేదు బాబూ! ఇక వెళ్ళు. ప్రొద్దున్నే సామాను సర్దుకొని వచ్చేసేయ్. డాక్టరు శేర్వుడ్ దగ్గరకి నీవే వెళ్ళాల్సి ఉంటుంది. నాకు బొత్తుగా ఓపిక తగ్గిపోయింది.''

డాక్టరు శేర్వుడ్‌ను తీసుకొని జ్వాలా ప్రసాద్, నవల్ మీర్జాపూర్ వెళ్ళే సరికి రెండు గంటలయింది. విద్య గంగాప్రసాద్ దగ్గర గదిలో కూర్చుని ఉంది. ఆమె బయటకు వచ్చి వీళ్ళను గదిలోకి తీసుకుని వెళ్ళింది. గంగా ప్రసాద్ కండ్లు మూసుకుని నోట్లాడకుండా పడుకొని ఉన్నారు. కాని ఆయన ముఖంలో సహించడానికి అలవికాని యాతన కనిపిస్తూ ఉంది. డాక్టరు శేర్వుడ్ గంగాప్రసాద్‌ను పూర్తిగా పరీక్షచేశారు. ఈలోగా మీర్జాపూర్ సివిల్ సర్జన్‌ను కూడా నవల్ పిలుచుకు వచ్చాడు. ఇద్దరు డాక్టర్లు ఒకరితో ఒకరు సంప్రతించి జ్వాలా ప్రసాద్‌కు చెప్పారు: ''వీరిని అలహాబాద్ తీసికొని వెళ్ళాల్సి వుంటుంది. మీర్జాపూర్లో ఎక్స్‌రే తీయించేందుకు కూడా వీల్లేదు. అలహాబాదులో అన్ని వసతులూ వుంటాయి.''

''కాని కలెక్టరు గవర్నమెంటు ఆర్డరు లేకుండా హెడ్‌క్వార్టర్సు వదలి వెళ్ళడానికి వీల్లేదు కదా!'' అన్నారు జ్వాలా ప్రసాద్.

సివిల్ సర్జన్ సమాధానం చెప్పారు: ''మీరు డాక్టరు శేర్వుడ్‌తోపాటు అలహాబాదు వెళ్ళండి. నేను సర్టిఫికేటు వ్రాసి ఇస్తాను. కమీషనరుకు మీరీయన శెలవుదరఖాస్తు ఇవ్వండి. ఈయన మీర్జాపూరు నుండి అలహాబాదు వెళ్ళడం చాలా అవసరం.''

ఓ గంటలో డాక్టరు శేర్వుడ్‌తో కలసి జ్వాలా ప్రసాద్ అలహాబాదుకు బయలుదేరి వెళ్ళారు.

డాక్టరుతో కూడ తాతగారిని సాగనంపి నవల్ కిశోర్ తిరిగి నాన్నగారి గదిలోకి వచ్చాడు. గంగాప్రసాద్‌కు తీవ్రంగా జ్వరం కాస్తూ వుంది. ఆయన నవల్‌కిశోర్‌ను చూచి తన దగ్గర కూర్చోమని సంజ్ఞ చేశారు. కొంచెంసేపు గంగాప్రసాద్ ఏక దృష్టితో నవల్ వైపు చూచి చాలా బలహీనంగా అడిగారు: "అయితే డాక్టరు శేర్వుడ్ ఏమన్నారు?"

గంగాప్రసాద్ మాటల్లో నవల్‌కు ఏదో ఒక రకమైన కంపనం, ఆయన చూపుల్లో అదోరకమైన భయం తోచింది. నవల్ సమాధానం చెప్పాడు: "అలహాబాదులో తగిన చికిత్స జరుగుతుంది, అక్కడనే మీకు నయమవుతుందని చెప్పారు."

"అలహాబాదులో నయమవుతుందన్నారా? నిజమేనా? నేను మాత్రం నయం కావడానికి వీల్లేని వ్యాధి ఏదో నన్ను పట్టుకొందని అనుకుంటున్నాను. అయితే డాక్టరు శేర్వుడ్ నాకు నయమవుతుందని చెప్పారా? కాని అసలు వ్యాధి ఏమిటని చెప్పారాయన?" గంగాప్రసాద్ తన చుట్టూ ఆవరించిన నైరాశ్యతిమిరంలో ఆశాకిరణాన్ని వెదకడానికి ప్రయత్నిస్తున్నారు. గంగాప్రసాద్ ముఖం పీల్చుకునిపోయింది. ఆయన వ్యక్తిత్వమంతా ఒకసారిగా క్షీణించి పోయినట్టయింది. నవల్‌కు అబద్ధం చెప్పక తప్పింది కాదు. "వ్యాధి పేరేమిటో ఆయన చెప్పలేదు. కాని అలహాబాదు వెళ్ళి ఒక నెలపాటు ఆయన దగ్గర మందు తీసుకుంటే నయమవుతుందని మాత్రం చెప్పి వెళ్ళారు. తాతయ్య మీ సెలవుకు దరఖాస్తు పెట్టడానికి వెళ్ళారు."

గంగాప్రసాద్ కుప్పగూలినట్లయి పోయారు: "నా సెలవుకు దరఖాస్తు పెట్టడానికి వెళ్ళారా? సరే, సెలవు తీసుకోవాల్సిందే. బహుశా నాకిక ఒకటే సెలవనుకుంటాను."

అక్కడనే ఒక మూలన నిలుచుని విద్య ఈ సంభాషణ అంతా వింటూ ఉన్నది. ఆమె ముందుకు వచ్చి అన్నది: "నాన్నకు ఒంట్లో సరిగా లేనప్పటి నుంచి ఇలాంటి మాటలే అంటున్నారు. నీవన్నా కొంచెం చెప్పన్నయ్యా! ఈ విధంగా నిరాశచెందడం మంచిది కాదు."

గంగాప్రసాద్ ముఖంలో జాలితో కూడిన చిరునవ్వు కనిపించింది:

"విన్నావా నవల్ ! ఈ విద్య నాకు తెలివి చెపుతూ ఉన్నది – పదహారేండ్ల పిల్ల !" విద్యను పిలిచి ఆయన అన్నారు : "వెళ్లమ్మా, ఇక వెళ్ళి మీ అమ్మను పంపించు. పగలూ రాత్రీ ఈ పరిచర్యతో సరిపోతున్నది మీకు!" అంటూనే ఆయన నవల్ వైపు చూచి అన్నారు : "నాకు నిద్ర వస్తూఉంది. మీరందరూ కొంచెం సేపు విశ్రాంతి తీసుకొండి. కొన్నాళ్ళలో మీరు నాకు పరిచర్య చేయక తప్పదు." గంగాప్రసాద్ కండ్లు మూతలు పడ్డాయి.

నవల్ కిశోర్, విద్య గది నుండి బయటకు వచ్చారు. విద్య నవల్ కంటె రెండు సంవత్సరాలు చిన్న. కాలు పొడుగు. కండ పుష్టిగల పిల్ల. విశాలమైన నేత్రాలు, ఆ నేత్రాల్లో పటిష్ఠమైన కాఠిన్యం కనిపిస్తూ ఉంటుంది. విప్పారిన గోధుమ వన్నె. ఈ సంవత్సరం విద్య బి.యే. మొదటి సంవత్సరం పూర్తి చేసింది–కాశీ విశ్వ విద్యాలయంలో పరీక్షలు కాగానే ఆమె మిర్జాపూరు వచ్చేసింది. "మనకు చాలా గడ్డు రోజులు వచ్చా యన్నయ్యా!" అన్నది విద్య నవల్‌తో.

"అదే విద్యా ! కాని ఈ ఆపదను మనం ఎదుర్కోవాలి. వేరే మార్గం లేదు."

విద్య మాట్లాడలేదు. నిలబడి ఆలోచిస్తూ అన్న వైపు చూస్తూ ఉంది. నిండు శరీరం, విశాలకాయం, ముఖంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూ ఉంది. నవల్ చూడడానికి అందంగానే ఉంటాడు. తీర్చిదిద్దిన రూపం, ఆరోగ్యంగా కనిపించే శరీరం. "అన్నయ్యా ! నాన్న తర్వాత నాకు నీవే కదా పెద్దవాడివి. నీవెలా చెపితే అలా చేస్తాను. ఈ ఆపదనుండి బయట పడాలి." అంటూ విద్య కంట తడిపెట్టింది. "వెళ్ళి అమ్మను పంపిస్తాను నాన్న దగ్గరికి" అంటూ కన్నీరు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది విద్య.

లోపల గదిలో నవల్‌కిశోర్ నాయనమ్మ దిగులుపడి కూర్చుని ఉంది. నవల్ ఆమె దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు. యమున నిశ్చలంగా మౌనంగా కొయ్యబొమ్మలా కూర్చుని ఉంది. ఆమె నవల్‌ను చూచి కూడా అతను వచ్చినట్లు గమనించలేక పోయింది. 'అవ్వా' అని పిలిచాడు నవల్.

యమున గమనించింది నవల్ వచ్చాడని : "వచ్చావా నవల్ ! డాక్టరు ఏమన్నారు ?"

"ఆయన నాన్నను అలహాబాదు తీసుకుపొమ్మని చెప్పారు. అక్కడనే ఆయన నాన్నకు నయం చేస్తారుట."

"ఇప్పుడు గంగూ దగ్గర ఎవరున్నారు?" అని అడిగింది యమున.

"అమ్మ ఉన్నది. నాన్నకు నిద్ర వస్తూ ఉంది. అందుకని మమ్మల్ని వెళ్లమన్నారు."

"వెళ్తాను నేను గూడా వాడి దగ్గరికి" అంటూ యమున గంగాప్రసాద్ గదిలోకి వెళ్ళింది. నవల్‌తో విశేషంగా మాట్లాడలేదు. కాని ఆమె శరీరంలో ప్రాణాలున్నట్లే అనిపించడం లేదు. కాళ్ళు తడబడుతున్నాయి.

నవల్ అక్కడినుండి ఉసూరుమంటూ వచ్చి వరండాలో కూర్చున్నాడు. రాత్రి గడిచిపోతూవుంది. పంచలో లాంతరు వెలుతురు మిణుకు మిణుకు మంటూ ఉంది. చుట్టు పక్కలా చీకటులు కమ్మిఉన్నాయి. ఏకాంతంగా మౌనంగా అతను ఆలోచించ సాగాడు – గతం, వర్తమానం, భవిష్యం – వీటిలో ఒకదానికొకటి సంబంధం ఏమిటి? ఈ జరుగుతున్నవన్నీ ఏ విధానాన్ని అనుసరించి జరుగుతున్నాయి. అతని దగ్గరఉన్న కుర్చీలో విద్య ఎప్పుడు వచ్చి కూర్చున్నదో అతనికి తెలియనే తెలియదు.

విద్య ఇక ఊరుకోలేక 'అన్నయ్యా' అని నవల్‌ను పలకరించింది.

నవల్ ఉలిక్కిపడ్డాడు: "నీవా విద్యా! నాన్నకెలా ఉంది? నిద్ర పట్టిందా? మేల్కొనే ఉన్నారా?"

"నిద్ర పట్టటమనేది ఉంటే గదూ, ఎప్పుడు మసిలి పోయే జ్వరంతో కండ్లు మూసుకొని ఒళ్ళు తెలియకుండా పండుకుని వుంటారు." అన్నది విద్య.

"ఇప్పుడు నాన్న దగ్గర ఎవరున్నాడు?"

"మామ్మ ఉంది. అమ్మ భోజనాలు ఏర్పాటు చేయడానికి వెళ్ళింది."

"అయితే అక్కడికి వెళ్ళుతాను, ఎలా ఉందో చూచి వస్తాను."

"అలాగేఉంది గాని కొంచెంసేపు కూర్చో అన్నయ్యా! అయితే పరీక్షలు పూర్తిగా అయిపోయినాయా?"

నవల్ నవ్వుతూ అన్నాడు: "అసలు పరీక్ష ఇప్పుడే ఆరంభమవుతున్నది విద్యా! బి.యే. పరీక్ష ఏముంది? అదో వినోదం. అన్నట్టు నీ పరీక్షసంగతి నీవు చెప్పనే లేదు."

"చెప్పేదేముందన్నయ్యా! బి.యే. ఫస్టియర్ నుండి సెకండియరుకు వచ్చాను."

అప్పుడే రుక్మిణి వచ్చి "అబ్బాయ్ నవల్, ఆయన పిలుస్తున్నారు నిన్ను" అని నవల్‌తో చెప్పింది.

"వస్తున్నానమ్మా! అని నవల్ వెంటనే గంగాప్రసాద్ గదిలోకి వెళ్ళాడు. నవల్‌ను గంగాప్రసాద్ పలకరించారు: "అబ్బాయ్ నవల్! కులాసాగా ఉన్నావా? పరీక్షల్లో ఎలా వ్రాశావు?"

"పరీక్షల్లో బాగానే వ్రాశాను నాన్నా! ఈసారి ఫస్టుక్లాసు రావచ్చు" అన్నాడు నవల్.

గంగాప్రసాద్ కొంచెంసేపు ఏక దృష్టితో తన కుమారుడివైపు చూచారు. తర్వాత నెమ్మదిగా అన్నారు: "లండన్‌లో నీకు ఉండడానికంతా ఏర్పాటు చేసేశాను. సెప్టెంబరు మొదటివారంలో నీవక్కడికి వెళ్ళాల్సి ఉంటుంది."

"ఇప్పుడు దానికి తొందరేముంది నాన్నా! ముందు నీకు నయమయితే, తర్వాతనే వెళ్ళుతాను." అన్నాడు నవల్.

"నాకు నయమవడమా? నవల్. నా జబ్బేమిటో నాకు తెలుసు. ఇది రాజ రోగం. ఇది నయమయ్యేది కాదు. నా రోగం కోసం ఇది నయమయేదాకా ఆగడంలో అర్థం లేదు. నేను నశించిపోతున్నాను. నేను నశించేలోగా నీవు వికసించాలని నా కోరిక."

గంగాప్రసాద్ మాటలో ఏదో నిస్సహాయత, నైరాశ్యం ధ్వనిస్తూ ఉంది. అంతకు ముందతనిలో వున్న దర్పం, అధికారం, గర్వం అన్నీ అతన్ని ఒక్కసారి వదలిపెట్టి ఎక్కడికో పోయినట్టు తోచింది. నవల్ గంగాప్రసాద్ మాటలకు ఏమీ సమాధానం చెప్పలేదు. గంగాప్రసాద్ కొంచెం నీరసంగా మళ్ళీ అన్నారు: "నవల్, నాకు జీవితంలో అన్ని విధాల భయంకరమైన పరాజయమే కలిగింది. ఈ హోదా, ఈ గొప్పతనం, ఈ పరువు, ఈ ప్రతిష్ట – ఇవన్నీ బాహ్యానటన. వీటిలో ఏమీలేదు. కాని ఏమైనా ఉంటే అది దేనిలోఉందో ఆ విషయం నాకు ఇంతవరకూ బోధ పడలేదు."

గంగాప్రసాద్ మాట్లాడడానికి చాలా ప్రయాసపడుతున్నారు. ఈ విషయం నవల్ గమనించగలిగాడు: "నాన్నా! ఇక నిద్ర పోవడానికి

ప్రయత్నించు. ఇలాంటి మాటవల్ల, ఈ నైరాశ్యంవల్ల మరింత శ్రమ కలుగుతుంది. నా వల్ల నీకు ఏవిధమైన అసంతృప్తి కలుగకుండా నేను ప్రయత్నిస్తాను. ఆ విషయమై నీకేమాత్రం సందేహమక్కరలేదు. ఇదిగో, మందు తీసుకో వేళ అయింది."

"ఇయ్యి. మందు తీసుకోవడం నా ధర్మం-మందు తీసుకున్నందువల్ల ఏమీ ప్రయోజనం లేదని నాకు తెలుసును గనక. మందు తీసుకున్న తర్వాత నిద్రపోవడానికి ప్రయత్నించడం కూడా నా ధర్మమే-నిద్ర పట్టదని నాకు తెలుసు గనక. ఒకవేళ నిద్రపట్టినా ఒక క్షణంలో మెలకువ వస్తుంది. ఆ క్షణంలో కూడా ఏదో పీడ కల."

గంగాప్రసాద్‌కు మందు, ఆహారం ఇచ్చి నవల్ గదిలోనుంచి బయటకు వచ్చేసరికి రాత్రి చాల పొద్దుపోయింది. వేసవికాలం అవడంవల్ల బయట వేడిగా ఉంది. విద్య వరాండాలో కూర్చుని అన్నగారి కోసం ఎదురు చూస్తూ ఉన్నది. నవల్ రాగానే "అన్నయ్యా! పద అన్నం తిను వెళ్ళి" అని అన్నదామె.

"వెళ్తున్నాను" అని కూర్చున్నాడు నవల్. నలువైపుల మాటు మణగింది. పంచమినాటి చంద్రుడు ఆకాశంలో క్రమంగా క్రిందికి వెళ్ళి పోతున్నాడు. అప్పుడు చాలా దూరంలో ఉన్న మఱ్ఱిచెట్టు పైన ఉన్నాడు. నవల్ విద్యకు ఆ చంద్రుణ్ణి చూపిస్తూ అన్నాడు: "విద్యా! చూచావా ఆచంద్రుణ్ణి - ఎంత తేజోహీనంగా ఎంత కాంతిహీనంగా, ఎంత బలహీనంగా కనిపిస్తున్నాడో! నెమ్మదిగా ఆకాశం నుండి క్రిందికి దిగి పోతున్నాడు. అతని కాంతి క్షీణించి పోతున్నది."

"చూస్తున్నానన్నయ్యా! ఈ చంద్రుడిలా అస్తమించి పోతాడు అయితే నేం. మళ్ళీ రేపు ఇదే చంద్రుడు ఉదయిస్తాడు; ఇంతకంటే ఎక్కువగా ప్రకాశిస్తాడు. అతనిలో ఇంకా ఎక్కువ కాంతి ఉంటుంది." అన్నది విద్య.

నవల్ నైరాశ్యంతో అన్నాడు: "అవును నిజమే. కాని అది రేపటి మాట. నాకు కావలసినది ఈ రోజు, ఈ క్షణం."

"అన్నయ్యా! మన జీవితమంతా 'రేపు' అనేదాని మీదనే ఆధారపడి ఉన్నది. 'రేపు' అనే ఆశ మనకు లేకపోతే 'నేడు' అనేది ఎంత భయంకరంగా ఉంటుందో, ఎంత అసహ్యం అయిపోతుందో చెప్పడానికి వీల్లేదు."

"నీవు చెప్పేది నిజమే కావచ్చు విద్యా!" అంటూ నవల్ మళ్ళీ ఆకాశం వైపు చూచాడు. చంద్రుడిప్పుడా మఱ్ఱిచెట్టు చివరి కొమ్మపైకి వచ్చాడు. చంద్రుడస్తమించడం ఇప్పుడు నవల్ చూస్తున్నాడు. మెల్ల మెల్లగా చంద్రబింబం పూర్తిగా చెట్టుక్రిందకి వచ్చేసింది. కొంచెంసేపు ఆ మఱ్ఱిచెట్టు సందులోనుండి చంద్రకాంతి వడపోసినట్టు వచ్చింది. ఇప్పుడది కూడా లోపించింది. ఇప్పుడతని యెదుట నిర్భేద్యమైన, అంధకారం మాత్రమే ఉంది. నవల్ లేచి నిలుచున్నాడు. 'పద విద్యా' అన్నాడు.

రెండు

గంగాప్రసాద్ అడిగాడు: "నవల్! జ్ఞాన్ మావయ్య దగ్గరి నుండి ఏమన్నా కబురందిందా? ఫారిన్ నుండి ఎప్పుడు వస్తున్నాడు?"

"మే చివరి వారంలో రావాలి. ఏం ఆయనతో ఏమన్నా పని ఉందా?"

"లేదు. ఊరికనే అడిగాను. రెండు సంవత్సరాలయింది అతన్ని కలుసుకుని. అప్పుడప్పుడు ఆయన మాట జ్ఞాపకం వస్తూంది."

అదే సమయంలో జ్వాలా ప్రసాద్ డాక్టరు శేర్వుడ్‌ను వెంట పెట్టుకొని గదిలోకి వచ్చారు. డాక్టరు శేర్వుడ్ గంగాప్రసాద్ శరీరాన్ని బాగా పరీక్ష చేసి చాలా గంభీరంగా అన్నారు: "పరిస్థితిలో ఎక్కువ మార్పు కనిపించ డంలేదు. ఎండలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ఎక్కడికైన చల్లని ప్రదేశా నికి తీసుకు వెళ్ళాలి."

"మీరు చెప్పింది నిజమే డాక్టరుగారూ!" అన్నాడు గంగాప్రసాద్.

డాక్టరు శేర్వుడ్ జ్వాలా ప్రసాద్ వైపు తిరిగారు: "భువాలీ శానిటోరియంకు వ్రాసి అక్కడ ఒక కాటేజి ఏర్పాటు చేయిస్తాను. సెప్టెంబరు దాకా అక్కడ ఉంటే ఈయనకు పూర్తిగా ఆరోగ్యం చేకూరుతుంది."

"భువాలీ శానిటోరియమా! అయితే మా వాణ్ణి అక్కడకి తీసు

కెళ్ళాలా? మరోచోట ఎక్కడా మా వాడికి ఏర్పాటు చేయడం సాధ్యం కాదూ?" అని మెల్లగా అన్నారు జ్వాలా ప్రసాద్.

"ఏర్పాటు చేయడానికేం, ఎక్కడైనా చేయవచ్చు. కాని వైద్య సౌకర్యాలు అక్కడే దొరుకుతాయి."

జ్వాలా ప్రసాద్‌కూ, డాక్టరు శేర్వుడ్‌కు మధ్య జరుగుతున్న సంభాషణ గంగాప్రసాద్ మౌనంగా వింటున్నాడు- వానిలో అతని కేమి అభిరుచి లేని వాడు లాగా. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తర్వాత గంగాప్రసాద్ నవల్‌తో అన్నాడు: "నవల్, భువాలీయే బాగుంటుందని చెప్పు తాతయ్యకు. అక్కడ ట్రీట్‌మెంటు బాగా జరుగుతుంది. మీరెవ్వరూ నాకూడా ఉండాల్సిన పని కూడ ఉండదు."

"నీ వక్కడ ఒంటిరిగా ఎలా ఉంటావు నాన్నా? డాక్టరు శేర్వుడ్ కాటేజీ ఏర్పాటు చేయమని కూడా వ్రాశారు. నీతో నేను కూడా వస్తా నక్కడకి."

"నీవు నాతో వస్తావా? వద్దు బాబూ! నీవు ఇంగ్లండు వెళ్ళాలి. మీ తాతయ్య నాతో వస్తారు."

"నీకు పూర్తిగా నయమయ్యే వరకు నేను ఇంగ్లండు వెళ్ళడం లేదు నాన్నా" అన్నాడు నవల్ చాలా గట్టిగా.

గంగాప్రసాద్ మళ్ళీ మాటలు పెంచలేదు. ఆయన కండ్లు మూసుకున్నాడు. నవల్ గదిలోనుంచి బయటికి వచ్చాడు. అతను చాలా దిగులుగా ఉన్నాడు. వాళ్ళ నాన్న చెప్పిన మాట నిజమే. ఆయనకు రాజరోగం వచ్చింది. మీర్జాపూర్ నుండి అలహాబాదు, అలహాబాదు నుండి భువాలీ!

గంగాప్రసాద్ అలహాబాదు నుండి వచ్చి దాదాపు ఒక నెలరోజులయింది. కాని ఈ నెలరోజుల్లో ఆయన పరిస్థితి క్రమంగా క్షీణిస్తూనే ఉంది. ఆయన శరీరం కృశించి కృశించి అస్థిపంజరం అయిపోయింది. ఇప్పుడాయనకు లేచి తిరగడం గూడా శ్రమగా ఉన్నది. నవల్ గంగాప్రసాద్ పరిస్థితి చూస్తూనే ఉన్నాడు: లోలోపల కుమిలిపోతున్నాడు. కాని అతను చేయ గలిగిందేమున్నది? అతను గదిలోనుంచి బయటకు వచ్చేసరికి ఎండ చాలా తీవ్రంగా ఉంది. వరండాలోనుంచి జ్వాలా ప్రసాద్ రావడంచూచి

అతను ఆగిపొయ్యాడు. జ్వాలా ప్రసాద్ డాక్టరు శేర్వుడ్‌ను పంపించి తిరిగి వస్తున్నారు.

"ఏం తాతయ్యా, ఏమయింది?" అని అడిగాడు నవల్ జ్వాలా ప్రసాద్ ముఖంలో విషాద రేఖలను గమనిస్తూ.

"బాబూ! భగవంతుడు కాపాడాలి. భువాలీ వెళ్ళక తప్పదు మీ నాన్నకు. అక్కడికి వెళ్ళిన వాళ్ళల్లో నయమై తిరిగి వచ్చినవాళ్ళు చాలా కొద్దిమంది. డాక్టరు కూడా ఎక్కువ ధైర్యం చెప్పడం లేదు." అన్నారు జ్వాలా ప్రసాద్ గద్గద కంఠంతో.

"భువాలీ ఎప్పుడు వెళ్ళాలి తాతయ్యా!" అని అడిగాడు నవల్.

"వచ్చే వారానికల్లా వెళ్ళాలి. రేపో ఎల్లుండో కాటేజి ఏర్పాటు చేయడం అవుతుంది. గంగూ నిద్రపోతున్నాడా!"

"లేదు. పండుకొని ఉన్నాడు. రా పోదాం."

నాల్లిద్దరు రాగానే గంగాప్రసాద్ కండ్లు తెరిచాడు. "వచ్చే వారాని కల్లా నీవు భువాలీ చేరుకోవాలని డాక్టరుగారు అంటున్నారు. ఆయన కాటేజి కోసం వ్రాశారు, ఒక టెలిగ్రాం కూడా ఇచ్చేశారు." అన్నారు జ్వాలా ప్రసాద్.

"అలాగే" అన్నారు గంగాప్రసాద్: "కాని నాతో కూడా ఎవ్వరూ రావాల్సిన పనిలేదు. భీఖూను తీసికొనివెళుతాను."

"అదెలా కుదురుతుంది. నాయనా! నీకు పథ్యం పానం అక్కడ ఎవరు చేసి పెడతారు? మీ అమ్మా, నేనూ వస్తాం. రుక్మిణి ఇక్కడ పిల్లల్ని చూచు కుంటూ ఉంటుంది." అన్నారు జ్వాలా ప్రసాద్.

నవల్ అందుకున్నాడు: "లేదు తాతయ్యా! నాయనమ్మ, నేనూ వెళతాం. నీవిక్కడనే ఉండాలి. ఇంటి సంగతి చూచుకోవాలి గదా!"

గంగాప్రసాద్ నవల్ వైపు చూచాడు – ఆత్మవిశ్వాసం, సామర్థ్యం గల తన కుమారుణ్ణి, భావికి ఆశాజ్యోతి! ముఖంలో నవ్వు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: "అవును నాన్నా! నవల్ చెప్పే మాట బాగానే ఉంది. నాతో వాడు రావడమే బాగుంటుంది. జులైలో నీవు వస్తే వాడు తిరిగి వచ్చి చదువు సంగతి చూచుకుంటాడు."

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పలేకపోయారు. అంటువ్యాధులకు నిలయమైన ఆ శానిటోరియంలో నవల్ వెళ్ళి ఉండడం ఆయనకు ఇష్టం

లేదు. కాని ఆ మాట అనడానికి ఆయనకు ధైర్యం చాలడంలేదు. ఆయన కడుపున బుట్టిన కుమారుడే ఆ భయంకరమైన వ్యాధితో బాధ పడుతున్నాడు గదా! మరి ఏం చెపుతాడు, ఎవరితో చెపుతాడు! మాట్లాడకుండా దీనంగా గదిలోకి వెళ్ళారు. ఆయన వెళ్ళిన తర్వాత గంగాప్రసాద్ నవల్‌తో అన్నారు: “నవల్, భువాలీ వెళ్ళడానికి సిద్ధంగా ఉండు. ఇక్కడ ఎండలకు నేను తట్టుకోలేకుండా ఉన్నాను. చనిపోవడం ఖాయమైనప్పుడు సుఖంగా అక్కడే పోతాను.”

“అలా అనకు నాన్నా! అక్కడ నీకు నయమై పోతుంది. అంత నిరాశ పడవలసిన అవసరం లేదు.”

“లేదు, నిరాశ పడడం లేదు. ప్రపంచం ఆశతోనే నడుస్తున్నది. ఊరకే అలా అన్నాను.” అన్నాడు గంగాప్రసాద్.

మూడోరోజుకల్లా భువాలీలో గంగాప్రసాద్ ఉండడానికి, వైద్య సహాయానికి ఏర్పాటు జరిగింది. ఆరోజు ఉదయాన్నుండీ వడగాలి కొడుతూ ఉంది. గంగాప్రసాద్‌కు ఆయాసం హెచ్చుతూ ఉంది. ఆయన నవల్‌కు చెప్పారు: “సోమవారం నాటికి సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో బరేలికి రిజర్వు చేయించు. బరేలినుండి కాఠ్‌గోదాం వరకు రిజర్వేషన్ కోసం టెలిగ్రాం కూడా ఇప్పించు. సాయంత్రం ఏ ఆరుగంటలకో స్టేషనుకు వెళ్ళి ఈ పని చేయించు. ఇక ఇక్కడ ఆట్టే ఎక్కువ రోజులు ఉండడం అనవసరం.”

సాయంత్రం నవల్ స్టేషనుకు వెళ్ళాడు. రిజర్వేషను చేయించి స్టేషను నుండి తిరిగి వచ్చేసరికి అతనికి కొంత బరువు తీసినట్టు ఉంది. అనుకోకుండా అతని సైకిలు రాయ్‌బహాదుర్ కామతానాథ్‌గారి ఇంటివైపు వెళ్ళింది.

రాయ్‌బహాదుర్ కామతానాథ్ లోపల తోటలో కూర్చుని ఒంటరిగా ఏదో చదువుకుంటున్నారు. నవల్ కనిపించగానే ఆయన పలకరించారు: “అరే ఏవా నవల్! చాలా రోజులకు కనిపించావ్. ఎలా ఉంది మీ నాన్నగారికి?”

“డాక్టరు భువాలీ వెళ్ళమని చెప్పారాయనికి. ఇక్కడేమీ నయమవడం లేదు.”

“ఇక్కడేం నయమవుతుంది! చుస్తూన్నావుగా ఎండలెంత తీవ్రంగా ఉన్నాయో! మే ఆరవ తేది షిప్‌లో రిజర్వేషను దొరికింది. అందుకని మే

మూడవ తేదీ ఇక్కడ బయలుదేరి బొంబాయి వెళ్ళాలి. ఇవ్వేళ ఏప్రిల్ ఇరవై రెండు. నీవు కూడా మే మూడో తేదీ ఇక్కడ బయలుదేరే ప్రయత్నంలో ఉండు. మూడు బర్తులు బుక్ చేయించాను. నాకూ, ఉషకూ, నీకూ."

"మీతో నేను రావడం పడదు. సోమవారం నేను నాన్నగారితో భువాలీ వెళుతున్నాను."

"నీవు భువాలీ వెళుతున్నావా? గంగాప్రసాద్ భువాలీకి నిన్నెలా తీసుకు వెళుతున్నాడు?" అన్నారు రాయ్‌బహాదుర్ ఆశ్చర్యంగా: "అదంతా కుదరదు. నీవు మాతో స్విట్జర్లండు వెళ్ళడం ఖాయం. గంగా ప్రసాద్‌తో కూడా జ్వాలా ప్రసాద్ వెళతారు."

అదే సమయంలో లోపలినుండి ఉష వచ్చింది. నవల్‌ను చూడగానే ఆమె అనేసింది: "వచ్చారా నవల్ బాబూ! మే ఆరోతేదీ షిప్‌లో మనం వెళ్ళాలని బొంబాయి నుండి నిన్ననే నాన్నగారికి ఉత్తరం వచ్చింది. మే మూడో తేదీ మనం బొంబాయికి ప్రయాణం కావాలి."

నవల్ చాలా దీనంగా అన్నాడు. "నేను మీతో రావడం సాధ్యం కాదు ఉషా! నాన్నగారి అనారోగ్యం వల్ల పరిస్థితి అంతా తారుమారయింది. డాక్టర్లు ఆయన్ని భువాలీ తీసుకు వెళ్ళమని చెప్పారు. నేనాయనతో భువాలీ వెళుతున్నాను."

"ఏ పరిస్థితిలో కూడా మీరు క్షయ రోగంతో నిండిన ఆ భువాలీ శానిటోరియానికి వెళ్ళడానికి వీల్లేదు. మీ నాన్న నిన్ను కూడా తీసుకు వెళ్ళడానికి ఎలా ఒప్పుకున్నారో నాకు ఆశ్చర్యంగా ఉంది. అదిగాక నీవు ఇంగ్లండు వెళ్ళి ఐ. సి. యస్. పరీక్షకు చదవాల్సిన వాడివి."

"దానికింకా చాలా వ్యవధి ఉంది" అన్నాడు నవల్ కిశోర్: "మే, జూన్ నేను నాన్నగారి దగ్గర ఉంటాను. ఆ తర్వాత మా తాతయ్య అక్కడికి వస్తారు."

ఇక ఉష నవల్‌ను సమాధానపరచడానికి ప్రయత్నించింది: "మీరు మా కూడా వస్తారని నే నెంతో ఆశపడ్డాను. కష్టాలనేవి అందరికీ వస్తాయి. కాని కష్టాల్లో మునిగిపోవడం అవివేకమయిన పని. ఇక్కడ ఉన్నందువల్ల మీ నాన్నగారికి నయమవుతుందని కానీ ఫారిన్ వెళ్ళినందువల్ల నయంకాదని గానీ చెప్పడానికి వీల్లేదు. మాతోకనక మీరు రాకపోతే ఇక మీరు వెళ్ళడమే పడకపోవచ్చు."

నవల్ ఉష వైపు చూచాడు. ఆమె ముఖంలో ఏ విధమైన సానుభూతి కూడా కనిపించలేదు. నవల్‌కు తటస్థించిన ఆపదకు ఆమె ఆవంత కూడా చలించలేదు. నవల్ ఉద్విగ్నుడయ్యాడు: "అవును ఉషారాణీ! బహుశా నా ప్రయాణం ఆగిపోవచ్చు. ఆ విషయం నాకు తెలుసు. కాని మా నాన్నగారిని ఇలా అనారోగ్య పరిస్థితిలో వదలి నేనెలా వెళ్ళగలను? ఈ సమయంలో నేనాయన దగ్గర లేకపోతే ఆయన కెంత కష్టంగా ఉంటుందో కొంచెం ఊహించు. మమకారాన్ని అధిగమించి మన మెలా ఉండగలం?"

రాయ్ బహాదుర్ కామతానాథ్ సమాధానం చెప్పారు: "నేను చెపుతున్నాను గదా! ఈ మమకారమే నిన్ను నాశనం చేసేస్తుంది నవల్. నాకు తెలుసు నిన్ను భువాలీ వెళ్ళమని జ్వాలా ప్రసాద్ గానీ గంగా ప్రసాద్ గానీ చెప్పి ఉండరు. వాళ్ళు వద్దనే చెప్పి ఉంటారు. అవునా?"

"నేను వెళ్ళడం తాతయ్య కిష్టంలేదు. కాని నాన్న నన్ను రావద్దని చెప్పలేదు."

రాయ్‌బహాదుర్ కామతానాథ్ చాలా కర్కశంగా అన్నారు: "మీ నాన్నగారికి మతి చెడిపోయింది. ఈ వ్యాధివల్ల ఆయనకు మనస్తిమితం ఉన్నట్లు లేదు. ఆయనతో నేను మాట్లాడుతాను. నీవు మాతో స్విట్జర్లాండు వచ్చినా, రాకున్నా భువాలీ వెళ్ళడం మాత్రం మంచిది కాదు. కనీసం దాన్ని ఆపడానికైనా నేను ప్రయత్నిస్తాను. ఇది అంటువ్యాధి. నీవు మీ నాన్నకు దూరంగా ఉండాలి."

రాయ్‌బహాదుర్ కామతానాథ్ అన్న మాటలకు నవల్ చాల బాధ పడ్డాడు. తన తండ్రికి తను దూరంగా ఉండాలి, ఎందుకంటే ఆయనకు అంటువ్యాధి వచ్చింది. కన్న కొడుకే తండ్రి దగ్గర ఉండటానికి ఇష్ట పడకపోతే మరి ఆయన దగ్గర ఇంకెవరుంటారు? ఇదేనా లోకనీతి? ఇదేనా లోకాచారం? గద్గద కంఠంతో నవల్ అన్నాడు: "మామయ్యా! నేను మా నాన్నకు దూరంగా ఉండాలని చెబుతున్నారా మీరు? ఇంతటి మహా పాతకం చేయమని నాకు సలహా చెపుతున్నారా? మరి అలాంటప్పుడు ప్రపంచంలో ఆత్మీయులెవరుంటారు? అలాంటి ప్రపంచం ప్రపంచంకాదు, నరకమవుతుంది. వీల్లేదు. అలా చెయ్యడానికి వీల్లేదు. చివరివరకు నేను నాన్న దగ్గరనే ఉంటాను. సోమవారం నేను ఆయనతో వెళుతున్నానని

చెప్పడానికే ఇక్కడికి వచ్చాను. ఇక నేను వెళ్లుతాను. నాన్నగారు నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు.''

ఉష నవల్‌ను ఆపింది : "కొంచెంసేపు కూర్చోండి. ఎన్నాళ్ళ తర్వాతనో వచ్చారు. విద్య కూడా వచ్చిందనుకొంటాను. బనారస్ చదువు కోడానికి వెళ్ళిన తర్వాత మళ్ళీ మేము కలుసుకోలేదు. ఆమెను చూడాలని అనిపిస్తున్నది.''

"నాన్నగారి అనారోగ్యం వల్ల దానికి కూడా తీరడంలేదు. ఇరవైనాలుగు గంటలూ ఆయనకు ఉపచారం చేస్తూనే ఉంటుంది. దానికి నేను చెపుతాను. కాని ఆ రోగాల కొంపకు నీవు రావడం మామయ్యకిష్టం కాక పోవచ్చు. మేము సోమవారం వెళ్ళిపోయాక విద్య తీరికగానే ఉంటుంది.''

నవల్ మాటల్లో ఉన్న వ్యంగ్యాన్ని ఉష గమనించలేక పోయింది. కాని రాయ్‌బహాదుర్ కామతానాథ్ అర్థం చేసుకున్నారు : "రేపో, ఎల్లుండో, నేను ఉషను తీసుకుని వస్తాను. ఉష రావాలనుకుంటున్నదని. విద్యకు చెప్పు.'' మళ్ళీ ఉష వైపు తిరిగి అన్నారు: "చూడమ్మా. భోజనం తయారయి ఉంటుంది. నవల్‌ను భోం చెయ్యందే వెళ్ళనియ్యకు.''

రాయ్ బహాదుర్ కామతానాథ్ గారి ఇంట్లో నవల్‌కు ఎందుకో చిరాకుగా ఉంది. అతడు లేచి నిలబడ్డాడు: "క్షమించండి మామయ్యగారూ! నాన్నగారు నాకోసం ఎదురు చూస్తూ ఉంటారు. అందువల్ల నేనిక్కడ భోంచెయ్యడానికి వీల్లుండదు.'' అని నవల్ వెళ్లిపోయాడు.

నవల్ ఇంటికి తిరిగి వచ్చేసరికి అతని ముఖంలో దైన్యం కనిపిస్తూ ఉంది. కామతానాథ్ గారింట్లో జరిగిందంతా అతనికి చాలా కటువుగా తోచింది. దాని కతను లోలోపల కుమిలి పోతున్నాడు. అతని విషాదాన్ని గమనించి విద్య పలకరించింది: "ఎందుకన్నయ్యా! అలా దిగులుపడి ఉన్నావ్? ఎక్కడికి వెళ్ళావ్?''

"ఉష వాళ్లింటికి వెళ్ళాను విద్యా! నిన్నడిగానని చెప్పమన్నది. నిన్ను చూచి చాల రోజులయిందని అనుకొంటున్నది.''

"ఏం చెయ్యనన్నయ్యా! ఇక్కడికి వచ్చినప్పటి నుంచి నీవు చూస్తూనే ఉన్నావు కదా పనిలో మునిగి తేలుతూ ఉన్నాను. మీరు ఘవాలీ వెళ్ళిన తర్వాత కొంచెం తీరిక చూచుకొని వెళ్ళివస్తాను. కాని ఇందులో నీవు దిగులు పడాల్సిందేముంది ?''

"లేదు. దీనికోసం నేను దిగులు పడడం లేదు." అని కొంచెంసేపు ఆగి మళ్ళీ అన్నాడు నవల్: "కామతానాథ్‌గారు నాతో ఒక మాట అన్నారు. నాన్నగారిని వదలిపెట్టి నే నాయనతో ఫారిన్ వెళ్ళాలట! స్విట్జర్లాండు వెళ్ళడానికి నాకు కూడా టిక్కెట్టు కొన్నారట."

విద్య నివ్వెరపోయింది: "అయితే మరి నీవు వెళ్ళుతున్నావా అన్నయ్యా! ఆయనతో కూడా?"

"ఎంత పిచ్చిదానవమ్మా" అని నవల్ నవ్వాడు: "నాన్నగారిని వదలి పెట్టి నేనాయనతో ఫారిన్ వెళ్ళతానా? అలా వీల్లేదని చెప్పి వచ్చాను. కాని ఆయన అలా మొండిపట్టు పట్టడం నాకు చాలా ఆశ్చర్యకరంగా ఉంది."

విద్య కండ్లు చెమర్చాయి: "రానని చెప్పి వచ్చావు గదా అన్నయ్యా! నీవలా అంటావని నాకు తెలుసు. జబ్బు పడింది మన నాన్నగారు గదా, వాళ్ళకి మన అవస్థ ఎలా అర్థమవుతుంది? అక్కడ నీవు భోంచేసినట్టు లేవు. పద అన్నయ్యా! భోంచేస్తుగాని."

శనివారంనాడు ప్రొద్దున్నే ఖవాలీ ప్రయాణానికి కావల్సిన వస్తువులు కొనుక్కురావడానికి బజారువెళ్ళారు. కొనాల్సిన సామాన్లు అట్టే ఎక్కువగా లేకపోవడం వల్ల పది గంటలకల్లా తిరిగి వచ్చాడు. అతను ఇంటికి తిరిగి వచ్చేసరికి డ్రాయింగు రూములో రాయ్‌బహాదూర్ కామతానాథ్ గారి మాటలు వినిపించాయి. ఆయన జ్వాలా ప్రసాదుతో అంటున్నారు: "మీ వంటి పెద్దవాళ్ళు ఇలా ఆలోచన లేని పని ఎలా చేయగలరు? గంగా ప్రసాద్‌తో పాటు ఖవాలీకి నవల్‌ను పంపిస్తే ఏమవుతుందో మీరాలోచించారా?"

జ్వాలా ప్రసాద్ చాలా హీన స్వరంతో సమాధానం చెపుతున్నారు: "నేను వాడికెంతో చెప్పి చూచాను రాయ్‌బహాదూర్ గారూ! కాని వాడు నా మాట వింటేగా! గంగూకు కూడా వాడి మీద అంత మమకారం ఎందుకో తెలియదు. మరి గంగూతో ఈ విషయమంతా చెప్పడం నాకు ఇష్టంలేదు."

"అవును, మీకి విషయం అతనితో చెప్పడం ఇష్టం లేదు. కనక మీరీ మెత్తనంతో కుటుంబాన్ని నాశనం చేయాలను కొంటున్నారు. నన్నడిగితే నవల్ ఖవాలీ వెళ్ళడానికి ఎంత మాత్రం వీల్లేదు. ఒక ఆపద రానే వచ్చింది. కాని రెండోది తప్పించుకోవడానికి అవకాశం ఉంది."

"ఈ ఆపదను ఎలా తొలగించుకోవాలో నాకు బోధపడడం లేదు." అన్నారు జ్వాలా ప్రసాద్ తానేమీ చేయలేక పోతున్నట్టు.

"అదే నేను చెపుతున్నాను. మేము స్విట్జర్లాండు వెళుతున్నాం. నవల్‌ను మేము మా కూడా తీసుకు వెళతాం. అక్కడినుండి అతను ఇంగ్లండు వెళతాడు."

జ్వాలా ప్రసాద్ సంకోచిస్తూ అన్నారు: "రాయ్ బహాదూర్ గారూ గంగాప్రసాద్ స్థితి మీరు చూస్తూనే ఉన్నారు. ఎంత కాదన్నా ఇంగ్లండు వెళ్ళడానికీ అక్కడ ఉండడానికీ ఎంతో ఖర్చవుతుంది. మరి ఆ సంగతి ఈ పరిస్థితిలో గంగాప్రసాద్‌తో ప్రస్తావించడం భావ్యం కాదు."

రాయ్‌బహాదూర్ కామతానాథ్ బిగ్గరగా నవ్వారు. "బాబుగారూ! నవల్ గంగాప్రసాద్ గారి అబ్బాయి అంటే ఒకటీ మా పిల్లవాడంటే మరొకటీనా? నేను నవల్‌ను మీ డబ్బు పెట్టి తీసుకు వెళతానను కొన్నారా! ఇంగ్లండు వెళ్ళడానికీ, అక్కడ ఉండి చదువుకోడానికీ, అక్కడినుండి తిరిగి రావడానికి – అయ్యే ఖర్చంతా నేనే భరిస్తాను."

జ్వాలా ప్రసాద్ మనస్సు కుదుట పడింది: "అయితే మీరు గంగా ప్రసాద్‌కు చెప్పి చూడండి. నవల్ నా మాట వినేవాడు కాదు. గంగూ చెపితే కాదనడు. నేను గంగూకు మీరు వచ్చిన సంగతి చెపుతాను."

రాయ్‌బహాదుర్ కామతానాథ్ జ్వాలా ప్రసాద్‌తో పాటు గంగాప్రసాద్ గదిలోకి ప్రవేశించారు: గంగాప్రసాద్ పాలిపోయిన చిరునవ్వుతో రాయ్‌బహాదుర్ కామతానాథ్‌ను ఆహ్వానించారు: "రండి రాయ్‌బహాదుర్ గారూ! ఇలా దయచేశారు?"

రాయ్‌బహాదుర్ గంగాప్రసాద్ మంచానికి కొంచెం దూరంగా కుర్చీలో కూర్చున్నారు. తర్వాత గొంతు సరిచేసికొని అన్నారాయన: "ఎల్లుండి మీరు భువాలీ వెళ్ళుతున్నారట! మీరీపని ముందెప్పుడో చేసి ఉండాల్సింది. ఇంత ఎండల్లో మందు ఎలా పట్టుతుంది?"

"డాక్టరు కూడా అదే అన్నారు. సెప్టెంబరు దాకా అక్కడ ఉండమని ఆయన చెప్పారు." అని సమాధానం చెప్పారు గంగాప్రసాద్.

"అవును, కనీసం సెప్టెంబరు దాకా అక్కడ ఉండడం మంచిది. నయమైన తర్వాత కూడా కొన్ని సంవత్సరాల వరకు వేసవికాలమంతా

మీరు చల్లని ప్రదేశాల్లోనే గడపడం అవసరం. ఇది చాలా కఠినమైన వ్యాధి. దీనికి స్వచ్ఛమైన గాలి, తగిన విశ్రాంతి—ఇవే మందులు."

కొంచెంసేపు ఆగి కామతానాథ్ మళ్ళీ సంభాషణ సాగించారు: "కలెక్టరు గారూ! నవల్‌ను గురించి నాకు ఆలోచనగా ఉంది. నేను స్విట్జర్లాండు వెళ్ళుతున్నాను. అతను ఐ. సి. యస్. కు ఎటూ ఇంగ్లండు వెళ్ళాలికదా! అక్కడినుండే అతను ఇంగ్లండు వెళ్ళవచ్చును. అతని చదువును గురించీ దీనికయ్యే ఖర్చును గురించీ మీరేమి ఆలోచించకండి. అతను మీ పిల్లవాడె లాగో అలాగే మా పిల్లవాడని అనుకోండి. ఖర్చు సంగతి నేను చూచుకుంటాను."

జబ్బు పడ్డ తర్వాత గంగాప్రసాద్ ముఖంలో తొలిసారి సంతోషం కనిపించింది—కామతానాథ్ మాటలకు. గంగాప్రసాద్‌కు ఈ జబ్బు వచ్చినప్పటి నుంచి ఇంటి పరిస్థితిని గురించి చాలా విచారంగా ఉంది. ఆయన సంపాదించినన్నాళ్ళూ వచ్చింది వచ్చినట్టు రేపనే మాట లేకుండా ఖర్చు పెట్టేశారు. అవసానకాలం సమీపించేసరికి అసలు పరిస్థితి ఆయనకు బోధపడింది.

రాయ్‌బహాదుర్ కామతానాథ్‌తో ఆయన తడబడుతూ అన్నారు: "అలాగే, నవల్‌ను మీతో తీసికొని వెళ్ళండి. మా నాన్నగారున్నారుగదా నా దగ్గర. నవల్‌కు ఉషనిచ్చి చేద్దామని మీరు నిర్ణయించుకొన్న నాడే నవల్ మీ పిల్లవాడయ్యాడు!" ఆ తర్వాత గంగాప్రసాద్ తన తండ్రివైపు చూచి అన్నారు: "నవల్‌ను కొంచెం ఇలా పిలవండి, వాడితో చెబుతాను."

జ్వాలా ప్రసాద్ నవల్‌ను పిలుచుకు వచ్చారు: నవల్ తన తండ్రి ఎదుట నిలబడి "నన్ను పిలిచారా నాన్నా?" అన్నాడు.

"నవల్! రాయ్‌బహాదుర్ కామతానాథ్ ఉషను కూడా తీసుకొని స్విట్జర్లాండు వెళ్ళుతున్నారు. ఆయన నీకు కూడా ప్యాసేజి బుక్ చేశారు." అన్నారు గంగాప్రసాద్.

"అవును, నాకు తెలుసు." అన్నాడు నవల్.

"నీవు ఈయనతో వెళ్ళు. అక్కడినుండే ఇంగ్లండు వెళ్ళవచ్చు."

"అవును, నేనా సంగతి విన్నాను. అంతేకాదు, నేను ఫారిన్ వెళ్ళేందుకయ్యే ఖర్చంతా రాయ్‌బహాదుర్ గారు భరిస్తారనే విషయం కూడా నాకు

తెలుసు. కాని నేను మీతో భువాలీ వెళ్ళాలి. మీకు నయమైన తర్వాత ఏం చెయ్యాల్సిందీ ఆలోచిస్తాను.''

నవల్ చెప్పిన సమాధానం గంగాప్రసాద్‌కు తప్పుగా తోచలేదు. ఆయన కామతానాథ్ వైపు చూచి అన్నారు: ''వింటున్నారు గదా మావాడన్నమాట. మీరే నచ్చ చెప్పండి.''

''కామతానాథ్ నవల్ వైపు చూదారు: ''నవల్! అలా మొండిపట్టు పట్టగూడదు. ఇది నీ 'కెరియరు' కు సంబంధించిన ప్రశ్న.''

నవల్ శాంతభావంతో సమాధానం చెప్పాడు: ''మామయ్యా! 'కెరియర్' అనేది జీవితంలో ఆత్మీయతకూ మమకారాలకూ మించింది కాదు. నాన్న గారిని ఈ స్థితిలో వదలి వెళ్ళడం నాకు ఊహించడానికి కూడా సాధ్యం కాదు. మీరు నా కర్తవ్య నిష్ఠను చెడగొట్టాలని అనవసరంగా ప్రయత్నిస్తున్నారు. నేను వెళ్ళనని చెప్పేశాను, అంటే నేను వెళ్ళననే దాని కర్థం.''

నవల్ మొండిపట్టు చూచి కామతానాథ్‌కు కోపం వచ్చింది : ''నవల్! శాస్త్రాల్లో చెప్పనే చెప్పారు – ''వినాశకాలే విపరీత బుద్ధి'' అని. నేను చెప్పాల్సింది చెప్పాను.'' అంటూ ఆయన లేచి నిలబడ్డారు.

కామతానాథ్ అన్న మాటలకు నవల్ తగిన సమాధానం చెప్పలేక పోలేదు. చెప్పాలని అనిపించింది కూడా అతనికి. కాని సంయమంతో అన్నాడు : ''మీరు చెప్పిన మాట నిజమే. కాని ఈ ఆపత్కాలంలో నా బుద్ధి నాకు మేలు చేయగలదనే అనుకోవాలి. కన్న తండ్రికి నన్ను దూరం చేయాలని మీరు చేసే ప్రయత్నం ప్రశంసించ దగినది కాదు. ఇక నా భవిష్యత్తును గురించి అంటారా, ఐ.సి.యస్. కాక పోయినా నేను జీవించి ఉండగలను.'' అంటూ నవల్ త్వరత్వరగా ఇంట్లోకి వెళ్ళి పొయ్యాడు.

గంగాప్రసాద్ కామతానాథ్‌ను శాంతపరచడానికి ప్రయత్నించారు : ''వాడి మాటలను మీరు అపార్థం చేసికోకండి రాయ్‌బహాదుర్‌గారూ! వాడికి నా మీద ఎంతో మమకారం. జులై-ఆగస్టు నాటికి వాణ్ణి నేను ఇంగ్లండు తప్పకుండా పంపుతాను. అందులో మీకు సందేహమక్కర్లేదు.''

నవల్ పగలంతా భువాలీవెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. సాయంత్రానికి అతను గంగాప్రసాద్ గదిలోకి వెళ్ళేసరికి గంగాప్రసాద్ అతన్ని

కూర్చోమని అన్నారు: "నవల్! ఈ రోజు నాకు ఒంట్లో కొంచెం తేలికగానే ఉన్నట్టుంది."

నవల్ గంగాప్రసాద్ దగ్గర కుర్చీవేసుకుని కూర్చున్నాడు. కొంచె మాగి గంగాప్రసాద్ అన్నారు: "నవల్! నేనీ మాట అంటే నీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. కాని ఈరోజు కామాతానాథ్ ఎదుట నీ రూపం చూచి నేను నివ్వెరపోయాను."

"నావల్ల ఏమైనా పొరబాటు జరిగిఉంటే క్షమించాలి నాన్నగారూ?"

గంగాప్రసాద్‌కు నవ్వు వచ్చింది. ఆ నవ్వులో దైన్యంగానీ దిగులుగానీ లేదు. అది ఆయన అంతకుముందు సహజంగా నిర్ముక్తంగా నవ్వే నవ్వు: "లేదు నవల్, క్షమించవలసిన దేమీ లేదు. అప్పుడు నీ ముఖముద్రచూచి నేను మురిసిపొయ్యాను. నాలో ఏర్పడిన ఘోరమైన భయం నెమ్మదిగా తొలిగిపోయింది."

"నాకు మీరు చెప్పేదేమిటో బోధపడడం లేదు నాన్నగారూ!" అన్నాడు నవల్ ఏదో అర్థంచేసుకోవాలని ప్రయత్నిస్తూ.

"నామాటలు నీకర్థంకావడం లేదు. అయితే విను. నవల్! నా వ్యాధి పేరు గ్యాలపింగ్ టి.బి అని నీకు తెలిసే ఉంటుంది. దీనికి మందు లేదు. నేను రక్తం కక్కుకున్ననాడే నాకీ సంగతి తెలిసిపోయింది. వెంటనే భయంకరమైన ఆందోళన నా మనస్సులో ప్రవేశించింది. నీ సంగతి ఏమిటి, విద్య సంగతి ఎలా, సుధ, కేవల్ వీళ్ళ నెవరు చూస్తారు. అని ఏవేవో ఆలోచనలు నన్ను పీడించాయి. నీవేమో చదువుకోవాల్సిన వాడివి, విద్య పెండ్లి కావల్సిన పిల్ల, సుధ, కేవల్ ఇంకా పసిపిల్లలు. నా మనస్సులో ఏర్పడిన ఆందోళనను నీవు ఊహించను కూడా లేవు. తాతయ్య ముసలి వాడయిపోయినారు. ఆయన విషయం కూడా గట్టిగా చెప్పలేము. అందు కని నాకు చనిపోవాలని లేదు. జీవితంలో నేనేమీ నిలవ చేయలేదు. మీ కేమీ ఏర్పాటు చేయలేక పొయ్యాను. పిల్లల సంగతి ఏమవుతుందో నా కేమీ పాలుపోలేదు. అందువల్ల నా ప్రాణాలు విలవిల కొట్టుకున్నాయి."

నవల్ బదులు చెప్పకుండా తండ్రి చెప్పే మాటలు వింటున్నాడు. గంగాప్రసాద్ శ్వాస పీల్చుకొని మళ్ళీ ఆరంభించారు: "నాకోగ్లాసు మంచి నీళ్ళియ్యి తండ్రీ! మాట్లాడే ఓపిక కూడా పోతున్నది."

నవల్ లేచి గంగాప్రసాద్‌కు మంచినీళ్ళు అందించాడు.

దాహం తీర్చుకొని గంగాప్రసాద్ మళ్ళీ మొదలుపెట్టాడు: "ఈ రోజు నిన్ను ఆ రూపంలో చూచేసరికి వెంటనే నా భయం ఎలా మాయమై పోయిందో తెలియదు. నీకు స్వాభిమానం ఉంది, సమర్థుడివి, అవకాశాలనూ, ఆకర్షణలనూ కాలదన్ని కష్టాలను ఓర్చుకొనే స్థైర్యం నీకు ఉందని నాకు తెలిసిపోయింది."

నవల్‌కు తన తండ్రి తనను ఇలా ప్రశంసించడం బాగాలేదు: "అదంతా ఎందుకులెండి ఇప్పుడు నాన్నగారూ! మీకు చాలా అలసటగా ఉన్నట్టుంది." అన్నాడతను.

గంగాప్రసాద్ ఆగలేదు: "నేను చెప్పేది పూర్తిగా విను. నన్ను మధ్యలో ఆపకు. నా అలసట అంతా పోయిందనే విషయం నీకు తెలియదు. ఇప్పుడు నాకేమీ దిగులు లేదు, విచారంలేదు. నేను ప్రశాంతంగా చనిపోగలను. నీవు అన్నీ చక్కబెట్టుకోగలవని నాకు ధైర్యం వచ్చింది. నాకంటే ఎక్కువ సామర్థ్యంతో అన్నింటిని సమర్థించగలవు." కొంచెంసేపు ఆగి గంగాప్రసాద్ మళ్ళీ అన్నారు: "నవల్, నేనిలా ఎందుకు పడిపోయానో నీకు తెలుసా? నన్ను నేనే ఇలా పడగొట్టుకున్నాను. దానికి నేనే స్వయంగా బాధ్యుణ్ణి. నాలో ఉండే పిరికిదనమే నన్నిలా పడగొట్టింది."

నవల్ మనస్సులో అదే తెలుసుకోవాలని కుతూహలం ఏర్పడింది. "అదేమిటి నాన్నగారూ?" అని అడిగాడు.

"అదే చెప్తున్నాను విను. ఒకనాడు నా మనస్సులో ఈ ఉద్యోగం, బానిసత్వం, పారతంత్ర్యం - ఇవన్నీ చూచి ఒక రకమైన తిరుగుబాటు చెలరేగింది. ఆ తిరుగుబాటు చాలా సహజమైంది. ఈ విషయం జ్ఞాన్ మామయ్యకు తెలుసు. రాజీనామా ఇద్దామని నేను నిర్ణయించుకున్నాను. కాని నాలో ఉన్న పిరికితనానికి ఏదో సాకు చిక్కింది. అది నన్ను లొంగదీసింది. వ్రాసి పెట్టిన రాజీనామాను చించి వేశాను. విషంలాంటి ఆ అవమానాన్ని నేను మింగివేశాను. కాని ఆ అవమానం అనే విషం ఎంత దారుణమైనదో, ఎంత మెల్లగా ఎంత ప్రమాదానికి దారితీయగలదో తర్వాత తెలిసింది. రాజీనామాను చించివేయగానే నేను భగ్నమై పోయాను. పది సంవత్సరాలు అలాగే నెట్టుకుంటూ వచ్చాను. ఇక అదికూడా ముగిసి పోయినట్టే. ఈరోజు నాకు చాలా సంతోషంగా ఉంది."

నవల్ ఈ సంగతి అంతకు ముందే జ్ఞానప్రకాశ్ చెప్పగా వివరంగా

విన్నాడు. ఆ విషయం అతని తండ్రిలో ఇంతగా మార్పు కలుగు జేసిందని అతను ఆశ్చర్యపోయాడు. గంగాప్రసాద్ ఇంకా ముగించలేదు: "నవల్, నేనొక్క మాట చెప్తాను, విను. నీవు భగవంతునికి తప్ప మరెవ్వరికి లొంగకు. నీ అంతరాత్మకు వ్యతిరేకంగా ఏ పని చేయకు. తనను తాను మరచిపోవడానికి మద్యం తాగకు."

భావావేశంలో నవల్ అన్నాడు: "ఈ మూడు పనులు నేను చేయనని వాగ్దానం చేస్తున్నాను. ఇక మీరు నిద్రపొండి నాన్నగారూ!"

"అలాగే తండ్రీ! ఈ రోజు నాకు తేలికగా ఉంది. ఆకలి కూడా వేస్తూ ఉంది. ఏదో కొద్దిగా తిని నిద్రపోతాను. ఈ రోజు నిద్రకూడా బాగా పడుతుంది."

మరునాడుదయం గంగాప్రసాద్ చాలా సంతోషంగా ఉన్నారు. జ్వరం ఒక డిగ్రీ తగ్గిపోయింది. నవల్‌ను పిలిచి అన్నారు. "నవల్, నాకిక్కడనే నయమవుతుందని అనిపిస్తూ ఉంది. భువాలీ వెళ్ళడం అవసరమా?"

"ఏర్పాట్లన్నీ చేశాను. అక్కడ ఇంకా త్వరగా నయం కావచ్చు." అన్నాడు నవల్.

"అవునులే, వెళ్ళాలని అనుకొన్నప్పుడు వెళ్ళడమే మంచిది. పైన ఇక్కడ ఎండలు కూడా ఎక్కువగా ఉన్నాయి. భువాలీలో పూర్తిగా ఆరోగ్య పడి రావచ్చునను కొంటాను" అంటూనే గంగాప్రసాద్ ముఖంలో చిరునవ్వు కనిపించింది.

గంగాప్రసాద్ ముఖంలో ఒకరకమైన కాంతి కనిపించింది నవల్‌కి. సంతోషంగా అతను డ్రాయింగ్ రూమ్‌లో వచ్చి కూర్చున్నాడు. సామాన్లు సర్దటం అంతా అయిపోయింది. మరునాడుదయం గంగాప్రసాద్‌ను తీసుకుని అతను భువాలీ వెళ్ళాలి. అప్పుడే సత్యవ్రత్‌తో మాయాదేవి డ్రాయింగ్ రూమ్‌లోకి ప్రవేశించింది.

రాగానే మొదలు పెట్టింది మాయ: "అయ్యో నవల్ బాబూ! ఏమయింది బాబూ! ఎంత ఆపద వచ్చింది? ఎక్కడున్నారాయన? మాకు ఈయన అనారోగ్యం సంగతి కాన్పూరులో తెలిసింది - చాలా ఆలస్యంగా. అక్కడి నుంచి మేము నేరుగా మిర్జాపూర్ వెళ్ళాం. అక్కడికి వెళ్ళేసరికి అలహాబాదు వెళ్ళారని తెలిసింది. అయితే ఇప్పుడాయన ఆరోగ్యం ఎలా ఉంది నవల్?"

నవల్ వాళ్లిద్దర్నీ కూర్చోమని చెప్పి అన్నాడు: "డాక్టర్లు ఆయన్ని భువాలీ తీసుకు వెళ్ళమని చెప్పారు. రేపుదయం ఆయన భువాలీ వెళ్ళుతున్నారు."

"అయ్యో పాపం. భువాలీ వెళ్ళాల్సిన స్థితి వచ్చిందా?" అని కేక పెట్టింది మాయ: "నవల్, ఆయన్ని మాకోసారి చూపించు. ఒకసారి మా దేవతను మేము చూచుకుంటాం" అన్నదామె.

"చూస్తాను, నిద్రపోతున్నారో ఏమో. నిన్న సాయంత్రం నుంచి ఆయన ఆరోగ్యం కొంచెం తేలికగానే ఉంది. మీరు కూర్చోండి. నేనిప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళాడు నవల్. కొంచెం సేపటికి "రండి, మిమ్మల్ని రమ్మంటున్నారని" చెప్పి నవల్ సత్యవ్రత్‌ను, మాయాదేవిని గంగాప్రసాద్ గదిలోకి తీసుకు వెళ్ళాడు.

గంగాప్రసాద్‌ను చూడగానే మాయాదేవి బిగ్గరగా అరచింది: "అయ్యో అయ్యో! ఇలా అయిపోయినారేం? చివరకు మిమ్మల్ని ఈ స్థితిలో చూడాల్సి వచ్చింది!" అని ఆమె వడిగా వెళ్ళి గంగాప్రసాద్ కాళ్ళు పట్టుకొని ఏడవడం మొదలు పెట్టింది.

ఎంతో కష్టంమీద మాయాదేవి గంగాప్రసాద్ కాళ్ళను వదలిపెట్టింది. అప్పుడు గంగాప్రసాద్ మాయాదేవిని పలకరించారు: "కూర్చోండి మాయాదేవిగారూ! అంతా కులాసా? పిల్లా జెల్లా కులాసాగా ఉన్నారా? ఎప్పుడు వచ్చారిక్కడికి?"

మాయాదేవి ఆ మాటలను వినిపించుకోకుండా ఒకటే ఏడవడం. పిచ్చి పట్టినట్టు మాట్లాడుతూ ఉంది. "అసలు మీకేమయింది? ఈ జబ్బు మీకెలా వచ్చింది? మాకీ విషయం తెలియపరచనేలేదు! మేము మిర్జాపుర్ వెళ్ళాం. మీకు జబ్బు చేసిందని కాన్పూర్‌లో అందరూ అనుకుంటూ ఉంటే విన్నాము. మీర్జాపుర్ నుండి నేరుగా ఇక్కడకు వచ్చేశాం. అయ్యో భగవంతుడా! ఏమిటీ అన్యాయం?"

సత్యవ్రత్ మాటామంతీ లేకుండా మౌనంగా గంగాప్రసాద్ వైపు చూస్తున్నాడు. గంగాప్రసాద్‌ను గుర్తు పట్టడమే అతనికి కష్టంగా ఉన్నట్టుంది. అస్థి చర్మమయమైన పంజరం బలహీనంగా, శిథిలంగా నిస్సత్త్వంగా ఆయన ముందు పడి ఉంది. ఒకప్పుడు ఇతని ఠీవికి ఎందరో గజగజ వణికి పోయేవారు. గొప్ప గొప్ప తెల్లదొరలతో పోరాడే వాడితను.

అపార జన సమూహం నుండి మాయాదేవిని విడిపించుకొని వచ్చిన ఆ ధృఢకాయుడేనా ఇతను అని అతనికి ఆశ్చర్యం వేసింది. ఆ ఉల్లాసం, ఆ ఉత్సాహం, ఆశక్తి, ఆ కార్యదీక్ష చూచి తాను నివ్వెరపోయి నిశ్చేష్టుడయ్యేవాడు. మరి అదంతా ఇప్పుడెక్కడికి పోయింది? ఆ వ్యక్తికి బదులు ఆ స్థానంలో ఒక వ్యాధిగ్రస్తుడయిన అవిటివాడు కనిపిస్తున్నాడు. ఈ వ్యక్తిని గుర్తు పట్టడం అతనికి కష్టంగానే ఉంది. ఆ సమయంలో సత్య వ్రత్‌కు గంగాప్రసాద్ యొక్క పరిచిత కంఠం వినిపించింది : "ఏమోయ్ సత్యవ్రత్ ఏమిటి ఆలోచిస్తున్నావ్? మీరంతా సైమన్ కమిషన్నుమహా చక్కగా బహిష్కరించేశారట. తర్వాత కార్యక్రమం ఆలోచించారా?"

ఇంకా ఈ వ్యక్తిలో చైతన్యం ఉంది. ప్రస్తుతాన్ని గమనిస్తూనే ఉన్నాడని సత్యవ్రత్‌కు భోధపడింది. "ప్రస్తుతం ప్రత్యేకమైన కార్యక్రమం ఏమీ లేదు. ఈ హిందూ-ముస్లిం అల్లర్లు ఒక విధంగా మా రాజకీయ రంగానికి కుఠారాఘాతంగా తయారయాయి. దానికి తోడు దేశంలో పేదరికం ఎక్కువయి పోయింది. పేదరికంతో పాటు అసంతృప్తి పెరిగి పోయింది." అన్నాడు సత్యవ్రత్.

గంగాప్రసాద్ నవ్వుతూ అన్నారు: "అన్నిటికీ మించింది దేశంలోని జాగరూకత. ఇప్పుడే ఏదయినా ఉద్యమం బయలుదేరే సూచనలేమయినా ఉన్నాయా?"

సత్యవ్రత్ కొంచెం నిరుత్సాహంగా అన్నాడు: "అలాంటి సూచనలు నాకేమీ కనిపించడం లేదు. ఇంత పేదరికం, నిరుద్యోగంతో బాధపడుతున్న ప్రజల్లో విప్లవ భావాలు కనిపించడం లేదు. నాలోనే నాకు చాలా నైరాశ్యం ఆవరించి ఉన్నట్లు తోస్తున్నది. అంతటా అదో విధమైన విషాదం, కల్మషం నాకు గోచరిస్తూ ఉంది."

"ఈ విషాదం, కల్మషంలోనే విప్లవ బీజాలు దాగిఉన్నాయి సత్యవ్రత్! కార్యనిరతి జీవిత నియమం. ఎక్కడ క్రియ ఉంటే అక్కడ ప్రతిక్రియ కూడా ఉంటుంది. ఈ ప్రతిక్రియకు పర్యవసానం జరిగి తీరుతుంది" అంటూ గంగాప్రసాద్ మాయాదేవి వైపు తిరిగారు: "ఏమండీ మాయాదేవిగారూ! మీరు కాంగ్రెసు నాయకత్వాన్ని సంపాదించ లేక పోతున్నారే, ఎందుచేత? ఇటీవల పేపర్లలో మీ పేరెక్కడా కనిపించడం లేదు. సత్యవ్రత్‌కు మీ మీద అసూయ అనుకుంటాను."

"తగల బెట్టండి ఈ నాయకత్వాన్ని! పిల్లలతో నా కసలు తీరు తుంటేగా! ఇంట్లో పనిచేసుకున్న తర్వాత కొద్దిగొప్పో తీరికఉంటే రాట్నం వడకడంతో గడుపుతాను. కాని ఇదంతా అనవసరమని అనిపిస్తున్నది. ఇవన్నీ వదిలేయండి, మీ సంగతి ఏమిటో అసలు కొంచెం చెప్పండి."

"నా సంగతి చెప్పేదేముంది? చూస్తున్నారుగా మీరు! నిన్నటినుంచి కొంచెం ఆరోగ్యంగా ఉంది. బహుశా సెప్టెంబరు నాటికి పూర్తిగా నయమవుతుందను కొంటాను. రేపు ఉదయం బండికి భువాలీ వెళుతున్నాను. ఇక్కడ ఎండలకు ఆరోగ్యం ఏమాత్రం బాగుపడడం లేదు."

"రేపు ఉదయం మేము స్టేషను దగ్గరికి వస్తాం. ఇక మీరు విశ్రాంతి తీసుకోండి. మాట్లాడడం మీకు చాలా అలసటగా ఉంటుంది." అన్నాడు సత్యవ్రత్ లేచి నిలబడుతూ.

సత్యవ్రత్ అన్నది నిజమే. గంగాప్రసాద్ నిజంగానే అలసిపోయారు. ప్రక్కకు పొర్లుతూ ఆయన అన్నారు: "అవును. కొంచెం అలసటగానే ఉంది. చాలా నీరసంగా ఉంది. సరే, రేపు స్టేషను దగ్గర కలుసుకుందాం." అంటూ ఆయన కండ్లు మూసుకున్నారు.

ఆ రోజు పగలంతా గంగాప్రసాద్‌ను చూచిపోయేవాండ్లు ఎడతెగకుండా వచ్చారు. సుమారు రాత్రి ఎనిమిది గంటలకు గంగాప్రసాద్ నవల్‌ను పిలిచారు: "నవల్, రేపుదయం మనం భువాలీ వెళ్ళడం చాలా అవసరమా?"

"అదేమిటి నాన్నా, అలా అంటున్నావు. సామానంతా సర్దేశాను. రేపుదయం ప్రక్కచుట్ట కట్టడం ఒక్కటే మిగిలిఉంది." అన్నాడు నవల్ ఆశ్చర్యంతో.

"నిన్నటికీ, ఈ రోజుకూ నాకు చాలా ఆరోగ్యంగా ఉన్నట్లు తోస్తున్నది. అందుకని బహుశా ఇక్కడనే నయమవుతుందని ఆలోచిస్తున్నాను." మళ్ళీ కొంచెంసేపు ఆలోచించి అన్నారు: "లేదులే, అక్కడికే వెళ్ళుదాం. అసలు విద్య పెండ్లిని గురించి నాకు ఆలోచనగా ఉంది. నవంబరులో దాని పెండ్లి జరగాలి. నేను భువాలీలో ఉంటే మరి ఇక్కడ దాని పెండ్లికి ఎవరు ఏర్పాటు చేస్తారని ఆలోచిస్తున్నాను. మిర్జాపూర్ నుండి బాబూ విందేశ్వరీ ప్రసాద్‌గారి ఉత్తరం వచ్చింది. నవరాత్రుల్లో ప్రధానం జరిపించవలసిందని వ్రాశారు.

"మీరా విషయాన్ని గురించి దిగులు పడకండి. నేను జులైలో ఇక్కడికి వచ్చి అన్ని ఏర్పాట్లు చేస్తాను. అదికాక పెండ్లి ముహూర్తం కొంచెం అటు ఇటుగా పెట్టుకోవచ్చు. మీరిలా అనారోగ్యంగా ఉందని కూడా ఆయనకు ఎటూ తెలుస్తుంది."

గంగాప్రసాద్ కొంచెం ఆలోచించి అన్నారు: "ఇంతవరకు నేనాయన కేమీ జవాబు వ్రాయలేదు. భువాలీ వెళ్ళి అక్కడినుండి జాబు వ్రాస్తాను." అలా ఉన్నట్టుండి గంగాప్రసాద్ ముఖం వంకర పోయింది. "కొంచెం బేసిన్ ఇలా పెట్టు నాన్నా!" అన్నారు.

నవల్ త్వరత్వరగా బేసిన్ తీసుకు వచ్చాడు. కాని అతను బేసిన్ తీసుకు వచ్చేలోగా గంగాప్రసాద్‌కు పెద్దగా దగ్గు వచ్చింది. ఆ దగ్గుతోనే ఆయన రక్తం కక్కుకున్నారు. ఆ రక్తంతో పక్కంతా తడిసిపోయింది.

నవల్ ఖంగారు పడ్డాడు. అక్కడనుండే అతను "తాతయ్యా! కొంచెం ఇటురా!" అని బిగ్గరగా పిలిచాడు.

ఇంతలోనే గంగాప్రసాద్‌కు మళ్ళీ వాంతి అయింది – మాంసపు ముద్దలు రక్తం కక్కున్నారు. గంగాప్రసాద్ ముఖం నల్లబడింది, కండ్లు తిరిగి పోతున్నాయి. జ్వాలా ప్రసాద్ వచ్చేసరికి మూడోసారి కూడా వాంతి అయింది. అలాగే నల్లగా, కుళ్ళు వాసనతో మాంసపు ముద్దలు కక్కున్నారు. దానితో గంగాప్రసాద్ ఒళ్ళు తెలియకుండా పడిపోయారు.

ఇల్లంతా గదిలో చేరింది. జ్వాలా ప్రసాద్ డాక్టరు శేర్వుడ్‌ను పిలుచుకు రావడానికి పరుగెత్తారు.

డాక్టరు శేర్వుడ్ వచ్చి గంగాప్రసాద్‌ను చూచారు. ఆయన ఒళ్ళు తెలియకుండా పడిఉన్నారు. పూర్తిగా పరీక్షచేసి డాక్టరు చెప్పారు: "ఏం లాభం లేదు. ఏ క్షణంలోనైనా ప్రాణం పోవచ్చు. ఉదయందాకా బతికితే గొప్ప."

జ్వాలా ప్రసాద్ గొల్లుమన్నారు: "ఎలాగయినా బ్రతికించండి డాక్టరు గారూ! ఏ మందయినా ఇవ్వండి."

"మందు పేరిట ఈయనకు గంగాజలం ఇవ్వండి. భగవంతుడు గేలపింగ్ టి.బి. తెచ్చి పెట్టిన వ్యక్తిని పరీక్షించడం ఎవరికి సాధ్యమవుతుంది? అంతా ముగిసిపోయింది" అంటూ డాక్టరు శేర్వుడ్ వెళ్ళిపోయారు.

ఇల్లంతా గొల్లుమన్నది. జ్వాలా ప్రసాద్, నవల్ కలిసి గంగాప్రసాద్‌ను

మంచంలో నుంచి దించి కింద పండుకోబెట్టారు. బ్రాహ్మణ్ణి పిలిచి గోదాన మిప్పించారు. బయట పురోహితులవారు మృత్యుంజయ జపం చేస్తున్నారు. మహా మృత్యువాయింటిని ఆవరించిందని అనిపించింది నవల్‌కు. గది వెలుపల వరండాలో యమున స్పృహతప్పి పడిపోయింది. రుక్మిణి నెత్తి బాదుకుంటూ ఉంది. జ్వాలా ప్రసాద్, నవల్ ఇద్దరూ మృత్యుదేవత నుండి గంగాప్రసాద్‌ను తప్పించడానికి ప్రయత్నిస్తున్నట్టుగా కూర్చున్నారు. కేవల్‌ను, సుధను తీసుకొని విద్య బయటి వరండాలోనికి వెళ్ళిపోయింది. భీఖూ హడావిడిగా అటూ ఇటూ పరుగెత్తుతున్నాడు.

ఉదయం సుమారు మూడు గంటలకు గంగాప్రసాద్ కండ్లు తెరచాడు. కండ్లు తెరవగానే నవల్ కనిపించాడు. "నీవా... నీవు" అని తండ్రి వైపు చూచి "నాన్నా నవల్ ఉన్నాడు. విద్య పెండ్లి చేస్తాడు." అని అన్నారు. తర్వాత ఆయన నాలుగు వైపులా చూచారు. యమునను దగ్గరికి రమ్మని సంజ్ఞచేశారు: "నీ కాళ్ళు నా చేతులకు అందించమ్మా" అన్నాడు. తర్వాత రుక్మిణి వైపు చూచి "నిన్నెంతో కష్టపెట్టా, నన్ను క్షమించు" అన్నారు. అప్పుడు పిల్లల్ని చూచారు. కాని ఇక మాట్లాడే శక్తి ఆయనలో లేదు. నవల్ వైపు చూచి ఆయన పిల్లల్ని అతనికి చూపించారు. ఆ పిల్లల్ని చూడవలసిన భారం నవల్ పైన ఉన్నదని బహుశా ఆయన చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. తర్వాత ఆయన దృష్టి ఉన్నట్టుండి అకస్మాత్తుగా విద్య మీద నిలబడి పోయింది. అప్పుడే ఆయనకు తేపు వచ్చింది తల వ్రేలాడి పోయింది.

ఇల్లంతా బావురుమన్నది.

మూడు

మూడు రోజుల దాకా ఎడతెగకుండా వర్షం కురుస్తూ ఉంది. ఆ రోజే మేఘాలు కొంచెం పలచ బడ్డాయి. సాయంత్రం నవల్ టీ త్రాగి

వరండాలోకి వచ్చేసరికి బాగా తెరపిచ్చింది. సూర్యకిరణాలు వాడిపోయిన ఎఱ్ఱని కాంతిని వరండాలోకి ప్రసరింపచేస్తున్నాయి. జులై చివరకు వచ్చింది. నలువైపుల ప్రకృతి సస్యశ్యామలంగా ఉంది. నవల్ యూనివర్సిటీ నుండి ఇంతకు ముందుగానే వచ్చాడు - కొంచెం అలసి పోయినట్టున్నాడు. క్లాసు అయిపోయిన తర్వాత కూడ అతను తన స్నేహితులతోపాటు అక్కడనే ఆగిపోయాడు - అప్పటికింకా వాన పూర్తిగా తగ్గిపోలేదు. తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు యూనివర్సిటీ గేటు దగ్గరకు వచ్చేసరికి సైకిలుకు పంచరయింది. సైకిలు బాగు చేయించుకోడానికి అతనక్కడనుండి కర్నల్‌గంజ్ వెళ్ళాడు.

నవల్ అలసట మానసికమైనది. వారం రోజుల క్రింద అతను తన చెల్లెలు విద్యను బనారస్ బోర్డింగ్ హౌస్‌లో వదలిపెట్టి వచ్చాడు. విద్య బి.యే. ఫైనల్‌లో ఉంది. బి.యే. పూర్తి చెయ్యాలని విద్య అభిలాష. విద్యను పై చదువు చదివించడం జ్వాలా ప్రసాద్‌కు ఇష్టం లేదు. విద్య మాత్రం బి.యే. ప్యాసయి తీరాలని పట్టుదల పట్టింది. నవల్ విద్యనే సమర్థించాడు. వాళ్ళిద్దరి పట్టుదలకు జ్వాలా ప్రసాద్ లొంగిపోయాడు. విద్య నవల్‌కంటె వయస్సులో రెండు సంవత్సరాలు చిన్న. కాని ఆమె నవల్‌కు చాలా తోడుగా ఉండేది. నవల్ మౌనంగా వరాండాలోకి వచ్చి కూర్చున్నాడు. అతడేదో ఆలోచిస్తున్నాడు - ఏమాలోచిస్తున్నాడో, అతనికే తెలియదు - కాని ఏదో ఆలోచిస్తూమాత్రం ఉన్నాడు. ఏవో ఆలోచనలు ఒకటి తరువాత మరొకటి పూర్వాపర సంబంధం లేకుండా అతని మనస్సులో ఉదయిస్తున్నాయి, అస్తమిస్తూనూ ఉన్నాయి. ఇటీవల మూడు నెలల నుండి అతని ప్రపంచం మారింది, అతని విలువలు మారాయి, అతని దృక్పథం మారింది. అంతేకాదు, అసలు తానే మారిపోయానని అనిపిస్తూ ఉన్నదతనికి.

అదే సమయంలో నవల్‌కి జ్ఞానప్రకాశ్ గొంతు వినిపించింది: "ఏమోయ్ నవల్! ఏమిటాలోచిస్తున్నావు?"

నవల్‌కు ఆశ్చర్యం వేసింది. జ్ఞానప్రకాశ్ నిలబడి నవ్వుతూ ఉన్నారు. జ్ఞానప్రకాశ్ ముఖంలో నవల్‌కి ఎప్పుడూ కనిపించే సౌమ్యత్వం సాత్వికత, దార్ఢ్యం ఇప్పుడు కూడా అలాగే కనిపించాయి. "ఏం లేదు తాతయ్యా! మనస్సులో ఏదో విచారంగా ఉంది. అందుకని ఇక్కడికి

వచ్చి కూర్చున్నాను. చాల రోజుల తర్వాత ఇవ్వేళ ఎండ వచ్చింది. ఇంట్లో నుండి బయటకు కదలి కూడా చాలా రోజులయింది. కాసేపు అలా తిరిగి వద్దామా అని ఆలోచిస్తున్నాను. ఈ రోజు మీరు కాంగ్రెసు ఆఫీసు నుండి త్వరగా వచ్చేశారే!" అన్నాడు నవల్.

"అవును. ఈ రోజంతా విపరీతమైన పని పడ్డది. చాలా అలసటగా ఉంది. త్వరగా వచ్చేశాను. నీవు టీ తాగేశావనుకుంటాను."

"అవును, ఇప్పుడే తాగి బయటకు వస్తున్నాను. మీరిలా కూర్చోండి. నేను మీకు టీ తీసుకు వస్తాను." అంటూ నవల్ లోపలికి వెళ్ళి భీఖూకు చెప్పాడు: "భీఖూ తాతా! జ్ఞాన్ తాతాయ్య వచ్చారు. వరండాలో ఆయనకు తీసికొని వెళ్ళి ఇయ్యి."

"ఇప్పుడే తెస్తాను బాబయ్యా! అన్నయ్యగారు కూడా ఇప్పుడే నిదర పోయి లేచినట్టున్నారు. ఆయన్ని కూడా పిలుచుకుపొండి."

జ్వాలా ప్రసాద్ తన గదిలో కూర్చుని గీత చదువుకుంటున్నారు: "తాతయ్యా టీ తయారయింది. జ్ఞాన్ తాతయ్య గూడా వచ్చారు. మీరు కూడా పది పదిహేను నిముషాల్లో వరండాలోకి రండి. మేము మీకోసం ఎదురుచూస్తూ ఉంటాము."

"అలాగే నాయనా! ఇదిగో ఈ అధ్యాయం పూర్తిచేసి వస్తాను." అన్నారు జ్వాలా ప్రసాద్.

నవల్ జ్ఞానప్రకాశ్ దగ్గరకి వెళ్ళి కూర్చున్నాడు.

"అయితే నీవు యల్.యల్.బి. లో చేరావా? ఇంగ్లండు వెళ్ళే ఆలోచన మానేశావా?" అని అడిగారు జ్వాలా ప్రసాద్.

"అలాంటి ఆలోచన ఏమీ లేదు తాతయ్యా! ఇంట్లో పరిస్థితి మీకు తెలుసు గదా! అదిగాక ఈ సంవత్సరం విద్యకు పెండ్లిచెయ్యాలి. పెండ్లి ఖర్చు కావాలి. తాతయ్య ఈ పెండ్లి ఎలా చేస్తారో బోధపడడం లేదు."

"నవల్! నేనొక మాట చెప్తాను. మరోలా అనుకోవద్దు. నా ఖర్చు మీద నీవు ఇంగ్లండు వెళ్ళి చదువుకో. ఇది నీ కెరియర్‌కు సంబంధించిన ప్రశ్న. ఏం చెప్పను. మీ నాన్నకు జబ్బుచేసినప్పుడు నేను మనదేశంలో లేకపోవడం వల్ల అలా అయింది. మీరు నాకు కబురయినా చేశారు గారు."

"ఎలా కబురు చేస్తాం తాతయ్యా! మీరు అప్పెండిక్సు అపరేషనుతో హాస్పిటల్లో ఉన్నారు కదా!"

"సరే. అయిపోయిందేదో అయిపోయింది. నీ పాస్‌పోర్టు నీ దగ్గరే ఉంది కదా! అసలు సెప్టెంబర్లో వెళ్ళాలనే కదా అనుకొంది. ఇప్పుడు మించకు పోయిందేమీ లేదు. నా మాట విని నీవు ఇంగ్లండు వెళ్ళు. మిగిలిన విషయాలన్నీ నీకనవసరం."

నవల్ కొంచెంసేపు మౌనంగా ఉండి తర్వాత అన్నాడు: "లేదు జ్ఞాన్ తాతయ్యా! నేనిక్కడ ఉండి కుటుంబ విషయాలు చూచుకోవాలి. విద్య వివాహ విషయం నాన్నగారే నిర్ణయించి పోయారు. దాని పెండ్లి నవంబరులో చెయ్యాలి. అదీగాక నాకిప్పుడు ఐ.సి.యస్. అవాలని పెద్ద కుతూహలంగా కూడా లేదు."

అప్పుడే జ్వాలా ప్రసాద్ వరండాలోకి వచ్చారు. జ్వాలా ప్రసాద్ చాలా విచారంగా ఉన్నారు. అప్పటికే భీఖూ వరండాలో టీ పెట్టేసి వెళ్ళి పొయ్యాడు. వరండాలోకి వచ్చిరాగానే జ్వాలా ప్రసాద్ అన్నారు: "విన్నావా జ్ఞానూ! విందేశ్వరి ప్రసాద్ దగ్గర నుంచి ఈరోజే ఉత్తరం వచ్చింది. ఈ సంవత్సరం పెండ్లి జరిగితీరాల్సిందేనని వ్రాశారు. నవ రాత్రుల్లో ప్రధానం చేసుకుని తీరాలట."

"పెండ్లి చేయడం ఖాయమైనప్పుడు, అనవసరంగా ఆలస్యం చేయడం ఎందుకూ? నా ఉద్దేశ్యం కూడా అదే. నవరాత్రుల్లో ప్రధానం పంపించండి. నవంబరులో పెండ్లి చేసెయ్యండి." అన్నారు జ్ఞానప్రకాశ్.

"అది నిజమేనోయ్! కాని ప్రధానంలో ఎనిమిదివేలు పెట్టాలి. మరి ఎనిమిదివేల రూపాయలు కూడాలి కదా! ప్రధానం పెట్టడమంటే అంత సులభమైన పనికాదు." అన్నారు జ్వాలా ప్రసాద్ నీరసంగా.

జ్ఞానప్రకాశ్ కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్టు చివుక్కున లేచారు: "ఎనిమిది వేలకు ప్రధానమా! నీకేమన్నా పిచ్చి పట్టిందా బావా! ఇంట్లో పరిస్థితి ఏమిటి? ఎనిమిదివేలు ప్రధానంలో పెట్టడమేమిటి?"

"ఏం చెప్పను జ్ఞానూ! గంగూ ఈ యేర్పాటు చేసి పోయాడు. సిద్ధేశ్వరి పి.సి.యస్. లో సెలెక్టయాడు. మే నెలలో మమ్మల్ని ఓదార్చడానికి బాబూ విందేశ్వరి ఒక జాబు వ్రాశారు. దానిలో రాజా జస్వంతరాయ్ గారి దగ్గరి నుండి మరో సంబంధం వచ్చిందనీ, వాళ్ళు పాతికవేలు కట్నం ఇస్తామంటు న్నారనీ కాని గంగాప్రసాద్‌కు మాట ఇచ్చేసినందువల్ల ఆ సంబంధాన్ని మానివేస్తున్నామనీ వ్రాశారు. ఆ ఉత్తరం నేను నవల్‌కు చూపించాను."

"అయితే ఎనిమిదివేలు ప్రధానంలో ఇయ్యడం అంటే మొత్తం పది హేను వేలు కట్నం అవుతుంది. ఏం నవల్! బాబూ విందేశ్వరి ప్రసాద్‌కు పదిహేను వేలిచ్చి సిద్దేశ్వరితో విద్యకు పెండ్లిచేయడం నీకు ఇష్టమేనా?"

"జ్ఞాన్ తాతయ్యా! నాన్నగారు ఈ వివాహాన్ని నిర్ణయించారు. ఇది జరిగి తీరాలి, ఏమయినా సరే!" అన్నాడు నవల్.

జ్వాలా ప్రసాద్ టీ త్రాగుతూ అన్నారు: "జ్ఞానూ! నీకు విందేశ్వరి ప్రసాద్ బాగా తెలుసుకదా! ఆయనతో చెప్పి కొంచెం కట్నం తగ్గించ లేవూ? పదిహేను వేల రూపాయలు ఆయనకు ఒప్పందం. పై ఖర్చులు దాదాపు రెండు మూడు వేల దాకా అవుతాయి. మొత్తం పద్దెనిమిది వేల రూపాయలు చాలా పెద్ద మొత్తం అవుతుంది. పెండ్లి ముహూర్తం కొంచెం అలస్యంగా పెట్టుకోడానికి కూడా ఆయన ఒప్పుకోడం లేదు."

జ్ఞానప్రకాశ్ నిర్మొహమాటంగా అన్నారు: "బావగారూ! ఈ విందే శ్వరీ ప్రసాద్ మనిషికాదు. పిశాచంలాంటి వాడు. పైజాబాదుకు డిస్ట్రిక్టు సెషన్సు జడ్జిగా బోలెడంత జీతం సంపాదిస్తాడు. కొడుకు డిప్టీ కలెక్టరయ్యాడు. కాని ప్రతి పైసను ప్రాణమొక ఎత్తుగా లెక్కపెట్టు కుంటాడు. నన్నడిగితే ఈ సంబంధం మానేయడం మంచిది. ఇంతకంటె చాలా మంచి సంబంధమే దొరుకుతుంది."

"జ్ఞానూ! సంబంధం మానేయడం మాత్రం సాధ్యం కాదు. నేనొకవేళ మానివేయడానికి ఒప్పుకున్నా నవల్ మాత్రం ఒప్పుకోడు. గంగూ నిర్ణ యించి పోయిందేదయినా సరే అది ఇతనికి వేద వాక్యం." అన్నారు జ్వాలా ప్రసాద్.

జ్ఞానప్రకాశ్ నవల్ వైపు చూచారు. నవల్ తల వంచుకొని మాట్లాడకుండా కూర్చున్నాడు. జ్ఞానప్రకాశ్ కొంచెంసేపు ఆలోచించి అడిగారు! "మీ దగ్గర మొత్తం డబ్బెంత ఉంది?"

"నా దగ్గర బ్యాంకులో మొత్తం రెండు వేల రూపాయలున్నాయి. గంగూ చేసిన అప్పు అది తీర్చగా అతని తాలూకు పన్నెండు వందల దాకా మిగిలింది. గంగూ చేతి వజ్రాల ఉంగరం అమ్మితే అయిదున్నర వెయ్యి వచ్చింది. ఇవన్నీ కలిపి మొత్తం తొమ్మిదివేల దాకా అవుతాయి."

"తొమ్మిదనుకొండి" అన్నారు జ్ఞానప్రకాశ్. "అప్పటికీ కట్నానికి ఇంకా ఆరువేలు కొరవ పడుతుంది. ఏదో విధంగా ప్రధానం చేసుకున్నారే

అనుకో. ఆ తర్వాత పెండ్లికి గాను మరో తొమ్మిది వేలు చూచుకోవాలి. దీన్ని గురించి మీరేమయినా ఆలోచించారా ?"

"ఇంతవరకూ ఆలోచించ లేదు. ఇక ఆలోచించాలి. గంగూ మోటారు కారు మీద వెయ్యి రూపాయలు వస్తాయి. ఇక ఏడెనిమిది వేలు అప్పు తీసుకు రావాలి." కొంచెంసేపు ఆలోచించి ఆయన జ్ఞానప్రకాశ్‌తో అన్నారు. "జ్ఞానూ! సత్యప్రకాశ్‌కు వ్రాసి రెండు వేలు నీవు ఏర్పాటు చేయించు: లక్ష్మీచందువల్ల దాదాపు అయిదు వేల వరకు రాబట్టవచ్చునను కొంటాను. ఏదో విధంగా పెండ్లి మాత్రం చేసి తీరాలి."

జ్ఞానప్రకాశ్ జ్వాలా ప్రసాద్ మాటలకు సమాధానం చెప్పలేదు. టీ త్రాగి ఆయన మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయారు.

జ్ఞానప్రకాశ్ వెళ్ళిపోయిన తర్వాత జ్వాలాప్రసాద్ నవల్‌తో అన్నారు: "నవల్! మరి ఏం చేద్దామో చెప్పు."

"ప్రధానం చేసుకుందాం తాతయ్యా! మాట ఇచ్చేశాం కదా! ఏమయినా సరే విద్యను ఈ సంబంధానికే ఇచ్చి చెయ్యాలి."

"అలాగే మరి, నవరాత్రాల్లో ప్రధానానికి వస్తామని చెప్పి నేనతనికి వ్రాస్తాను. ఆయన కోరిక ప్రకారం ఎనిమిది వేలు ప్రధానంలో ఇస్తామని వ్రాస్తాను." అన్నారు జ్వాలా ప్రసాద్.

ఎండ పూర్తిగా తగ్గిపోయింది. నవల్ లోపలికి వెళ్ళి గుడ్డలు మార్చు కున్నాడు – బయటికి వెళ్ళుదామని. అతను వరండాలోకి వచ్చేసరికి జ్ఞాన ప్రకాశ్ కనిపించి నవల్‌ను తన గదిలోకి పిలిచారు.

జ్ఞానప్రకాశ్ గదిలో చాలా త్వరత్వరగా తిరుగుతున్నారు. నవల్ గమనిస్తూ ఉన్నాడు. నవల్ గదిలోకి వెళ్ళగానే ఆయన అన్నారు: "నవల్! నా దగ్గర ప్రస్తుతం మూడు వేల రూపాయలున్నాయి. ఇందులో రెండు వేలు నీవు తీసుకో. కాని ఈ డబ్బు తాతగారికియ్యకు. మీ అమ్మ దగ్గర ఉంచు. మా అన్నయ్య సత్యప్రకాశ్‌కు కూడా నేను వ్రాస్తాను. కాని ఆయన సంగతి చెప్పడానికి వీల్లేదు. సమయానికి డబ్బు పంపిస్తాడని చెప్పలేము."

"ఇప్పుడు తొందరేముంది జ్ఞాన్ తాతయ్యా!" అన్నాడు నవల్.

జ్ఞానప్రకాశ్ చిరాకుగా అన్నారు: "నేను చెప్పినట్టు చెయ్యి. నా సంగతి మాత్రం నమ్మకమేముంది. ఈ డబ్బు ఎప్పుడైనా ఖర్చయిపోవచ్చు.

ముందు మీ అమ్మకు ఈ డబ్బు ఇచ్చేసి తర్వాత బయటకు వెళ్ళు. ఇక ఇంతట వెళ్ళు.'' అని అలాగే గదిలో మళ్ళీ తిరగడం మొదలుపెట్టారు.

సెప్టెంబరు చివరివారంలో విద్యకు ప్రధానంపెట్టాలి. దసరా సెలవుల్లో విద్య బనారస్‌నుండి అలహాబాదు వచ్చింది. కాని ఆమె సంతోషంగా లేదు. రేపు ప్రధానమనంగా ఈరోజు సాయంత్రం విద్య నవల్‌తో అన్నది. ''అన్నయ్యా! అలా ఆల్‌ఫ్రెడ్ పార్కుదాకా వెళ్ళివద్దాం వస్తావా? ఇంట్లో కూర్చుని కూర్చుని విసుగేస్తూ ఉంది.''

విద్యకు అలా అనిపించినందుకు నవల్‌కు ఆశ్చర్యం వేసింది. కాని అతను విద్యతోపాటు ఆల్‌ఫ్రెడ్ పార్కువైపు వెళ్ళాడు. వానలు తగ్గిపోయి చాలా రోజులయింది. కాని ఉక్క పొయ్యడం మాత్రం అలాగే ఉంది. రామలీలా ఉత్సవాలు చూడడానికి జనమంతా ఊళ్ళోకి వెళ్ళారు. అక్కడికి వెళ్ళి విద్య అన్నది: ''అన్నయ్యా! నిన్నొకమాట అడుగుతాను చెపుతావా? నా పెండ్లికి గాను కట్నం ఎంత ఇస్తున్నారు?''

''ఆ సంగతి నీకెందుకమ్మా? నాన్నగారు ఎంత ఇస్తామని ఒప్పుకొన్నారో అంత ఇస్తారు.'' అన్నాడు నవల్.

''ఆ సంగతి నాకెందుకంటే ఇది నా పెండ్లికి సంబంధించింది కాబట్టి. చెప్పాల్సిందే నాకు అన్నయ్యా!''

''ప్రధానంలో ఎనిమిదివేలు ఒప్పుకున్నామమ్మా! నాలుగు వేలు రొక్కం, మిగిలింది వస్తు రూపంలోను.''

''నాలుగువేలు రొక్కం, నాలుగు వేలకు సామాన్లు, అంటే మొత్తం పదిహేను వేలు కట్నమన్న మాట.'' అన్నది విద్య. అదేమాట మళ్ళీ అన్నట్టుగా.

''అవును, నాన్నగారు ఈ కట్నం నిర్ణయించారు.'' అన్నాడు నవల్.

''ఇప్పుడు నాకర్థమయింది నీవు ఇంగ్లండు ఎందుకు వెళ్ళడం లేదో! నాన్నగారు మిగిలింది ఇచ్చి పోయిందేమీ లేదు కదా! ఈ డబ్బంతా ఎక్కడ నుండి వచ్చింది?''

నవల్ విసుక్కుంటూ అన్నాడు: ''ప్లీడరు పరీక్షకు చదువుచున్నది నేను, వాదించడం నీవు. అదంతా నీకెందుకు? డబ్బు విషయం అంతా తాతయ్యే ఏర్పాటు చేస్తున్నారు, ఇకముందు చేస్తారు. ఈ సంగతి అడగడానికేనా నన్నిక్కడికి తీసుకు వచ్చావు?''

"అవునన్నయ్యా! ఈ సంగతి అడగాలనే. అయితే నా పెండ్లితో ఈ యిల్లు గుల్లయిపోతుందన్న మాట. కట్నం తగ్గించమని తాతయ్య విందేశ్వరీ ప్రసాద్‌గారికి వ్రాస్తే ఆయన కాదన్నారటగదా! నిజమేనా?"

నవల్ నవ్వుతూ అన్నాడు: "మామగారి పేరు చెప్పడానికి సిగ్గువెయ్యడం లేదూ? అవునా మాట నిజమే."

కొంచెంసేపు ఆగి విద్య అన్నది: "అన్నయ్యా! ఈ సంబంధం చెయ్యొద్దు. అలా అయితే నేను పెండ్లి మానేస్తాను." అంటూ విద్య వొక్కిపోయింది.

నవల్ విద్య చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నాడు: "విద్యా! విషయం చాలావరకు ముందుకు సాగింది. నాన్నగారు ఇచ్చిన మాట మనం నిలబెట్టాలి. ఇల్లు గుల్లవడం సంగతి భగవంతుడి మీద వదలి వేయాల్సిందే. ముంచినా తేల్చినా అతనిదే భారం. ఈ పెండ్లివల్ల ఇల్లూ చెడిపోదూ, నేనూ చెడిపోను. అదిమాత్రం నేను గట్టిగా చెప్పగలను."

"కాని నేను మాత్రం చెడిపోతాను. నీకు దణ్ణం పెడతాను, నన్ను ఆ ధన పిశాచి ఇంట్లోకి నెట్టకండి. ఇంకా మించి పోలేదు."

త్యాగమూ, ఔన్నత్యమూ, కర్తవ్య దీక్షతో ఒళ్ళు తెలియని నవల్‌కు విద్య మనస్సులోని భావం బోధ పడలేదు. అతను గదుముతూ అన్నాడు: "ఇంక ఇలాంటి మాటలనకు విద్యా! నాన్నగారు చెప్పిన మాట కాదనడానికి వీల్లేదు. నాన్నగారు, నీ బాధ్యత అంతా నా మీద వదిలేసి వెళ్ళారు. నేను నిజం చెపుతున్నాను. నాకసలు ఇంగ్లండు వెళ్ళాలని లేదు. లేకుంటే జ్ఞాన్ తాతయ్య నన్ను తన ఖర్చుమీద పంపిస్తానన్నారు. ఇక ఇంటికి పద, ఆలస్యమయింది. ఇకమాత్రం ఈ విషయాన్ని గురించి పల్లెత్తి ఒక మాట కూడా అనవద్దు."

విద్య కండ్లు తుడుచుకుంటూ అన్నది: "నేను చెప్పేది నీకర్థం కావడం లేదు, అర్థం కాదు కూడాను." నిరాశ చేసుకుని మళ్ళీ అన్నది: "నీవు చెప్పినట్లే చేస్తాను. కాని అన్నయ్యా! ఈ సంవత్సరం నాకు బి.యే. ఫైనల్. ఈ పెండ్లి వల్ల నా చదువు ఆగిపోకుండా చూడాలి. నన్ను బి.యే. ప్యాసు చేయిస్తానని నాకు వాగ్దానం చెయ్యి. చెప్పన్నయ్యా! నన్ను బి.యే. ప్యాసయేటట్టు చేస్తావు కదూ?"

విద్య ముఖవైఖరి చూచి నవల్‌కు జాలి వేసింది. "అలాగే విద్యా! నిన్ను బి.యే. ప్యాసు చేయించే భారం నాది." అన్నాడు.

నవమినాడు ఉదయం ప్రధానం తీసుకుని నవల్ ఫైజాబాదు వెళ్ళాడు. బాబూ విందేశ్వరీ ప్రసాద్ నవల్‌ను రిసీవు చేసుకోడానికి స్వయంగా స్టేషనుకు వచ్చారు. ఎంతటి సామ్యాకారం ఆయనది. బాబూ విందేశ్వరీ ప్రసాద్‌ను నవల్ మొట్టమొదటిసారి చూస్తున్నాడు. విందేశ్వరి ప్రసాద్ కుశల ప్రశ్నలడిగారు: "ప్రయాణం బాగా జరిగిందా? దారిలో రైలు ప్రయాణంలో ఇబ్బంది ఏమీ కలుగలేదు కదా!"

విందేశ్వరీ ప్రసాద్ చూపించిన మర్యాదకు నవల్ సంతోషించాడు. సాయంత్రం ప్రధానానికి ముందు విందేశ్వరి ప్రసాద్ నవల్‌ను అడిగారు: "ప్రధానానికి తెచ్చిన వస్తువులేవో కొంచెం చూపిస్తావా?"

నవల్ పెట్టె తెరిచి సామాన్లన్నీ చూపించాడు. వేరు వేరు పాత్రల్లో సామానంతా అమర్చి ఉంది. సామాను చూడగానే విందేశ్వరీ ప్రసాద్ ముఖం ముడుచుకు పోయింది. "నాలుగు వేల రొక్కం సరిగానే ఉంది. కాని, ఈ సామాను నాలుగు వేలు చెయ్యదు. ఇది చాలా తగని పని" అన్నాడాయన.

సామాన్లకు సబంధించిన ధరల జాబితా విందేశ్వరీ ప్రసాద్ చేతికందిస్తూ నవల్ అన్నాడు: "మా తాతయ్య మీకీ జాబితా ఇయ్యమన్నారు."

"ఈ జాబితా నాకెందుకు? దాన్నేమన్నా కాచుకు తాగుతానా?" అని వ్యంగ్యంగా అన్నారు విందేశ్వరీ ప్రసాద్: "ప్రతి వస్తువు ధర నాలుగో వంతు ఎక్కువ చేసి వ్రాసి ఉంటారు. ఈ సంగతి నాకు తెలియంది కాదు." దానితో నవల్‌కు విందేశ్వరీ ప్రసాద్ మరో రూపంలో కనిపించారు. "ఆ మాత్రం స్తోమతు లేనప్పుడు మాతో సంబంధం చెయ్యాల్సిన అవసర మేముంది." అన్నారాయన.

వస్తువుల ధరలన్నీ నాలుగోవంతు పెంచి వ్రాసిన మాట నవల్‌కు తెలుసు కాని స్తోమతు మాట వినేసరికి నవల్‌కు రోషం వచ్చింది: "అవును మరి, ఆడపిల్ల గలవాళ్ళకు స్తోమతులేముంటాయి లెండి. స్తోమతు ఉన్న వాడేమో లేకుండానే పొయ్యారు. ఈ మాట మేము ముందే వ్రాశాము. కాని ఎవరిని ఏమీ అనుకొని లాభం లేదు. అన్నిటికీ భగవంతుణ్ణే అను కోవాల్సి వస్తుంది."

విందేశ్వరీ ప్రసాద్‌కు నవల్ మాటల్లో ఉండే వినయం ఏమాత్రం బోధ పడలేదు. "మా పరువు తీసేశావోయ్ నువ్వు! ఈ ప్రధానంచూచి అందరూ

ఏమనుకుంటారు? పెద్ద పెద్ద ఉద్యోగస్తులనూ, జమీందార్లనూ, ధనవంతులనూ పిలిచాను నేను. నా దగ్గర ఇలాంటి మోసం టక్కరి పనికిరాదని మీ తాతగారికి చెప్పు. పెండ్లిలో నాకు రొక్కంగా నాలుగు వేలు కావాలి. ఈ సామాను, గీమానూ నాకక్కర్లేదు. ఇంట్లో ఇలాంటి సామాను కావలసినంత ఉంది.''

నవల్ ప్రాణాలు బిగబట్టుకొని ఆ అవమానాన్ని మింగి వేసుకున్నాడు. ప్రధానం అయిన మరునాడు ఉదయమే అతను అలహాబాదు చేరుకున్నాడు. ప్రధానంలో జరిగిందంతా అతను జ్వాలా ప్రసాద్‌కు విశదంగా చెప్పాడు: ''తాతయ్యా! ఎలాంటి ధన పిశాచాల మధ్య మనం చిక్కుకున్నామో బోధపడింది. జ్ఞాన్ తాతయ్య చెప్పింది నిజమే. ఆ కుటుంబంలో విద్యకు పెండ్లి సంబంధం చెయ్యడం చాలా పొరపాటు.''

అది విని జ్వాలా ప్రసాద్ నివ్వెర పోయినారు. జ్వాలా ప్రసాద్ దగ్గర ప్రస్తుతం మూడు వేల రూపాయలు మాత్రమే ఉన్నాయి. పెండ్లికి ఇక రెండు నెలల వ్యవధి ఉంది. ''అయిందేదో అయిపోయింది నవల్. ఇప్పుడు మన దగ్గర దాదాపు తొమ్మిది వేల రూపాయలు మాత్రమే ఉన్నాయి. ఇంకా ఆరువేల రూపాయల కోసం ప్రయత్నించాలి!!'' అన్నారు జ్వాలా ప్రసాద్.

''అవును తాతయ్యా! ఇంకా ఆరువేల రూపాయలు పోగు చెయ్యాలి. లేకుంటే వేరే మార్గం లేదు.''

జ్వాలా ప్రసాద్ దీనంగా అన్నారు: ''ఏం చెయ్యాలో తెలియడం లేదు. సత్యప్రకాశ్‌కు వ్రాసి రెండు వేలు సర్దగలడేమో కనుక్కోమని జ్ఞానప్రకాశ్‌కు చెప్పాను. నేను కూడా సత్యప్రకాశ్‌కు రెండు జాబులు వ్రాశాను. కాని అటు సత్యప్రకాశ్ దగ్గరి నుండీ జవాబు రాలేదు, ఇటు జ్ఞానప్రకాశ్ కూడా ఆ విషయమై నాతో మళ్ళీ ఏమీ పలకరించలేదు.''

జ్ఞానప్రకాశ్ తన కిచ్చిన డబ్బును గురించి నవల్ మరిచేపొయ్యాడు. ''తాతయ్యా! జ్ఞాన్ తాతయ్య రెండు నెలల క్రితం నాకు రెండు వేల రూపాయలిచ్చారు. అవి నేను అమ్మ దగ్గర దాచేశాను. కనుక ఇప్పుడు మనకు కావలసింది నాలుగు వేలు'' అన్నాడు నవల్.

జ్వాలా ప్రసాద్ ముఖం విప్పారింది. ''దైవం అనుకూలిస్తే అవి కూడా దొరక్కపోవు. ఈరోజే నేను లక్ష్మీచంద్‌కు ఉత్తరం వ్రాసేస్తాను. హాశా అయిదువేలు రూపాయలదాకా అతను సర్దగలడు.''

అప్పుడే జ్ఞానప్రకాశ్ కంఠం వినిపించింది జ్వాలా ప్రసాద్‌కు : "లక్ష్మీచంద్ వల్ల ఏమీ ప్రయోజనం లేదు. అతని ఆశ వదలుకొని మరో చోట ప్రయత్నించడం మంచిది. మా అన్నయ్య సత్యప్రకాశ్ కూడా నాకు పొడిపొడి మాటలతో ఉత్తరం వ్రాసేశాడు."

"జ్ఞానూ ! నీవు రెండు వేల రూపాయలివ్వడం వల్ల ఎంతో సహాయంగా ఉంది. ఈ సమయంలో లక్ష్మీచంద్ కూడా కొద్దీ గొప్పో సహాయం చేస్తాడని నాకు ఆశ ఉంది. నేను స్వయంగా కాన్పూరు వెళ్ళి అతన్ని కలుసుకుందామా అని అనుకుంటున్నాను."

"దానికేం, నీవు పని చేసుకుని అంతదూరం వెళ్ళితే కాదనలేక ఏ వెయ్యో ఐదువందలో ఇస్తే ఇయ్యనూ వచ్చు."

ఆ రోజు సాయంత్రం విద్య నవల్‌తో అన్నది : "అన్నయ్యా ! నేనిక నీతో ఆ విషయమేమీ చెప్పను. జరిగిందంతా నీకు తెలియనే తెలుసు. ఇక జరుగబోయేది నేననుభవిస్తాను. రేపు నన్ను బనారసులో దిగపెట్టి వచ్చేసేయి."

నవల్ చాలా బాధపడుతూ అన్నాడు : "నన్ను క్షమించు విద్యా ! మా వల్ల చాలా పెద్ద పొరపాటే జరిగింది."

"పొరపాటు జరిగిపోయింది. దాన్నిక దిద్దుకోడానికి వీల్లేదు. కాని నీవు నాకిచ్చిన వాగ్దానాన్ని మాత్రం గుర్తుంచుకో. నన్ను బి. యే. ప్యాసు చేయిస్తానని నీవు మాట ఇచ్చావు."

"అవును విద్యా ! నేను నీకిచ్చిన మాట నెరవేరుస్తాను. రేపు నిన్ను బనారస్ తీసుకు వెళతాను. నీవు నిశ్చింతగా చదువుకో. నీ చదువు కేమీ భంగం రాకుండా చూచే బాధ్యత నాది." అన్నాడు నవల్.

రోజులు వడివడిగా గడిచిపోతున్నాయి. జ్వాలా ప్రసాద్ డబ్బుకు ఏర్పాటు చేయలేక పోతున్నారు. జ్ఞానప్రకాశ్ చెప్పినట్లుగానే లక్ష్మీచంద్ తాను అప్పిచ్చే స్థితిలో లేనని చెప్పాడు జ్వాలా ప్రసాద్‌తో. "బాబాయ్, నా పరిస్థితి బాగా లేదు. వివాహంలో పిల్లకు నా తరఫున ఈ వెయ్యి రూపాయలు చదివించండి. నేను బహుశా పెండ్లికి రాలేక పోతాను." అని లక్ష్మీచంద్ జ్వాలా ప్రసాద్ చేతిలో వెయ్యి రూపాయలు పెట్టాడు. ఇంకా మూడు వేల రూపాయలు కొరవ పడుతున్నాయి. చదివింపుల్లో మరో

వెయ్యి రూపాయలు రావచ్చు. ఈ సంగతి జ్వాలా ప్రసాద్‌కు తెలుసు కాని రాబోయేదాన్ని గురించి కచ్చితంగా చెప్పలేము.

నవంబరు మూడోవారం కూడా దాటింది. జ్వాలా ప్రసాద్ చుట్టాలూ పక్కాలూ అంతా రావడం మొదలుపెట్టారు. ఇంట్లో సందడిగా ఉంది. విద్యను తీసుకు రావడానికి నవల్ బనారస వెళ్ళాడు. నవంబరు ఇరవై మూడు కల్లా అతను విద్యను తీసుకొని వచ్చాడు. ఆమెను పెండ్లికూతురు చేశారు.

విడిది వారి సంగతంతా నవల్ చూస్తూన్నాడు. నవల్ వచ్చీరాగానే పనిలో మునిగి పోయాడు. ఏర్పాట్లన్నీ చక్కగా చేసేశాడు నవల్. జ్ఞాన ప్రకాశ్ ఇంటి సంగతులన్నీ చూస్తున్నారు, కాని ఆయనది పేరే కాని ఏర్పాట్లన్నీ భీఖూ చూడుకుంటున్నాడు. బయటినుండి సామాను తీసుకు రావడంలో నవల్ భీఖూకు సాయం చేస్తున్నాడు. ఒకరోజు సామాన్లన్నీ తీసుకుని నవల్ ఇంటికి వచ్చేసరికి భీఖూ కనిపించి అన్నాడు: "బాబయ్యా! ముందు గదిలో జ్వాలన్నయ్య జ్ఞానన్నయ్యతో ఏదో మాట్లాడుతూ ఉన్నారు. ఇద్దరికీ ఏదో మాట వ్యత్యాసం వచ్చినట్టనిపించింది నాకు. కాసంత మీరు వెళ్ళి కనుక్కోండి బాబూ!"

నవల్ డ్రాయింగ్ రూములోకి వెళ్ళాడు. జ్ఞానప్రకాశ్ అంటున్నారు: "ఏమయినా సరే, మీరు అప్పు చేయటానికి నేనొప్పుకోను. పళ్ళెంలో రెండు వేలు పెట్టవద్దు. ఆ మొత్తం తర్వాత ఇస్తామని చెప్పండి."

"చాలా గొడవ అవుతుంది జ్ఞానూ! నీకు తెలియదు" అన్నారు జ్వాలా ప్రసాద్. "ఈ రెండువేలు నేను ఏదో విధంగా సమకూర్చాలి."

"ఎల్లుండి పెండ్లి పెట్టుకొని ఇప్పుడు రెండువేల రూపాయలు ఎక్కడి నుంచి తీసుకొస్తారు?" అన్నారు జ్ఞానప్రకాశ్: "రూపాయలంటే ఏమన్నా బజారులో పారేసి ఉన్నాయా - వెళ్ళి పోగు చేసుకు రావడానికి! దగ్గఱ ఏముంటే దానితో సరిపుచ్చేసేయండి అంతాను. పిల్లకు పెండ్లి చేస్తున్నారు కాని మరేం అమర్యాదకరమైన పని చెయ్యడం లేదు."

జ్వాలా ప్రసాద్ చాలా విషాదంగా నవ్వారు: "ఆడపిల్ల పెండ్లి చేయడం అంటే అమర్యాదకరమైన పని చేయడం అన్నమాటే జ్ఞానూ! ఈ యిల్లు తాకట్టు పెడితే ఒక వెయ్యి రూపాయలు రావచ్చు. ఎక్కడన్నా మాట్లాడు జ్ఞానూ!"

"ఇల్లు తాకట్టు పెట్టడం - దస్తావేజులు తయారుచేయించడం - అప్పిచ్చేవాణ్ణి వెదకడం - అన్నయ్యా! నీకేమన్నా మతి చెడిపోయిందా యేం! విపరీతమైన వడ్డీ ఇవ్వాల్సి వస్తుంది. వీల్లేదు. ఇదంతా అయ్యేపని కాదు! మనకిక వ్యవధి కూడా లేదు."

జ్వాలా ప్రసాద్ కొంచెంసేపు ఆలోచించిన తర్వాత నవల్‌ను పిలిచి అన్నారు: "మీ నాయనమ్మను కొంచెం పిల్చుకురా తండ్రీ!"

నవల్ యమునను పిల్చుకు వచ్చాడు. "ఏమిటి సంగతి! త్వరగా చెప్పండి. ముంగిట్లో ముత్తైదులంతా వచ్చి ఉన్నారు. దేవీపూజ జరుగుతూ ఉన్నది. నేను తొందరగా వెళ్ళాలి" అన్నది యమున.

"ఏం లేదు. రెండు వేల రూపాయలు కొరవ పడుతున్నాయి. ఎక్కడా పారుపోవడం లేదు." అన్నాడు జ్వాలా ప్రసాద్.

"అయితే మరి నేనేం చెయ్యను. ఇది మగవాళ్ళు చూసుకోవలసిన విషయం! మీరున్నారు, జ్ఞాన్‌బాబు ఉన్నారు......"

"మా వల్ల అయేటట్టయితే నిన్నెందుకు పిలుస్తానే?" అన్నారు జ్వాలా ప్రసాద్ విసుక్కుంటూ.

"అయితే మరి నన్నెందుకు పిలిచారో చెప్పండి" అన్నది యమున ఏదో సందేహంతో.

"అదే చెప్పడం. నీవీ, అమ్మాయివీ కొన్ని సొమ్ములిస్తే కుదువపెట్టి డబ్బు తీసుకురావాలి."

"అయ్యో రామ! అంతవరకు వచ్చిందీ." అన్నది యమున విచారంతో.

"వేరే మార్గం లేదు. దగ్గర ఉన్నదంతా అయిపోయింది. ఇల్లు తాకట్టు పెట్టడానికి వ్యవధి లేదు. ఇదొక్కటే మార్గం కనిపిస్తూ ఉంది. రేపు ఉదయం నాకు సొమ్ము లిచ్చేసెయి. ఎల్లుండి పెండ్లివాళ్ళు వస్తున్నారు." అన్నారు జ్వాలా ప్రసాద్.

యమున కండ్లల్లో నీళ్ళు నిండాయి: "కోడల్ని ఈ మాట ఏ మొహం పెట్టుకొని అడగను! నాకు సొమ్ములు లేకపోయినా పరవాలేదు. కాని తన కూతురు పెండ్లి అవుతూఉంటే కోడలిమెడ బోసిగాఉంటే ఎలా ఉంటుంది! పరువు, మర్యాద అన్నీ పోతాయి.

"పరువు మర్యాద ఆలోచించే సమయం కాదిది. అలా చేయక తప్పదు. రేపు ఉదయానికల్లా సొమ్ములు నా చేతికి రావాలి."

కన్నీటితో యమున వెళ్ళిపోయింది. ముంగిట్లో గౌరీపూజ జరుగుతూ ఉంది. ఆడవాళ్ళంతా పకపకా నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. యమున మాత్రం మాటామంతీ లేకుండ ఉదాసీనంగా అన్ని పనులూ చేస్తూ ఉన్నది. యమున ఔదాసీన్యం గమనించి రుక్మిణి ఆమె దగ్గరకు వెళ్ళి అడిగింది: "అత్తయ్యా! ఏమిటలా ఉన్నావు? ఒంట్లో సరిగా ఉందా?" యమున రుక్మిణిని లోపలికి తీసుకువెళ్ళి పరిస్థితి అంతా చెప్పింది.

అప్పటినుండీ ఇంట్లో అదో రకమైన ఔదాసీన్యం ఏర్పడిపోయింది. ఇంట్లో జరుగవలసిన ఆచారాలూ, విధులూ జరుగుతునే ఉన్నాయి కాని ఎవ్వరికీ ఉత్సాహం గాని సంతోషం గాని ఉన్నట్టు తోచడంలేదు. ఇదంతా ఏమిటి, ఎందుకిలా మార్పు వచ్చింది అనే విషయం అతిథులకు బోధపడడం లేదు. కాని ప్రతివాడికి ఏదో ఖంగారుగా ఉంది.

సాయంత్రానికల్లా ఇంట్లో వాతావరణమంతా చాలావరకు మారి పోయింది. వాతావరణంలో కనిపిస్తున్న ఈ మార్పును అందరికంటె ఎక్కువగా భీఖా గమనించాడు. కాని ఏమయిందో ఎందుకయిందో అతనికి బోధపడడం లేదు. అతను ఉండబట్టలేక యమునను సామాన్ల గదిలోకి పిలిచి అడిగాడు: "అమ్మగారూ! ఇదేమిటి అందరూ ఇలా మారిపోయారు? అసలేమయింది? ఉన్నట్టుండి సంతోషమంతా మాయమై పోయిందే?"

యమున కంట తడిపెట్టింది. "ఇదంతా భగవంతుని మాయ భీఖా! దైవం మనల్ని నాశనం చేయాలని సంకల్పించాడు. కొడుకును తీసుకు వెళ్ళాడు. ఇప్పుడు నా ఒంటిమీద నగల్ని కూడా తీసుకు పోవాలని చూస్తున్నాడు." విషయమంతా వివరంగా భీఖాకు చెప్పింది యమున."

"ఓష్!" ఇంతేనా అంటూనే భీఖా ముఖం పైన చిరునవ్వు కనిపించింది. "అయితే మీ సొమ్ములేమీ పోకుండా నేను చూస్తాను. సంతోషంగా అమ్మాయిని పెండ్లికూతురుని చేయండి. పెద్దబాబు ఇంట్లోనే ఉన్నారా?"

"అవును, జ్ఞాన్‌బాబూ, నవల్‌తో కూర్చుని ఏదో మాట్లాడుతున్నారు" అని యమున వెళ్ళిపోయింది.

నవల్, జ్ఞానప్రకాశ్ కూర్చుని వరపూజలో ఇయ్యాల్సిన విందును గురించి మాట్లాడుకుంటున్నారు. పెండ్లివాళ్ళంతా కలిసి వంద మందికి పైన ఉండరు. కాని ఊళ్ళో స్నేహితులూ, బంధువులూ అంతా కలిసి

దాదాపు నాలుగు వందల మంది అవుతారు. జ్వాలాప్రసాద్ వాళ్ళకు కొంచెం ఎడంగా మౌనంగా కూర్చుని వాళ్ళ మాటలు వింటున్నారు. ఆయనలో ఏ మాత్రం ఉత్సాహం కనిపించడం లేదు. అదే సమయంలో భిఖా ఒక రేకు పెట్టె తీసుకొని డ్రాయింగ్ రూములోకి వచ్చాడు. వస్తూనే అతను ఆ పెట్టెను జ్వాలా ప్రసాద్ ముందు పెట్టాడు: "అమ్మాయిగారి పెండ్లికి నేనిది చదివించ దలుచుకున్నాను బాబయ్యా!" అన్నాడు.

జ్వాలా ప్రసాద్‌కు ఆశ్చర్యం వేసింది: "నీవు చదివించేదేమిటి? ఏమిటి భిఖా! దీనిలో ఏముంది?"

"నాకు లెక్క పెట్టడం రాదు. కాని దీన్లో చాలా రూపాయలున్నాయి. కనక అమ్మగారి సొమ్ములు, కోడలిగారి సొమ్ములు కుదువ పెట్టాల్సిన అవసరం లేదు. విద్య మా అమ్మాయే కదా! నేను నా చేతులతో పెంచాను. నా ఒళ్ళో పెరిగింది."

జ్ఞానప్రకాశ్, నవల్ లేచి భిఖా దగ్గరకు వచ్చారు. "దీనిలో ఎన్ని రూపాయలున్నాయి?" అని అడిగాడు జ్ఞానప్రకాశ్.

"చెప్పలేదా బాబూ, నాకు లెక్కరాదు. నాకు నిలువ ఉన్నదంతా దీన్లోనే ఉంది. జీవితమంతా ఈ యింట్లోనే గడిచింది కదా బాబూ! అప్పుడప్పుడు మిగిలిందంతా దీన్లో దాచేస్తూ వచ్చాను. మా అమ్మ నాకిచ్చిపోయింది కూడా ఇందులోనే ఉంది. అంతా లెక్క చూచుకోండి బాబూ!"

"భిఖా! ఇది నీవు జీవితమంతా శ్రమపడి నిలవచేసుకున్నది. ఇది మేము తీసుకోగూడదు." అన్నారు జ్వాలా ప్రసాద్.

"నేను వేరు, మీరు వేరా బాబయ్యా! నాకు వేరే ఇల్లు వాకిలి అంటూ ఉంటేగా! నాకున్నదంతా ఈ పిల్లా జెల్లా! వీళ్ళందరిని నేను ఎత్తుకొని పెంచాను. పెంచి పెద్దవాళ్ళను చేశాను." అన్నాడు భిఖా. ఆ తర్వాత భిఖా నిబ్బరం లేకపోయింది. ఏడుస్తూ అన్నాడు: "బాబయ్యా! గంగా బాబుకు నేనంటే మీకంటే కూడా ఎంతో అపేక్ష. ఆయన అంటే నాకెంతో గర్వంగా ఉండేది. పాపిష్టి దైవం ఆయన్ని తీసుకెళ్ళాడు. మనకు దూరం చేశాడు." భిఖా దుఃఖం ఆపుకోలేక పోతున్నాడు. "గంగా బాబు అమ్మాయి పెండ్లిని గురించే దిగులు పడిపోయారు. అదే ఆయన చివర కోరిక. భగవంతుడి దయవల్ల ఆ రోజు వచ్చింది. విద్యమ్మకోసం

నేను ఈ పెట్టె బయటకు తీసుకు వచ్చాను. దీన్ని మీరే చూచుకోండి. ఇది నా చదివింపు.''

జ్వాలా ప్రసాద్ కళ్ళల్లోకి కూడా నీళ్ళు వచ్చాయి. ఆయన భీఖూ వైపు తిరిగి చూచారు. అంతులేని మమకారం, జాలి ముడతలు పడిన ఆ ముసలి ముఖంలో ఆయనకు కనిపించాయి. తడబడుతూ ఆయన నవల్‌తో అన్నారు: ''నాకు ఈపెట్టె తెరవడానికి కూడా అధికారం లేదు. నీవు తెరువు బాబూ!''

నవల్ పెట్టె తెరిచాడు. దానిలో కొన్ని వెండి ఆభరణాలున్నాయి. అవి ఛింకీ భీఖూకు ఇచ్చిపోయింది. యాభై కాసుల బంగారముంది. పది హేను వందలదాకా డబ్బుంది.

జ్ఞానప్రకాశ్ పన్నెండు వందల రూపాయలు, యాభై కాసులు వేరుగా తీసిపెట్టాడు. ''ఈ కన్యాదానపు ఖర్చులో ఇంతే కొరవపడింది. మిగిలింది నీవు ఉంచుకో! నవల్ పెండ్లిలో కూడా కొంచెం ఇయ్యాల్సి ఉంటుంది కదా! ఇంకా సుధ పెండ్లి కూడా నీవే చెయ్యాలి.'' అన్నారు భీఖూతో ఆయన.

భీఖూ ముఖంలో సంతోషంతో చిరునవ్వు వెల్లి విరిసింది: ''అలాగే బాబయ్యా! బతికి బాగుంటే అన్నీ చేస్తాను.'' అంటూ భీఖూ తన పెట్టె తీసుకొని త్వరత్వరగా వెళ్ళిపోయాడు.

మళ్ళీ వాతావరణం మారింది. అంతటా ఆనందం, ఉల్లాసం వ్యాపించాయి. అంతా ఇంద్రజాలం అనిపించింది.

ముప్పయ్యో తారీఖున పెండ్లి వాళ్ళు వచ్చారు. వివాహం సక్రమంగా జరిగిపోయింది. వింధ్యేశ్వరీ ప్రసాద్‌కేమీ కొరవలేకుండా లాంచనాలన్నీ జరిగాయి. అంపకాలకు ముందు ఆ రోజు ఉదయం నవల్ వింధ్యేశ్వరీ ప్రసాద్‌ను కలుసుకోడానికి విడిది ఇంటికి వెళ్ళాడు. చేతులు కట్టుకొని అతను వింధ్యేశ్వరీ ప్రసాద్‌తో అన్నాడు: ''అతిథి సత్కారాల్లో ఏమయినా లోపం జరిగిఉంటే క్షమించమని అడగడానికి వచ్చాను.''

పెండ్లి కూతురు వాళ్ళు చేసిన మర్యాదలకు వింధ్యేశ్వరీ ప్రసాద్ చాలా సంతోషించారు. ''మాకు చాలా ఆనందంగా ఉందోయ్, నిన్ను చూచి. తండ్రికి తగిన కుమారుడివి. ఔదార్యం, ఉత్సాహం రెండూ నీలో ఉన్నాయి.''

"నేను మిమ్మల్ని ఒక చిన్న విషయం అడగడానికి వచ్చాను. అదేమిటంటే విద్య ఈ సంవత్సరం బి.యే. ఫైనల్‌లో ఉంది. బి.యే. పరీక్ష పూర్తి అయ్యేదాకా చదివించాలి."

వించేశ్వరీ ప్రసాద్ నవ్వుతూ అన్నారు: "అరే, బి.యే. ప్యాసవడానికి మన అమ్మాయి ఏమన్నా ఉద్యోగం చేయాలా?"

"అబ్బే! మీ కోడలికి ఉద్యోగం చేయాల్సిన అవసరమేముంటుంది? కాని సిద్ధేశ్వరీ బాబు డిప్టీ కలెక్టరు. ముందు ముందు కలెక్టరవుతారు. తన భార్య గ్రేడ్యుయేటయితే సంఘంలో తనకే గౌరవంగా ఉంటుంది."

నవల్ చెప్పవలసింది చక్కగానే చెప్పాడు. వించేశ్వరీ ప్రసాద్ సిద్ధేశ్వరీ వైపు చూచారు: "వింటున్నావా నవల్ చెప్పింది? ఏమిటి నీ అభిప్రాయం?" అన్నారు.

"మీ యిష్టం నాన్నగారూ! బి.యే. ప్యాసవడం మంచిదే. అదికాక నాలుగయిదు నెలల్లో అయిపోతుంది కూడాను."

వించేశ్వరీ ప్రసాద్ నవ్వారు: "కాలం మారింది. అందరి ఆలోచనలూ ఒకేరకంగా ఉంటాయి. అలాగేనోయ్, ఒక వారంలో నేను పంపిస్తాను. కాని అమ్మాయి బనారస్‌లో చదువుతున్నది – బోర్డింగ్ హౌస్‌లో ఉంటూ."

'అవునండీ' అన్నాడు నవల్.

"అయితే బోర్డింగ్ హౌస్ ఖర్చు మీరే భరించాలి. ఏం, సిద్ధేశ్వరీ! అంతేనా?"

సిద్ధేశ్వరి సమాధానం చెప్పారు: "ఆ మాట కూడా చెప్పాలా నాన్నగారూ! ఇన్ని రోజులనుంచి చెల్లెలికి చదువు చెప్పించినప్పుడు ఇంకా అయిదారు నెలల్లో ముంచుకు పోయేదేముంది?" అంటూ పెద్దగా నవ్వాడు.

సిద్ధేశ్వరి నవ్విన ఆ నవ్వు ఎంతో అసహ్యంగా ఉంది. వించేశ్వరీ ప్రసాద్ మాటలు ఎంతో కృత్రిమంగా, స్వార్థపూరితంగా ఉన్నాయి. కాని నవల్ తన చెల్లెలికిచ్చిన మాట నిలబెట్టగలిగినందుకు సంతోషించాడు.

నాలుగు

"అదికాదండీ! వాళ్ళు పాపం స్వరాజ్యం ఇస్తామని వస్తే వీళ్ళు వాళ్ళతో మాట్లాడనే లేదుట! ఎంత తెలివి తక్కువతనం!" రాయ్‌బహాదుర్ కామతానాథ్ హెచ్చు స్థాయిలో మట్లాడుతున్నారు: "ఇండియాకు స్వరాజ్యం కాదు – సొరకాయలొస్తాయి."

జ్ఞానప్రకాశ్‌కు నవ్వు వచ్చింది: "రాయ్‌బహాదుర్ గారూ! వాళ్ళను కలుసుకున్నట్టయితే నిజంగా సొరకాయలే వచ్చేవి. అందుకనే మేము సైమన్ కమీషన్ను బహిష్కరించేశాము. వాళ్ళను కలుసుకున్నందువల్ల, ఏమైనా లాభం ఉండి ఉంటే తప్పకుండా కలుసుకుండే వాళ్ళం."

"అయినా, మనకు ప్రాచీన మర్యాదలూ, శిష్టాచారాలూ పోయినాయి లెండి. ఏడు సముద్రాలు దాటి వాళ్ళు మనదేశానికి వస్తే మనం చేయవలసిందిదేనా? విందులు చేసి, వాళ్ళకు మనదేశం చూపించి, మంచి మంచి మాటలు చెప్పినట్టయితే వ్యవహారమంతా ఒక్క క్షణంలో చక్కబడేది. మీరడిగిన దానికి రెట్టింపు ముట్ట జెప్పేవాళ్ళు. అలా రాబట్టడం పోనిచ్చి ఈ కాంగ్రెస్ వాళ్ళు, వాళ్ళను చెడామడా తిట్టడం మొదలుపెట్టారు. సంవత్సరం దాకా చూచారు, వీళ్ళకేమైనా తెలివి వస్తుందేమోనని, వాళ్ళకు తమ కష్ట సుఖాలు చెప్పకొని వాళ్ళు చెప్పే సమాధానం కూడా వింటారేమోనని. కాని అలాంటి లక్షణాలేమీ కనిపించక పోయేసరికి పాపం వాళ్ళే మొహం చిన్న బుచ్చుకొని పోయినారు. ఎలాంటి మొరటువాళ్ళురా వీళ్ళు, ఒట్టి అడవి మృగాల్లాగా ఉన్నారని అనుకొని పోయి ఉంటారు."

జ్ఞానప్రకాశ్‌కు రాయ్‌బహాదుర్ మాటలు వింటూ ఉంటే చాలా వినోదంగా ఉంది. ఆయన అన్నారు: "రాయ్‌బహాదుర్ గారూ! సైమన్ కమీషనుతో మాట్లాడడానికి మిమ్మల్ని ఎందుకు పిలవలేదో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇంత పెద్ద బిరుదు, ఆస్తి, గౌరవం, మర్యాద – ఇన్ని ఉన్నా మీ మాట ఎత్తుకోనేలేదు వాళ్ళు."

"ఏం చెప్పను! ఈ ఇంగ్లీషు ఆఫీసర్లను నమ్మడానికి వీల్లేదు. మా దగ్గర వేలకువేలు చందా తీసుకువెళతారు. సైమను కమీషనుతో మాట్లాడడానికి కాంగ్రెసు వాళ్ళనే బతిమిలాడుతారు. నేను వెళ్ళినట్లయితే కమిషను

వాళ్ళను స్వరాజ్యానికి ఒప్పించే వాణ్ణి. నేను లెఫ్టినెంటు గవర్నరుకు ఉత్తరం కూడా వ్రాశాను. కాని నేను వ్రాసిన దానికి జవాబు కూడా రాలేదు వాళ్ళ దగ్గర నుండి. ఇక రానీ చందా కోసం, చిల్లిగవ్వ కూడా ఇవ్వను మలపరాయళ్ళకు.''

''అది సరేకానిండి. మీరు యూరపునుండి చాలా ఆలస్యంగా వచ్చారే. అక్టోబరులో వస్తామని చెప్పారు. తీరా వచ్చేసరికి డిశంబరయింది. యూరపు అంతా ఘాలించేసినట్లున్నారు.'' అన్నారు జ్వాలా ప్రసాద్.

రాయ్‌బహాదుర్ కామతానాథ్ నవ్వుతూ అన్నారు: ''ఏం చెప్ప మంటారు. మా ఉష మొండి పట్టుపట్టింది. అసలు దానికి యూరప్ నుండి తిరిగి రావడమే ఇష్టంలేదు. కాని ఆ దేశాల్లో చలికి నేను తట్టుకోలేక పోయాను. ఇక్కడకు వచ్చిన తర్వాత మీతో కలిసికోడానికి తీరికే లేక పోయింది. ఉషకు కూడా ఒక సంవత్సరం చెడిపోయింది. ఇక వచ్చే సంవత్సరమే అది యూనివర్సిటీలో చేరుతుంది.''

ఇంతలో నవల్ గదిలోకి వచ్చాడు. అతనితోపాటు భీఖా ఒక ట్రేలో నాలుగు గ్లాసుల షర్‌బత్ తీసుకుని వచ్చాడు.

జ్ఞానప్రకాశ్ అడిగారు: ''ఈసారి వేసవిలో ఎక్కడికి వెళ్ళాలని అను కుంటున్నారు?''

''మసూరీలో ఒక బంగళా కొన్నాను. ప్రతి సంవత్సరం వేసవిలో ఏదో ఒక చోటికి వెళ్ళడం అవుతున్నది. అందుకని ఒకేసారి బంగళా కొనేస్తే సరిపోతుందని అనుకున్నాను. చాలా చౌకగా గూడా దొరికింది - అంతా కలిసి పన్నెండు వేలు.'' తర్వాత ఆయన జ్వాలా ప్రసాద్‌తో అన్నారు: ''ఇదే మీకు నా ఆహ్వానం. మే ఆరంభమయింది. మూడు నాలుగు రోజుల్లో నేను ఒంటరిగానే వెళ్ళుతున్నాను. మీరు కూడా నాతో రాకూడదూ?''

జ్వాలా ప్రసాద్ నవ్వుతూ అన్నారు: ''నేనేం వస్తాను మసూరీ అలహాబాదులో నాకేమీ ఇబ్బందిగా కూడా లేదు.''

కామతానాథ్ షర్‌బత్ తాగుతూ అన్నారు: ''అయితే నవల్! ఇటీవల నీవు మా యింటికి రావడమే మానేశావ్. ఎందుకోమరి? ఇంగ్లండు వెళ్ళడం సంగతి ఏమయింది? ఈ సంవత్సరం నీకు చెడిపోనే పోయింది.''

"మరేనండి! కాని ఇంగ్లండు వెళ్ళాలనే ఆలోచన కూడా ఏమీలేదు. యల్. యల్. బి. ప్రీవియస్ పరీక్ష అయిపోయింది. బాగానే వ్రాశాను."

"అయితే మరి ప్లీడరవాలనా నీ ఉద్దేశ్యం?" అని విచారంగా అడిగారు కామతానాథ్.

దానికి సమాధానంగా జ్ఞానప్రకాశ్ అన్నారు: "ప్లీడరు పని చెయ్యడం ఏమయినా తప్పయిన పనా? మీ కుమారుడు గౌరీనాథ్ కూడా ప్లీడరు పనే చేస్తున్నాడేమో!"

"ఆ, వాడి మొహం, వాడి ప్లీడరు పనీనూ వాడూనూ!" అన్నారు కామతానాథ్. "నెలంతా చాకిరిచేస్తే యాభై అరవై రూపాయలకు మించిరావు. వద్దు నవల్, ఈ ప్లీడరుపని నీకు వద్దు. నీవు ఇంగ్లండు వెళ్ళు." తర్వాత ఆయన జ్వాలా ప్రసాద్ వైపు చూచి అన్నారు: "మా కుటుంబంలో ఎవరైనా పెద్ద ఆఫీసరు కావాలని నా అభిలాష. గౌరీనాథ్ ఒట్టి బడుద్ధాయి అయి పోయాడు. ఎంతో అవస్థపడి కింద మీదయి ప్లీడరు పరీక్ష పాసయాడు వాడు. మూడు సంవత్సరాలనుంచి పని చేస్తూ వుంటే ఇప్పటికి వందో యాభైయో వస్తున్నాయి. సీతానాథ్ బిజినెస్ చూచుకుంటున్నాడు అంటే, ఇంటి సంగతులన్నీ చూచుకుంటున్నాడన్నమాట. ఈ సంవత్సరం లక్షా పాతికవేల లాభం వచ్చింది. అందుకని కొడుకులు కాకపోయినా అల్లుడన్నా కలెక్టరవుతాడేమోనని అనుకున్నాను. నా అభిలాష నెరవేరితే చాలు. ఎంత ఖర్చయినా పరవాలేదు."

కామతానాథ్ సంభాషణతో నవల్‌కు విసుగువేసింది. "ఎలాగైనా యల్. యల్. బి. ఫైనల్ పూర్తి చేయాలి. అదిగాక నేను కూడా మా కుటుంబంలో ప్రభుత్వోద్యోగం చేసే సంప్రదాయాన్ని ఇంతటితో సమాప్తం చేయాలని అనుకుంటున్నాను. ప్లీడరుపని నాకు కలిసి వస్తుందనే అనుకుంటాను." అన్నాడు నవల్.

కామతానాథ్ లేచి నిలబడ్డారు: "నావిధి నేను నిర్వర్తించడానికి సిద్ధంగానే ఉన్నాను. నెమ్మదిగా నా సలహాను గురించి ఆలోచించు. ఈ ప్లీడరుపని వల్ల ఏమీ లాభంలేదని మీరు కూడా నచ్చ చెప్పండి ఇతనికి. రెండు నెలల వరకు నేను మసూరీలో ఉంటాను. అది సరేకాని నవల్! ఉష ఎప్పుడూ నీ సంగతే అనుకొంటుంది. అప్పుడప్పుడూ మా యింటికి వస్తూ పోతూ

ఉండు. దాని మనస్సుకు హాయిగా ఉంటుంది. ఏదీ, ఇక ఉషను ఇంటికి వెళ్ళుదాం రమ్మను. చాలా ఆలశ్యమై పోయింది."

ఉష, విద్య ఇంట్లో కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. విద్య బి. యే. పరీక్ష పూర్తిచేసుకుని బనారస్‌నుండి వచ్చి మూడు రోజులయింది. ఉషను కారులో ఎక్కించి నవల్, విద్య తిరిగి వస్తూ ఉండగా విద్య అన్నది: "అన్నయ్యా! నీవు ఇంగ్లండు వెళ్ళకూడదూ? ఈ విషయంలో నీకు ఎలాగైనా నచ్చచెప్పమని ఉష మరీ మరీ చెప్పింది."

నవల్‌కు చిరాకు వేసింది: "నేను వెళ్ళను, వెళ్ళను, వెళ్ళను. కామతానాథ్ గారి అమ్మాయిని పెండ్లి చేసుకోవడం నా కిష్టమేగాని కామతానాథ్‌కు బానిస అవడం నాకెంత మాత్రం ఇష్టం లేదు." అన్నాడతను.

"అయితే కామతానాథ్‌గారి అమ్మాయిని పెండ్లి చేసికోవడం కూడా నీ వల్ల గాదన్నమాట! ఆ అమ్మాయి ఏవో కలలు కంటున్నది, ఆవిడకేవో ఆశలు ఆకాంక్షలూ ఉన్నాయి". అంటూ విద్య ఒక్కసారి నిట్టూర్పు విడిచింది: "అన్నయ్యా ఆలోచనలకూ, ఆదర్శాలకూ పొత్తు కుదరని ఈ అసమాన కుటుంబాల మధ్య వివాహ సంబంధం చాలా ప్రమాదకరంగా ఉంటుంది. నా సంగతే చూడు. కాపరానికి వెళ్ళాల్సిన రోజులు సమీపించే కొద్దీ నాకేదో ఖంగారుగా ఉంటున్నది."

విద్య చెప్పిన మాటలు వినేసరికి నవల్‌కు దిగులు వేసింది: "విద్యా నీవు మీ అత్తగారింటి విశేషాలేమీ నాకు చెప్పలేదు. నీకక్కడ ఏమన్నా కష్టంగా ఉన్నదా? ఉన్నదున్నట్లు చెప్పు."

విద్యకు నవ్వు వచ్చింది. "ఇంతా నేనక్కడ ఉండి వచ్చింది ఒక వారమేకదా అన్నయ్యా! చెప్పడానికి ఏముంది? కాని ఒక మాట మాత్రం కచ్చితంగా చెప్పగలను. అత్తగారిల్లంటే నాకేమిటో అసహ్యమనిపిస్తున్నది. మన యింటిని సర్వ నాశనం చేసిన వారిపట్ల నాకు ప్రేమ ఎలా ఏర్పడుతుంది చెప్పు. ఆ యింట్లో ఉండే ప్రతి వ్యక్తి నాకొక పిశాచంలా కనిపిస్తారు. నా మనసులో ఏర్పడిన ఈ అభిప్రాయాన్ని పోగొట్టుకోడానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాను. కాని అది సాధ్యమవడం లేదు. ఆ కుటుంబం అంటే నాకెందుకో అతిభయంకరమైన అసహ్యం వేస్తూ ఉన్నది."

విద్య మాటలు విని నవల్ స్తబ్ధుడయ్యాడు: "విద్యా! జీవితమంటే మన

మనస్సును సమాధాన పెట్టుకోవడమన్నమాట. అలాంటి అభిప్రాయానికి నీవు నీ మనస్సులో తావియ్యకు. భావావేశంలో నీవు అనకూడని మాట అనవని నాకు మాట ఇయ్యాలి.''

"అన్నయ్యా! నావల్ల నీకేమీ చీకాకు కలుగనియ్యను. జీవితమొక సమాధానమని నాకు తెలుసు. కాని ఈ సమాధానానికి కూడా రెండు రూపాలుంటాయి. నాకు సంబంధించినంత వరకు నేను మర్యాద, అభిమానం మీద నిలబడి ఉంటాను.'' అంటూ విద్య ఇంట్లోకి వెళ్ళిపోయింది.

విద్యకు జూన్ మూడో వారంలో కార్యం చేయాడానికి నిర్ణయం జరిగింది. సిద్ధేశ్వరికి ఉన్నావ్ జిల్లాలో ఉద్యోగం అయింది. అతనికి ఈ లోగా సెలవు దొరికేటట్టు లేదు. కార్యం కాగానే సిద్ధేశ్వరి విద్యను తీసుకుని నేరుగా ఉన్నావ్ వెళ్ళాలని తీర్మానించారు. ఫైజాబాద్ వెళ్ళాల్సిన పని లేదని విద్యకు సంతోషంగానే ఉంది. ఆమెకు విందేశ్వరీ ప్రసాద్ అంటే బొత్తుగా గిట్టదు.

విద్య ఉన్నావ్ వెళ్ళిపోయిన తరువాత నవల్ దేశంలోని రాజకీయ సంచలనాన్ని గురించి ఎక్కువగా ఆలోచించడం మొదలుపెట్టాడు. ఎక్కువ సేపు దేశంలోని రాజకీయాలను గురించి జ్ఞానప్రకాశ్‌తో చర్చించడంలో అతను గడుపుతూ ఉన్నాడు. దేశమంతటా బలప్రయోగం జరుగుతూ ఉంది. దేశం నలుమూలలనుండి అరెస్టు చేసినట్టు వార్త లెక్కువగా అందుతున్నాయి. ఇంతకు ముందు ఎప్పుడూ నవల్ రాజకీయాలను పట్టించుకోలేదు. ఇప్పుడతనికి రాజకీయాల్లో అభిరుచి ఏర్పడింది.

జూలై నెల వచ్చింది. వానలు జోరుగా కురియడం మొదలుపెట్టాయి. నవల్‌కు యల్.యల్.బి. ప్రీవియస్‌లో ఫస్టుక్లాసు వచ్చింది. విద్య కూడా బి.యే. ఫస్టుక్లాసులో ప్యాసయింది. అంతకు ముందురోజే విద్య దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో చాలా బాధాకరమైన విషయాలున్నాయి. ఉన్నావ్‌లో ఇంటి విషయాలన్నీ సిద్ధేశ్వరి అత్త అయిన ఒక వితంతువు చూస్తూ ఉంది. ఇంట్లో ఆమెదే పెత్తనం. విద్యకు అది తన ఇల్లు అనే అభిప్రాయమే ఏర్పడడం లేదు. అయినప్పటికీ విద్య చాలా ఓర్పుగానే కాలం గడుపుతూ ఉంది. ఒక విధంగా విద్యను ఇంట్లో బంధించినట్లయింది. డిప్టీ కలెక్టరు భార్య అయినప్పటికీ ఆమెకు మామూలు కుటుంబాల్లో ఆడవాళ్ళలాగా ముసుగులోనే ఉండవలసి వచ్చేది.

ఆ రోజు నవల్ నిద్రపోయి లేచేసరికి, అతని మనస్సు ఆనందంగా లేదు. జ్ఞానప్రకాశ్ వరాండాలో కూర్చుని టీ త్రాగుతూ ఆ నాటి పేపరు చదువుకుంటున్నారు. నవల్ కూడా జ్ఞానప్రకాశ్ దగ్గరికివెళ్ళి కూర్చున్నాడు. అతను 'లీడరు' తీసుకొని చూచాడు. ప్రత్యేకమైన వార్త ఏమీ లేదు - విప్లవకారుల మీద కేసులు నడుస్తున్నాయి : అసెంబ్లీలో అధికార వర్గానికీ, అనధికార వర్గానికీ వాగ్వాదాలు జరుగుతూ ఉన్నాయి.

నవల్ పేపరు మూసేసి జ్ఞానప్రకాశ్ వైపు చూచాడు : "జ్ఞాన్‌తాతయ్యా ఇదంతా చేసినందువల్ల ఇండియాకు ఏమయినా లాభం కలుగుతుందంటావా? బలప్రయోగం విపరీతంగా జరుగుతూఉంది. ఏ ఆందోళన చెయ్యకపోయినా ప్రజలను జైళ్లల్లో పెడుతున్నారు. జన సామాన్యం చలించడం లేదు."

జ్ఞానప్రకాశ్ నవ్వుతూ అన్నారు : "అవునోయ్ నవల్! దీనివల్ల ప్రజలు మెలకువతో ఉన్నారని మాత్రం స్పష్టంగా తెలుస్తున్నది. మధ్య వర్గంలో ఈ నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదే, దీని ఫలితం త్వరలోనే తెలుస్తుంది."

"మధ్య వర్గాన్ని పీడిస్తున్న నిరుద్యోగ సమస్యకూ దేశంయొక్క స్వాతంత్ర్యానికీ సంబంధం ఏమిటి తాతయ్యా? నాకర్థం కావడం లేదు."

"చాలా మామూలు విషయం నవల్! దేశంలో నూటికి తొంభైరెండు మంది చదువురానివాళ్ళని నీకు తెలుసుగదా! వాళ్ళకు ఆలోచన తెలియదు, విషయం అర్థంకాదు. వాళ్ళందరికీ నాయకులు కావాలి. ఈ నాయకత్వం చదువుకొన్న వాళ్ళ చేతుల్లో ఉంటుంది. ఈ చదువుకున్న వాళ్ళంతా ధనవంతులు, పెద్ద పెద్ద జమీందార్లు, ఉన్నత పదవుల్లో ఉన్నారు. వారికీ సామాన్య జనానికీ లాభించే విషయాలు ఒకటిగా ఉండవు. అర్థమయిందా ఇప్పుడు?"

"ఆహా! పూర్తిగా తెలిసిపోయింది." అన్నాడు నవల్‌కిశోర్.

"కాని ప్రస్తుతం మనదేశంలో వేలకొలది లక్షల కొలది యువకులు చదువుకున్న వాళ్ళు ఉన్నారు. వాళ్ళందరికీ డబ్బులేదు, ఉద్యోగం లేదు. ఈవిప్లవం, ఈఆందోళనా - ఇదంతా ఈ నిరుద్యోగ సమస్యవల్ల ఏర్పడిందే కదా! చాలా రోజుల వరకూ ఇంగ్లీషువాళ్ళు హిందూ ముస్లిం సమస్యను లేవనెత్తి హిందువులూ, ముసల్మానులూ ఒకరితో ఒకరు పోరాడేటట్టు చేసి ఈ నిరుద్యోగ సమస్యపైకి రాకుండా చేశారు. కాని మిథ్యోపచారాలతో

నిజమైన సమస్యను పరిష్కరించడం సాధ్యం కాదు. ఈనాడు హిందువులకూ ముసల్మానలకూ మధ్య భేద భావం పోయింది. నిరుద్యోగ సమస్యవల్ల ఏర్పడుతున్న అసంతృప్తి అటు హిందువులకూ ఇటు ముసల్మానలకూ సమానమైనదే. ఈ నాడు జరుగుతున్న సంఘటనలన్నీ దీనినే నిరూపిస్తాయి. దేశ రాజకీయ పరిస్థితుల్లో ఏర్పడ్డ ఈ స్థంభన ఎక్కువ రోజులు ఉండదని నా అభిప్రాయం.''

''అయితే మరి ఇంగ్లీషువాళ్ళు ఇండియాకు ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తారని మీరు భావిస్తున్నారా ?''

జ్ఞానప్రకాశ్ కొంచెం ఆలోచించి అన్నారు : ''నవల్ ! అసలు విషయమేమిటంటే ఒత్తిడిలేకుండా బ్రిటిష్ ప్రభుత్వం ఇండియాకు ఏమీ ఇవ్వదు. త్వరలోనే దేశంలో పెద్ద ఉద్యమం బయలుదేరక తప్పదు.''

''దేశం ఏదైనా ఉద్యమానికి సిద్ధంగా ఉన్నదని నాకు తోచడం లేదు.'' అన్నాడు నవల్ : ''ఎక్కడ చూచినా అకర్మణ్యత, నైరాశ్యం కనిపిస్తూఉంది. మహాత్మాగాంధీ మొదట సాగించిన ఉద్యమాన్ని ఉపసంహరించడం చాల పొరపాటయింది.''

''అలా అనడానికి వీల్లేదు, నవల్ ! ఆయన చేసిన పని సరియైనదనే నా అభిప్రాయం. అప్పుడీ ఆందోళన పల్లెటూళ్ళదాకా వ్యాపించలేదు. కేవలం పెద్ద పెద్ద పట్టణాలవరకే కాంగ్రెస్ పరిమితమై ఉంది. కాని ఈ ఏడెనిమిది సంవత్సరాలనుండీ పల్లెటూళ్ళకుకూడా కాంగ్రెసుభావాలు ప్రసరించినాయి. కొద్దిమంది చదువుకొన్న వాళ్ళకే పరిమితమైన ఆందోళన ఎన్నడూ జయప్రదం కాదు. కోట్ల కొలది ప్రజలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించడానికి సిద్ధమైతేనే కాని ఈ ఆందోళన జయప్రదం కాదు.''

నవల్ మాట్లాడలేదు. జ్ఞానప్రకాశ్ మళ్ళీ అన్నారు: ''కాని నవల్ ! ఈ కోట్ల కొలది ప్రజలకు నాయకత్వం కావాలి – నిజాయితీ, నీతి కలిగిన వ్యక్తుల సహకారం కావాలి. మనదేశంలో ఈ నిజాయితీ, నీతి చాలా తక్కువ అయిపోతున్నాయి.''

నవల్ నైరాశ్యంతో నిట్టూర్పు విడిచాడు. ''నీవు చెప్పింది నిజం తాతయ్యా !'' అంటూ అతను కూడ టీ త్రాగసాగాడు.

లార్డు ఇర్విన్ ఇంగ్లండు నుండి వచ్చి 1929 అక్టోబరు 31 వ తేదీన చేసిన ప్రకటనను గురించి దేశమంతటా చర్చ జరుగుతూ ఉంది. యూనివర్సిటీ యూనియన్ తరఫున కాన్వొకేషన్ – వీక్‌లో ఒక వక్తృత్వ సమావేశం ఏర్పాటయింది. అందులో చర్చనీయాంశం: "అధినివేశిక స్వరాజ్యం వల్ల దేశంలోని సమస్యలను పరిష్కరించడం సాధ్యమా?" అని. ఈ విషయం పైన నవల్ తన ఉపన్యాసం తయారుచేస్తున్నాడు. విషయం చాలా కఠినమైంది. ఈ విషయంలో నవల్ జ్ఞానప్రకాశ్ సహాయం పొందడం అవసరమనుకున్నాడు.

జ్ఞానప్రకాశ్ పొద్దున్నే ఫలహారం చేసి కాంగ్రెస్ ఆఫీసుకు వెళ్ళబోయే ముందే నవల్ ఆయన్ని పట్టేశాడు. జ్ఞానప్రకాశ్ కూర్చున్నారు. ఆయన నవల్‌కు తన అభిప్రాయాలను వివరించారు. అప్పటికప్పుడు ఆయన కొక ఆలోచన తట్టింది. అదాయన నవల్‌కు చెప్పారు: "అన్నట్టు నవల్! ఇక్కడ అలహాబాదులో నవంబరు 16 వ తేది సర్వదళ సమావేశం జరుగబోతున్నదని నీకు తెలుసు. అప్పుడిక్కడ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరుగుతుంది. ఆ సమావేశంలో ఈ విషయం మీద చాలా ముఖ్యమైన చర్చలు జరుగుతాయి."

"అవునవును. కాని తాతయ్యా! మరి ఆ సమావేశాల్లో పాల్గొనడానికి నాకు అవకాశం ఉంటుందా?" అని అడిగాడు నవల్. "అదే నేను చెప్తున్నాను. ఆ సమావేశంలో పాల్గొనేందుకు దేశంలో నలుమూలల నుండి ప్రజలు వస్తారు. మాకు మంచి తర్ఫీదు పొందిన సమర్థులయిన వాలంటీర్లు కావాలి. నీవు యూనివర్సిటీ నుంచి పదిహేను – ఇరవైమంది వాలంటీర్లను తయారు చేయగలవా?"

నవల్ చాలా ఉత్సాహంతో అన్నాడు: "దానికేం తాతయ్యా! సరదాగా చేసేస్తాను. ఇంతకుముందు నా కెందుకు చెప్పలేదు? రేపు సాయంత్రానికల్లా నీకీ వాలంటీర్ల జాబితా తయారుచేసి ఇస్తాను. కాని ఈ వాలంటీర్లకు ప్రత్యేకమైన దుస్తులేమన్నా అవసరమా?"

జ్ఞానప్రకాశ్ కొంచెం ఆలోచించి చెప్పారు: "దుస్తులను గురించి ప్రత్యేకంగా ఏమీ అనుకోలేదు. కాని ఖద్దరు జుబ్బా, ఖద్దరు పైజమా లేకుంటే

ధోతీ, గాంధీ టోపీ ఉండాలి. చలిగా ఉన్నది కనుక చిన్న వేస్టు కోటు కూడా ఉంటే బాగుంటుంది. అయిదారు రూపాయలకు ఈ డ్రస్సు తయారవుతుంది. అంతమాత్రం ఖర్చు భరించగలిగిన స్టూడెంట్స్ దొరకాలి.''

సర్వదళ సమావేశం జరిగింది. కాని వాతావరణం నైరాశ్యంతో నిండిపోయింది. వైస్రాయి చేసిన ప్రకటనపై బ్రిటిషు పార్లమెంటులో జరిగిన చర్చలు, దానిపై బ్రిటిష్ మంత్రులు ఆ ప్రకటనను గురించి చేసిన వివరణలూ, కలిసి దేశంలో ఉన్న నవ యువకులను ఉద్రేకపరిచాయి. దేశ యువకులు బ్రిటిష్ పరిపాలకుల ధూర్త నీతిని సహించి లొంగిపొయ్యేందుకు సిద్ధంగా లేరు. వాళ్ళల్లో ఉత్సాహం, ఉద్రేకం, పోరాడవలెననే ఆసక్తి, ప్రాణాలకు లెక్కచేయకుండా ఎదిరించాలనే కుతూహలం ఎక్కువగా ఉంది. ఈ నవయువకులకు నాయకత్వం వహిస్తున్నారు-జవహర్‌లాలు నెహ్రూ, సుభాష్ చంద్రబోస్.

నవల్ ఇదంతా గమనిస్తున్నాడు. అతనిలోని చైతన్యం మేల్కొన్నది. పోరాటం తప్పదని అతను గ్రహించాడు. తాను కూడా ఆ పోరాటంలో పాల్గొనవలెనని నిశ్చయించుకున్నాడు. క్రమంగా నవల్ మనస్సులోని ఆలోచనలు అతనికి తెలియకుండానే కార్యరూపాన్ని పొందుతూన్నాయి.

నవంబరు చివర వారం జరుగుతూ ఉంది. చలి బాగా ఎక్కువయింది. జ్వాలా ప్రసాద్ ఇంట్లో అందరికీ ఉన్ని గుడ్డలూ, పరుపులూ, రజాయిలూ ఏర్పాటు చేస్తున్నారు. ఆయన నవల్‌ను పిలిచి అన్నారు : "బాబూ నవల్ ! పోయిన సంవత్సరం విద్య పెండ్లి ఖర్చులవల్ల నీకు గుడ్డలేమీ కొనియ్యలేదు. నీ గుడ్డలన్నీ పాతవయిపోనట్లున్నాయి, చినిగి పోతున్నాయి కూడా! ఈ సంవత్సరం నీవొక వులెన్ సూటు కుట్టించుకో. చొక్కాలు, పైజమాలు కూడా కొనుక్కో'' అంటూ జ్వాలా ప్రసాద్ నవల్‌కు కొంత పైకం ఇచ్చారు.

"తాతయ్యా! గుడ్డలు మాత్రం నాకు నచ్చినవి కొనుక్కుంటాను. నీకేం అభ్యంతరం లేదుకదా !'' అన్నాడు నవల్.

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: "నవల్ ! ఈ రోజుల్లో ప్రపంచమే తన ఇష్టం వచ్చినట్టు నడుస్తున్నది. అభ్యంతర పెట్టడంవల్ల ప్రయోజనమే ముంటుంది ? కట్టుకొనేది నీవే కదా, నేను కాదు !''

నవల్ డబ్బు తీసుకొని బజారుకు వెళ్ళాడు. చాలా తీవ్రంగా ఆలో

చిస్తున్నాడతను. అనుకోకుండానే అతని కాళ్ళతన్ని ఖాదీ భండారు లోకి తీసుకువెళ్ళినాయి. అతనికే ఆశ్చర్యమయింది. అక్కడనుండి మరోచోటకి వెళ్ళదామని కూడా అతననుకొన్నాడు. కాని అతని కాళ్ళక్కడి నుండి కదల్లేదు. గుడ్డ తీయించి చూచాడు. ఒక తానుతో ఒక కోటు, ఒక జాకెట్టు తయారవుతుందని అంగడివాడు చెప్పాడు. అతనికి కావలసింది కూడా అంతే. అవికాక రెండు ఖద్దరు తాన్లు తీసుకున్నాడు – ఆరు చొక్కాలు, రెండు పైజమాలు, నాలుగు ధోవతులు కూడా తీసుకున్నాడు. ఇవన్నీ తీసుకోగా అతని దగ్గర ఇంకా ఇరవై రూపాయలున్నాయి. అంగడి వాడడిగాడు: "గుడ్డలు కుట్టిస్తారా బాబూ? దర్జీ అంగట్లోనే ఉన్నాడు. అన్నింటికీ కలిసి కుట్టుకూలి పది రూపాయలవుతుంది." నవల్ గుడ్డలు కుట్టడానికి ఇచ్చేశాడు.

నవల్ ఖాదీ భండార్ నుండి కాంగ్రెస్ కమిటీలో జ్ఞానప్రకాశ్ దగ్గరికి వెళ్ళాడు. కాంగ్రెస్ ప్రకటనలనన్నిటినీ తయారుచేయించి జ్ఞానప్రకాశ్ టీ త్రాగుతున్నారు. నవల్‌ను చూచి ఆయన అడిగారు: "ఈరోజు కాంగ్రెస్ కమిటీ వైపు వచ్చావే. ఏమిటి విశేషం? కూర్చో, టీ తాగు. నాతో ఏమన్నా పని ఉందా?"

నవల్ కూర్చుని టీ తయారు చేసుకున్నాడు. "జ్ఞాన్ తాతయ్యా! ఈ రోజు నేనొక సాహసమైన కార్యం చేశాను."

"నీముఖ వైఖరి చూస్తేనే ఆ సంగతి తెలుస్తున్నది. ఏం చేశావో చెప్పు."

"ఈరోజు నుండి ఖద్దరు కట్టడం ఆరంభించాను. వులెన్ సూటు కుట్టించుకోమని తాతయ్య నాకు యాభై రూపాయలు ఇచ్చారు. వాటితో నేను ఖద్దరు గుడ్డలు తీసుకొని కుట్టడానికి ఇచ్చి వచ్చాను. నలభై రూపాయల్లో ఆరు చొక్కాలు, రెండు పైజమాలు, నాలుగు ధోవతులు, ఒక కోటు ఒక జాకెట్, ఆరు గాంధీ టోపీలు వచ్చాయి – కుట్టు కూలి కూడా కలిసి. ఎంత చౌకగా వచ్చాయో!"

జ్ఞానప్రకాశ్ చాలా గాంభీర్యంగా అన్నారు: "అంతా బాగానే ఉంది. కాని ముందు యల్.యల్.బి. పాసవాలి. ఒకమాట మాత్రం గుర్తు పెట్టుకో. ప్లీడరు పరీక్ష ప్యాసయేవరకూ రాజకీయాల్లో కార్యరూపంగా నీవు పాల్గొనడానికి నేను ఒప్పుకోను. లేకుంటే జ్వాలన్నయ్య నన్నే అడుగుతారు."

"ఇప్పుడే రాజకీయ కార్యరంగంలో దిగాలని నాకు అభిలాష లేదు. అందులో మీకు సందేహం అక్కర్లేదు. కాని ఖద్దరు కట్టడం మొదలు పెట్టి డానికి అభ్యంతరమేమీ ఉండదనుకుంటాను."

"ఉండదు, కాని సి.ఐ.డి. వాళ్ళ జాబితాలోకి ఎక్కుతావు. ఆ ప్రమాదం మాత్రం ఉంది. పరవాలేదులే, కార్యరంగంలో నీవు దిగనంత వరకు పోలీసులు నిన్నేమీ చేయలేరు. నీవు గవర్నమెంటులో పని చెయ్యబోవడం కూడా లేదు."

డిశంబరు మొదలు పెట్టగానే చలి తీవ్రరూపం ధరించింది. శనివారం సాయంత్రం రాయ్‌బహాదూర్ కామతానాథ్ జ్వాలా ప్రసాద్‌ను కలుసుకు నేందుకు వచ్చారు. ఆరోజు రాయ్‌బహాదూర్ కామతానాథ్ చాలా గంభీ రంగా కనిపిస్తున్నారు. కామతానాథ్ డ్రాయింగ్ రూములో కూర్చున్న తర్వాత జ్వాలా ప్రసాద్ ఆయనతో అన్నారు: "ఏమండీ రాయ్‌బహాదుర్ గారూ! ఈరోజు మీరు చాలా గంభీరంగా ఉన్నారే? ఏం విశేషం?"

"ఏం లేదు. ఏదో పనిపాటల్లో తీరికలేక అలా ఉంది. సీతానాథ్ పని బాగా పెంచేస్తున్నాడు. నేను కూడా తీరికలేకుండా ఏదో పని చేస్తూ ఉండాల్సి వస్తున్నది. ఈరోజు ఉదయం నుంచి క్షణం తీరలేదు. మిమ్మల్ని చూచి చాలా రోజులయిందని చెప్పి ఇలా వచ్చాను."

జ్వాలా ప్రసాద్ భీఖూకు టీ తీసుకురమ్మని చెప్పి కామతానాథ్‌తో సంభాషణ ప్రారంభించారు: "ఆఁ చెప్పండి, రాయ్‌బహాదుర్ గారూ! వ్యాపారమంటే మరి తీరికలేకుండా పనిచేయాల్సి ఉంటుంది. లేకుంటే అన వసరంగా తలనొప్పి తీసుకవచ్చే వ్యాపారంకూడా ఒక వ్యాపారమేనా?"

"డిప్టీగారూ! ఈ జీవితమే ఒక తలనొప్పి. కావలసినంత సంపాయించాం గదా అని ఇక మానేద్దామని అనుకున్నాను. ఏడు గ్రామాలు మన చేతిలో ఉన్నాయి. ఊళ్ళో, అయిదు మహాడీలున్నాయి. కాని మన సీతానాథ్ ..... వాడు క్షణం కూడా ఊరికే కూర్చోడు. ఇల్లు వాకిలీ, ఆస్తి పాస్తి అంతా గౌరీనాథ్‌కు వదిలేసి, వ్యాపారమంతా సీతానాథ్‌ను చూచుకోమని చెప్పి నేను నిర్విచారంగా కూర్చుందామనుకున్నాను. కాని మన సీతా నాథ్ వ్యాపారాన్ని విపరీతంగా పెంచాడు. ఒక నెల క్రితం వాడొక పిండి మిల్లు కొన్నాడు."

కామతానాథ్‌కు తన గొప్ప చెప్పుకోటమంటే మహా సరదా. ఆ

విషయం జ్వాలా ప్రసాద్‌కు బాగా తెలుసు. అప్పుడప్పుడూ ఆయనకీ పద్ధతి రుచించేది కూడా కాదు. కామతానాథ్ చెప్పిందంతా విని ఆయన అన్నారు. "అదంతా ఇప్పుడెందుకు లెండి. అసలీకాలానికి తగింది వ్యాపారం: ఆస్థానాలు, జమీందారీ వల్ల ప్రస్తుతం ఏమీ లాభం లేదు. జమీందార్లూ, అగ్రహారీకులూ అంతా నశించిపోతున్నారు."

టీ త్రాగుతూ కామతానాథ్ అడిగాడు: "అయితే డిప్టీగారూ! నవల్‌ను గురించి మీరేమాలోచించారు?"

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: "మన మాలోచించి నట్టుగా అవడం లేదని అసలా విషయం ఆలోచించడమే మానేశాను. అదిగాక నవల్ పెరిగి పెద్దవాడయినాడు. వాడు నా మాట వినడే వినడు. అంతకంటే ఏ విషయంలోనూ వాడు నన్ను సలహా అడగడు – అనడం బాగుంటుంది. వాడి మనస్సుకు నచ్చినట్టు చేస్తాడు."

"ఇది చాలా తగని పని" అన్నారు కామతానాథ్. "ఎవరో అంటుంటే విన్నాను. అతను కాంగ్రెస్‌లో వాలంటీరుగా చేరాడట. ఖద్దరు కట్టడం మొదలు పెట్టాడట."

"అవును, ఆల్ పార్టీస్ కాన్ఫరెన్స్ అయిందే, అందులో వాడు వాలంటీరుగా పని చేశాడు. తప్పుపని చేయడం లేదుకదా అని నేను కాదననూ లేదు. అదికాక కాలం మారింది. ఈ కాలపు ఆచారాలు, మర్యాదలు కూడా మారినాయి. నేను కాదంటే, వాడు నామాట వినకపోవచ్చు. అప్పుడు అనవసరంగా నా మనస్సు బాధ పడుతుంది. వాడు మంచి మార్గంలో ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను. వాడిలో నీతి, నిజాయితీ ఉన్నాయి. స్వానుభవం వల్ల ఈ ప్రపంచంలో నీతి, నిజాయితీ – ఇవే నిజమైన ఆస్తి పాస్తులని, నాకు బోధపడింది."

"అవును, అది నిజమే. కాని అవన్నీ ప్రపంచంలో పనికొచ్చేవి కావు. ప్రపంచంలో రాణించాలంటే లోకం ఎలా వెళుతుంటే మనం కూడా అలాగే వెళ్ళాలి. తప్పదు. అలా కాకుండా నీతి, నిజాయితీ అని కూర్చుంటే, కానీ పుట్టదు. మీకు బహుశా తెలియకపోవచ్చు – నవల్ పేరు సి.ఐ.డి. రికార్డుల్లోకి ఎక్కింది. ఎంతో అవస్థపడి అతని పేరు నేను కొట్టేయించాను. దానికి గాను నేను రెండు వందల రూపాయలు ఇయ్యాల్సి వచ్చింది."

జ్వాలాప్రసాద్ విచారపడ్డారు: "అయితే మరి నవల్ సి.ఐ.డి. వాళ్ళ

దృష్టిలో పడ్డాడన్నమాట! వాడు ప్రభుత్వానికి వ్యతిరేకమైన పనులెప్పుడూ చెయ్యలేదే!"

"ఆ సంగతి ఇక మరచిపొండి. అతని పేరు కొట్టేయించానని చెప్పాను గదా! ఏ పనయినా కొంచెం ఆలోచించుకొని చేస్తే బాగుంటుందని నవల్‌కు చెప్పి పోదామని నేను వచ్చాను. బ్రిటిష్ ప్రభుత్వం చాలా కఠోరంగా ప్రవర్తిస్తూ ఉంది. సైన్యాన్ని సిద్ధంగా ఉండవలసిందని ఉత్తర్వులు చేశారు. ఆయన కర్నల్ డిగ్వీ లేడూ—పాపం ఎంత మంచి వాడనీ, మొన్ననే నాకు రెండు లక్షల కాంట్రాక్టు ఇచ్చాడు—మరి ఆ కర్నల్ డిగ్వీ చెప్పాడు—ఇంగ్లండు నుండి రెండు లక్షల సైన్యం వస్తున్నదని. తుపాకులు, మిషను గన్లూ - వీటికి లెక్కలేదు. బొంబాయి, కలకత్తా, కరాచీ అంతటా వీటిని సేకరించి పెట్టారు."

జ్వాలా ప్రసాద్‌కు మరీ ఖంగారు వేసింది: "రాయ్‌బహాదూర్ గారూ! ఇది చాలా దుర్వార్త వినిపించారు. అయితే మరి ఇంగ్లీషువాళ్ళు ఇంత సన్నాహం చేసుకొని కూడా మరోవైపు అధినివేశ స్వరాజ్యం సంగతి ఎందుకెత్తుతున్నారు?"

"అదే నేననేది, ఇదంతా ఒట్టి మోసం, కపటం, దగా. అసలు విషయమేమిటంటే చివరకు వాళ్ళు మనకు ఇచ్చేది ఏమీ లేదు, ఇయ్యవలసిన అవసరం కూడా లేదు. కనీసం మరో యాభై సంవత్సరాలవరకూ ఇండియా స్థితి ఇంతే. ఆ తర్వాత యాభై సంవత్సరాలకు ఏమవుతుందో ఎవరికి తెలుసు!"

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పలేదు. కామతానాథ్ ప్రసంగం మార్చారు: "నేను నవల్ వివాహ విషయం కనుక్కొందామని వచ్చాను. ఉషకు పద్దెనిమిది సంవత్సరాలు నిండి పందొమ్మిదో సంవత్సరం జరుగుతూ ఉంది. ఈ సంవత్సరం వేసవిలో పెండ్లి చేద్దామని నా అభిప్రాయం. మీకేమయినా ఇబ్బంది ఉందా?"

"పిల్లనిచ్చే మీరే ఇబ్బంది లేకుండా చూచుకోవాలి. నాదేముంది? పెండ్లివాళ్ళతో సహా ఒక్క క్షణంలో మీ దగ్గరకు వచ్చి నిలబడతాను."

"ఏం చెయ్యమంటారు చెప్పండి. నా కోరిక నెరవేరేటట్టు కనిపించడం లేదు. నవల్ ఐ.సి.యస్. అవుతాడుగదా అని ఆశ పెట్టుకొన్నాను. కాని అతను పట్టిన పట్టు విడవనంటాడు. అతని మొండి పట్టు మన గౌరికి ఎంత మాత్రం నచ్చలేదు. ఇంగ్లండు వెళ్ళిరావడానికయ్యే

ఖర్చు, అక్కడ ఉండడానికయ్యే ఖర్చు, అక్కడ చదువుకయ్యే ఖర్చు – అంతా భరించడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. కాని నవల్ ఒప్పు కుంటేగా!"

"అవును, అదంతా ఈశ్వరేచ్ఛ" అన్నారు జ్వాలా ప్రసాద్.

"అవునండీ డిప్టీగారూ! లాభం, నష్టం, జీవితం, మరణం, యశస్సు, అపయశస్సు దైవాధీనాలని ఎవరో చక్కగా చెప్పారు."

ఈ మాటలు వింటూనే జ్వాలా ప్రసాద్ వరండావైపు చూచారు. నవల్ బట్టల ప్యాకెట్ తీసుకొని వస్తున్నాడు. "నవల్! కొంచెం ఇలా రా నాన్నా! గుడ్డలు కుట్టించుకొని వచ్చినట్టున్నావ్?" అని పిలిచారు జ్వాలా ప్రసాద్.

నవల్ కామతానాథ్ అక్కడ ఉన్న విషయం గమనించలేదు. లేకుంటే బహుశా ఆ ప్యాకెట్ తీసుకొని ఆ గదిలోకి వచ్చేవాడు కాదు. నవల్ చేతిలోనుంచి ప్యాకెట్ తీసుకొని జ్వాలా ప్రసాద్ అన్నారు: "ఏవీ నీ గుడ్డలు! చాలా కుట్టించుకు వచ్చావే!" అంటూ జ్వాలా ప్రసాద్ ప్యాకెట్ విప్పారు.

గుడ్డలు చూచి జ్వాలా ప్రసాద్ ఆశ్చర్యపడ్డారు. కాని అంతకంటె ఆశ్చర్యం వేసింది కామతానాథ్‌కు. "భేష్! ఖద్దరు గుడ్డలు చాలా కుట్టించు కుని వచ్చావే. కాంగ్రెస్‌లో చేరిపోయినట్టున్నావ్?" అన్నారు కామతా నాథ్.

ఆ గదిలో కామతానాథ్ ఉన్నట్టు నవల్‌కు తెలిసింది. "లేదు మామయ్యా! కాంగ్రెసులో చేరలేదు. కాని ఖద్దరు కట్టడం మాత్రం ఆరంభిస్తున్నాను."

"ఇంత లావాటి ఖద్దరు గుడ్డలు ఒంటికి గుచ్చుకోవూ? అయినా నీకి ఖద్దరు కట్టుకోవాలని తోచినందుకనుకోవాలి" అన్నారు కామతానాథ్ ముఖం చిట్లించుకుంటూ.

"ఏదో తోచింది నాకు, మోతీలాల్, జవహర్‌లాల్ లాంటి వాళ్ళే ఖద్దరు కట్టుకుంటూ ఉంటే నేనెందుకు కట్టుకోకూడదని అనిపించింది. ఇప్పుడే గుడ్డలు దాచేసి వస్తాను." అని నవల్ గుడ్డలు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

కామతానాథ్ కొంచెంసేపు దాకా స్తంభించినట్టు మాటా మంతీ లేకుండా

కూర్చునిపోయారు. తర్వాత ఆయన అన్నారు: "పిల్లవాడు చేజారిపోయి నట్టే డిప్టీగారూ!"

జ్వాలా ప్రసాద్ నీరసంగా నిట్టూర్పు విడిచారు. "అలాగే అనిపిస్తున్నది. కాని అంతా ఈశ్వరేచ్ఛ. మన చేతిలో ఏమీ లేదు."

కామతానాథ్ మండిపడ్డారు: "మీ ఈశ్వరేచ్ఛ నలా కట్టిపెట్టండి. నేను చూస్తానితని సంగతి. ఏప్రిల్లో పెండ్లి మాత్రం జరిగి తీరాలి. జనవరిలో ముహూర్తం దొరకడం లేదు. ఉషతోపాటు అతన్నీ ఫారిన్ పంపించేస్తాను. ఉష పేరిట యాభైవేల రూపాయలు బ్యాంకులో వేశాను. ఒక్కసారి మన అబ్బాయిగారు ఆ మాయలోపడిపొయ్యాడంటే దేశభక్తి అంతా ఒక్కసారి మాయమైపోతుంది."

జ్వాలా ప్రసాద్‌కు కామతానాథ్ అన్నమాటలు నచ్చలేదు. కామతానాథ్ తండ్రి రామ్‌సవజీన్ స్టోర్‌కీపర్‌గా పనిచేసేవాడు. అధర్మం, అక్రమం అంటే ఆయన్ని చెప్పి మరొకరిని చెప్పాలి. బర్మా యుద్ధం, అఫ్గను యుద్ధం జరిగే రోజుల్లో ఆయన అంతులేని డబ్బు సంపాయించాడు. ఆయన తన కుమారుడు కామతానాథ్‌కు మిలిటరీ కంట్రాక్టరు పని ఇప్పించాడు. 1914-18 లో జరిగిన ప్రపంచ యుద్ధంలో కామతానాథ్ దాదాపు అయిదు లక్షల రూపాయలు సంపాదించాడు. రాయ్‌బహాదుర్ పదవి కూడా వచ్చింది ఆయనకు. మున్షీ రామ్‌సజీవన్ ఎప్పుడూ జ్వాలా ప్రసాద్ ఎదురుగా చేతులు కట్టుకుని నిలబడేవాడు. ఈరోజు కామతానాథ్ జ్వాలా ప్రసాద్ మనుమణ్ణి డబ్బిచ్చి కొనుక్కోవాలని చూస్తున్నారు. కామతానాథ్ మాటలకు జ్వాలా ప్రసాద్ చాలా బాధపడ్డారు. కాని జ్వాలా ప్రసాద్ కామతానాథ్‌కు ఏమీ సమాధానం చెప్పలేదు.

కామతానాథ్ లేచి నిలబడ్డారు: "ఇక నేను వస్తాను. గౌరీనాథ్‌తో మాట్లాడి పెండ్లి ఏరోజు చేస్తే బాగుంటుందో నిర్ణయిస్తాను. మీరు సిద్ధంగా ఉండండి."

కామతానాథ్, జ్వాలా ప్రసాద్‌కు మధ్య జరిగిన సంభాషణను గురించి జ్వాలా ప్రసాద్ నవల్‌తో ఏమీ చెప్పలేదు. కామతానాథ్ ఏప్రిల్లో ఉషకు వివాహం చెయ్యాలని అనుకుంటున్నారనీ తారీఖు నిశ్చయించి కబురు చేస్తామని చెప్పారని మాత్రం ఆయన నవల్‌తో అన్నారు.

"ఇప్పుడే తొందరేముంది తాతయ్యా! యల్.యల్.బి ప్యాసవనీ" అన్నాడు నవల్.

నవల్ ఒంటినిండా ఖద్దరు దుస్తులు వేసుకుని బయల్దేరాడు. జ్వాలా ప్రసాద్ అతన్ని కాసేపు చూచారు. ఆయన ముఖంపై చిరునవ్వు కనిపించింది. "ఈ దుస్తుల్లో మహా చక్కగా ఉన్నావోయ్. భగవంతుడు నిన్ను కాపాడుతాడు" అన్నారు.

మరునాడుదయం జ్ఞానప్రకాశ్ నవల్‌తో అన్నారు: "నవల్! లాహోర్ కాంగ్రెస్‌లో దేశంలోఉన్న నవయువకులంతా వెళ్ళి జవహర్‌లాల్‌కు చేయూత ఇవ్వాలి. నీవు అలహాబాదు యూనివర్సిటీ నుండి పదిమంది యువకులను అక్కడికి వెళ్ళడానికి తయారుచేయగలవా?"

"నా పేరొకటిముందు వ్రాసేసుకోండి. ఒక వారంలో పదిమంది పేర్లు నేను చెపుతాను." అన్నాడు నవల్ ఉత్సాహంగా.

"నీవనుకున్నంత సులభంకాదది నవల్! లాహోర్ వెళ్ళాలంటే ఒక్కొక్కడికి షుమారు నలభై యాభై రూపాయలు ఖర్చవుతాయి. ఖర్చు పెట్టగలిగిన వాళ్ళు వెళ్ళడానికి సిద్ధంకారు. వెళ్ళడానికి తయారుగా వున్న వాళ్ళదగ్గర డబ్బుండదు. నా దగ్గర కొంత ప్రైవేటు ఫండుంది. దాన్లో నుండి సగం ఖర్చు నేను భరిస్తాను."

"అయితే సులువే" అన్నాడు నవల్.

"కాదు నవల్. అలా అయినప్పటికీ ఇందులో చాలా చిక్కులున్నాయి. అందుకనే ఈరోజునుంచే నీవు మి స్నేహితులతో మాట్లాడడం మంచిది. లాహోర్ సమావేశం చాలా గొప్పగా ఉంటుంది. డిశంబరు ఇరవై మూడో తేది ఢిల్లీలో లార్డ్ ఇర్విన్‌తో మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూ మాటాడబోతున్నారు. ఆ మాటలకు పర్యవసానం ఏమి తేలుతుందో చూడాలి. ఏ పరిస్థితిలో గూడా లాహోర్ సమావేశం చాలా ప్రాముఖ్యం వహిస్తుంది."

జ్ఞానప్రకాశ్ చెప్పిన పనిమీద నవల్ వెళ్ళాడు. నిజంగా ఈ కార్యం సాధించడం కష్టంగానే తోచింది. ఆ రోజు ఎంతో అవస్థపడి ఇద్దరు విద్యార్థులను లాహోరు వెళ్ళడానికి అతను ఒప్పించగలిగాడు. ఆ ప్రయత్నంలో తిరిగి తిరిగి అతను బాగా అలసిపోయాడు. దాదాపు తొమ్మిది గంటలకు అతను ఇంటికి చేరుకున్నాడు.

ఇంటికి వచ్చేసరికి ఇంట్లో వాతావరణం చాలా విచిత్రంగా కనిపించింది

కుటుంబంలో వాళ్ళందరూ డ్రాయింగ్ రూములోనే ఉన్నారు. జ్వాలా ప్రసాద్ చేతిలో ఒక టెలిగ్రాం ఉంది. యమున ఏడుస్తూ అంటున్నది: "ఎలాంటి కసాయి వాళ్ళకు ఒప్పచెప్పారో మన విద్యను! ఇల్లు గుల్లచేసి పోవడమే కాకుండా ఇదో బెడద తెచ్చిపెట్టారు. నవల్‌ను పంపితే లాభం లేదు. మీరే వెళ్ళి కనుక్కురండి అసలు సంగతేమిటో!"

నవల్ రాగానే జ్వాలా ప్రసాద్ ఆ టెలిగ్రాం నవల్ చేతికిచ్చారు. ఆ టెలిగ్రాం సిద్ధేశ్వరి పంపారు, ఉన్నావ్ నుండి వచ్చింది. టెలిగ్రాం నవల్ పేరిట ఉంది. "వెంటనే వచ్చి మీ చెల్లెల్ని తీసుకువెళ్ళు" అని వ్రాసిఉంది దానిలో.

నవల్ ఆ టెలిగ్రాంను రెండు మూడుసార్లు చదువుకున్నాడు. "ఏమిటో అర్థం కావడంలేదు" అన్నాడు.

"అందులో అర్థమయ్యేదేముంది? వాళ్ళు విద్యను ఇంట్లోనుండి వెళ్ళగొట్టాలని చూస్తున్నారు. నిన్ననే విద్య ఉత్తరం వ్రాసింది – కుటుంబంలో జనమంతా ఉన్నావ్ చేరుకున్నారు. అందరూ యమకింకర్లలాగా మా కన్నతల్లిని వేధిస్తున్నారు" అన్నది రుక్మిణి.

"రేపు ఉదయం బండికి వెళ్ళు. ఎలాగైనా మన అమ్మాయికి నచ్చ చెప్పేటట్టు చూడు. అది అసలే ముక్కోపి. అత్తగారింట్లో ఉండడం అంటే కొంచెం అణిగిమణిగే ఉండాలి మరి." అన్నారు జ్వాలా ప్రసాద్ నవల్‌తో.

రుక్మిణి మళ్ళీ చెప్పింది: "అబ్బాయ్ నవల్! విద్యను నీ కూడా తీసుకు వచ్చేసేయ్. విద్యవల్ల తప్పేమీలేదు. వాళ్ళు ఒట్టి ఛండాలురు. మన అమ్మాయి ప్రాణం తీయడానికి తయారయినారు. అంతా మన ఖర్మ!" అంటూ రుక్మిణి గొల్లుమన్నది.

అదే సమయంలో జ్ఞానప్రకాశ్ గదిలోకి వచ్చారు. రుక్మిణి ముఖంమీద ముసుగు వేసుకొని ప్రక్కకు తొలిగిపోయింది. "ఏమిటి బావా ఇదంతా? ఈ ఏడవడమేమిటి?" అని అడగాడు జ్ఞానప్రకాశ్.

నవల్ జ్ఞానప్రకాశ్‌కు టెలిగ్రాం చూపించాడు. టెలిగ్రాం చదువుకొని జ్ఞానప్రకాశ్ అన్నాడు: "అలాగా! అంతవరకూ వచ్చిందీ సంగతి! నవల్‌ను పంపించడం వల్ల లాభంలేదు. బావా! నీవు వెళ్ళాలి.

జ్వాలా ప్రసాద్ నీరసంగా అన్నారు: "నన్ను వెళ్ళమనకు జ్ఞానూ. నవల్ వెళ్ళడమే మేలు. రేపు ఉదయం బండికి నవల్‌ని పంపిస్తున్నాను."

“రేపు ఉదయం బండికి కాదు, నవల్ ఈ రాత్రి బండికే వెళ్ళాలి. ఇంతా ఇప్పుడు తొమ్మిది గంటలే అయింది. రాత్రి పదకొండు గంటలకు కాన్పూరుకు ఒక ప్యాసింజరు వెళ్ళుతుంది. ఇలాంటి విషయాల్లో ఆలస్యం చేయకూడదు. నవల్! వెళ్ళి సిద్ధంకా” అని జ్ఞానప్రకాశ్ గది బయటకు వెళ్ళారు. నవల్ తయారయి బయలుదేరబోయే సమయానికి జ్ఞానప్రకాశ్ కూడా పక్క చుట్ట చుట్టుకొని తాను కూడా ప్రయాణమైనారు: “నవల్! నీవు ఒంటరిగా వెళ్ళి సమర్థించలేవు. నీతో నేను కూడా వస్తున్నాను. నీవు పసివాడివి. వాళ్ళకు నీవు సమాధానం చెప్పలేవు.”

జ్ఞానప్రకాశ్, నవల్ ఉన్నావ్ స్టేషన్లో బండి దిగేసరికి అప్పుడే ఎండ వస్తూ ఉన్నది. సామానంతా వెయిటింగ్ రూములో పెట్టి ఇద్దరూ ఇక్కా మాట్లాడుకొని ఊళ్ళోకి వెళ్ళారు. సిద్ధేశ్వరీ ప్రసాద్ బంగళా దగ్గరకు వెళ్ళిన తర్వాత జ్ఞానప్రకాశ్ చౌకీదారుతో అన్నారు: “అలహాబాదు వాళ్ళు వచ్చారని సిద్ధేశ్వరీ బాబుకు చెప్పు.”

“చిన్నయ్యగారు నిద్రపోతున్నారు. పెద్దయ్యగారికి చెప్పి వస్తాను.” అని చౌకీదారు ఇంటిలోపలికి వెళ్ళాడు.

ఇద్దరూ వరండాలో కూర్చున్నారు. రెండు నిమిషాల్లో విందేశ్వరీ ప్రసాద్ బయటకు వచ్చారు. “వచ్చేశారూ మీరు? చాలా తొందరగా వచ్చారు. భగవంతుడు మేలుచేశాడు.” అంటూ ఆయన చౌకీదారును పిలిచారు: “ఆ గది తెరువు.” ఆయన మళ్ళీ వాళ్ళిద్దరి వైపు చూచి అడిగారు: “మీ సామానెక్కడ?”

“స్టేషన్లో పెట్టి వచ్చాం” అని చెప్పాడు నవల్.

“మంచి పని చేశారు. ఇంతదూరం సామాను తీసుకురావడం మళ్ళీ తీసుకు పోవడం శ్రమ తప్పినట్టు. అయితే మీ చెల్లెల్ని తీసుకువెళ్ళి మా ప్రాణాలు కాపాడండి. అది మా పాలిటికి దయ్యంలాగా తయారయింది.”

“అసలు సంగతేమిటి?” అని అడిగారు జ్ఞానప్రకాశ్.

“సంగతి మీ అమ్మాయే చెప్తుంది. నిన్నటినుండీ గదిలోపల గడియ వేసుకొని కూర్చున్నది. దగ్గరకుపోతే కొట్టడానికి సిద్ధంగా ఉన్నది.” అంటూ ఆయన సిద్ధేశ్వరిని పిలిచారు: “సిద్ధేశ్వరీ! వీళ్ళు అలహాబాదు నుంచి వచ్చారు.”

అదే సమయంలో విద్య పరుగెత్తుకుంటూ గదిలోకి వచ్చింది:

"అన్నయ్యా! నన్ను ఈ పిశాచాల నుండి కాపాడు. మీరు కూడా వచ్చారా తాతయ్యా! నా ప్రాణం దక్కింది."

విద్య ఒళ్ళంతా గాయాలుపడి ఉండడం జ్ఞానప్రకాశ్ గమనించారు. వింద్యేశ్వరీ ప్రసాద్ చాలా కఠోరంగా అన్నారు: "నవల్! ఈ గయ్యాళి గంపను లోపలికి తీసుకెళ్ళి సామాన్లన్నీ సర్దించు. ఈ లోగా నేను జ్ఞాన ప్రకాశ్‌తో మాట్లాడుతూ ఉంటాను."

నవల్ విద్య చెయ్యి పట్టుకుని ఆమెను గదిలోకి తీసుకు వెళ్ళాడు. ఇంతలో సిద్ధేశ్వరీ ప్రసాద్ గదిలోకి ప్రవేశించాడు. జ్ఞానప్రకాశ్ సిద్ధేశ్వరీ ప్రసాద్‌ను అడిగారు: "అసలేమయింది సిద్ధేశ్వరీ బాబూ! మాకు కూడా కొంచెం తెలిసేటట్టు చెప్పు."

సిద్ధేశ్వరి చాలా ఉద్రిక్తుడై ఉన్నాడు: "మా అమ్మను, అక్కయ్యను తిడుతూ ఉన్నంతసేపూ నేను ఊరకనే ఉన్నాను. కాని నాన్నగారు దీన్ని కొంచెం గదిమేసరికి నాన్నగార్ని కూడా తిట్టడం మొదలెట్టింది. అప్పుడు నాకిక కోపం వచ్చేసి చెయ్యి చేసుకున్నాను."

"ఊరికే ఒక దెబ్బ కొట్టాడు వీడు" అన్నారు వింద్యేశ్వరీ ప్రసాద్.

"అవునలాగే! ఒక్క దెబ్బ కొట్టేసరికి ఒళ్ళంతా బద్దలయింది. తర్వాత తర్వాత?" అని అడిగాడు జ్ఞానప్రకాశ్.

"ఆ తర్వాత తనంటతానే చేతులూ, కాళ్ళూ, విరుచుకోటం మొద లెట్టింది. ఆకాశం ఊడి తలమీద పడ్డట్టు అరిచింది. దానిమీద సిద్ధేశ్వరీ మళ్ళీ మరొక దెబ్బ వేశాడు. ఇక ప్రళయమనుకోండి. పెద్దగా కేక పెట్టి సిద్ధేశ్వరి మీద ఒక దెబ్బ వేసింది. ఆడది తన మగవాడి మీద చెయ్యి చేసుకోవడం నా జీవితంలో మొట్టమొదటసారి ఇప్పుడు చూచాను. అలాంటి ఆడదాన్ని తుపాకేసి కాల్చేయాలి."

"ఏం చెప్పను! గబగబా గదిలోకి పరిగెత్తిపోయి లోపల గడియ వేసుకుంది. లేకుంటే నేను దీని ప్రాణం తీసేసేవాణ్ణి. మీరు దీన్ని మీ కూడా తీసుకెళ్ళండి. లేకపోతే ప్రమాదం జరుగుతుంది."

జ్ఞానప్రకాశ్ చాలా ప్రశాంతంగా అన్నారు: "అవును మరి అందుకనే, మేము వచ్చాం. అచ్చం దాని ప్రాణం పోవడంతో సరిపొయ్యేదికాదు, మీ కందరికీ ఉరి శిక్ష కూడా పడేది. ఈమె గంగాప్రసాద్ గారి అమ్మాయి!"

"గంగాప్రసాద్ యమ లోకానికి వెళ్ళాడు. ఈ పాపిష్టి పిల్లను కూడా అక్కడికే సాగనంపే వాళ్ళం." అన్నారు వింధేశ్వరీ ప్రసాద్.

జ్ఞానప్రకాశ్ బిగుసుకుని నిలబడ్డారు: "వింధేశ్వరీ ప్రసాద్ గారూ, మాటలు కొంచెం జాగ్రత్తగా రానియ్యండి. గంగాప్రసాద్ లేకపోతే ఈ పిల్ల దిక్కులేక అనాధగా ఉందని అనుకోకండి."

సిద్ధేశ్వరి తన తండ్రి కడ్డం పోతూ అన్నాడు: "నాన్నగారూ! వీళ్ళతోటి మాట్లాడడంవల్ల ప్రయోజనం లేదు."

అప్పటికి నవల్ రెండు ట్రంకు పెట్టెలతో సహా విద్యను వెంట బెట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాడు. "విద్య తనతో తీసుకువచ్చే సామానంతా ఇదే. ఇక మనం ఇక్కడినుండి వెళ్ళడం మంచిది."

జ్ఞానప్రకాశ్ సిద్ధేశ్వరి వైపు చూచారు: "వెళ్ళడానికి మరి నీ కారూ గీరూ ఏమయినా ఉందా? లేకుంటే ఏమన్నా పిలుస్తావా?"

వింధేశ్వరీ ప్రసాద్ ఇప్పుడు శాంతించారు. ఆయన నౌకర్ను పిలిచి చెప్పారు: "భవానీ! డ్రైవరుకు చెప్పు కారు తీసుకు రమ్మని." ఆ తర్వాత ఆయన విద్యవైపు తిరిగి అన్నారు: "ఇక ఈ ఇంట్లో అడుగు పెట్టడానికి వీల్లేదు నీవు. తెలిసిందా? నీ సొమ్ములన్నీ తీసి ఇక్కడ పెట్టి మరీ వెళ్ళు."

విద్య ఆవేదన పడుతూ అన్నది: "మీ యిల్లు ఇల్లుకాదు, నరకం. నేను మళ్ళీ ఈ ఇంట్లో అడుగుపెట్టానంటే నేను గంగాప్రసాద్‌గారి అమ్మాయిని కాను. నీ సొమ్ములు నాకేం అక్కర్లేదు. తీసుకో" అని విద్య ట్రంకు పెట్టె తాళపు చెవి సిద్ధేశ్వరి ముందు విసిరి వేసింది. ఆ తాళపు చెవిని సిద్ధేశ్వరి తీసుకొనే లోగానే జ్ఞానప్రకాశ్ తీసుకున్నారు: "ఆ సొమ్ములు ఈ పిల్లవి. వాటిమీద మీకేమీ అధికారం లేదు."

వింధేశ్వరీ ప్రసాద్ బిగ్గరగా అరిచారు: "నీవెవరవోయ్ మా మధ్య మాట్లాడడానికి? ఇలా ఇచ్చేసెయి ఆ తాళం చెవి."

జ్ఞానప్రకాశ్ అన్నారు: "నేనీ పిల్ల సంరక్షకుణ్ణి. మంచి చెడ్డలు చూచి పెంచినవాణ్ణి." అంటూ జ్ఞానప్రకాశ్ తాళంచెవి తన జేబులో వేసుకున్నారు.

వింధేశ్వరీ ప్రసాద్ సిద్ధేశ్వరీ ప్రసాద్‌తో అన్నారు: "ఇంకా చూస్తావేమిటిరా! సొమ్ముల పెట్టె లోపలికి తీసుకెళ్ళక!"

జ్ఞానప్రకాశ్ గదుముతూ అన్నారు: "ఖబర్దార్! ట్రంకు మీద చెయ్యి

వెయ్యి చూస్తాం. పదిహేను వేల కట్నం తీసుకున్నావు నీవు విందేశ్వరీ ప్రసాద్! చివరకు పిల్లను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టేస్తున్నావు. ట్రంకు నెవరన్నా తాకారా, మర్యాదగా ఉండదు!" ఆ మాట అంటూనే జ్ఞాన ప్రకాశ్ జేబులోనుంచి పిస్తోలు బయటకు తీశారు: "విందేశ్వరీ ప్రసాద్! కావలిస్తే పోలీసుల్ని పిల్చుకోవచ్చు. నీవు డిస్ట్రిక్టు జడ్జివి, 'లా' నీకు తెలుసు. నవల్ ట్రంకు తీసుకెళ్ళి కారులో పెట్టేసేయ్. ఏం విందేశ్వరీ ప్రసాద్! పోలీసుల్ని పిలుస్తానంటే నేనుంటాను. ఇక్కడ పోలీసు సూపరిం టెండెంటు ఠాకుర్ కుశల్ సింగ్. గంగాప్రసాద్‌కు ఆప్తమిత్రుడు. ఆ మాట గుర్తుంచుకో."

విందేశ్వరీ ప్రసాద్ పండ్లు కొరుకుతూ అన్నారు: "నీ సంగతి నేను కనుక్కుంటాను. నిన్ను నాశనం చేసేస్తాను."

"నా సంగతి కనుక్కోటానికి నీకు అవకాశమిస్తున్నాను. ధైర్యముంటే పోలీసుల్ని పిలిపించు. దోపిడి చేయడానికి వచ్చానని చెప్పి నన్ను అరెస్టు చేయించు. నీలాంటి పాపి ఇక ఉండడు."

సిద్ధేశ్వరీ అన్నారు: "పదండి నాన్నాగారూ లోపలికి! ఈ నీచులతో మీ కెందుకు!" అంటూ సిద్ధేశ్వరి విందేశ్వరీ ప్రసాద్ చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకవెళ్ళాడు.

జ్ఞానప్రకాశ్, నవల్ విద్యను తీసుకొని తర్వాత బండికి ఉన్నావ్‌నుండి అలహాబాదుకు బయలుదేరి వెళ్ళారు.

ఆరు

"మొత్తం ఎంతమందయినారు?" జ్ఞానప్రకాశ్ అడిగారు.

"నాతో కలిపి ఏడుగురు" అన్నాడు నవల్. "జ్ఞాన్ తాతా! మీరు చెప్పిన మాట నిజమే. ఇది నేననుకున్నంత సులభమైన పనికాదు. కాని

మనం వెళ్ళాల్సింది ఎప్పుడు? డిశంబరు ఇరవై ఐదున కదా కాంగ్రెస్ ఆరంభం! ఈలోగా మరో ముగ్గుర్ని పోగు చేస్తాన్లే.''

జ్ఞానప్రకాశ్ నవ్వుతూ అన్నారు: ''అక్కర్లేదు. వీళ్ళే చాలు. నేను మాత్రం రెండు రోజులు ముందే అక్కడికి వెళ్ళి ఉండాలి. కాబట్టి నేనిక్కడ డిశంబరు ఇరవై రెండు బయల్దేరుతాను. మీరందరూ ఇక్కడినుండి ఇరవై నాలుగున బయల్దేరండి. మీకక్కడ ఉండడానికి నేను అన్ని ఏర్పాట్లు చేసి ఉంచుతాను.''

విద్య అక్కడనే కూర్చుని ఆనాటి పేపరు చదువుతూ ఉన్నది. పేపరు చదవడం మానేసి ఆమె అన్నది: ''అన్నయ్యా! నేను కూడా మీతో వస్తాను. అయితే జ్ఞాన్ తాతా! ఇప్పుడు ఏడుగురల్లా ఎనిమిది మందైనట్టు.''

ఉన్నావ్ నుండి వచ్చినప్పటినుండీ విద్య అదోరకంగా ఉంది. ఎవరితో కూడా ఎక్కువగా మాట్లాడడం మానేసింది. తన గదిలోనుంచి బయటకు వెళ్ళడం తగ్గించేసింది. గదిలోనే కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉండేది. విద్య అన్నమాటలకు నవల్ ఆశ్చర్యపడ్డాడు. ''నీవు కాంగ్రెస్ సభలకు మాతో వస్తావా? ఏమిటి నీవనేది'' అన్నాడు విద్య వైపు చూస్తూ.

''అవునన్నయ్యా! నేను కూడా వస్తాను. పనీపాటా లేకుండా అస్తమానం దిగులుపడుతూ ఉంటే నాకు విసుగు వేస్తూ ఉంది. ఏం జ్ఞాన్ తాతయ్యా! లాహోర్ కాంగ్రెస్‌కు నేను కూడా వస్తే మీకభ్యంతరం లేదు కదా! మాట్లాడవేం? చెప్పు.''

జ్ఞాన్‌ప్రకాశ్ విద్యవైపు చూచారు. కొంచెంసేపు అలాగే కండ్లార్పకుండా చూచారు. ఆమె ముఖంలోని దార్ఢ్యం, కాఠిన్యం, కండ్లలో అగాధమైన గంభీర సంకల్పం! శాంతమూర్తిలా సుకుమారంగా ఉంది ఆమె! జ్ఞానప్రకాశ్‌ను చూస్తూఉంటే అదో చిత్రరువులా తోచింది. చల్లని నిట్టూర్పు విడిచి ఆయన అన్నారు: ''లేదమ్మా, నీవు మాతో రావడానికి అభ్యంతరమేమీ లేదు. కాని ఈ పరిస్థితిలో నీవు లాహోరు వెళ్ళడం అంత మంచిది కాదు. లోకులనేక రకాలుగా అనుకుంటారు.''

విద్య కొంచెం సేపు మాట్లాడ లేదు. తర్వాత ఆమె దీనంగా అన్నది: ''తాతయ్యా! లోకం అనేకరకాలుగా అనుకొన్నందువల్ల మనకు వచ్చేదీ లేదు, పోయ్యేదీ లేదు. కాని నేను మిమ్మల్ని బలవంతంచేసి బాధించను. నేనిలా కుమిలిపోవడమే మీ కిష్టమైతే, నేనిలాగే ఉండిపోతాను. స్త్రీ

జీవితమంతా బానిస జీవితం. ఏం అన్నయ్యా! నేను చెప్పింది నిజమేనా?''

విద్య వాక్కులో పలికిన నిస్సహాయత, వ్యంగ్యం బాణంలాగా జ్ఞాన ప్రకాశ్ హృదయాన్ని వేధించింది. తన పిరికిదనానికి తానే సిగ్గుపడ్డారు. ఆయన కండ్లు క్రిందికి వ్రాలాయి. చాలసేపటికి ఆయన తెప్పరిల్లుకొని అన్నారు : ''లేదమ్మా! నీవు బానిసగా ఉండవలసిన అవసరమూ లేదు, ఇలా దిగులుపడుతూ ఉండవలసిన పనీలేదు. నీవు మాతో వచ్చేసెయి. త్వరగా ప్రయాణంగా. నీవు నాతోటే రావాలి. వీళ్ళంతా థర్డ్‌క్లాస్‌లో వెళతారు. వీళ్ళతో నీవు అవస్థ పడలేవు.''

విద్య నవ్వింది: ''జ్ఞాన్ తాతయ్యా! నీవెంత మంచివాడివో! ఒక వైపు నీవు, మరో వైపు నవల్ – నాకిక కావలసింది లేదు. కాని తాతయ్యా! నేను నవల్‌తోపాటు థర్డ్‌క్లాస్‌లోనే వస్తాను. జీవితంలో పోరాటానికి సిద్ధపడ్డ తర్వాత ఈ చిన్న చిన్న సౌకర్యాలను గురించి ఆలోచించడం పనికిరాదు. అన్నయ్యా! నన్ను నీ కూడా తీసుకెళతావు గదూ! మీ తిండి, తిప్పలూ అంతా నేను చూచుకుంటాను.''

విద్య లాహోర్ వెళ్ళుతున్నది, అనే వార్త ఇంట్లో అందరినీ కలవర పెట్టింది. యమున రుక్మిణితో చెప్పింది : ''అమ్మాయ్! ఆ విద్యకు కొంచెం చెపుదూ లాహోర్ వెళ్ళడం మంచిది కాదని. ఉన్నావ్ వాళ్ళేమంటారు? వాళ్ళ సంబంధం మళ్ళీ బాగుపడే అవకాశం ఏదన్నా మిగిలిఉంటే అది కూడా దీనితో పోతుంది. మంచి కుటుంబంలో పిల్ల ఇలా ఇల్లూ వాకిలీ వదలిపెట్టి దేశమంతటా మగరాయడిలా మొగాళ్ళతో కలిసి తిరగడం, అందరితో విచ్చల విడిగా మాట్లాడడం మంచిది కాదు. నలుగురూ ఉమ్మేస్తారు.''

''అవునత్తయ్యా! విద్య లాహోర్ వెళ్ళడం నాకు గూడా నచ్చలేదు. కాని దాని పరిస్థితి ఇలాగే ఉంటే అది ఇంక ఎన్నో రోజులు బతకదు. చూస్తున్నావు గదా దాని పరిస్థితి. ఎండి ఒరుగై పోతున్నది.'' అని రుక్మిణి కంట తడిపెట్టింది.

''అది నాకు తెలుసు. కాని ఇంటి గౌరవం కూడా చూడవద్దూ. పుట్టగానే పోతే దిగులుండేది కాదు. ఇప్పుడిది మన వంశం పేరూ ప్రతిష్ఠా అంతా మంట గలిపేటట్టుంది.'' యమున కొంచెం బిగ్గరగా అన్నది.

''అత్తయ్యా! మీకు దణ్ణం పెడతాను, అలాంటి మాటలనకండి! ఒకవేళ

-ఈ మాటలు విద్య చెవిలో పడ్డాయంటే ఏదైనా అఘాయిత్యం చేసుకుంటుంది. విద్య చేయతగని పని ఎప్పుడూ చేయదని నాకు నమ్మకం ఉంది.''

''చేయతగనిది చెయ్యదు! మొగుడిమీద చెయ్యి చేసుకోవడం చేయ తగిన పనేనా?''

''అయితే మరి తన ప్రాణాల్ని అర్పించేస్తుందా అది? చూచారు గదా, దాని ఒళ్ళంతా బద్దలైపోయింది. ఇంట్లో వాళ్ళందరూ కలిసి దాన్ని చావ గొట్టారు. కసాయి వాళ్ళకిచ్చి చేశాం దాన్ని. ప్రాణాలతో బతికి బయట పడింది. అంతే చాలు.'' అన్నది రుక్మిణి.

యమునకు కోపం వచ్చింది: ''అయితే నెత్తి కెక్కించుకో దాన్ని! దాన్ని జీవితాంతం నీవే కాపాడేటట్టు మాట్లాడుతున్నావు. ఇవన్నీ నేను చూస్తూ ఉండలేను. వెళ్ళి ఆయనకు చెపుతాను. ఆయన చెపితేగాని అది వినదు.'' అంటూ యమున జ్వాలా ప్రసాద్ దగ్గరకు వెళ్ళింది.

జ్వాలా ప్రసాద్ పూజ ముగించుకుని వచ్చి డ్రాయింగ్ రూములో కూర్చున్నారు. విద్య లాహోరు వెళ్ళడం అనేది ఆయనకు కూడా నచ్చ లేదు. జ్ఞానప్రకాశ్‌తో ఆయన అన్నారు: ''విద్య లాహోరు వెళ్ళడం ఏ మాత్రం సమంజసంగా లేదు. అవతల దానికయినవాళ్ళ నడగడం అవసరం.''

జ్ఞానప్రకాశ్ అన్నారు: ''కాని బావా! నేనొక విషయం అడుగుతాను. అసలు దానికయిన వాళ్ళెవరు? ఆ పిల్లను ఇంట్లోనుంచి తరిమివేసిన వాళ్ళేనా దానికయిన వాళ్ళు?''

జ్వాలా ప్రసాద్ చిక్కులో పడిపోయారు: ''అయితే మరి వాళ్ళు కాక పోతే మేమా?''

''ఇదివరకు మీరు, ఇప్పుడు కాదు. మీరా అమ్మాయిని ఆ పిశాచాల చేతుల్లో పెట్టారు. ఇప్పుడా అమ్మాయికి ప్రపంచంలో ఎవ్వరూ లేరు. ఆమెకు 'నా' అనే వాళ్ళెవరూ లేరు. ఆమె ఎవరినీ ''నా'' అనుకోవడానికి అవకాశం లేదు. ఇప్పుడామె భిక్షమెత్తుకొని ఇతరుల దయా దాక్షిణ్యాల పైన బతకాలి. ఇప్పుడామెకు రెండే మార్గాలున్నాయి. బానిసత్వం లేకుంటే మరణం!''

అదే సమయంలో యమున గదిలోకి వచ్చింది: ''జ్ఞానూ, విద్యకు లాహోరు వెళ్ళమని నీవే సలహా చెప్పావా?''

"లేదు అక్కయ్యా! విద్యకు ఆ సలహా చెప్పింది ఆమె జీవితం. పది పన్నెండు రోజుల్నుంచీ ఆ అమ్మాయి చావు బ్రతుకుల మధ్య మధనపడి బాధ పడుతూ ఉంటే నీవూ చూడలేదూ! ఉన్నావ్‌నుండి వచ్చినప్పటినుంచీ గదిలో కూర్చుని దిగులుపడుతూ ఉన్నది. ఆమె ముఖం మీద చిరునవ్వు మాయమైపోయింది. కంటి తడి అరనిమిషం కూడా ఆరకుండా ఆమె ఆవేదన పడింది. ఉండి ఉండి ఈ రోజు ఆమె మృత్యువుతో పోరాడ డానికి సిద్ధంగా ఉంది. తొలిసారిగా ఆమె జీవితంలో సాహసం బయలు దేరింది. ఆమె జీవితం నవల్‌ని ఆశ్రయించి, నా సాయం కోరింది. మరి మేము ఏం చెయ్యాలో చెప్పు అక్కా,! తను లాహోరు వస్తానని అడిగింది, మేము సరేనన్నాం. ఆ మాటకు ఆమె ముఖం మళ్ళీ ఒక్కసారి విప్పా రింది. కండ్లల్లోకి కాంతి వచ్చింది. అక్కయ్యా! అమ్మాయి చనిపోవడం నీ కిష్టమా?"

యమునకు ఏడుపు వచ్చింది :

"అయ్యో మా అమ్మాయికి ఇలా అవుతుందనుకోలేదు. ఎంతో ఆశలు పెట్టుకుని పెంచాను. చివరకు పాపిష్టి వాళ్ళ చేతుల్లో పడ్డది. జ్ఞానూ, నేను దాన్ని కాదనను. దానికెలా బాగుంటే అలాగే చెయ్యనీ!" అంటూ యమున వెళ్ళిపోయింది.

ఆ తర్వాత జ్వాలా ప్రసాద్ ఆ విషయమై ఇక మాట్లాడలేదు.

డిశంబరు ఇరవై మూడో తేదీ సాయంత్రం అలహాబాదులో జనమంతా కలవర పడుతున్నారు. 'లీడర్, పాయనియర్' - రెండు వార్తాపత్రికలూ ప్రత్యేక సంచికలు ప్రచురించాయి. వైస్రాయి ఢిల్లీ తిరిగి వచ్చేప్పుడు పురానా కిలా (పాతకోట) దగ్గర ఆయన స్పెషల్ ట్రెయిను క్రింద బాంబు పేల్చారనే వార్త ఆ సంచికలు ప్రకటించాయి. వైస్రాయి ప్రాణంతో బయట పడ్డారు. కాని రైలు బండి మాత్రం దెబ్బ తిన్నది. ఒక నౌకరు గాయపడ్డాడు.

జ్వాలా ప్రసాద్ ఆ వార్త వినగానే చాలా విచారించారు. రాత్రి పూట ఆయన నవల్నీ విద్యనూ పిలిచి నవల్‌ని అడిగారు: "ఈరోజు వచ్చిన వార్త నీవు విని ఉంటావు. దానిమీద నీ అభిప్రాయమేమిటి?"

నవల్ సమాధానం చెప్పాడు: "వార్త చాలా భయంకరమైంది తాతయ్యా! బహుశా దీని ఫలితం కూడా విపరీతంగానే ఉండవచ్చు. లార్డ్

ఇర్విన్‌తో గాంధీ చేయబోతున్న సంప్రతింపులు కూడా జయప్రదం కాక పోవచ్చని అనుకుంటాను.''

''నేనడుగుతున్నది ఆ విషయం కాదు. ఈ పరిస్థితుల్లో నీవూ, విద్యా లాహోరు వెళ్ళడం క్షేమమా అని నా ప్రశ్న.'' అన్నాడు జ్వాలా ప్రసాద్.

''కాకేం, ఇంతవరకూ ప్రభుత్వం కాంగ్రెస్ చర్యలపై ఆంక్షపెట్టలేదు. అలా చేసిఉంటే ఆ వార్త కూడా పేపర్లల్లో వచ్చి ఉండేది. అసలు ప్రభుత్వం కాంగ్రెసుపైన అలాంటి ఆంక్షపెట్టదనే నా అభిప్రాయం. హింసాత్మకమైన చర్యలను విశ్వసించే విప్లవకారులు చేసే పనులివన్నీ. మహాత్మాగాంధీ, కాంగ్రెస్ అవలంబించేది అహింసతో కూడిన మార్గం.''

''అయితే మీరు లాహోరు వెళ్ళాలని పూర్తిగా నిశ్చయించుకున్నట్టు తోస్తున్నది.'' అన్నారు జ్వాలా ప్రసాద్.

''ఈ సంఘటన జరిగిన తర్వాత లాహోరు కాంగ్రెస్ చూచితీరాలి! భలేగా ఉంటుంది తాతయ్యా!''

''ఆ భలేగా ఉండడమేమిటో నాకు తెలుసు. కాని మీకు చెప్పగలిగే దెవరు! సరే, కావలసిన గుడ్డలు మాత్రం కూడా తీసుకువెళ్ళండి. ఈసారి చలి బాగా తీవ్రంగా ఉంది. లాహోర్ అసలే చలిదేశం. గంగూ ఓవర్ కోటు కూడా తీసుకువెళ్ళు. అమ్మాయ్ విద్యా! నాకు నీ విషయమే దిగులుగా ఉందమ్మా!''

విద్య నవ్వుతూ అన్నది: ''నాకు నాన్న కుట్టించిన ఫర్‌కోటు ఉంది. నా విషయం నీవేమీ దిగులుపడకు తాతయ్యా!''

డిశంబరు ఇరవైనాలుగో తేదీ ఉదయం, విద్యను తీసుకుని నవల్ స్టేషనుకు వెళ్ళేసరికి విపరీతమైన చలి వేస్తూఉంది. రాత్రంతా వాన కురుస్తూనే ఉన్నది. వాన వెలిసింది గాని చలిగాలి మాత్రం రుయ్‌మని వీస్తూ ఉంది. స్టేషను దగ్గఱ నవల్ తన తోటివాళ్ళంతా వచ్చారో లేదో అని చూచాడు. ఎనిమిది మందికీ మొత్తం అయిదుమందే తేలారు.

బండి చాలా ఖాళీగాఉంది. ఆ చలికి ప్రయాణం చేయాలంటే అందరికీ ధైర్యం చాలడంలేదు. ఆ అయిదుగురూ థర్డ్‌క్లాస్ పెట్టెలో హాయిగా కూర్చున్నారు – వాళ్ళలో అదో రకమైన ఉత్సాహం పొంగిపోతూ ఉంది.

జ్ఞానప్రకాశ్ తను చెప్పిన ప్రకారం లాహోరు స్టేషను దగ్గరకు

వచ్చారు. నవల్‌ను చూచి ఆయన అన్నారు : "ఇక్కడ విపరీతమైన చలి వేస్తూ ఉంది. ఈ సంగతి నాకు ముందుగా తెలిస్తే మిమ్మల్ని ఇక్కడికి రమ్మనే వాణ్ణి కాదు."

నవల్ నవ్వాడు : "వచ్చేశాం గదా తాతయ్యా! ఇక్కడ చలి ఎలా ఉంటుందో కూడా కాస్త చూచి వెళ్ళచ్చు."

నవల్ తన బృందంతో సహా ఒక శిబిరంలో మకాం చేశాడు. విద్య జ్ఞానప్రకాశ్ గదిలో దిగింది.

సాయంత్రం సమావేశం పూర్తి అయ్యేసరికి వేళ్ళు కొంకర్లు పోయే చలి ఆరంభించింది. కాని విద్యకు ఆ చలి చలి అనిపించనే లేదు. ఆమె ఆ రోజు ఒక నూతన ప్రపంచం చూచింది. ఆ ప్రపంచంలో ఎక్కడ చూచినా కార్యదీక్ష, సంఘర్షం కనిపిస్తూ ఉన్నాయి. అందులో ఆమె కూడా పాల్గొంటున్నది. వేలకొలది స్త్రీ పురుషులు సర్వస్వం వదిలేసి త్యాగ బుద్ధితో దేశంకోసం ఏమయినా చెయ్యడానికి నడుం కట్టుకొని ఉన్నారు. వాళ్ళందర్నీ చూస్తే ఆమెకు తన దుఃఖం చాలా స్వల్పంగా తోచింది. కాంగ్రెస్ సమావేశంనుంచి వచ్చి విద్య నవల్‌తో అన్నది : "అన్నయ్యా! అప్పుడే అంతగా పొద్దుపోలేదు. లాహోరు చాలా గొప్ప పట్టణమని చెప్పు కుంటారు. కాసేపలా వెళ్ళి వస్తామా?"

మంచు పడుతున్న ఆ రాత్రిలో బయటికి వెళ్ళడానికి నవల్ జంకు తున్నాడు. కాని విద్య ముఖంలో ఉన్న ఉల్లాసాన్ని చూస్తే కాదనడానికి మన సొప్పలేదు. అప్పటికీ తప్పుకునేందుకు ప్రయత్నం చేశాడు : "చూడు విద్యా! ఎంత చలి వేస్తున్నదో!" అన్నాడు.

"అవునన్నయ్యా! కాని ఈ చలి నన్ను బాధించడం లేదు. ఓవరు కోటు వేసుకో నీవు. ఎంత ముచ్చటగా ఉందో రాత్రి! నాకు జీవితం మీద మమకారం ఏర్పడుతూ ఉన్నది. వెళ్ళదాం రా అన్నయ్యా! ఒక గంటలో తిరిగి వచ్చేద్దాం."

నవల్ విద్య మాటను కాదనలేకపోయాడు. అతను విద్యను వెంట పెట్టుకొని బయల్దేరాడు. వాతావరణం షికారు వెళ్ళడానికి అనుకూలం కాని మాట నిజమే. వీధులన్నీ నిర్జనంగా ఉన్నాయి. ఒకరిద్దరు మను ష్యులు అక్కడక్కడ తిరుగుతున్నారు. సినిమా హాళ్ళ దగ్గర మాత్రం కొంచెం సందడిగా ఉంది. కొంతమంది హోటళ్ళల్లో కూర్చుని ఫోం చేస్తు

న్నారు. నవల్, విద్య మాల్ రోడ్డులో టాంగా వదిలేసి కాలినడక పట్టారు.

విద్య నవల్ని ఏమేమో అడగాలనుకొన్నది, ఏదేదో తెలుసుకోవాలని ఆమెకు కుతూహలంగా ఉంది. కాని ఇప్పుడవన్నీ ఆమెకు అనవసరమని తోచింది. ఆమె కండ్ల ఎదుట జీవితం కనిపిస్తూ ఉన్నది - మంచుతో నిండిన ఆ రాత్రిలా జీవితం కూడా బాధిస్తూ ఉన్నట్టు తోచింది. కాని ఆమెకు చలి వేయడం లేదు. ఆమె రక్త నాళాల్లో వేడి రక్తం ప్రవహిస్తూ ఉంది. ఎముకలు కొరికే ఆ చలిగాలికి ఆమె మేను పులకరిస్తూ ఉన్నది. విద్య హృదయంలోని వెచ్చదనం, ఆమె రక్త నాళాల్లో ప్రవహిస్తున్న ఉష్ణరక్తం వల్ల మంచులా గడ్డకట్టి మనుష్యులను వేధించే ఆ జీవితాన్ని తను ఎదుర్కొనగలననే ధైర్యం ఆమెకు వచ్చింది.

ఆ రోజామె కాంగ్రెసు సమావేశంలో అధ్యక్షత వహించిన జవహర్లాలు నెహ్రూ ప్రసంగం విన్నది. ఆ ప్రసంగంలో చాలా భాగం ఆమెకు బోధ పడలేదు. అందులో రాజకీయాలు చాల గహనంగా జటిలంగా చర్చించడం జరిగింది. అయినప్పటికీ ఆమె కా ఉపన్యాసం పూర్తిగా అర్థం కాకపోలేదు. మనుష్యుడు స్వతంత్రుడు. అన్యాయాన్ని తీవ్రంగా ఎదుర్కొనడం మానవుని కర్తవ్యం. జీవితమొక క్రియాత్మకమైన పోరాటం. ఈ భావాలతో కూడిన ఆ ఉపన్యాసం విని ఆమె తన్మయమయి పోయింది.

విద్య తన ప్రక్కనే తనతోపాటు నడిచివస్తున్న తన అన్నయ్య నవల్ని చూచింది. ఆమె అన్నయ్య ముఖంలో కూడా స్థైర్యం, ఆత్మవిశ్వాసం కనిపించాయి. "మా అన్నయ్య మాత్రం జవహర్లాలు కాగూడదూ?" అనుకొన్నదామె.

ఆమె ముఖం వాడిపోయింది. జవహర్లాలు తండ్రి చాటు బిడ్డ. తండ్రి అండ దండలు ఆయనకు లభించాయి. కాని నవల్ కు తండ్రి లేడు. ఇంత చిన్న వయస్సులోనే అతని పసి భుజాలపై కుటుంబ భారం వచ్చి పడింది. పిల్లలను ఎక్కదీసుక రావలసిన భారమే కాకుండా తను కూడా అతనికి భారంగా తయారయింది. ఉన్నట్టుండి ఆమె నవల్ చెయ్యి పట్టుకుని అన్నది : "అన్నయ్యా! నేనిక జీవితాంతం వరకూ అత్తగారింటికి స్వస్తి చెప్పేసి వచ్చాననే విషయం నీవెప్పుడయినా ఆలోచించావా? నేను నీకు తప్పించుకోడానికి వీలులేని భారంగా తయారయాను."

నవల్ నవ్వాడు : "ఎంత పిచ్చిదానవమ్మా విద్యా ! నీవు ఒకరికి భార మవుతావా? నీకు ధైర్య సాహసాలున్నాయి, శక్తి సామర్థ్యాలున్నాయి. నీవే ఇతరులకు ఆధారం కాగలవు. నిన్ను ఆవరించిన విషాదం నీ శక్తి సామర్థ్యాలు నీకు తెలియకుండా చేస్తున్నది. కాని నాకు తెలుసు."

ఆ మాటలతో విద్యనావరించిన విషాదమంతా కరిగిపోయింది. ఇప్పు డిప్పుడే ఆమెకు జీవితమంతా మంచుముద్దలా తోచింది. కాని అంతలోనే ఆమెలో నున్న వెచ్చదనం వల్ల ఆ చలికి ఆమె శరీరం పులకరించింది. "నిజమన్నయ్యా ! నా బరువును నేనే మోయగలనని నీకు నమ్మకముంది గదూ ! ఈ జుగుప్సను, ఈ దాస్యాన్ని నిర్మూలించి నా కనువైన మార్గాన్ని నేనే ఏర్పాటు చేసుకోగలనా అన్నయ్యా ? అయితే నీవు నాకీ ప్రయత్నంలో సాయం చేయాలి. చేస్తావు కదూ ? చెప్పన్నయ్యా !"

"అలాగే విద్యా ! తప్పకుండా చేస్తాను. ఇక మనం ఇంటికి వెళ్ళాలి. చలి చాలా తీవ్రంగా ఉంది."

"అలాగే వెళ్ళుదాం. నిజంగా చలి ఎక్కువగానే ఉన్నదన్నయ్యా! వెళ్ళగానే టీ పెడతాను. జ్ఞాన్ తాతయ్య కూడా వచ్చే ఉంటారు."

లాహోరు కాంగ్రెస్‌లో వాతావరణం అంతా ఉత్తేజకరంగా ఉంది. మహాత్మాగాంధీకి, లార్డ్ ఇర్విన్‌కు మధ్య రాజీ కుదరలేదు. దేశమంతటా నైరాశ్యం, క్రోధం వ్యాపించాయి. పోరాడాలి, అవస్థపడి సాధించాలి, యాచించినందువల్ల ఏమీ ప్రయోజనం లేదు. బలవంతంగానైనా సరే మనం సాధించదలచుకొన్నది సాధించి తీరాలి. కాని దీని కంతటికీ నాయకత్వ మేదీ ?"

గాంధీ మౌనం వహించి శాంతంగా, దృఢంగా, నిశ్చలంగా ఉన్నారు. నాయకత్వం వహించదగిన సామర్థ్యం గాంధీకొక్కరికే ఉంది. కాని ఆయన కొన్ని షరతులు పెట్టారు – చాల కఠినమైన షరుతు లాయనవి. ప్రేమ, అహింస, త్యాగం – ఆయన పెట్టిన ఈ షరతుల నెవరైనా పాటించ గలరా? ద్వేషించకూడదు, కాని భయంకరమైన పోరాటం జరిపించాలి. హింస పనికిరాదు, కాని చావు బ్రతుకులను లెక్కచేయకుండా పోరాడాలి. అన్నిటినీ వదలుకోవడానికి సిద్ధం కావాలి, కాని స్వాధికారాన్ని సాధించాలి. మరి ఈ షరతుల ననుసరించి పనిచేయడం సాధ్యమేనా? జైళ్ళకు వెళ్ళండి, లాఠీదెబ్బలు తినండి. తుపాకి దెబ్బలకు గురికండి. కాని కయ్,

కుయ్ అనడానికి వీల్లేదు. ఇది సాధ్యమేనా ? అలా చేయడం ఎవరికి చేతవుతుంది ?

వేలాది ప్రజలున్నారు – స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు – ఎందరో ఉన్నారు. అందరూ దృఢ సంకల్పంతో, గట్టి నమ్మకంతో ఉన్నారు. వీళ్ళందరూ గాంధీ చెప్పిన అహింసా ప్రేమ మార్గంలో నడవగలుగుతారా? గాంధీ అడుగుతున్నారు – "ఇదంతా సాధ్యమవుతుందా ?" అని.

గాంధీ అడిగిన ప్రశ్నకు సమాధానం కాంగ్రెస్ అధ్యక్షుడు జవహర్లాలు చెప్పాడు. ఇదంతా సాధ్యమవాలి, సాధ్యమయి తీరాలి అన్నాడు జవహర్లాలు. హింసవల్ల ప్రయోజనం లేదు. హింసాయుతమైన పోరాటంలో ఎక్కువ బలవంతమైన, శక్తివంతమైన హింసకే విజయం లభిస్తుంది. గాంధీ చెప్పిన ఈ మాట నైతికమయినది. నీతికీ దానికీ ఘనిష్ఠ సంబంధముంది. విచ్ఛిన్నమైన నీతిరహితమైన జాతి హింసాయుతమైన పోరాటంలో నెగ్గలేదు. ఈ కాంగ్రెస్ సభా మండపంలో మన మధ్యనే ఎందరో గూఢచారులున్నారు. వీళ్ళను కనిపెట్టడం మనకు సాధ్యంకాదు. వీళ్ళంతా మనకు సన్నిహితులు, ఆత్మీయులు.

"విశ్వాస రూపంలో కాక అదొక సిద్ధాంతంగా భావించి మనం అహింసననుసరించాలి" అంటాడు జవహర్లాలు. వస్తుస్థితిని చక్కగా గమనించినవాడు జవహర్లాలు. అతడు దేశ చైతన్యానికీ, జాతీయాత్మకూ ప్రతినిధి. గాంధీవలె అతడు దైవసమానుడు కాడు. గతాన్ని నెలకొల్పడం మీద అతనికి నమ్మకం లేదు. ఆర్ష పరంపర నతడంగీకరించడు. నశించినదంతయు అసత్ పదార్థమయి యుండాలి. లేకుంటే అది నశించి ఉండేది కాదు. జవహర్లాలు నేటి పరిస్థితి కనుగుణమైన భౌతికజీవి. సామ్యవాదాన్ని ఆయన నిశితంగా పరిశీలించాడు. భవిష్యమంతా ఈ సామ్యవాదం మీదనే ఆధారపడి ఉందని ఆయన విశ్వాసం. కాని జవహర్లాల్ వ్యక్తిత్వం సర్వాత్మనా భారతీయ సంస్కృతి కనుగుణమయింది. ఆయనకు హింసయన్న గిట్టదు. అహింస సిద్ధాంతరీత్యానే కాక నిత్య జీవితంలో ఆయన సర్వాత్మనా నమ్మిన ఆదర్శం. గాంధీలో లోపించింది జవహర్లాల్లో ఆకారాన్ని పొందింది. ఆవేశంతో ఉత్సాహంగా ఉష్ణరక్తంతో పోరాడే నవయువకులకు జవహర్‌లాల్ ప్రతినిధి. భావి జీవితాన్ని గురించి కలలుగనే నవయువకులే అహింసాయుతమైన ఈ స్వాతంత్ర్య సమరంలో

పోరాడగలరు. అలా పోరాడి స్వప్నాలను సార్థకం చేయగల సాహసం, సామర్థ్యం వాళ్ళకే ఉంది.

ఆశలు నిరాశలై పోయాయి. అదో రకమైన భయంకర విషాదం ఆవరించింది. ఇక ముందు ఏమి కానున్నదో ఎవరికీ తెలీదు. కాని ముందుముందు ఏదో అవుతుంది. అయితీరాలి. లాహోరులో జరిగిన కాంగ్రెస్ సమావేశం ప్రజల భావనలకు నిదర్శనం. నాయకులు వివేకపూరితమైన నివారణోపాయాన్ని దేన్నీ సూచించలేక పొయ్యారు. పోరాటం తప్పదని మాత్రం తెలుస్తున్నది. కాని ఈ పోరాటం ఎలా ఉండాలి అనేది తేలలేదు. దీనికొక పద్ధతి, ప్రణాళిక ఏర్పడలేదు.

లాహోరు కాంగ్రెస్‌లో ఎన్నో తీర్మానాలు చేశారు. ఎన్నో విషయాలు చర్చించారు. ఎంతమందో ఉపన్యాసాలిచ్చారు. ఇవన్నీ పేపర్లల్లో వచ్చాయి. ఇలాంటి తీర్మానాలు, ఉపన్యాసాలు, ప్రచార కార్యక్రమం - ఇదంతా కాంగ్రెస్‌కు పరిపాటి అయిపోయింది. అంతేకాని ఒక నిశ్చితమైన కార్యక్రమాన్ని ఈ లాహోరు కాంగ్రెస్ తయారు చేయలేదు. దేశమంతా లాహోరు వైపు చూస్తూ ఉన్నది. కాని లాహోరులో జరిగిన విషయాలను పరిశీలిస్తే ప్రజలకు నైరాశ్యమే లభిస్తున్నది.

మళ్ళీ లాహోరు కాంగ్రెస్‌లో మాత్రం నైరాశ్య వాతావరణం ఏమాత్రం లేదు. అక్కడ చేరినవారికి దృఢ సంకల్పం ఏర్పడింది, ఉంటే ఉంటాం, పోతే పోతాం అనే నిశ్చయం వాళ్ళ మనస్సుల్లో ఏర్పడింది. మనిషిని మంచుగడ్డలా చేసే ఆ చలిలో కూడా ప్రతి వ్యక్తి హృదయంలో ఉష్ణ రక్తం ప్రవహిస్తూ ఉంది. వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిరుపహతంగా ఉత్సాహవేగంతో సాగుతూ ఉన్నాయి.

ఇదంతా నవల్ చూచాడు. విద్యకూడా చూచింది–నూతన ప్రపంచం, నూతన వాతావరణం, నూతన దృక్పథం!

నవల్, విద్య కలిసి ఢిల్లీ మీదుగా అలహాబాదు చేరుకున్నారు. జ్ఞాన ప్రకాశ్‌కి కొద్దిరోజులు ఢిల్లీలో పని పడ్డది. నవల్, విద్య ఇంటికి వెళ్ళే సరికి యమున మంచంలో ఉంది. మొదట ఆమెకు జలుబు, దగ్గుతో ఆరంభించి చివరకు నిమోనియాలోకి దిగింది. ఆమె అలా జబ్బుతో ఉన్నట్టు తెలియగానే విద్య, నవల్ ఇద్దరూ నేరుగా ఆమె గదిలోకి వెళ్ళారు. ఆమెకు జ్వరం చాలా తీవ్రంగా ఉంది. ఒళ్ళు తెలియకుండా కండ్లు మూసుకుని

ఆమె పండుకొని ఉంది. ఆమె దగ్గర రుక్మిణి కూర్చుని ఉంది. జ్వాలా ప్రసాద్ డాక్టరుకోసం వెళ్ళారు. రుక్మిణి యమునతో అన్నది: "అత్తయ్యగారూ! విద్య, నవల్ లాహోరు నుంచి వచ్చేశారు. ఇదుగో ఇక్కడే నిలబడి ఉన్నారు, చూడండి."

రుక్మిణి మాటలకు యమున కండ్లు తెరిచింది. ఆమె కదోరకమైన శాంతి చేకూరినట్టుగా ఉంది. వాళ్ళిద్దర్ని చూచి ఆమె చాల నీరసించిన కంఠంతో అన్నది: "వచ్చారా మీరిద్దరూ! మీ కోసం నేనెంతో ఎదురు చూస్తూ ఉన్నాను. మిమ్మల్ని చూడకుండానే వెళ్ళిపోవల్సి వస్తుందేమో అనుకున్నాను."

"లేదు మామ్మా! అలా అనకు. నీవు వెళ్ళడం ఏమిటి? నీకు నయమైపోతుంది" అన్నది విద్య.

యమున పాలిపోయిన చిరునవ్వుతో అన్నది: "ఆ విషయం ఎవరు చెప్పగలరమ్మా! ఇలా రా తల్లీ! నా తలవైపు కూర్చో. ఏదీ నీచెయ్యి నాకిలా అందించు." అని విద్య చెయ్యి తన తలపైన పెట్టుకొని "అబ్బ! ఎంత హాయిగా ఉందమ్మా" అంటూ ఆమె కండ్లు మూసుకున్నది.

రుక్మిణి నవల్ చెయ్యి పట్టుకుని ఆ గదిలో నుంచి బయటకు తీసుకు వెళ్ళింది: "నీకు తెలుసా బాబూ! విందేశ్వరీ ప్రసాద్ సిద్ధేశ్వరికి రెండో పెండ్లి చేస్తున్నారు. జనవరి ఇరవై ఎనిమిది పెండ్లి. ఈ విషయం తెలిసిన రోజు నుంచి అత్తయ్య మంచం పట్టింది." కొంచెంసేపు ఆగి మళ్ళీ ఆమె నవల్‌తో అన్నది: "ఇదంతా ఏమిటి బాబూ! వాళ్ళకేమయినా చెప్పి చూడగూడదూ?"

నవల్ కూడా ఆ వార్త విని భేద పడ్డాడు. కొంచెంసేపు ఆలోచించి అతడన్నాడు "చెప్పి చూచేదేముందమ్మా! అది అలా జరుగవలసి ఉంది. ఒక విధంగా ఇదంతా మన మంచికే అనుకో!"

"అయ్యో రామ! అదేమిటిరా అలా అంటావు? దీని జీవితమంతా తెల్లవారాలి. ఎవరు చూస్తారు దాన్ని?"

"ఏం ఫరవాలేదమ్మా! దాన్ని భగవంతుడే చూస్తాడు. తన విషయం తానే సమర్థించుకొనేందుకు కావలసిన శక్తి భగవంతుడే ఇస్తాడు. తాతయ్య ఎక్కడ?"

"డాక్టరు కోసం వెళ్ళారు. ఆయనదెంత గట్టి గుండె! కొండల్లాగా

ఆపదలు ముంచుకు వస్తున్నాయి. కాని ఏ మాత్రం విసుగు లేకుండా తన విధి తాను నిర్వహిస్తున్నారు. అత్తయ్య ఆరోగ్యం ఏమాత్రం బాగుపడడం లేదు. నాలుగయిదు రోజుల నుంచి నిద్ర కూడా పట్టడం లేదు. సీవిక వెళ్ళు. భీఖూ నీళ్ళు కాచి ఉంటాడు. స్నానం చెయ్యి వెళ్ళి. బడలిక తీరుతుంది."

రుక్మిణి మళ్ళీ యమున గదిలోకి వచ్చింది. విద్య యమున తల నిమురుతూ మౌనంగా కూర్చుని ఉంది. యమున కండ్లు మూసుకుని పండుకొని ఉంది. ఆమెకు నిద్ర వస్తున్నట్టు తోచింది. రుక్మిణి విద్యతో అన్నది: "వెళ్ళి స్నానం చెయ్యమ్మా! నేను కూర్చుంటానిక్కడ."

యమున కండ్లు తెరిచింది: "లేదు రుక్మిణీ! అమ్మాయిని మరి కొంచెం సేపు నా దగ్గరనే కూర్చోనీ."

యమున కండ్లలో నీళ్ళు నిండినయి: "మా పిచ్చి తల్లికి మేము చేతులారా అన్యాయం చేశాం. నన్ను క్షమించు తల్లీ! లేకుంటే నేను సుఖంగా మరణించలేను. నేను నీకు చాలా అపకారం చేశాను. నన్ను క్షమించానని చెప్పు."

విద్య ఆశ్చర్యంతో రుక్మిణి వైపు చూచింది. "ఏమిటమ్మా యిది! నాయనమ్మ ఇలా అంటున్నదేమిటి?"

రుక్మిణి తల వంచుకుని అన్నది: "సిద్ధేశ్వరి మళ్ళీ పెండ్లి చేసుకుంటున్నాడు. జనవరి ఇరవై ఎనిమిది పెండ్లి."

విద్య చిరునవ్వుతో అన్నది: "నిజమా అమ్మా! అయితే నాకి బంధనం నుండి ముక్తి లభించిందన్న మాట." అంటూ విద్య యమున చేతులను గట్టిగా పట్టుకొన్నది. "మామ్మా! ఇది చాలా మంచి వార్త. నాకు ముక్తి లభించింది. నా బంధనం పూర్తిగా తెగిపోయింది. అంతా ఈశ్వరుని అనుగ్రహం. దీనిలో దిగులు పడవలసిందేముంది మామ్మా!"

"నీకు బోధపడదు తల్లీ! కనీసం ఇప్పుడల్లా నీకా సంగతి ఏమీ తెలియదు. ఎంత అనర్థం జరిగింది పరమేశ్వరా!" అన్నది యమున.

"ఇది క్రొత్త విషయమేమీ కాదు మామ్మా! ఇటువంటివి నిత్యమూ జరుగుతూనే వుంటాయి. దీనిలో ఎవరి తప్పేముంది? ఇదంతా భగవంతుని లీల. నాకు మాత్రం ఈ వార్త విన్న తర్వాత చాలా సంతోషంగా ఉంది."

యమున ఎలుగెత్తి అన్నది: "అమ్మా, నన్ను క్షమించానని నీ నోటితో చెప్పు తల్లీ!"

రుక్మిణి విద్యతో అన్నది: "చెప్పవే విద్యా! నీవా మాట చెపితే అత్తయ్యకు మనసు కుదుట పడుతుంది."

విద్య యమున చెయ్యి పట్టుకొని అన్నది: "మామ్మా! మీరందరూ నా మేలు కోరే ఇదంతా చేశారు. దానికి ఈశ్వరుడే సాక్ష్యం. నాకోసం మీరు ఇల్లూ, వాకిలీ అంతా గుల్ల చేసుకున్నారు. కాని మీరనుకోకుండా నాకు కీడు జరిగి ఉంటే దానికి నిన్ను క్షమిస్తున్నాను. నీకు నయమవుతుంది మామ్మా. నీకు నయంకావాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను."

యమునకు భావావేశంలో ఎక్కిళ్ళు వచ్చాయి, ఆమెకు స్పృహ తప్పిపోయింది. మళ్ళీ ఆమెకు స్పృహ రాలేదు.

జ్ఞానప్రకాశ్ ఢిల్లీనుండి బొంబాయి వెళ్ళారు. బొంబాయి నుండి ఆయన అలహాబాదు వచ్చేసరికి రాత్రి చాలా పొద్దుపోయింది. నవల్ తన గదిలో కూర్చుని చదువుకుంటున్నాడు. జ్ఞానప్రకాశ్ వస్తున్న టాంగా చప్పుడు విని అతను బయటికి వచ్చాడు. అతను సామాన్లు దింపించి వరాండాలో పెట్టించాడు. టాంగా వాణ్ణి పంపించేసి ఆయన నవల్ని అడిగాడు: "ఇంట్లో ఇంత నిశ్శబ్దంగా ఉందేం? నీ వెందుకింత దిగులుగా ఉన్నావు?"

నవల్ మెల్లగా చెప్పాడు: "తాతయ్యా! మామ్మ పోయింది. ఇవ్వాళకు ఎనిమిది రోజులు!"

"ఏమిటి? అక్కయ్య పోయిందా? ఏమయింది?"

"మనం వెళ్ళిన తర్వాత ఆమెకు నిమోనియా వచ్చింది. ఆమె ప్రాణాలు మాకోసం ఎదురు చూస్తున్నట్టు నిలబడి ఉన్నాయి. మేమిక్కడకు వచ్చిన రోజు రాత్రికే ఆమె ప్రాణం పోయింది."

జ్ఞానప్రకాశ్ తన సామానంతా గదిలో పెట్టించారు. తర్వాత ఆయన నవల్ని వెంటపెట్టుకుని జ్వాలా ప్రసాద్ గదిలోకి వెళ్ళారు. జ్వాలా ప్రసాద్ నేల మీద దుప్పటి పరుచుకొని మరో దుప్పటి కప్పుకొని పండుకొని ఉన్నారు. ఇంకా పదోరోజు కాలేదు. జ్వాలా ప్రసాద్‌కు నిద్ర వచ్చింది. కాని ఆ నిద్ర అంత గాఢమయింది కాదు. జ్ఞానప్రకాశ్ నవల్ గదిలోకి వచ్చినప్పుడయిన అడుగుల చప్పుడుకే ఆయనకు మెలకువ వచ్చింది. జ్ఞానప్రకాశ్‌ను చూడగానే జ్వాలా ప్రసాద్ అన్నారు: "జ్ఞానూ!

నీవు రావడం చాలా ఆలస్యమయింది. మీ అక్కయ్య పోయింది. ఇదంతా సహించలేక పోయింది. నేనెంతో ధైర్యం చెప్పాను. కాని అది చివరకు తట్టుకోలేక పోయింది.''

జ్ఞానప్రకాశ్ నేల మీదనే కొంచెం దూరంగా కూర్చున్నారు - మౌనంగా. ఆయన నోట మాట రావడం లేదు.

జ్వాలా ప్రసాద్ అన్నారు: ''సిద్ధేశ్వరికి రెండో వివాహం చేస్తున్నారని వార్త అందింది. ఈ వార్తతో అది కూలిపోయింది. ఆ రోజు మంచం పట్టింది. ఇక మళ్ళీ లేవలేదు.'' జ్వాలా ప్రసాద్ కంఠం స్తంభించి పోయింది.

కొంచెంసేపు మౌనంగా ఉండి జ్ఞానప్రకాశ్ అన్నారు: ''ధైర్యం తెచ్చుకో బావా! నీవిలా అధైర్యపడితే లాభం లేదు.''

జ్వాలా ప్రసాద్ తన దిగులునంతా లోపలనే అణచుకొని బలవంతంగా అన్నారు: ''తెలుసు జ్ఞానూ! నాకంతా తెలుసు. ధైర్యంగా ఉండక చేసేదేముంది? కాని నా జీవిత సహచరి గతించింది. దాని ఆత్మశాంతికి భగవంతుని ప్రార్థిస్తున్నాను.''

నవల్ జ్వాలా ప్రసాద్ వైపు చూచాడు. ఆయన మాటల్లో ఎంత గహనమైన విషాదం ఉంది! అరవై ఆరేండ్ల ముదుసలి ముడతలు పడ్డ ముఖం .... జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు చూచాడో ఆ వ్యక్తి. జ్వాలా ప్రసాద్ ఇంకా అంటూనే ఉన్నారు: ''జ్ఞానూ! అది జీవితంలో వినాశం చూచి దానికి తట్టుకోలేక విరిగి పడిపోయింది. కాని వినాశం తర్వాత మళ్ళీ వికాసం అనేది ఉంటుందని అర్థం చేసుకోలేక పోయింది.'' అంతలోనే జ్వాలా ప్రసాద్‌కు స్పృహ వచ్చినట్లు ''నీ విప్పుడే స్టేషన్నుంచి వస్తున్నట్టున్నావు. వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కొని గుడ్డలు మార్చుకో'' అన్నారు. ఆ తర్వాత నవల్ వైపు చూచి అన్నారు: ''జ్ఞానూకు తిండీ తిప్పలూ కొంచెం విచారించు నవల్, అవసరమైతే అమ్మను లేపి అన్నం వండమని చెప్పు.''

''విద్య పూరీలు చేస్తున్నది తాతయ్యా! మీరిక నిద్ర పొండి'' అంటూ నవల్ లేచాడు. ''రండి జ్ఞాన తాతయ్యా. నీళ్ళు కాగే ఉంటాయి. స్నానం చేయాలనిపిస్తే చేసేయండి. ఈలోగా పూరీలు తయారవుతాయి.''

ఉదయం జ్ఞానప్రకాశ్ నిద్ర లేచేసరికి జ్వాలా ప్రసాద్ ఇంట్లో అందర్నీ

తీసుకుని గంగా స్నానానికి వెళుతున్నారు. ఆ రోజు అందరికీ సూతకపు శుద్ధి స్నానాలు. జ్ఞానప్రకాశ్ కూడా వాళ్ళందరితో గంగా స్నానం చెయ్యడానికి వెళ్ళారు. అందరూ మధ్యాహ్నానికి త్రివేణి నుంచి తిరిగి వచ్చారు.

సాయంత్రం జ్వాలా ప్రసాద్ అలా తిరిగి రావడానికి బయలుదేరారు. నవల్ జ్ఞానప్రకాశ్ దగ్గట టీ త్రాగుతూ కూర్చున్నాడు. విద్య కూడా అక్కడనే ఉంది. టీ తాగుతూ జ్ఞానప్రకాశ్ విద్య వైపు చూచారు. ఆమె మౌనంగా కూర్చుని ఉంది. జ్ఞానప్రకాశ్ నవ్వుతూ అన్నారు: "ఏవమ్మా విద్యా! ఇక నీ కార్యక్రమం ఏమిటి? నీకిక ముక్తి లభించింది గదా!"

విద్య ముఖం కాంతితో వెలిగింది. ఆమె జ్ఞానప్రకాశ్‌తో అన్నది: "నిజమే తాతయ్యా! మీరు కూడా నాకు ముక్తి లభించిందనే అనుకుంటున్నారా?"

"అవునమ్మా! నీకు ముక్తి లభించింది - కనీసం ఆ పిశాచాల నుంచి. దానికి నీవెంతో సంతోషించవలసిన దానివి, అలా దిగులుపడి కూర్చున్నావేమిటి? ఇది సరిగా లేదు."

"ఏం చెయ్యమంటావు తాతయ్యా! నా వల్లనే నాయనమ్మ పోయింది." అన్నది విద్య చాల రుదిత కంఠంతో.

జ్ఞానప్రకాశ్ నవ్వారు: "ఎవ్వరూ ఎవరివల్లా పోరమ్మా విద్యా! ఎవరికి వెళ్ళాల్సిన రోజు వస్తే వాళ్ళు పోతారు. ఏదో ఒక రోజు నీవు కూడా పోతావు. అయిపోయిన దాన్ని మనం ఆపలేక పోయాం, అలాగే కాబోయేదాన్ని కూడా ఆపడం మనకు సాధ్యం కాదు. ఇప్పుడు నీకు ఏం చెయ్యాలని ఉన్నదో నాకు చెప్పు. కాంగ్రెసుతో పని చేస్తావా? బొంబాయి నుంచి వస్తూ నేనదే ఆలోచిస్తూ వచ్చాను. లాహోరులో నీవు చూచావు గదా - ఎంతమంది స్త్రీలు ఈ ఉద్యమంలో ముందంజ వేస్తున్నారో!"

విద్య కొంచెంసేపు ఆలోచించి తల ఊపుతూ అన్నది: "కాదు తాతయ్యా! అదంతా నావల్ల అయేపని కాదు."

"అదంతా నీవల్ల కాదు, మరి నీవల్ల అయేదేమిటి? ఈ పిరికితనాన్ని నీవు వదలి పెట్టాలి."

విద్య కొంచెం సందేహిస్తూ సమాధానం చెప్పింది: "అది కాదు

తాతయ్యా! మగవాళ్ళ మధ్య కూర్చుని నేను పని చేయలేను తాతయ్యా! అంటే నాకు మగవాళ్ళంటే సిగ్గని కానీ భయమని కానీ కాదు. అసలు నాకు నన్ను చూచే భయమేస్తుంది. నేను చాల దారుణమైన జీవితాన్ని అవలంబించాను.'' విద్య కంఠంలో అంతులేని జాలి పలుకుతున్నది.

జ్ఞానప్రకాశ్‌కు హృదయంలో ఏదో బాధ కలిగింది. ఆయన మళ్ళీ విద్యవైపు చూచారు. ఎంత శాంతం! ఎంత సౌమ్యత! ఎంతటి సాత్విక సౌందర్యం! ఎంత నిర్దాక్షిణ్యమైన విధి విధానం! బలవంతంగా ఆమెను వైధవ్యం బాధిస్తున్నది. జ్ఞానప్రకాశ్ అన్నారు: "నిజమే తల్లీ మన ఊళ్లో స్త్రీ విద్యా నికేతనం అని ఆడపిల్లల పాఠశాల ఒకటి ఉన్నది. ఆ పాఠశాల మేనేజింగ్ కమిటీలో నేను మెంబరును. అందులో ఒక టీచరు రాజీనామా పెట్టారు. మార్చి మొదటి తేదీనుండి ఆమె స్థానం ఖాళీ అవుతుంది. ఒక దరఖాస్తు వ్రాసియ్యి. ఆ పని చెయ్యగలవు గదా?''

"అలాగే తాతయ్యా! ఆ పని చేయగలను. అక్కడ నన్ను చేర్పించండి, సాధ్యమైనంత త్వరగా. తాతయ్యా! అప్పుడప్పుడు నాకు కాలయాపన బహు కష్టంగా తోస్తుంది. ఆ పనిలో ఒగిగితే దానితోనే పొద్దుపోతుంది.''

జనవరి ఇరవైఆరో తేదీ దేశమంతటా 'స్వాతంత్ర్య దినోత్సవం' జరుగబోతున్నది. ఇంతవరకూ కాంగ్రెస్ అడిగింది అధినివేశ స్వరాజ్యం. కాని ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. స్వరాజ్యంకోసం పోరాడవలసి వచ్చినప్పుడు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఎందుకు పోరాడ కూడదు? కలకత్తా కాంగ్రెసులో తొలిసారి స్వాతంత్ర్యం కావాలని తీర్మానించడం జరిగింది. లాహోరు కాంగ్రెసు ఈ తీర్మానాన్ని కార్య రూపంలో పెట్టడానికి సంకల్పించింది. స్వాతంత్ర్య ప్రకటన పత్రం తయారయింది. జనవరి ఇరవై ఆరు దేశంలో నలుమూలలా ప్రతి వ్యక్తి స్వాతంత్ర్య దీక్ష పూనవలెనని నిర్ణయం జరిగింది. ఈ స్వాతంత్ర్య దినానికి సంబంధించిన తీర్మానాన్ని దేశమంతటా ప్రచారం చేసి ఆ నాటి కార్యక్రమాన్ని రూపొందించడంలో జ్ఞానప్రకాశ్ కార్యమగ్నులై ఉన్నారు. నవల్ కూడా ఈ పనిలో జ్ఞానప్రకాశ్‌కు చాలా ఉత్సాహంగా సాయం చేస్తున్నాడు.

యమున చనిపోయి పదుమూడు రోజులయిన తర్వాత జ్వాలా ప్రసాద్ గీతాధ్యయనం ప్రారంభించారు. ఈ అధ్యయనంలో విద్య ఆయనకు తోడుగా ఉండేది. నవల్ పగలంతా బయట ఎక్కడనో తిరిగేవాడు. పగటి

పూట అతను యూనివర్సిటీకి వెళ్ళేవాడు. లేకుంటే మిగిలిన సమయం కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గడిపేవాడు. పిల్లలు స్కూలుకు వెళ్ళే వాళ్లు. రుక్మిణి ఇంట్లో పనులన్నీ చూచుకుంటూ ఉండేది.

ఒక రోజు సాయంత్రం జ్వాలా ప్రసాద్ డ్రాయింగు రూములో కూర్చుని భగవద్గీత వింటున్నారు. విద్య వినిపిస్తున్నది. ఇంతలో ఏదో టాంగా వచ్చి పోర్టికోలో ఆగింది. "చూడమ్మా! ఎవరో వచ్చినట్టున్నారు," అన్నారు జ్వాలా ప్రసాద్.

విద్య వరండాలోకి వెళ్ళి చూచింది. విందేశ్వరీ ప్రసాద్ టాంగా దిగి వరండాలోకి వస్తున్నారు. విద్య శాంతంగా అన్నది: "తాతగారు డ్రాయింగు రూములో ఉన్నారు, రండి."

విందేశ్వరీ ప్రసాద్ విద్యకేమీ సమాధానం చెప్పలేదు. చాలా కఠోర ముఖ ముద్రతో ఆయన డ్రాయింగ్ రూములోకి ప్రవేశించారు.

జ్వాలా ప్రసాద్ లేచి విందేశ్వరీ ప్రసాద్‌కు స్వాగతం తెలుపుతూ అన్నారు: "రండి, కూర్చోండి."

విందేశ్వరీ ప్రసాద్ బదులు చెప్పకుండా కూర్చున్నారు. జ్వాలా ప్రసాద్ విద్యతో అన్నారు: "అమ్మా! టీ పెట్టి తీసుకునిరమ్మని భీఖూకు చెప్పు."

అప్పుడు విందేశ్వరీ ప్రసాద్ నోరు తెరిచారు: "అక్కర్లేదండీ! టీ ఫల హారం చేసే బయలుదేరాను. మీతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలని యిక్కడికి వచ్చాను. దీన్ని ఇక్కడినుంచి వెళ్ళమని చెప్పండి."

జ్వాలా ప్రసాద్ విద్య వైపు తిరిగి అన్నారు: "వింటున్నావు గదూ విద్యా! కాసేపు లోపలికి వెళ్ళమ్మా!"

విద్య లేచి నిలబడ్డది. మళ్ళీ ఏదో ఆలోచించి ఆగిపోయింది. "ఈయన మాట్లాడదలచుకొన్నది నన్ను గురించే అనుకుంటాను. కనక నేనిక్కడ ఉండడం చాలా అవసరం. ఈయన చెప్పే మాటలు నేను కూడా వింటాను." అన్నదామె.

విందేశ్వరీ ప్రసాద్ కొంచెం గట్టిగా అన్నారు: "నీతో మాకేమీ సంబంధం లేదు. నేను మాట్లాడవలసింది జ్వాలా ప్రసాద్‌తో. నీ ముఖం చూడడం కూడా నా కిష్టం లేదు."

విద్య కూడా బిగ్గరగా అన్నది: "కాని నన్నుగురించి వెళ్ళగక్కదలచిన విషం నా ఎదుటనే కక్కడం మంచిది. ఆ విషాన్ని నేను దాచుకుంటాను. ఈ విషవమనంతో మీరు ఇతరులను బాధించవద్దు. మీ విషంతో మా నాయనమ్మ పోనే పోయింది."

అప్పుడు జ్వాలా ప్రసాద్ వింధేశ్వరీ ప్రసాద్‌తో అన్నారు: "ఈ అమ్మాయి ఇక్కడ ఉండడం అవసరమేనని నేను కూడా అనుకుంటున్నాను. ఈ విషయం దాని భావి జీవితానికి సంబంధించింది. అంతేకాక ఇది చిన్న పిల్లకాదు. తన మంచి చెడ్డలు తానే చూచుకొని అవగాహన చేసుకోవలసిన వయస్సు వచ్చింది. నాదేముంది? భగవంతుడెప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను. అమృతం తాగి పుట్టిన వాణ్ణికాదు కదా నేను."

"సరే మీ ఇష్టం" అన్నారు వింధేశ్వరీ ప్రసాద్ వ్యంగ్యంగా. "అయితే దాన్ని కూడా విననియ్యండి. నేను మీకో ఉత్తరం వ్రాశాను. సిద్ధేశ్వరికి వచ్చేవారంలో పెండ్లి చేయబోతున్నామని దానిలో వ్రాశాను."

"అవును బాబూ! ఆ విషయాన్ని గురించి మీరు వ్రాసిన ఉత్తరం చేరింది. హిందూ లా ప్రకారం సిద్ధేశ్వరికి తన ఇష్టం వచ్చినన్ని సార్లు వివాహం చేసుకోడానికి అధికారం ఉంది. మరి ఆ విషయంలో ఇక అడగ దలచిందేమిటి?"

"నేను మిమ్మల్ని రెండు విషయాలు అడగడానికి వచ్చాను. ఈ పెండ్లికి మీ అమ్మాయి వస్తుందా? వస్తే ఆ తర్వాత సిద్ధేశ్వరితో కాపరం చెయ్యడానికి ఒప్పుకుంటుందా? అని"

జ్వాలా ప్రసాద్ దీనికి ఏదో సమాధానం చెప్పబోయేలోగా విద్య అనేసింది: "పెండ్లికి ముందు గాని, తర్వాత గాని మీ యింట్లో ఉండడం కంటే నరకంలో ఉండడం మేలు."

"విన్నారా మీరు, ఈ గయ్యాళి మాటలు!" అన్నారు వింధేశ్వరీ ప్రసాద్: "ఇక మీ అమ్మాయి మనవర్తిని గురించి మాకేమీ బాధ్యత లేదనే విషయం మీరు బాగా తెలుసుకోండి. ఈ విషయం మీకు ముందుగా తెలియపరచాలనే నేను వచ్చాను. మాటిమాటికి చట్టం చట్టం అని మాట్లాడే జ్ఞానప్రకాశ్‌కు ఈ విషయం ముఖ్యంగా చెప్పాలి."

"మీ పాపిష్ఠి డబ్బులో నాకొక్క దమ్మిడి కూడా అక్కర్లేదు." అని సమాధానం చెప్పింది విద్య: "ఈ విషయాన్ని గురించి తాతగారితో కానీ,

ఖ్యాన్ తాతయ్యతో గాని మాట్లాడవలసిన అవసరమే లేదు. నేను వ్రాసి ఇయ్యగలను మీకు."

విందేశ్వరీ ప్రసాద్ జ్వాలా ప్రసాద్ వైపు చూచారు. "విన్నారు కదూ మీరు! ఇక నా తప్పేం లేదు. మేము మీ అమ్మాయిని పోషించడానికీ, మా యింట్లో ఉంచుకోడానికీ సిద్ధంగానే ఉన్నాం. కాని ఈమెకు మా దగ్గఱ ఉండడం ఇష్టం లేదు."

జ్వాలా ప్రసాద్ అన్నారు: "చెప్పేసింది గదా మీతో, తనకు ఏ విధమయిన భరణం మీరు ఇవ్వక్కర్లేదని."

విందేశ్వరీ ప్రసాద్ చేతిలో ఏదో ఫైలుంది. దానిలో నుంచి ఆయన ఒక కాగితం తీసి అన్నారు: "మేము కూడా అలాగే అనుకొన్నాం. అందుకనే నేను ఒక కాగితం వ్రాసి తీసుకు వచ్చాను. దీనిమీద సంతకం చేసి ఇయ్యమనండి దీన్ని. ముందు ముందు ఈ విషయం కోర్టు కెక్కడం నాకిష్టం లేదు. అందువల్ల మన రెండు వంశాలకూ చెడ్డ పేరు వస్తుంది." అంటూ ఆయన తన చేతిలో ఉన్న కాగితం జ్వాలా ప్రసాద్‌కు ఇచ్చారు.

జ్వాలా ప్రసాద్ ఆ కాగితంలో వ్రాసిందంతా చదివి దాన్ని విద్య చేతికిస్తూ అన్నారు: "అంతా బాగానే ఉంది. నీవు కూడా కొంచెం చదువమ్మా!"

విద్య దాన్ని చదివి అన్నది: "నేను నా మనః పూర్వకంగా వీళ్ళని వదిలి పెడుతున్నానని దీనిలో వ్రాసి ఉంది. కాని వీళ్ళ అమానుష దుష్ప్రవర్తనను సహించలేక నేను వీళ్ళ ఇంట్లో ఉండడానికి ఇష్టంలేక నా అంతట నేను వెళ్ళిపోతున్నానని ఉండాలి."

"అలా వ్రాయడానికి వీల్లేదు. నీ గయ్యాళితనాన్ని సహించలేక నిన్ను మేము ఇంట్లో నుంచి వెళ్ళగొట్టాం."

విద్య చాలా దృఢంగా అన్నది: "వ్రాసే దాన్ని నేను. నాకు ఎలా వ్రాయడం బాగుంటుందని తోస్తే అలా వ్రాస్తాను. వ్రాయించుకో దలుచుకుంటే నేను చెప్పినట్టు వ్రాయించుకో. లేకుంటే ఇక్కడి నుంచి వెళ్ళిపో."

జ్వాలా ప్రసాద్ చెప్పారు: "మీరీ కాగితం ఎవరికీ చూపించేది కాదు, కోర్టుకు వెళ్ళేదీ కాదు. ఇది మీ దగ్గర ఉంచుకునేదే కదా! అలాంటప్పుడు అమ్మాయి చెప్పినట్టు వ్రాయించుకోండి."

విందేశ్వరీ ప్రసాద్ కొంచెంసేపు ఆలోచించారు. ఈ వ్యవహారం ఇంత

సులభంగా పరిష్కారమవుతుందని ఆయన అనుకోలేదు. ఆయన కొంచెం స్వాయి తగ్గించి అన్నారు! "మన ఇద్దరి వంశ గౌరవం కాపాడడానికే ఈ పని నేను చేస్తున్నాను, మీ యిష్టం వచ్చినట్టే మసోదా మార్చండి."

ఆ మసోదాలో విద్య తన విషయం వదిలేసి ఆ కాగితం జ్వాలా ప్రసాద్ చేతికిచ్చింది. జ్వాలా ప్రసాద్ దాన్ని చదివారు: "సరిపోయింది. ఇదిగో తీసుకోండి వింధ్యేశ్వరీ ప్రసాద్ గారూ! ఇంత సులువుగా, ఏ తగాదా లేకుండా మీ పని చక్కబడి పోయింది. ఇక ఓ కప్పు టీ త్రాగి వెళ్ళండి."

వింధ్యేశ్వరీ ప్రసాద్ ఆ కాగితాన్ని తన ఫైల్లో పెట్టుకున్నారు: "అక్కర్లేదు, ఇక నాకీ యింటితో సంబంధం లేదు." తర్వాత ఆయన విద్య వైపు తిరిగి అన్నారు: "హిందూ లా ప్రకారం విడాకులివ్వడానికి వీల్లేదనే మాట మాత్రం గుర్తుంచుకో. జీవితాంతం నీవు సిద్ధేశ్వరి భార్యగా ఉండ వలసిందే. ఎప్పటికయినా సరే నీ దుష్ప్రవర్తన మా దాకా వచ్చిందంటే నిన్ను జైలుకు పంపిస్తాం."

వింధ్యేశ్వరీ ప్రసాద్ అన్న మాట విద్య సహించలేక పోయింది. కాలి చెప్పు తీసికొని ఆమె వింధ్యేశ్వరి వెంట పడింది — 'ఛండాలుడా' అంటూ.

వింధ్యేశ్వరీ ప్రసాద్ గడ దాటి బయటికి చేరారు. జ్వాలా ప్రసాద్ విద్యను చెయ్యి పట్టుకొని ఆపేశారు. విద్య జ్వాలా ప్రసాద్ చెయ్యి విడిపించుకుని చేతుల్లో చెప్పులు పట్టుకొని వింధ్యేశ్వరీ ప్రసాద్ వెంట పరుగెత్తడం మొదలు పెట్టింది. ఈలోగా వింధ్యేశ్వరీ ప్రసాద్ టాంగాలో కూర్చున్నారు. "ఇక తొందరగా తోలవోయ్ బండి" అని ఆయన టాంగా అతనికి చెప్పారు.

టాంగా కదిలింది. "ఒట్టి పిరికిపంద!" అంటూ విద్య ఆగిపోయింది. ఆ తర్వాత ఆమె దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

ఏడు

1930 మార్చి 2 వ తేదీ మహాత్మాగాంధీ లార్డ్ ఇర్విన్ పేరిట ఒక ఉత్తరం వ్రాసి ప్రచురించారు. దానితో దేశమంతటా అలజడి బయలుదేరింది. ఆ ఉత్తరంలో ఆయన తన సత్యాగ్రహోద్యమాన్ని ప్రకటించారు. చేసిన ప్రయత్నాలన్నీ పనికిరాకుండా పోయాయి. బ్రిటిష్ ప్రభుత్వం స్వరాజ్యం ఇవ్వడానికి ఏమాత్రం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితిలో సత్యాగ్రహానికి మించి మరో ఉపాయం లేక పోయింది. గాంధీజీ వ్రాసిన ఆ ఉత్తరంలో సౌజన్యం, సౌహార్ధంతో పాటు దృఢసంకల్పం కూడా ధ్వనిస్తూ ఉంది.

నవల్ చదువు బాగానే సాగుతూ ఉంది. కాని ఆ రోజు అతనికి యూనివర్సిటీలో తోచలేదు. అతను నేరుగా కాంగ్రెస్ కమిటీ కార్యాలయానికి చేరుకున్నాడు. జ్ఞానప్రకాశ్ అలహాబాదులో సత్యాగ్రహ కార్యక్రమం తయారుచేస్తున్నారు. నవల్ని చూడగానే ఆయన అన్నారు: "నవల్! పరిస్థితులు పక్వానికి వచ్చాయి. యుద్ధం ఆరంభమైంది."

"అవును తాతయ్యా! గమనిస్తూనే ఉన్నాను. మీకీ పని తొందర ఎప్పటికి తగ్గుతుంది?"

"ఈ రోజు పగలంతా నాకు ఈ పనితోనే సరిపోతుంది. చూస్తున్నావు గదా, బోలెడంత పని ఎదురు చూస్తూ ఉన్నది. సాయంత్రం ఏ ఆరింటికో, ఏడింటికో ఇక్కడనుండి లేవగలననుకుంటాను. సాయంత్రం ఇంటికి వచ్చే టీ తాగుతాను. అన్నట్టు ఈ రోజు ఉదయం 'స్త్రీ విద్యా నికేతనం' లో మీటింగయింది. విద్యకు మార్చి 15 నుంచి అక్కడ ఉద్యోగం ఇయ్యడానికి నిర్ణయించారు. సాయంత్రం వచ్చి అంతా చెపుతాను."

"సరే తాతయ్యా! ఈ రోజు నాకు యూనివర్సిటీలో ఏమీ తోచలేదు. అందుకని నేరుగా ఇంటికే వెళుతున్నాను."

నవల్ అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో అతని మనస్సు చాల హాయిగా ఉంది. విద్యకు ఉద్యోగం దొరికింది. ఇక ఆమె తన కాళ్ళపై నిలబడగలదు. ఆమెకు ఒక మార్గం దొరకడంతో ఒక గొప్ప సమస్య తీరిపోయింది. విద్యకు ఈ శుభవార్త చెప్పడానికి అతను త్వరత్వరగా ఇంటికి వెళ్ళాడు. అప్పుడు విద్య జ్వాలా ప్రసాద్ దగ్గర డ్రాయింగ్ రూములో కూర్చుని ఆయనకు రామాయణం చదివి వినిపిస్తూ ఉన్నది. నవల్ వస్తూనే

చెప్పాడు: "విద్యా! నీకో శుభవార్త తెచ్చాను. మిఠాయి పంచి పెట్టాలి. మార్చి 15 వ తేదీనుండి నీకు 'స్త్రీ విద్యా నికేతనం' లో ఉద్యోగం కుదిరిందని జ్ఞాన్ తాతయ్య చెప్పారు.

"నిజమా అన్నయ్యా!" అని తొందరపడుతూ అన్నది విద్య. మళ్ళీ మరుక్షణమే తన ఉబలాటానికి తనకే సిగ్గు వేసింది. ఆమె జ్వాలా ప్రసాద్‌తో అన్నది: "తాతయ్యా! ఈ [1]దోహా చదివి ఇంతటితో ఈనాటికి రామాయణం చదవడం ముగిద్దాం."

జ్వాలా ప్రసాద్ నవ్వారు: "అవునమ్మా! ఇక మనస్సు నిక్కడ నిలవడం కష్టం. భగవంతుని దయవల్ల నీకు ఉద్యోగం వచ్చింది. కాబట్టి శ్రద్ధగా ఆయన్ని స్మరించాలి."

విద్య రామాయణం ముగించి నవల్ వైపు చూచింది: "అవునన్నయ్యా! రామచంద్రుడు నన్ను అనుగ్రహించాడు. అయితే నేను పదిహేనో తేదీ నుంచి వెళ్ళాలా?"

నవల్ విద్యకు సమాధానం చెప్పేలోగా జ్వాలా ప్రసాద్ తనలో తాను మెల్లగా అనుకొన్నారు: "ఇలాంటి గడ్డు రోజులు కూడా చూడక తప్పింది కాదు. ఇల్లాలు కావలసిన పిల్ల ఇల్లు వదిలి ఎక్కడనో బానిసగా చాకిరి చేసుకోవలసి వచ్చింది."

నవల్ బదులు చెప్పలేదు. కాని విద్య ఊరకుండ లేకపోయింది: "తాతయ్యా! ఈ బానిసత్వం ఎలా పోతుంది? ఇంట్లో కుమిలిపోతూ కూర్చుని బలవంతంగా తన్ను తాను అణచి పెట్టుకొని ఉండడం మాత్రం బానిసత్వం కాదా?"

జ్వాలా ప్రసాద్ క్రిందికి చూస్తూ అన్నారు: "నీవు చెప్పింది నిజమే కావచ్చు. కాని ఇంట్లో మమకారం అనేది ఒకటి ఉంటుంది కదా!"

విద్య కొంచెం కఠోర కంఠంతో అన్నది: "మమకారం! ఎవరికి ఉంది ఈ మమకారం? ఎవరిమీద ఉంది? ఘోరమైన ద్వేషాన్ని సహించి నన్ను నేను చంపుకొని ఉండవలసి వచ్చింది. నా తల్లి దండ్రుల రక్త మాంసాలను పీల్చి వేసిన ఆ ధన పిశాచాల మీద నాకు మమకారం ఎలా ఉంటుంది తాతయ్యా!"

జ్వాలా ప్రసాద్ అన్నారు: "నీకు తెలియదు తల్లీ! ఈ ప్రపంచంలో

---

[1] ద్విపద లాంటి పద్యం. హిందీలో దీనికి 'దోహా' అని పేరు.

ఒంటరిగా ఉండడం ఎంతో భయంకరంగా ఉంటుంది. ఈ ఒంటరితనాన్ని పోగొట్టుకొనేందుకే కుటుంబం అనే ఏర్పాటు అవసరం.''

విద్య నవ్వింది: ''తాతయ్యా! మీరున్నారు, అన్నయ్య ఉన్నాడు. అమ్మ ఉంది - వీళ్ళంతా కాక ఇంత పెద్ద ప్రపంచం ఉంది. ఇంత పెద్ద కుటుంబం ఉన్నప్పుడు నాకు దిగులెందుకు? ఏమన్నయ్యా? నీవు నన్నెప్పుడూ నీ దగ్గరే ఉండ నిస్తావు గదూ! నాకు నీ మీద ఎంత ఆపేక్షో, వదినెను కూడా అంత ఆపేక్షతోనే చూస్తాను. నీ పిల్లల్ని పూల లాగా తల మీద పెట్టుకొని పెంచుతాను.''

నవల్ కన్నీటిని అపుకొంటూ అన్నాడు: ''విద్యా! ఏమిటదంతా నీ వనేది. నీవు నా కంటే చిన్నదానివి, చెల్లెలు వయినప్పటికీ తెలివి తేటల్లో, ధైర్య సాహసాల్లో నాకు పూజ్యురాలివి.''

నవల్ గడియారం వైపు చూచాడు. ఇంకా మూడు గంటలే అయింది. ఇంట్లో అతనికేమీ తోచడం లేదు. అతని అంతరంగంలో ఏదో అలజడిగా ఉన్నట్లు అతనికి తోస్తున్నది. కాని ఆ అలజడి ఎందుకు? ఏమిటి? అనేది అతనికి బొత్తుగా బోధపడడం లేదు. విద్య నవల్ని అడిగింది: ''నీవేదో పరధ్యానంగా ఉన్నావే. ఏమయిందన్నయ్యా!''

నవల్ నవ్వాడు: ''నాకే బోధ పడడం లేదు. ఏ పని చెయ్యాలన్నా ఏమీ తోచడం లేదు.''

విద్య లేచింది: ''ఉషను కలుసుకుని చాల రోజులయింది. నాలుగయిదు రోజులనుంచి ఆమెను చూచి వద్దామని అనుకుంటున్నాను. నాతో రా నీవు కూడా. అక్కడనా్న కొంచెం మనస్సుకు హాయిగా ఉంటుందేమో!''

ఉష పేరు వినగానే నవల్ ఉలిక్కిపడ్డాడు. చాలా రోజులనుంచి ఆమెను పూర్తిగా మరిచిపొయ్యాడు. విద్య ఆ సంగతి ఎత్తేసరికి అతనికి ఉష గుర్తుకు వచ్చింది. అతని మనస్సు ఉషవైపు మరలింది. కాని ఈ ఆకర్ష ణతో పాటు అదోరకమైన శంక, ఒక రకమైన భయం కూడా ఏర్పడింది. ఈ శంకా భయాలను తప్పించుకోవడానికే బహుశా అతని మనస్సు ఉష పట్ల తటస్థంగా ఉంది. ఇప్పుడు మళ్ళీ ఆకర్షణతో పాటు ఆ శంక, భయం కూడా చెలరేగాయి.

భయం, శంక – వీటిని నిర్మూలించాలి. వీటితో పోరాడాలి. వీటి నుండి తప్పించుకొని తిరిగినందువల్ల ప్రయోజనం లేదు. నవల్ అన్నాడు:

"అలాగే వెళదాం విద్యా! కాని తొందరగా వెళ్ళాలి. పది నిమిషాల్లో తయారు కావాలి నువ్వు. ఆరు గంటలకు కాకున్నా, ఏడు గంటలకయినా అక్కడ నుంచి తిరిగి రావాలి. జ్ఞాన తాతయ్య సాయంత్రం ఇక్కడనే టీ తాగుతానని చెప్పారు. ఆయనతో మాట్లాడాల్సిన పని కూడా ఉంది."

విద్యతోపాటు నవల్ రాయ్‌బహాదుర్ కామతానాథ్ ఇంటికి వెళ్ళేసరికి నాలుగు గంటలయింది.

ఉష కాలేజీనుంచి అప్పుడే వచ్చి టీ తాగడానికి సిద్ధంగా ఉంది. నవల్, విద్య ఇద్దరితోపాటు ఆమె బయటి గదిలోనే కూర్చుని అక్కడికే టీ తెప్పించింది. విద్య అడిగింది: "ఏం ఉషారాణీ! చదువెలా సాగుతూ ఉంది?"

ఉష నవ్వింది: "బాగానే సాగుతూ ఉంది. ఏం చెప్పను! యూరపు వెళ్ళిరావడంతో ఒక సంవత్సరం నష్టమైపోయింది. నాతోటి వాళ్ళంతా బి.యే. ఫైనల్లోకి వచ్చేశారు. నాకే సిగ్గుగా ఉంది."

"ఇందులో సిగ్గుపడవలసిందేముంది. నీవేమన్నా ఫేలయ్యావుగనకనా! వచ్చే సంవత్సరానికల్లా బి.యే. అయి పోతావు" అన్నాడు నవల్.

"అవును. వచ్చే సంవత్సరానికి ఎటూ అవుతాను. కాని మనస్సులో ఎందుకో ఒక రకమైన ఉబలాటం ఎక్కువయింది. దేనికయినా కాచుకొని ఉండాలంటే చిరాకు వేస్తున్నది. మళ్ళీ మరోసారి ఈ చదువూ సంధ్యా ఇదంతా అనవసరంగా నెత్తిన పెట్టుకున్నానేమోననిపిస్తుంది. అసలు నాకు బి.యే. ప్యాసవాలసిన అవసరమేముంది? ఉద్యోగం చెయ్యబోవటం లేదు కదా!"

నవల్ సమాధానం చెప్పాడు: "ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేక పోయినా బి. యే. మాత్రం పూర్తిచెయ్యి. చదువుకోవడం కేవలం ఉద్యోగం కోసమే కాదుగదా! అదీకాక ప్రపంచంలో విలువలు చాలా త్వరత్వరగా మారిపోతున్నాయి. మన భావిజీవితం ఎలా ఉంటుందో మన మిప్పుడే చెప్పలేము."

ఉష చాలా ఉదాసీనంగా అన్నది: "అవును నవల్ బాబూ! భవిష్యత్తు ఎలా ఉంటుందో మనకు తెలియదు. తెలుసుకునేందుకు వీలు కూడా లేదు." ఆ సంగతి అంతటితో ముగించడానికి ఆమె విద్య వైపు తిరిగి అన్నది: "ఏం విద్యారాణీ! రోజులెలా గడుస్తున్నాయి?"

"చాలా హుషారుగానే గడుస్తున్నాయి. భోంచెయ్యడం, కొంచెం చదువుకోవడం, నిద్ర వచ్చినప్పుడు నిద్రపోవడం" అంటూ విద్య నవ్వింది: "కాని ఇలా నిశ్చింతగా ఇంక అట్టే ఎక్కువ రోజులు గడిచేలా కనిపించడంలేదు. ఈ జీవితంతో విసుగు వేస్తూ ఉంది. ఏదయినా పని చెయ్యాలని తోస్తున్నది."

"పని చెయ్యాలనుకుంటే లేకుండా పోతుందా?" అన్నది ఉష.

"పని అంటే జీవనోపాధికి కావలసిన పని. స్త్రీ విద్యా నికేతనంలో ఒక టీచరు పని దొరికింది. మార్చి పదిహేనునుండి అక్కడ పని చెయ్యబోతున్నాను."

ఉష నివ్వెర పోయింది: "అయితే నీవు ఉద్యోగం చేస్తావా? అందరూ ఏమంటారు? నీకు మాత్రం ఎలా ఉంటుంది?"

"నాకు మాత్రం బాగానే ఉంటుంది. నేను దీనికోసం ప్రయత్నించాను. నేను నాకాళ్ళమీద నిలబడగలిగినందుకు నాకు గర్వంగానే ఉంది. ఎవరి మీద ఆధారపడి ఉండవలసిన పనిలేదు. ఒకరి ఆశ్రయమక్కర్లేదు. ఇక ఎవరన్నా చూచి ఏమనుకుంటారో అనేదే ప్రశ్న. కాని దాన్ని గురించి విచారించడం అనవసరం. ఇతరులకు నా జీవితంతో ప్రమేయమేముంది? వాళ్ళు నాకు పెట్టేది లేదు. నేను వాండ్లకు పెట్టేది లేదు."

నవల్ విద్యను సమర్థించాడు: "మనల్ని గురించి విమర్శిస్తూ తిరగడానికి ఇతరులకు తీరిక మాత్రం ఎక్కడిది ఉషారాణీ! విద్య చేసే పనిని విమర్శించి ఆమెను హేళన చేసే వారందరూ పాతకాలం వాళ్ళు. ఆ పాత కాలం గతించి పోతున్నది. ఇక క్రొత్త ప్రపంచం వాళ్లెవరైనా సరే విద్య చేసే పని సరియైనదనే భావిస్తారు. ఆమెను గౌరవిస్తారు. స్త్రీకి కూడా స్వతంత్రమైన వ్యక్తిత్వముందని గమనిస్తారు."

నవల్ చెప్పిన మాటలు ఉషకు నచ్చలేదు. "మీరుచెప్పింది నిజమే నవల్ బాబూ! మీ యీ కొత్త ప్రపంచంలో స్త్రీకి కూడా స్వతంత్రమైన వ్యక్తిత్వముంది. గడప దాటి ఆడది బయట చాకిరి చేస్తుంది. మగవాండ్లతో సరిసమానంగా కూర్చుని పని చేస్తుంది, కుటుంబ గౌరవాన్ని మంటగలిపి బయట పచార్లు చేస్తుంది — ఈ నూతన ప్రపంచం మీకు నచ్చితే నచ్చవచ్చు. కాని ఈ నూతన ప్రపంచం తప్పు దారిలో నడుస్తున్నదని నా అభిప్రాయం. ఇది ఇలా ఎన్నాళ్ళో జరగదు. ఆడ – మగ, బలహీనుడు—

బలవంతుడు, ధనికుడు – దరిద్రుడు ఈ భేదం అనాదికాలంనుండీ వస్తూ న్నది, కలకాలం ఉంటుంది. ఏవో కొత్త విలువలని మీరంటూన్నారే, అవి నిజమైనవి కావు. ఇవన్నీ పిచ్చి కలలు. వీటి మీద నాకు నమ్మకం లేదు.''

నవల్ చాలా ఆశ్చర్యంగా ఉష వైపు చూచాడు. తాను ప్రేమించిన ఉషయేనా ఇలా మాట్లాడడం? తాను జీవన సహచరిగా చేసుకుని ధన్యత చెందవలెనని అనుకొన్న ఆ ఉషయేనా ఈమె? ఉష ఇలా ఎందుకు మాట్లాడుతూ ఉన్నది? ఆమె చదువుకున్న చదువంతా ఏమయిపోయింది? ఈ ఉష యూరపువెళ్ళి వచ్చింది. స్వతంత్ర దేశాల్లో తిరిగి వచ్చింది. మరి అక్కడికి వెళ్ళినందువల్ల ఈమె దృక్పథం మరింత సంకీర్ణమై పోయింది. తన దృక్పథాన్ని ఉష అర్థం చేసుకుంటుందేమోనని నవల్ మరోసారి ప్రయత్నించాడు: "ఉషా! నీవు యూరపు వెళ్ళి వచ్చావు. అక్కడ స్త్రీల కెంత స్వాతంత్ర్యం ఉందో చూచి ఉంటావు. మరి ఇప్పుడు నీవు మాట్లాడే వైఖరి చాలా ఆశ్చర్యంగా ఉంది.''

ఉష నవ్వింది. కాని ఆమె నవ్వులో వ్యంగ్యం ఉంది: "అవును, నేను యూరపు వెళ్ళి వచ్చాను. అక్కడ ఆడవాళ్ళను చూచి వచ్చాను. అక్కడ కొంతమంది ఆడవాళ్ళు పని చేస్తున్నమాట నిజమే కాని వాళ్ళు విధిలేక అలాచేస్తున్నారు. మనదేశంలో తక్కువజాతి స్త్రీలు చాకిరి చేస్తు న్నట్టే వాళ్ళు కూడా చేస్తున్నారు. కాని ఉద్యోగం చేయవలసిన అగత్యం లేనివాళ్ళు హాయిగా కాలం గడుపుతూనే ఉన్నారు. చేతి కష్టం లేకుండా ఖర్చుపెడుతున్నారు. వాళ్ళకెంత మందో నౌకర్లూ, చాకర్లూ ఉన్నారు, కార్లున్నాయి, పెద్ద పెద్ద బంగాళాలున్నాయి. సినిమాలకు, నాటకాలకు, రంగశాలలకు వాళ్ళు విచ్చలవిడిగా వెళ్ళుతారు. రత్నాలూ, వజ్రాలూ పొది గిన ఆభరణాలతో అలంకరించుకొని ఉంటారు. వాళ్ళు చాలా విలువగల దుస్తులు వేసుకొని ఉంటారు. అక్కడ స్వాతంత్ర్యమనీ, బానిసత్వమనీ వాళ్ళెవ్వరూ అనుకోరు. అక్కడ ఒకే ఒక భేదం ఉంది – ధనికులు, దరి ద్రులు.'' తర్వాత ఉష విద్యవైపు తిరిగి అన్నది: "ఏం విద్యారాణీ! నీవే చెప్పు. నీవు అత్తగారిల్లు వదిలిపెట్టి రాకపోతే నీవు ఉద్యోగం చేసేదానివా? మరో మార్గం లేకపోవడం వల్లనే నీవు ఉద్యోగం చేయవలసి వస్తున్నది.''

విద్య విషయంలో ఉష చెప్పిందంతా నిజమే. విద్యకు ఉష చెప్పింది నచ్చలేదు. కాని ఆమెతో వాదించడం ఇష్టం లేక విద్య మౌనంగా ఉంది.

కొంచెంసేపు విద్య ఏదైనా సమాధానం చెబుతుందేమోనని ఎదురు చూచిన తర్వాత ఉష మళ్ళీ అన్నది: "స్త్రీ స్వాతంత్ర్యమంటే ఎవరికైనా చాకిరి చేయడానికి, వీధుల్లో తిరగడానికి కాదు. స్త్రీ స్వాతంత్ర్యమంటే ఇంటిలో దిగ్బంధంగా కూర్చోకుండా బయటికి వెళ్ళి తన ఇష్టం వచ్చినట్లు తిరగడం, బుర్ఖా తీసేసి సభా సమావేశాల్లోకి వెళ్ళడం, నలుగురితో కలిసి మెలిసి తిరగడం. ఈ స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి సంపద అవసరం నవల్ బాబూ!"

అప్పుడే సీతానాథ్ ఎక్కడికో వెళ్ళడానికి బయలుదేరాడు. నవల్ని చూడగానే అతనన్నాడు: "అరే నీవా నవల్! చాల రోజులకు కనిపిస్తు న్నావ్? భలే! పై నుంచి క్రిందిదాకా ఖద్దరు వేసేశావే! పూర్తిగా కాంగ్రెసు వాడివయిపోయినావా యేం!"

నవల్ సమాధానం చెప్పాడు: "వేషానికి సంబంధించినంత వరకూ కాంగ్రెసు వాణ్ణే అయిపోయాను. కాని ఇంకా తీవ్ర రాజకీయాల్లో దిగలేదు. అలాంటి ఆలోచన కూడా ఏమీ లేదు."

"అది కూడా ఎప్పుడో అయిపోతుంది. దానిలో తప్పు కూడా ఏమీ లేదనే నా భావం." తర్వాత అతను ఉషతో అన్నాడు: "కర్నల్ గ్రాహం దగ్గరికి ఏదో అవసరమైన పనిమీద వెళ్ళుతూ నేను కారు తీసుకు వెళ్ళానని గౌరీ అన్నయ్యకు చెప్పు. నేను రావడం ఆలస్యమయితే ఆయన్ని టాంగా చేసు కోమని చెప్పు."

"చిన్నన్నయ్యా! నీవే టాంగా చేసుకుని వెళ్ళగూడదూ?" అన్నది ఉష.

"నేను చాలా చోట్లకు వెళ్ళాలి. టాంగాతో చాలా ఆలస్యమయి పోతుంది. అయితే నేను కర్నల్‌గార్ని కలుసుకొని అరున్నర గంటలకల్లా కారు పంపించేసేస్తాను. అక్కడినుంచి నేను టాంగా చేసుకుంటాను. ఆ తర్వాత అతను నవల్‌తో అన్నాడు: "వస్తావా నవల్, నేను చేథం లైన్సు వెళుతున్నాను. దారిలో మిమ్మల్నిద్దర్ని 'డ్రాప్' చేస్తాను."

విద్యకు మరి కొంతసేపు కూర్చోవాలని ఉంది. కాని నవల్ లేచి నిల బడ్డాడు. "వచ్చేస్తున్నాం సీతానాథ్! విద్యా, పద, ఇక ఇంటికి వెళ్ళుదాం. ట్యూటర్ తాతయ్య వచ్చే టైమయింది."

నవల్‌గారి ఇంటిదగ్గర విద్యను దించేసి సీతానాథ్ నవల్‌తో

అన్నాడు: "నవల్! నీవు నాతో కొంచెంసేపు అలా రాగూడదూ! నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి గూడాను."

"అలాగే, కాని నేను తొందరగా తిరిగి రావాలి." అన్నాడు నవల్.

చేథం లైన్సులో సీతానాథ్‌కు తన పని చూచుకోడానికి పది నిమిషాలు మాత్రమే పట్టింది. అక్కడినుండి ఇద్దరూ సివిల్ లైన్సుకు వచ్చేశారు. ఒక రెస్టరెంటుకు ఎదురుగా కారు దిగి డ్రైవరుతో చెప్పాడు: "ఇక కారు ఇంటికి తీసుకెళ్ళు."

రెస్టరెంటులో సీతానాథ్ టీ తెప్పించాడు. అప్పుడతను నవల్ని అడిగాడు: "ఏమోయ్ నవల్! రాజేంద్ర కిశోర్ను నీవు ఎప్పుడయినా కలుసుకున్నావా? అతన్ని గురించి నీ అభిప్రాయమేమిటి?"

నవల్ కొంచెంసేపు ఆలోచించి అన్నాడు: "అతనితో నాకు బాగా పరిచయం లేదు. రెండు సార్లు మాత్రమే కలుసుకున్నాను, అది కూడా మీ యింట్లోనే. చూడడానికి మంచి వాడిలాగానే కనిపిస్తాడు. అసలు విషయమేమిటి?"

"రాజేంద్ర కిశోర్‌కి వివాహమయిందనే సంగతి నీకు తెలుసా?"

"అందులో ఆశ్చర్యమేముంది? అతని వయస్సు కూడా చాలా ఎక్కువగానే కనిపిస్తుంది." అన్నాడు నవల్ చిరునవ్వుతో.

"లేదు, ఆశ్చర్యమేం లేదు. విదేశం వెళ్ళే ముందే అతనికి వివాహమయింది. కాని అసలు విషయవేమిటంటే ఉషను అతనికిచ్చి చేయాలని గౌరీ అన్నయ్య అభిప్రాయం. అతనే గౌరీ అన్నయ్యతో ఈ విషయం ప్రస్తావించి ఉంటాడని నాకనిపిస్తుంది."

నవల్‌కు ఆకాశం నుండి క్రింద పడ్డట్టు తోచింది: "రాజేంద్రకిశోర్ మరో వివాహం చేసుకోవాలనుకుంటున్నాడా? ఎందుకు?"

"ఎందుకంటే అతని భార్య అనాకారి, చదువూ సంధ్యాలేని పల్లెటూరి పిల్ల, ఎప్పుడూ ముసుగు వేసుకొని ఇంట్లో కూర్చుంటుంది, బీద కుటుంబానికి చెందింది. ఐ.సి.యస్. ఆఫీసరుకు అందంగా, నాగరికంగా ఉండే భార్య కావాలి."

ఇద్దరూ మాట్లాడకుండా టీ త్రాగుతున్నారు. కొంచెంసేపాగి నవల్ అన్నాడు: "దీనికి గౌరీనాథ్ చాలా సంతోషించి ఉంటారు. ఆయనకు అధికారం, పరువూ, ప్రతిష్ఠా అంటే ఎక్కడలేని వ్యామోహం." ఇప్పుడు

ఉషలో వచ్చిన మార్పును నవల్ క్రమంగా అర్థం చేసుకుంటున్నాడు: "సీతానాథ్, మీరు ఉషను రాజేంద్ర కిశోర్‌కు ఇచ్చి చెయ్యడానికి నాకే మాత్రం అభ్యంతరం లేదు. నేను ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఉషను పెండ్లి చేసుకోవాలని అనుకోవడం పొరపాటు."

"కాని ఉషను రాజేంద్ర కిశోర్‌కిచ్చి చెయ్యడం నాకేమాత్రం ఇష్టం లేదు. ఇంట్లో గౌరీ అన్నయ్యను సమర్థిస్తున్నది నాన్నాగారొక్కరే," అన్నాడు సీతానాథ్.

"అయితే మరి ఈ విషయంలో ఉష అభిప్రాయమేమిటి ?"

"అదే వచ్చిన చిక్కు. ఈ విషయంలో ఉష ఏమీ మాట్లాడడం లేదు. ఈ మౌనాన్ని అర్ధాంగీకారంగా కూడా భావించవచ్చు. ఇప్పుడు నేను కారు పంపించానే అది రాజేంద్ర కిశోర్‌ను స్టేషను నుండి తీసుకు రావడానికే పంపించాను. సాయంత్రం బండికి అతను వస్తున్నాడు. గౌరీ అన్నయ్య అతన్ని తీసుకురావడానికి స్టేషనుకు వెళుతున్నారు. బహుశా ఆయనతో ఉష కూడా వెళ్ళవచ్చు."

నవల్‌కు తన కండ్లు చీకట్లు కమ్మినట్లుతోచింది. అతను లేచి నిలబడ్డాడు: "సీతానాథ్, నా స్థితి నాకు బోధపడేటట్టు చేసినందుకు మీకు ధన్యవాదాలు."

సీతానాథ్ నవల్ చెయ్యి పట్టుకున్నాడు: "నవల్ ! నీవు నన్నపార్థం చేసుకుంటున్నావు. నీకు ఉష మీద అధికారం ఉంది. ఈ అధికారాన్ని నీవు వదులుకోకూడదు. నాకు రాజేంద్ర కిశోర్ నచ్చలేదు. ఒక భార్య ఉండగా మరో వివాహం చేసుకునే పెద్ద మనిషి ఎంత పెద్ద హోదాలో ఉన్నప్పటికీ అతడు పతితుడనే నా భావం."

నవల్ చాలా ఉదాసీనంగా సమాధానం చెప్పాడు: "ఎవరికీ ఎవరి మీదా అధికారం లేదు సీతానాథ్ ! నాకు ఉషమీద గాని, ఉషకు నా మీద గాని అధికారం ఏమీ లేదు. ఎవరికైనా సరే తన మీదనే తప్ప మరో వ్యక్తి పైన అధికారం ఉండదు."

సీతానాథ్ నిరాశ చెందాడు: "అలా వీల్లేదు. పరిస్థితి మనల్ని దాటి పోయిందనే అనిపిస్తున్నది. ఇదంతా గౌరీ అన్నయ్య చేసిన చమత్కారం. ఆయనకు అధికారం, పరువు, ప్రతిష్ఠ అంటే అదో వ్యామోహం. ఇతరులు కష్టపడి, నానావస్థలతో సంపాదిస్తే తాను హాయిగా కూర్చుని అనుభవిస్తా

నంటాడు. ఇదే ఆయన దృక్పథం. నాకు నీవు తోడ్పడడానికి అనుకు న్నాను. కాని నీవెప్పుడూ ఆదర్శవాదివిగా ఉంటావే గాని యథార్థవాదం లోని కుత్సితాన్ని దగ్గరకు చేరనియ్యవు. నేను మాత్రం ఈ విషయంలో నాన్నగారితో మాట్లాడి తీరుతాను.''

నవల్ సివిల్ లైన్సు నుండి ఇంటికి చేరాడు. జ్ఞానప్రకాశ్ కాంగ్రెస్ కమిటీనుండి తిరిగి వచ్చారు. డ్రాయింగ్ రూములో సోఫామీద తీరికగా పండు కొని ఉన్నారు. జ్వాలా ప్రసాద్, విద్య కుర్చీలల్లో కూర్చుని ఉన్నారు. రుక్మిణి వాకిట్లో నిలబడి ఉంది. జ్వాలా ప్రసాద్ అంటున్నారు: ''మీకెలా తోస్తే అలా చెయ్యండి. ఎనభై రూపాయలంటే తీసి వేయవలసింది కాదని నా అభిప్రాయం. కాని ఒక టాంగా మాత్రం కొనే ఏర్పాటు చెయ్యాలి. లేకుంటే వెళ్ళడం, రావడం విద్యకు ఇబ్బందిగా ఉంటుంది.''

''టాంగా ఎందుకు కొనడం తాతయ్యా! నవల్ అన్నయ్య నెలకు పది రూపాయల్లో ఒక టాంగా అద్దెకు మాట్లాడుతాడు. ఉదయం స్కూలుకు తీసుకు వెళతాడు. మళ్ళీ సాయంత్రం నన్నక్కడి నుంచి తీసుకు వస్తాడు. ఏమంటారు జ్ఞాన్ తాతయ్యా?''

''అంతే, అదే మంచి పని. కొన్నాళ్ళ నుంచీ కొత్త కారు కొనాలని అను కుంటున్నాను. పాతది అమ్ముడు పోయింది కూడాను. కాని నా సంగతి చెప్పడానికి వీల్లేదు. మళ్ళీ ఆందోళన మొదలవుతూ ఉంది. జైళ్ళకు వెళ్ళే వాళ్ళల్లో మొదటి వాణ్ణి నేనే!''

అప్పుడే నవల్ గదిలోకి ప్రవేశించాడు. అతని ముఖం విలవిలపోతూ ఉన్నది. అతన్ని చూడగానే విద్య అడిగింది: ''ఏమిటన్నయ్యా! ఏమయింది? ఒంట్లో కులాసాగా ఉందా?''

నవల్ కుర్చీమీద కూర్చుని కండ్లు మూసుకున్నాడు: ''ఒంట్లో కులాసా గానే ఉంది కాని ఒక గ్లాసు మంచినీళ్ళు తీసుకురా విద్యా!'' అన్నాడు.

మంచి నీళ్ళు తాగిన తర్వాత నవల్ కుదుట పడ్డాడు: జ్ఞానప్రకాశ్ అడిగారు: ''ఏమిటయింది నవల్?''

పొడి చిరునవ్వుతో నవల్ సమాధానం చెప్పాడు: ''ఏం లేదు తాతయ్యా ఇప్పుడే ఒక పీడకల వచ్చింది. దానితో మనస్సు కొంచెం చలించింది. కాని ఆ కల వచ్చింది, పోయింది. ఇప్పుడు నేను కులాసాగానే ఉన్నాను.''

"పగటిపూట మేల్కొని ఉన్నప్పుడు కలలేమిటిరా బాబూ?" అని అడిగారు జ్వాలా ప్రసాద్.

"ఏం లేదు తాతయ్యా! ఊరికే తమాషాగా అన్నాను." అంటూ నవల్ ప్రసంగం మార్చాడు. "అయితే జ్ఞాన్ తాతయ్యా! మహాత్మా గాంధీ ఉత్తరం వ్రాసిన తర్వాత పరిస్థితి ఎలా ఉంది?" అని అడిగాడు నవల్ జ్ఞాన ప్రకాశ్ వైపు తిరిగి.

"పరిస్థితి అంత స్పష్టంగా లేదు. కాని మహాత్ముడు వ్రాసిన ఆ ఉత్తరం వల్ల ఏమీ ప్రయోజనం లేదని మాత్రం స్పష్టంగా తెలుస్తున్నది. సత్యాగ్రహం తప్పదు. సబర్మతీ ఆశ్రమంలో కొంతమంది సత్యాగ్రహం చేయడానికి పూనుకున్నారు. మార్చి పన్నెండో తేది మహాత్మునితో పాటు వాళ్ళంతా దండీలో ఉప్పు సత్యాగ్రహం చెయ్యడానికి బయలుద్దేరుతారు. సబర్మతినుంచి రెండువందల మైళ్ళుంటుంది దండి. సత్యాగ్రహం చేసే వాళ్ళంతా కాలి నడకమీద అక్కడికి వెళ్ళుతారు."

నవల్‌లో ఇమిడిఉన్న విషాదం ఆ పాటికి పూర్తిగా అంతరించిపోయింది. "మీరు కూడా గాంధితో పాటు సత్యాగ్రహం చేయాలని అనుకుంటున్నారు గదా!" అని అడిగాడు.

"అవును. నేనాయనకు ఉత్తరం వ్రాశాను. కాని ఆయన దానికి ఒప్పుకోలేదు. బహుశా ఏప్రిల్ అయిదో తేదీ ఆయన చట్టవిరుద్ధంగా ఉప్పు తయారు చేస్తారు. అదే రోజున దేశమంతటా అలాగే ఉప్పు తయారు చేసి చట్టాన్ని ఉల్లంఘించడం జరుగుతుంది. మేమందరం మా స్థలాల్లోనే ఉండి సత్యాగ్రహం చేయాలని ఆయన ఆదేశం."

కొంచెంసేపు ఎవ్వరూ మాట్లాడ లేదు. తర్వాత జ్వాలా ప్రసాద్ అడిగారు: "అయితే నీవు కూడా సత్యాగ్రహం చేస్తావా జ్ఞానూ."

"అవును బావా! మొట్టమొదటి రోజే అలహాబాదులో చట్ట విరుద్ధంగా ఉప్పు తయారు చేయవలసిన వాళ్లల్లో నా పేరు ఉంది. ఇదే సమరానికి నాంది."

"ఆ తర్వాత?" అడిగారు జ్వాలా ప్రసాద్. జ్ఞానప్రకాశ్ నవ్వారు: "ఆ తర్వాత జన సామాన్యమంతా ఇలాగే ఉప్పు తయారుచేసి చట్టాన్ని అతిక్రమిస్తారు. అన్యాయాన్ని వ్యతిరేకించడం మనధర్మం. కాని ఈ కార్య

క్రమమంతా హింసారహితంగా సాగుతుంది. కొత్తరకమైన యుద్ధం కొన సాగిస్తున్నాం మేము.''

భోజనాలు అయిన తర్వాత విద్య నవల్ని అడిగింది: ''అన్నయ్యా! సీతానాథ్‌కూ నీకూ జరిగిన సంభాషణ ఏమిటో నిజంగా చెప్పు. ఎందుకంత ఖిన్నుడివయి పోయావు?''

నవల్ చాలా దీనంగా అన్నాడు: ''మరో నైరాశ్యం ఏర్పడింది. మరో దెబ్బ తగిలింది. ఉష నాకు దూరమైపోయింది.''

''అన్నయ్యా! అలా అనడం తప్పు. నిజం చెప్పాలంటే నీవే ఉషకు దూరమై పోయావు. ఇది నీకు విజయమేకాని పరాజయం కాదు.''

నవల్ పిచ్చివాడివలె నవ్వాడు: ''విజయం! పరాజయం! వీటి అర్థ మేమిటో ఎవరికి తెలుస్తుంది విద్యా! నేను మాత్రం నానాటికి ఏదో పోగొట్టు కుంటున్నట్టూ, క్రమంగా చెదరి పోతున్నట్టూ అనిపిస్తున్నది నాకు.''

విద్య చాల నిలకడగా నవల్ని చూస్తూ అన్నది: ''అన్నయ్యా! నీవు చెదిరిపోయి మళ్ళీ కుదురుకుంటున్నావు. పాతది పోగొట్టుకొని కొత్తది సమ కూర్చు కుంటున్నావు. అలాంటప్పుడు అధైర్యం, అవిశ్వాసం ఎందు కన్నయ్యా! ధైర్యం తెచ్చుకో, నిన్ను నీవు అర్థం చేసుకో!''

నవల్ తన చెల్లెల్ని చాలా ఆశ్చర్యంతో చూచాడు. విద్య చెయ్యి పట్టు కొని తన దుఃఖాన్ని వెలిబుచ్చాడు: ''నిజం చెప్పావు విద్యా! చెదిరి పోయింది అసత్తు. కాని సత్పదార్థం ఏమిటో వెదకి కనుక్కోవాలి.''

ఎనిమిది

''ప్రపంచం ఎందాకా వచ్చింది? ఇక ముందు ఎక్కడికి వెళ్ళుతుంది?'' జ్వాలా ప్రసాద్ తన్ను తానే ప్రశ్నించుకుంటున్నారు. ఆయన కండ్లు కొద్దిగా చెమర్చాయి. ఆయన కంఠం కంపిస్తూ ఉంది. ఎదురుగా రుక్మి తల వంచుకుని కూర్చున్నది. జ్వాలా ప్రసాద్ రుక్మిణితో అన్నారు: ''వాడు

నా మాట వినడు. నాకేం తెలియదనీ, నేనమాయకుణ్ణనీ అనుకుంటాడు వాడు. వాడి సంగతి నాకేమీ అర్థం కావడం లేదు. నా తెలివి తేటలు నశించి పోయినయ్యో లేకుంటే వాడికి తెలివి తేటలు ఎక్కువయినయ్యో తెలియదు."

"పరీక్షలన్నా వ్రాస్తాడా నవల్ ?" అన్నది రుక్మిణి: "మీరు కొంచెం భయం పెట్టండి వాడికి, తెలిసీ తెలియంది చెప్పండి."

జ్వాలా ప్రసాద్ నిరుత్సాహంగా అన్నారు: "భయం పెట్టేదే తెలిసి తెలియనిది చెప్పేదీ ఎవరికమ్మా! ఏదన్నా చెడపని చేస్తే భయపెట్టవచ్చు. వాడేమీ తప్పుపని చేయడం లేదుకదా! ఇక ఈ రోజుల్లో తెలిసిన వాళ్ళెవరో, తెలియని వాళ్ళెవరో తెలుసుకోవడం అసంభవం. నీవే ఆలోచించు. ఇంతకు ముందు జైలుకు వెళ్ళడమంటే అందరికీ ఎంతో భయంగా ఉండేది. మరి ఇప్పుడు జైలును కృష్ణ జన్మ స్థానంగా భావించి గొప్ప గొప్ప వాళ్ళు కూడా జైలుకు వెళుతున్నారు. ఇక నా వల్ల కాదమ్మా! వాడికి చెప్పి చెప్పి నాకు విసుగు పుట్టింది."

రుక్మిణి కన్నీరు తుడుచుకుంటూ అన్నది: "మామయ్యా! ఇదంతా ఇలా ఎందుకు జరుగుతూ ఉంది. ఏదయినా ఉపాయం చూడాలి మీరు."

జ్వాలా ప్రసాద్ రుక్మిణికి ఏమీ సమాధానం చెప్పలేదు. ఆయన సమాధానం చెప్పే స్థితిలో కూడా లేరు. ఇదంతా ఇలా ఎందుకు జరుగుతూ ఉంది అనేది క్రొత్తగా బయలుదేరిన ప్రశ్నకాదు. ఆయన జీవితంలో ఆరంభంనుంచి ఇప్పటివరకూ ఇదే ప్రశ్న ఏన్నోసార్లు వచ్చింది. కాని దానికి సమాధానం మాత్రం ఆయనకు ఎప్పుడూ దొరకలేదు. ఎవరిచేతిలో ఏమీలేదు. దేనికీ ఎవరూ ఏమీ చేయగలిగింది లేదు. అన్నీ జరుగవలసి నట్టు జరిగిపోతూ ఉంటాయి.

రుక్మిణి మాట్లాడకుండా నిలబడి ఉంది. జ్వాలా ప్రసాద్ ఏదన్నా సమాధానం చెప్తారేమోనని ఆమె ఎదురు చూస్తూన్నది - నిస్పృహగా. నిస్సహాయురాలైన ఆ ఇల్లాలికి ఏం చెయ్యాలో తోచడంలేదు. తనవన్నీ తనవి కాకుండా పోతున్నాయి. ఎవరూ ఆమెకు దారిచూపే వాళ్ళు కనిపించడంలేదు. ఆమె మళ్ళీ బిగ్గరగా దీనంగా అన్నది: "మామయ్య గారూ వాణ్ణి ఎలాగైనా సరే జైలుకు వెళ్ళకుండా చూడండి. అక్కడ వెట్టి చాకిరి చెయ్యాలి మనవాడు."

జ్వాలా ప్రసాద్ నిరుత్సాహంగా అన్నారు: "అమ్మాయీ! వెట్టి చాకిరి

చేయడం నాకంత విచారకరంగాలేదు. కాని. . . . కాని. . . . జైలుకు వెళ్ళడమనేది . . . . నాకేదో విచిత్రంగా తోస్తున్నది. దీనికంతా కారకుడు జ్ఞానూ.'' జ్వాలా ప్రసాద్ కంఠంలో కొంచెం కర్కశత్వం కనిపించింది: ''తాను తప్పుదారి బట్టి తన జీవితం చెడగొట్టుకున్నది కాక ఇప్పుడు మన అబ్బాయికి కూడా దుర్బుద్ధులు నేర్పుతున్నాడు.''

'' అలా అనకండి మామగారూ! మనుష్యమాత్రుడు చేయగలిగిందేమీ లేదు. ఇంతకూ భగవంతుడు మనమీద పగపట్టాడు. మనల్ని నాశనం చేసి తీరేటట్టున్నాడు.'' అంటూ రుక్మిణి కన్నీరు తుడుచుకుంటూ అక్కడినుండి వెళ్ళిపోయింద.

నవల్ డ్రాయింగ్ రూములో జ్ఞానప్రకాశ్‌తో మాట్లాడుతూ కూర్చున్నాడు. విద్య కూడా అక్కడనే కూర్చుని ఉంది. జ్ఞానప్రకాశ్ అంటున్నారు: ''నవల్! మొదటి వరుసలో నా పేరుంది. రెండో వరుసలో నీ పేరు వ్రాయించాను.''

''అలా కాదు తాతయ్యా! మొదటి వరుసలోనే నేను వెళతాను. మీరు కనీసం ఒక వారం దాకా జైలుకు వెళ్ళడానికి వీల్లేదు. ఈ ఉద్యమానికి తగిన ఏర్పాట్లు చేయాలి కదా! ఏం విద్యా! నీవేమంటావ్?'' అన్నాడు నవల్ చిరునవ్వుతో.

విద్య నవల్ చెప్పినమాటనే సమర్థించింది: ''అవును తాతయ్యా! మొదటి వరుసలో అన్నయ్య వెళ్ళడమే బాగుంటుంది.''

జ్ఞానప్రకాశ్‌కు నవ్వు వచ్చింది: ''మరి నీవో విద్యా! నీవు మాత్రం ఉప్పు తయారు చేయవూ?''

''వద్దు తాతయ్యా! నేను వీటన్నిటికీ దూరంగానే ఉంటాను. జైలుకు వెళ్ళడం, పోరాడడం ఇవన్నీ మగవాండ్లకు సరిపోతాయి.'' అని విద్య కొంచెంసేపు ఆగి మళ్ళీ అన్నది: ''ఎవరు చూచారు! అవసరమయితే నేను కూడా రంగంలోకి దిగవలసి వస్తుందేమో!''

''లేదు విద్యా! నీవు రంగంలోకి దిగవలసిన అవసరముండదు. నేనూరకే ఎగతాళికి అలా అన్నాను.''

అప్పుడే జ్వాలా ప్రసాద్ డ్రాయింగ్ రూములోకి ప్రవేశించారు. ఆయన ముఖం చాలా గంభీరంగా ఉంది. ఆయన రాగానే అందరూ సంభాషణ చాలించారు. కొంచెంసేపు జ్వాలా ప్రసాద్ అక్కడ కూర్చున్న ముగ్గుర్నీ

తదేక దృష్టితో చూచారు. తర్వాత ఆయన నవల్‌తో అన్నారు: "నవల్! ఎల్లుండి ఉప్పు సత్యాగ్రహం చేసేవాళ్ళ జాబితాలో నీపేరు కూడా ఉందని విన్నాను. అయితే మరి నీవు చదువూ సంధ్యా మానేసి జైలుకు వెళ్ళడానికి నిశ్చయించుకున్నావా?"

"అవును తాతయ్యా! నేను చాలా రోజుల నుంచి ఆలోచిస్తూ వచ్చాను. నా జీవిత విధానాన్ని గురించి. ఈ ప్లీడరు పని నాకు లాభం లేదని తోస్తున్నది. అబద్ధాలాడడం, ముఖస్తుతి చేయడం, ఇతరులను మోసగించడం – ఇవన్నీ ప్లీడరు పనికి కావలసిన లక్షణాలు. మరి ఇవన్నీ నాకు లేవు, కాబట్టి ప్లీడరు పనికి నేను దూరంగా ఉండడమే మంచిది. ప్లీడరు పని చేయదలచుకోనప్పుడు పరీక్షవల్ల మాత్రం లాభమేముంది?"

"అయితే ఈ రెండు సంవత్సరాలూ లాభించలేదన్నమాట." అన్నారు జ్వాలా ప్రసాద్.

"అలా కాదు తాతయ్యా! ఈ రెండు సంవత్సరాల్లో నేనెన్నో విషయాలు గమనించాను, ఎన్ని సంగతులో నేర్చుకొన్నాను. ఎన్నింటినో తెలుసుకున్నాను. ఎంతమంది యువకులు చదువుకుని కూడా ఉద్యోగం లేక తిరుగుతున్నారో, మీరు చూస్తూన్నారు గదా! వాళ్ళంతా మనసుల్లో చాలా బాధపడుతున్నారు. కాని వాళ్ళకు కడుపునిండా తిండి కూడా దొరకడం లేదు. వేలకొలది నవయువకులు బి.యే., యం.ఏ., ప్యాసయి ఉద్యోగాలకోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. వాళ్ళకు ఉద్యోగాలు లేవు. నేను కనీసం ఈ నైరాశ్యానికీ, విచారానికీ, బాధలకూ దూరంగా ఉన్నాను. ఏం జ్ఞాన్ తాతయ్యా! నేను చెప్పేదాంట్లో తప్పేమీ లేదుగదా!"

జ్వాలా ప్రసాద్ కొంచెం విసుక్కుంటూ అన్నారు: "జ్ఞానూ ఎటూ నీకు వంత పాడుతాడు. నీవు కూడా అతని శిష్యబృందంలో చేరావు. అతనికేం తెలుసు! జీవితంలో ఏమీ అనుభవించలేదు. కనీసం పెళ్ళి అయినా చేసుకోలేదు."

జ్ఞానప్రకాశ్ తిరుగు సమాధానం చెప్పారు: "బావా! పెండ్లి చేసుకున్న వాళ్ళు బాగుపడింది మాత్రమేముంది? చీకూ, చింతా, భయం, సందేహం- ఇవన్నా తప్పిపోయాయి. ఇక శిష్యరికం అంటావా! ఎవరూ ఎవరికీ శిష్యరికం చేసేది లేదు. ఎవరి అంతరాత్మ ఎలా ప్రేరేపిస్తే వాళ్ళు అలా చేస్తారు."

"అవును తాతయ్యా! జ్ఞాన్ తాతయ్య చెప్పింది నిజమే. భగవద్గీతలో కూడా అలాగే వ్రాసి ఉంది" అన్నది విద్య.

ప్రపంచమంతా తనకు వ్యతిరేకంగా ఏదో కుట్ర పన్నిందని అనిపించింది జ్వాలా ప్రసాద్‌కు. ఆయన మాట విని అర్థం చేసుకునే వాళ్ళు ఎవరూ కనిపించలేదు. ఆయన గదినుండి బయటకు వెళ్ళి వరండాలో కూర్చు న్నారు. ఆయన అక్కడ నీరసంగా నైరాశ్యంతో కూర్చుని పోయారు. ఇంకా కొద్దిగా ఎండ కాస్తూనే ఉంది. ఈ లోగా భీఖా పళ్ళెంలో టీ తీసు కుని డ్రాయింగ్ రూములోకి వచ్చాడు. అక్కడి నుంచే అతనన్నాడు: "బాబూ! టీ తాగి వెళ్ళండి. టీ నేనక్కడికే తీసుకు వస్తాను. గదిలోకి రావలసిన పనిలేదు."

జ్వాలా ప్రసాద్ భీఖా కేమీ సమాధానం చెప్పలేదు. రెండు చేతులతో తలపట్టుకొని దిగులుపడుతూ కూర్చున్నారు. చివరికిదంతా ఎలా పరిణమి స్తుందో ఆయనకు తోచడంలేదు. తన చుట్టూ ఉన్న వాతావరణం ఆయన కేదో క్రొత్తగా ఉన్నట్లు తోస్తున్నది. గడచిన గడియలు, మరచిన మమతలు ఒకదాని వెనుక ఒకటి ఆయన స్మృతి పటలంలో మరల గోచరిస్తూ ఉన్నాయి. అవన్నీ మసక మసకగా కనిపించీ కనిపించనట్టు ఉన్నాయి. శివలాల్, గంగాప్రసాద్, యమున - వీళ్ళందరూ వెళ్ళిపోయారు. అసలొకానొకప్పుడు వాళ్ళు ఉండేవారని కూడా అనిపించడం లేదు. ఏదో ఒక రోజు ఆయన కూడా రాలి పోతారు - అలాగే విస్మృత రేఖల్లో కలిసి పోతారు. మరి ప్రపంచంలో మన అస్థిత్వం ఒట్టి మోసమా? అంతా భ్రాంతేనా?

జ్వాలా ప్రసాద్ ఆలోచనల స్రవంతి ఆగిపోయింది. భీఖా ఆయన ముందు టీ తెచ్చి పెట్టాడు. "ఇదిగో బాబూ! టీ తీసుకోండి. ఏమిటో ఆలో చిస్తున్నారే?" భీఖా జ్వాలా ప్రసాద్ చేతికి టీ అందించాడు. ఆ తర్వాత అతను అక్కడనే నేలమీద కూర్చున్నాడు.

జ్వాలా ప్రసాద్ భీఖాను చూచారు. భీఖా గాజు గ్లాసులో టీ పోసుకుని తాగుతున్నాడు. అతను మౌనంగా లాన్ వైపు చూస్తూ ఏదో ఆలోచిస్తు న్నాడు. ఆ సమయంలో తనకు అత్యంత సన్నిహితుడూ ఆత్మీయుడూ భీఖా అని తోచింది జ్వాలా ప్రసాద్‌కి. ఆయన భీఖాతో అన్నారు: "భీఖా!

విన్నావా నీ పీ సంగతి? ఎల్లుండి నవల్ ఉప్పు తయారుచేయడానికి వెళు తున్నాడు!''

"అవును బాబూ! విన్నాను. ఇంత పెద్ద చదువు చదివి మన చిన్న బాబు ఉప్పు తయారు చేయడానికి ఎందుకు వెళుతున్నారో నాకు అర్థం కాలేదు. బాబూ! ఉప్పరి వాండ్లు కదు బాబూ ఉప్పు తయారు చేసేది. సీమ ఉప్పు వచ్చిన తరవాత ఆ పని కూడా లేకుండా పోయింది. పని వాళ్ళంతా తిండిలేక అల్లాడుతూ ఉన్నారు. అయితే నవల్ బాబు లాయరు పని మానేసి ఉప్పు తయారు చేయడానికి వెళ్ళుతుంటే వద్దని చెప్పగూడదా బాబూ!''

"నీ కర్థంకాలేదు భీఖా! వాడు ఉప్పు తయారుచేసే పనిలో చేరడం లేదు. చట్టానికి వ్యతిరేకంగా ఉప్పు తయారుచేసి జైలుకు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు.'' అన్నారు జ్వాలా ప్రసాద్.

భీఖా ఆశ్చర్యపడుతూ అడిగాడు: "అయితే నవల్ బాబు జైలుకు వెళ్ళ డానికి చిన్నబాబుకు పిచ్చిపట్టిందా బాబూ! మీరంతా వద్దని చెప్పలేదూ!''

"ఏం చెప్పను భీఖా! వాడు నా మాట వింటేగా! జ్ఞానూ కూడా జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు.''

భీఖా నిరుత్సాహంగా అన్నాడు: "అయితే ఆయనకు కూడా మతి పోయిందన్నమాట! ఇప్పుడేం చెయ్యాలి మరి? పాడు దైవం మా గంగా బాబును తీసుకు వెళ్ళాడు. లేకుంటే నవల్ బాబును జైలుకు వెళ్ళనిస్తారా ఆయన?'' ఈ మాటలు అంటూనే భీఖా కంట తడి పెట్టాడు.

గంగాప్రసాద్ సంగతి వచ్చినప్పుడల్లా భీఖా కంట తడి పెట్టడం అలవాటు. జ్వాలా ప్రసాద్ అన్నారు: "ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు భీఖా! ప్రపంచంలో ఎవరూ ఎవరినీ ఆపలేరు.'' అంటూ జ్వాలా ప్రసాద్ తనలో తాను పడుతున్న మథనకు విసుగు పుట్టినట్టు అక్కడి నుంచి లేచారు.

భీఖా కూడా లేచి నిరుత్సాహంగా అన్నాడు: "అవును బాబూ! మీరు చెప్పింది నిజం. మన అబ్బాయిగారు పోతూ ఉంటే మనం ఆపగలిగామా? మరి ఇంకెవరిని మాత్రం ఎలా ఆపగలం?'' చాలా విచార పడుతూ భీఖా ఇంట్లోకి వెళ్ళిపోయినాడు.

జ్వాలా ప్రసాద్ కూడా విచారపడుతూ ఊరికే అలా వెళ్ళి వద్దామని బయటికి వెళ్ళారు. ఆయన మనస్సు చాలా ఖిన్నంగా ఉంది. మనస్సుతో

పాటు కాళ్ళుకూడా తేలిపోతున్నాయి. ఆ రోజు ఆయన త్రివేణి వైపు వెళ్ళకుండా కత్రావైపు వెళ్ళారు. ఆనంద భవన్ ఎదురుగా వేలకొలది జనం గుమికూడారు. 'భారత్ మాతాకీ జయ్', 'మహాత్మా గాంధీకీ జయ్', 'మోతీలాల్ నెహ్రూకీ జయ్', 'జవహర్‌లాల్‌కీ జయ్', అని అందరూ కేకలు పెడుతున్నారు. ఆ రోజు వార్తా పత్రికల్లో గాంధీ తన సత్యాగ్రహ సహచరులతోపాటు దండిని సమీపించారని వార్త ప్రకటింపబడింది. వాళ్ళందరూ మరునాడుకాక మూడోరోజు ఉప్పు సత్యాగ్రహం చేస్తారు. ఆరోజే దేశమంతటా ఉప్పు సత్యాగ్రహానికి ప్రారంభోత్సవం జరుగుతుంది.

ఈ సత్యాగ్రహం అలహాబాదులో కూడా ఆ రోజే ఆరంభమవుతుంది. నవల్ మొదటి రోజే సత్యాగ్రహంలో పాల్గొంటున్నాడు. మొదటి రోజు సత్యాగ్రహం చేసే వాళ్ళందర్నీ అరెస్టు చేస్తారు. రెండో రోజు కూడా అరెస్టు చేస్తారు, మూడో రోజు కూడా చేస్తారు. ఇలా కొన్నాళ్ళవరకు ఈ ఉద్యమం సాగుతుంది. ఈ ఉద్యమం కూడా 1920–21 నాటి ఉద్యమంలాగానే తేలిపోతుందా? ఆ ఉద్యమం ఎంత సులభంగా అణిగి పోయింది? అలాగే దీన్ని కూడా అణచి వేస్తారు. బ్రిటిష్ ప్రభుత్వం చాలా ధైర్యంగా ఉంది. అధికార్లల్లో ఏమాత్రం ఆవేశం కానీ ఉద్రేకం కానీ కనిపించడం లేదు.

సత్యాగ్రహాన్ని చూడడానికి ఎంతో దూరం నుంచి పల్లెటూళ్ళ నుంచి వచ్చిన గ్రామస్థులను జ్వాలా ప్రసాద్ చూశారు. ఆ గ్రామస్థులే ఈ జయ జయ ధ్వనులు చేస్తున్నారు. ఆ గ్రామస్తుల్లో కేవలం కుతూహలమేకాదు, ఉత్సాహంతో, ఉద్రేకంతో కార్యరంగంలో దిగి పని చేయగల సామర్థ్యం కూడా ఉంది.

ఉన్నట్టుండి జ్వాలా ప్రసాద్ ఆలోచన మారింది. స్వాతంత్ర్య కాంక్ష ఇప్పుడు భారతదేశంలోని లక్షల కొలది గ్రామాల్లోకి ప్రవేశించిందని ఆయనకర్థమయింది. లక్షల కొలది, కోట్ల కొలది గ్రామస్థులు ఈ ఉద్యమంలో పాల్గొంటారు. ఈ ఉద్యమంలో వాళ్ళ సహకారం కేవలం భావనాత్మకమే కావచ్చు, అప్పుడు ఈ ఉద్యమాన్ని అణచి వేయడం సులభంకాదు. ఈ ఉద్యమాన్ని అణచి వేయడానికి బహుశా సైన్య సహాయం అవసరమవుతుంది. సైనికులు, తుపాకులు, మిషన్ గన్లు – వీటన్నిటినీ ఈ ఉద్యమం ఎదుర్కొనగలుగుతుందా?

జ్వాలా ప్రసాద్ ఇక ముందుకు వెళ్ళలేక పోయారు. ఆయన ఇంటివైపు తిరిగారు. ఇంటికి వెళ్ళి చూచేసరికి జ్ఞానప్రకాశ్ గదిలో కూర్చుని ఏదో వ్రాసుకుంటూ ఉన్నారు. కాని నవల్ ఎక్కడా కనిపించలేదు. "నవల్ ఎక్కడికి వెళ్ళాడమ్మా?" అని అడిగారాయన విద్యను.

"ఇప్పుడే అలా వెళ్ళాడు, రాయ్‌బహాదూర్ గారింటికి వెళ్ళుతానని చెప్పాడు. బహుశా అక్కడికే వెళ్ళి ఉంటాడు."

జ్వాలా ప్రసాద్‌లోని అంధకారాన్ని చీల్చుకుని ఒక ఆశాకిరణం వెలువడింది. నవల్ని ఈ ఉద్యమంలో ప్రవేశించకుండా చేయగలిగిన వాళ్ళెవరైనా ఉంటే అది అతని మమకారం, ఉషపై అతనికి గల మమకారం. ఈ మమకారం నవల్ని వెనుకకు లాగవచ్చు.

ఎల్లుండి ఉదయం దాకా నవల్ స్వతంత్రుడు. ఆ తర్వాత అతను పోరాటంలోకి దిగుతాడు. ఈ పోరాటం ఎలా పరిణమిస్తుందో అతనికి కొంచెం బోధపడుతూ ఉంది, కాని అప్పుడే పూర్తిగా బోధపడడం లేదు. ఈ పోరాటంలో దిగేముందు ఒకసారి అతను ఉషతో కలుసుకుని మాట్లాడాలను కున్నాడు. ఉష తనకు దూరమై పోతున్నదని తెలిసి కూడా అతను ఉష దగ్గరికి వెళ్ళాడు.

ఉష ఇంట్లో వాతావరణం కొంచెం గంభీరంగా ఉంది. గౌరీనాథ్ సీతానాథ్ మాటకు మాట తర్కించుకున్నట్టున్నారు. ఆ పరిస్థితిలో రాయ్ బహాదుర్ కామతానాథ్ లోలోపల మథన పడుతున్నారు. కొంచెంసేపు ఆయన గౌరీనాథ్‌ను సమర్థిస్తున్నారు, మరి కొంచెంసేపు సీతానాథ్‌ను సమర్థిస్తున్నారు. కాని ఉష తన పెద్దన్నయ్య వైపే మొగ్గడం గమనించి ఆయన కూడా గౌరీనాథ్‌నే ఎక్కువగా సమర్థిస్తున్నారు.

నవల్ రాయ్‌బహాదుర్‌గారి ఇంటికి వెళ్ళేసరికి రాయ్‌బహాదుర్ కామతానాథ్ తన గదిలో మౌనంగా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నారు. ఆ రోజు మధ్యాహ్నమే ఆయన కొడుకులిద్దరు మాటకు మాట పెంచుకుని తీవ్రంగా తర్కించుకున్నారు. నవల్ని చూడగానే రాయ్‌బహాదుర్ అన్నారు: "రావోయ్ నవల్! చాలా రోజులకు కనిపిస్తున్నావ్! చదువు సక్రమంగా సాగుతున్నదా?"

"బాగానే సాగుతూ ఉంది."

"యల్.యల్.బి. పరీక్ష అయ్యాక మున్సబ్ పరీక్ష కూడా పూర్తిచేసే

శేయి.'' అన్నారు రాయ్‌బహాదుర్. ''హైకోర్టు ఛీఫ్ జస్టిస్ నాకు బాగా తెలుసు. నేను చెప్తే ఆయన నిన్ను తప్పకుండా తీసుకుంటారు.''

''అవునండి, మీరు చెప్తే ఏ పనయినా అయిపోతుంది. కాని మున్సిఫ్ పరీక్షకు కూర్చోవాలని నాకేమీ అభిప్రాయం లేదు.''

రాయ్‌బహాదుర్ కొంచెం చిరాకుగా అన్నారు: ''నీవొట్టి పట్టుదల మనిషివోయ్! గౌరీ కూడా అదే అంటాడు. అయితే మరి ప్లీడరు పనిలోనే దిగుతావా? ఈ ప్లీడరు పని వల్ల ఏమీ ప్రయోజనం లేదు. గౌరీ పడే అవస్థలు చూస్తూనే ఉన్నానుగా.''

నవల్ చిరునవ్వుతో అన్నాడు: ''మామయ్యా! నేను చివరికి ఏం చేస్తానో నాకే తెలియదు. మనిషి స్వయంగా చేసేదేమీ ఉండదు. అన్నీ వాటంతట అవే జరిగేపోతూ ఉంటాయి. వీటన్నిటికంటే మంచి పనే చేయగలుగుతానేమో, ఎవరు చెప్పగలరు?''

''అయితే నీవు ఫిలాసఫరు వైపోయినావన్నమాట.'' అంటూ కామతానాథ్ పెద్దగా నవ్వారు. తర్వాత ఆయన లోపలినుంచి ఉషను పిలిచి చెప్పారు. ''చూడమ్మా! ఉషా! నవల్ బాబు వచ్చారు.''

ఆ సమయానికి ఉష ఆ గదివైపే వస్తూ ఉన్నది. ఆమె గదిలోకి ప్రవేశిస్తూనే అన్నది: ''ఓహో. మీరా? నవల్‌బాబూ! చాలా రోజుల తర్వాత వచ్చారే! రండి, బయట వరండాలో కూర్చుందాం. ఇవ్వేళ చాలా వేడిగా ఉంది కదా నాన్నా?''

''అవునమ్మా! అక్కడే వెళ్ళి కూర్చోండి. నేనిక్కడే ఉంటాను. నన్ను కలిసికోడానికి కొంతమంది వస్తారు.'' అన్నారు కామతానాథ్.

ఉష నవల్ని వెంటబెట్టుకొని వరండాలోకి వెళ్ళింది. ''కూర్చోండి. ప్రస్తుతం మీరు చదువులో బాగా మునిగిపోయి ఉంటారనుకుంటాను.''

''ఆ మునిగి పోవడమూ జరుగుతున్నది, అప్పుడప్పుడూ తేలిపోవడమూ జరుగుతున్నది.'' అన్నాడు నవల్ కూర్చుంటూ. ''ఈరోజు చదువుకోవాలనిపించలేదు. నిన్ను చూచి చాలా రోజులయింది గదా అని ఇలా వచ్చాను. నీ చదువెలా సాగుతూ ఉంది?''

''ఏమంత బాగా సాగడం లేదు. అసలు నిజం చెప్పాలంటే చదువు మీద నాకు ఆసక్తి తగ్గిపోయింది.'' కొంచెంసేపు మౌనంగా ఉండి ఆమె

మళ్ళీ అన్నది: "ఇటీవల మీరు కాంగ్రెస్ – ఆఫీసులోనే ఎక్కువకాలం గడుపుతున్నారని విన్నాను."

ఉష మాటలు విని నవల్ ఆశ్చర్యపడ్డాడు. అంటే నవల్ ఏం చేస్తున్నదీ, ఉష పూర్తిగా గమనిస్తూనే ఉన్నదన్నమాట. అంటే రాయ్ బహాదుర్ కామతానాథ్‌గారి ఇంట్లో ఇంకా నవల్ సంగతి చర్చకు వస్తూనే ఉన్నదన్నమాట. "అవును, నీవన్నదానిలో అబద్ధం లేదు. ఎవరు చెప్పారు నీకు?" అన్నాడు నవల్.

"గౌరీ అన్నయ్య చెప్పారు. మీరు కాంగ్రెస్ నాయకులు కాబోతున్నారని ఆయన అనుకుంటున్నారు." అన్నది ఉష.

"కాంగ్రెస్ నాయకుడవడం తప్పని కాదు కదా!" అని అడిగాడు నవల్ చాల కుతూహలంగా.

"ఆ సంగతి నాకేం తెలుసు? కాని కాంగ్రెస్ నాయకులయిన వాళ్ళు జైలుకు వెళ్ళాల్సి ఉంటుందని మాత్రం నేను విన్నాను."

నవల్ ఉష కండ్లల్లోకి చూస్తూ అన్నాడు: "ఉషా! నేనిప్పుడిక్కడికి ఎందుకు వచ్చానో నీకు తెలుసా?"

"తెలియకేం, నన్ను చూచిపోవడానికి వచ్చారు. బహుశా నాతో మాట్లాడాలని కూడా అనుకుంటే అనుకొని ఉండవచ్చు. అంతేకదా?"

"మాట్లాడాలనీ, చూచిపోదామనే వచ్చాను. ఉషా! నేను నిన్ను విడుదల చేయాలని వచ్చాను."

ఆ మాటకు ఉషకు కోపం వచ్చింది: "విడుదల మీరు నన్ను చాలా రోజుల క్రితమే నాకు చెప్పకుండానే చేసేశారు. ఆ విషయం ఇప్పుడు నాకు చెప్పవలసిన అవసరం ఏమి వచ్చింది? అసలు నిజం చెప్పాలంటే నన్ను నేనే విడుదల చేసుకున్నాను."

ఉష చెప్పిన విషయం అక్షరాలా నిజం. కాని ఈ నిజాన్ని ఉష తన నోట చెప్పడం నవల్‌కు నచ్చలేదు. "నాకు తెలుసు ఉషా! నీవు విడిపించుకొని పోయావనే విషయం నాకు తెలుసు. ఇలా స్వేచ్ఛగా విడిపించుకొని వెళ్ళిన తర్వాత నీవు మళ్ళీ మరో బంధంలో చిక్కుకుంటావని కూడా నాకు తెలుసు. ఆ నవీన బంధం చాల వికరాళమై బీభత్సంగా ఉంటుందనే మాట మాత్రం గుర్తుంచుకోవాలి."

ఉష చాలా పరుషంగా అన్నది: "ఈ విషయంలో మీ అభిప్రాయం

చెప్పమని మిమ్మల్ని ఎవరడిగారు ? అలా మీ అభిప్రాయం చెప్పడానికి మీ రెవరు ?"

నవల్ నవ్వాడు: "అవును, నా అభిప్రాయాన్ని ఎవరూ కోరలేదు. ఆ మాట వాస్తవమే. కాని నీకు నా అభిప్రాయం చెప్పే అధికారం నాకు లేకపోలేదు. అలాంటి అధికారం నాకు ఎప్పటికీ ఉంటుంది. నిన్ను నేను నాదాన్నిగా భావించడంవల్ల నాకా అధికారం లభించింది. తనకు ఆత్మీయు లయిన వాండ్లెవరయినా తప్పుదారిని పోతుంటే మనస్సు బాధపడడం సహజం. రాజేంద్రకిశోర్ వివాహితుడనేమాట నీకు తెలుసు."

ఉష కేక పెడుతున్నట్టుగా బిగ్గరగా అన్నది: "ఆ విషయాన్ని గురించి ఇక మీతో మాట్లాడడం నా కిష్టం లేదు. అది నా వ్యక్తిగతమైన విషయం."

నవల్ లేచి నిలబడ్డాడు: "ఇదంతా నీతో చెప్పినందుకు నేను విచారి స్తున్నాను. మన మిద్దరం ఎప్పుడో ఒకరికొకరం దూరమైపోయాం. నేను చెప్పదలచి వచ్చింది ఒకటి, చివరకు చెప్పింది మరొకటి."

"మీరు నన్ను విడుదల చేయడానికి వచ్చారు. ఆ మాట మీరు చెప్పనే చెప్పారు. అదికాక మరేమన్నా చెప్పాలనుకున్నారా ?" అని వ్యంగ్యంగా ప్రశ్నించింది ఉష.

"అవును, ఎల్లుండి నేను ఉప్పు సత్యాగ్రహం చెయ్యబోతున్నాను. అంటే ఎల్లుండి మధ్యాహ్నానికల్లా నేను బహుశా జైలుకు వెళ్ళిపోతాను. జైలుకు వెళ్ళే ముందుగా నిన్ను ఒకసారి చూచి నా శుభాకాంక్షలు నీకు చెప్పడానికి వచ్చాను. కాని ఇక్కడికి వచ్చి నేను పరుష భాషల్లో చిక్కు కొని పొయ్యాను. దానికి నన్ను క్షమించాలి" అంటూ నవల్ అక్కడినుంచి వెళ్ళి పోబొయ్యాడు.

ఉష పరుగెత్తి నవల్ చెయ్యి పట్టుకొని అన్నది: "ఏమిటి ? ఎల్లుండి మీరు జైలుకు వెళ్ళుతున్నారా ?" నవల్ని బలవంతంగా కుర్చీలో కూర్చో పెట్టిందామె "వద్దు జైలుకు వెళ్ళవద్దు. నేను చెప్పిన మాట వినండి."

"వీల్లేదు, ఉషారాణీ ! అడుగు ముందు పడింది, ఇక వెనుకకు రావడం సాధ్యం కాదు. అన్ని ఏర్పాట్లు చేసేశాను."

"మీరు నన్ను సరిగా అర్థం చేసుకోలేదు. రాజేంద్ర కిశోర్ మీద నాకేమీ మమకారం లేదు, ఆయన్ని నేను ప్రేమించలేదు. మీరు జైలుకు

వెళ్ళవద్దు. యల్.యల్.బి. ప్యాసవండి. అతన్ని నేను చేసుకోనని ఈ రోజే నేను నాన్నగారితో చెప్పేస్తాను. చెప్పండి, మాట్లాడరేం!"

"ప్రయోజనం లేదు, ఉషా! నేను నిరాశచెంది జైలుకు వెళ్ళడంలేదు. నేననుసరిస్తున్న మార్గానికి ఇదే సహజపరిణామం. సంఘర్షం! సంఘర్షం! సంఘర్షం! జీవితమంతా సంఘర్షమయమే. ఈ సంఘర్షం నా అంతః ప్రేరణ. ఈ సంఘర్షమయమైన జీవితంలో నీవు నాకు సహచరిగా ఉండ లేవని నాకు తెలుసు. అందువల్లనే రాగానే నేను నిన్ను విడుదలచేశాను.

నవల్ మాటలకు ఉష బాధపడింది: "అయితే మీరు జైలుకు వెళ్ళడానికి నేను కారణం కాదా ?"

"ఏమాత్రం కాదు, నా అంతట నేనే నా అంతఃప్రేరణ వల్ల జైలుకు వెళుతున్నాను."

ఉషకు తన మీద తనకే చిరాకు వేసింది. తన విజయాన్ని తన గొప్ప తనాన్ని ఊహించుకొని ఆమెలో ఏర్పడిన గర్వమంతా పొడి పొడిగా విడి పోయింది. "తెలిసింది! అయితే మీరు నన్ను హేళన చేయడానికి వచ్చారు. మీ గొప్పతనం నా ముందు చూపించి నన్ను అవమానపరచటానికి వచ్చారు."

నవల్ మళ్ళీ లేచి నిలబడ్డాడు: "లేదు, ఉషా! జీవితాంతం వరకూ నిన్ను కలవలేనేమోనని నీ దగ్గర సెలవు తీసుకుని నీకు నా శుభాకాంక్షలు అందచేయడానికి నేను వచ్చాను. ఇక మనం బహుశా మళ్ళీ కలుసుకోవడం జరుగదు."

ఉష ఆవేశంతో అనేసంది: "మీ శుభాకాంక్షలు మీ దగ్గరనే ఉంచు కోండి. నాకు వాటి అవసరం లేదు. మీరు జైలుకు వెళ్ళండి, అనుభ వించండి. నన్ను గురించి మీరేమీ దిగులు పడవలసిన పనిలేదు. నాకు కావలసిన వన్నీ ఉన్నాయి. వాటి కెప్పటికీ కొరవలేదు. మీరు చేస్తున్న పని మీకు మంచిదని తోస్తే నేను చేస్తున్న పని నాకు మంచిదని తోస్తున్నది. వెళ్ళండి, వెళ్ళండి మిమ్మల్ని చూస్తే నాకు అసహ్యం వేస్తున్నది. వెళ్ళండి." అంటూ ఉష ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

నవల్ కొంచెంసేపు మాట్లాడకుండా నిలబడ్డాడు. అతనిలో ఏవేవో ఆలోచనలు తుఫానులాగా చెలరేగాయి. మెల్లమెల్లగా అతను మామూలు

స్థితికి వచ్చేసరికి రాయ్‌బహాదుర్ అతన్ని అడుగుతున్నారు: "ఏం నవల్ ! ఏమయింది ? అయితే నీవు ఎల్లుండి జైలుకు వెళుతున్నావా ?"

"అవునండీ, ఎల్లుండి నేను జైలుకు వెళుతున్నాను." అని నవల్ అక్కడి నుండి వెళ్ళిపొయ్యాడు.

అక్కడినుండి నవల్ ఇంటికి నడిచే వెళ్ళాడు. రాత్రి వాతావరణం చాలా హాయిగా ఉంది. పిండి ఆరబోసినట్లు చిక్కని వెన్నెల నలుదిక్కులా వ్యాపించి ఉంది. ఎక్కడ చూచినా కవితా మయమైన వాతావరణం సుఖావహంగా ఉంది. అతని మనస్సులోని ఉద్రేకమంతా శాంతిస్తూ ఉంది. అంతులేని శాంతితో పాటు అతని అంతరంగంలో అదో రకమైన విశ్రాంతి కూడా ఏర్పడుతున్నట్లు అతనికి తోస్తూ ఉంది. ఇంటికి వెళ్ళేసరికి విద్య అతనికోసం ఎదురుచూస్తూ ఉంది. "అక్కడికి వెళ్ళి వచ్చావా అన్నయ్యా!" అని అడిగింది విద్య.

"ఆఁ, వెళ్ళివచ్చాను, అంతా నిర్మూలనం చేసి వచ్చాను. నవీనాన్ని నిర్మించడానికి ఎంత వ్యయ ప్రయాసలు అవసరమో నాకు బోధపడుతూ ఉంది. ప్రాచీనాన్ని ఎంతో నిర్దాక్షిణ్యంగా నిర్మూలించవలసి వస్తున్నది."

విద్య చిరునవ్వుతో అన్నది: "అలా కాదన్నయ్యా, ప్రాచీనం తనంతట తానే విచ్ఛిన్నమయి పోతున్నది. దాన్ని కాపాడాలంటే దానితోపాటు నీవు కూడా విచ్ఛిన్నమయి పోవలసి ఉంటుంది. కనక ఆ విషయాన్ని గురించి విచారించడం అవసరం. ఇక వెళ్ళి భోంచెయ్యి!"

ఆ రాత్రంతా నవల్ కలలు కన్నాడు – కొన్ని మంచి కలలు, కొన్ని పీడ కలలు. మరునాడు నవల్ ఆలస్యంగా నిద్రలేచాడు. తొమ్మిది గంటలకు కాంగ్రెస్ పార్టీ ఒక బహిరంగ సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో సత్యాగ్రహం యొక్క ఆశయాలూ, దాని స్వరూపం వివరిస్తారు. జ్ఞాన ప్రకాశ్ ఆ సమావేశానికి వెళ్ళడానికి సిద్ధమైనారు. నవల్ కూడా త్వర త్వరగా తయారయి జ్ఞానప్రకాశ్‌తోపాటు ఆ సమావేశానికి వెళ్ళాడు.

వాళ్ళిద్దరూ సభా మండపాన్ని సమీపించేసరికి అక్కడ గుమికూడిన వాళ్ళందరూ జయ జయ ధ్వనులతో వాళ్ళని ఆహ్వానించారు. వేదిక మీద సత్యాగ్రహం చేసే వాళ్ళ జట్టు ఉంది. నవల్ కూడా వాళ్ళతోపాటు కూర్చున్నాడు. అందరి కండ్లూ దేశం కోసం ఆత్మత్యాగం చేయడానికి సిద్ధమయిన ఆ వ్యక్తులపై కేంద్రీకృతమై ఉన్నాయి.

నవల్‌కు తనలో ఏదో నూతన భావావేశం క్రమంగా పరివర్ధిత మౌతున్నట్లు తోచింది. అతను వేదికపైకి ఎక్కగానే అతన్ని ఏదో ఆందోళన కలవరపరచింది. ఇప్పుడా ఆందోళన పోయింది, నూతన పటుత్వం అతనిలో ప్రవేశించింది. కొంచెంసేపటికల్లా తాను పూర్తిగా మారిపోయా నని అతనికి తోచింది. అంతులేని ఉత్సాహం, నిశ్చలమైన సంకల్పం!

ఆ సమయంలో అతనికి ప్రపంచమే మరోలా కనిపించింది. అప్పుడతని స్మృతి పథంలో జ్వాలా ప్రసాద్ లేరు, రుక్మిణి లేదు, తమ్ములు లేరు, చెల్లెలు లేదు. చివరకు జ్ఞానప్రకాశ్‌ను కూడా అతను మరచిపోయాడు. అతని ఎదుట విశాల జన సముదాయం ఉంది, వాళ్ళందరి సుహృద్భావం అతని వెంట ఉంది. దానితో అతనికి ఎక్కడలేని ధైర్య విశ్వాసాలు లభించాయి.

జ్ఞానప్రకాశ్, నవల్ మీటింగు నుండి నేరుగా ఇంటికి వచ్చేశారు. ఇంటికి వచ్చేసరికి అందరూ విచారకరంగా ఉన్నట్టు నవల్‌కు తోచింది. ఇంట్లో అందరూ దిగులుపడుతూ ఉన్నారు. అందరి ముఖాల్లో విషాదం కనిపిస్తూ ఉంది. వీళ్ళిద్దరూ వస్తే భోంచెయ్యాలని జ్వాలా ప్రసాద్ ఎదురు చూస్తూ కూర్చున్నారు. వాళ్ళు రాగానే అందరూ భోజనాల దగ్గర కూర్చున్నారు. కాని జ్వాలా ప్రసాద్ మౌనంగా ఉన్నారు. అన్నం తినాలని కూడా ఆయనకు అనిపించడం లేదు. నవల్ జ్వాలా ప్రసాద్‌ను అడిగాడు: "ఎందుకు తాతయ్యా! ఏదో దిగులు పడుతున్నట్టున్నావు?"

జ్వాలా ప్రసాద్ సమాధానం చెప్పారు: "ఏం లేదోయ్, ఏదో మనస్సు హాయిగా లేదు. ఈ ప్రపంచం ఎంత మారిపోయిందో అని విచారిస్తు న్నాను. రేపు నీవు జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నావు. నాలుగయిదు రోజుల్లో జ్ఞానూ కూడా వెళ్ళుతాడు. ఇక నేను ఒంటరిగా మిగిలిపోతాను."

అన్నం వడ్డిస్తూ విద్య నవ్వింది: "మీరు ఒంటరిగా ఎందుకుంటారు తాతయ్యా! నేనున్నాగా మీ దగ్గర! నవల్ అన్నయ్య అసలెప్పుడయినా ఇంట్లో ఉంటుంటేగా! నేను నీకు 'భాగవతం' చదివి వినిపిస్తున్నాను గదా!"

విద్య మాటలకు జ్ఞానప్రకాశ్ నవ్వారు: "సెబాస్ విద్యా! సరియైన మాట చెప్పావు. బావా! ఇక ఈ మమకారం వదిలేసి మమ్మల్ని మా విధి నిర్వర్తించడానికి సంతోషంగా పంపించు. మాతోపాటు మమ్మల్ని కాపాడ డానికి ధర్మం, భగవంతుడు ఉన్నాడని మనసు కుదుటపర్చుకో."

"అవును జ్ఞానూ! నీ వెంట ధర్మం ఉంది. భగవంతుడు కూడా ఉన్నాడు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. అందుకనే మిమ్మల్ని కాదన లేదు నేను. కాని నా మనసు నిలవద్దుటోయ్!"

"మనసు రాయిచేసుకో బావా! మహా అయితే మాకు ఆరునెలలు శిక్ష వేస్తారు. మేము పోరాడబోయేది అహింసాయుద్ధం కాబట్టి మరే ఉపద్రవం జరగడానికి అవకాశం లేదు."

జ్వాలా ప్రసాద్ నీరసంగా అన్నారు: "అవకాశం లేని మాట నిజమే. కాని, కాని......"

"కాని?" జ్ఞానప్రకాశ్ అడిగారు.

"కాని, ఏంలేదు. వెళ్ళండి నవల్! జ్ఞానూ! మీరిద్దరూ వెళ్ళండి. మానవమాత్రుడికి సాధ్యమయిందేమీ లేదు, ఏమాత్రం లేదు. అలాం టప్పుడు దిగులుపడి మాత్రం లాభమేముంది? కావలసింది అయితీరు తుంది. దాన్ని కాదనడానికి వీల్లేదు." జ్వాలా ప్రసాద్ ఫోంచేసి లేచే సరికి ఆయనకు మనస్సు కుదుటపడ్డట్టు తోచింది. ఇంట్లో అందరికీ కూడా దిగులుపోయింది.

ఏప్రిల్ అయిదో తేది ఉదయం నవల్ దాదాపు నాలుగున్నర గంటలకే నిద్రలేచాడు. ఇంకా నలువైపులా చీకటి ఉంది. కాని తూర్పు దిక్కున మాత్రం కొంచెం కొంచెం వెలుతురు కనిపిస్తూ ఉంది. నవల్ లేచాడు. అతనితోపాటు ఇంట్లో వాళ్ళందరూ లేచారు. ఏప్రిల్ అయిదో తేది ఉదయం దండీలో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహం చేస్తున్నారు. ఆరోజే దేశంలో అన్ని చోట్లా అలాంటి సత్యాగ్రహాలు జరుగబోతున్నాయి. కాంగ్రెస్ ఆఫీసు నుండి తొమ్మిది గంటలకు ఒక ఉత్సవం బయలుదేరు తుంది. ఆ ఉత్సవం సత్యాగ్రహం చేయదలుచుకున్న ప్రతి వ్యక్తి ఇంటికీ వెళ్ళి ఆ వ్యక్తికి స్వాగతం చెప్పాలి. ఊరంతా తిరిగి చివరకు చట్ట విరుద్ధంగా ఉప్పును తయారు చేస్తారు. అదీ ఆ రోజు కార్యక్రమం.

ఈ ఉత్సవం నవల్‌గారి ఇంటికి వచ్చేసరికి సుమారు పదిన్నర అయింది. అప్పటికి ఉత్సవంలో ఇరవై వేల మంది జనం చేరారు. నవల్ బంగళాకు ఎదురుగా వీధిలో ఉత్సవం ఆగింది. ఏవేవో నినాదాలు బడుతూ ఉన్నాయి.

విద్య ఉదయం నుంచే నవల్‌కు హారతి పట్టటానికి పళ్ళెం చక్కగా

అమర్చి పెట్టి ఉంచింది. ఉత్సవం వాకిట్లోకి రాగానే విద్య నవల్‌కు హారతి పట్టి అతని మెడలో పూలదండ వేసింది. రుక్మిణి సమీపంలోనే నిలబడి ఉంది. విద్య రుక్మిణి చెయ్యి పట్టుకుని ఆమెను బలవంతంగా నవల్ దగ్గరికి తీసుకు వచ్చింది: "అమ్మా! అన్నయ్యకు బొట్టు పెట్టమ్మా! అన్నయ్య శ్రీ కృష్ణజన్మమందిరానికి వెళ్ళుతున్నాడు. వెళ్ళి రమ్మని ఆశీర్వదించమ్మా!"

రుక్మిణి శరీరమంతా కంపించిపోతూ వుంది. ఆమె కండ్లు కన్నీటితో నిండిపోయాయి. విద్య ధైర్యం చేసి బలవంతంగా ఆమె ముఖం మీద ముసుగు తీసి వేసింది. "ఇది అధైర్యపడి జంకవలసిన సమయం కాదమ్మా" అన్నది. జనమంతా ఏక కంఠంతో కేకలు పెడుతూ వున్నారు: "నవల్ కిశోర్ జిందాబాద్ నవల్ కిశోర్ కీ జయ్!"

తన పిల్లవాణ్ణి గురించి జనులంతా జయ జయ ధ్వనులు చేస్తూ వుంటే రుక్మిణి విన్నది. తన కొడుకును సాగనంపడానికి అపరిమితమైన ఉత్సాహంతో పొంగిపోతున్న అపార జన సమూహాన్ని ఆమె కండ్లార చూచింది. అప్పుడామె ఒళ్ళు పులకరించింది. ఆమెలోని విషాదమంతా తేలిపోయింది. ఆమె తన పైట కొంగుతో కన్నీళ్ళు తుడుచుకొని ఒక్కసారి తన కుమారుణ్ణి తన దగ్గరకు చేర్చుకున్నది. తర్వాత ఆమె వణకిపోతున్న చేతులతో అతనికి బొట్టు పెట్టి హారతి పట్టింది.

జ్వాలా ప్రసాద్ వరాండాలో కూర్చుని మౌనంగా ఇదంతా చూస్తున్నారు. భీఖా అతని ప్రక్కనే నిలబడి ఉన్నాడు. నవల్ జ్వాలా ప్రసాద్ దగ్గరకు వెళ్ళి ఆయన కాళ్ళకు నమస్కరించాడు. "భగవంతుడు నిన్ను కాపాడుతాడు" అని మాత్రం అనగలిగారు జ్వాలా ప్రసాద్.

ఆ తర్వాత నవల్ భీఖా వైపు తిరిగి అన్నాడు: "భీఖా తాతా! నేను వస్తాను. తాతయ్యను కొంచెం శ్రద్ధగా చూస్తూ ఉండు."

"వెళ్ళిరా బాబూ! క్షేమంగా వెళ్ళి తొందరగా వచ్చేసేయ్."

"ఇక నవల్ ఉత్సవంలో చేరాడు. విద్య నవల్‌తో పాటు వెళ్ళింది. పదన్నయ్యా! నేను కూడా నీతో కొంతదూరం వస్తాను. అక్కడినుంచి నేను స్కూలుకు వెళ్ళిపోతాను." అంటూ విద్య కూడా ఊరేగింపులో చేరింది.

ఊరేగింపు ముందుకు సాగింది. ఇంట్లో వాళ్ళందరూ అక్కడనే నిలబడి ఊరేగింపు చూస్తున్నారు. దాదాపు అరగంట పట్టింది ఊరేగింపు సాగే

సరికి. ఆ తర్వాత రుక్మిణి తన దుఃఖం ఆపుకోలేక పోయింది. ఆమె బిగ్గరగా విలపించి ఇద్దరు పిల్లలను తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది.

జ్వాలా ప్రసాద్ భీఖూతో పాటు గుమ్మం దాకా వచ్చారు. ముందుకు సాగిపోతున్న ఊరేగింపును తదేక దృష్టితో చూస్తున్నారు. ఊరేగింపు కను చూపు మేర దాటిపోయింది, ఎక్కడ చూచినా నిశ్శబ్దంగా ఉంది. జ్వాలా ప్రసాద్ భీఖూ వైపు తిరిగి చూచారు: "భీఖూ! ఏమిటిదంతా?"

"ఏమీ బోధపడడం లేదు బాబయ్యా! అబ్బాయిగారేమో సంబరాలు పడుతూ జైలుకు వెళ్ళుతున్నారు. అమ్మాయిగారు ఉద్యోగంలో దిగారు. ఇదంతా ఏమిటో బోధపడడం లేదు."

జ్వాలా ప్రసాద్ నిర్వేదంగా అన్నారు: "అవును, భీఖూ! ఏమీ బోధపడడం లేదు. ఈ యాభై సంవత్సరాల్లో ఎంత మార్పు వచ్చిందో చూడు. అంతా మారిపోయింది, పూర్తిగా మారిపోయింది. నీవు మారిపోయావు, నేను మారిపోయాను. ఎవరెవరో క్రొత్త వ్యక్తులు వచ్చారు, పాత వాళ్ళు గతించి పోయారు." జ్వాలా ప్రసాద్ కంఠం కంపించి పోతున్నది.

భీఖూ జ్వాలా ప్రసాద్ చెయ్యి పట్టుకుని అన్నాడు: "లోపలికి వెళదాం రా బాబయ్యా! కాసేపు విశ్రాంతిగా కూర్చో. ఇదంతా భగవంతుని లీల! మన చేతుల్లో ఏమీ లేదు. నాకేమీ బోధపడడం లేదు."

"నాకూ బోధపడడం లేదు భీఖూ! ఇదంతా ఏమిటి? ఇలా ఎందుకు జరుగుతూ ఉంది? ఈ రకరకాల చిత్తరువులు వాటంతట అవి ఏర్పడుతున్నాయి. మళ్ళీ వాటంతట అవే మాయమై పోతున్నాయి. దీనివల్ల ప్రయోజనం?"

తరతరాల చిత్తరువులను చూచి జీవితంలో ఎన్నో ఒడుదుడుకులకు తట్టుకుని నిలబడి ఎంతో అనుభవం సంపాదించిన ఇద్దరు వృద్ధులూ ఏమీ చెయ్యలేకుండా ఉన్నారు, ఏమీ బదులు చెప్పలేకున్నారు. వాళ్ళకు దూరంగా వేలు, లక్షలు, కోట్లకు మించిన ప్రజలు జీవితాన్ని, జీవిత పురోగమనాన్ని గమనించి నవనవోన్మేషంతో నూతనోత్సాహంతో నవ్య జగత్తును నిర్మించాలని వెళుతున్నారు.